
జ్ఞాన యోగం

# బ్రహ్మ జిజ్ఞాస-2



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని స్క్రిబ్డ్ వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్: https://www.scribd.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో స్క్రిబ్డ్ వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org


Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్:
## http://www.scribd.com



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!


ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# బ్రహ్మజిజ్ఞాస

## ద్వితీయ భాగము

మజ్జీబోయిన రామసుబ్బయ్య



Dr K Dayanandaswamy ebo

ఓం

# బ్రహ్మజిజ్ఞాస

(జ్ఞాన, రాజ, కర్మ, భక్తి, శ్రీ వైష్ణవ
ప్రపత్తులను తెలియజేయు)

## ద్వితీయ భాగము

గ్రంథకర్త
**మట్టిబోయిన రామసుబ్బయ్య**

Dr K Dayanandaswamy ebooks

# ముందుమాట

వేదాంత విజ్ఞానాన్ని సామాన్యులకు అందించాలనే ఉదాత్తమైన ఆశయంతో రచింపబడిన ఉద్గ్రంథం బ్రహ్మజిజ్ఞాస. సహజమైన ఈశ్వరచింతన, వైరాగ్యధోరణి, బహుగ్రంథ పరిశీలన, అనేక సంవత్సరాల అనుభవం -- ఇవన్నీ ఏకత్ర సమన్వయం పొందిన జ్ఞానవయోవృద్ధులు శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారి లేఖిని నుండి ఈ గ్రంథం అపూర్వంగా రూపొందింది.

బ్రహ్మజిజ్ఞాస నాలుగు భాగాలుగా ప్రచురింపబడుతోంది. మొదటి భాగం అద్వైతసిద్ధాంతానికి సంబంధించినది. ఇప్పుడు ప్రచురితమౌతున్న ఈ రెండవ భాగం అనుష్ఠానమార్గలను తెలుపుతుంది.

ప్రథమ భాగం లాగానే ఈ రెండవ భాగం కూడ తిరుమల తిరుపతి దేవస్థాన ధార్మిక ప్రచురణ కార్యక్రమంద్వారా వెలువడుతోంది. తృతీయ, చతుర్థ భాగాలు సైతం త్వరలో వెలువడ నున్నాయి. పరమాత్మను (బ్రహ్మ)ను గూర్చి తెలుసుకోవాలనుకునే ఆసక్తి కలవారందరూ విశిష్టశైలితో విలసిల్లుతు వున్న 'బ్రహ్మజిజ్ఞాస' ను పఠించి ఆత్మోన్నతి, ఆనందాతిశయము పొందగలరని మా ఆశయము, ఆకాంక్ష.

Dr K Dayanandaswamy ebooks



ఓమ్

# విన్నపము

పరమేశ్వరానుగ్రహమున బ్రహ్మజిజ్ఞాస ద్వితీయ భాగమ్ము ముద్రింప గలిగితిని. ప్రథమ భాగము వెలువడి రెండు సంవత్సరము లయినది. ప్రథమ భాగముయొక్క ఉపోద్ఘాతమునందు ``జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగమున నాలుగును ద్వితీయ భాగమని"వ్రాసి యుంటిని. ప్రస్తుతము అవిగాక ప్రపత్తిని చేర్చితిని. మొదట ప్రపత్తి యనునది భక్తియోగమున నంతర్భూతమని నాలుగవ ప్రకరణమున ``(౨౧) శరణాగతి" అను ఒక అధ్యాయముగ వ్రాసితిని. అంతమాత్రము చాలదని దానిని గుఱించి విపులముగ వ్రాసిన బాగుండునని నాకొక మిత్రుడు సలహా నిచ్చెను. లోకమున కొందఱు ``భగవంతునియందు భక్తి ప్రపత్తు లుండవలెనని చెప్పుకొనుచుందురు. కనుక ప్రపత్తిని గుఱించి సంగ్రహముగ ఏబది పుటలలో వ్రాయవలెనని తొలుత సంకల్పించితిని. వ్రాయుటకు మొదలిడిన క్రమముగ 114పుటలకు పెరిగినది.

ఈ ద్వితీయ భాగమునందు అయిదు ప్రకరణములు గలవు. అందు మొదటి నాలుగు ప్రకరణముల యందు చెప్పబడిన జ్ఞానయోగాదులు నాలుగును నాలుగు ప్రత్యేక దర్శనములని చెప్పవచ్చును. ప్రపత్తి భక్తిలో చేరదని చెప్పిన యెడల ప్రపత్తి సహితము స్వతంత్ర దర్శనమని చెప్పవలసి వచ్చును. కాని, అది విశిష్టాద్వైతమునం దంతర్భూతమే. ఒకొక్కదానికి అధికారి, ఫలము మున్నగు విషయములను అయిదు ప్రకరణములయందును చర్చించితిని. ఒక ప్రకరణమునకును మరియొక ప్రకరణమునకు లంకె లేదు అనగా:-ఏ ఒక్క ప్రకరణము చదివినను అందలి విషయము తెలిసికొనవచ్చును. ఈ గ్రంథము ప్రథమ ద్వితీయభాగములు కూడ నిట్లే దేనికది ప్రత్యేకమని చెప్పినను లేక ప్రథమభాగము యొక్క తరువాత చెప్పవలసిన విషయమే ఈ ద్వితీయ భాగమని చెప్పినను చెప్పవచ్చును. ఆచరణయందు అన్నింటికిని ఫలితము బ్రహ్మప్రాప్తియే యగుటవలన బ్రహ్మజిజ్ఞాసువులకు ఈ ప్రకరణములు ఒకదాని తరువాత నొకటి పఠనీయములే. ప్రథమభాగము చదువనిదే ద్వితీయబాగము చదువరాదని భావించకూడదు. అట్లు చదివినను బోధపడును.

Dr K Dayanandaswamy ebooks



ఈ భాగమునం దచ్చటచ్చట "ప్రథమ భాగమును చూడుడు" అని చెప్పియుంటిని అట్లు చూచిన విషయసేకరణకు మంచిదే. గాని చూడకపోయినను బాధలేదు.

ఇందులో మొదటి ప్రకరణము జ్ఞానయోగము. ఇందు కొంతవరకు విషయము అద్వైత సంప్రదాయమునకు చెందినది. కొన్ని సాధనలు ముముక్షువుల కెల్లరకు నుపయోగపడునట్టివే.

రెండవ ప్రకరణము రాజ యోగము ప్రత్యేక దర్శనమైనను యమాది అష్టాంగ యోగములు పాతంజలయోగులకే గాక అద్వైతులకును విశిష్టాద్వైతులకును కూడ ధ్యానము వఱకు నొక్కటే.

మూడవ ప్రకరణము కర్మయోగము. అందఱకు అందుబాటులోనుండి మోక్షప్రాప్తికేగాక సంఘ శ్రేయమునకును తోడ్పడును.

నాలుగవ ప్రకరణము భక్తియోగము. భక్తియొక్క నిర్వచనము అనేక విధములుగా నున్నందున నాకు తెలసినంత వఱకు పలువుర అభిప్రాయములు వ్రాసితిని. ముఖ్యముగ శివకేశవులకు అభేదమును, అందు శ్రుతి ప్రమాణమును చూపి, సామాన్యముగ ప్రతివిషయమునందును ఒక శివభక్తుని కథను, ఒక విష్ణుభక్తుని కథను చెప్పితిని.

నేను పుట్టిన కులమునందు స్మార్తవైష్ణవ మతభేదము లేదు. విదేశీయునికి వీటియందు తటస్థ భావ మెట్లుండునో నాకును నట్లే యున్నది. ఆ విధముగనే విశిష్టాద్వైతులయందుగల తెంగల, వడగల శాఖలును నాకు సమానములే. అనగా; నాకు స్వభావముగనే అద్వైత విశిష్టాద్వైత సిద్ధాంతములయందు ఏ యొక్కటియందును పక్షపాతబుద్ధి లేదు. అయినను అద్వైతము తక్కిన మతములకంటె అధికముగ నన్నాకర్షించినది. అద్వైతమునందుగల అంతమాత్రపు అభిమానాధిక్యము విశిష్టాద్వైతమును గౌరవముగ చూచుటకు అడ్డు తగులదు. ఇందుకు దృష్టాంతము అయిదవ ప్రకరణమున విశిష్టాద్వైతమును గుఱించి నేను వ్రాసిన విధమును సహృదయముతో చదివిన బోధపడగలదు. ఒక్క విశిష్టాద్వైతమునందే కాదు; శివాద్వైత, వీర శైవ సిద్ధాంతములను కూడ నేను గౌరవముతో చూతును. ఒక్కొక్కదానియందొక్కొక్క విశేషము గలదు. అన్ని

Dr K Dayanandaswamy ebooks



సిద్ధాంతములయొక్క మూలసూత్రములకును కేంద్రమొక్కటే. మతము విస్తరించుకొలదిని దానియందు దోషమగపడును. ఆ దోషములను వదలి తాత్త్వికాంశములను మాత్రము గైకొనిన చాలవఱకు అన్నింటికిని సమన్వయము కుదురును. ఇన్ని భిన్న భిన్న మతము లుండవలెనని ఈశ్వర సంకల్పమేమో యనిపించును.

అద్వైత విశిష్టాద్వైతములయందేది శ్రేష్ఠమను ప్రశ్న నిరర్థకమైనది. రెండింటికిని శ్రుతియే మూలము. రెండును అద్వైతములే. "సర్వం ఖల్విదం బ్రహ్మ" = సర్వమును బ్రహ్మమే. "నే హ నానాస్తి కించన" = బ్రహ్మమునకంటె ఇతర మేమియును లేదు అను శ్రుతివాక్యము ఇరువురకు సమ్మతమే. ఐతే, బ్రహ్మ మెట్టిది? నిర్విశేషమని శ్రీశంకరులును, జీవజగద్విశేషణకమని శ్రీరామానుజులును చెప్పిరి. మూలసూత్రమునందెంత స్వల్ప భేదమేయైనను అది క్రమముగా బ్రహ్మాండమంత పెరిగినది. ఒకరిమతము నొకరు విమర్శించుకొనుటతో గ్రంథరాశి పెరిగిపోయినది. కడచిన అనేక శతాబ్దములనుండి యిట్టి వాదము జరుగుచునేయున్నది. కాని, గెలిచినవారెవరో? ఓడినవారెవరో? తెలియదు. ఉభయపక్షములయం దెవరును తాము పరాజితులమని యింతవఱకు అంగీకరించియుండలేదు. ఇంకెన్ని శతాబ్దము లీవిధముగ పోరాడినను ఫలితమింతే. కనుక రెండు మతములయందును ఒకటి శ్రేష్ఠము, మరియొకటి తక్కువ యనునది వ్యర్థ వాదము. ఎవరెవరి పూర్వజన్మ సంస్కారము ననుసరించి వారివారికి భిన్నభిన్న మతములయందు రుచి ఏర్పడుచుండును, ద్వితీయభాగము ముగించుచు అద్వైతజ్ఞాన నిష్ఠునకును, భక్తునకును, ప్రపన్నునకును గమ్యస్థాన మొక్కటియేయని చెప్పితిని. భక్తిప్రపత్తులవలన జ్ఞానము కలుగుననియు, జ్ఞానమువలననే ముక్తి కలుగుననియు అద్వైతులందురు. భక్తిప్రపత్తులవలన సాక్షాత్ ముక్తి కలుగునని అద్వైతమంగీకరింపదు. ఇందువలన నా మత మెట్టిదో వ్యక్తమగును.

ప్రస్తుత నివాసము

చిత్తూరు ఇట్లు,

**23-3-1969** గ్రంథకర్త

Dr K Dayanandaswamy ebooks



# ఉపోద్ఘాతము

డాక్టరు. కె. సి. వరదాచారి, ఎం.ఎ; పిహెచ్.డి.          శ్రీ రాజగృహ, బి.జి. తేరువీథి, తిరుపతి 17-3-1963

ఆర్యా !

చిత్తూరు న్యాయవాది - శ్రీ వి. కె. రాజగోపాల అయ్యంగారి ద్వారా, మీ "బ్రహ్మజిజ్ఞాస" రెండుభాగములను అభిప్రాయ ఉపోద్ఘాతములను వ్రాయు నిమిత్తము నాకు పంపినందుకు కృతజ్ఞుడను. ఇంతకు ముందే మీరు పంపియుండిన 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమ సంపుటిని చదివి యుండినందున, ఈ గ్రంథమును గూర్చి అభిప్రాయము వ్రాయుటకు అద్వైత పండితుడే తగునని, అందులకు నేను చాలనని ఒప్పుకొనవలసి ఉన్నది. నా స్వయం కృషి విశిష్టాద్వైతమునకు మాత్రమే పరిమితమైనది. సామాన్య లౌకిక దృక్పథములను పురస్కరించుకొని భిన్నవేదాంత సంప్రదాయము లందును భేదాభిప్రాయములు లేకున్నను, చరమ సిద్ధాంతములను గుఱించి మాత్రము తీవ్రములైన భేదము లున్నవి. ఆత్మ అనునది అవిభాజ్యమైన ఏకైక తత్త్వమను భావమును విశిష్టాద్వైతులు అంగీకరింపరు. ఇట్లే భక్తి స్వరూపమును గూర్చిగూడ మతాంతరము గలదు. జ్ఞానానంతరము భక్తి కలుగుచున్నదిగాని, జ్ఞానమునకు భక్తి సాధనము కాదు. భగవంతుని గూర్చిన అంతర్ జ్ఞానమునకు శరణాగతి ఒక సాధనమేగాని, వ్యక్తిగత దారిద్ర్య భయభీతులను పోగొట్టుటకును, భగవంతుని అనుగ్రహమును పొందుటకును మాత్రమే అది సాధనమను అభిప్రాయము సరియైనది గాదు. బ్రాహ్మీస్థితియొక్క సిద్ధి అనునది సామీప్య సాన్నిధ్యములకన్న భిన్న మైనది కాదు.

విశిష్టాద్వైతమునకు సంబంధించిన సామాన్య సిద్ధాంతములను; శరణాగతి, లేక ప్రపత్తి విషయములందును మీకున్న పరిజ్ఞానము మిక్కిలి ఉపయోగకారియై యున్నది.

శంకరాచార్యుల అద్వైతముకూడ "అచలము" నకే దారితీయునన్న మీ అభిప్రాయమును నేను సంపూర్ణముగ సమాదరింతును. దైవ సాయుజ్యమును ప్రాపింపజేయు తురీయ పథము ఒక విధమైన ఉత్క్రాంతిగా భావించరాదనియు, అది ఇహలోకమున పొందు ఆత్మసాక్షాత్కారమే అనెడు మీ అభిప్రాయమును

Dr K Dayanandaswamy ebooks



అంగీకరించి కొనియాడుచున్నాను. ఏలయన - తురీయావస్థలో ఆకాశ, సమయాది విభేదము లన్నియు లయమైపోయి, కేవలము ఒక్క బ్రహ్మమే భాసించుచుండును. మీ అభిప్రాయమున, అచలానుభూతి మాండూక్యుడు పేర్కొనిన తురీయమున కన్న అతీత మైనదియును, శంకరుని అద్వైతానుభూతితో సమాన మైనదియు అగుచున్నది. అచలానుభూతి నిర్గుణమైనది. అకాలము, ఆకాశములకు సంబంధించిన సిద్ధాంతములకు సమానమైన ఈ అచలానుభవమును గూర్చి మీరు గావించిన ప్రతిపాదనము రమణీయమై అతీతయోగ విధాన వివరణమున శిఖరాయమానముగ నున్నది. శ్రుతిప్రమాణములకన్న మీ సిద్ధాంతము విలక్షణముగా నున్నది. ఆ అచలానుభూతి యొక్క సాక్షాత్కార తేజఃకిరణమును ఒక దానిని మీరు పొందియో, లేక దాని తటమునకు దరిసియో యుందురని నా దృఢవిశ్వాసము.

సమగ్రముగా అద్వైత దర్శన గ్రంథ పఠనము గావించిన వారును, అచలానుభవమునకు దారితీయు సాధనమును అనుష్ఠించిన సుధీమణులును మీ రచనలను అత్యంతము సమాదరింపగలరు. ఉపోద్ఘాతము వ్రాయుమనిన మీ అభ్యర్థనము నాకు గౌరవ ప్రదమైనప్పటికిని, మీ వివరణముల అంతస్సార మెఱిగి, విలువగట్టి సమ్మాన్యత చేకూర్చగలుగు నంత శక్తి నాకు లేదేమో అని భావింతును.

మీ యగాధ ఋజుత, భక్తి తత్పరతలకు తగిన సత్ఫలితములు లభించగలవు. ప్రాక్తన శ్రుతుల పఠనము మాత్రమే నేడు మనకు జాలదు, తదంతర్గత సత్యార్థానుభవ గవేషణము, నిరూపణములే మనకు ముఖ్య ఆచరణయోగ్య కార్యములై ఉన్నవి. అందులకే శ్రీరమణునివంటి మహాపురుషుడు ఇప్పుడు శరణ్యుడై యున్నాడు. అట్టి మహర్షిని స్తుతించుట, పూజించుటతోనే తృప్తిపడక, ప్రతివ్యక్తియు తన జీవితావధిలో శ్రుతిప్రోక్తమైన, యోగీశ్వరులు బోధాతీత శక్తితో ప్రవచించిన సత్యదర్శనమును స్వయముగా సమకూర్చుకో గలిగిన ధీరకార్యమును చేపట్టవలసియున్నది.

భగవంతుడు మీకు సాక్షాత్కారమును ప్రసాదించుగాత !

శుభాకాంక్షలతో
ఇట్లు, హృదయ పూర్వకముగా
(సం) కె. సి. వరదాచారి

(ఇది ఆంగ్ల మూలమున కనువాదము)

Dr K Dayanandaswamy ebooks



## బ్రహ్మజిజ్ఞాస ద్వితీయభాగముపై

# పండితుల అభిప్రాయములు

ఓమ్

అఖిలాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షులును, కైలాసాశ్రమాధిపతులును
నగు పరమహంస పరివ్రాజకాచార్య

## శ్రీ స్వామి నిత్యానందగారి అభిప్రాయము

బ్రహ్మజిజ్ఞాసా పాఠకమహాశయులారా! ఓం తత్సత్-ఓం నమస్తే!

శ్లో॥ **యావా నర్థ ఉదపానే సర్వత స్సంప్లుతోదకే।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః॥**

**గీత: 2-66.**

అను గీతావచనానుసారము ఈ బ్రహ్మజిజ్ఞాసా మహోద్గ్రంథమున నెందు చూచినను జిజ్ఞాసా పర్యవసాన ఫలితమగు పరమార్థమే పరిస్ఫుటముగా గోచరింపజేయుచున్న దనుటలో వింత లేదు-విశేషము కాదు.

జిజ్ఞాసకొఱకై మానవుడు ఎంత తపింపవలెనో? ఎంత అన్వేషింపవలెనో? ఎంత పరువులెత్తవలెనో? అన్నింటికిని గ్రంథకర్తయే మూలమై సముచిత పద్ధతితో సర్వతోముఖముగా సంలబ్ధి ఫలితముగా మహిమాతిశయముల నుద్దీపింప జేయు వాఙ్మయముల బ్రస్ఫుటముగా గ్రోడీకరించి వివిధ విషయములతో వివిధ భంగుల బాఠకుల నానందరసాబ్ధి నోలలాడించి రనుటలో అతిశయోక్తి లేదు. ముఖ్యముగా మొదటి భాగములో జగన్మిథ్యాత్మ నిరూపణతో విడిచిపెట్టక ద్వితీయమున అద్వితీయవిధానముగా భక్తి ప్రపత్తి ప్రముఖ విషయముల గూర్చి నిరవధికముగా అనే కోదాహరణ పూర్వకముగా నుల్లేఖించిరి. సహజముగా నాధ్యాత్మిక విషయములలో సంభవించు బహుళ సంశయముల గూర్చి విపులముగా విశదీకరించుచు పెక్కు నివారణోపాయముల నుల్లేఖించియున్నారు. మఱియును వేద విభాగ కర్తయగు వ్యాసమహర్షి ప్రవచించిన బ్రహ్మసూత్రములలో "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అని ప్రారంభించి తన హృదయ గతాభిమతములగు నాధ్యాత్మిక పరమ రహస్యములను నిరాఘాట

Dr K Dayanandaswamy ebooks



ధాటీ పాటవముతో నుద్ఘాటించి యున్నారు. ఈ కృతికర్తయు "బ్రహ్మజిజ్ఞాస" అను పేర సంశయ ప్రాతిపదిక సమస్యలను పెక్కింటిని నివారించుటకై నిరవధిక శక్తితో నిర్భయముగా నమృతోపమానముగ జాటియున్నారు. ఇట్టి యుద్గ్రంథములు ముముక్షువులగు పాఠకుల కెంతయేని మహోపకారకములు గాన నిట్టి ప్రకరణ విషయక గ్రంథము లెన్నియో విరచించి శ్రీ భారతి సేవాసమగ్రతలో నుత్తీర్ణు లగుదురని అందుకై భగవంతుడు ఈ గ్రంథకర్తకు ఆయురారోగ్య భోగ భాగ్య విజ్ఞాన నిధాన మొసంగుగాతమని పొరింబొరి నా జగదీశుని ప్రార్థించుచున్నాను.

(సం) స్వామి నిత్యానంద
అధ్యక్షుడు
అఖిలాంధ్ర సాధుపరిషత్తు
**14-3-1969.**

—✤—

## మహాకవి, విద్వాన్
## దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి అభిప్రాయము.

ప్రథమభాగము వలెనే ఈ ద్వితీయభాగమును బ్రహ్మవిద్యా రహస్యములను విశదీకరించుచు ప్రశ్నోత్తరముల రూపమున జిజ్ఞాసువుల సందేహమును నిశ్శేషముగా తొలగించుచు, భక్తి జ్ఞాన వైరాగ్యములను మనస్సునకు హత్తించుచు అత్యంత ప్రశంసనీయముగా నున్నది.

ముముక్షువుల కెల్లరకును ఈ యుత్తమ గ్రంథము అవశ్య పఠనీయము, అపారోపకారకము అనుటలో సందేహము లేదు.

నెల్లూరు,
10-3-1968

(సం) దీపాల పిచ్చయ్య శాస్త్రి.

Dr K Dayanandaswamy ebooks



## ఉభయవేదాంత ప్రవర్తకులు

# శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి అభిప్రాయము

శ్రీయుతులు మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యగారికి నమస్సులు.

నా విలంబమును మన్నింపుడు. మీ "బ్రహ్మజిజ్ఞాస" రెండు సంపుటాలును మీరు విశ్వాసముతో పంపి పదునైదు దినములు దాటినవి. విషయమును విస్తరమును గొప్పవి. వయోదోషముచేత ఆరోగ్యమును దృష్టిపాటవమును శిథిలములుగా నున్న నాకు ఆ గ్రంథములను తుదిదాక చూచుట కింత నిదానమైనది. ఒకవిధముగా చదివి యిప్పటికి ముగింపగలిగినాను. ఇంకను రెండు మారులైనను చదువుకోవలసి యున్నది. ప్రయత్నింతును.

మీ గ్రంథమున అద్వైతసిద్ధాంతము సాంగోపాంగముగా విశదముగా వివరింపబడినది. వైశద్యము, సంయమము, నిర్మలత, అకృత్రిమధార - ఇవి మీ శైలిలో చూచి సంతోషింపవలసిన విషయ విశేషములు. గహనమైన విషయము లింత చక్కగా చిక్కు లేక వ్రాయగలుగుట సామాన్యము గాదు. ఇందుకు నావంటి చదువరుల కృతజ్ఞత మీయెడ చెల్లగలదు. విశిష్టాద్వైత ప్రక్రియను అట్టి నిర్మలశయ్యతోనే వివరించితిరి. కాని అది తెంగల సంప్రదాయమునే ఎక్కువగా ప్రతిఫలింపజేయుచున్నదని నా సందేహము; నేను వడగల సంప్రదాయమువాడను. ఈ రెండు సంప్రదాయములకును గల భేదము సాంఘికముగా నున్నంత తాత్త్వికముగా లేదని నా విశ్వాసము. తత్త్వవిషయమున శ్రీదేశికుల మహారచనల విలువ ఉదాసింపరానిది. శ్రీ రామానుజ సిద్ధాంతమున కవి మూలాధారములుగా నున్నవన్నమాట యిరుతెగలవారును అంగీకరించినదే.

తిరుపతి,
17-3-69

భవదీయుడు.
(సం) రా॥ అనంతకృష్ణశర్మ.

Dr K Dayanandaswamy ebooks



## అఖిలాంధ్ర సాధుపరిషత్ ఉపాధ్యక్షులును,
## గీతావాణి సంపాదకులును, భూమానందాశ్రమాధిపతులును నగు
## ప॥ప॥ శ్రీరామకృష్ణానందస్వాములవారి
## అభిప్రాయము.

స్వాధ్యాయతపస్వి శ్రీ మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యగారు తాము వ్రాసిన "బ్రహ్మజిజ్ఞాస" యొక్క ద్వితీయ భాగమునకు నా అభిప్రాయమును కోరి పూర్తిగా బైండుచేయని పుస్తకమును నాకు పంపిరి. నా అభిప్రాయము వారి గ్రంథములో పడవలెనట. అదేమోకాని, వారి గ్రంథమే యిప్పుడు నా అభిప్రాయములో పడినది. కొన్ని కొన్ని విషయముల గురించి నాలోని విచికిత్సలకు ఈ గ్రంథము చికిత్స చేసినది.

అద్దములో కొండను చూపినట్లు వేదాంత శాస్త్రమునంతను సారాసార సముద్ధరణము చేసి చెప్పిన గ్రంథమునకు మొత్తము గ్రంథము గ్రంథమే అభిప్రాయము.

ఈ గ్రంథములో జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగముల యొక్కయు ప్రపత్తి స్వరూప స్వభావ ప్రకార ప్రయోజనములు సమగ్రముగ అయిదు ప్రకరణములతో సుమారు అయిదువందల పుటలలో చర్చింపబడినవి. ప్రపత్తి అనునది భక్తియోగమునందే అంతర్భూతము కాగలదు. "భక్తి ప్రపత్తులు ఒకే పద్ధతియొక్క రెండు రూపము" లని శ్రీ రాధాకృష్ణ పండితులు చెప్పిన మాటను గ్రంథకర్త ఉదాహరించియున్నారు.

మానవులు భిన్న సంస్కారములు కలవారు. సంస్కారములనుబట్టి వారి వారి అభిరుచులు కూడ భిన్న భిన్నములు. సాధనమార్గము కూడ ఈ క్రమమునకు అపవాదముగ లేదు. వినోబాభావే చెప్పిన విధమున, ``గంగానదిని దాటుటకు వారి వారి అనుకూలము ననుసరించి వారి వారి చోటులనుండి వంతెనలు వేసికొనునట్లు; సంసారమును తరించుటకు ముముక్షువులు తమ

Dr K Dayanandaswamy ebooks



తమ సంస్కారములనుబట్టి సాధనలను గ్రహింతురు. బుద్ధిప్రధానులు జ్ఞానయోగమును, చిత్తప్రధానులు రాజయోగమును, ఇంద్రియ (ప్రాణ) ప్రధానులు కర్మయోగమును, హృదయ ప్రధానులు భక్తి యోగమును అనుసరించుటకు ఇచ్ఛగింతురు. మొదట ఈ మార్గములు భిన్న భిన్నముగ నున్ను, గమ్యమును చేరుసరికి, గిరిశిఖరము నెక్కుసరికి దారుల వలెను; సముద్రమును చేరుసరికి నదులవలెను సమన్వయము పొందగలవు. ఈ సిద్ధాంతమునే "యే యథా మాం" అని, "ధ్యానే నాత్మని" అని భగవద్గీతయు, "త్రయీ సాంఖ్యం యోగం" అని పుష్పదంతాచార్యులు, అట్లే శ్రీ రామకృష్ణ వివేకానంద, రామతీర్థ, మహాత్మగాంధీ, వినోబా ప్రభృతులును ప్రతిపాదించి యున్నారు. ఆకులు కొమ్మలు ఎంచుకొనుట పండితుల పద్ధతి. పండ్లు తినుట సత్పురుషుల పని.

యుగపురుషుడు సర్వమత సమన్వయకర్త శ్రీ రామకృష్ణ పరమహంసగారి స్మరణతో ప్రారంభమైన (మొదటి భాగము చూడండి) గ్రంథములో గ్రంథకర్త కూడ పై విధమున సమన్వయముతో చెప్పిన మాటలు చూడండి.

"భిన్న భిన్న సంస్కారములు గల భిన్నజీవులకు సరిపడునట్లు భిన్న భిన్నములగు మోక్షధర్మములను భగవంతుడు, లేక గీతాకారుడు గీతాముఖమున లోకమున కుపదేశించి యున్నాడు. ఎవరికేది తగునో వారద్దాని ననుసరింతురు"(పేజి 357.)

"జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగములను నీ నాలుగు సంప్రదాయములను నొకదానితో మరియొకటి అప్పుడప్పుడు కలియుచుండును. అయినను నీ నాలుగింటిలో నేది సాధకునిచేత ప్రాముఖ్యముగా గైకొని యాచరణలో పెట్టబడునో అతడట్టి సంప్రదాయమునకు చెందిన వాడని పిలువబడును" (పేజి 98).

146 వ పేజిలోని "కర్తవ్యము-స్వధర్మము" అను విషయము చదువదగినది.

*　*　*

Dr K Dayanandaswamy ebooks



గ్రంథము చివరిలో జిజ్ఞాసువు పలికిన మాటలనే క్రింద పొందుపరచుచున్నాను. (360 పేజి)

"నా బోంట్లు ఎన్నియో గ్రంథములు ఎంతో కాలము కష్టపడి చదివినను తెలిసికొనజాలనంతటి విజ్ఞానమును బోధించితిరి." ప్రతి పాఠకుడును పలుకవలసిన మాటలివి.

"సకలరత్నపూర్ణ సర్వ వసుంధరా
చక్రదాన విధియు సరి యనంగ
రాదు. విశ్వవేదరాశి సారాధ్యాత్మ
విద్య యిచ్చుటకు వివేకధుర్య."

అని మహాభారతమున చెప్పిన మాటను తానును గ్రంథమున 18వ పుటలో చెప్పిరి, చెప్పుటేకాక ఆ ఫలమును సాధించుకొన్న దక్షత ధన్యత గ్రంథకర్తకు దక్కినది. ధన్యవాదములు.

తృతీయభాగ సందర్శన సౌభాగ్యమునకు ప్రతీక్షించు

మీ అభిన్నాత్మ,

(సం)శ్రీరామకృష్ణానందస్వామి,

25-3-69

మకాం,
శ్రీ శంకరనికేతనము,
శృంగేరి.

Dr K Dayanandaswamy ebooks

సంస్కృతభాషా ప్రచారిణీ సభా ప్రధాన మంత్రులగు
ఉ॥ వే॥ శ్రీమాన్ సాహిత్యరత్న, విద్యాప్రవీణ, విద్వాన్,

# తి.కం. తిరువేంగడాచార్యులవారి అభిప్రాయము

శ్రీయుతులు జ్ఞానవయోవృద్ధులునగు శ్రీ మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యగారు రచించిన 'బ్రహ్మజిజ్ఞాస' రెండవ భాగము ఆమూలాగ్రము పఠించితిని. శుద్ధమైన భాషలో, లలితమైన శైలిలో సరళాతిసరళముగ వేదాంత విషయములను వివరించిన వీరి ప్రతిభా విశేషము అభినందనీయము. గహనమగు వేదాంత విషయములను అరటిపండొలిచి చేత నిడినట్లు ప్రతిపాదించిరి. వాసనాక్షయ తత్త్వజ్ఞానములు, మనోనాశతత్త్వజ్ఞానములు, చిత్తముయొక్క స్థూల సూక్ష్మతలు మొదలగువాని వివరణములిందుకు నిదర్శనములు.

మఱియు నీ రచయిత యద్వైత సిద్ధాంతమున నిష్ణాతృత్వమును వహించుటయే గాక విశిష్టాద్వైతమునందును తగినంత పరిజ్ఞానమును గడించి యుభయ సిద్ధాంతముల యందును దనకు గల యాదరమును దెలుపుటకే యీ భాగము రచించెనని తోచుచున్నది. వీరి గ్రంథ రచనమునకై యుపక్రమించి శతాధికములగు గ్రంథములను పరిశీలించిరి. అందును సుమారిరువది విశిష్టాద్వైత గ్రంథములను ఆకళించుకొనిరని తెలియుచున్నది. వీరు చాలవరకు అద్వైత విశిష్టాద్వైత మతముల సమన్వయమునకే యత్నించిరి. కొన్ని చోట్ల గల యాంతరంగికాభిప్రాయ భేదములకును తమ వ్యాఖ్యానమును జతపఱచి సమన్వయమును సాధించిరి. ఉదాహరణమునకు (1) విదేహముక్తిని గుఱించి శంకర విద్యారణ్యుల భావభేదములకు సమన్వయమును 41 వ పుటయందు జూచునది. (2) రామానుజాచార్యులు వేదాధికారము లేనివారికి జ్ఞానకర్మలయం దధికారము లేదని శ్రీభాష్యమున ప్రతిపాదించిన దానికి వీరి సమన్వయము 174వ పుటయందు జూచునది. బ్రహ్మవిద్యాధికారమునకు జాతి యడ్డు రాదని వీరు మహాప్రయత్నముతో సమర్థించిరి.

ప్రపత్తికి ఉపనిషత్తులయందు ప్రమాణము లేదనుటయు, ప్రపత్తి బీజములు మాత్ర మందు గోచరించుచున్న వనుటయు సరికాదు.

Dr K Dayanandaswamy ebooks



ఈశావాస్యోపనిషత్తునందలి 'వాయు రనిల మమృతం' ఇత్యాది 17వ మంత్రమును "అగ్నేనయ" అను 18వ మంత్రమును చరమశ్లోకార్థకమే యని పూర్వాచార్యులు వ్యాఖ్యానించిరి. ఇంతయేల శ్రుతిస్మృత్యాది సకల ప్రమాణములను శరణాగతి పర్యవసాయులుగా శ్రీవైష్ణవు లనుసంధింతురు.

విశేషానుగ్రహ విషయముననువీరి యుద్దేశము వేరుగా నున్నది. వ్యక్తిగతాభిప్రాయము భేదించుట సహజము.

ఏతావతా వీరి బృహద్గ్రంథము బహుగ్రంథ పరిశీలన ఫలితమై స్వానుభవ సమ్మిళితమై, సులభగ్రాహ్యమై, ముముక్షువుల కుపాదేయమై జిజ్ఞాసువులకు సకల విషయ ప్రతిపాదకమై యలరారుచున్నది.

ఇట్లు

చిత్తూరు.
28-3-69.

(సం) తి. కం. తిరువేంగడాచార్యులు,
ప్రధానమంత్రి
సంస్కృతభాషా ప్రచారిణి సభ.

Dr K Dayanandaswamy ebooks



# Opinion of Ubhaya Vendantha pravarthaka

Sreeman
**M. Ananthasayanam Ayyangar,**
former governor of Bihar
and former speaker of parliament.

31. G. M. STREET,
TIRUPATI,
4-4-69.

I have gone through both the parts of "Brahma Jijnasa" written by Sri Marriboyina Ramasubbayya Garu. They are both interesting and instructive. Both of them deal with the knowledge of Brahman or the Creator of the Universe. The same title has been used to both parts. The title to both the parts has been taken from the first Sutra, the Brahma Sutras. The language is simple and is in an easy flowing style.

The first part deals mainly with the philosophy of Advaitha the points for and against the same and also the principles of their schools of philosophy and emancipation from birth and death. At the outset, the author tries to establish that even in the early days, all casteds were competent to read the Vedas and Upanishads I agree with him that every one who wants to attain Moksha can read all the Pramanas today, whatever might have been practice or the injunctions in the earlier periods. It is necessary that every one should know our religion. Hinduism based on the Upanishads and the Brahmasutras is the most cosmopolitan system and is fully based on philosophical researches. The need of the hour is the spread of knowledge of our ancient philosophy, religion and culture, and, Sri Rama subbayya has done a great service by printing this book in an easy flowing style and putting it within the reach of the ordinary man.

Dr K Dayanandaswamy ebooks



The second part deals with what we call the Upaayaas or the means of attaining Brahman. It deals with the details of Gnaana Yoga, Raaja Yoga, or Dhyaana Yoga, karma Yoga, Bhakti Yoga, or Devotion and Prapatthi or the Doctrine of Surrender. He describes in detail the principles of Devotion and the Doctrine of surrender according to the Raamaanuja philosophy. These two parts contain the knowledge and information necessary to understand the various systems of Vedic Philosophy prevailing in India.

I am sure that the readers will greatly benefit by reading these books.

**(Sd) M. Ananthasayanam Ayyangar**

Dr K Dayanandaswamy ebooks



శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతులగు

# శ్రీశ్రీశ్రీ విమలానందస్వాములవారి అభిప్రాయము

శ్రీ వ్యాసాశ్రమం-పోస్టు,
ఏర్పేడు మార్గము,
చిత్తూరు జిల్లా (ఆం.ప్ర.)

మకాం,
ఓంకార సత్రయాగము,
దువ్వ - (పోస్టు) ప.గోదావరి జిల్లా.
14-4-69

పరిశుద్ధాత్మ స్వరూపులగు,

శ్రీ మట్టిభోయిన రామసుబ్బయ్యగారిచే రచింపబడిన 'బ్రహ్మజిజ్ఞాస' అను గ్రంథముయొక్క ప్రథమ, ద్వితీయ భాగములు రెండు చేరినవి. పూర్తిగ చదువుట కవకాశము చిక్కినది కాదు. అయినను సంచారములో వెంట ఉంచుకొని వీలు చిక్కినపుడెల్ల స్థాలీపులాకన్యాయముగ నచటచట చూచుట జరిగినది. శ్రీ రామసుబ్బయ్యగారు చాల పరిశ్రమచేసి యీ ఉద్గ్రంథమును రచించిరి. వారి వివిధ గ్రంథావలోకనమునకు, దీర్ఘకాల పరిశ్రమకు సాక్షి యీ 'బ్రహ్మజిజ్ఞాస'. అందులోను స్వయముగా వ్రాయుటకు ఓపిక లేకపోయినా తాము చెప్పుచు నితరులచే వ్రాయించిరట. దీనివలన గూడ వారి ప్రజ్ఞ, సూక్ష్మేక్షిక, వివిధ విషయ పరిజ్ఞానము సువ్యక్తమగు చున్నది. మొత్తానికి ఈ రూపేణ వారు తెలుగు భాషలో లేని లోటును దీర్చిరి. సంస్కృత భాషలో వివిధ వేదాన్త గ్రంథములను పఠించి సారమును గ్రహించలేని ఆంధ్ర సాధకులకు, జిజ్ఞాసువులకు నీ రూపమున మహోపకార మొనర్చిరి. వీరి యీ సేవ చిరస్మరణీయము. సంస్కృతాభిజ్ఞులకు గూడ ఇంతటి వ్యాపకజ్ఞాన ముండదేమో యనిపించుచున్నది. ఇందు వర్ణవ్యవస్థాది విషయములు నవ్యదృష్టితో విమర్శింపబడియున్నవి.

ముముక్షువులకు, జిజ్ఞాసువులకు తప్పక పఠింపదగిన గ్రంథము. శ్రీ రామసుబ్బయ్యగారికి పరమేశ్వరుడు ఇతోఽధికాధ్యాత్మికసేవ జేయుశక్తి సామర్థ్యముల ప్రసాదించి అనుగ్రహించుగాక!

ఓం జయ గురుదేవ్!

మీ
విమలానందస్వామి

Dr K Dayanandaswamy ebooks



ఆచార్య (ప్రొఫెసర్) డాక్టరు కొత్త సచ్చిదానందమూర్తిగారు 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమ - ద్వితీయ భాగములపై వ్రాసిన అభిప్రాయము.

## Sri Venkateswara University

Professor
**K. Satchidananda Murthy**
Vice-chancellor

Tirupati - 517502
Andhra Pradesh
18th January, 1976.

Dear Shri Ramasubbaiah,

I have received copies of your Brahma-Jijnasa, 2 Pts. Thank you very much.

I have read a few paragraphs here and there and I am happy to note that you have expounded Vedantas in the traditional way in clear Telugu.

I hope many mumukshoos are reading it and are being profited.

Yours sincerely,

(Sd.) K. Satchidananda Murthy.

(పై అభిప్రాయమునకు ఆంధ్రానువాదము)

ఆచార్య
కె. సచ్చిదానందమూర్తి,
వైస్-ఛాన్సలర్

తిరుపతి - 517 502
ఆంధ్రప్రదేశ్
18 జనవరి 1976

ప్రియమైన రామసుబ్బయ్యగారూ !

మీ 'బ్రహ్మజిజ్ఞాస' గ్రంథముయొక్క రెండు భాగములు చేరినవి. అనేక వందనములు

అక్కడక్కడ కొన్ని ప్యారగ్రాఫ్‌లను చదివినాను. అందు మీరు వేదాంతమును సంప్రదాయక విధమున విస్పష్టమైన తెనుగులో వివరించినారు. ఈ విషయము నాకు చాలా ఆనందమును తృప్తిని కలిగించినది.

అనేక ముముక్షువులు దీనిని చదివి లాభపడగలరని ఆశపడుచున్నాను.

సహృదయముతో

(సం) కె. సచ్చిదానందమూర్తి

Dr K Dayanandaswamy ebooks



# గ్రంథసమీక్ష

యథార్థ భారతి - వ్యాసాశ్రమమునుండి వెలువడు వేదాంత మాసపత్రిక. సంపుటి 43- సౌమ్యనామ సం|| నిజాషాఢము జూలై నెల 1969 - సంచిక 5.

ఓమ్

"బ్రహ్మజిజ్ఞాస" (ప్రథమ, ద్వితీయ భాగములు)

గ్రంథకర్త : శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారు. కడప.

ఇందు అద్వైతమత సిద్ధాంతమునకు సంబంధించిన అనేక విషయములు చర్చింపబడినవి. గ్రంథకర్త అనేక శాస్త్రములను పరిశోధించి వేదాంతజిజ్ఞాసువులకు తెలుసుకోదగిన పెక్కు విషయములను అనగా సాధకుని యొక్క బ్రహ్మజిజ్ఞాస మొదలుకొని బ్రహ్మసాక్షాత్కార పర్యంతము జిజ్ఞాసువులకు ఉపకరించు నటుల శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాస ప్రమాణ పురస్సరముగ అనేక విషయములను వివరించిరి. వర్ణ వ్యవస్థాది విషయములు నవ్యదృష్టితో, సత్య దృష్టాంతములతో పరిశీలింపబడినవి. బ్రహ్మజిజ్ఞాసువులు తప్పక పఠింపదగిన గ్రంథము, బ్రహ్మజిజ్ఞాస. ఆంధ్రజిజ్ఞాసు లోకమునకు మహోపకార మొనర్చినది. శ్రీరామసుబ్బయ్యగారు విలక్షణమైన ప్రతిభతో, అసమాన ప్రజ్ఞతో ఈ బ్రహ్మజిజ్ఞాసను తెలుగు భాషామతల్లికి సమర్పించి ఎనలేని కీర్తిని గడించిరి.

—✤—✤—✤—

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 17-9-1969

బ్రహ్మజిజ్ఞాస (ద్వితీయభాగము)

గ్రంథకర్త : శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్యగారు.

జ్ఞాన, రాజ, కర్మ, భక్తి యోగములున్ను, 'ప్రపత్తి' అనుభాగమును కల ఆధ్యాత్మికవిద్యా వివరణ రూపమైన దివ్యగ్రంథము ఇది.

Dr K Dayanandaswamy ebooks



జిజ్ఞాసువు ప్రశ్నిస్తూ ఉంటాడు. వేదాంతి సమాధాన మిస్తూ ఉంటాడు. శ్రుతిస్మృతులు, ఉపనిషత్తులు, భారత భాగవత రామాయణ ములు, భగవద్గీత - ఈ గ్రంథాన్ని సప్రమాణమును చేశాయి.

ఆధ్యాత్మవిద్య అనగానే ఆమడదూరం పర్వెత్తిపోయే వానిని అత్యంత శ్రద్ధాభక్తులతో అతి సన్నిహితుని చేసే గ్రంథము ఇది.

జీవాత్మ సంబంధాన్ని, రహస్యాన్ని తెలుసుకుని తరణోపాయము గుర్తించి పరమహంసయై పరబ్రహ్మమునందు లీనము కావడమే జీవిక చరమలక్ష్యం. దానికి మించిన కృతకృత్యత లేదు.

'ద్వేపదే బంధ మోక్షాయ
న మమేతి మమేతి చ
మమేతి బధ్యతే జంతుః
న మమేతి విముచ్యతే' (పైంగలోపనిషత్తు)

బంధమునకు, మోక్షమునకు రెండు మార్గములు గలవు.

ఒక మార్గము 'న మమ', రెండవది 'మమ'. 'మమ'(నాది, నావారు) అను మార్గమునందు బంధమును, 'న మమ' (నాదికాదు) అను మార్గమున పోయిన మోక్షము కలుగును.

రాజయోగ మనగా నా కేదో సందేహముండేది. ఈ గ్రంథమున గల రాజయోగ వివృతివలన అది తీరంది. అలాగే భక్తికి, ప్రపత్తికి గల భేదము, ఫలము ప్రపత్తి వివృతివలన తేట తెల్లమయింది.

రామానుజాదుల మత సిద్ధాంతాలు కూడ దీనివల్ల సులభ గ్రాహ్యము లవుతున్నాయి. వాటికి చిన్న చిన్న కథలు కూడ ఉన్నాయి.

ప్రపత్తిని వివరిస్తూ అళ్వారుల మార్గాన్ని రామ సుబ్బయ్యగారు రమ్యంగా చూపారు. వాటిలో 'దాశరథి' సంఘటన చక్కగా ఉంది. తేట తెలుగున బ్రహ్మవిద్యను బోధించే గ్రంథాలలో ఇది ప్రథమగణ్యి మన దగ్గది.

— *యామిజాల.*

Dr K Dayanandaswamy ebooks

బ్రహ్మ జిజ్ఞాస ద్వితీయ భాగముయొక్క రచనకు తోడ్పడి నట్టియు ఈ భాగమున నుదాహరించినట్టియు గ్రంథనామములు, వాటి సంకేతాక్షరములు మొదలగు వివరములు

**సంకేతాక్షరములను (        ) యీ గుర్తులో వేసియున్నాను**

| **గ్రంథ నామము** | **గ్రంథకర్త లేక అనువాదకులు లేక ప్రచురణ కర్తలు** | |
|---|---|---|
| (గీత: గీ) భగవద్గీత | | వావిళ్ళవారిది |
| (ఆం. భాగ.)ఆంధ్ర భాగవతము | శ్రీపోతన కవి | " |
| (ఆం.మ.భా.శాంతి)ఆంధ్రమహాభారతము శాంతిపర్వము, | కవిత్రయము | |
| సనత్సుజీతాయము | | " |
| ఆంధ్రపద్మపురాణము | శ్రీ పిసుపాటి చిదంబర శాస్త్రి | |
| పాద్మము | సంస్కృతము | |
| ఆంధ్రవామన పురాణము | శ్రీ రామావఝుల కొండయ్యశాస్త్రి | |
| ఆంధ్ర శివపురాణము | శ్రీ ముదిగొండ నాగవీరేశ్వర కవి | |
| ఆంధ్ర విష్ణుపురాణము | | |
| శివపురాణము (సంస్కృతము) | | |
| ఉత్తర హరివంశము | శ్రీ నాచనసోమకవి | వావిళ్లవారిది |
| హరివంశము | శ్రీ ఎఱ్ఱనకవి | " |
| (పా.యో.సూ.) పాతంజలయోగ సూత్రములు - | శ్రీవివేకానంద స్వాములవారి వ్యాఖ్యకు ఆంధ్రానువాదము శ్రీరామకృష్ణమఠమువారి ప్రచురణ. | |

కర్మయోగము- శ్రీ వివేకానందస్వామి, అనువాదకులు -చిరంతనానందస్వామి

Dr K Dayanandaswamy ebooks



(హఠ)హఠయోగప్రదీపిక శ్రీ వివేకానందస్వామి అనువాదకులు- చిరంతనానందస్వామి

(హఠ) హఠయోగప్రదీపిక శ్రీ స్వాత్మారామయోగి వావిళ్ళవారిది

(యో. ప్ర. ) యోగమార్గ ప్రకాశిక - యుగళదాసుగారిది "

శ్రీ శంకరాచార్యులవారి గ్రంథములు:-

(బ్ర. సూ. భా) బ్రహ్మసూత్రభాష్యము-పురాణపండమల్లయ్యశాస్త్రి గారి ఆంధ్రానువాదము

దక్షిణామూర్తిస్తోత్రము వావిళ్ళవారిది

అపరోక్షానుభూతి "

(స.వే.సి.సం.) సర్వవేదాంతసిద్ధాంత సంగ్రహము "

(వి. చూ.) వివేకచూడామణి

(దృ. వి.) దృగ్దృశ్యవివేకము

కనకధారాస్తవము "

శివానందలహరి "

సౌందర్యలహరి "

(గౌ.కా.)గౌడపాదకారికలు "

ఇతర వేదాంత గ్రంథములు :-

(నై.సి.) నైష్కర్మ్యసిద్ధి - శ్రీ సురేశ్వరాచార్యులు "

(సాం.సూ.) సాంఖ్యసూత్రములు(దర్శనము)శ్రీ పండితగోపదేవ్ వ్యాఖ్య సాంఖ్యకారికలు

(జ్ఞా.వా.) జ్ఞానవాసిష్ఠము

(వే.పం) వేదాంత పంచదశి-శ్రీ విద్యారణ్యస్వామి

(జీ.ప్ర) జీవన్ముక్తి ప్రకాశిక ,,శ్రీమేకల పార్థసారథినాయుడుగారి ఆంధ్రీకరణము ఉత్తరగీత.

Dr K Dayanandaswamy ebooks

**శ్రీ సీతారామాంజనేయ సంవాదము**

(భా.త) భారతీయతత్త్వ శాస్త్రము, డా||యస్. రాధాకృష్ణన్‌గారి ``ఇండియన్ ఫిలాసఫీ" అను నాంగ్లగ్రంథమునకు శ్రీ బులుసు వేంకటేశ్వరుల ఆంధ్రానువాదము.

(శ్రీమద్రామా.) శ్రీమద్రామాయణము

ఆముక్తమాల్యద శ్రీకృష్ణదేవరాయలు

శ్రీకాళహస్తిమాహాత్మ్యము - ధూర్జటికవి

శ్రీకాళహస్తీశ్వర శతకము

**శ్రీ వైష్ణవ గ్రంథములు:-**

(ఆం. శ్రీ. భా) ఆంధ్రశ్రీభాష్యము -శ్రీమద్రామానుజాచార్యులవారి శ్రీభాష్యమునకు ఆంధ్రానువాదము - అనువాదకులు - శ్రీమాన్ కం. శేషాచార్యులు.

(ము. ము) ముముక్షుప్పడి శ్రీ పిళ్ళైలోకాచార్యుల తమిళ గ్రంథమునకు అనువాదము అనువాదకులు - శ్రీమాన్ కం. శేషాచార్యులు.

(శ్రీ భూ.) శ్రీవచన భూషణము - శ్రీమాన్ P.B. అణ్ణంగరాచార్య స్వాములు

(ఆ. హృ) ఆచార్యహృదయము - అనువాదకులు శ్రీ కం. శేషాచార్యులు.

(వి. మో) విలక్షణమోక్షాధికారి నిర్ణయము - ఎరుంజి అప్పా "

(ర.సా) రహస్యసారము - శ్రీ వేదాంత దేశికులు - "

(ప. ప) ప్రపన్నామృతము - శ్రీ అనంతాచార్య విరచితము - టి.వి. చూడామణిగారి తాత్పర్యసహితము.

(తిరు) తిరువాయి మొళి - శ్రీ నమ్మాళ్వార్లు -శ్రీమాన్ మాడభూషి రామానుజాచార్యులు

ఆచార్యసూక్తిముక్తావళి - శ్రీనంబూరి కేశవాచార్యులు

అవతార రహస్యము - శ్రీ దేశిక వరదాచార్యులు

దివ్యసూరిచరితము - శ్రీ గరుడవాహన పండితులు.

Dr K Dayanandaswamy ebooks



స్తోత్ర రత్నము- శ్రీ యామునాచార్యులు

గద్యత్రయము -శ్రీ మద్రామానుజాచార్యులు, శ్రీమాన్ పి. బి. అణ్ణంగ రాచార్యస్వాములవారు.

యతీంద్రమత ప్రదీపిక - శ్రీ కం. శ్రీనివాసాచార్యులు

ముకుందమాల - శ్రీ కులశేఖరాళ్వార్లు

పిళ్ళైలోకాచార్యులవారు తమిళమున రచియించిన ``అష్టాదశ రహస్య గ్రంథములయందు పది రహస్యములు"

తత్త్వత్రయము, అర్థపంచకము, ప్రమేయశేఖరము, ప్రపన్న పరిత్రాణము, సారసంగ్రహము, సంసారసామ్రాజ్యము, నవరత్నమాల, నవవిధ సంబంధము; తత్త్వశేఖరము, అర్చిరాది. ఆంధ్రానువాదము - శ్రీమాన్ గట్టుపల్లి శేషాచార్యులు.

ఉపనిషత్తులు: (శ్వేత) శ్వేతాశ్వతర; ముండక; ప్రశ్న: సన్న్యాస; పరమహంస;పరమహంస పరివ్రాజక: జాబాల్య: యాజ్ఞవల్క్య:నారద పరివ్రాజక; ముద్గల; అన్నపూర్ణ; (ముక్తి)ముక్తిక:(అమృత) అమృతబిందు:శాట్యాయని; పైంగల: (తేజ. తేజో) తేజోబిందు; (యో.శి.) యోగశిఖ; (యో. కుం.) యోగకుండలి; యోగతత్త్వ: (బృ) బృహదారణ్యక: శాండిల్య;(త్రి. బ్రా) త్రిశిఖి బ్రాహ్మణ; మండలబ్రాహ్మణ: (యో.చూ)యోగ చూడామణి; (ధ్యాన)ధ్యానబిందు; బ్రహ్మవిద్య: పాశుపత:బ్రహ్మ; అద్వయతారక: స్కంద:రామరహస్య: రామతాపని; సీత; సారసార; గోపాలతాపిని; కృష్ణ; హంస; కలిసంతారణ; దర్శన; సౌభాగ్యలక్ష్మి; తారసార; నారాయణ; (ఛాం) ఛాందోగ్య; భిక్షుక; తురీయాతీత; అవధూత; ఇంకను కొన్ని గ్రంథములు.

Dr K Dayanandaswamy ebooks



# ద్వితీయభాగము - విషయసూచిక

## మొదటి ప్రకరణము - జ్ఞానయోగము


| | | |
|---|---|---|
| ౧. | ఆరంభము | .... 1 |
| ౨. | ముముక్షువు | ....2 |
| 3 | ముముక్షువు దినచర్య | ....3 |
| ౪. | ముముక్షువు పరిత్యజింపదగినవి | ....4 |
| ౫. | సాధన చతుష్టయము | ....8 |
| ౬. | శ్రవణాదులు | ....10 |
| ౭. | యజ్ఞదానతపములు | ....12 |
| ౮. | ఉపాసనములు | ....17 |
| ౯. | భ్రమ రెండు విధములు | ....19 |
| ౧౦. | ప్రతిబంధములు | ....20 |
| ౧౧. | ప్రణవోపాసన | ....21 |
| ౧౨. | సత్త్వగుణపోషణ | ....24 |
| ౧3. | సన్న్యాసము | ....27 |
| ౧౪. | విదేహముక్తుడు, అశరీరి | ....39 |
| ౧౫. | వైరాగ్యబోధోపరతులు | ....48 |
| ౧౬. | జ్ఞానియొక్క లోకవ్యవహారము | ....53 |
| ౧౭. | తత్త్వజ్ఞాన వాసనాక్షయ మనోనాశములు | ....56 |
| ౧౮. | వాసనలు | ....59 |
| ౧౯. | వాసనాక్షయ మనోనాశములు | ....66 |
| ౨౦. | వాసనాక్షయ తత్త్వజ్ఞానములు | ....69 |
| ౨౧. | మనోనాశ తత్త్వజ్ఞానములు | ....70 |
| ౨౨. | చిత్తముయొక్క స్థూలసూక్ష్మతలు | ....78 |

Dr K Dayanandaswamy ebooks



౨3. అష్టాంగ (జ్ఞాన) యోగము ....79
౨౪. సమాధి విఘ్నములు ....80
౨౫. సమాధి ....84
౨౬. జీవన్ముక్తుడు ....89
౨౭. జ్ఞానికి ఆకాశగమనాది శక్తులుండునా? ....94
౨౮. విదేహ కైవల్యము (తురీయాతీతము) ....97

## రెండవ ప్రకరణము - రాజయోగము

౧. అవతారిక ....99
౨. యోగతత్త్వము ....100
3 సాంఖ్యము-యోగము ....102
౪. యోగము-జ్ఞానము ....106
౫. యోగమున కర్తులు ....109
౬. యోగము అష్టాంగములు గలది ....110
౭. యమము ....110
౮. నియమము ....112
౯. ఆసనము. ....114
౧౦. ప్రాణాయామము ....115
౧౧. ప్రత్యాహారము ....117
౧౨. ధారణ ....117
౧3. ధ్యానము ....118
౧౪. చిత్తముయొక్క అవస్థలు ....119
౧౫. నిరోధ సంస్కారము ....120
౧౬. సమాధి ....120
౧౭. యోగము నాల్గు విధములు ....123
౧౮. తారకము ....125

Dr K Dayanandaswamy ebooks

౧౯. నాడీమండలము ....126
౨౦. షట్చక్రములు ....129
౨౧. సహస్రారము ....131
౨౨. కుండలినీశక్తి ....131

## మూడవ ప్రకరణము - కర్మయోగము

౧. అవతారిక ....136
౨. యజ్ఞచక్రము ....137
3 కర్మ-వికర్మ -అకర్మ ....142
౪. కర్తవ్యము - స్వధర్మము ....146
౫. ధర్మాధర్మములు ....147
౬. స్వధర్మాచరణ మననేమి ? ....149
౭. కర్మయోగము సులభ మగుటెట్లు? ....158
౮. కర్మయోగమువలన మోక్షమెట్లు సిద్ధించును? ....159

## నాలుగవ ప్రకరణము- భక్తియోగము

౧. భక్తి మార్గము ....163
౨. భక్తి యనగా నెట్టిది? ....168
3 భక్తికి అధికారులు ....173
౪. భక్తి మహిమ ....182
౫. జ్ఞానము -భక్తి ....188
౬. భగవంతుడు ....192
౭. శ్రీరామకృష్ణావతారములు ....196
౮. పరాభక్తి (పరభక్తి) ....199
౯. ముఖ్య భక్తి ....201
౧౦. ఏకాంతిక భక్తి ....203

Dr K Dayanandaswamy ebooks




౧౧. గౌణభక్తి (అపరాభక్తి) ....204

౧౨. సకామభక్తునకు ముక్తి కలదా? ....208

౧ . భక్తిభావములు బహువిధములు ....210

౧౪. గోపికల భక్తి ....220

౧౫. శబరి ....227

౧౬. భగవద్వేషులకు ముక్తి కలదా? ....229

౧౭. ప్రతిమారాధనము - ప్రతీకోపాసనము ....231

౧౮. భగవత్కథామృతము ....239

౧౯. భగవన్నామ మహిమ ....241

౨౦. ప్రార్థన ....248

౨౧. శరణాగతి ....251


## ఐదవ ప్రకరణము - ప్రపత్తి


౧. అవతారిక ....257

౨. అర్థపంచకము ....264

3. ఈశ్వరుడు ....266

౪. చేతనులు ....272

౫. జీవేశ్వర సంబంధము ....276

౬. అచేతనము ....277

౭. పరమాకాశము-పరమపురుషుడు ....279

౮. మోక్షము ....282

౯. శ్రీ వైష్ణవులయందు రెండు శాఖలు ....285

౧౦. తిరుమంత్రము ....286

౧౧. ద్వయము ....294

౧౨. చరమశ్లోకము ....299

౧3. చరమశ్లోక తాత్పర్య పరిశీలనము ....303

Dr K Dayanandaswamy ebooks



౧౪. ప్రపత్తికి అధికారులు ....307

౧౫. భక్తి ప్రపత్తులకు గల భేదము ....313

౧౬. దోషభోగ్యము ....316

౧౭. పరభక్తి పరజ్ఞానము పరమభక్తి ....319

౧౮. భక్తుడు-అష్టవిధభక్తి లక్షణములు ....320

౧౯. షడ్విధ శరణాగతి లక్షణములు ....324

౨౦. రెండవ చరమ శ్లోకము ....320

౨౧. మొదటి చరమ శ్లోకము ....321

౨౨. విశేషానుగ్రహము ....330

౨3. ఆచార్యులు- భాగవతులు ....338

౨౪. సింహావలోకనము సామాన్య పరిశీలనము ....341

సంప్రదాయారంభము ....341

ఆళ్వారులలో ముఖ్యులు ....342

ఆళ్వారుల మతము ....345

జీవేశ్వరుల పరతంత్రత ....347

పూర్వాచార్యులు-రామానుజులు ....350

శ్రీ రామానుజులకు తోడ్పడినవారు ....352

శ్రీరామానుజుల తదనంతరము ....354

శ్రీ వైష్ణవ మతమునకు ప్రపత్తియే తగినది ....356

పర్యవసానము ....358

ఆళ్వారులు జన్మాంశ రచనాదులు

ఆచార్య శిష్యపరంపర

౧వ అనుబంధము ....362

౨-వ అనుబంధము ....365

Dr K Dayanandaswamy ebooks

ఓమ్
శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః

# బ్రహ్మజిజ్ఞాస
## (ద్వితీయ భాగము)

## మొదటి ప్రకరణము - జ్ఞానయోగము

శ్లో॥ మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం యువానం
వర్షిష్ఠాంతే వసదృషిగణై రావృతం బ్రహ్మనిష్ఠైః ।
ఆచార్యేంద్రం కరకలిత చిన్ముద్రమానందమూర్తిం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తి మీడే* ॥
(శ్రీ దక్షిణామూర్తి స్తోత్రము)

### (1) ఆరంభము

**జిజ్ఞాసువు :** అనాదియగు సంసార స్వరూపమును, అర్చిరాది ధూమాది మార్గములును, జీవుల పరలోక గమనాగమనములును; క్రమముక్తి, సద్యోముక్తి, సగుణ నిర్గుణ బ్రహ్మస్వరూపములను గుఱించి నాయందనుగ్రహముతో తెలిపితిరి. విదేహముక్తులిట్టివారనియు, జీవన్ముక్తులిట్టివారనియు సంగ్రహముగా తెలిపియుంటిరి. వారిని గుఱించి యింకను వినవలయునని యున్నది. సామాన్య మానవుడు జీవన్ముక్తు డగుటకు ఎట్టి తపస్సును, ఎట్టి సాధనలను, ఎట్టియనుష్ఠానములను చేయవలసియున్నదో, మఱియు ముముక్షువులు సద్గురువుసన్నిధి నేయే విషయములను శ్రవణము

---

* తాను చిన్నవాడై యుండియు బ్రహ్మనిష్ఠులు, వృద్ధులు, శిష్యభూతులునగు ఋషులచేత పరివేష్ఠింపబడినవాడై వారికి మౌనముచేతనే పరబ్రహ్మతత్త్వము నుపదేశించుచున్నవాడును, చిన్ముద్రను ధరించినవాడును, ప్రసన్నమైన ముఖము గలవాడును, గురువులలో శ్రేష్ఠుడునగు దక్షిణామూర్తిని స్తోత్రము చేయుచున్నాను.

Dr K Dayanandaswamy ebooks



చేయవలసియున్నదో- అట్టి సమస్త విషయము లును అనుగ్రహించి తెలుపుడు.

## (2) ముముక్షువు

**వేదాంతి :** మోక్షాపేక్ష కలవాడు ముముక్షు వనబడును. బ్రహ్మము నెఱుంగ వలయునను జిజ్ఞాస (ఇచ్ఛ) కలవాడు బ్రహ్మజిజ్ఞాసు వనబడును. ఇరువురి లక్ష్యము నొక్కటే. జిజ్ఞాసువులలో నుత్తమశ్రేణికి చెందినవారు నచికేతుడు, ఖాండిక్యుడు, సత్యకాముడు మొదలగువారు. నచికేతుడు యముని నాత్మవిద్య నర్థించెను. యముడు *నచికేతునితో నాధ్యాత్మ విద్యకు బదులు అశ్వములను, గోవులను, రథములను, సౌందర్యవతులైన కన్యలను, రాజ్యమును కోరుమని చెప్పెను. కాని నచికేతుడు వాని నన్నిటిని నిరాకరించి ఆత్మవిద్యనే కోరి దానినే పొందెను. ఖాండిక్యుడు రాజ్యమును కోరక కేశిధ్వజుని బ్రహ్మవిద్య నర్థించెను.**

* నచికేతునికథ కఠోపనిషత్తులోనిది. బ్రహ్మజిజ్ఞాస ప్రథమభాగము (39)లో కొంత చెప్పబడినది.

** పూర్వము నిమివంశమునందు ఖాండిక్యుడు, కేశిధ్వజుడు అనునిద్దఱు రాజులుండిరి. ఖాండిక్యుడు సమస్తధర్మములు నెఱిగినవాడు. కేశిధ్వజుడు బ్రహ్మవిద్య నెఱిగినవాడు. వీరేదో కారణమున పరస్పరము యుద్ధము చేసికొనిరి. ఖాండిక్యుడు యుద్ధమున నోడి సకుటుంబముగా నాప్తులైన మిత్రులతోను, సచివులతోను అరణ్యమునకు పోయి యందు నివసించు చుండెను. కేశిధ్వజు డొక యజ్ఞము చేసెను. యజ్ఞము సమాప్తము గాకపూర్వమే పులి యజ్ఞపశువును చంపెను. దీనికి సరియైన ప్రాయశ్చిత్తము చేయని యెడల యజమానికి (కేశిధ్వజునకు) వంశహాని కలుగును. ఇందులకు ప్రాయశ్చిత్త మేమని కేశిధ్వజుడు ధర్మవిదుల నడిగెను. వారు తమకు ఈ ధర్మరహస్యము తెలియదనియు, ఖాండిక్యుడొక్కడే దీనిని చెప్పగలడనియు చెప్పిరి. కేశిధ్వజు డొంటరియై ఖాండిక్యునికడకు పోయెను. ఖాండిక్యుడు కేశిధ్వజునికి ప్రాయశ్చిత్తము తెలిపెను. కేశిధ్వజుడు గురుదక్షిణ కోరుమని చెప్పెను. ఖాండిక్యుని బంధుమిత్రులు గురుదక్షిణగా రాజ్యమును కోరుమని యెంత బలవంత పరచినను నాతడు రాజ్యమును కోరక బ్రహ్మవిద్య నిమ్మని కోరెను. కేశిధ్వజుడు ఖాండిక్యునకు బ్రహ్మవిద్య నొసంగుటయే కాక అతని రాజ్యమును సైతము గైకొనుమని బలవంతపరచెను. ఖాండిక్యు డందులకు నిరాకరించినందున కేశిధ్వజుడు ఖాండిక్యుని కుమారుని కతనితండ్రి రాజ్యము నొసగెను. ఈ కథ విష్ణుపురాణమునందును, ఆముక్తమాల్యదయందును గలదు.

Dr K Dayanandaswamy ebooks



ఇట్టి యుత్తమాధికారులగు ముముక్షువులు బూడిద గప్పిన నిప్పువంటివారు. కొంచెము గాలి సోకినచో చాలును. పైనున్న బూడిద యెగిరిపోయి పరిశుద్ధమైన నిప్పు ప్రకాశించును. ఇట్టివారు శ్రవణమాత్రము చేతనే సిద్ధినొందుదురు.

మధ్యమాధికారి చిరకాలము గురుశుశ్రూషవలనను, శాస్త్రాభ్యాసము వలనను, ఈశ్వరానుగ్రహము వలనను, ఆ జన్మమునగాని మఱుజన్మమున గాని ముక్తుడగును. ఉత్తమాధికారివలె కేవలమోక్షమునే కోరక ఇతర విషయములందును అపేక్ష కలవాడు కనుక తప్పక ఈ జన్మయందే ముక్తుడగునను నమ్మకము లేదు.

మందాధికారి లౌకిక లాంపట్యమున మునిగి యుండినను, అప్పుడప్పు డతనికి మోక్షాపేక్ష గలుగుచుండును. కనుక ఈ జన్మమునందు ముక్తుడు కాలేడు. ఈ జన్మమునం దనేకపుణ్యకర్మల నాచరించి సంచితములగు పాపకర్మల నశింపజేసికొని మఱికొన్ని జన్మములను బొంది ముక్తుడు కావచ్చును.

## (3) ముముక్షువు దినచర్య

మధ్యమ మందాధికారులగు ముముక్షువులు మలినవాసనల నణచినగాని జ్ఞానము గలుగదు. అందుకై యనుదినము నిద్రలేచినది మొదలు మరల నిద్రించువఱకు తాము చేయవలసిన కార్యక్రమము (Programme)ను నిర్ణయించుకొని ఆ విధముగా చేయుచుండుట యుత్తమ పద్ధతి. ఆ కార్యక్రమ మిట్లుండవలెను-నిద్రలేవగనే శ్రీ శంకరాచార్య విరచితమగు "ప్రాతఃస్మరణమ్"* అను శ్లోకములు పఠించి ప్రాతఃకాలోచిత కర్మల నాచరించి కొంతసేపు మహాభారతమునందు చెప్పబడిన మోక్షధర్మములు పఠింపవలెను. తరువాత జ్ఞానవాసిష్ఠము (వాసిష్ఠ రామాయణము)ను చదువవలెను. మధ్యాహ్నము భోజనానంతరము

* "ప్రాతఃస్మరణమ్" అను గ్రంథమున నాలుగు శ్లోకములు గలవు. గ్రంథ విస్తర భీతిచే నిట వ్రాయలేదు.

Dr K Dayanandaswamy ebooks



శ్రీ రామకృష్ణ పరమహంసగారి జీవిత చరిత్రమును చదువవలయును. సాయంకాలమున భాగవతములోని దివ్యకథలను పఠింపవలయును. రాత్రికాలమున సమాధి కుదురుటకు మనస్సు సమస్థితికి తెచ్చుకొనుటకు ప్రయత్నము చేయుచుండవలెను. ఈషణత్రయమునుండి చిత్తమును మరలించి వైరాగ్యమును కలిగించు కథలను వినుటయు, చదువుటయు, ఇతరులకు బోధించుటయు నను నీ కార్యక్రమములందు కాలమును గడుపుటచే వాసనాబీజములు మొలక లెత్తకుండునట్లు చేయవలెను. మనము భూమిలో కొన్ని బీజములను చల్లి వాటికి నీరుచల్లక వాటిపై పెద్దబండ నొకదాని నుంచిన ఆ బీజము లెట్లు మొలక లెత్తుటకు సమర్థములు కావో, అట్లే వాసనాబీజములు మొలకలెత్త కుండునట్లు మనస్సునకు పైన చెప్పిన కార్యభార ముంచవలయును.

ఐహికభోగముల ననుభవించు ఐశ్వర్యవంతులను గుఱించిగాని, సౌందర్యవతులైన స్త్రీలవర్ణనగాని, తనకు అపకారము చేసిన శత్రువును గుఱించిగాని వినగూడదు. ఎప్పుడైనను నైహికవాంఛలయందు మనస్సు కలిగినపుడు శ్రీ శంకరాచార్య విరచిత గుర్వష్టకమును, కౌపీన పంచకమును, శ్రీలక్ష్మీనరసింహస్తోత్రమును పఠించి వాటియొక్క అర్థమును మనస్సున పలుమారు చింతింపవలయును.

## (4) ముముక్షువు పరిత్యజింపదగినవి

ముముక్షువు నరకద్వారమగు కామక్రోధ లోభములను పరిత్యజింప వలయు ననగా సురాపాన, పరాంగనా గమనాది పాపకర్మములకు దూరముగ నుండవలయునని చెప్పనవసరములేదు గదా! అట్లే మఱికొన్నింటినుండి జాగ్రత్తవహించవలసి యున్నది. వాటిలో అభిజాత్యము, విద్యాగర్వము, ధనగర్వము లనునివి పాపకర్మలలో చేరకపోయినను పాపకర్మములను చేయింపగలవు. ఇవి మోక్ష ప్రతిబంధకములు. ఇందు

<u>అభిజాత్యము</u> : గొప్పకులములలో పుట్టినవారు తాము గొప్ప కులములో పుట్టినవారమని తక్కువకులములో పుట్టినవారిని నీచముగ

Dr K Dayanandaswamy ebooks


చూచుట. ఇట్టివారమృతమును పొందలేరు. ఒక సందర్భమున విద్యారణ్యులవా రీక్రింది కథను వ్రాసిరి.

ఒక బ్రాహ్మణుడు అమృతమును గోరి విష్ణుదేవుని గూర్చి తప మొనర్చెను. దేవుడు ప్రత్యక్షమై "వాంఛితార్థమును తెలుపు" మనెను. బ్రాహ్మణుడు "ఇంద్రుని వద్దనున్న అమృతమును నిప్పింపు" మని కోరెను. అంత విష్ణుదేవుడు "ఇంద్రుడు నీ కమృతము నిచ్చును. నీ వతనియొద్దనుండి గైకొను" మని చెప్పి యంతర్హితుడయ్యెను. ఇంద్రుడు చండాలవేషమున వచ్చి బొడ్డుక్రింద వ్రేలాడగట్టుకొని యుండిన అమృత కలశమును జూపి "ఇదే అమృతకలశము గైకొను"మని చెప్పెను. బ్రాహ్మణుడు "చండాలుని వద్దనుండియా నే నమృతమును పొందుట!" యని అమృతము గైకొనుట కిష్టపడక నిరాకరించెను. అంతటితో నింద్రు డదృశ్యుడాయెను. తాను బ్రాహ్మణుడనన్న ఆభిజాత్యమే ఆ బ్రాహ్మణుని కమృతప్రాప్తి కలుగకుండ జేసినది.

<u>విద్యాగర్వము</u> : "విద్య యొసగును వినయ"మని అన్నారు పెద్దలు. వినయమునకు మారుగ గర్వము కలిగినయెడల ప్రతిబంధక మగును. పద్మపురాణమందలి సృష్టిఖండమునం దొకకథ గలదు. ఆ కథ యిది:

బ్రహ్మ చేయు యజ్ఞమునకు విద్వాంసులగు బ్రాహ్మణులు వచ్చి యొకచోట బసచేసిరి. శివుడు వారి విద్యాగర్వము నణచగోరి భిక్షుక వేషమున చేతియందు కపాలమును ధరించి బ్రాహ్మణులున్న చోటునకు పోయెను. బ్రాహ్మణు లాతనిని చూచి, అసహ్యించుకొని "ఇదిగో వీడెవ్వడో చేత పుఱ్ఱెను పట్టుకొని వచ్చియున్నాడు. వీనిని తరిమివేయుడు" అని తిరస్కారముగ చూచిరి. శివుడచ్చటినుండి కదలలేదు. ఆతనిని మెడబట్టి త్రోయవలెనని వారు యత్నించిరి. శివుడు కపాలమును వారున్న చోటున నేలపై నుంచి పాకశాలకడకు పోయెను. ఆ పుఱ్ఱెను అచ్చటనుండి యెత్తివేసి ఆ స్థలమును శుభ్రపరుపవలెనని బ్రాహ్మణులు యత్నించిరి. కాని పుఱ్ఱెను బ్రాహ్మణులంటు టెట్లాయని యాలోచించుచుండ నొక బ్రాహ్మణుడు "నేను పుఱ్ఱెనెత్తి పారవేసెద" నని చెప్పి అచ్చటినుండి

Dr K Dayanandaswamy ebooks



పుఱ్ఱె నెత్తివేసెను. మొదట కపాలమున్న చోటున మఱియొక కపాలముండెను. దానిని కూడ తొలగించగా మఱియొకటి యుండెను. దానిని కూడ తొలగించగా మఱియొకటి యుండెను. ఇట్లెన్ని తీసివేసినను మరల కపాలము లుండుటను చూచి, ఆ వచ్చిన భిక్షుకుడు సాధారణ భిక్షుకుడు కాడని శివుడని తెలిసికొని శివునికడకు పోయి ఆయన పాదములపై బడి క్షమాపణ కోరుకొనిరి.

విద్యాగర్వము గల శ్వేతకేతువను బ్రాహ్మణుడు ప్రవాహణుడను పాంచాలదేశపు రాజువలన గర్వభంగము నొందినట్లు ఛాందోగ్య శ్రుతియందు గలదు.

ధనగర్వము : దీనిని గుఱించి యెక్కువగా చెప్పవలసిన పనిలేదు. అంద రెఱింగినదే.

కులవిద్యాధనములు మూడును గలిగియు గర్వింపనివాడు లోక పూజ్యుడగును. పై మూడింటిలో నే యొకటి యుండినను అట్టి వారికి పరమేశ్వర దర్శనావకాశము కలుగదు. కనుక ముముక్షువులు పై మూడింటిని జాగ్రత్తగ దరిజేరనీయక, బ్రహ్మవేత్తలును భగవద్భక్తులును నగు సత్పురుషులను తక్కువగ భావింపక వారిచెంత చేరి శ్రవణాదులు చేయవలయును. సద్గురువును వెదకి, తెలిసికొని, ఆయనకు శుశ్రూష చేసి, ఆయన యనుగ్రహమును పొంది, వేదాంతశ్రవణము చేయవలెను. శ్రవణాదులకు ముందు సాధనచతుష్టయ మభ్యసింపవలెను.

విశిష్టాద్వైతులు ఈ గర్వత్రయమునే మదత్రయ మందురు.* విద్యాభిజాత్య ధనమదములు మూడును విడువని వానికి తత్త్వోపదేశము చేయరు. ఇందుకొక ఇతిహాసము 'ప్రపన్నామృతము' 22వ అధ్యాయమున గలదు.

శ్రీరామానుజాచార్యులవారు భగవద్గీత 18-66వ శ్లోకమునకు రహస్యార్థమును తెలియగోరి గోష్ఠీపూర్ణుల (తిరుకోట్టి యూరునంబి)

---

శ్లో॥ విద్యామదో ధనమదః తృతీయోఽభిజనోమదః ।
ఏతే మదావలిప్తానాం ఏత ఏవ సతాం దమాః ॥ (ప్ర.ప 22-19)

Dr K Dayanandaswamy ebooks

నాశ్రయించిరి. గోష్ఠీపూర్ణులు రామానుజులవారిని పదునేడు పర్యాయములు తమకడకు త్రిప్పుకొని పదునెనిమిదవసారి వచ్చినప్పుడు చరమశ్లోక తాత్పర్యమును చెప్పి "దీనిని మదత్రయమున్న వారికి చెప్పవలద"ని ఆదేశించిరి. శ్రీ రామానుజుల మేనల్లుడగు దాశరథి యనువారు చరమ శ్లోకార్థము నెఱుగగోరి శ్రీరామానుజుల నాశ్రయించిరి. దాశరథి మదత్రయము గలవాడని తెలిసి రామానుజులు, వారిని గోష్ఠీపూర్ణుల నాశ్రయింపుమని చెప్పిరి. గోష్ఠీపూర్ణుల కడకేగ వారు రామానుజుల వారికడకే పొమ్మనిరి. దాశరథి చేయునదిలేక రామానుజులవారి కడకే వచ్చిరి. అట్టి సమయమున నచ్చట నొకవిశేషము జరిగెను. అది యేమన :

శ్రీ రామానుజులవారి గురువగు మహాపూర్ణుల (పెరియనంబి) కుమార్తెయగు అత్తుళాయమ్మగారు తమ అత్తవారింట అత్తగారు పెట్టు బాధలు పడలేక, యింటిపనులు చేయలేక తండ్రిగారి కా విషయము నివేదించుటకై వచ్చి రామానుజులవారితోకూడ అచ్చటనున్న తండ్రిగారికి (పెరియనంబి గారికి) తన కష్టములు నివేదించెను. పెరియనంబిగారును 'మీ అన్నగారికి (రామానుజుల వారికి) చెప్పుకొమ్మ'ని చెప్పిరి. ఇది యంతయు వినుచున్న రామానుజులవారు తమయెదుట నిలిచియున్న దాశరథిని చూచి "నీవు అత్తుళాయమ్మగారి యింటికేగి దాసునివలె నీళ్ళు తెచ్చుట, వంట చేయుట మొదలగు పనులు చేయుచుండు"మని చెప్పిరి. దాశరథియు వారియాజ్ఞ శిరసావహించి అట్లే చేయుచుండెను.

ఒకనాడొక శ్రీవైష్ణవపండితుడు అత్తుళాయమ్మగారి యింటికి అతిథిగా వచ్చియుండి శాస్త్రవిషయమును ప్రసంగించుచు ఒక శ్లోకమునకు వారుచెప్పిన యర్థము సరియైనది కానందున దాశరథి దానికి సరియైన తాత్పర్యమును వివరించిరి. అది విన్న యచ్చటి వారెల్ల దాశరథి సకలశాస్త్రములు తెలిసిన మహాపండితుడని గ్రహించిరి. ఇంతటి మహాపండితుడు తమ యింట దాస్యముచేయుటకు కారణమేమని ఆ యింటివారు దాశరథిని ప్రశ్నించిరి. దాశరథియు, తాము "రామానుజుల వారి ఆజ్ఞానుసారమట్లు చేయుచుంటి" మని వారికి చెప్పిరి. అంత నచ్చటివారెల్ల రామానుజులవారి కడకేగి "దాశరథిగారి దాస్యము

Dr K Dayanandaswamy ebooks



మాన్పింపు" మని వారిని ప్రార్థించిరి. శ్రీరామానుజులును దాశరథికి గల మూడు మదములు వారిని విడిచినవని తెలిసికొని, దాశరథిని దాస్యవిముక్తులనుగా చేసి, వారికి చరమశ్లోకార్థమును బోధించిరి. విద్యా కుల ధన మదములు గలవారి కెవ్వరికిని బ్రహ్మతత్త్వజ్ఞాన మంటదు. గురువు మదత్రయము లేనివారికే బోధింపవలెను. మదత్రయము లేనివారికే సాధన చతుష్టయము నలవడును.

## (5) సాధన చతుష్టయము

**సాధనచతుష్టయ మనగా** : పరబ్రహ్మప్రాప్తికి సాధనములగు శ్రవణాదులను చేయుటకు తగిన అర్హతను సంపాదించునట్టి సాధనములని యర్థము. వాటి వివరమిట్లు చెప్పబడెను. 1. నిత్యానిత్య వస్తువివేకము. 2. ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము (వైరాగ్యము) 3. శమాదిషట్కసంపత్తి. 4. ముముక్షుత్వము.

1. **నిత్యానిత్య వస్తువివేకము** : నిత్యమనగా నాశరహితముగా త్రికాలములయందుండు నట్టిది. అనిత్యమనగా కొంతకాల ముండిన పిమ్మట నశించునట్టిది. ఈ రెండింటి జ్ఞానమే నిత్యానిత్య వివేకము. కన్నులకు కనబడిన రూపమేదైనను కొంతకాలముండి నశించునట్టిదే. అట్లే తక్కిన యింద్రియములకు వ్యక్తమగు ప్రపంచముకూడ నట్టిదే. నశించునదన్న భావము అనుభవమునకు వచ్చునపుడు నాశనములేని పదార్థమొకటి యుండితీరవలయును. అట్లు లేకుండినచో 'ఇది నశించుచున్న'దను అనుభూతి కలుగనేరదు. నశియింపని పదార్థమొకటి యుండి తీరవలయుననియు, అది ఆత్మయే యనియు తెలిసికొని దానిని పొందవలయునని నిశ్చయించుట.

2. **వైరాగ్యము** : గడ్డిపోచ మొదలు సత్యలోకాధిపత్యమువఱకు గల ఈ సమస్తమును, కాకిమలమువలె భావించి వాటియందు కోర్కె లేకుండుట. నిత్యానిత్య వివేకము గలవానికే వైరాగ్యము సిద్ధించును.

3. **శమాదిషట్కము** : ఇది ఆఱు విధములు. (1) శమము (2) దమము (3) ఉపరతి (4) తితిక్ష (5) శ్రద్ధ (6) సమాధానము.

Dr K Dayanandaswamy ebooks


1. **శమము** : అంతరింద్రియ నిగ్రహము. అంతరింద్రియ మనగా మనస్సు. ఇది యింద్రియములద్వారా విషయముల కొరకై బహిర్ముఖ మగుచుండును. మనస్సును మంచి పనులయందు మాత్రమే ప్రవర్తింపజేయుట. ఇది చాల కష్టతరమైనది. వైరాగ్య మనునది యుండిననేగాని మనస్సు పురుషునకు స్వాధీనము గాదు. దీనిని స్వాధీనపఱచుకొనుటకు పెద్దలనేక విధములగు నుపాయములు చెప్పియున్నారు.

2. **దమము** : ఇది బహిరింద్రియ నిగ్రహము. అనగా జ్ఞానేంద్రియము లయిదును, కర్మేంద్రియము లయిదును నిగ్రహించుట. తాబేలు తన యవయవములను ఇష్టము వచ్చినపుడు తనలో ముడుచుకొనుటకును, బయటికి వదలుటకును నెట్లు సమర్థమై యున్నదో; యట్లే యింద్రియములను స్వాధీన పఱచుకొని యుండవలయును. పైన చెప్పిన శమమునకును, దమమునకును వైరాగ్య మవసరము. శమము కలిగినచో దమము సులభ మగును.

3. **ఉపరతి** : ఇంద్రియములు విషయములపైకి మఱల నెప్పుడైనను యథేచ్ఛగా పోనీయక నిలిపియుంచుట. అనగా విషయములయందు దోషదృష్టిని విచారించి వాటిని తిరస్కరించుట.

సాధన చతుష్టయములో చెప్పిన యీ యుపరతిగాక సాధన చతుష్టయము సాధించిన యనంతరము శ్రవణ మనన నిదిధ్యాసల నభ్యసింపగా; నిదిధ్యాస పరిపక్వము కాగా; సమాధియు, నుపరతియును కలుగును. అచ్చట నుపరతి యనగా శరీరముగాని, జగత్తుగాని తోచకుండుట. ఇచ్చట అనగా - సాధన చతుష్టయమునందే ప్రపంచము తోచక పోయిన శ్రవణాదులతో పనియేమి? కనుక యుపరతి యనగా జగత్తు తోచకపోవుటయను నర్థమిచ్చుట (శమాదిషట్కమునందు) సంగతము కాదు.

4. **తితిక్ష** : "సహనం సర్వదుఃఖానామ్" సర్వ దుఃఖములు సహించుటయే యని శ్రీ శంకరులవారి వచనము. శీతోష్ణములు, సుఖ

Dr K Dayanandaswamy ebooks


దుఃఖములు వచ్చుచు పోవుచుండును. అవి స్థిరములు కావు. వాటిని ఓర్పుతో సహింపవలెను. తితిక్ష యనగా ఓర్పు.

5. శ్రద్ధ : శాస్త్రములయందును గురువాక్యములయందును భక్తిగలిగి యనుష్ఠించుట. అనగా "శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్" అని (గీత 4-39) గురువువలనను శాస్త్రములవలనను తనకు తప్పక ఫలము కలుగునను నమ్మకము; దానికై ప్రయత్నము; అట్టి ప్రయత్నమునందు త్వర, రుచి, వాసన- ఇవి పూర్వజన్మవాసన ననుసరించి యుండును. గీత 17వ అధ్యాయమునం దీవిషయము స్పష్టపరుపబడినది.

6. సమాధానము : ప్రత్యగభిన్న పరబ్రహ్మమునందు సర్వదా బుద్ధిస్థాపనము సమాధానమని కొందఱందురు. కాని యది సరికాదు. బుద్ధిని నేకాగ్రముగా లక్ష్యముతో నిలుపుట సమాధాన మనబడును. మఱి కొందఱు శాస్త్రముల యందు చెప్పిన విషయములు సత్యమైనవని నమ్ముట సమాధానమని యందురు. ఇదియే సరియైనదని నా యభిప్రాయము.*

7. ముముక్షుత్వము : సంసారబంధనివృత్తి యెప్పు డేవిధముగా కలుగునో యనెడి దృఢబుద్ధి. మోక్షమునందు తప్ప అన్యమునందు అపేక్ష లేకుండుట.

## (6) శ్రవణాదులు

ఇట్లు సాధనచతుష్టయ సంపత్తి కలిగిన యధికారి శ్రవణ మనన నిదిధ్యాసలు చేయవలయునని చెప్పిరి.

1. శ్రవణమనగా : మొదట వేదాంతశాస్త్రజన్య జ్ఞానమును సంపాదింపవలయును. స్వయముగా చదివిగాని, గురుముఖమునగాని వేదాంత శ్రవణము చేయవలయును. మహావాక్యములయొక్క అర్థమును చక్కగా తెలిసికొనవలయును.

* కొన్ని వేదాంతగ్రంథములయందు శమాదిషట్కమును. (1) శమము (2) దమము (3) శ్రద్ధ (4) సమాధానము (5) ఉపరతి (6) తితిక్షయని క్రమమును చెప్పుదురు. కాని, నేను అపరోక్షానుభూతియందలి క్రమము ననుసరించితిని.

Dr K Dayanandaswamy ebooks


శ్రవణమాత్రముచేతనే యుత్తమాధికారికి మోక్షము కలుగునని శ్రీ శంకరాచార్యులవారు చెప్పిరి.

"వెనుకటి జన్మమున శ్రద్ధాభక్తులతో పరమేశ్వరుని సంతుష్టుని చేసి ఆయన యనుగ్రహము పొందినవాడు ఈజన్మమున నిత్యానిత్య వస్తువివేకము, తీవ్రవైరాగ్యము మొదలగు సాధనములున్నచో మహావాక్య శ్రవణమునకు ముఖ్యాధికారి యగుచున్నాడు." (స.వే.సి.సం. 786)

**శ్లో॥ అధ్యారోపాపవాద క్రమ మనుసరతా దేశికేనాఽత్ర వేత్రా**
**వాక్యార్థే బోధ్యమానే సతి సపది సత శ్శుద్ధబుద్ధే రముష్య ।**
**నిత్యానందాద్వితీయం నిరుపమమలం యత్పరం తత్త్వ మేకం**
**తద్బ్రహ్మైవాఽహమస్మీత్యుదయతి పరమాఖండతాకారవృత్తిః ॥**

(స.వే.సి.సం. 787)

తా॥ అధ్యారోపాపవాదములచే అపవాదక్రమమును అనుసరించి గురువు మహావాక్యము బోధించుచుండగా తత్కాలమందే నిర్మలచిత్తుడై యున్న అతనికి నిత్యము, అద్వితీయము, నిరుపమము, నిర్మలము, ఏకమునగు ఏపరతత్త్వము గలదో ఆ బ్రహ్మమే నేనగుదును అను నఖండాకారవృత్తి కలుగుచున్నది. శ్రవణమాత్రమున ముక్తినొందిన వారు చాలదుర్లభులని చెప్పవచ్చును. వరుణపుత్రుడగు భృగువు, తండ్రి వలన శ్రవణము చేసిన దానిని తపస్సుచేసి తెలిసికొనెను (తైత్తిరీయ శ్రుతి). ఉద్దాలకుని పుత్రుడగు శ్వేతకేతువు తండ్రివలన శ్రవణముచేసి పిమ్మట మననము చేసి తెలిసికొనెను (ఛాందోగ్యశ్రుతి). శ్రీ రామకృష్ణపరమహంస గారి గురువగు శ్రీ తోతాపురి నలువది సంవత్సరములు కష్టపడుటవలన సాధింపగలిగిన నిర్వికల్పసమాధిని పరమహంసగా రొక్కదినములో సాధింపగలిగిరి.

2. **మననము :** విన్నదానిని పలుమారులు మననము చేయవలయును. వినిన యర్థముయొక్క సాధక బాధకములను చక్కగా విచారించి నిశ్చితాభిప్రాయము కలిగి దానిని పలుమారు మననము చేయవలయునని యర్థము. "నేను శరీరేంద్రియ మనో బుద్ధ్యహంకారములు

 Dr K Dayanandaswamy ebooks

గాను, జననమరణ రహితమగు ఆత్మయే నేను" అను నీ విషయము నిరంతరము మరువరాదు. ఈ వాక్యములు రాత్రింబవలు నీశ్రోత్రము లందును, నీ మనోవీథిని వినిపించుచుండవలెను. ఈ వాక్యముల భావము నీ యంతరంగమున నిండి నీ శరీరమందలి ప్రత్యణువునందును ప్రవేశించవలయునని పెద్దల ఆదేశము. మననమునకు అవధిగా నిదిధ్యాస కలుగునంతవఱకును ఆవర్తింపవలయును.

3. నిదిధ్యాస : శ్రద్ధతో ఏకాగ్రచిత్తముతో మననము చేయుటవలన నిదిధ్యాస సిద్ధించును. నిదిధ్యాస యనగా: సమాధికి నిదిధ్యాస ప్రారంభదశ యగును. అదియే క్రమమున పరిపక్వ దశయందు సమాధి యనబడును. ఇది పొందుటచేతనే తత్త్వజ్ఞానము సిద్ధించును.

**తత్త్వజ్ఞాన** మనగా : అద్వితీయ పరబ్రహ్మ మిట్టిదను నపరోక్షజ్ఞానము కలుగుట. శ్రవణాదు లెంతవఱకు చేయవలయుననగా : బ్రహ్మానుభవ పర్యంతము చేయవలయునని 'బ్రహ్మసూత్రములు ఆవృత్త్యధికరణము' నందు కలదు.

సూ॥ **"ఆవృత్తి రసకృ దుపదేశాత్"** (బ్ర.సూ. 4-1-1)

**"ఆత్మావా ఽ రే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః"**

(బృహదా. 4-2-1 మఱియు 4-5-6)

ఆత్మను సాక్షాత్కరింపవలయును, శ్రవణము చేయవలయును, మననము చేయవలయును, నిదిధ్యాస చేయవలయును- అని మైత్రేయికి యాజ్ఞవల్క్య డుపదేశించెను.

## (7) యజ్ఞ, దాన, తపములు

ఉత్తమాధికారి యగువానికి శ్రవణాదులవలన తత్త్వజ్ఞానము గలుగు చున్నది. అట్లు కలుగనియెడల నిర్గుణబ్రహ్మోపాసనము చేయవలయును. అందుకును సమర్థుడు గానియెడల సగుణబ్రహ్మోపాసనము చేయవలయును. ఉపనిషత్తులయందు చెప్పిన సగుణోపాసనలను చేయుటకు సామర్థ్యము లేనివారు చిత్తశుద్ధికొఱకు యజ్ఞము, దానము, తపము

Dr K Dayanandaswamy ebooks



వీటిని ఫలాపేక్షలేక శ్రద్ధతో నాచరింపవలయును (గీత. 18-5). అట్లు చేయుటవలన పూర్వజన్మకృతమగు పాపములు నశించును. అందువలన చిత్తము శుద్ధమైన సాధనచతుష్టయము అలవడి శ్రవణాదులకు యోగ్యుడగును. శ్రవణాదులవలన తత్త్వజ్ఞానము కలుగుచున్నది. బ్రహ్మజ్ఞానము కలుగుటకు సాధనచతుష్టయము అంతరంగ సాధనమనియు; యజ్ఞ, దాన, తపంబులు బహిరంగసాధనము లనియు చెప్పుదురు.

**యజ్ఞము :** మోక్షలాభమును గోరువారు వేదములయందు చెప్పిన యజ్ఞములు చేయనక్కరలేదు. మోక్షకామున కట్టి యజ్ఞములను శ్రుతి నిషేధించినది.

**మ॥ ప్లవాహ్యేతే అదృఢా యజ్ఞరూపా**
**అష్టా దశోక్త మవరం యేషు కర్మ ।**
**ఏతచ్ఛ్రేయో యేఽభినందంతి మూఢా**
**జరా మృత్యుం తే పునరేవాపి యన్తి ॥** (ముండక 1-2-7)

**తా॥** (యజ్ఞము చేయుటకు) పత్నీ యజమాను లిద్దఱును పదునాఱుగురు ఋత్విక్కులు చేరి పదునెనమండుగురిచే శరీరాయాసము చేతను; ధనవ్యయము చేతను, సాధ్యమైనదియు; స్వల్పఫలము గలుగజేయు నదియు, నికృష్టమగు కర్మయే స్వరూపముగా గలదియు నగు యజ్ఞమును శ్రేయస్సాధనముగా నమ్మిన మూఢులు మాటిమాటికి జరామృత్యురూపమగు సంసారమును తరింపనేరరు.

యజ్ఞ శబ్దమునకు గీతయందనేకార్థములు చెప్పబడియున్నవి. గీత రెండవ యధ్యాయమునందు అనేక విధములగు యజ్ఞములు చెప్పబడినవి. అందు ముఖ్యముగా మనకు కావలసినది బ్రహ్మయజ్ఞమే. ఇది పంచమహా యజ్ఞములలో నొకటి.* పురాణములను, వేదాంత గ్రంథములను చదువుట; యితరులకు వినిపించుట, తాను వినుట, సప్తాహము మొదలగునవి

* పంచమహాయజ్ఞములు : 1. పితృయజ్ఞము, (పితృదేవతలకు శ్రాద్ధతర్పణాదుల చేయుట.) 2. దేవయజ్ఞము. (దేవతలను పూజించుట.) 3. బ్రహ్మయజ్ఞము. (వేదశాస్త్రములను చదువుట.) 4. పశుయజ్ఞము. (పశుపక్ష్యాదులను బలినొసంగుట.) 5. మనుష్యయజ్ఞము. (అతిథిసత్కారము.)

Dr K Dayanandaswamy ebooks



చేయుట- యివి బ్రహ్మయజ్ఞములో చేరును. "**యజ్ఞానాం జపయజ్ఞో ఽస్మి**" అను గీతావచనము ననుసరించి యజ్ఞములలో జపయజ్ఞము నేనే అని భగవానుడు చెప్పి యున్నందున అదియే శ్రేష్ఠమగు యజ్ఞము.

**జపము:** మంత్రమును జపించుట. మంత్రములు అనేకములు గలవు. శ్రీరామతారకము, శివపంచాక్షరి, నారాయణ అష్టాక్షరి, వాసుదేవ ద్వాదశాక్షరి, కలిసంతరణము మొదలగు మంత్రము లుపనిషత్తుల యందున్నవి. వాటియందు దేనినైనను శాస్త్రోక్తప్రకారము జపింపవలయును. "**జపతో నాస్తి పాతకం**" జపమువలన పాతకము నశించును. శ్రవణాదికములకు ప్రతిబంధకము తొలగిపోవును. మనస్సు నిర్మలమగును.

**దానము :** దానము లనేకములు చెప్పబడినవి. అభయదానము, అన్నదానము, భూదానము, వస్త్రదానము, విద్యాదానము, జ్ఞానదానము మొదలగునవి. అన్నిటికన్నను జ్ఞాన దానము గొప్పది. వ్యాసభగవానుడు శుకమహర్షికి పరబ్రహ్మ ప్రాప్తి సాధన ప్రకారంబంతము నుపదేశించి తానుపదేశించిన తత్త్వమును నిర్మలాత్ముడగు తపస్వికి నీ వొసగుమని యాదేశించి

**ఆ||** సకలరత్న పూర్ణ సర్వవసుంధరా
చక్రదానవిధియు సరియనంగ
రాదు విశ్వ వేదరాశి సారాధ్యాత్మ
విద్య యిచ్చుటకు వివేకధుర్య! (ఆం.మ.భా.శాంతి (5-159)

తా|| సకల భూమండలమును దానముగా నిచ్చిన గలుగు సుకృతమున కంటె సమస్త వేదసారమగు ఆధ్యాత్మ జ్ఞానమును బోధించుటవలన కలుగు పుణ్యము గొప్పదని బోధించిరి.

**తపస్సు :** తపస్సు ధనమువంటిది. ధనము శ్రేష్ఠ నికృష్ట కర్మముల రెండింటికి నుపయోగపడునట్లే తపోధనమును మంచి-చెడు కార్యములకు వినియోగపడును. తపస్సు గొప్ప ఆయుధము వంటిదని చెప్పవచ్చును. వేదకాలమునందును, శ్రీమద్రామాయణము రచియింపబడిన కాలమునను, యజ్ఞయాగాది కర్మకాండతోబాటు తపస్సునకు సహితము గొప్ప గౌరవము

Dr K Dayanandaswamy ebooks



ప్రచారములో నుండెడిది. గొప్ప సామ్రాట్టులు సహితము తాపసుల పాదములకు ప్రణమిల్లుచుండిరి. తపస్సువలన మహిమ కలుగును. మహిమలు గలవారిని లోకులు గౌరవింతురు. తపస్సువలన బ్రహ్మలోక ప్రాప్తి కలిగినట్లు కొందఱందురు కాని అట్టి తాపసులకు కేవల తపస్సేగాక యోగాభ్యాసముకూడ నుండియుండును. యోగారూఢులకు బ్రహ్మలోక ప్రాప్తిని శ్రుతి యంగీకరించినది. కాని కేవల తపస్సుచేతనే బ్రహ్మలోక గమనము గలుగుననుట ఆలోచింపదగిన యంశము.

భగవద్గీతయందు తపస్సు-కాయిక వాచిక మానసికములని త్రివిధములుగా చెప్పబడినది.

దేవతలను (తల్లిదండ్రులను), బ్రాహ్మణులను (బ్రహ్మవేత్తలను), గురువులను, ప్రాజ్ఞులను పూజించుట, శుచిగా నుండుట (కిల్బిషము లేకుండుట), బ్రహ్మచర్యము (భార్య యందు మాత్రమే ఋతుకాలముల యందు సంగమము), ఎట్టిప్రాణిని హింసింపకుండుట-అనునివి శరీర ప్రధానమైన తపస్సు. (గీ. 17-14)

ఇతరులకు నొప్పి కలిగింపనిదియు, ప్రియమును హితమును కలిగించు నట్టిదియు, యథార్థ మైనదియు నగు వచనములను బలుకుట, వేదముల (వేదాంతముల) నభ్యసించుట అనునవి వాగ్రూపమైన తపస్సు. (గీ. 17-15)

మనస్సు నిర్మలముగా నుంచుకొనుటయు, సద్వృత్తియు, మితభాషణము, మనోనిగ్రహము, నిష్కాపట్యము లనునివి మనస్సంబంధమైన తపస్సు. (గీ. 17-16)

ఈ మూడువిధములగు తపస్సులును ఉత్కృష్టమైన శ్రద్ధతో ఫలాపేక్ష లేక చేసిన, అట్టితపము సత్త్వగుణ ప్రధాన మగును. ఇది యుత్తమమగు తపస్సు.

Dr K Dayanandaswamy ebooks



ఫలాపేక్షతో గూడిన తపస్సు రాజస తామసగుణ ప్రధానమైనది. ఘోరతపస్సు చేసినవారు ఆతపస్సును వారి స్వార్థమునకో, లోకమును హింసించుటకో ఉపయోగించిరిగాని లోకకళ్యాణమున కుపయోగించినది చాల అరుదు. హిరణ్యకశిప రావణాదులు తపస్సు చేసి లోకములను బాధించిరి.

సౌబరి అను తపస్వి మాంధాత పుత్రికల నూఱ్ఱురను వివాహమాడి వారితో ఇంద్రియ సౌఖ్యముల ననుభవించెను. మాందకర్ణియను ముని సరోవర జలములయందు మందిరము నిర్మించి పంచాప్సరసలతో క్రీడించెను. ఉగ్రతపము పనికిరాదు. ఉగ్రతపఃప్రయత్నమును నిరుత్సాహపరచి; అధ్యాత్మ విద్యను, నిష్కామ కర్మాచరణమును ప్రోత్సహించు తలంపుతో మహాభారతమునందు కౌశికుడను బ్రాహ్మణునకు పతివ్రతతోను, ధర్మవ్యాధునితోను నైన సంవాదమును, జాజలి-తులాధార సంవాదమును మొదలగు కథలు చెప్పబడినవి. కనుక మందాధికారులు చిత్తశుద్ధి కొఱకు స్వల్పతపము చేయుటయే యుక్తము.

ఇచ్చట తపమనగా: ఉపవాసముండుట. ఏకాదశి, శివరాత్రి మొదలగు దినముల యందు నిరాహారులై రాత్రులందు జాగరణము చేయుట మొదలగునవి. (ఉపవాసమనగా: భగవంతుని సమీపము నందుండుట) ఇట్టి యుపవాస దినములందును, జాగరణము చేయు దినములందును జూదము, సినిమాలు, చదరంగము మొదలగు క్రీడలు చేయక భగవన్నామ సంకీర్తనము, జపమును చేయుచుండవలయును.

ఈ విధముగా యజ్ఞ దాన తపంబులయందు కలిగెడు నిష్ఠ 'సత్' అని చెప్పబడును. 'సత్' అనగా బ్రహ్మము. ఫలాపేక్షలేక చేయబడు నీమూటి వలన పాపక్షయమై శ్రవణాదులు చేయునపుడు కలిగెడు ప్రతిబంధకములు తొలగిపోవును. బ్రహ్మజ్ఞానము కలిగిన పిమ్మట కూడ యజ్ఞ దాన తపములు చేయుట తప్పుకాదని చెప్పిరి. జ్ఞాని వీటిని సంపూర్ణముగ వదలినను వదల వచ్చును. చేసినను చేయవచ్చును. జ్ఞానులకు నింద్రియ జయమే తపస్సు. అది జ్ఞానమునకే సాధనము.

Dr K Dayanandaswamy ebooks


## (8) ఉపాసనములు

సగుణ బ్రహ్మోపాసనలను విద్యలని యందురు. ఉపనిషత్తుల యందు ముప్పదిరెండు విద్యలు చెప్పబడినవి. అవి తెలిసికొనగోరువారు ఆయా ఉపనిషత్తులను పరిశీలింపవలయును. సగుణ బ్రహ్మోపాసనలు కర్మలవలెనే బహువిధములుగ జెప్పబడినవి. కాని అన్నింటికి ఫలమొక్కటి కాదు. కొన్ని పాపమును నశింపజేయును; కొన్ని ఐశ్వర్యాదుల నొసగును; మఱికొన్ని క్రమముక్తి నొసగును. *ముముక్షువు క్రమముక్తి నొసంగు నుపాసనలనే చేయవలయును. అవి గురుముఖమున తెలిసికొని చేయవలెను. సగుణ బ్రహ్మోపాసనయే గాక నిర్గుణ బ్రహ్మోపాసనకూడ కలదు.

ఎవరికి బ్రహ్మవిచారము చేయుటకు సామర్థ్యము లేక గురువులును, శాస్త్రములును అనుకూలము లేక, అనగా లభింపక యుండి, మోక్షమును కోరునట్టివారు నిర్గుణోపాసనమును చేయవలయును. (వే.పం. 6-54)

ఒకవేళ నిర్గుణోపాసనమువలన నీ జన్మమున వారికి బ్రహ్మ సాక్షాత్కారము కలుగనిచో, అనగా ఉపాసనము పక్వము గానిచో మరణ సమయమునగాని జన్మాంతరమునగాని, లేదా బ్రహ్మలోకమునకు పోయినచో అచ్చటకాని బ్రహ్మసాక్షాత్కారము లభించును.

(వే.పం. 9-136)

ఈ జన్మమునందే నిర్గుణోపాసన పరిపక్వమైన యెడల అదియే సవికల్ప సమాధి యగును. అనంతరము నిర్వికల్ప సమాధి అనాయాసముగ లభించును. (వే.పం. 9-126)

జి : బోధకును ఉపాసనకును గల భేదమేమి?

వే: బోధ వస్తువుయొక్క అధీనమైనది. వస్తు యాథార్థ్యమును తెలియజేయును. అనగా సాలగ్రామమును చూచి 'ఇది శిల' యని

---

* క్రమముక్తిని గుఱించి ఈ గ్రంథముయొక్క ప్రథమ భాగము 3, 6, 8 అధ్యాయములలో చెప్పబడినది.

Dr.K Dayanandaswamy ebooks

గ్రహించుట బోధ, ఉపాసనము కర్త్రధీనమైనది. తాననుకొన్న విధమున భావించుట. అనగా : సాలగ్రామమును చూచి ఇది 'శ్రీ మహావిష్ణువు' అని భావించుట. (వే. పం. 9-74)

**ఉపాసన మనగా :** అనేకమారులు ఒక్కవిధముగనే భావన చేయుట. (తాననుకొన్న విధమున భావించుట) నిర్గుణ బ్రహ్మమును నిర్గుణమనియు, వాగాద్యగోచరమనియు నుపాసింపవలయును. భావన యెడతెగక (తైలధారవలె అవిచ్ఛిన్నముగా) నుండవలయును. గురూపదేశమును నమ్మి భావించెడి వస్తువును దక్క అన్యమును మధ్యకాలమున జ్ఞాపకము రాకుండున ట్లెడతెగక ప్రవర్తించెడి వృత్తుల ప్రవాహమే యుపాసనము. (వే.పం. 9-77) ఈ విధముగ నిరంతర ధ్యానము చేసిన యెడల కలలో కూడ ఆధ్యానమే అనువర్తించును. ఉపాసింపబడెడు దైవము తానేయని నిశ్చయము గలుగువఱకు నుపాసనముచేసి అట్టి నిశ్చయము మరణ పర్యంతము కలిగియుండవలెను. (వే.పం. 9-78) దీనిని అహంగ్రహోపాసన మందురు.

జి : ఎడతెగక యుపాసనము సాగించవలయునన్న అన్నపానాదులు చేయుట మొదలగు నిత్యనైమిత్తిక కర్మము లడ్డము రావా?

వే : పర పురుషుని యందనురక్తి గల స్త్రీ గృహకృత్యములను జేయుచుండినను పరపురుష సంగమ సౌఖ్యమునే నిరంతరము భావించునట్లు, భోజనాదులు చేయుచుండినను నిరంతరము ధ్యానము చేయుచుండవలెను. ధ్యానైకనిష్ఠుడు లోకవ్యవహారమును స్వల్పముగ జేయును.

అవిశ్వాస ముండిన పరోక్షజ్ఞానము చెడిపోవును. ఎట్లనగా: చతుర్భుజుడగు విష్ణుమూర్తి వైకుంఠమున కలడని గురువుపదేశించిన మాటను నమ్మవలయును. గురూపదేశమువలన విష్ణుమూర్తి కలడను జ్ఞానమే పరోక్షజ్ఞాన మనబడును. అట్లే నిర్గుణ బ్రహ్మోపాసకుడును, నిర్గుణ బ్రహ్మమును గుఱించిన నమ్మకమును గలిగియుండవలయును. ఉపాసకులు గురువు మాటను నమ్మిన చాలును. వారికి శాస్త్రములతో కాని విమర్శలతోకాని అవసరము లేదు.

Dr K Dayanandaswamy ebooks

## (9) భ్రమ రెండు విధములు

**జి :** ఉపాసనాదులన్నియు భ్రాంతిజనకములే కదా? భ్రమవలన బ్రహ్మజ్ఞాన మెట్లు కలుగును?

**వే :** భ్రమ (1) సంవాదిభ్రమ యని (2) విసంవాదిభ్రమ యని రెండు విధములు.

1. **విసంవాది భ్రమ :** తలుపులు మూయబడిన నొక యింటినుండి యింటిలోని దీపపుకాంతి ఆ యింటి తలుపునందున్న సన్నని రంధ్రము ద్వారా బయటికి ప్రసరించుచుండగా నొకానొకడు దానిని చూచి ఆ రంధ్రమునందున్న కాంతిని రత్నమని భ్రమపడి వచ్చి చూచెను. అది రత్నము కాదని లోపలనున్న దీపపుకాంతియని తెలిసికొని వెడలిపోయెను.

2. **సంవాదిభ్రమ :** అట్లే తలుపులు మూయబడిన యింకొక యింటియందు లోపల మణి యుండెను. ఆ రత్నపు కాంతి మూయబడిన తలుపునందున్న సన్నటి రంధ్రములో నుండి బయటపడెను. దానిని చూచి యాతడు ఆ రంధ్రమున్న స్థానమున రత్నమున్నదని భ్రమపడి వచ్చి చూచి యది రత్నము కాదని, యింటిలో రత్నమున్నదని దానికాంతి రంధ్రమునుండి ప్రసరించుటచే రంధ్రముననే రత్నమున్నట్లు కనబడెనని తెలిసికొని తలుపుతెఱచి లోపలనున్న రత్నమును తీసికొనిపోయెను. సంవాదిభ్రమ లాభమును గలుగజేయునది.

మొదటివాని భ్రమవలన వానికి లాభమేమియును కలుగలేదు. ప్రయాసమాత్రమే కలిగినది. అట్టి భ్రమ విసంవాది భ్రమయనియు, రెండవవాడు రత్నలాభమును పొందుటకు కారణమైన భ్రమ సంవాది భ్రమయనియు చెప్పబడినది. (వే.సం. 9-1 నుండి 6 వఱకు)

సంవాది భ్రమకు మఱియొక దృష్టాంతము చెప్పబడినది. ఒకడు నీటి యావిరిని చూచి అది పొగయని, అచ్చట యగ్ని కలదని తలచి అగ్నికొఱ కచ్చటికి పోయిన, దైవికముగా నచ్చట నిప్పు దొఱకెనేని వానికి కలిగిన ధూమజ్ఞానము భ్రమయైనను లాభకరమే యైనదిగదా?

అట్లే ఉపాసనమువలన బ్రహ్మసాక్షాత్కారము కలుగును.

 Dr K Dayanandaswamy ebooks

## (10) ప్రతిబంధములు

వేదములు వేదాంతములు తెలిసినను ప్రతిబంధములు క్షయింపక బ్రహ్మజ్ఞానము కలుగనేరదు. శ్రీ సురేశ్వరాచార్యులవారును, శ్రీ విద్యారణ్యులవారును మూడు ప్రతిబంధములు చెప్పిరి. (1) భావి ప్రతిబంధము (2) భూతప్రతిబంధము (3) వర్తమాన ప్రతిబంధము.

1. **భావిప్రతిబంధమునే ఆగామి ప్రతిబంధ మందురు. అనగా :** ముందు జన్మయందు అనుభవింపవలసిన ప్రారబ్ధము. ఇందుకు దృష్టాంతము - జింకయందు గల స్నేహము భావిప్రతిబంధకమై భరతునకు హరిణ జన్మము కలిగించినది.

2. **భూత ప్రతిబంధమనగా :** ఇదివఱకు గడిచిన విషయము ధ్యానకాలమందు స్మరణకు వచ్చుట. ఇందుకొక దృష్టాంతము చెప్పబడినది. ఒక గృహస్థుడు ఒక బఱ్ఱెనుంచుకొని దాని నత్యంత ప్రేమతో చూచుచుండెను. కొంతకాలమైన తర్వాత అతడు సన్న్యసించి గురూపదిష్ట ప్రకారము ధ్యానమునందు కూర్చుండగా అతనికి అభ్యాసవశమున నా బఱ్ఱెయే జ్ఞాపకమునకు వచ్చుచుండెను. ఆ విషయము గురువున కెఱిగింపగా గురువది విని, అదియే బ్రహ్మమని చెప్పెను. గురువు మాటను నమ్మి అతడట్లే ధ్యానింప ప్రతిబంధము క్షయింపగనే కృతార్థు డాయెనని లోకమున గల వాడుకను విద్యారణ్యులవారు చెప్పిరి. (వే.పం. 9-41, 42)

3. **వర్తమాన ప్రతిబంధమనగా :** విషయముల యందాసక్తి, మందబుద్ధి, కుతర్కము, దురాగ్రహము, కర్తృత్వాది ధర్మములు కలవాడననెడి అభినివేశము, వర్తమాన ప్రతిబంధ మనబడును. ఇది శ్రవణాదులచేతను శమదమాదులచేతను నివర్తించును.

జి : మీరు బఱ్ఱెను సాకెడి గృహస్థుని విషయమై ప్రస్తావించితిరి. నీచమైన బఱ్ఱెను బ్రహ్మమని భావించుట తగునా?

Dr K Dayanandaswamy ebooks


వే : సాలగ్రామ మొకశిల. దానియందు విష్ణుభావన నుంచుచున్నారు. నికృష్టవస్తువునందు ఉపాస్యమగు నుత్కృష్ట వస్తువును భావించి యద్దానిని నితరవస్తుచింతనచే (ఇతర వృత్తులచే) నంతరితము గాకుండ నిరోధించుటయే యుపాసన. ఉపాసన కాలంబనమగు నికృష్టవస్తువును ప్రతీకమందురు. బట్టి దృష్టాంతమునందు అది ప్రతిబంధమని చెప్పబడెను. కాని బట్టనే బ్రహ్మమునకు ప్రతీకముగా తీసికొనలేదు. ప్రతిబంధము పాపమువలన కలుగును. పాపము నశింపగనే ప్రతిబంధము తొలగిపోవును. ప్రతిబంధము తొలగినంతనే మార్గము సాగిపోవును. దీనికొక దృష్టాంతమును చెప్పిరి.

ఒక గృహస్థుడు దారిద్ర్యముతో బాధపడుచు నొక యింటిలో కాపురముండెను. వాడు కాపురమున్న యింటియందే వాడు ప్రతిదినము నడచుచు శయనించుచున్న చోటనే భూమిలో ఒక నిధి యుండెను. నిధియున్న సంగతి యాత డెఱుగడు. ఒకప్పుడేదో కారణమున నిధియొక్క పై భాగమున నున్న మట్టిని త్రవ్వవలసి వచ్చెను. అట్లు చేయగా నా నిధి యాతనికి లభించెను. అతనికి నిధి లభించుటకు ప్రతిబంధమగు మట్టి తొలగిపోయినంతనే దారిద్ర్యము తొలగిపోయెను. ప్రతిబంధము తొలగినంతనే యుపాసన సిద్ధించును; స్థిరపడును. ఉపాసన లన్నింటిలోను శ్రేష్ఠమైనది ప్రణవోపాసన.

## (11) ప్రణవోపాసన

ఓమ్ అను ప్రణవమునకును ప్రపంచమునకును నభేదము. అట్లే పరబ్రహ్మమునకును ఓంకారమునకును భేదము లేదు. ఓంకారము సగుణ నిర్గుణ బ్రహ్మములకు చిహ్నమై యున్నది.

కా॥ "ప్రణవో ఽ హ్యాపరం బ్రహ్మ ప్రణవశ్చ పరః స్మృతః ।
**అపూర్వో ఽ నన్తరో ఽ బాహ్యో ఽ నపరః ప్రణవో ఽ వ్యయః"॥**
(గౌ.కా. 26)

తా॥ ప్రణవమే పరాపరబ్రహ్మ స్వరూపమని చెప్పబడుచున్నది. అనగా: సగుణ నిర్గుణ బ్రహ్మములు రెండును అని యర్థము. ప్రణవమే

Dr K Dayanandaswamy ebooks



అపూర్వము (కారణము లేనిదనుట), ప్రణవమే అనంతరము (భిన్నజాతీయ మగునది మఱియొకటి లేనిదనుట) అనపరము, (మఱియొక కార్యము దీనికి లేనిదనుట) అవ్యయము అని చెప్పబడినది. అనగా: ఉప్పుకల్లునకు లోపల వెలుపల ఉప్పునిరసము తప్ప తదితర మేమియును లేకుండునట్లే ఆత్మస్వరూపమగు ప్రణవమునకు బాహ్యాభ్యంతరములు లేవు. అజమని అభిప్రాయము. మందమధ్యమాధికారులకు పరాపర బ్రహ్మాత్మకముగ ప్రణవము ధ్యేయమగుచున్నది. ఉత్తమాధికారులకు సర్వవిశేష శూన్యముగ, ఏకరసముగ ప్రణవము జ్ఞానగమ్య మగుచున్నది.

ఓంకారము బ్రహ్మమునకు వాచకము. బ్రహ్మము వాచ్యము. వాచ్య వాచకములకు భేదము లేదు. ప్రతీకముల కన్నింటికంటెను ఓంకారము శ్రేష్ఠమైన ప్రతీకము (ఆలంబనము). ఓంకారముయొక్క మహిమను అనేక శ్రుతులు కొనియాడినవి. ముఖ్యముగ మాండూక్యశ్రుతి ఓంకారమునకును బ్రహ్మమునకును అభేదము చెప్పినది. ఈ విషయము సమగ్రముగ తెలిసికొనవలెనన్న మాండూక్యశ్రుతికి గౌడపాదకారికలు, వాటికి విపులమైన వ్యాఖ్యానము చదివినచో తెలియగలదు.

కా॥ "యుంజీత ప్రణవే చేతః ప్రణవం బ్రహ్మ నిర్భయమ్ ।
ప్రణవే నిత్యయుక్తస్య న భయం విద్యతే క్వచిత్"॥ (గౌ.కా. 25)

తా॥ ప్రణవనాదములో నీ మనస్సును చేర్పవలయును. నిర్భయమైన బ్రహ్మమే ఆ ప్రణవము. ప్రణవమునందు ఎల్లప్పుడును ఐక్యమై యుండువానికి నెచ్చటను భయముండదు.

అరణియందు మొదట అగ్ని కనబడకపోయినను మథించిన పిమ్మట ఏవిధముగ అగ్ని కనబడుచున్నదో, ఆ విధముగ ఓంకారోపాసనచేత ఆత్మ గ్రహింపబడుచున్నదని శ్వేతాశ్వతరశ్రుతి చెప్పుచున్నది.

మం॥ "స్వదేహ మరణిం కృత్వా ప్రణవం చోత్త రారణిమ్ ।
ధ్యాననిర్మథనాభ్యాసాత్ దేవం పశ్యేత్ నిగూఢవత్" ॥(శ్వేత.1-114)

తన శరీరము అధరారణి (క్రిందికఱ్ఱ)గ చేసి, ప్రణవమును ఉత్తరారణి

Dr K Dayanandaswamy ebooks

(పైకట్టె)గ జేసి, చిత్తైకాగ్రమనెడి మథనము నభ్యసించిన యెడల అరణియందు గూఢముగ నుండు అగ్నిని చూడ గలుగునట్లు, జ్యోతి స్స్వరూపమగు ఆత్మను చూడగల్గుచున్నాడు. ఈయర్థమును తెల్పు మంత్రమే కైవల్య బ్రహ్మోపనిషత్తులయందును గలదు. ప్రణవము నీ విధముగ జపింపవలయును. ఓం అనగా నేమో దానియర్థమును చక్కగా తెలిసికొని యుండవలయును. *ఓమ్ అని ఉచ్చరింపవలయును. అట్లుచ్చరించినపుడు, అకారమాత్ర ఉకారమాత్ర యందును, ఉకారమాత్ర మకారమాత్రయందును, మకారమాత్ర అర్ధమాత్రయందును లయమగునట్లు భావించుకొనవలయును. ఇట్లే విశ్వవిరాట్టులను క్రమముగ తైజససూత్రాత్మలయందును, వారిని ప్రాజ్ఞ అంతర్యాముల యందును, వారిరువురను తురీయమను ఆత్మయందును లయించినట్లు చింతింపవలయును. అప్పుడు అమాత్రయగు బ్రహ్మము మాత్రమే మిగిలియుండును. ఒక్కసారి ప్రణవము నుచ్చరించుటకును మరల నుచ్చరించుటకును ఈ మధ్య కాలములో నున్న నిశ్శబ్దతను గుర్తించుచు రావలయును. ఈ ప్రణవమును సగుణముగ నుపాసించిన వారు అర్చిరాది మార్గమున బ్రహ్మలోకమునకు జని క్రమముక్తులగుదురు. నిర్గుణోపాసకులకు బ్రహ్మలోక గమనవాంఛ యుండెనేని వారిచట ముక్తులు కారు. బ్రహ్మలోకమునకే పోవుదురు.

శ్లో॥ "ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహర న్మామనుస్మరన్ ।
యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్"॥
(గీ. 8-14)

తా॥ ఓంకారమును స్మరించుచు ఎవడు దేహమును వదలుచున్నాడో అట్టివాడు పరమోత్కృష్టమైన మోక్షపదము (బ్రహ్మము)ను పొందుచున్నాడు.

శైబ్యుడైన సత్యకాము డడిగిన ప్రశ్నకు పిప్పలాదు డీవిధముగ సమాధాన మిచ్చెను. **'తస్మై స హోవాచ, ఏతద్వై సత్యకామ పరం చాపరం**

---

* ఈ గ్రంథముయొక్క ప్రథమభాగము రెండవ ప్రకరణమున (9) ఆత్మయొక్క పాదచతుష్టయము జీవేశ్వరుల త్రివిధావస్థలు అను రేఖాచిత్రమును 2-46 "బ్రహ్మ ప్రణవ పథకము - జ్ఞానభూమికలు" వాటిని గుఱించిన వివరములను చక్కగ జ్ఞప్తియందుంచుకొనవలయును.

Dr K Dayanandaswamy ebooks


**చ బ్రహ్మ యదోంకార స్తస్మాద్విద్వానేతే నైవాయతనే నైకతరమన్వేతి'** (ప్రశ్న. 5-2)

ఓ సత్యకాముడా! సత్యమగు నక్షరమను పేరుగల బ్రహ్మము ఏది కలదో అదియును, అపరబ్రహ్మ మనునది (కార్య బ్రహ్మము) యేది కలదో అదియును, ఓంకారమే. ఆ కారణమువలన పండితుడు ఓంకారోపాసన చేతనే ఆ రెండింటిలో దేనినైనను పొందుచున్నాడు. మఱియు **"యః పునరే తంత్రిమాత్రేణైవోమిత్యే తేనైవాక్షరేణ, పరం పురుష మభిధ్యాయీత..."** (ప్రశ్న. 5-5)

"ఎవడు మూడు మాత్రలు గలదియైన ఓంకారమును సూర్యాంత ర్గతుండైన పురుషుని ఉపాసించునో" అని చెప్పుచు అట్టివాడు సూర్య మండలమును భేదించి బ్రహ్మలోకమునకు పోవునవి..... **"స ఏ తస్మాజ్జీవఘనాత్పరాత్పరం, పురిశయం పురుషమీక్షతే....."** (ప్రశ్న.5-5)

హిరణ్యగర్భునికంటెను పరుడును, ఎల్ల శరీరములయందును ప్రవేశించిన వాడునునగు బ్రహ్మమును చూచుచున్నాడు అని చెప్పెను. ఈ విషయము బ్రహ్మసూత్రములు 1వ అధ్యాయము 3వ పాదమున ఈ క్షతి కర్మాధికరణమున చర్చింపబడినది. తైత్తిరీయోపనిషత్తు శిక్షావల్లి చతుర్థానువాకమున మంద మధ్య మాధికారులు (శ్రీ మేధాకాములు) ప్రణవోపాసన చేయవలసిన విధానమును, అష్టమానువాకమున ఉత్తమాధికారి నుద్దేశించి శుద్ధ బ్రహ్మోపాసనమును చెప్పబడినది. కనుక ఆ విషయమును తెలియగోరువారు ఆయా యుపనిషత్తులను చూడవలయును.

## (12) సత్త్వగుణ పోషణ

జిజ్ఞాసువు ముఖ్యముగ గమనింపవలసిన విషయమేమన - త్రిగుణాత్మక ప్రకృతిని జయింపవలయును. త్రిగుణములనగా: సత్త్వము, రజస్సు, తమస్సు. వీటి గుణము లిట్లుండును :

Dr K Dayanandaswamy ebooks



సత్త్వగుణము స్ఫటికమువలె స్వచ్ఛమై నిర్మలముగ ప్రకాశించునది. ఉపద్రవము లేనిది. సుఖమును జ్ఞానమును కలిగించునది. భూతములయెడ కరుణ, మైత్రి కలుగజేయునది. త్యాగమును కలిగించునది. త్యాగము మోక్షమునకు మార్గదర్శియగును.

**కం॥ త్యాగ మొక నెలవు, శమ సం**
**యోగం బుత్తరము, దాని కూర్ధ్వము సంతో**
**షాగమము, మోక్షలాభో**
**ద్యోగికి నివి గమ్యభూము లుత్తమధిషణా!**(ఆం.మ.భా.శాం.5-349)

మోక్షమే గమ్యస్థానముగా పయనించు ముముక్షువను బాటసారి తొలుత త్యాగమను నెలవునుండి ప్రయాణము సాగించి అచ్చటికి నుత్తరముగా (పైన) నుండు శమసంయోగ (మనోనిగ్రహ)మును చేరవలయును. అచ్చటి నుండి పైకి పోయిన సంతోషమను (ఆనందము) స్థలమును చేరును. ఆ పైకిపోయిన మోక్షమను గమ్యస్థానమును జేరును. మోక్షలాభము గోరువారు త్యాగమునుండి బయలుదేరి మనోనిగ్రహ సంతోషము లనునవి రెండును దాటవలసినవి- అని కపిలుడు సూర్యరశ్మియను ముని కుపదేశించెను. కనుక సత్త్వగుణమును పోషించుట ముముక్షువున కత్యవసరము. వైరాగ్యము, త్యాగము శాంతికి కారణములు.

రజోగుణమువలన లోభము వృద్ధినొందును. లోభము సర్వానర్థకారి. అరిషడ్వర్గములలోకెల్ల నిది చాల చెడ్డది. ఏలయన లోభమే తక్కిన కామక్రోధాదులను కలిగించుచున్నది.

తమోగుణమువలన నిద్ర, మోహము, జాడ్యము, విపరీత జ్ఞానము మొదలగునవి కలుగును. రజస్తమో గుణములు మోక్షమున కెట్లు ప్రతిబంధకములో గీత 14వ అధ్యాయము చదివిన తెలియును.

ప్రకృతిజయమునకు ప్రకృతి సహాయ మవసరము. ఇందుకుపాయము రజస్తమోగుణములను అణగద్రొక్కి సత్త్వగుణమును వృద్ధిలోనికి తేవలయును. శ్రీరామచంద్రుడు సత్త్వగుణగరిష్ఠుడగు విభీషణున

Dr K Dayanandaswamy ebooks



కభయమిచ్చి రజస్తమో గుణోపేతులగు రావణకుంభకర్ణుల సంహరించి నట్లు సత్త్వగుణ సహాయమున రజస్తమోగుణముల నణగ ద్రొక్కవలయును. ప్రకృతియనగా: సత్త్వరజస్తమోగుణములే కదా? సృష్టికి పూర్వము సత్త్వరజస్తమోగుణములే మూడును సమాన స్థితిలో నుండెను. ఆ సామ్యావస్థ చెడుటతోడనే సృష్టి ప్రారంభమై విశ్వనిర్మాణము జరిగెనని యిదివఱకే మనము తెలిసికొనియున్నాము. ఏ ప్రకృతివలన విశ్వము కలిగెనో, ఆ ప్రకృతియొక్క సత్త్వరజస్తమోగుణములే విశ్వమునందలి ప్రతిపదార్థమునందును కలవు.

వివిధ నామరూపములు కల సకల పదార్థములును పై మూడు గుణములలో నేదేని యొక గుణము అధికముగను, తక్కినవి యల్పముగను కలిగియుండును. మనము భుజించు నాహారము సత్త్వగుణ మధికముగ నుండునట్టిదిగ నుండవలయును. ఆహార పానీయములేగాక మనము లోపలికి తీసికొను సమస్తమును, మనకొక విధముగ ఆహారమే యగుచున్నది. అనగా: అన్నము నీరే కాక నేత్రములతో చూచు రూపమును, శ్రోత్రముచే విను శబ్దమును, ఈ విధముగ పంచేంద్రియములచేత మనము గ్రహించునట్టి విషయములు సత్త్వగుణమును పోషించునట్టివిగ నుండవలయును. కనుక మనము నివసించు పరిసరములను, మనము కలసికొనుచుండు వ్యక్తులను, జాగ్రత్తగ పరిశీలించి రజస్తమోగుణములను వృద్ధినొందింపక, సత్త్వగుణమును పోషించునట్టివిగ నుండునట్టి వాటితో సంబంధ ముంచుకొనవలయును.

మనము ఏ రంగుగల అద్దమునుండి చూచిన, పదార్థములు దాని వర్ణముతో కనబడును. సత్త్వగుణము స్వచ్ఛమైన దగుటచే యథార్థ జ్ఞానము కలుగును. ఇతర గుణములవలన విపరీతజ్ఞానము కలుగను. సత్త్వగుణము రజస్తమో గుణముల నణగద్రొక్కి వృద్ధిలోనికి వచ్చినదనగా అట్టివ్యక్తికి పూర్వము (రజోగుణ మధికముగా నున్న కాలము) నందున్న యభిరుచుల యందసహ్యము కలుగును. ప్రవృత్తి తగ్గి యేకాంతవాసమును గోరును. అతనికి కలిగెడు స్వప్నములయందును భేదముండును. "సత్త్వాత్సంజాయతే జ్ఞానం" యన్న గీతావాక్యము ననుసరించి సత్త్వగుణమువలన జ్ఞానము కలుగుచున్నది. జ్ఞానమువలన ముక్తి.

Dr K Dayanandaswamy ebooks



## (13) సన్న్యాసము

జి : సన్న్యాసు లెట్టివారు? సన్న్యాసులు కాని యెడల ముక్తి లభించదా? గృహస్థ, సన్న్యాసాశ్రమములందేది శ్రేష్ఠమైనది?

వే : ఏ యాశ్రమమునందుండి యైనను ముక్తుడు కావచ్చును. గృహస్థ-సన్న్యాసాశ్రమములు రెండును మాన్యములేనని కొన్ని చోట్లను, గృహస్థాశ్రమము శ్రేష్ఠమని కొన్నిచోట్లను శాస్త్రములయందు చెప్పిరి. మనువు గృహస్థుడే శ్రేష్ఠుడని చెప్పెను (మను. 6-89). పూర్వము విప్రులకు మాత్రమే సన్న్యాసార్హత కలదని శాస్త్రములు చెప్పుచున్నవి. ఇట్లు చెప్పుటకు కారణమేమన విప్రులు ఐహిక సుఖములను వదలి పరమపదమగు శాశ్వత సుఖమును లక్ష్యమునందుంచుకొని ప్రవర్తించెడివారు. ఒక సమయమున కృష్ణద్వైపాయన మునీంద్రుడు శుకయోగీంద్రు నిట్లు ప్రబోధించెను.

కం॥ విను విప్రశరీరము సుఖ
మునకే బహు నియమ దుఃఖముల నిహమున జెం
దను నిత్యసౌఖ్యముం బర
మున బొందను బుట్టెగాక బోధప్రవణా! (ఆం.మ.భా.శాం. 6-231)

విప్రులు ఐహికసుఖముల ననుభవించుటకై జన్మించిన వారు కారు. వారు ఇహమున కర్మానుష్ఠానము తపము మొదలగు వానివలన దుఃఖమును సహించి, పరమున నిత్యసుఖము నొందుటకే జన్మించిరని భావము. ప్రాప్తించిన దానితో సంతోషపడుట, శీతోష్ణాది ద్వంద్వముల యెడ సహిష్ణుత అను నీబ్రాహ్మణధర్మములు వానప్రస్థ సన్న్యాసాశ్రమ ధర్మములకు దగ్గనివి గనుక బ్రాహ్మణులు వానప్రస్థులై పిమ్మట సన్న్యసించినచో సన్న్యాసాశ్రమమును చక్కగా నిర్వర్తించుటకు సమర్థులని పూర్వుల అభిప్రాయము. ఏ వర్ణమువారైనను పూర్వజన్మ సంస్కారముచేత వైరాగ్యము కలిగియుండిరేని వారును సన్న్యాసార్హులే. సిద్ధార్థునివంటి మహాత్ముడు సమస్త రాజభోగము లనుభవించుచుండినను ఆకస్మికముగ తీవ్ర వైరాగ్యసంపన్నుడై బుద్ధుడై లోకవంద్యు డయ్యెనని మనమెఱుగుదుము

Dr K Dayanandaswamy ebooks



గదా! మనుస్మృతి ఆఱవ ప్రకరణమునందు 33వ శ్లోకమువఱకును వానప్రస్థుని ధర్మములను చెప్పి, పిమ్మట నా ప్రకరణమంతయు సన్న్యాసమును గుఱించి చెప్పినది. అందు యతిధర్మము లిట్లు చెప్పబడెను:

సన్న్యాసము స్వీకరించుటకు ముందు ఋణముల మూడింటిని తీర్చవలయును. అట్లు చేయక కర్మసన్న్యాసము చేయునాతడు నరకమున బడును. (మను. 6-35) ఋణములు మూడనగా: (1) ఋషి (2) పితృ (3) దేవ ఋణములు.

(1) బ్రహ్మచర్యాశ్రమమున ఋషిఋణమును, (2) వంశమును నిలుపుటకు సంతతిని పొందుటవలన పితృఋణమును, (3) యజ్ఞము చేయుటవలన దేవఋణమును, తీర్చిన యనంతరమే సన్న్యాసమును స్వీకరించుటకు అర్హత కలుగునని చెప్పిరి. అదియును ఆయువుయొక్క కడపటి నాలుగవ భాగమునందు అనగా: 100 సంవత్సరములు ఆయుః ప్రమాణముగా భావించి దానిని నాలుగుభాగములుగా చేసి మొదటి నాలుగవ భాగమున బ్రహ్మచర్యమును, తర్వాతభాగమున గృహస్థాశ్రమమును, మూడవభాగమున వానప్రస్థాశ్రమమును, నాలుగవభాగమున సన్న్యాసమును స్వీకరించవలెను.

(మను. 6-33, 36, 37)

యతి సర్వమును పరిత్యజించినవాడై భిక్షకై మంటిమూకుడు, గోచికై చింకిపేలిక మాత్రమే యుంచుకొని తరుమూలములందు నివసించుచు అన్నిటియందును బ్రహ్మభావనచే సమబుద్ధి గలవాడై యుండవలెను (శ్లో 44). వ్యాధులు కలిగినను లెక్కచేయక మందులు తీసికొనక వనమునందే కాలము గడుపుచు భిక్షకుమాత్రము గ్రామమునకు రావలెను (43). యతి, జన్మమునుగాని మరణమునుగాని కోరరాదు. కూలివాడు కూలిడబ్బునకై యెదురుచూచునట్లు యతి మరణ కాలమునకై నిరీక్షింపవలెను (45). భిక్ష అధికముగా లభించినను అధికముగా భుజింపరాదు (55). వంటయైన తరువాత గృహస్థులందరును భుజించిన పిమ్మటనే భిక్షకు వెడలవలయును. ప్రాణ సంరక్షణకు వలసినంతమాత్రమే భుజింపవలెను. భోజనమునందలి రుచిని వివేచింపరాదు (57).

Dr K Dayanandaswamy ebooks


**శ్లో॥ అభిపూజిత లాభాంస్తు జుగుప్సేతైవ సర్వశః ।**
**అభిపూజిత లాభైశ్చ యతిర్ముక్తో౽పి బధ్యతే ॥** (మను. 6-58)

తా॥ భిక్షయిచ్చెడి గృహస్థు తన్ను గౌరవించి భిక్షయిచ్చిన యెడల అది యెప్పుడును యతి గైకొనరాదు. అట్లు గైకొనిన యెడల వారియందలి వాత్సల్యమువలన ముక్తిమార్గము పొందదగిన వాడైనప్పటికి యతి మరల సంసారమునందు బంధింపబడుచున్నాడు.

భగవాన్ బుద్ధ, శ్రీశంకర, శ్రీరామానుజులు - వారే స్వయముగా గృహస్థుల యిండ్లకడకు పోయి యింటిముందు నిలిచి భిక్ష గైకొనెడివారని చరిత్రయందు చదివి యున్నాము. ఎవరియింటికి భిక్షకు పోయిన బాగుండునాయని సన్న్యాసి యోచించకూడదు. అట్లు ప్రయత్నించరాదు. ప్రారబ్ధముచేత ప్రాప్తించిన భిక్షాన్నమే గైకొనవలెనని శాస్త్రము చెప్పినది.

సన్న్యాసోపనిషత్తు ఇట్లు చెప్పినది :

**"పంచసప్త గృహాణేస్తు భిక్షామిచ్ఛే త్క్రియావతామ్!**
**గోదోహమాత్ర మాకాంక్షే న్నిష్క్రాన్తో న పునర్వ్రజేత్!!"**

ఐదు గాని ఏడుగాని ఇండ్లను భిక్షకై అర్థించవచ్చును. ఆవును పితుకుటకు నెంతకాలము పట్టునో అంతకాలము మాత్రము గృహస్థుల యిండ్లముందు నిలువవలెను. అంతకంటె ఎక్కువకాలము నిరీక్షింపరాదు. ఏడిండ్లలో భిక్ష లభింపని యెడల అనాడుపవాస ముండవలసినదే -**"చరేన్మాధుకరం భైక్షం యతిర్మ్లేచ్ఛకులాదపి"** యతి మ్లేచ్ఛుని యింటి యందుండి యైనను భిక్ష గైకొనవచ్చును. **"న దేవతా ప్రసాదగ్రహణమ్, న బాహ్య దేవాభ్యర్చనం కుర్యాత్"** యతి దేవతా ప్రసాదమును స్వీకరింపరాదు. బాహ్య దేవార్చనము చేయరాదు. ఇట్టి నియమము లనేకములు గలవు. భుజింపవలసిన ఆహారనియమ మతి కఠినమైనది.

జి : సన్న్యాసులందరు శాస్త్రోక్త నియమముల నన్నింటిని పాటించలేరు గదా? వారిస్థితి యెట్టిది?

 Dr K Dayanandaswamy ebooks

వే : నూటి కొక్కరైనను పాటించువారు లేకపోరు. తక్కినవారు వారి వారి శక్త్యనుసారము పాటింతురు. విద్యార్థులు పరీక్షలయందు నూటికి నలువది 'మార్కులు' వచ్చినను కృతార్థులుగా గణింపబడుచుండ లేదా! అట్లే నిషిద్ధాచరణము లేక, యెంత యెక్కువగా యతిధర్మము ననుసరించిన అంత కృతార్థు లగుదురు. ఎవరుగాని త్వరపడి సన్న్యాసమును స్వీకరింపరాదు.

చాతుర్మాస్యములయందు తప్ప నితర కాలములయందు సన్న్యాసి యొక్క చోట స్థిరముగా నుండరాదు. "**గ్రామే ఏకరాత్రం తీరే త్రిరాత్రం పట్టణే పంచరాత్రం క్షేత్రే సప్తరాత్ర మనికేత స్థిరమతి:**" అని పరమహంస పరివ్రాజకోపనిషత్తు. అనగా : గ్రామము నందొక రాత్రి, తీరమున మూడు రాత్రులు, పట్టణము నందైదురాత్రులు, పుణ్యక్షేత్రముల యందు నేడు రాత్రులు మాత్రమే నివసించుచు, నివసించుటకు స్థిర నివాసము లేనివాడై స్థిరమతియై యుండవలెను.

జి : శ్రీ శంకరాచార్యాదులు బాల్యముననే సన్న్యసించిరి గదా? వారి విషయమేమి?

వే : పైన చెప్పినది సామాన్యవిధి, శ్రీ శంకరులకు వర్తింపదు. వారికి స్వప్న మందైనను స్త్రీ వాంఛ కలుగలేదు. బాల్యముననే విరక్తి కలిగినది. అట్టి వారు బ్రహ్మచర్యాశ్రమము నందుండియే సన్న్యసింప వచ్చునని శ్రుతి చెప్పినది. ఇదియొక పద్ధతి.

రెండవపద్ధతి : వివాహమాడిన పిమ్మట సంతతిని గని పుత్రుని విద్యావంతుని చేసి, వానికి వివాహమొనర్చి వానికి కుమారుడు కలుగగనే అనగా పౌత్రుని ముఖము చూడగనే గృహము వదలి వానప్రస్థాశ్రమము స్వీకరించి అటుపిమ్మట సన్న్యసింపవలె ననిరి. ఒక్కసారి గృహస్థాశ్రమ మను వలలో తగులుకొన్నవారు వారి యిష్టానుసారము ఆవలను త్రెంచరాదని మనువు అభిప్రాయము. కాని యిట్టి నియమ మున్నప్పటికిని '**యదహరేవ విరజేత్తదహరేవ ప్రవ్రజే**' త్తని జాబాల్యోపనిషత్తు చెప్పినట్లు "ఎప్పుడు వైరాగ్యము కలుగునో అప్పుడు సన్న్యాసము స్వీకరింపవచ్చును." అని

Dr K Dayanandaswamy ebooks


యున్నది కనుక శ్రీరామకృష్ణ పరమహంసగారివలె శారదాదేవి గారిని వివాహమాడినను వారిరువురును వైరాగ్యము కలిగి యుండినందున సన్న్యసించినను శాస్త్రవిరోధము లేదు.

ఆతురసన్న్యాసమని మరియొక విధమగు సన్న్యాసమును శాస్త్రములు చెప్పినవి. ఆతురుడనగా ఘోర కష్టదశ సంప్రాప్త మైనప్పుడును, దొంగలు పులులు మొదలగు వానివలన ప్రాణాపాయము కలిగినప్పుడును, ప్రవాహమున కొట్టుకొని పోవునప్పుడను, కార్చిచ్చుచేత చుట్టబడినప్పుడును, ముసలితనముతో బాధపడునప్పుడును - ఇట్టి సమయములయందు బ్రతుకడని తోచినచో వాక్కుతోను మనస్సుతోను సన్న్యసింపవచ్చును. **"యద్యాఽఽతురస్స్యాన్మనసా వాచా వా సన్న్యసేత్"** అని జాబాల్యోపనిషత్తు చెప్పినది. అనగా: ఆతురుడైన యెడల మనస్సుతోగాని వాక్కుతోగాని ప్రేషోచ్చారణమును చేసి సన్న్యసింప వచ్చునని తాత్పర్యము. అట్టి వానికి విధి లేదు. హోమాది కర్మలు లేవు. అట్టి సన్న్యాసి మరణించిన దహనాది అంత్యక్రియలు చేయనక్కరలేదు. సన్న్యాసులను పూడ్చినట్లు పూడ్చవలెను. ఆపదనుండి బ్రతికి బయట పడినయెడల **"ఆతురోజీవతి చేత్క్రమసన్న్యాసః కర్తవ్యః"** అని సన్న్యాసోపనిషత్తు గురువు దగ్గరకు పోయి యథావిధిగా మంత్రోపదేశమును పొంది హోమాదులతో సన్న్యాసకల్ప ప్రకారము కర్మకాండ జరుపవలెను. పిమ్మట జీవిత శేషమంతయు యతి ధర్మమునందే యుండవలెను.*

---

* ఈ విషయమైన యైతిహ్యమొక్కటి యిట్లు చెప్పుదురు. ఆంధ్ర దేశమున కోనసీమలోని కూచిమంచి అగ్రహారమునందు 16వ శతాబ్ది చివరనున్న నారాయణ తీర్థులనువారు కృష్ణానదిని దాటుటకై నదియందీదుచు ప్రవాహ మధిక మయినందున నీదలేక మృత్యుముఖమున నుంటినని తలచి మానసికముగ ఆతుర సన్న్యాసమును స్వీకరించిరి. పిమ్మట నెట్లో నదినుండి బయటపడి తన సన్న్యాస స్వీకార మితరు లెఱుగరని అత్తవారిల్లు చేరి భార్యతో ప్రథమ సమాగమమునకై శయనాగారము ప్రవేశించగా వారిభార్య కాయన సన్న్యాసివలె కనబడిరట. ఆమె భయపడి తల్లిదండ్రుల కాసంగతి చెప్ప వారు నిజము తెలిసికొనిరి. అంత నారాయణతీర్థులవారు తాను గృహస్థుడుగా నుండుట భగవదిచ్ఛ గాదని నిశ్చయించుకొని, గురువు కడకేగి శాస్త్రోక్తరీతిని సన్న్యసించిరి. వీరే "శ్రీకృష్ణలీలాతరంగిణి" గ్రంథకర్తలు.

Dr K Dayanandaswamy ebooks



సత్+న్యాసము = సన్న్యాసము సత్ అనగా : బ్రహ్మము. న్యాసమనగా వర్తించుట. అనగా బ్రహ్మమునందుండుటయని యర్థము. కనుకనే సన్న్యాసాశ్రమమునకు బ్రహ్మాశ్రమమని, తురీయాశ్రమ మనిపేర్లు. తురీయమనగా నాలుగవది. సన్న్యాసులను యతులని, భిక్షులని యందురు. సన్న్యాసమనగా: కర్మపరిత్యాగము. ఇది వాచ్యార్థము. లోకాచారమునుబట్టి నిరగ్నియు, శిఖాయజ్ఞోపవీతములు పరిత్యజించిన వాడును సన్న్యాసియని చెప్పబడును. కాని యథార్థముగ చెప్పవలసివచ్చినచో గీత చెప్పినట్లు "ఎవడు కర్మల యొక్క ఫలము నపేక్షింపక చేయదగిన కర్మలను చేయుచున్నాడో వాడే సన్న్యాసి. అనగా: కర్మఫల పరిత్యాగము చేసినవాడు. అట్టివాడే యోగియు నగుచున్నాడు. అతడు అగ్నులు లేని వాడును తపోదానాది క్రియలు లేనివాడును కాడు." (గీ. 6-1)

సన్న్యాసము స్వీకరించుట యనగా: ప్రపంచ భావమున మరణించుటవంటిదే. నూతనజన్మము ప్రారంభమగును. పూర్వాశ్రమము నందున్న నామ, వేష, కుల, గోత్ర, జాతి, మత, భార్యా, పుత్ర, మిత్ర, బాంధవ, ధనధాన్యాది సమస్తమును పరిత్యజింపవలయును. ఇవి యేవియును తనకు చెందనివిగా భావింపవలయును. ఏలనో శ్రీ శంకరులవారును, శ్రీ రామకృష్ణ పరమహంసగారును పూర్వాశ్రమ నామమునే యుంచుకొనిరి. శాస్త్రములయందు సన్న్యాసమును గురించి చెప్పిన విధమును సంగ్రహముగా చెప్పెదను.

సన్న్యాసోపనిషత్తు (1) వైరాగ్యసన్న్యాసి (2) జ్ఞాన సన్న్యాసి (3) జ్ఞానవైరాగ్యసన్న్యాసి (4) కర్మసన్న్యాసి అని నాలుగువిధములగు సన్న్యాసులను గురించి చెప్పినది.

(1) పూర్వజన్మ పుణ్యపరిపాకముచేత విషయములయందు అత్యంత వైరాగ్యము గలిగి సన్న్యసించినవాడు వైరాగ్యసన్న్యాసి.

(2) శాస్త్రజ్ఞానమువలన ప్రపంచముపై విరక్తి కలిగి వాసనా త్రయమును వదలి సాధన చతుష్టయ సంపన్నులై సన్న్యసించివారు జ్ఞానసన్న్యాసి.

Dr K Dayanandaswamy ebooks



(3) క్రమేణ సాధన చతుష్టయ మభ్యసించిన ఆత్మానుసంధానపరుడు వైరాగ్య సన్న్యాసి.

(4) వెనుక మనుస్మృతి చెప్పిన క్రమమున బ్రహ్మచర్యాది ఆశ్రమముల మూడింటిని జరిపి సన్న్యసించినవాడు కర్మసన్న్యాసి యనబడును.

ఈ సన్న్యాసులు నలుగురును క్రింద చెప్పబోవు ఆఱు విధములైన సన్న్యాసులలోనే చేరియున్నారు. సన్న్యాసోపనిషత్తు ఇట్లు చెప్పినది.

**'సన్న్యాస షడ్విధో భవతి కుటీచక బహూదక హంస పరమహంస తురీయాతీతావధూత** :". సన్న్యాసులు ఆఱువిధములని చెప్పినది. (1) కుటీచక (2) బహూదక (3) హంస (4) పరమహంస (5) తురీయాతీత (6) అవధూతలు. కొందఱు హంస, పరమహంస అను రెండు భేదములనే అంగీకరించి హంసునియందే కుటీచక బహూదకులను రెండు భేదములను చేర్చియున్నారు.

(1) **కుటీచకుడు** : తీర్థయాత్రలు చేసి మఱల తీర్థయాత్రలు చేయుటకు అసమర్థుడై యుండిగాని, తీర్థయాత్రలు చేయుటకు మొదలే అసమర్థుడై యుండిగాని ఒక మఠము కట్టుకొని అందులో నుండువాడు.

(2) **బహూదకుడు** : తీర్థయాత్ర చేయువాడు.

(3) **హంస** : పైన చెప్పిన కుటీచక, బహూదక మార్గముల రెండింటియందును నుండువాడు. ఇత్తడు ఏకదండి, శిఖను వర్జించి యజ్ఞోపవీతమును మాత్రము ఉంచుకొనినవాడు. శిఖ్యకమండలధారి. కృచ్ఛ్రచాంద్రాయణ వ్రతపరుడు. దినమునకు ఒకసారి భుజించువాడు.

(4) **పరమహంస:** ఏకదండి, శిఖాయజ్ఞోప విరహితుడు. *కౌపీనమును, దండమును కాషాయవస్త్రమును మాత్రము పరిగ్రహించినవాడు. సర్వకర్మ వివర్జితుడు. ఆత్మనిష్ఠుడు. ఈ పరమహంసయందు రెండు భేదములు

* శ్రీ వైష్ణవ సన్న్యాసులు శిఖాయజ్ఞోపవీతములను పరిత్యజింపరు. వీరిని "జియ్యర్" అందురు. ఈ సన్న్యాసులు కాషాయ వస్త్రములను వదలి శ్వేతవస్త్రములను ధరించిరేని వారిని సన్న్యాసులని తెలిసికొనుట కష్టము.

Dr K Dayanandaswamy ebooks



కలవు. (1) వివిదిషుడు (2) విద్వాంసుడు. ఇందులో ఆరూఢుడైనవాడు తురీయాతీతుడనియు అవధూత యనియు చెప్పుదురు.

వివిదిషా సన్న్యాసము : సన్న్యసించియే వేదాంత శ్రవణము చేయవలెనను నియమము పాటించువారు కలరు. శ్రీతోతాపురి యట్టివారు. శ్రీరామకృష్ణ పరమహంసగారికి సన్న్యాస మిచ్చిన తరువాతనే యుపదేశము నిచ్చిరి. సన్న్యసింపక పోయినచో లౌకిక వ్యవహారములయందు తగులుకొన్న మనస్సునకు వేదాంత శ్రవణము పట్టుబడదని మొదట సన్న్యసించి, గురుసన్నిధి చేరి, తత్త్వజ్ఞానమును పొందవలయునని చెప్పుదురు. ఇదియే వివిదిషా సన్న్యాసము. ఇతడు శిఖాయజ్ఞోపవీతములను త్యజించి రెండు కౌపీనములను, నొక వస్త్రమును, దండమును, పాదుకలను, ఒక బొంతను మాత్రము ధరించి భిక్షాటనము చేయవలయునని నియమము విధింపబడెను. లజ్జను కౌపీనాదులచేతను, సర్పాద్యుపద్రవములను కఱ్ఱ చేతను, చలిని నెండను ఆచ్ఛాదనము చేతను, అంటరాని వస్తువుల స్పర్శను పాదుకలచేతను నివారించు కొనవలయును. సన్న్యాసమును స్వీకరించుట, సన్న్యాసవేషమును ధరించుట లోకానుగ్రహము కొఱకే యని శాస్త్రములయందు చెప్పబడినది.

ఎట్లనగా:- సన్న్యాసాశ్రమ లక్షణములను చూచి లోకులు నమస్కార భిక్షాప్రదానాది సత్కారములు చేసి సుకృతమును పొందవలయునను బుద్ధిచేతను, శిష్టాచార ప్రాప్తమైన సన్న్యాసాశ్రమ మర్యాదను పాటించుటకును అని చెప్పబడినది. కాషాయాదులను ధరించి సన్న్యసింపక పోయినను గృహస్థుడై యుండి మానసిక సన్న్యాసము చేసి వేదాంత శ్రవణము చేయవచ్చును.

విద్వత్సన్న్యాసము : బ్రహ్మచర్య, గృహస్థాశ్రమముల యందుండు కాలమునందే సాధన చతుష్టయము సాధించి శ్రవణాదుల నాచరించి బ్రహ్మాత త్త్వజ్ఞానము సంపాదించిన జ్ఞాని, చిత్తశాంతికొఱకు వాసనాక్షయ మనోనాశములు సాధించుటకు సన్న్యసించినచో, అట్టి సన్న్యాసమును విద్వత్సన్న్యాస మందురు. అనగా: విద్వాంసుడు (జ్ఞాని) సన్న్యసించెనని

Dr K Dayanandaswamy ebooks



యర్థము. దీనికి ఫలము జీవన్ముక్తియని చెప్పిరి. సన్న్యసింపక పోయినచో జీవన్ముక్తుడు కాలేడని వారి భావము.

కాని ఒకానొకప్పుడు సన్న్యాసమను వేషమును విధిపూర్వకముగా ధరింపక, భిక్షాటనము చేయక, గృహమునందే లౌకిక వ్యాపారములు వర్జించి జీవన్ముక్తు లగుట కవకాశ మున్నది. ఉపనిషత్తులు సామాన్యముగ సన్న్యాసమును ప్రోత్సహించు నట్టివి గనుక జీవన్ముక్తుడు కావలసినవాడు సన్న్యసింపవలెనని చెప్పినవి. ఈసన్న్యాసిని పరమహంసయని యందురు. పరమహంస యనగా: పరబ్రహ్మమని యర్థమగును. పరమహంసయందు వివిదిషుడును, విద్వాంసుడును కలడను విషయము మన కాశ్చర్యము కలిగించును.

ఏలయన: వివిదిషుడు తత్త్వజ్ఞానము లేని సామాన్యుడు. వేషము నామము మారినది. ఇతనికి పరమహంసయను నామము విద్వత్సన్న్యాసికి వలెనే ఇవ్వబడుటను చూడగా సన్న్యాసాశ్రమమును గౌరవించుటకే యని యర్థము చేసికొనవలయును. విద్వత్సన్న్యాసము స్వీకరించినవారు సన్న్యాస స్వీకారముచేతనే జీవన్ముక్తులు కాలేరు. ఏలయన: జీవన్ముక్తికి అవసరమగు వాసనాక్షయ మనోనాశములు సాధించినప్పుడే జీవన్ముక్తి సిద్ధించుచున్నది. కాని, ఆయన విద్వత్సన్న్యాసమును స్వీకరించుటకు మునుపును, స్వీకరించిన తరువాతను తత్త్వజ్ఞానము కలవాడు గనుక ఆయన బ్రహ్మస్వరూపుడే.

వివిదిషా సన్న్యాసియగు పరమహంస తత్త్వజ్ఞానము సంపాదింప వలసియున్నది. ఆయన కాజన్మమున తత్త్వజ్ఞానము కలిగినను కలుగవచ్చును. లేదా పరమేశ్వరానుగ్రహము లేనియెడల ఆ జన్మమున తత్త్వజ్ఞానము కలుగక పోవచ్చును. అందువలన పరమహంసయగు వివిదిషుడు తత్త్వజ్ఞాన మార్జించువఱకు సామాన్య సంసారితో సమానుడే. ఇరువురకు వేషమునందు మాత్రమే భేదము. వివిదిషుడు తత్త్వజ్ఞాన మార్జించుటకు పూర్వమే మృతి చెందినయెడల పుణ్యలోకములు మాత్రము కలుగును. సాధన చతుష్టయము సాధింపనిదే సన్న్యాసమున కర్హత కలుగదు.

మం॥ "త్రిదండం కమండలుం శిక్యం పాత్రం జలపవిత్రం

Dr K Dayanandaswamy ebooks



శిఖాం యజ్ఞోపవీతం చేత్యేతత్సర్వం భూస్స్వాహేత్యప్సు
పరిత్యజ్యాఽత్మాన మన్విచ్ఛేత్" (జాబాలోపనిషత్తు)

తా॥ "పరమహంసలు త్రిదండము, కమండలువు, ఉట్టి (కావడి), జలపాత్రము, శిఖ, యజ్ఞోపవీతము అను వీనిని మంత్రపూర్వకముగా జలమునందు పరిత్యాగము చేసి ఆత్మధ్యానము చేయవలయును."

ఏలయన : ఇవి యుండనట్లయిన ధ్యానసమయమున వీటి నెవరైన నెత్తుకొని పోవుదురేమో యను విక్షేపము కలుగుటకు అవకాశమున్నది. కనుక త్యజింపవలయునని చెప్పియుందురు. వివిదిషా సన్న్యాసియగు పరమహంస కివి అవసరము. ఆయనకు బ్రహ్మజ్ఞానము లేదు. జ్ఞానియగు పరమహంస సకలద్వంద్వములకు అతీతుడు.

మం॥ న దండం న కమండలుం న శిఖాన్న యజ్ఞోపవీతం
న చాచ్ఛాదనం చరతి పరమహంసః
న శీతం న చోష్ణం న సుఖం న దుఃఖం న మానావమాన
ఇతి షడూర్మివర్జితో న శబ్దం న స్పర్శం న రూపం న రసం
న గంధం న చ మనోఽ ప్యేవ్యం నిన్దాగర్వ మత్సర
దంభ దర్పేచ్ఛా ద్వేష సుఖ దుఃఖ కామ క్రోధ లోభ
మోహ హర్షాసూయాహంకారాదీంశ్చ హిత్వాస్వ
వపుం కుణపమివ దృశ్యతే (పరమహంసోపనిషత్తు)

తా॥ అట్టి పరమహంస దండము, కమండలము, శిఖ, యజ్ఞోపవీతము, అచ్ఛాదనార్థము ధరించెడి వస్త్రమును ధరింపక సంచరించును. చలి, వేడిమి, సుఖము, దుఃఖము, మానము, అవమానము అను షడూర్ములు లేనివాడై, శబ్ద స్పర్శ రస గంధములు లేనివాడై, సంశయాత్మకమగు మనసు లేనివాడై; నిందా, గర్వ, మత్సర, దంభ, దర్ప, ఇచ్ఛా, సుఖ, దుఃఖ, కామ, క్రోధ, లోభ, మోహ, మద, హర్ష, అసూయలు మున్నగునవి పరిత్యజించి తన శరీరమును శవమువలె చూచుచున్నాడు.

శాస్త్రములందు జీవన్ముక్తిని గుఱించి చెప్పిన లక్షణములే యిచ్చట చెప్పబడి యున్నందున జీవన్ముక్తుడైన పరమహంసను గూర్చియే యీ

Dr K Dayanandaswamy ebooks



లక్షణములు చెప్పబడినవి. మఱియు

"ఆశాంబరో న నమస్కారో న స్వధాకారో న నిందా న స్తుతి
ర్యాదృచ్ఛికో భవే త్స భిక్షుః" (పరమహంసోపనిషత్తు)

తా॥ ఆ భిక్షువు దిగంబరుడు; నమస్కారము, స్వధాకారము, నింద, స్తుతి యివి లేనివాడును యాదృచ్ఛికుడును నగుచున్నాడు-

అనుటవలన సన్న్యాసులయందు దిగంబరులు కొందఱు గలరు. శ్రీరామకృష్ణ పరమహంసగారి గురువులగు శ్రీతోతాపురిగారు దిగంబరసన్న్యాసులు. (5) తురీయాతీత (6) అవధూత.

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాశ్రమముల యందు సన్న్యాసము నాల్గవది. నాల్గవ దానిని తురీయ మందురు. తురీయాతీత మనగా నాల్గవ దానికంటె పైనున్నది. కాని, దాని కొక పేరు పెట్టలేదు. అందుండువారిని అతివర్ణాశ్రములని అందురు.

శ్లో॥ "బ్రహ్మచారీ గృహస్థశ్చ వానప్రస్థో ఽథ భిక్షుకః ।
అతివర్ణాశ్రమీ తే ఽపి క్రమాత్ శ్రేష్ఠ విచక్షణాః" ॥

తా॥ బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్న్యాసి, అతివర్ణాశ్రమి- వీరలైదుగురయందు నొకరికంటెను నొకరు, ఉత్తరోత్తర శ్రేష్ఠులు. అనగా: అందరికంటెను అతివర్ణాశ్రమి శ్రేష్ఠుడని యర్థము.

శ్లో॥ "అతివర్ణాశ్రమీ సాక్షాద్గురూణాం గురు రుచ్యతే ।
తత్సమో నాధికశ్చాస్మిన్ లోకే ఽస్త్యేవ న సంశయః" ॥

తా॥ఈ అతివర్ణాశ్రమి గురువులకు గురువు. ఇతనితో సమానుడుగాని అధికుడుగాని లోకమునందు లేడు. ఇందుకు సంశయము లేదు. అనగా వీరు బ్రాహ్మణాది వర్ణములను, బ్రహ్మచర్యాది ఆశ్రమములను అతిక్రమించినవారని యర్థము.

సన్న్యాసోపనిషత్తు తురీయాతీతులను, అవధూతలను వేఱువేఱుగా జెప్పినది. ఉపనిషత్తులయందు తురీయాతీతావధూతోపనిషత్తు,

Dr K Dayanandaswamy ebooks



అవధూతోపనిషత్తు అని రెండుపనిషత్తు లున్నవి. కాని అనుభవమునందు వారిరువురు సమానులే యని నాయభిప్రాయము.

"తత్ర పరమహంసో నామ సంవర్తకారుణి శ్వేతకేతు దుర్వాస ఋభు నిదాఘ జడభరత దత్తా త్రేయ రైవతక ప్రభృతయో ఽవ్యక్తలింగా వ్యక్తాచారా అనున్మత్తా ఉన్మత్తవ దాచరన్తః" అని జాబాల్యుపనిషత్తు నందును, "...తత్ర పరమహంసానామ సంవర్తకారుణి శ్వేతకేతు దుర్వాస ఋభు నిదాఘ దత్తాత్రేయ శుక వామదేవ హారీతక ప్రభృతయో వ్యక్తలింగా ఽవ్యక్తా ఽచారా అనున్మత్తా ఉన్మత్తవదాచరంతః" అని యాజ్ఞవల్క్యోపనిషత్తును చెప్పినది. నారద పరివ్రాజకమును, మఱికొన్ని పేర్లు ఎక్కువగా చెప్పినది. వీరిలో ఋభు, జడభరత వామదేవాదులగు కొందఱు సన్న్యాసమును శాస్త్రీయముగా స్వీకరించినట్లెచ్చటను చెప్పలేదు. బాలోన్మత్త పిశాచములవలె దిగంబరులై తిరుగుచుండువారు. వీరిని పరమహంస లనుటకంటె తురీయాతీతులని, అవధూతలని అనుటయే యుక్తము. అట్లుగాక వీరిని పరమ హంసలలో చేర్చిన తురీయాతీతులు, అవధూతలు వీరికంటె గొప్పవారున్నట్లు శాస్త్రములయందు కనబడదు. కనుక వీరు తురీయాతీతావధూతలని చెప్పవచ్చును. వీరు షడ్విధభ్రమలను వదలినవారు. "కుల గోత్ర జాతి వర్ణాశ్రమ రూపాణి షడ్భ్రమాః" (1) కులము (2) గోత్రము (3) జాతి (4) వర్ణము (5) ఆశ్రమము (6) రూపము-ఇవి ఆఱుభ్రమలు అని ముద్గలోపనిషత్తు. తురీయాతీతులు వేఱు, అవధూతలు వేఱుగా సన్న్యాసోపనిషత్తు చెప్పినది. కాని జడ భరతాదులు ఏ విధికిని లోబడి నడచుకొన్నవారు కారు. కనుక ఎవరు తురీయాతీతులని, ఎవరు అవధూతలని నిర్ణయించగలము.

జాబాల్య, నారద పరివ్రాజక, భిక్షుకోపనిషత్తులు పరమహంసలు సామాన్యముగా నివసించు ప్రదేశములను ఇట్లు చెప్పినవి. పాడుబడిన యిల్లు, దేవాలయము, పుట్ట, పొద, వృక్షమూలము, కుమ్మరిల్లు, అగ్నిహోత్రశాల, ఏటిలోని యిసుకదిబ్బ, కొండ, గుహ, తొఱ్ఱ, సెలయేరు, ఎడారి - ఈ ప్రదేశములు సామాన్యముగా తురీయాతీతులకు, అవధూతలకు

Dr K Dayanandaswamy ebooks



నివాసస్థానములు. కాని వారికిట్టి నియమముగాని మఱొట్టి నియమముగాని లేదు. ఉపనిషత్తులయందు చెప్పిన విధుల ననుసరించిన యతి ఆ జన్మముననే ముక్తుడు కావచ్చును. కాని యతి ధర్మములు చాల కఠినమైనవి. వాటిని పూర్ణముగ నెఱుగగోరువారు సన్న్యాసోపనిషత్తులను చూడవలెను.*

## (14) విదేహ ముక్తుడు : అశరీరి

జి : జ్ఞాన భూమికలను గుఱించి చెప్పినప్పుడు నాలుగవ భూమికను తరించి ముక్తి కలుగునంటిరి. తత్త్వజ్ఞాని యనియు, జీవన్ముక్తుడనియు, నిరువుర పేర్లు వినబడుచున్నవి. ఇఱువురు వేఱు వేఱు దశలయం దుండువారా? యిరువురు నొక్కదశయందుండువారా?

**వే:** ఇది చిక్కైన విషయము. అద్వైతమును బోధించిన యాచార్యులయందు శ్రీ శంకరభగవత్పాదుల తరువాత శ్రీ విద్యారణ్య స్వాములవారు గణనకెక్కినవారు. **వీరిరువురకు కొన్ని విషయముల యందు భేదాభిప్రాయము లున్నట్లున్నది. నీ వడిగిన ప్రశ్నలకు తృప్తికరమగు సమాధానము చెప్పవలయునన్న నిరువుర యభిప్రాయములు చెప్పవలసియున్నది. శ్రీ విద్యారణ్యులవారు బ్రహ్మవేత్తలయందు విదేహముక్తులనియు, జీవన్ముక్తులనియు భేదమును చూపియున్నారు.

విద్యారణ్యులవారి మతమిది:- తత్త్వజ్ఞానము కలిగిన మాత్రముననే

---

* ఈ క్రింద చెప్పబడినవి సన్న్యాసోపనిషత్తులు : బ్రహ్మ, జాబాల్య, ఆరుణి, పరమహంస, మైత్రేయ, నారదపరివ్రాజక, నిర్వాణ, భిక్షుక, తురీయాతీత అవధూత, సన్న్యాస, పరమహంసపరివ్రాజక, కుండిక, అవధూత, యాజుషీయకఠ, యాజ్ఞవల్క్య, కాట్యాయని-లు.

**శ్రీ శంకరులవారి కాలమును గుఱించి పండితులయందు భేదాభిప్రాయము లున్నవి. క్రీ.శ. 788-820 సంవత్సరముల మధ్యయందుండినట్లు చెప్పువా రనేకులు గలరు. శ్రీ విద్యారణ్యులవారు ఆంధ్రులు. విద్యానగర (విజయనగర) నిర్మాణము జరిగిన క్రీ.శ. 1335వ సంవత్సరమున ఆమహానగర నిర్మాణమున కంకుర్వారణ గావించినవారు. పూర్వాశ్రమమున వీరి నామధేయము మాధవాచార్యులు. సన్న్యాసము స్వీకరించియు శ్రీ

Dr K Dayanandaswamy ebooks



ముక్తుడగును గాని వాసనాక్షయ మనోనాశములు కలుగవు. తత్త్వజ్ఞాని వాసనాక్షయ మనోనాశములు సాధించి జీవన్ముక్తిని సాధింపవలసియున్నది. విదేహముక్తి తత్త్వజ్ఞానముయొక్క ఫలము. తత్త్వజ్ఞానము సాధన చతుష్టయ సంపత్తివలనను, శ్రవణాదులవలనను కలుగును. తత్త్వజ్ఞానమనగా: నామరూపాత్మకయగు ఈ నానాత్వమునందు నామరూపరహితమైన యేకత్వమును కనుగొనుట. అనగా పరమాత్మను దర్శించుట. సామాన్యమానవుడు శరీరమే తాననుకొనిన విధముగ శరీరము నేనుకాను, శరీరమునకంటె విలక్షణమైన ఆత్మను నేనని నమ్ముట. శ్రవణ మనన నిదిధ్యాసలు దృఢముగా నభ్యసించుటవలన ప్రపంచము సత్యము కాదను దృఢనిశ్చయము కలిగి అజ్ఞానసంశయ విపర్యయములు నశించి తత్త్వజ్ఞానము కలుగుచున్నది. ఇదియే బ్రహ్మజ్ఞానము. బ్రహ్మమునకు తనకును నభేదమని యెఱుగుటయే.

వెనుక చెప్పబడిన *జ్ఞాన భూమిక లేడింటిలోను (1) శుభేచ్ఛ (2) విచారణ (3) తనుమానసలను మొదటి మూడు భూమికలను దాటి నాలుగవ భూమికయగు సత్త్వాపత్తిని సాధించిన యోగికి తత్త్వజ్ఞానము కలుగును. ఇతనికి విదేహముక్తి కలుగును. 'విదేహ' మనగా దేహము లేక పోవుట యని యర్థము. ఇచ్చట 'దేహ' శబ్దమునకు వర్తమాన కాలమునందలి దేహమని యర్థము కాదు. మరణించిన ప్రతివాడును తిరుగ జన్మింపవలసియున్నది. పునర్జన్మ మెత్తుటకు నెట్టి శరీరము ధరింపవలసియున్నదో యట్టి శరీరమునకు కావలసిన సామగ్రిని జీవించియున్నపుడే అనగా: వర్తమాన దేహమున్నపుడే దేహి కర్మలద్వారా సమకూర్చుకొనుచున్నాడు. ఇందుకు కారణము అవిద్య. తత్త్వ

హరిహరరాయల వారికి మంత్రియై రాజకీయములయందు పాల్గొని దేశమునకును, మతమునకును మహోపకారము చేసిన మహనీయులు. వీరి తమ్ముడు శాయనాచార్యులవారు. వేదములకు భాష్యములు రచియించిరి. వీరు బుక్కరాయలకును వారి కుమారులగు శ్రీ రెండవ హరిహర రాయలకును మంత్రియై యుండిరని చరిత్రవలన తెలియుచున్నది.

* ఈ గ్రంథముయొక్క ప్రథమభాగమున (2-45) "జ్ఞానభూమికలు" అందు చెప్పబడినవి.

Dr K Dayanandaswamy ebooks

జ్ఞానోదయముతో అగామి సంచిత కర్మలు దగ్ధమైపోయినవి. భవిష్యద్దేహమునకు (పునర్జన్మమునకు) కారణమగు అవిద్య. తత్త్వజ్ఞానికి నశించినందున భవిష్యద్దేహము నశించినదనియు, దేహములేని వాడనియు భావించి అతనికి విదేహముక్తుడని పేరు పెట్టిరి. అంతియేకాని వర్తమాన కాలమునందున్న దేహము లేదని యర్థము కాదు. నాకు దేహము లేదని యెవరైన నన్నచో 'నాకు నాలుక లేదని' చెప్పినట్లగును.

శ్రీ విద్యారణ్యులవారికంటెను పూర్వులగు శ్రీ శంకరాదులు జీవన్ముక్తుడైన పురుషునకు ప్రారబ్ధకర్మ నశియించగనే సూక్ష్మశరీరము నశియించుచున్నందున అప్పుడే వర్తమాన దేహముకూడ నశించుచున్నది. జీవన్ముక్తునకు కలిగిన ఆ స్థితిని విదేహముక్తియని చెప్పిరి. కాని, జీవించియుండగనే విదేహముక్తి కలుగునని చెప్పలేదు.

విద్యారణ్యులవారి మతము ననుసరించి విదేహముక్తునకు తత్త్వజ్ఞానము (బ్రహ్మజ్ఞానము) మాత్రమే యుండును. వాసనాక్షయ మనోనాశములు పూర్తిగా నుండవు. అత డజ్ఞానులవలె గాకపోయినను కొంతవఱకైనను వాసనాక్షయ మనోనాశములు కలిగియుండును. కొంతవఱకు వాసన లుండుటబట్టియే వీరు ద్రవ్యార్జనకొఱకును, ప్రతిష్ఠకొఱకును ప్రాకులాడుచున్నట్లు పురాణేతిహాసములయందును, ఉపనిషత్తులయందును చెప్పబడిన కథలవలనను తెలియుచున్నది.

యాజ్ఞవల్క్యమహర్షి జనకుడు చేయు యాగమునందలి గోధనమునకుగాను పోయెను. జనకరాజు కొమ్ములకు బంగారము కట్టబడిన వేయి గోవుల నచట నిలిపి 'బ్రహ్మవేత్త యగువాడు వీటిని తోలుకొని పోవచ్చు'నని చెప్పెను.

యాజ్ఞవల్క్య మహర్షి గోవులను తీసికొని పోవుటకు శిష్యుల కనుజ్ఞ యిచ్చెను. అప్పుడు ఆసభలో నుండిన హోతయగు అశ్వలుడు "నీవు బ్రహ్మవేత్తవా?" యని ప్రశ్నింపగా "నేను బ్రహ్మనిష్ఠునకు నమస్కరింతును. మనమందఱము గోవులను కోరెడి వారమై యున్నాము." అని

 Dr.K Dayanandaswamy ebooks

యాజ్ఞవల్క్యుడు ప్రత్యుత్తరమిచ్చెను. దీని భావమేమి? మేము బ్రహ్మనిష్ఠులము కామనియేగదా? మఱియు తనతో వితండవాదము చేసిన శాకల్యుని తల పగులునని చెప్పగా శాకల్యుని తల పగిలి పోయెను. (ఈ కథ బృహదారణ్యకశ్రుతి పంచమాధ్యాయము నందలి ప్రథమ బ్రాహ్మణము నందు కలదు)

జానశ్రుతియను రాజు బ్రహ్మవిద్య నెఱుగగోరి అఱునూర్ల గోవులను, ఒక నిష్కహారమును, కంచరగాడిదలు కట్టిన రథమును కానుకగా తీసికొని రైక్వునియొద్దకు పోయి విద్య నర్థింపగా, రైక్వుడు జానశ్రుతుని చూచి "శూద్రుడా! అవి నీయొద్దనే యుండనిమ్ము." అని మొదట నిరాకరించెను. పిదప జానశ్రుతి యింటికిపోయి మరికొన్ని గోవులను, తన కుమార్తెనుకూడ తెచ్చి యివ్వగా రైక్వు డాకానుకలను, జానశ్రుతియొక్క కుమార్తెను గైకొని తృప్తిపడెనని చెప్పబడినది. (ఈ కథ ఛాందోగ్యము 4వ ప్రపాఠకము 1, 2, 3వ ఖండముల యందు కలదు*)

ఈ కథలవలన మన మర్థము చేసికొనవలసిన దేమన యాజ్ఞవల్క్య రైక్వులిరువురును బ్రహ్మవిదులే యయ్యును వారికి వాసనాక్షయము, మనోనాశము కాలేదని చెప్పవలయును, రైక్వుడు జానశ్రుతియొక్క కుమార్తె ముఖమును చూచి జానశ్రుతి ననుగ్రహించెను. కామినీ కాంచనములచే ఆయనచిత్త మాకర్షింపబడెను. **యాజ్ఞవల్క్య మహర్షి తనతో వితండ వాదము చేసిన శాకల్యుని క్షమింపడాయెను. దీనివలన ఆయన ధనాపేక్షను

---

* ఈ గ్రంథము ప్రథమభాగము మొదటి ప్రకరణమునందలి (6) "బ్రహ్మసూత్రములలో వర్ణప్రసక్తి" అను విషయమున జానశ్రుతిని గుఱించి చర్చింపబడినది. అచ్చట చూడుడు.

** ఈ విషయమును గుఱించి శ్రీ రామానుజాచార్యులవారిట్లు అభిప్రాయపడిరి. "జానశ్రుతి బ్రహ్మవిద్య నభిలషించుట కర్హుడని రైక్వుడెఱిగియు, చిరకాలము గురువుసేవ చేయకయే విద్యను తెలియగోరు నతనికి (జానశ్రుతికి) యథాశక్తి ద్రవ్యము కానుకగా నొసగుటచే నతనియందు బ్రహ్మవిద్య స్థిరముగా నుండునని తలచి, మొదట తెచ్చిన కానుకలు అల్పమని కైకొనక రైక్వుడు నిరాకరించియు, పిమ్మట (జానశ్రుతి) తెచ్చిన కానుకలను జానశ్రుతి స్వశక్త్యనుగుణముగా నున్నవని తెలిసికొని అతనికి బ్రహ్మవిద్య నుపదేశించెను" (ఆంధ్ర శ్రీ భాష్యము)

Dr K Dayanandaswamy ebooks


ప్రతిష్ఠను గోరినవాడే గాదా? కోపమోహములు సామాన్యులకు వలెనే బ్రహ్మవిదులకు సహిత మున్నచో సామాన్యులకును బ్రహ్మవిదులకును గల భేదమేమి? బ్రహ్మవిదుడు బ్రహ్మవేత్తయగుట యొక్కటియే భేదము. అవిద్య నశించినను పూర్వ సంస్కారములు వాసనారూపమున నుండి అవి ప్రేరేపించుచుండుననియు అందువలన వారును చిత్తవిశ్రాంతి లేనివారై అజ్ఞానులవలెనే సుఖదుఃఖములకు లోనగు చుందురనియు శాస్త్రము చెప్పినది.

**మం॥ భిద్యతే హృదయ గ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయాః।**
**క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥**(ముండక 2-2-8)

పరబ్రహ్మమును చూచిన జ్ఞానికి హృదయగ్రంథి వీడును. సర్వ సంశయములు నశించును. కర్మక్షయ మగునని చెప్పిన ముండకశ్రుతికి ఇది విరోధముగదా? యనిన, ఇచ్చట కర్మక్షయ మనగా సంచితాగామి కర్మలు మాత్రమే నశించునని యర్థము.

హృదయగ్రంథి యనగా అజ్ఞానమువలన అహంకారమును కూటస్థ చైతన్యమును ఏకమని తలచుట (అనగా రెంటికిని తాదాత్మ్యాధ్యాస మనుట). దీనిని చిదచిద్గ్రంథి యనియు నందురు. అజ్ఞానమువలన కలిగిన యీ అధ్యాసముచేతనే 'యిది నాకు కావలెను, అది నాకు కావలెను' అను కోరికలు కలుగుచున్నవి. ఈ కోరికలనే కామములనియు చెప్పుదురు.
(వే.పం. 6-261)

**శ్లో॥ అప్రవేశ్య చిదాత్మానం పృథక్పశ్యన్నహంకృతిమ్ ।**
**ఇచ్ఛంస్తు కోటి వస్తూని న బాధో గ్రంథిభేదతః ॥** (వే.పం.6-262)

తా॥ ప్రత్యగాత్మ కంటె అహంకారమును వేరైనదానినిగ తెలిసికొనుట గ్రంథిభేదము (అధ్యాసనివృత్తి) యనబడుచున్నది. అప్పుడు కోటి వస్తువులు కోరుచున్నను సాధకునకు సుఖదుఃఖాద్యనర్థముల నీయజాలవు.

ఒకవేళ అధ్యాస నివర్తించినను ప్రారబ్ధకర్మ దోషమువలన కామాదులు పుట్టుట అసంభవము కాదు. (వే.పం. 6-263)

Dr K Dayanandaswamy ebooks

తత్త్వజ్ఞానము కలుగునప్పుడు వాసనాక్షయ మనోనాశములు తాత్కాలికముగా కలుగుననియు, వాసనలు తిరిగి మొలక లెత్తవచ్చు ననియు, వాసనాక్షయమునకు ప్రత్యేకమైన ప్రయత్నము చేయవలయు ననియు విద్యారణ్యులవారు చెప్పిరి. ఇందు నిమిత్తమే (చిత్తశాంతి కొఱకే) యాజ్ఞవల్క్య మహర్షి సన్న్యసించి తపస్సునకు పోయెను. "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" (ముం. 3-2-9)

బ్రహ్మమును తెలిసినవాడు బ్రహ్మమే యన్నట్లు వీరు బ్రహ్మస్వరూపులే యైనను జ్ఞానభూమికలయందు మొదటి నాలుగు భూమికలనే సాధించిన వారగుటచేత చిత్తవిశ్రాంతిని కలిగించు వాసనాక్షయ మనోనాశములకు గాను తదితర జ్ఞానభూమికలు సాధింపవలసియున్నది. కనుక (వీరు) విదేహ ముక్తులు. జీవన్ముక్తులకంటెను తక్కువవారు.

జి : (1) విదేహముక్తి యనగా: జీవన్ముక్తుడు దేహపతనానంతరము ముక్తుడగుట యని పూర్వాచార్యులును; (2) తత్త్వజ్ఞానికి తత్త్వ జ్ఞానమువలన అవిద్య నశించినందున భవిష్యద్దేహము నశించినదనియు, అందువలన అతడు విదేహ ముక్తుడనియు విద్యారణ్యుల వారును చెప్పిరిగదా? ఇందేది యుక్తమని మీ అభిప్రాయము.

వే : ఈ విషయము విద్యారణ్యులవారు జీవన్ముక్తి వివేకమను* గ్రంథమునందు చర్చించిరి.

ఈ విషయమున శ్రీ శంకరులవారి అభిప్రాయము వినుము. బ్రహ్మము నెఱిగినవారు అశరీరులను విషయమును గుఱించి బ్రహ్మసూత్రముల యందు "సూ|| తత్తు సమన్వయాత్" (బ్ర.సూ. 1-1-4) అను సూత్రభాష్యమున శంకరులవారు ఇట్లు వ్రాసిరి:

"అశరీరం వా వసంతం న ప్రియాప్రియే స్పృశ్యత" అని (ఛాం. 8-B 12-1) తత్త్వవిదున కశరీరత్వము (జీవన్ముక్తి) కలదని చెప్పుచున్నది.

---

* ఈ 'జీవన్ముక్తి వివేకము' జీవన్ముక్తి ప్రకాశిక యను పేర ఆంధ్రీకరింపబడినది.

Dr K Dayanandaswamy ebooks



సశరీరత్వము మిథ్యాజ్ఞానమే కారణముగా కలది గాన శరీరము పతితము కాగా నశరీరత్వము కలుగును గాని జీవించియున్నవారికి కలుగదనరాదు. ఆత్మునకు దేహాదులయం దాత్మబుద్ధి యను మిథ్యాజ్ఞానమును విడిచి వేఱొకట సశరీరత్వము కల్పింప సాధ్యముకాదు... "దేహాదులకంటె వేఱగు నాత్మ కలదను నెల్లవారికిని దేహాదులందు నేనను ప్రత్యయము మిథ్యయకాని గౌణము కాదు. కావున = సశరీరత్వము మిథ్యాజ్ఞానమే కారణముగా గలది కాబట్టి విద్వాంసునకు జీవించియున్న వానికిని అశరీరత్వము సిద్ధించును. బ్రహ్మము నెఱిగినవారి విషయమునను "**తదేష......తద్యథా ఒహి నిర్ల్వయనీ వల్మీకేమృతా ప్రత్యస్తా శయీతైవమే వేదం శరీరం శేతే. అథాయ మశరీరోమృతః ప్రాణో బ్రహ్మైవ తేజ ఏవ.**" (బృ. 6-4-7)

జీవన్ముక్తుని దేహము ఎట్లుండుననగా పుట్టయందు పాముచేత విడువబడిన కుబుసమునందు పామునకు ఎట్లు అభిమానము విడువబడినదో ఆ విధముగనే జ్ఞానిచేత విడువబడిన అభిమానము కలదియై అతని దేహము నిలిచియుండును. కనుకనే అతడు మృతిలేని వాడును జీవించియున్నను స్వయంప్రకాశుడు నగుచు బ్రహ్మమే యగుచున్నాడు. (అం.సూ.భా.)

జి : జీవించియుండగనే జ్ఞానికి అశరీరత్వము సిద్ధించునని శ్రీ శంకరులనివారు చెప్పిన యీ వాక్యములకు విద్యారణ్యులవారి సమాధానమేమి?

వే : శ్రీ శంకరులవారు చెప్పిన పై విషయములు జీవన్ముక్తు నుపదేశించి చెప్పినవని వారి యభిప్రాయము.

ఈ విషయమై శ్రీ సురేశ్వరాచార్యులవారు నైష్కర్మ్యసిద్ధియందు చెప్పిన దాని తాత్పర్యమునుకూడ చెప్పెదను. జ్ఞానికి ఆత్మజ్ఞానముయొక్క స్వభావముచేతనే అజ్ఞానము నశించుటవలన అజ్ఞాన కార్యములగు దేహాది వాసనలు తత్త్వజ్ఞానముచేత దహింపబడినవి గనుక అతనికి చేయదగిన కార్యమొక్కటియు నుండదు. అతడు విధినిషేధముల కతీతుడని శాస్త్రము చెప్పియున్నందున తత్త్వజ్ఞానోదయ కాలమునందే అతనికి సద్యోముక్తి

Dr K Dayanandaswamy ebooks



కలిగియున్నది. త్రాటినిజూచి సర్పమని భయము జెందినవాడు అది సర్పము కాదని రజ్జువని తెలిసిన పిమ్మట సహితము కొంతకాలము వఱకు భయముచేత కలిగిన వణకును వదలలేడు. అదేవిధముగ అజ్ఞానము నశించినను జ్ఞాని రాగద్వేషాదులను కొంతకాలమువఱకు వదలజాలడు. వేరు త్రెంపబడిన చెట్టు ఏ ప్రకారము ఎండిపోయి నశియించి పోవుచున్నదో, ఆ విధముగనే తత్త్వజ్ఞానియొక్క సకల ప్రవృత్తులును క్షీణించి క్రమముగా శరీరాదులు నశించిపోవును.

ఐతే, తత్త్వజ్ఞానికి విధి నిషేధములు లేవని చెప్పినందున అతడు యథేచ్ఛాచారము కలిగి యుండునా? ఉన్న అట్లు యథేచ్ఛాచారము (నిషిద్ధకర్మాచరణము) గల తత్త్వవేత్తకును కుక్కకును భేదము లేదు. ఏలయనగా : విసర్జింపబడిన అమేధ్యమునే యిరువురు భక్షించి నట్టగునుగదా *అధర్మమువలన అనగా పూర్వజన్మమున చేయబడిన పాపాచరణమువలన ఈ జన్మమున అజ్ఞానము కలుగును. దానివలన నిషిద్ధకర్మాచరణము కలుగును. తత్త్వవేత్తకు ధర్మకార్యాచరణమునందు సహితము ఇచ్ఛ కలుగనప్పుడు అధర్మ కార్యమగు యథేచ్ఛాచారమెట్లు చేయగలుగును? ముముక్షువగు పురుషుడు మూడు లోకముల యందున్న సమస్త విషయములయందు విరక్తుడై యుండి గదా తత్త్వజ్ఞానము సాధించియున్నాడు. అట్టివాడు తత్త్వజ్ఞాన ప్రాప్త్యనంతరము విషయానురక్తు డెట్లగును? అవిద్య నశింపని కాలమునందే విరక్తుడై యున్న పురుషుడు అవిద్య నశించిన తరువాత విషయాసక్తుడు కాడని నిశ్చయము. ఎట్లనగా: ఆకలిగొన్నవాడైనను విషమును భక్షింపడుగదా? భోగ్యమైన అన్నమును భుజించి ఆకలి తీరినవాడు విషము భక్షించునా?

(నై.సి. 4-59 (108) నుండి (124) వఱకు) మఱియు

శ్లో|| రాగోలింగ మబోధస్య చిత్తవ్యాయామభూమిషు |
కుత శ్శాద్వలతా తస్య యస్యాగ్నిః కోటరే తరోః || (నై.సి. 4-67)

---

* ఈ విషయమిట్లే వేదాంత పంచదశి 4-55వ శ్లోకమున చెప్పబడినది.

Dr.K.Dayanandaswamy ebooks

తా॥ విషయాసక్తి కలిగి యుండుటయే జ్ఞానము లేదనుటకు గుర్తు ఒక వృక్షమునందు ఆకులు, కాయలు మొదలగునవి యుండి పచ్చిగా నున్నచో నా చెట్టుతొఱ్ఱలో అగ్ని యుండదు. అగ్నియున్నచో నా వృక్షము పచ్చగా నుండదు. దీని యర్థమేమన జ్ఞానియైనచో రాగద్వేషము లుండవు. రాగద్వేషము లుండినచో జ్ఞాని కాజాలడు అని చెప్పిరి. ఈ శ్లోకము వేదాంత పంచదశియందు 7-191వ శ్లోకముగ గైకొనబడినది. ఐతే శాస్త్రమునందిట్లు చెప్పబడినదని పంచదశియం దీక్రింది శ్లోకము గలదు.

**శ్లో॥ రాగాదయస్సంతు కామం న తద్భావో ఽపరాధ్యతి ।**
**ఉత్ఖాతదంష్ట్రోరగవదవిద్యా కిం కరిష్యతి?"॥**

తా॥ విషయములయందు రాగద్వేషాదు లుండినను అవి యున్నంతమాత్రముచే, తత్త్వజ్ఞానికి బాధ లేదు. అవిద్య తత్త్వజ్ఞానముచేత నశియించి యున్నందున కోరలు పెరికిన సర్పమువలె రాగాదులు తత్త్వజ్ఞానిని ఏమియు చేయజాలవు.

జ్ఞానికి రాగద్వేషములు పునర్జన్మహేతువులు కావు. ఏలయన: అవి వేయించిన విత్తనములవలె మొలకలెత్తనేరవు. అవిద్యయే పునర్జన్మహేతువు. కావున అజ్ఞానికి అవిద్యాసహిత రాగద్వేషాదులు పునర్జన్మమును కలిగించుచున్నవి.

జి : అట్లయినచో "రాగోలింగ" అను వాక్యము వ్యర్థమైనదే కదా?

వే : విద్యారణ్యులవారు పై రెండు శ్లోకములు జీవన్ముక్తి ప్రకాశికయం దుదాహరించి "రాగోలింగ"అన్న మొదటి వాక్యము "జీవన్ముక్తి పర్యంతము పరిపాకము నొందిన తత్త్వజ్ఞానము గల పురుషుని గూర్చి చెప్పబడినదనియు **"రాగాదయస్సంతు కామం"** అను రెండవ వాక్యము కేవల తత్త్వజ్ఞానిని గూర్చి చెప్పబడినదనియు చెప్పి పైరెండింటికిని పరస్పర విరుద్ధము లేదని సమర్థించిరి.

Dr K Dayanandaswamy ebooks



జి : తత్త్వజ్ఞానికి రాగద్వేషములు పునర్జన్మ హేతువులు కానప్పుడు జీవన్ముక్తునకు సహితము పునర్జన్మ హేతువులు కావుగదా? జీవన్ముక్తునకు రాగద్వేషము లుండిన తప్పేమి?

వే : నిజమే, పునర్జన్మ హేతువులు కాకపోయినను నవి యుండకూడదు. ఏలయనగా: భ్రాంతివలన రజ్జువునందు కన్పింపబడిన సర్పము కఱవక పోయినను భయమును కలిగించుచున్నది కదా? అదేవిధముగా అభాసములగు రాగద్వేషములు సహితము పునర్జన్మమును కలిగించకపోయినను బాధ కలిగించును. కనుక జీవన్ముక్తునకు అవి యుండరాదు.

తత్త్వజ్ఞానికి దేహాత్మభ్రాంతి లేకపోయినను పూర్వపు అలవాట్ల చొప్పున (ప్రారబ్ధభోగానుభవ సమయమునందు) నేను మనుష్యుడనని తలంచినను తొల్లింటి తత్త్వజ్ఞానము నశింపదు. జీవన్ముక్తు డట్లు తలంపడు. (వే.పం. 7-245, 246)

అవిద్యయును తత్కార్యమును తత్త్వజ్ఞానముచేత బాధితములైనవి. తత్కార్యములు చచ్చిన యెలుక పిల్లిని చంపజాలనట్లు; తత్త్వసాక్షాత్కార మును చెఱుపజాలవు. (వే.పం. 7-278)

ఈ చర్చలవలన తేలిన సారాంశ మేమనగా:- తత్త్వజ్ఞానోదయ కాలమునందే అనగా బోధ కలిగినప్పుడే పురుషుడు ముక్తుడగుచున్నాడు. అట్టివానికి రాగద్వేషాదు లున్నను పునర్జన్మ హేతువులు కావు. జీవన్ముక్తులకు రాగద్వేషాదు లుండవు అని శ్రీ విద్యారణ్యులవారి సిద్ధాంతము. తత్త్వజ్ఞానము కలిగినపిమ్మట రాగద్వేషాదు లుండవు. అట్లుండిన పునర్జన్మము కలదు అని శ్రీ శంకర, శ్రీ సురేశ్వరుల సిద్ధాంతము.

## (15) వైరాగ్య బోధోపరతులు

శ్రీ విద్యారణ్యులవారి మతము ననుసరించి వైరాగ్య బోధోపరతుల మూటియందును బోధ యొక్కటి కలిగినంత మాత్రముచేతనే విదేహముక్తి కలుగును.

Dr K Dayanandaswamy ebooks


వైరాగ్యము, బోధ, ఉపరతి యను నీ మూడును ప్రత్యేకములైనవి. ఇవి ఒకటొకటి కలిసి తత్త్వబోధకు తోడ్పడును. ఈ మూడును తఱచుగా కలిసియుండును. ఒకానొకనియం దీమూడును నుండవచ్చును. లేదా యిందులోనే యొక్కటి కాని రెండుకాని లేకపోవచ్చును. (వే. పం. 6-276)

హేతు, స్వరూప, కార్యము లీమూడింటికి ప్రత్యేకముగా నుండుటచేత మూడును వేఱువేఱని చెప్పియున్నారు. వాస్తవముగా నీ మూడును భిన్నములే (వే. పం. 6-277) ఎట్లనగా:

**వైరాగ్యము:** విషయములయం దనిత్యత, శరీరము బుద్బుదప్రాయమని యెఱుంగుట దీనికి హేతువు. కోరికలు లేకపోవుట విషయ సుఖములను వదలుట స్వరూపము. ఐహికములందుకాని సత్యలోకాధిపత్యము నందుకొని వాంఛ లేకుండుట కార్యము. ఇట్టి హేతు స్వరూపకార్యములు తక్కిన బోధోపరతులకు లేకుండుట, వైరాగ్యమునకు మాత్రమే యుండుట యసాధారణము లనబడుచున్నవి. (వే.పం. 6-278)

**బోధ :** అనగా తత్త్వజ్ఞానము. శ్రవణ మనన నిదిధ్యాసలు దీనికి హేతువు. కూటస్థుడును, అహంకారమును వేఱువేఱని తెలిసికొని కూటస్థుడు సత్యమనియు, అహంకారము మిథ్యయనియు నిశ్చయించుట స్వరూపము. అన్యోన్యాధ్యాస స్వరూపమగు హృదయగ్రంథి మఱల పుట్టకుండుట దీని కార్యము. (వేపం. 6-279)

**ఉపరతి :** యమ నియమాదులు హేతువులు. చిత్తము ఏకాగ్రత నొందుట దీనికి స్వరూపము. లోక వ్యవహారము లేకుండుట కార్యము. (వే.పం. 6-280)

శ్లో॥ **"తత్త్వబోధః ప్రధానం స్యాత్సాక్షాన్మోక్ష ప్రదత్వతః ।**
**బోధోపకారిణౌ వేతౌ వైరాగ్యో పరమావుభౌ"॥** (వే.పం. 6-281)

తా॥ వైరాగ్యము, బోధ, ఉపరతి ఈ మూడింటిలో బోధ (తత్త్వజ్ఞానము) మోక్షమును కలుగజేయును కనుక ముఖ్యము. వైరాగ్యోపరతులు రెండును బోధకు సహాయకారులు కనుక అముఖ్యములు.

బోధ లేకయే తక్కిన రెండున్నను, నాతడు ముక్తుడు కాజాలడు.

Dr K Dayanandaswamy ebooks



అవి తపస్సు కనుక పుణ్యలోక ప్రాప్తిమాత్రము కలుగును. (వే. పం. 6-283)

**శ్లో॥ పూర్ణే బోధే తదన్యౌ ద్వౌ ప్రతిబద్ధౌ యథా తథా ।**
**మోక్షో వినిశ్చితః కింతు దృష్ట దుఃఖం న నశ్యతి ॥** (వే.పం.6-684)

తా॥ బోధ (తత్త్వజ్ఞానము) పరిపూర్ణముగా నుండగా, ఆ తత్త్వజ్ఞానము కంటెను వేరైన వైరాగ్యోపరతులు రెండును లేకపోయినను మోక్షము తప్పక వచ్చును. కాని ప్రారబ్ధకర్మ ననుభవించుచుండెడు దుఃఖము నశింపదు.*

శ్రీ విద్యారణ్యులవారు ఇచ్చట వైరాగ్యమునకు ప్రాముఖ్య మివ్వక పోయినను సాధన చతుష్టయమునందు వైరాగ్యము చేరియున్నందున ఆరంభమునందే వైరాగ్యము కలిగి యుండవలెనని, లేదేని శ్రవణాదుల కనర్హుడని భావింపవచ్చును.

వైరాగ్యమున కవధి-సత్యలోకాధిపత్యము నొసంగెదమని చెప్పినను నిరాకరించుట.

బోధకవధి-మూఢుడు దేహమే తానని అజ్ఞానదశ యందెట్లు నమ్మియుండునో, అట్లు ఆత్మస్వరూపమే నేననెడి దృఢనిశ్చయము కలిగియుండుట.

ఉపరతి కవధి-లోకవ్యవహారములను మఱచి గాఢముగా నిద్రించు వానివలె నుండుట. ఇందులో నేది యెంతవఱకు కలిగి యుండునో తన బుద్ధికే విశదమగును. (వే.పం. 6-285-286)

---

* ఈ విషయమున "శ్రీ సీతారామాంజనేయ సంవాదము" గ్రంథకర్త విద్యారణ్యులవారి ననుసరించిరి.

కం॥ "అక్షర తత్త్వజ్ఞానము
సాక్షాన్మోక్షప్రదంబు సంసారిక దుః
ఖక్షయకరమగు దక్కిన
లక్షణములు సుఖకరములు లలితాత్ములకున్."

Dr K Dayanandaswamy ebooks

శంకరులవారును పైమూడింటికిని అవధి పైవిధముగనే చెప్పియున్నారు. కాని వైరాగ్య బోధోపరతులను గుఱించిన విద్యారణ్యుల పై యభిప్రాయముకంటెను శంకరులవారి యభిప్రాయము భిన్నముగ నున్నది.

శ్లో॥ "వైరాగ్యస్య ఫలం బోధో బోధస్యోపరతిః ఫలమ్ ।
స్వానందానుభవాచ్ఛాన్తి రేషైవోపరతేః ఫలమ్" ॥ (వి.చూ. 420)

తా॥ సంపూర్ణవైరాగ్యమునకు ఫలము బోధ. అనగా: ఆత్మజ్ఞానము. బోధకు ఉపరతి ఫలము. స్వస్వరూపానందానుభవము వలన కలుగు పరమశాంతి. (చిత్తశాంతి)

శ్లో॥ యదుత్తరోత్తరాభావః పూర్వ పూర్వం తు నిష్ఫలమ్ ।
నివృత్తిః పరమా తృప్తి రానన్దోఽనుపమః స్వతః ॥ (వి.చూ. 421)

తా॥ వైరాగ్యము కలిగి బోధ కలుగని యెడల వైరాగ్యము నిష్ఫలమగును. వైరాగ్యబోధలు రెండును కలిగియుండియు, ఉపరతి కలుగనియెడల వైరాగ్య బోధలు రెండును నిష్ఫలము లగును. ఈ మూడును కలిగి యుండియు, శాంతి కలుగని యెడల పై మూడును నిష్ఫలము లగును. శ్రుతిసహిత మిట్లే చెప్పినది. *విషయవాసనా నివృత్తియే శాంతి. అట్లు కానియెడల మఱల వాసనలు మొలకెత్తునని వారి తాత్పర్యము.

శ్లో॥ వైరాగ్య బోధౌ పురుషస్య పక్షివత్
పక్షౌ విజానీహి విచక్షణత్వమ్।
విముక్తి సౌధాగ్రతలాధిరోహణమ్
తాభ్యాం వినా నాన్యతరేణ సిద్ధ్యతి ॥ (వి.చూ. 375)

తా॥ పక్షికి రెండుఱెక్కలు ఎట్లవసరమో అట్లు మోక్షసౌధమున కెగురుటకు పురుషునకు వైరాగ్యబోధలు రెండును ఱెక్కలవంటివి. పక్షికి

* వివేక చూడామణి యందలి 420, 421 శ్లోకములు అధ్యాత్మోపనిషత్తునందున్నవి.

Dr K Dayanandaswamy ebooks


నౌకతెక్క లేనియెడల నది యెట్లెగురజాలదో, యట్లే వైరాగ్యబోధలలో నేది లోపించినను మోక్షము సిద్ధింపదు.

శ్లో॥ అత్యంత వైరాగ్యవతస్సమాధి
స్సమాహితస్యైవ దృఢప్రబోధః ।
ప్రబుద్ధతత్త్వస్య హి బంధముక్తి
ర్ముక్తాత్మనో నిత్యసుఖానుభూతిః ॥ (వి.చూ. 376)

తా॥ అధికమైన వైరాగ్యవంతునకే సమాధి కలుగును. సమాధియందు నిలిచినవానికే దృఢమైన బోధ కలుగును. దృఢబోధ కలవాడే బంధవిముక్తు డగును. బంధవిముక్తునకే శాశ్వతానందానుభవము కలుగును.

మోక్షసౌధమునకు వైరాగ్యము ద్వారము వంటిది. ద్వారమునందు ప్రవేశింపలేనివాడు సౌధములోనికి పోనేరనట్లు వైరాగ్యము లేనివాడు మోక్షమును పొందలేడు. (వి.చూ. 376)

వైరాగ్యము లేకపోయినచో జ్ఞానమునకు ప్రమాదమని శంకరులవారి మతము. జ్ఞాని నిరంతరము బ్రహ్మనిష్ఠాపరుడై యేమరక యుండవలయును. ఎప్పుడైనను చిత్తము బ్రహ్మలక్ష్యమునందుండి విషయములపైకి మరలిన యెడల ప్రమాదమే యని శ్రీశంకరులవారు చెప్పియున్నారు.

శ్లో॥ లక్ష్యచ్యుతం చేద్యది చిత్త మీష
ద్బహిర్ముఖం సన్నిపతే త్తతస్తతః ।
ప్రమాదతః ప్రచ్యుత కేలికన్దుకః
సోపానపఙ్క్తౌ పతితో యథా తథా ॥ (వి.చూ. 3)

తా॥ ప్రమాదవశమున చేయిజారి సోపానాగ్రము నందు పడిన బంతి ప్రతి సోపానము మీదను దొర్లుచు క్రిందికి వచ్చి పడునట్లు, లక్ష్యచ్యుతుడైన జ్ఞాని క్రమముగ విషయాసక్తుడై నానాటికి పతితుడై యధోగతి పాలగును.

చిత్తమునకు నొక్క క్షణమైనను విషయప్రసక్తి కలిగిన యెడల దానిని చింతించుటద్వార విషయాసక్తి కలుగును. అందువలన కామము కలుగును. అందువలన భోగములయందు ప్రవృత్తి కలుగును. (వి.చూ.327)

Dr K Dayanandaswamy ebooks



బ్రహ్మలక్ష్యమునుండి మనస్సు జారినయెడల ఆత్మస్వరూపమునకు భ్రంశము కలుగును. అట్లు భ్రంశమైన పిమ్మట తిరిగి లక్ష్యమునందు కుదురుకొనుట దుస్తరము. కనుక సకలానర్థ హేతువగు సంకల్పమునకు చోటివ్వరాదు. (వి.చూ. 328)

సకల రాజ్యభోగములను త్యజించి బ్రహ్మనిష్ఠయందున్న భరతు డొకలేడిపిల్లమీద కరుణగలవా డగుటచే క్రమముగ దానియందు చిత్తము తగులుకొని తిరిగి లేడియై జన్మింపవలసి వచ్చెను. హరిణజన్మమునందు ముక్తి సాధించుట సాధ్యముకాదు కనుక మఱియొక జన్మమున (బ్రాహ్మణ కుటుంబమునందు జడభరతుడుగ జన్మించి) ముక్తి సాధించెను.

## (16) జ్ఞానియొక్క లోకవ్యవహారము

జి : జ్ఞానులైన జనకాదులు ప్రక్చందన వనితాది భోగముల ననుభవించుచుండిరని శాస్త్రములయందు చెప్పిరిగదా? వీరి విషయ మేమందురు?

వే : వేదాంత పంచదశి (11వ ప్రకరణము) యోగానంద ప్రకరణము 127, 128, 129, 130వ శ్లోకముల యందలి భావమిది. పతివ్రతయగు స్త్రీ పతితో సహగమనము చేయుటకు పోవుచు నలంకరించుకొనును. ఆమెకు ఆసక్తి లేనట్లే బ్రహ్మనంద మనుభవించు యోగికి విషయానందమునం దాసక్తి లేకయే అనుభవించును. కాకికి రెండు కన్నులున్నను దానికి చూపుమాత్ర మొక్కటే. ఒక కంటితో చూచినపుడు మఱియొక కంటితో చూడదు. రెండుభాషలు తెలిసినవాడు నొకకాలమునందొక భాషతోనే మాట్లాడును. అట్లే యోగి సమాధియం దున్నప్పుడు బ్రహ్మనందమును, విక్షేపదశయందు (అనగా సమాధినుండి లేచినపుడు) విషయసుఖము ననుభవించుచున్నాడు.

జి : "లక్ష్యచ్యుతం" అన్న శంకరులవారి శ్లోకమునందలి యర్థము బ్రహ్మలక్ష్యమునుండి జారినవాడు పతితు డగునని యిదివఱలో చెప్పితిరి. దానికిని పైఅభిప్రాయమునకును విరోధము సంభవించును కదా?

Dr K Dayanandaswamy ebooks



వే : విద్యారణ్యుల వారు ఈ విషయమును తృప్తిదీప ప్రకరణమున ఇట్లు చెప్పిరి. ప్రారబ్ధకర్మయొక్క ప్రాబల్యముచేత జ్ఞానికి విషయభోగములందు కోరిక కలిగినయెడల జ్ఞాని నరకబాధను పొందినట్లు దుఃఖపడుచునే అట్టి భోగములను అనుభవించుచున్నాడు. (7-143). గురు, వేదాంత వాక్యములందు శ్రద్ధ కలిగియుండియు దారపుత్రాదులతో కూడియున్న గృహస్థులగు జ్ఞానులు, ప్రారబ్ధకర్మఫల మనుభవించుచున్న వారయ్యును మా కింకను ప్రారబ్ధకర్మ క్షయింప లేదేయని దుఃఖపడుదురు- (7-144)

జ్ఞానులకు దుఃఖముండదు కదా? యనిన, అది భ్రాంతి మూలకమగు సంసార దుఃఖము కాదని, అది విరక్తివలన కలిగినది కనుక బంధహేతువు కాదని సమాధానము చెప్పబడెను. (7-145)

ఇది వఱకు కర్మవిపాకమునుగుఱించి చెప్పిన సందర్భమున ప్రారబ్ధము మూడు విధములని చెప్పియుంటిని. *ఇచట మఱల సంగ్రహించి చెప్పెదను. (1) ఇచ్ఛా ప్రారబ్ధము (ఇచ్ఛను పుట్టించునది) (2) అనిచ్ఛా ప్రారబ్ధము (తానిచ్ఛగింపకయే భోగమును పుట్టించునది) (3) పరేచ్ఛా ప్రారబ్ధము (పరుల సంకల్పముచేత భోగమును నిచ్చునది). ఇట్టి ప్రారబ్ధాధీనమై భోగము ననుభవించుట జ్ఞానికి దోషము కాదు. (7-152)

ఇట్టి భోగానుభవము వలన **కలిగిన సుఖదుఃఖాదులు అగ్ని తప్తములైన విత్తనములు భుజించుటకేగాని మొలకలెత్తుట కుపయుక్తములు కాజాలనట్లు యోగికి పునర్జన్మ హేతువు కాజాలవని శాస్త్రము సమాధానము చెప్పినది. (7-164)

జ్ఞాని నేను కర్తను గాను! భోక్తను గాను, ప్రారబ్ధానుసారముగ వ్యవహారము ప్రవర్తించుగాక!అను నిశ్చయము కలిగియుండును. (7-267)

---

* బ్రహ్మజిజ్ఞాస 1-2-18 కర్మసిద్ధాంతమును చూడుడు.

** భోగమనగా సుఖదుఃఖానుభవము.

Dr K Dayanandaswamy ebooks


తత్త్వజ్ఞానమునకు పూర్వము అవిద్యతో పోరాడి దానిని జయించిన పురుషుడు తిరుగ అవిద్యచేత జయింపబడడని చెప్పబడెను. దీని సారాంశ మేమన జ్ఞాని కర్తృత్వాభిమానములేక చేసిన యెట్టికర్మయైనను అతనిని బంధింపజాలవు.

జి : జ్ఞానిని గుఱించి శ్రీ శంకర, శ్రీ విద్యారణ్యుల వారి యభిప్రాయములు తెలిపితిరి. అందేది శ్రేష్ఠమైనదని తమ అభిప్రాయము?

వే : భరతుడు హరిణజన్మ మెత్తిన దృష్టాంతము శ్రీశంకరులవారి అభిప్రాయమును బలపరచుచున్నది. జనకాదులు జ్ఞానులయ్యును రాజ్యపాలనము చేసిరనియు, వసిష్ఠమహాముని పుత్రవియోగమును సహింపలేక యాత్మహత్యచేసికొన ప్రయత్నించెనని మహాభారతమున చెప్పియుండుట వలనను, యాజ్ఞవల్క్యులు మొదలగువారు గృహస్థులై యుండి ధనార్జనము చేసియుండుటయు - మొదలగు దృష్టాంతములు విద్యారణ్యులవారి యభిప్రాయమును బలపరచుచున్నవి.

యాజ్ఞవల్క్యాదులు జ్ఞానులు కారని, వారికి బ్రహ్మానుభవము కలిగియుండలేదని చెప్పినచో అట్టివారి వాక్యములే శాస్త్రములై యున్నవి గనుక వాటిని నమ్మి ఆమార్గమున నడచిన మనము సంసారమునుండి తరింపలేముగదా! సంప్రదాయజ్ఞులగు పెద్దలు 'నారాయణం పద్మభవం వసిష్ఠమ్' అని గురుపరంపర స్తోత్రము చేయుచున్నారుగదా? వసిష్ఠమహర్షి సామాన్య పామరునివలె పుత్రశోకము ననుభవించినట్లున్నది. ఇట్టి పరస్పర విరుద్ధములను తొలగించుటకే విద్యారణ్యుల వారు జ్ఞానులను విదేహముక్తులని, జీవన్ముక్తులని విభజించి మొదటివారికి వాసనాక్షయ మనోనాశములు కలుగలేదు గనుక వారికి రాగద్వేషాదులు గలవని, రెండవవారికి వాసనాక్షయ మనోనాశములు కలిగియున్నందున రాగద్వేషాదులు లేవని ఇరువురు ముక్తపురుషులేయని తీర్మానించిరి. వెనుక తరమువారు చేసిన కార్యములయందున్న లోపములను ముందుతరమువారు దిద్దుకొని పోవునట్లు, తత్త్వశాస్త్రమునందు సహితము వెనుకటివారు సంశయనివారణ చేయని సమస్యలను తరువాత వచ్చెడివారు చేయుచుపోయిన సంగతి చరిత్ర ప్రసిద్ధమే.

Dr K Dayanandaswamy ebooks

వైరాగ్యోపరతులు లేకయే బోధ (ఆత్మతత్త్వజ్ఞానము) కలుగుననియు వైరాగ్యోపరతులతో నిమిత్తము లేకయే బోధమాత్రముచే పురుషుడు ముక్తుడు కావచ్చుననియు చెప్పిన విద్యారణ్యులవారి వాక్యములు (సిద్ధాంతము) వారి తదనంతర వేదాంతులలో కొందఱు క్రొత్తమార్గమును త్రొక్కుటకు తోడ్పడినవి. అదియెట్లో ముందు **అచలమతమును** గుఱించి చెప్పునప్పుడు తెలిపెదను.

జి : తత్త్వజ్ఞాని వాసనాక్షయ మనోనాశములు సాధించిననే జీవన్ముక్తు డగునంటిరి. వాసనాక్షయ మనోనాశము లెట్లు సాధింపవలయునో ఆనతిండు.

## (17) తత్త్వజ్ఞాన వాసనాక్షయ మనోనాశములు

తత్త్వజ్ఞాన వాసనాక్షయ మనోనాశములు ఏకకాలమునందే సాధింపవలసియున్నవి.

**మం॥ వాసనాక్షయ విజ్ఞాన మనోనాశా మహామతే ।**
**సమకాలం చిరాభ్యస్తా భవంతి ఫలదా మతాః ॥**

(అన్నపూర్ణ - ముక్తిక)

తా॥ వాసనాక్షయ తత్త్వజ్ఞాన మనోనాశములు ఏకకాలమునందే యభ్యసింపవలయును. కాలభేదముచేత నొకటి యొకప్పుడును, మరియొకటి యింకొకప్పుడును సాధించుటకు సాధ్యపడదు.

కారణమేమన ఇవి ఒకదానికొకటి కార్యకారణములై యున్నవి. ఈ మూడుసాధనములలో రెంటిని కార్యకారణములుగ చేర్చిన మూడు ద్వంద్వము లేర్పడును. ఈ మూడింటిని ఈ క్రింది విధముగ విభజించి యున్నారు.

1. **వాసనాక్షయ మనోనాశములు.**
2. **వాసనాక్షయ తత్త్వజ్ఞానములు.**
3. **మనోనాశ తత్త్వజ్ఞానములు.**

Dr K Dayanandaswamy ebooks


పైన చెప్పిన మూడు ద్వంద్వములలో మొదటిది :

1. వాసనాక్షయ మనోనాశములు : వాసనాక్షయము కారణము, దాని కార్యము మనోనాశము. అనగా: వాసనాక్షయము కలుగనిదే మనోనాశము కలుగదు. మఱియొక పక్షమున, మనోనాశము కలుగక వాసనాక్షయము కలుగదు. అందువలన మనోనాశము కారణము, వాసనాక్షయము దానికి కార్యము. ఇట్లే తక్కిన రెండు ద్వంద్వముల యందున్న రెండును ఒకదానికొకటి కార్యకారణములని యెఱుగవలయును. కనుక ఇవి యన్నియును ఒక్కసారిగనే యభ్యసింపవలయును. కాలభేదముచేత అభ్యసించినయెడల నూఱు సంవత్సరములకైనను మోక్షము సిద్ధింపనేరదు. మఱియును వీనిని చిరకాల మభ్యసింపవలయును.

వాసనలు (పూర్వసంస్కారములు) బీజరూపమై అంతఃకరణమందు వసించుచుండి మనస్సును విషయములకొఱకు ప్రేరేపించుచుండును. అందువలన చిత్తము నేకాగ్రతను పొందనీయక వాసనలు ప్రేరేపించుచుండును. వాసనాక్షయమైన యెడల మనస్సు శుద్ధమై వృత్తిరూపమగు పరిణామమును విడిచి నిరోధరూపముగ పరిణమించును. అదియే మనోనాశము. మనోనాశ మగుటవలన నిరోధసంస్కార మధికమై శుద్ధమైన మనస్సునందు రజస్తమోగుణములు అల్పమై సత్త్వగుణాధిక్యముచే వాసనలు నశించును. కనుక వాసనాక్షయ మనోనాశములు రెండును నొక ద్వంద్వముగ నేర్పడినవి. ఇవి ఒక దానినొకటి పోషించుకొనునట్టివి.

2. వాసనాక్షయ తత్త్వజ్ఞానములు : వాసనాక్షయ మైనప్పుడు చిత్తము శుద్ధమై యుండును. కనుక, వాసనాక్షయము వలన శుద్ధమైన చిత్తమునందు తత్త్వజ్ఞానము పుట్టుచున్నది. తత్త్వజ్ఞానము కలుగుటవలన మనస్సు విషయములనుండి నివర్తింపబడినదై సాధకుడు సర్వమును బ్రహ్మస్వరూపముగ చూచుచున్నాడు. అప్పుడు హృదయగ్రంథి భేదింపబడుచున్నది. అట్టివాని అంతఃకరణమునందు వాసనలు నశించుచున్నవి. అందువలన వాసనాక్షయ తత్త్వజ్ఞానములు రెండును ఒక ద్వంద్వముగ నేర్పడినవి. ఇవి యొకదాని నొకటి పోషించుకొనునట్టివి.

Dr K Dayanandaswamy ebooks



3. **మనోనాశ తత్త్వజ్ఞానములు** : మనస్సు నశించుట అనగా: చంచలమగు మనస్సు దాని చంచలత్వముడిగి శుద్ధమై వృత్తిరూపమగు పరిణామమును విడిచి ఏకాగ్రత నొందుట. అట్టి స్థితియందు మనస్సు లేదని చెప్పుదురు. ఏలయన: సంకల్ప వికల్పములే మనస్సు. అచట సంకల్ప వికల్పములు లేనందున మనస్సు నశించినదని చెప్పబడుచున్నది. మనస్సువలననే ద్వైతప్రపంచము కనబడుచున్నది. ద్వైతము నశించినపుడు మిగిలియున్నది అద్వితీయబ్రహ్మ మొక్కటియే. అందువలన, మనోనాశమువలన తత్త్వజ్ఞానము కలిగినదనియు, తత్త్వజ్ఞానమువలన మనోనాశము కలిగినదనియు చెప్పుచున్నారు. ఇట్లు మనోనాశ తత్త్వజ్ఞానములు రెండును ఒక ద్వంద్వముగ నేర్పడినవి. ఇవి యొకదానినొకటి పోషించుకొనునట్టివి. ఇప్పుడు వీటిని సంగ్రహముగ చెప్పితిని. తరువాత విశదముగ వివరింతును.

జి : విదేహముక్తునకు తత్త్వజ్ఞానము మాత్రమే కలుగునని చెప్పుదురుకదా? వాసనాక్షయ మనోనాశములు లేకయే తత్త్వజ్ఞాన మెట్లు కలుగును?

వే : తత్త్వజ్ఞానము కలిగినపుడు విదేహముక్తునకు సహితము వాసనాక్షయ మనోనాశములు కలిగియుండవలయును. కాని, అది తాత్కాలికము మాత్రమే. మఱల వాసనలును మనస్సును విజృంభింపవచ్చును. అందువలన తత్త్వజ్ఞానమునకు కూడ బాధ కలిగినను కలుగవచ్చును. కనుకనే మొదట కలిగిన తత్త్వజ్ఞానమును దృఢపఱచుట (రక్షించుకొనుట) కొఱకు వాసనాక్షయ మనోనాశములు పూర్తిగ సాధింపవలయును. అందుకొఱకు తత్త్వజ్ఞానులగు వారిలో కొందఱు విద్వత్సన్న్యాసమును తీసికొందురు. యాజ్ఞవల్క్యుడు తత్త్వజ్ఞానియై యుండియు భార్యలను వదలి వాసనాక్షయ మనోనాశములను స్థిరపఱచుట కొఱకు విద్వత్సన్న్యాసమును గైకొని తపస్సునకు పోయెనని చెప్పబడినది. తాత్కాలికముగ సిద్ధించిన వాసనాక్షయ మనోనాశములను స్థిరపఱచుట కొఱకు జ్ఞానభూమికలయందు నాలుగవ భూమికను సాధించిన తత్త్వజ్ఞాని తక్కిన భూమికలను సాధించుటకు కృషిచేయును.

Dr K Dayanandaswamy ebooks



జి : వాసనాక్షయ మనోనాశములను సంపాదింపకున్న అదివఱకు సంపాదింపబడిన తత్త్వజ్ఞానము నశించునా?

వే : తత్త్వజ్ఞానము ఒకసారి పుట్టినయెడల దానిచేత నివర్తింపబడిన అవిద్య తిరిగి పుట్టనేరదనియు; వాసనాక్షయ మనోనాశములన్నచో తత్త్వజ్ఞానము సంపాదింపబడిన కాలమునందు తాత్కాలికముగ సంపాదింపబడినను దృఢాభ్యాసము లేకపోయిన యెడల ప్రారబ్ధకర్మవలన కలుగు సుఖదుఃఖములచేత బాధింపబడుచున్నవై నశింపవచ్చుననియు శాస్త్రములు చెప్పుచున్నవి.

జి : తత్త్వజ్ఞానము కలిగినప్పుడే వాసనాక్షయ మనోనాశములు దృఢతరముగ సిద్ధించినవారు లేరా?

వే : బ్రహ్మజ్ఞానాధికారులు 'కృతోపాస్తి' యని 'అకృతోపాస్తి' అని రెండువిధములుగ నుందురు. ఒకానొకరు ఉపాసనముచేసి యుపాస్యవస్తు సాక్షాత్కారమైన వెనుక తత్త్వజ్ఞాన సంపాదనకొఱకు శ్రవణ మననాదులయందు ప్రవర్తించి తత్త్వజ్ఞానియైన యెడల అతనికి తత్త్వజ్ఞానముతో కూడ వాసనాక్షయ మనోనాశములు దృఢతరముగ సిద్ధించును. అట్టి అధికారి ఉపాసనకాలమందు వాసనాక్షయ మనోనాశములను సాధించియుండుటయే అందుకు కారణము. ఇతనిని 'కృతోపాస్తి' యని యందురు. ఇతనినే ముఖ్య జ్ఞానాధికారి యనికూడ నందురు. ఉపాసనము చేయకయే తత్త్వజ్ఞానమును సంపాదించియుండు నట్టివానిని 'అకృతోపాస్తి' అని యందురు. ఇతడు వాసనాక్షయ మనోనాశములను సాధింపవలసియున్నది. వాసనాస్వరూపము తెలిసినగాని వాటి నివృత్తి సాధ్యపడదు గనుక వాసనలను గుఱించి తెలిసికొనవలయును.

## (18) వాసనలు

ముందువెనుక లాలోచింపక, యుక్తాయుక్తములు విచారింపక హఠాత్తుగ మానవుని చిత్తమునందు కలుగు క్రోధాది వృత్తులకు కారణమై చిత్తమునందుండు (పూర్వ) సంస్కార విశేషములు వాసనలు. పూర్వపూర్వాభ్యాసములచేత నాసంస్కారములు చిత్తమందు

Dr K Dayanandaswamy ebooks



వసించియుండును. కనుక వీటికి వాసనలని పేరు కలిగినది. ఇవి రెండు విధములు (1) శుద్ధవాసనలు. (2) మలినవాసనలను దుర్వాసనలనియును చెప్పుదురు. శుద్ధవాసనలు ముక్తికి తోడ్పడుచున్నవి. మలినవాసనలు పురుషుని సంసారమున బంధించుచున్నవి.

**శుద్ధవాసనలు :** ఇవి కరుణ, మైత్రి, ముదిత, వేదాంత శ్రవణము, సత్పురుషుల సాంగత్యము మొదలగునవి. వీటికి శుభవాసనలని పేరుగలదు. ఈశుభవాసనలను గీతయందు 16వ అధ్యాయములో చెప్పబడిన దైవసంపద లక్షణములతో పోల్చవచ్చును. ఇవి వాసనలే యైనను త్యజింపవలసినవే యయినప్పటికిని వీటి సహాయముతో ముముక్షువు మలినవాసనల నిర్మూలించుటచే నివి పరంపరా ముక్తికి కారణము లగుట వలన సిద్ధావస్థను పొందువఱకును విడువరానివి. సిద్ధావస్థను పొందినప్పటికి కరుణ, మైత్రి మొదలగునవి ఈశ్వర సంబంధమైనవి గనుక యివి వదలవని పెద్దలందురు. వేయించిన విత్తనములు మఱల మొలకలెత్తుటకు సమర్థములు గాక, భుజించుటకు మాత్రమే యెట్లుపయోగపడునో, ఆ విధముగ శుద్ధవాసనలు పునర్జన్మ హేతువులు గాక పరబ్రహ్మప్రాప్తికి సాధనములై యున్నవి.

**మలినవాసనలు :** ఇవి మూడువిధములై యున్నవి.

**మం॥ లోకవాసనయా జంతో శ్శాస్త్ర వాసనయాஉపి చ ।**
**దేహవాసనయా జ్ఞానం యథా తన్నైవ జాయతే॥**

(ముక్తి 2-7)

తా॥ (1) లోక (2) శాస్త్ర (3) దేహవాసనా త్రయముతో కూడుకొన్న మనస్సు గలవానికి బ్రహ్మజ్ఞానము కలుగజాలదు. లోక, శాస్త్ర, దేహ వాసనలను నీ మూడింటిని మలిన (అశుభ) వాసనలని యందురు. వీటి స్వరూపాదు లిట్టివి.

(1) **లోకవాసన :** భిన్నభిన్న మనస్తత్త్వములు గల లోకమునందలి జనులందఱికిని అనుకూలముగ నడుచుటకును, అందఱిని తృప్తి పఱచుటకును ప్రయత్నించుట. ఈ కార్య మసాధ్యమైనది గనుక దీనిని

Dr K Dayanandaswamy ebooks

మలినవాసన యని చెప్పిరి. తత్త్వజ్ఞాని తుల్యనిందాస్తుతియై యుండవలయును. లోకు లేమనుకొన్నను పెద్దలనుష్ఠించిన ధర్మమార్గమున నడచుటుచితము.

(2) **శాస్త్రవాసన** : శాస్త్రవాసన యనునది (1) పాఠ్యవ్యసనమనియు, (2) బహుశాస్త్రవ్యసనమనియు, (3) అనుష్ఠాన వ్యసనమనియు మూడువిధములు.

1. **పాఠ్యవ్యసనము** : వేదములు, తర్కము, వ్యాకరణము, ఛందస్సు మొదలగు శాస్త్రముల నభ్యసించుట తప్పుకాదు. కాని, పరమపురుషార్థమగు మోక్షమునకు సాధనమగు బ్రహ్మవిద్యకు నివి యెంతవఱకు తోడ్పడగలవో అంతవఱకే వీటి నభ్యసింపవలయును. వేదాంతశ్రవణము చేయక వేదశాస్త్ర పఠనమునందే కాలము గడుపుచుండుట పాఠ్యవ్యసన మనబడును.

2. **బహుశాస్త్ర వ్యసనము** : శాస్త్రమువలన సూక్ష్మమగు బ్రహ్మము నెఱుంగక నిరంతరము అనేక శాస్త్రములు చదువుచుండుట. ఇందుకు దృష్టాంతముగ దుర్వాసుని కథ చెప్పబడినది:-

పూర్వము దుర్వాసుడను ముని శాస్త్రగ్రంథము లన్నిటిని సంపాదించి వాటిని తీసికొని కైలాసమునకు సాంబశివుని దర్శించుటకు పోయెను. అచటనున్న నారదమహర్షి యతనిని జూచి "నీ వీగ్రంథములన్నియు మోయుచున్నావు. వీటి సారాంశము నీ వెఱుంగవు. కస్తూరి, కర్పూరాది సుగంధ ద్రవ్యములను మోయు గాడిదకును నీకును భేదము లే"దని చెప్పగా దుర్వాసు డా గ్రంథములను పరిత్యజించి సాంబశివుని శరణుపొంది యాయన అనుగ్రహమున బ్రహ్మవిద్యను పొందెనని కావషేయగీతలయందు ఒక గాథ కలదట.*

పై యంశమే పూర్వులచే నిట్లు చెప్పబడెను.

శ్లో॥ "చతుర్వేదోఽపి యో విప్రః సూక్ష్మం బ్రహ్మ న విందతి ।
వేద భారభరాక్రాంతః స వై బ్రాహ్మణ గార్దభః"॥

* ఈ కథ జీవన్ముక్తి ప్రకాశికయందు చెప్పబడినది.

Dr K Dayanandaswamy ebooks



తా॥ ఏ విప్రుడు నాలుగు వేదముల నధ్యయనము చేసియు, సూక్ష్మమైన బ్రహ్మము నెఱుంగడో, వాడు వేదగ్రంథభారమును మోయు బ్రాహ్మణ గార్దభమై యున్నాడు.

ఈ యర్థమునే సనత్సుజాతుడు ధృతరాష్ట్రునితో చెప్పినట్లు సనత్సుజాతీయమునందును గలదు.

3. **అనుష్ఠాన వ్యసనము** : కొందఱు మడుగని, తిథివారనక్షత్రాదుల యందు చేయవలసిన యనుష్ఠానములని, యవి చేయకపోయినచో పాపమో లేక యేదేని యనర్థమో కలుగునని భయపడి కాలమంతయు వీటి కొఱకై వ్యర్థము చేయుచుందురు. ఇందువలన నిది బ్రహ్మవిద్యకు ప్రతిబంధకమే యగును. దీనిని కర్మవాసనయని కూడ అందురు. ఇందుకు దృష్టాంతముగ నిదాఘుని గాథ చెప్పబడినది.

ఋభుమహాముని శిష్యుడైన నిదాఘుడను విప్రుడు సమస్త వేదాంగములు చదివి గృహస్థుడై కర్మల నాచరించుచుండగ ఋభు మహాముని యాతనికి బ్రహ్మవిద్యను బోధింపదలచి యతనికడకు పోయి కొన్ని యుపాయములచే బ్రహ్మవిద్య నుపదేశించి యింటికి వెడలిపోయెను. కొంతకాలమునకు శిష్యునియందు కరుణ గలవాడై తిరిగి శిష్యునియొద్దకు పోయి చూడగ నాతడు కర్మానుష్ఠానమునందే యాసక్తి కలవాడై యుండుట చూచి తిరిగి యాతనికి బ్రహ్మవిద్య నుపదేశించినట్లు విష్ణుపురాణమునందు కలదు. ఇందువలన మూడు విధములగు నీ శాస్త్రవాసనకూడ జన్మహేతు వగుటవలన మలినవాసనలలో చేర్పబడినది.

కొందఱు వేదాంత మనుపేర శాస్త్రవిరుద్ధమైన ప్రసంగములు చేయుచుందురు. వారితో ఎవరైన తెలిసినవారు 'ఇది శాస్త్రవిరుద్ధమ'ని వేదాంత శాస్త్రప్రమాణములు చూపి చెప్పినచో అట్టి హితము చెప్పిన వారిని చూచి "ఇదిగో నీకు శాస్త్రవాసన పట్టిన"దని అధిక్షేపించుచుందురు. శాస్త్రవాసన యననేమో వారికి తెలియదు. వేదాంత శాస్త్రపఠనము, వేదాంతశాస్త్రమును ఇతరులకు బోధించుట, ఒకరితో ఒకరు చర్చించుకొనుట-యివి శాస్త్ర వాసనలో చేరవు. ఇది యొక తపస్సు. వీనిని జ్ఞానాభ్యాసమని

Dr K Dayanandaswamy ebooks



యందురు. జ్ఞానభూమికలలో రెండవ భూమికలో చేరును. దీనిని మలినవాసన యని చెప్పకూడదు. ఇది శుద్ధవాసనలలో చేరును. సిద్ధావస్థ చెందిన పురుషునకు శాస్త్రములతో పనిలేదు.

3. దేహవాసన : ఇది మూడు విధములు (1) దేహాత్మత్వభ్రాంతి (2) గుణాదానభ్రాంతి (3) దోషాపనయనభ్రాంతి.

(1) దేహాత్మత్వ భ్రాంతి : దేహమే నేను, నేను వేఱు దేహము వేఱు కాదు. చైతన్య మీ దేహమునందే పుట్టినది. దేహి, దేహము దేహమేయను భ్రాంతి- ఇది శాస్త్రజ్ఞానము లేని వారియందును శాస్త్రజ్ఞానము కలిగిన లోకాయత, చార్వాకాదుల యందును కలదు. దేహాత్మవాదము అనగా: దేహమే నేనను నమ్మకము గలవారికి వేదాంత ప్రసంగములతో అవసరము లేదు. ఏలయన దేహము నశించునట్టిది. ఇది ప్రపంచమునం దందఱెఱిగిన సత్యము. దేహనాశముతో సమస్తమును నశించిపోవు నెడల పుణ్య పాపములతోగాని అధ్యాత్మ విచారముతోగాని యవసరము లేదు. శాశ్వతమైన వస్తువునకే ముక్తి. మరణముతో నశించునట్టి దానికి ముక్తితో పనిలేదు. కనుక అధ్యాత్మశాస్త్రము దేహాత్మవాదము అను నీ రెండును చీకటి వెలుతురులవలె పరస్పరము విరుద్ధమైనవి. ఇందులో ఒకటి యున్నచో మఱియొకటి యుండదు. దేహాత్మవాదమును మహాత్ము లనేకులు అనేక విధములుగ ఖండించియున్నారు. *ఈ విషయము 'అచలవాదము'ను గుఱించి చెప్పునప్పుడు వివరింతును.

2. గుణాదాన భ్రాంతి : లోక ప్రసిద్ధములగు సౌందర్యాదిగుణములను దేహమునకు సంపాదింపవలయునను భ్రాంతి. ఇది రెండు విధములు. (1) లౌకిక గుణాదానభ్రాంతి (వాసన) (2) శాస్త్రీయ గుణాదాన భ్రాంతి. (వాసన).

---

* ఈ గ్రంథము 1.223 నందు అన్నమయకోశమును గుఱించి చెప్పిన సందర్భమ దేహాత్మ వాదమును నిరసించియుంటిని. ఈ గ్రంథము యొక్క చతుర్థభాగమ అచలమత పరిశీలనము చూడవచ్చును.

Dr K Dayanandaswamy ebooks


(I) లౌకిక గుణాదాన వాసన : అనగా శరీరమునకు, ఔషధాదుల వలనను, భోజనాదుల వలనను పుష్టి, తేజము, కాంతి యివి కలిగించుట. నలుగు మొదలగు వానివలన చర్మమునకు మృదుత్వమును కాంతిని కలిగించుట. మిరియములు సేవించుట, అభ్యంగము చేయుట మొదలగు పనులచేత కంఠస్వరమును మధురముగ నుండునట్లు చేయుట. యౌవనము పోకుండునట్లు లేహ్యము మొదలగువానిని పుచ్చుకొనుట - ఇట్టివి లౌకిక గుణాదాన వాసనలో చేరును. శరీరము నీటి బుగ్గవంటిది. ఇది యేక్షణమునందో పోవును. లోకవ్యవహారములయందు ఏది నిజమైనను, ఏది నిజము కాకపోయినను శరీరము బుద్బుద ప్రాయమనుట సత్యము. ఇది మఱువక జ్ఞప్తియందున్నచో ఈ వాసన నశించిపోవును.

(II) శాస్త్రీయ గుణాదాన వాసన : శాస్త్రమునందు చెప్పిన పావనత్వాది గుణములు ఈ దేహమునకు సంపాదింప వలయునను భ్రాంతి. గంగానది మొదలగు పుణ్యనదులయందు స్నాన మాచరించుట, సాలగ్రామ తీర్థములు పుచ్చుకొనుట, గోమూత్ర సేవనముచేత దేహమును శుద్ధిచేసికొనుట మొదలగునవి శాస్త్రబోధిత విధానము లగుటచే శాస్త్రీయ గుణాదానభ్రాంతి యని చెప్పబడెను. గంగాస్నానాది కృత్యములు పాపక్షయమున కుపకరించునవి యైనను నివియే పరమ పురుషార్థములని పట్టుకొని ప్రాకులాడినచో కాలమంతయు దానికే వ్యర్థమగును. పరమ పురుషార్థమగు మోక్షమున కివి ప్రతిబంధకము లగుటచే మలిన వాసనలలో చేర్పబడినవి.

(3) దోషాపనయన భ్రాంతి : ఇది లౌకిక దోషాపనయన భ్రాంతియనియు, శాస్త్రీయ దోషాపనయన భ్రాంతి యనియు రెండు విధములు.

(I) లౌకిక దోషాపనయన భ్రాంతి : కొందఱికి నోటియందు దుర్గంధ ముండును. దేహమందు చెమట కంపుకొట్టుచుండును. ఇట్టివి నివారించుటకొఱకు వైద్యుడు చెప్పిన ఔషధములను సేవించి దుర్గంధాదుల కప్పిపుచ్చుకొనుచుందురు. అసలే మూత్ర పురీషాదులతో నిండిన ఈ

Dr K Dayanandaswamy ebooks



శరీరము దుర్గంధమై యుండగ, దీనికొఱకై యిట్టి భ్రాంతి నొందుట తగదను వివేకముతో నీ వాసనను నిర్మూలింపవలయును.

(II) **శాస్త్రీయ దోషాపనయన భ్రాంతి** : అపవిత్రాదులు కలిగినవని వీనిని స్నాన సంధ్యావందనాదులు అనుష్ఠించుటవలన తొలగించు కొనవచ్చు ననియెడి భ్రాంతి.

లోకవాసన శాస్త్రవాసన దేహవాసన యను పైన చెప్పిన మూడును బంధహేతువులు. ఈ మూడింటిని మృదుబంధమని, తీవ్రబంధమని రెండు విధములుగ విభజించిరి. దంభదర్పాది అసురసంపదతో చేరినపుడు తీవ్రబంధమనియు, లోకవాసన మొదలగునవి మృదుబంధమనియు చెప్పబడినవి.

**మానసవాసన** : మనస్సు శబ్ద స్పర్శ రూప రస గంధములను విషయములను కోరు సమయమందుండు సంస్కారములను మానసవాసన యని యందురు.

**విషయవాసన** : శబ్ద స్పర్శ రూప రస గంధములను విషయముల ననుభవించునపుడు కలుగు సంస్కారము విషయవాసన యనబడును.

ఈ వాసనలు గాక మనోవాసనయను మఱియొక వాసన కూడ కలదన్ని చెప్పుదురు. ఇది దంభము, దర్పము, అహంకారము మొదలగు అసురసంపద్రూప మయినది. ఇది నరకహేతు వగుటవలన మలిన వాసనలలో చేర్పబడినది. దీనికి విరుగుడు దైవసంపదను వృద్ధి పొందించుటయే.

పైన చెప్పిన లోకాది మలినవాసనలు మూడును, అసుర సంపదయును నీ నాలుగును మానస వాసనయును విషయవాసనలయందే చేరియుండును. బాహ్యవాసన ఆంతరవాసనలకంటె భిన్నమైన మఱియొక వాసన లేదు.

మైత్రి, ముదిత, కరుణ, ఉపేక్ష మొదలగు శుభవాసనలను వృద్ధిబొందించుటవలన అశుభవాసన లన్నియు నశించును. అనంతరము చిన్మాత్రవాసన లభ్యసింపవలయును.

Dr K Dayanandaswamy ebooks



చిన్మాత్ర వాసనలు :- చైతన్య వ్యతిరిక్తమగు వాస్తవ స్వరూపము జడవస్తువునకు లేదు. ఎట్లనగ ఇది ఘటము, ఇది జలము, ఇది శిల అని చెప్పబడు నీ వస్తువుల నేజ్ఞానము ప్రకాశింపజేసెనో ఆజ్ఞానమునుండి ఘట జల శిలాదులను వేఱుచేసి కేవల చిన్మాత్రమునే గ్రహింపవలయును.

ఈ చిన్మాత్రవాసన రెండు విధములు

(1) మనోబుద్ధులతో కూడిన చిన్మాత్రవాసన:- నేను జడద్రవ్యములను వదలి కేవల చిన్మాత్రను భావించుచున్నానని చేయుభావన. ఈ వాసన జ్ఞానకర్తయగు బుద్ధితోడను, సాధనమగు మనస్సుతోడను కలిసియున్నది. ఇదియే ధ్యానము. ఇది విడువదగినది.

(2) మనోబుద్ధులను విడిచిన చిన్మాత్రవాసన : ఇచట నేను జడద్రవ్యమును వదలి కేవల చిత్తునే భావించుచుండినను భావన లేదు. అనగా కర్తృత్వ కరణత్వానుసంధానము లేదు. ఇదియే సమాధి. ఇది విడువరానిది.

ఇవి వాసనలని జ్ఞానవాసిష్ఠము మొదలగు శాస్త్రములయందు చెప్పియున్నందున నిచ్చట వాసనలని చెప్పితిని. కాని, యివియే ముందు చెప్పబోవు సవికల్ప నిర్వికల్ప సమాధులు.

జ్ఞానవాసిష్ఠమునందు వాసనలు ధ్యేయమని, జ్ఞేయమని రెండువిధములుగ చెప్పబడినవి (5-20-25 నుండి 32 వఱకు). అవియు నీ చిన్మాత్ర వాసనలవంటివే.

## (19) వాసనాక్షయ మనోనాశములు

శుభవాసనలను వృద్ధిపొందించుటవలన మలినవాసనలు నశించునని తెలిసికొంటిమి. ఇప్పుడు మనోనాశమువలన వాసనాక్షయమగు విధమును విచారింపవలయును. వాసనాక్షయమునకు మొదట నింద్రియములను జయింపవలయును. ఇంద్రియ జయమువలన మనస్సు జయింపబడును. (బ్రహ్మజిజ్ఞాసువు సాధనచతుష్టయమును సాధించి యున్నందున నివి అతనికంత కష్టతరములు గావు) ఏ యింద్రియమును మొదట జయింప

Dr K Dayanandaswamy ebooks



వలయు నన్నది ప్రశ్న. మానవుడు జన్మించినపుడు మొదట ప్రవృత్తిలోనికి వచ్చిన యింద్రియము జిహ్వ. తరువాత ఒక్కొక్క యింద్రియము దానిదాని విషయముల నవి క్రమముగా గ్రహింపసాగినవి. కట్టకడపట ప్రవృత్తిలోనికి వచ్చిన యింద్రియము జననేంద్రియము. రైలింజను నిలిచిపోయిన తక్కిన పెట్టెలన్నియు నిలిచిపోవునుగదా?

**ఆ॥ అన్నమదముచేత నతివలు పురుషులు**
**ఏపు మీర మదను డేచనుండ్రు,**
**అన్న ముడిగినంత యతను డేమాయెరా?**
**విశ్వదాభిరామ! వినురవేమ!**

అన్నారు వేమన్నగారు. జిహ్వోపస్థలు రెండును జయించబడినపుడు తక్కిన యింద్రియము లన్నియు జయింపబడునని తాత్పర్యము. ఇంతటితో మనస్సుయొక్క విశృంఖలవృత్తి కొంత తగ్గి మనస్సు కొంతవఱకు స్వాధీనమగును. దీనికితోడు సాధకుడు పవిత్ర వాతావరణమునందు నివసింపవలెను. పరిసరములు శుభవాసనలను పోషించునట్టివిగ నుండవలయును. అవియే సత్సాంగత్యము మొదలగునవి. పరిసరములకు లొంగిపోవుట మానవుని స్వభావము. మలినవాసనలను పోషించునట్టి స్థలములకు పోరాదు. తీవ్రవైరాగ్యమువలన వాసనలు శీఘ్రముగా నశించును. బ్రహ్మచర్యము, మౌనము ముఖ్యముగ పాటింపవలయును.

పూర్వవాసనలు, మనస్సును శబ్దాది విషయములకొఱకు ప్రేరేపించుచుండును. వాసనాక్షయమువలన చిత్తవృత్తులు నిరోధింపబడును. శబ్దాది విషయములను మఱల మఱల భావింపక ఉండవలయును. భావింపక ఉండ వలయునన్న సాధకుడు జీవితమందు కొన్ని కట్టుబాట్లు చేసికొనవలయును. శృంగారరస ప్రధానములగు నవలలు, నాటకములు, చలన చిత్రములు (సినిమాలు) మొదలగువానికి దూరమై యుండవలయును. కామాది వృత్తులు కలిగినప్పుడు వాటికి విరుద్ధమగు వానిని మనసునందు భావింపవలయును.

అనగా: కామముచేత రావణుడు, లోభముచేత దుర్యోధనుడు, పుత్రమిత్ర కళత్రాదులతో నశించినట్టివారి చరిత్రను పునః పునఃస్మృతి పథమునకు

Dr K Dayanandaswamy ebooks



తెచ్చికొనవలయును. స్త్రీ సంబంధమైన కామము కలిగినపుడు వేదాంతశాస్త్రములందు చెప్పబడిన రీతిగ స్త్రీని గుఱించిన దోషవిచారము చేయవలయును. అట్టిదోష విచారము పలుమారు చేయుటవలన స్త్రీయందు కామేచ్ఛ జనింపదు. ఇట్లే, కామక్రోధాదులయందు దోషవిచారము పలుమారు చేయుటవలన అవి శాంతించును. ఇవి సాధకుని సాధనయొక్క ప్రారంభదశయం దనుష్ఠింపదగినవని గ్రహింపవలయును. తత్త్వజ్ఞానివిషయమునం దట్లుకాదు. తత్త్వజ్ఞానికి బ్రహ్మసాక్షాత్కారమై యున్నది కనుక అతనికి మనస్సు సులభముగ లొంగిపోవును.

జి : వాసనాక్షయముతో మనోనాశ మగుచుండగా మనోనాశమునకై ప్రత్యేక ప్రయత్నము చేయుటేల?

వే : వాసనాక్షయము తీవ్రబంధమును నశింపజేయును. మనోనాశము తీవ్రబంధ మృదుబంధముల రెంటిని నశింపజేయును. సాక్షాత్తుగా దుఃఖహేతువగు అసురసంపద తీవ్రబంధమనియు, అసురసంపదను పుట్టించునట్టిదియు,ద్వైతప్రపంచ ప్రతీతికి కారణమును నగునది మృదుబంధమనియు చెప్పబడినది. వాసనలే చిత్తమును క్షోభింప జేయుచున్నవి. మనస్సు సరోవరము వంటిది. పంచ జ్ఞానేంద్రియముల ద్వారా మనస్సునందు ప్రవేశించు ప్రతివిషయమును సరోవరమునందు విసరివేయబడిన రాళ్ళు దాని అడుగునకు పోయి నిలిచియుండునట్లు విషయములు సూక్ష్మములై మనస్సున వాసనారూపమున నిలిచియుండి, అవి యెప్పుడో యొకప్పుడు పైకి లేచును. అప్పుడు చిత్తమునందొక యల (తరంగము) కల్పింపబడును. సరోవరము నిస్తరంగమై నిర్మలమై యున్నప్పు డడుగు భాగము స్పష్టముగ కనబడుచుండును. సంకల్ప శూన్యమగు చిత్తమునందు వాసనలు నశించును. అట్టి చిత్తముచే పరమాత్మ యెఱుగబడును.

చిత్తమునకు రెండు రూపములు కలవు. (1) ఆత్మాకారము, (2) అనాత్మాకారము.

Dr K Dayanandaswamy ebooks



1. **ఆత్మాకారమనగా :** పరమాత్మ రూపము. చిత్తము సంకల్పశూన్యమై శబ్దాది విషయరహిత మైనపుడు ఆత్మాకారముగ నుండును.

2. **అనాత్మాకారమనగా :** శబ్దాది విషయరూపము అనేక జన్మముల నుండి యేర్పడిన వాసనలు చిత్తమునందుండును. వెనుక చెప్పినట్లు వాసనాక్షయ సాధనముచేతనే సమస్తవాసనలు నిర్విశేషముగ నశియించినవని తెలిసికొనుట కష్టము. ఏమైనను కొన్ని బీజములు మిగిలియుండి అప్పుడప్పుడు పరిస్థితుల ననుసరించి మనస్సును ప్రేరేపింపవచ్చును. అట్లు ప్రేరేపింపబడినపుడు చిత్తము కలగుచుండును. చిత్తము కలగినపుడు తిరిగి వాసనలు కలుగుచుండును. ఇట్లు ఒకదాని నొకటి ప్రోత్సహించుకొనుచు విషమచక్ర మేర్పడకుండుటకు వాసనాక్షయముతోబాటు ఏకకాలమునందే మనోనాశము కూడ నభ్యసింప వలయును. మనోనాశము చక్కగ కుదిరినచో దానితో సమస్త వాసనాబీజములు దగ్ధమైపోవును. అందువలన వాసనాక్షయముతోపాటు మనోనాశము ప్రత్యేకముగ అభ్యసించియే తీరవలయును. అగ్ని, శత్రువు, ఋణము, వ్యాధి - వీటి శేషము లుంచుకొనిన అవి స్వల్పమైనను నెట్లు ఒకప్పుడు పెద్ద ప్రమాదమునకు కారణము కావచ్చునో, అట్లే వాసనాబీజశేష ముంచికొనినను ప్రమాద మగునని అన్నపూర్ణోపనిషత్తు చెప్పినది.

## (20) వాసనాక్షయ తత్త్వజ్ఞానములు

వాసనాక్షయముతో తత్త్వజ్ఞాన మెట్లు కలుగునో వివరింతును. నిర్దగ్ధ వాసనాబీజ సత్తాసామాన్య రూపుడగును. **"నిర్బీజవాసనా యత్ర తత్తుర్యం సిద్ధిదం స్మృతం"** (అన్నపూర్ణ) ఎచట వాసనా బీజములు నశించినవో అచట తత్త్వజ్ఞానము సిద్ధించినది. అదియునుగాక వాసనాక్షయము వలన మనోనాశముకూడ కలుగుచున్నదిగదా? వాసనా క్షయమువలన తత్త్వజ్ఞానము కలుగుననుటకు శ్రీ విద్యారణ్యు లీ క్రింది దృష్టాంతమును చెప్పిరి.

ఒక శూన్యఘటము కలదనుకొందము. ఆ ఘటమునకు వెలుపలను, లోపలను సర్వగతమైన ఆకాశము మాత్రమే కలదు. ఆ ఘటమును బియ్యముచేతనో, పిండిచేతనో నింపినపు డాఘటమునందుగల ఆకాశము మనకు విస్పష్టముగ తెలియబడుటలేదు. కారణమేమన ఆ ఘటము

Dr K Dayanandaswamy ebooks



లోనున్న స్వతస్సిద్ధమగు ఆకాశము ఆగంతుకములగు తండులాదులచే గప్పబడి యున్నది. బియ్యము మొదలగు పదార్థములను కుండనుండి తీసివేసిన, అప్పు డాఘటమునందలి యాకాశము మనకు స్పష్టముగ ద్యోతక మగును. తండులాదులచే నింపబడిన ఘటమువలె చిత్తము వాసనలచే నిండియున్నది. చిత్తమందు గల సర్వవ్యాపకమును, స్వతస్సిద్ధమును నగు బ్రహ్మమును ప్రకాశింప నీయక ఆగంతుకములగు వాసనలు చిత్తమునందు నిండియున్నవి. వాసనలను తొలగించినచో వాసనా శూన్యమగు చిత్తమునందు పరమాత్మ ద్యోతక మగును. దీపమునకు తైలమెట్టిదో మనస్సునకు వాసన లట్టివి. తైలము లేకపోయిన దీపము శాంతి నొందునట్లు వాసనలు క్షీణింపగనే మనస్సు చంచలత్వ ముడుగును.

అట్టి మనస్సు అత్యంత నిర్మలమును, శుద్ధమును, ఆత్మాకారమునునై యుండును. దానినే మనోనాశమని చెప్పిరి. ఈ విధముగ వాసనాక్షయము వలన కలిగిన నిర్మల చిత్తముచేత తత్త్వజ్ఞానము కలిగినదని తెలిసికొనవలయును.

## (21) మనోనాశ తత్త్వజ్ఞానములు

జి : మనో నిరోధమువలన తత్త్వజ్ఞానము కలుగు నంటిరి. తత్త్వజ్ఞానమువలన మనోనిరోధము కలుగునంటిరి. ఇది యొక విషమచక్రము. పెండ్లి కానిదే పిచ్చి కుదురదు. పిచ్చి కుదురనిదే పెండ్లికాదు అన్నట్లున్నది. ఏది ముందు ఏది వెనుక జరుగవలెను?

వే : రెండును సమకాలమునందే జరుగవలెనని యిదివఱకే చెప్పితిని. మొదట తాత్కాలిక మనోనిగ్రహముచే తత్త్వజ్ఞానము నార్జించిన తత్త్వజ్ఞానికి వాసనాక్షయ మగును గనుక మనోనిగ్రహము సులభమగును. తత్త్వజ్ఞాని కాని వానికి తాత్కాలికముగ మనోనిగ్రహము కలిగినను స్థిరముగ నుండనేరదు. పూర్వము హిరణ్య కశిపుడు, రావణుడు మొదలగు రాక్షసులు తొలుత తాత్కాలికముగ మనస్సును జయించి తపస్సిద్ధి నొందిరిగాని వారికి తత్త్వజ్ఞానము లేనందున పిమ్మట వారు మనస్సునకు దాసులైరి. ఇంతవఱకు నేను చెప్పిన యుపాయములచే నెట్లో మనోజయముచే

Dr K Dayanandaswamy ebooks



శ్రవణాదుల నభ్యసించి తత్త్వజ్ఞానమును నార్జించిన తత్త్వజ్ఞానికి తర్వాత మనోజయము స్థిరమగును.

జి : పుష్పమును నలుపుటకంటె మనోజయము సులభమందురుగదా?

వే : ఈ విషయమై గీతయందు అర్జునుడు భగవానుని ఇట్లు ప్రశ్నించెను.

ఓ కృష్ణా! మనస్సు అతిచంచలమైనది. క్షోభ పెట్టునది. నిగ్రహింప శక్యము కానిది. దృఢమైనది. అట్టిమనస్సును నిగ్రహించుట, వాయువును నిగ్రహించుట యెట్లశక్యమో అట్లే యశక్యమయిన దానినిగా తలంచుచున్నాను. (గీత. 6. 34) అని చెప్పగా భగవానుడు 'అది వాస్తవమే' **'అసంశయం మహబాహో! మనో దుర్నిగ్రహం చలం'** (గీత. 6. 35) అని చెప్పియున్నందునను జ్ఞానవాసిష్ఠమునందును వేదాంత పంచదశియందును నిట్లు చెప్పిరి:

**శ్లో॥ "అప్యబ్ధిపానా న్మహత స్సుమేరూన్మూలనాదపి ।**
**అపి వహ్న్యశనాత్సాధో విషమశ్చిత్త నిగ్రహః ॥**

(జ్ఞా.వా.వే.పం.7-121)

**తా॥** సముద్రోదకమును త్రాగుటకంటెను, మేరుపర్వతమును నిర్మూలించుట కంటెను, అగ్నిని మ్రింగుట కంటెను చిత్తనిగ్రహము కష్టతరమైనది* అని చెప్పియున్నందునను మనోనిగ్రహము మిగుల కష్టతరమైనది, అయితే పుష్పము నలుపుటకంటెను మనోనాశము సులభమని శాస్త్రములయందు చెప్పినదాని భావమును వివరింతును.

**శ్లో॥ సుమనః కుసుమామర్దే కించిద్వ్యతికరో భవేత్ ।**
**సుసాధ్యాభావమాత్రేణ న తు సంకల్పనాశనే ॥**

(జ్ఞా.వా.స్థితి ప్రకరణము సర్గ 17)

---

* ఈ విషయమై శ్రీ సీతారామాంజనేయ సంవాదమున నిట్లున్నది.

చం॥ అలయక సప్తవారిధుల నావలి కీవలి కొక్కరీతిగాఁ
గలయఁగ నీఁదవచ్చును, నగంబుల నచ్చనగుండ్లుగాఁ గరం
బులఁగొని యాడవచ్చు, నభమున్ గబళింపఁగ వచ్చుఁగాని యి
య్యల నమనస్కయోగము గ్రహింపఁగరాదు దలంప నేరికిన్.

Dr K Dayanandaswamy ebooks



తా॥ జాజిపువ్వును నలిపివేయుటకు కొంత ప్రయాస (ప్రయత్నము) కావలయును. కాని, అంతకంటెను సంకల్పనాశనము సులభము.

జాజిపువ్వును నలుపవలయునన్న రెండు వ్రేళ్ళమధ్య దానినుంచి నలుపవలయును. ఈపని చేయవలయునని తొలుత మనస్సున సంకల్పము కలుగవలయును. ఆ సంకల్పశక్తి నరములందు కండరములయందు ప్రవేశించి ఆ పనిచేయవలయును.

**మనోనిగ్రహ మనగా** : నే కార్యమును చేయకుండుట. మనస్సు ఒక్క సంకల్పమును కూడ చేయకుండుట. "**అసంకల్పః పరం శ్రేయః**" సంకల్పము లేకుండుటే పరమశ్రేయమని జ్ఞానవాసిష్ఠము నందున్నది. కనుక యెంత చిన్న కార్యమైనను చేయుటకంటె చేయకుండుట సులభమన్న భావముతో అట్లుచెప్పిరి. దాని భావము నెఱుంగక "సీతారామాంజనేయ సంవాద" మను* గ్రంథమునందు పుష్పమును చీరుటకంటెను, కన్నులు మూయుటకంటెను అమనస్క యోగము సులభమని చెప్పబడినది, కనుక మనోనిగ్రహమునకు ప్రయత్న మవసరము లేదని కొందఱు చెప్పుదురు. కాని నేను పైన చెప్పిన భావమే ఆ గ్రంథకర్త భావమై యుండును. కాని మనోనిగ్రహము సులభమని వారి భావము కాదు.

జి : తత్త్వజ్ఞానికి మనోనాశ మెట్లు సులభమగును?

వే : తత్త్వజ్ఞానికి ఆత్మసాక్షాత్కారము కలిగి యుండును, కనుక తాను నిష్క్రియుండనను నిశ్చయము కలిగియుండును. దానితో వాసనాక్షయమై మనస్సు దాని చంచలత్వ ముడుగును. గీతయం దిట్లున్నది.

---

* శ్రీ సీతారామాంజనేయ సంవాదమునం దిట్లున్నది.
తోదక వృత్తము : చెలువుగఁ బువ్వులు చీఱుటకంటెన్
బొలుపుగఁ గన్నవ మూయుటకంటెన్
నలువగు నీయమనస్కపదంబే
సులభము సౌఖ్యము సూక్ష్మము వత్సా! (3-41)

Dr K Dayanandaswamy ebooks



శ్లో॥ **తత్త్వవిత్తు మహాబాహో! గుణకర్మ విభాగయోః ।**
**గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥** (గీత. 3-28)

తా॥ తత్త్వవేత్తయగు పురుషుడు గుణములను కర్మలను విభజించి తెలిసికొనినవాడై కర్మరూపములైన గుణములు విషయరూపములైన గుణములయందు వర్తించునేగాని తనకు వాటితో కొంచెమైనను సంబంధము లేదని వాటియందు ఆసక్తుడు గాకయుండును.

అందువలన ఇంద్రియ మనోవృత్తులకు పరమై వాటికి సాక్షియైయుండు నాత్మ తానని యెఱుగుటచే మనస్సు దాని చంచలత్వ ముడుగును.* **'పరం దృష్ట్వా నివర్తతే'** (గీత. 2-59) పరమాత్మను చూచిన వాని మనస్సు విషయములయందు చలించక నివర్తించునని చెప్పబడినది.

దేహి దేహములు రెండును వేఱువేఱనియు, తాను దేహిననియు నిశ్చయాత్మకబుద్ధి గలవానికి అట్టిభావము చేతనే మనస్సు వశమగుననియు, అదియే అమనస్కమనియు మహాభారతము నందలి ఉమామహేశ్వర సంవాదమునందు స్పష్టపరుపబడినది.

క॥ **విను దేహియు దేహము వే**
**ఱను నిశ్చయదృష్టి గల్గు నాతడు చాలున్**
**మనసు మగిడింప నది ని**
**ర్మనస్కత బొనర్చి మోక్షమార్గము జూపున్॥** (మ.భా.అను. 5-252)

---

* శ్రీ సీతారామాంజనేయ సంవాదమునం దిట్లున్నది.

తే॥ ఇంద్రియ మనంబు లటు చలియించె నేని
నేఁ జలించితి నంచు నీ వెఱుఁగఁ బోకు,
నిశ్చలుఁడ నంచుఁ దెలియుము నిన్నుగాంచి,
యవియు నతినిశ్చలములగు నంత మీద.

తే॥ ఆత్మతేజంబు వీక్షించు నతని మాన
సేంద్రియంబులు చేష్టల నెడల విడిచి
యొదిగి చెదరక కదలక యూరకుండు
సింగములఁగన్న గజములభంగి ననఘ! (3-76, 77)

Dr.K Dayanandaswamy ebooks

మనోనాశమునకు వాసనాక్షయ తత్త్వజ్ఞానములను నుపాయములేగాక ప్రాణనిరోధమను నుపాయము కూడ గలదు. ఈసాధనమువలన మనోనిరోధ మగుటచే పూర్వోక్త రీతిగా వాసనాక్షయము కూడ కలుగుచున్నది. దేహమునందున్న ప్రాణమును నిరోధించుటకు శ్వాసను క్రమబద్ధము చేయవలయును. చిత్తమునకు రెండు బీజములు కలవని చెప్పబడినది.

శ్లో॥ "ద్వే బీజే చిత్తవృక్షస్య వృత్తి వ్రతతి ధారిణః ।
ఏకం ప్రాణపరిస్పందః ద్వితీయం దృఢవాసనా"॥

తా॥ చిత్తమను వృక్షము వృత్తులను తీగలచేత చుట్టబడియున్నది. ఈ వృక్షమునకు రెండు బీజములు కలవు. (1) ప్రాణస్పందనము. (2) వాసన.

ప్రాణస్పందనము, వాసన యను నీ రెండును నొకదాని కొకటి బీజాంకుర న్యాయముగ నున్నవి. ఇందులో నేయొకటి నశించినను రెండవది నశించును. ఇందుకు ప్రమాణము.

శ్లో॥ "ద్వే బీజే చిత్తవృక్షస్య ప్రాణస్పందన వాసనే ।
ఏకస్మింశ్చ తయోః క్షీణే క్షిప్రం ద్వే అపి నశ్యతః"॥
(ముక్తి. 2-32 జ్ఞా.వా.)

తా॥ చిత్తవృక్షమునకు ప్రాణస్పందనము వాసన అను రెండు విత్తనములు (బీజములు) కలవు. అందులో నేయొక్కటి నశించినను నతిశీఘ్రముగ రెండవది నశించును. ప్రాణవాయువు, వాసన - ఈ రెండును చిత్తమును ప్రవర్తింపజేయును.

మలినవాసనలు కలవాడు పతంజలి చెప్పిన ప్రకారము మొదట ఆసనము నభ్యసించి ప్రాణాయామముచేత చిత్తనిరోధము చేయవలయును. శుద్ధవాసనలు కలవాడు ఉపాయముచేతను, సాధుసంగముచేతను చిత్తనిరోధము చేయవచ్చును. చిత్తస్పందనము నిరోధించినచో ప్రాణస్పందనము నిరోధింపబడును. ప్రాణస్పందనము నిరోధింపబడిన

Dr K Dayanandaswamy ebooks


చిత్తస్పందము నిరోధింపబడును. చిత్తనిరోధమునే* చిత్తనాశమనియు, మనోనిరోధమనియు, మనోజయమనియు, అమనస్కమనియు చెప్పుదురు. సంకల్పము, కామము, విచారేచ్ఛ, శ్రద్ధ, అశ్రద్ధ, ధైర్యము, అధైర్యము, లజ్జ, జ్ఞానము, భయము మొదలగు వృత్తులే మనస్సని చెప్పబడును. ఒక విషయమును (బాహ్య విషయమును) పలుమారు చింతించు మనస్సునకే చిత్తమని పేరు. శబ్దాది పదార్థములు వాస్తవములని సుఖస్వరూపములని భావించుటయే చిత్తముయొక్క స్వరూపము. మనోజయముతో ముక్తి కలుగును.

**మం॥ ఓం మనో హి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చాశుద్ధమేవ చ ।**
**అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామ వివర్జితమ్ ॥**

**మం॥ మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।**
**బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్ ॥**

(అమృత 1-2)

తా॥ మనస్సు శుద్ధమనియు, అశుద్ధమనియు రెండు విధములు. కోర్కెలు లేని మనస్సు శుద్ధమనియు, కామసంకల్పముతో కూడిన మనస్సు అశుద్ధమనియు చెప్పబడును. సంసారమునందు బంధించుటకును, అందుండి విముక్తి కలిగించుటకును మనస్సే కారణమై యున్నది. విషయములయం దాసక్తమైన మనస్సు బంధమునకును, నిర్విషయమైన మనస్సు మోక్షమునకును కారణమగుచున్నది. ఈ యర్థమునే

**మం॥ మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః।**
**బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతం॥**

అను మంత్రముతో శాట్యాయనీయోపనిషత్తు ప్రారంభింపబడినది.

---

* జ్ఞానయోగమున మనస్సు, బుద్ధి, చిత్తము అని చెప్పునట్టి అంతః కరణస్థానమున పాతంజలయోగులు "చిత్తము"ను చెప్పుదురు.

Dr K Dayanandaswamy ebooks



**శ్లో॥ వాయునా ఽ ఽనీయతే మేఘః పునస్తే నైవ నీయతే ।**
**మనసా కల్ప్యతే బన్ధో మోక్షస్తే నైవ కల్ప్యతే ॥** (వి.చూ. 174)

తా॥ మేఘమును తీసికొనివచ్చిన వాయువే తిరిగి మేఘమును దూరముగ తీసికొనిపోవునట్లు బంధమును కల్పించిన మనస్సే మఱల మోక్షమునుకూడ కల్పించుచున్నది. "**ఆత్మైవహ్యాత్మనో బంధు రాత్మైవ రిపురాత్మనః**" (గీత. 6-5)

మనస్సే బంధువు. మనస్సే విరోధి.

ఇట్టి మనోజయమున కుపాయములను పూర్వు లనేకశోధనలు చేసి కనుగొనిరి.

**మం॥ అధ్యాత్మ విద్యాధిగమ స్సాధుసంగమ ఏవ చ ।**
**వాసనాసంపరిత్యాగః ప్రాణస్పంద నిరోధనమ్ ॥**
**ఏతాస్తా యుక్తయః పుష్టా స్సంతి చిత్తజయే కిల ॥** (ముక్తి)

తా॥ వేదాంత శ్రవణముచేతను, సాధుసంగమముచేతను, నీ యుక్తులతో చిత్తమును స్వాధీన పఱచుకొనవచ్చును. ఇచట ప్రాణాయామ మనునది స్మార్త ప్రాణాయామమని చెప్పుదురు. అనగా:- సంధ్యావందన కాలములో చేయునట్టి ప్రాణాయామము. మనోనిరోధమున కింకొక యుపాయము చెప్పబడెను.

**మం॥ హస్తం హస్తేన సంపీడ్య దంతై ర్దంతాన్విచూర్ణ్య చ ।**
**అంగాన్యంగై స్సమాక్రమ్య జయేదాదౌ స్వకం మనః ॥**(ముక్తి 2-47)

తా॥ హస్తమును హస్తములతో బలముగా నలిపి, పండ్లను పండ్లతో బిగబట్టి, పాదాద్యవయవములను నాయా యవయవములతో త్రొక్కిపట్టి మనస్సును జయింపవలయును.

జి : మీరు మనోనాశము కలుగవలె ననుచున్నారు. యోగులు మైత్రి, కరుణ మున్నగు గుణములు కలవారలై యున్నారుకదా. మనసు లేనియెడల వారి కవి ఎట్లుండును?

Dr K Dayanandaswamy ebooks



వే : శ్రుతి యిట్లు చెప్పినది :

మం॥ ద్వివిధ శ్చిత్తనాశో ఽస్తి న రూపో ఽరూప ఏవ చ ।
జీవన్ముక్తౌ న రూపస్స్యాదరూపో ఽ దేహముక్తిగః ॥
(అన్నపూర్ణ-ముక్తి 2-37)

తా॥ మనోనాశము రెండు విధములు, (1) సరూప మనోనాశము, (2) అరూపమనోనాశము. సరూప మనోనాశము జీవన్ముక్తునియందు కనిపించును. సుఖదుఃఖములు సమముగ నుండుటయే మనోనాశము. అరూప మనోనాశము విదేహ కైవల్యమునందు కలుగును.

ఇచట కరుణ, మైత్రి మున్నగు శుభవాసనలు సహితము నశించును. పై విధముగ మనోనిరోధమువలన అహంకారము నశించుచున్నది. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అను నీ నాలుగును నంతఃకరణమని పిలువబడును. ఒక వస్తువే వేఱువేఱు వృత్తులనుబట్టి వేఱువేఱు పేర్లతో వ్యవహరింపబడినది. అట్లగుటచే సంకల్పములు చేయునపుడు మనస్సని పేరు. అప్పుడు మనస్సు మాత్రమే యున్నదని, తక్కిన మూడును లేవని యర్థము కాదు. ఇట్లు మనోనాశ మైనపుడు అహంకారమును, దానివెంట మమకారమును నశించుచున్నవి. అప్పుడంతఃకరణము సత్త్వమనుపేర పిలువబడును. సర్వానర్థరూప సంసారమునకు కారణమగు నహంకారము నశించినతోడనే మానవుడు కృతకృత్యు డగుచున్నాడు. ఏ మార్గము (జ్ఞాన, యోగ, కర్మ, భక్తి యోగముల) ననుసరించి చూచినను అహంకారము నశించిననే ముక్తి కలుగను.

మం॥ "ద్వే పదే బంధ మోక్షాయ న మమేతి మమేతి చ ।
మమేతి బధ్యతే జంతుర్నమమేతి విముచ్యతే"॥ (పైంగలోపనిషత్తు)

తా॥ బంధమునకును మోక్షమునకు రెండు మార్గములు కలవు. ఒక మార్గము 'న మమ', రెండవది 'మమ'. మమ (నాది నావారు) అను మార్గమునందు బంధమును, న మమ (నాది కాదు) అను మార్గమున పోయిన మోక్షమును కలుగును.

 Dr.K.Dayanandaswamy ebooks

## (22) చిత్తముయొక్క స్థూల సూక్ష్మతలు

తత్త్వజ్ఞానము కలుగవలయునన్న చిత్తము సూక్ష్మము కావలయును. స్థూలమైన (బలిసిన) చిత్తమునకు తత్త్వజ్ఞానము కలుగదు. కట్టెల నమ్మువాడు కట్టెలను తూచుటకు నుపయోగించు త్రాసుతో వజ్రములను చక్కగా తూచుటకు వీలుపడదు. వజ్రములు తూచుటకు సూక్ష్మమైన త్రాసు కావలయును. చిత్తము బలిసియున్నదనగా - రాగద్వేషాది మలిన వాసనలతో కూడినదై అసురసంపదను పుట్టించునట్టిది. చిత్తము బలిసిన దనిన బలము కలిగినదని యర్థము కాదు, దుర్బలమైనదని భావము. చిత్తము సూక్ష్మమైన దనగ చిక్కినదని యర్థము కాదు, తేజోవంతము, శక్తివంతము నైనదని భావము. లౌకిక వ్యాపారాదులయందు నిపుణులనియు, సూక్ష్మమైనదని చెప్పుటకు వీలులేదు. రాజకీయముల యందు ప్రతిభావంతులు కావచ్చును. అసాధ్యములగు వ్యూహములను పన్ని సైన్యములను నడిపి లోకమును జయించునంతటి వీరాధివీరులు కావచ్చును. న్యాయశాస్త్రమునందు గొప్ప ప్రవీణులు కావచ్చును. అట్లే తదితర విషయముల యందును వారిచిత్తము సూక్ష్మమైనదే కావచ్చును.

కాని, తత్త్వజ్ఞానమునకు కావలసిన చిత్తము విషయాసక్తము కానిదిగను, నిర్మలమునుగాను నుండవలెను. లౌకిక వ్యాపారములయందు ప్రవీణులగు వారి చిత్తము రజోగుణముతో కూడినది గనుక, వారి చిత్తము స్థూలమైనదని వేదాంతుల యభిప్రాయము. రాగద్వేషములను, దారేషణ, ధనేషణ, పుత్రేషణలను వదలి వైరాగ్యము కలిగి, సర్వభూతముల యందు మైత్రి కరుణ కలిగియుండువారి చిత్తమే సూక్ష్మమైనది. అదియే సత్త్వగుణాధిక్యము కలది యగును. ఇట్టి సూక్ష్మమైన చిత్తమునకు మాత్రమే తత్త్వజ్ఞానము కలుగును. దీపము కదలుచున్నపుడు దాని వెలుతురులో సూక్ష్మవస్తువులను చూడలేనట్లే బలిసిన చిత్తముచేత బోధ కలుగదు. చిత్తమును సూక్ష్మముచేసి దానిని సమస్థితికి తెచ్చుటకు యోగము నభ్యసింపవలయును.

Dr K Dayanandaswamy ebooks


## (23) అష్టాంగ (జ్ఞాన) యోగము

యోగమనగా - నిశ్చలమగు బ్రహ్మాకారవృత్తి రూపమైన నిర్వికల్ప సమాధి. ఈ యోగము (1) యమ (2) నియమ (3) ఆసన (4) ప్రాణాయామ (5) ప్రత్యాహార (6) ధారణ (7) ధ్యాన (8) సమాధులని యెనిమిది అంగములు గలది. పాతంజలయోగ శాస్త్రమునందు చెప్పబడిన యోగము ఈ యోగమునకంటె భిన్నమైనది. అద్వైత వేదాంత సంప్రదాయమునందు ఈ యోగాంగముల నిట్లు చెప్పిరి.

(1) **యమము** : సర్వమును బ్రహ్మమే యను జ్ఞానముచే ఇంద్రియముల నిరోధించుట. అనగా: బ్రహ్మజ్ఞానమునకు సజాతీయము లగు వృత్తులను నశింపజేయుట దీని స్వరూపము.

(2) **నియమము** : బ్రహ్మజ్ఞానాభ్యాసమే నియమము. అనగా: వేదాంత శాస్త్రములు చదువుట, వినుట, యితరులకు చదివి వినిపించుట, వేదాంతుల గోష్ఠియందు వేదాంత విషయములను చర్చించుట మొదలగునవి.

(3) **ఆసనము** : సకల పదార్థములను బ్రహ్మస్వరూపముగ భావించుట. (పాతంజల యోగమున చెప్పు స్వస్తి కాద్యాసనములు కష్టతరమైనవి, అవి కావు)

(4) **ప్రాణాయామము** : మనోవృత్తులను నిరోధించుట. ఇందు ప్రపంచము మిథ్యయని భావించి వాసనలను నిషేధించుట రేచకమనియు, బ్రహ్మమే నేనను వృత్తి పూరక మనియు, ఆ వృత్తిని చలింపజేయ కుండుటయే కుంభకమనియు చెప్పబడినది. పాతంజల యోగులు చెప్పు ప్రాణనిరోధ రూపమైన ప్రాణాయామము ఇచట నిరసింపబడినది. "**అజ్ఞానాం ప్రాణ పీడనం**" అజ్ఞానుల కొఱకే ప్రాణనిరోధము. (అని స.వే.సి.సం. 905)

(5) **ప్రత్యాహారము** : దృశ్యములయం దాత్మ రూపమును విడిచి మనస్సును చిద్రూపమందు నిలుపుట.

Dr K Dayanandaswamy ebooks



(6) ధారణ : చిద్రూపమునందు నిలిపిన మనస్సును చలింపనీయకుండుట.

(7) ధ్యానము : బ్రహ్మమే నేనగుదునను వృత్తిని బొంది ఆ వృత్తిచేత ప్రపంచ విషయముల యందు మనస్సు పోకుండ జేయుట.

(8) సమాధి : చిత్తవృత్తి బ్రహ్మాకారమై యుండగ, అట్లున్న సంగతి మఱచుట.

పైన చెప్పిన యోగాంగములు శ్రీ శంకరులవారి సర్వవేదాంత సిద్ధాంత సంగ్రహము ననుసరించి చెప్పబడినవి. శ్రీ శంకరులవారు, అపరోక్షానుభూతియం దివి గాక మఱికొన్నింటిని చెప్పియున్నారు. అవి యేవన :- (1) యమము (2) నియమము (3) త్యాగము (4) మౌనము (5) దేశము (6) కాలము (7) ఆసనము (8) మూలబంధము (9) దేహసమత్వము (10) దృష్టిస్థితి (11) ప్రాణాయామము (12) ప్రత్యాహారము (13) ధారణ (14) ఆత్మధ్యానము (15) సమాధి (అప. 102 నుండి 125 వఱకు)- ఈ పంచదశాంగ యోగములు తేజోబిందూపనిషత్తున 1-15, 16 నుండి 37వ మంత్రము వఱకు చెప్పబడినవి. వీటినే శ్రీ శంకరుల వారు అపరోక్షానుభూతియందు గైకొనిరి. ఈ యోగమును ముఖ్యముగ మందాధికారులును, నిర్గుణ బ్రహ్మోపాసకులును ఆచరింపవలయును.

## (24) సమాధి విఘ్నములు

సమాధియొక్క విఘ్నములు తెలిసికొని వాటిని పరిహరించినగాని సమాధి సిద్ధింపదు. చిత్తమునకు (1) లయము (2) విక్షేపము (3) కషాయము (4) రసాస్వాదనము (5) సమప్రాప్తియని యైదవస్థలు గలవు. నిర్వికల్ప సమాధికి మొదటి నాలుగును విఘ్నములు. ఐదవదియగు సమప్రాప్తియే సమాధి. మొదటి నాల్గింటియొక్క స్వరూపమును, ఆ విఘ్నములను తొలగించుకొను విధమును నీ క్రింద సంగ్రహముగ వివరింతును.

Dr K Dayanandaswamy ebooks

1. **లయము** : సాధకుడు చిత్తమును సమముగ చేయుటకు అనగా: వెనుక చెప్పిన విధముగ చిత్తమును జయించుటకు విషయముల కొఱకు పరుగిడు చిత్తమును బలవంతముగ నిరోధింపవలయును. అప్పుడు నిద్ర కలుగవచ్చును. అదియే లయము. నిద్రావస్థను జెందకుండ చిత్తమును ప్రబోధింపవలయును. చిత్తము లయావస్థ చెందకుండ నిరోధించుట కొఱకు సాధకుడు నిద్రింపవలసిన కాలము పూర్తిగ నిద్రింపవలయును. అట్లు చేసిన యెడల నిద్రామాంద్యము చెందదు. అజీర్ణము కాకుండ సులభముగ జీర్ణమగునట్టి భోజనము స్వల్పముగ చేయవలయును. అభ్యసనమునకు కూర్చుండుటకు పూర్వము శ్రమ కలుగునట్టి కార్యములు చేయరాదు. ఇందువలన చిత్తము లయావస్థ నొందకుండ కాపాడుకొన వచ్చును.

2. **విక్షేపము** : ఇట్లు లయమును పొందనీయక ప్రబోధింపబడిన చిత్తము శబ్ద స్పర్శాది విషయములను చెందనీయక నిరోధింపవలయును. ఇట్లు నిరోధించుటకు విషయములయందు దోషవిచారము పలుమారు చేయుచుండవలయును. మొదట కష్టముగ నున్నను నభ్యాసమువలన చిత్తము విషయములయందు ప్రవేశించిన వెంటనే నిరోధచిత్త వృత్తి కూడ కలుగుచుండును. అనగా:- విషయము చిత్తమునందు నిలువగనే దానియందలి దోషము సహితము చిత్తమున తోచును. ఇట్లు కొంతకాల మభ్యసింపగ విక్షేపమును జయించుట సాధ్యమగును.

'విక్షేప'మనగా:- శబ్దాది విషయములయందు చిత్తము పరుగిడుటయే. అనగా : బాహ్యావిషయాకార మగునట్టి మనోవృత్తిని విక్షేపమందురు. ఇదిగాక సాధకు డద్వితీయ బ్రహ్మమును చింతించుచుండుటవలన విషయములపైకి మనస్సు పోకుండుటకు నవకాశ ముండును. విక్షేపము కలుగకుండ చేసికొనుటను 'శమము'తో పోల్చవచ్చును. సాధకుడగు యోగి అభ్యాసకాలమునందే గాక ఇతర కాలములయందును మనోరాజ్యకల్పనము [ఊహాసౌధ నిర్మాణము (Building castles in the air] చేయగూడదు. దానివలన చిత్త మతిచంచలమై సమాధి సమయమున అప్రయత్నముగనే మనోరాజ్యము కల్పించుచుండును. ఇది గాక మఱికొన్ని కీడులు దీనివలన కలుగును.

 Dr K Dayanandaswamy ebooks

3. కషాయము : తీవ్రమగు రాగద్వేషాది వాసనలు గల చిత్తదోషము కషాయ మనబడును. పతివ్రతయగు నొక వనిత దూరస్థుడగు భర్తను గుఱించి చింతించునప్పుడు తన పరిసరముల జరుగుచున్న దేమియో యెఱుగదు. అట్లున్న స్థితియందే శకుంతలను దుర్వాసుడు శపించినట్లు మనము చదివి యున్నాము. ఇది రాగమునకు దృష్టాంతము. ఇట్లే ద్వేషాదులయందును నూహించుకొనవలయును. ఇట్టి కషాయములను చెందకుండుటకే పూర్వము సాధన చతుష్టయమందు వైరాగ్యము శమదమాదుల నభ్యసించియుండుట, సాధకుడు తిరిగి యీ సమయమున వైరాగ్యమును శమదమాదులను వృద్ధి నొందించుకొనుటవలన చిత్తమును కషాయము చెందకుండ చేసికొనవచ్చును.

మఱియు విక్షేప కషాయములకు గల భేదము నిట్లు చెప్పుదురు. బాహ్యవిషయాకారవృత్తి విక్షేపము, యోగి ప్రయత్నముచేత చిత్తవృత్తిని అంతర్ముఖము చేసిన సమయమున బ్రహ్మాకారమును పొందనీయక, యే రాగాదిజన్య సంస్కారము అడ్డగించునో అది కషాయ మనబడును.

4. రసాస్వాదనము : లోకులు దుఃఖనివృత్తిని కూడ ఆనందమని చెప్పుదురు. ఎట్లనగా: ఒకడు తలపై బరువు నెత్తుకొని దానివలన దుఃఖపడుచుండగ వాని భారమును దింపుటవలన వానికి ఆనందము కలుగును. అట్టి యానందమునకు తలపైనున్న బరువు తొలగుట తప్ప మఱియొక కారణమేమియును లేదు. ఈ విధముగ యోగి సమాధి చెందుటకు ప్రతిబంధకములగు విక్షేపాదులు తొలగుటవలన ఆనందము కలుగును. అది స్వస్వరూపానందము కాదు. అది అవిద్యా కల్పితమని తలంపవలయును. యోగి దానితోనే తృప్తిపడి ముందుకు సాగిపోక నిలిచిపోయినయెడల నది సమప్రాప్తి (సమాధి)కి విఘ్నముగ గణింపబడును. దీనినే రసాస్వాదన మనియు, సుఖాస్వాదన మనియు అందురు. అనగా:- దుఃఖనివృత్తి కలిగినదను తలంపు నిలిచియుండుట. దీనిని సవికల్ప సమాధి యందురు.

పై నాలుగు విఘ్నములను తొలగించుటవలన చిత్తమునకు సమప్రాప్తి (సమాధి) కలుగును. సమప్రాప్తి యనగా: చిత్తము సమమగుట,

Dr.K.Dayanandaswamy ebooks

బ్రహ్మతత్త్వమును దర్శించుట. ఇట్టి చిత్తముయొక్క యాకారమునకే **ఆత్మా**కారమని పేరు. చలించిన చిత్తమే జగద్రూపముగను, చలియించని చిత్తమే బ్రహ్మాకారముగను కనబడును. ఇదియే **"సర్వభూతేషు యేనైకం భావమవ్యయ మీక్షతే"** (గీత 18-20) సర్వభూతముల యందును అఖండమై, నాశరహితమై ఒక్కటైయున్న పరమాత్మను చూచుచుండుట. **"సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్"** (గీత 13-28) ఎవ్వడు సమస్త ప్రాణులయందు సమముగా నున్న పరమేశ్వరుని చూచుచున్నాడో అట్టివాడు నిజమును చూచుచున్నాడు.

**శ్లో॥ యదా న లీయతే చిత్తం న చ విక్షిప్యతే పునః ।**
**అనింగన మనాభాసం నిష్పన్నం బ్రహ్మ తత్తదా ॥**

(మాం.గౌ.కా. 3-46)

**తా॥** ఎప్పుడు చిత్తము లయము నొందక యుండునో, విషయము లందు విక్షేపము పొందక యుండునో, నివాత ప్రదేశమునందున్న దీపమువలె నెప్పుడు నిశ్చలమై యుండునో, కల్పితమగు నేవిధమైన విషయభావముచేత ఆభాసముగాక యుండునో అప్పుడే యిట్టి లక్షణము గల చిత్తము బ్రహ్మమగుచున్నదని భావము.

**అదియే** స్వస్థము, శాంతము, నిర్వాణము, సుఖముత్తమము, అజము, జ్ఞేయము, సర్వజ్ఞమునని బ్రహ్మవేత్తలు పలుకుచున్నారు. (మాం.గౌ.కా. 3-47)

సమాధియొక్క విఘ్నములు తేజోబిందూపనిషత్తునందిట్లు చెప్పబడెను. (1) అనుసంధాన రాహిత్యము (2) ఆలస్యము (3) భోగలాలస (4) లయము (5) తమస్సు (6) విక్షేపము (7) తేజస్సు (8) భేదము (9) శూన్యవృత్తి మొదలగునవి. (తేజో. 1-40, 41) శ్రీ శంకరులవారు ఎనిమిది విఘ్నములను అపరోక్షానుభూతి 127, 128వ శ్లోకములయందు పై విధముగనే వ్రాసిరి.

Dr K Dayanandaswamy ebooks


## (25) సమాధి

సమాధిచేతనే శుద్ధబ్రహ్మపదము లభించును.

**మం॥ యో హి వృత్తిం విహాయైనాం బ్రహ్మభ్యాం పావనీం పరామ్ ।
వృత్త్యైవ తే తు జీవంతి పశుభిశ్చ సమా నరాః ॥** (తేజో. 1-43)

తా॥ అఖండాకార వృత్తిగల వారలు మాత్రమే బ్రహ్మపదమును బొందుదురు. అఖండాకారవృత్తి లేనివారలయొక్క జీవితము పశువుల యొక్క జీవితముతో సమానమైనది.

నానావిధ వృత్తుల రూపమే చిత్తము. అట్టి చిత్తమును సమప్రాప్తికి తెచ్చు సాధన మిదివఱకే చెప్పబడెను. అఖండాకార చిత్తవృత్తి యనగా: బ్రహ్మాకారవృత్తియే. అదియే సమాధి. సమాధి రెండు విధములు. 1. సవికల్పము, 2. నిర్వికల్పము.

**సవికల్పసమాధి:** తెలిసికొనువారు, తెలివి, తెలిసికొనదగు పదార్థము, అను నీత్రిపుటి విలయ మందకయే, చిత్తవృత్తిని బ్రహ్మాకారముగ చేసి బ్రహ్మమునందు నిలుపుట సవికల్పసమాధి. ఇందు కుదాహరణము:- మట్టితో చేయబడిన యేనుగును చూచినపుడు దానియందు మన్నుతప్ప అన్యమేమియు లేదని తెలిసియుండియు 'ఏనుగు' అను భావమును, మట్టియను భావమును రెండును మనకు ఏ విధముగ నుండునో ఆ విధముగనే సవికల్ప సమాధియందు కేవల సన్మాత్రమగు ఆత్మ ప్రకాశించుచుండినను జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయరూపమగు త్రిపుటికూడ ప్రకాశించుచుండును. కనుకనే యీ సమాధి సవికల్ప సమాధియని చెప్పబడుచున్నది.

సమాధి లయపూర్వక సమాధి యనియు, బాధాపూర్వక సమాధి యనియు రెండువిధములు. జ్ఞానుల మతము ననుసరించినది బాధాపూర్వక సమాధి. అనగా: సృష్టి యే క్రమమున కలిగెనో దానికి విలోమముగ సృష్టిని లయమగునట్లు భావించుచు తుదకు బ్రహ్మము మాత్రమే మిగిలి యుండుట. లయపూర్వక సమాధి పాతంజల యోగులమతము ననుసరించినది. దీనివిషయము తరువాత చెప్పబడును.

Dr K Dayanandaswamy ebooks


నిర్వికల్పసమాధి : ఈ సమాధియందు వెనుక చెప్పిన త్రిపుటి తోచక కేవలము జ్ఞేయమగు పదార్థమునందే నిలుకడ యుండును. ఇట్టిస్థితిని యోగమని చెప్పుదురు. ఇదియే నిర్వికల్పసమాధి. ఇందుకు దృష్టాంతము: నీటియందుంచబడిన యుప్పుకల్లు కరిగి నీటిలో కలిసిపోయి కనబడకుండునట్లు బ్రహ్మాకారమును పొందిన వృత్తి (చిత్తవృత్తి) బ్రహ్మమాత్రమే యై తాను వేఱుగా కనబడదు. ఇచట అద్వితీయమగు బ్రహ్మము మాత్రమే గోచరమగును. తెలిసికొనువాడు మొదలగు కల్పనలు లేకుండుటచే నిర్వికల్ప సమాధియని దీనికి పేరుకలిగెను. నిద్రకును సమాధికిని గల భేదము నిద్రయందు అజ్ఞాన ముండును, సమాధియందు జ్ఞానముండును. సవికల్ప నిర్వికల్ప సమాధులకుగల భేదమొక్కటియే. అది యేదన చిత్తవృత్తి లయింపకుండుట, లయించుట. ముముక్షువగు వాడు ఈ రెండు సమాధులను ప్రయత్నముతో చేయుచుండువలయును.

అద్వైత వేదాంతమునకు పరమావధి నిర్వికల్ప సమాధి. దీనిపైన యోగి సాధింపవలసిన దేమియును లేదు. ఇది సిద్ధించిన బోధ దృఢమగును. అనగా:- జ్ఞానము చలింపక నిశ్చలజ్యోతివలె నుండును. ఇదియొక దివ్యానుభవము. ప్రతిప్రాణికి జాగరణ స్వప్న సుషుప్తులను మూడవస్థలున్నవి. ఇవిగాక మరణము, మూర్ఛ యనునవి కలవు. మూర్ఛ యనునది వ్యాధియని కొందఱందురు. మరణము దేహత్యాగము. కనుక దేహధారులకు జాగరణ, స్వప్న, సుషుప్తులలో నేదోయొకటి యెల్లప్పుడు నుండును. నిర్వికల్ప సమాధి సాధించిన పురుషుడు తప్ప తక్కినవా రెంతవారైనను నీ మూడవస్థలలో దేనియందైనను నొకదానియం దుండవలసినదే. పై అవస్థాత్రయమే మాయ, లేక అవిద్య. దీనినావల త్రోసి దీనికి వేఱై యుండుటయే నిర్వికల్పసమాధి.

**తే॥ తెలియ మేల్కొనియుండుట, గలలు, నిద్ర**
**యను నవస్థాత్రయము నవల బెట్ట**
**జాలు విజ్ఞాన నిర్మల సత్య బోధ**
**రూప నిర్భరానంద స్వరూపు డనఘ.** (మ.భా. శాంతి)

Dr K Dayanandaswamy ebooks



తా॥ తెలియ మేల్కొనియుండుట - జాగ్రదవస్థ, కలలు = స్వప్నము; నిద్ర = సుషుప్తి. ఈ మూడవస్థలను ఆవల బెట్టినవాడే సచ్చిదానంద స్వరూపుడగు ఆత్మ. కొంచె మాలోచించినచో ఇది యెంత మహత్తర విషయమో తెలియగలదు. అనేకకోట్ల జన్మలనుండి మనక్రిందను, మనమీదను, మన చుట్టుప్రక్కలను, మనలోపలను - ఒక్క క్షణములో నూఱవ వంతు కాలమైనను వదలక అంటిపెట్టుకొనియుండు అవిద్యను దాటి మనమొక్క క్షణమైనను నుండగలిగితిమా, అట్టి మహోన్నతస్థితిలో సరితూగజాలునది యేలోకమునందును ఏదియును లేదు. ఒక్క నిమిషకాల మీ సమాధియం దుండిన ఘనుని బ్రహ్మాదులును స్తోత్రము చేయలేరని పెద్దలనిరి. *శ్రీ రామకృష్ణ పరమహంసగారు ఒక్కనాటి సాధనలో నీ సమాధిని సాధించుటయేగాక మూడుదినములైనను ఈ సమాధినుండి లేవలేదు. వారి గురువగు శ్రీతోతాపురిగారు లేపకున్నచో వారికి బాహ్యస్మృతి యెంతకాలమునకు కలిగి యుండునో యెవరు చెప్పగలరు? తరువాత మఱియొకప్పుడు పరమహంసగారు ఇట్టి సమాధియం దాఱు నెలలుండిరి. సాధకుడు ఈ సమాధి నభ్యసించు కాలమున ఈ మహాత్మునకు నమస్కరించి ప్రారంభించుట మంచిది.

సవికల్ప సమాధి దృశ్యానువిద్ధమనియు, శబ్దానువిద్ధమనియు రెండు విధములు.

1. **దృశ్యానువిద్ధ సవికల్ప సమాధి :** దృశ్యములగు కామక్రోధాదులతో సంబంధము కలిగియుండు నట్టిది దృశ్యానువిద్ధము. అనగా: కామక్రోధాదులును, అహంకారాదులును, ఆత్మచే చూడబడుచున్నవి గనుక,

---

* "శ్రీ సీతారామాంజనేయ సంవాదము" నం దిట్లు చెప్పబడినది.

తే॥ లిప్తమాత్రం బవిద్యా విలిప్తమాత్ర
మైన ఘను నెన్నలేరు బ్రహ్మాదులనగ
క్షణము సర్వజగద్విలక్షణము బొందు
వాని నుతియింప దరమె యే వారికైన?

లిప్త-ఒక నిమిషము. క్షణము - నాలుగు నిమిషములు (ఇప్పటి గడియారము ననుసరించి). నిమిషమనగా: పూర్వము కనురెప్పపాటు కాలము.

Dr K Dayanandaswamy ebooks



ఆత్మ సాక్షియనియు, కామాదులు దృశ్యములు అనియు చెప్పిరి. దీని వలన ఆత్మయగు తాను దృశ్యమునకంటె వేఱైన వాడనని అసంగుడనని తెలిసికొనుచున్నాడు. అందువలన నిజమైన ఆత్మ స్వరూపమును పొందుచున్నాడు.

**2. శబ్దానువిద్ధ సవికల్ప సమాధి :**

**శ్లో॥ శుద్ధో ఽహం, బుద్ధో ఽహం, ప్రత్యగ్రూపేణ నిత్య సిద్ధో ఽహం ।**
**శాంతో ఽహ మనంతో ఽహం సతతపరానంద సింధురేవాహం ॥**
(స.వే.సి.సం. 856)

తా॥ నేను నిర్మలుడను, నేను బోధ స్వరూపుడను, నేను అంతరాత్మ స్వరూపుడను, నేను శాంతుడను, నేను పరమానంద సముద్రుడను- అని యీ విధముగ ఆత్మ స్వరూపమును నిరూపించు శబ్దములచేత నిరూపించబడిన వస్తువును భావింపవలయును.

**శ్లో॥ కామాది దృశ్య ప్రవిలాపపూర్వకం**
**శుద్ధో ఽహమిత్యాదిక శబ్దమిశ్రః ।**
**దృశ్యేన నిష్ఠస్య య ఏష భావః**
**శబ్దానువిద్ధః కథిత స్సమాధిః ॥** (స.వే.సి.సం. 862)

తా॥ కామము మొదలగు దృశ్యములను విలాపనము చేయుట, (పూర్వము చెప్పబడినట్లు దృగ్రూపమగు ఆత్మయందే నిష్ఠ కలవానికి) నేను శుద్ధుడనను మొదలగు శబ్దములలో మిశ్రితమైన ఏ భావన కలదో అది శబ్దానువిద్ధ మనబడును.

సమాధి నభ్యసించుటవలన కలుగు లాభములు:- ఆత్మభావనకు విపరీతమైన దేహేంద్రియములు నేనను భావన (ఇదియే విపరీత భావన) యును, సకల సంశయములును నశించును. జ్ఞాన ప్రతిబంధకమగు అవిద్య తొలగిపోయి జ్ఞానము ప్రకాశించును. బ్రహ్మానుభవము కలిగి బ్రహ్మానంద మనుభవించును. ఆత్మను అసద్రూపముగ గ్రహించు వాసనారూపమైన గ్రంథి లయమొందును. కర్మబంధము నశించును. అద్వితీయ బ్రహ్మమే నేనను దృఢభావము కలుగును.

Dr K Dayanandaswamy ebooks



యోగము నభ్యసించువాడు ఇతర కార్యములయందు మనస్సు ప్రవేశపెట్టగూడదు. అట్లు పెట్టిన యెడల పరధ్యానముచే తాటిచెట్టు నెక్కినవాడు క్రింద పడిపోవునట్లు పతితు డగునని శంకరులవారు చెప్పిరి.

ఎవడు చిరకాలము సవికల్పసమాధి నభ్యసించునో అట్టివానికి నిర్వికల్పసమాధి సిద్ధించును. ఈ విధముగ దృశ్యానువిద్ధ, శబ్దానువిద్ధ, సవికల్ప సమాధులు రెండును నిర్వికల్ప సమాధితో చేరి మూడగును. ఈ మూడును బాహ్యాభ్యంతర భేదములచేత ఆరగుచున్నవి. పైన చెప్పిన మూడును ఆంతరసమాధులు. బాహ్యసమాధు లనగా: బాహ్య దృశ్యానువిద్ధ, బాహ్యశబ్దానువిద్ధ, బాహ్య నిర్వికల్ప సమాధులు.

**బాహ్య సమాధులు** : ఎట్లు హృదయము (అంతరము) న మూడు సమాధులు ప్రయత్నముచే చేయబడెనో, అట్లే బాహ్య సమాధులు మూడును ద్వైతనివృత్తికై బాహ్యప్రపంచమందు చేయదగినవి.

సచ్చిదానంద రూపమగు పరబ్రహ్మము అధిష్ఠానము. ఆ యధిష్ఠానమందు నామరూపాత్మకమగు జగ మారోపింపబడి ప్రకాశించుచున్నది. తెలుపు, చల్లదనము, ద్రవము - ఈ మూడును జలముయొక్క గుణములు. ఆ జలమే గాలిచేత కదలినపుడు నిడుపుగా కనబడిన దానికి తరంగమని పేరు. నిడుపైన యాకృతియు 'తరంగ' మను పేరును ఈ రెండును రూపనామములు. ఈ రెండింటితో జలముయొక్క పైన చెప్పిన మూడు గుణములును (తెలుపు, చల్లదనము, ద్రవము) చేరి యైదయినవి. ఈ అయిదును ఒక్క జలమే.

**శ్లో॥ అస్తి భాతి ప్రియం రూపం నామ చేత్యంశపంచకం ।**
**ఆద్యత్రయం బ్రహ్మరూపం జగద్రూపం తతో ద్వయం ॥**

(దృ.వి. 22)

తా॥ 1. అస్తి (సత్తు) 2. భాతి (చిత్తు) 3. ప్రియము (ఆనందము) 4. రూపము 5. నామము. ఈ అయిదింటిని జగత్తనుచున్నారు. కాని మొదటి మూడును బ్రహ్మరూపములు. కడపటి రెండు (నామరూపములు) జగద్రూపములు.

Dr K Dayanandaswamy ebooks


నామరూపములు రెండింటిని వదలి బ్రహ్మస్వరూపమును మాత్రము గ్రహించుటయే బాహ్యసమాధి. సచ్చిదానందములగు మూడింటినుండి నామరూపములను వేఱుచేసి, నామరూపములు రెండును అవిద్యవలన ఆరోపింపబడినవని తెలిసికొని, సచ్చిదానంద స్వరూపమగు పరబ్రహ్మమును నేనేయని నిశ్చయింపవలయును. నేడు పంచభూతములు గాని, శబ్దస్పర్శాదులుగాని, దేహేంద్రియ ప్రాణమనోబుద్ధి చిత్తాహంకారములుగాని, దేశ కాలాదులుగాని కానని, వీటికన్నిటికి అధిష్ఠానమగు పరబ్రహ్మమునని భావింపవలయును.

**శ్లో॥ దేహాభిమానే గళితే విజ్ఞాతే పరమాత్మని ।**
**యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయః** ॥ (దృ.వి. 32)

తా॥ నేను దేహమను అభిమానము నశించి తానే బ్రహ్మమని దృఢనిశ్చయము కలిగిన పిమ్మట మనస్సు ఎచ్చటెచ్చటికి పోవునో అచ్చటచ్చట అప్రయత్నముగ సమాధులగు చుండును.

కారణము కార్యమునందు గలదు. కార్యము కారణమునందు లేదు. ఎట్లన, మట్టి కుండయందు గలదు, కుండ మట్టియందు లేదు. బ్రహ్మము జగత్తునందు గలదు, బ్రహ్మమునం దీజగత్తు లేదు. జలము తరంగమైనది. తరంగము నందు ఫేనబుద్బుదములు కనబడుచున్నవి. ఇవి యేవియు జలముకంటె భిన్నములు కావు. బుడగులు నురుగు నందును, నురుగు అలయందును, అల నీటియందును లయమగుచున్నవి. అట్లే సమస్త నామరూపములు బ్రహ్మమునందు లయించుచున్నవి. కనబడు వస్తుజాత మెల్లను ప్రతిక్షణమును మార్పు చెందుచున్నది. ఈ మార్పు అంతయు దేనియందు జరుగు చున్నదో అట్టి మార్పులేని బ్రహ్మమే నేను.

## (26) జీవన్ముక్తుడు

జీవన్ముక్తుడనగా : జీవించియుండగనే ముక్తిపొందినవాడని యర్థము. సన్న్యాసులను గుఱించి చెప్పిన సందర్భమున తురీయాతీతావధూతలును,

Dr K Dayanandaswamy ebooks



జ్ఞానులగు పరమహంసలును ఏలక్షణములు గలవారలని చెప్పబడెనో సామాన్యముగ అట్టి లక్షణములు గలవారే జీవన్ముక్తులు. సన్న్యాసాశ్రమము తీసికొనకయే జడభరతాదుల వంటివారు జీవన్ముక్తులైన సంగతి పురాణాదుల యందుండి మన మెఱిగియున్నాము. కనుక జీవన్ముక్తిని గుఱించి ప్రత్యేకించి చెప్పుటవలన తప్పులేదు. చిత్తశాంతి తారతమ్యములబట్టి వీరియందును తారతమ్యము లుండును. వీరిని గుఱించి శ్రుతి యిట్లు చెప్పినది.

1. మం॥ అంతశ్శూన్యో బహిశ్శూన్యః శూన్యకుంభ ఇవాంబరే ।
అంతః పూర్ణో బహిః పూర్ణః పూర్ణకుంభ ఇవార్ణవే ॥

తా॥ *ఆకాశమునందుంచబడిన ఒట్టి కుండకు లోపల నేమియును లేదు, వెలుపల నేమియును లేదు. అదేవిధముగ నీటిచేత నింపబడిన కుండ సముద్రములోపల ముంచినపుడు ఆ పూర్ణకుంభమునకు లోపలను, వెలుపలను జలము మాత్రమే యున్నది. అట్లే బాహ్యాభ్యంతరములయందు తనకంటె అన్యమేమియును లేక సర్వత్ర నిండియున్నా నను నిశ్చయజ్ఞానము గలవాడు జీవన్ముక్తుడని యర్థము. (ఈ స్థితి జీవన్ముక్తావస్థ యందు అత్యున్నత మైనది)

2. మం॥ నోదేతి నాస్తమాయాతి సుఖదుఃఖే మనః ప్రభా ।
యథా ప్రాప్త స్థితిర్యస్య స జీవన్ముక్త ఉచ్యతే ॥

తా॥ ఎవ్వని మనఃప్రకాశము సంప్రాప్త మయిన దానితో తృప్తిపడుచు సుఖదుఃఖముల యందు ఉదయాస్తమయములను (మోదఖేదములను) పొందక యుండునో అట్టివాడు జీవన్ముక్తుడని చెప్పుదురు.

---

* 1 నుండి 6 వఱకును మంత్రములు వరాహోపనిషత్తునందు కలవు. 1.వ మంత్రము మహానారాయణోపనిషత్తునందును కలదు. ఇవిగాక వరాహోపనిషత్తునందు మఱికొన్ని మంత్రములు గలవు. ఇవియే జ్ఞానవాసిష్ఠము మొదలగు గ్రంథములయందు గైకొనబడినవి. శంకరులవారు వీటిని "సర్వవేదాంత సిద్ధాంత సంగ్రహము" నందు గైకొనిరి. వివేక చూడామణియందు జీవన్ముక్తుని గుఱించి వ్రాయబడినది. తేజోబిందూపనిషత్తునందు నాల్గవ అధ్యాయమునందు జీవన్ముక్తుని గుఱించియు, విదేహముక్తుని గుఱించియు చెప్పబడినది.

Dr K Dayanandaswamy ebooks



3. మం॥ యో జాగర్తి సుషుప్తిస్థో యస్య జాగ్ర న్న విద్యతే ।
యస్య నిర్వాసనో బోధస్స జీవన్ముక్త ఉచ్యతే ॥

తా॥ ఎవడు నిద్రావస్థ యందున్నవాడై మేల్కొని యుండునో, ఎవనికి జాగ్రత్త (అనగా నింద్రియములచే విషయముల గ్రహించుట యను జాగ్రదవస్థ) లేదో, ఎవనికి జ్ఞానము వాసనారహితమయి యున్నదో, అట్టివాడు జీవన్ముక్తుడని చెప్పబడుచున్నాడు.

4. మం॥ రాగద్వేషభయాదీనా మనురూపం చరన్నపి ।
యో౽ న్తర్వ్యోమవ దత్యచ్ఛస్స జీవన్ముక్త ఉచ్యతే ॥

తా॥ రాగము, ద్వేషము, భయము మొదలగు వానికి అనుకూలముగ చరించువాడయినను, లోపల ఆకసమువలె అత్యంత నిర్మలుడై యుండునో అట్టివాడు జీవన్ముక్తుడని చెప్పబడును.

5. మం॥ యస్య నాహం కృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।
కుర్వతో౽కుర్వతోవా౽పి స జీవన్ముక్త ఉచ్యతే ॥

తా॥ కృత్యములు చేయుచున్నవాడైనను, చేయని వాడైనను ఎవని యొక్క భావము అహంకార రహితమైనదో, ఎవ్వనియొక్క బుద్ధి కర్మలయందు సంబంధపడదో అట్టివాడు జీవన్ముక్తుడని చెప్పబడును.

6. మం॥ యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః ।
హర్షామర్షభయోన్ముక్త స్స జీవన్ముక్త ఉచ్యతే ॥*

తా॥ ఎవనివలన లోకమునకు భయము లేదో; లోకమువలన (లోకుల వలన) ఎవడు భయము చెందుట లేదో; ఎవడు సంతోషము, భయము-వీటిని విడిచియున్నవాడో అట్టివాడు జీవన్ముక్తుడని చెప్పబడును.

---

* శ్రుతియందు చెప్పిన ఈ మంత్రమే భగవద్గీత 12-15 శ్లోకము. మంత్రమునందు 'స జీవన్ముక్త ఉచ్యతే' అని యుండగా గీతయందు "స చ మే ప్రియ" అని మాత్రమే భేదము. కనుక గీతయందు చెప్పబడిన భక్తుడు శ్రుతియందు చెప్పబడిన జీవన్ముక్తుడు సమానులని యర్థము.

Dr K Dayanandaswamy ebooks



**7. మం॥ న మే జాగ్ర న్న మే స్వప్నం న మే కారణ మణ్వపి ।
న మే తురీయ మితి యః స జీవన్ముక్త ఉచ్యతే ॥**
(తేజో. 4-11)

తా॥ నేను జాగ్రత్స్వప్న సుషుప్తి తురీయములు కాను - అను నిశ్చయము కలవాడు జీవన్ముక్తుడని చెప్పబడును.

**8. మం॥ అహం బ్రహ్మాస్మ్యహం బ్రహ్మాస్మ్యహం బ్రహ్మేతి నిశ్చయః ।
చిదహం చిదహం చేతి స జీవన్ముక్త ఉచ్యతే ॥** (తేజో.4-40)

తా॥ అహం బ్రహ్మాస్మి నేను బ్రహ్మము నగుచున్నాను. నేను బ్రహ్మానగు చున్నాను. నేను బ్రహ్మమును. ఇది ముమ్మాటికి నిశ్చయము. నేను చిత్స్వరూపుడను, నేను చిత్స్వరూపుడనని యెల్లప్పుడును నిశ్చయము గలవాడు జీవన్ముక్తుడని చెప్పబడును.

గీతయందు స్థితప్రజ్ఞుని గూర్చియును, భక్తుని గూర్చియును చెప్పబడిన లక్షణము లన్నియును జీవన్ముక్తునికి సరిపోవును. వైరాగ్యోపరతులు, వాసనాక్షయ మనోనాశములు కలిగి చిత్తవిశ్రాంతి నొందిన తత్త్వజ్ఞాని జీవన్ముక్తుడు.

జీవన్ముక్తివలన జ్ఞానరక్షణము, తపస్సు, విసంవాదాభావము, దుఃఖనాశము, సుఖావిర్భావము అను నైదుప్రయోజనములు సిద్ధించును.

జి : ఒకసారి కలిగిన తత్త్వజ్ఞానము ఏ విధముగను నశియించదని చెప్పితిరి గదా? అది సరియైనచో జ్ఞానరక్షణమునకు ప్రయత్నమేల?

వే : ప్రారబ్ధకర్మ వలన సంభవించు భోగములు అనుభవించియే తీరవలయును. భోగమనగా : సుఖదుఃఖానుభవము. అట్టి భోగానుభవ సమయమున చిత్తమునకు విక్షేపము కలుగును. మనోనాశ మున్నవారికి చిత్త విక్షేపము కలుగదు. బంధుజన వియోగమువలనగాని ధననాశమువలన గాని కలుగు దుఃఖము నిద్రయందు లేనియట్లు, జీవన్ముక్తునకు భోగానుభవ సమయమున సుఖదుఃఖములు తోచవు. కేవల తత్త్వవేత్తకు పునర్జన్మ లేకపోయినను సుఖదుఃఖము లుండును. మఱియు చిత్తవిశ్రాంతి లేనియెడల

Dr.K.Dayanandaswamy ebooks

సంశయ విపర్యయములు కలుగుచున్నవి. శుకమహర్షి యంతటివానికి తత్త్వజ్ఞానము కలిగియు సంశయము కలిగి జనకునిచే సంశయ నివారణ కావింపబడెనని వినియున్నాము. విపర్యయమునకు నిదాఘుని కథ దృష్టాంతముగ చెప్పబడెను. సంశయ విపర్యయములు తత్త్వజ్ఞాన ఫలమునకు ప్రతిబంధములైనవి. ఈ సంశయ విపర్యయములకే అసంభావన, విపరీత భావనలను నామాంతరములు గలవు. గీతయం దిట్లు చెప్పబడెను. "అజ్ఞానియు, విశ్వాసము లేనివాడును, సంశయాత్ముడును చెడిపోవుచున్నాడు. సంశయాత్మునకు ఇహపరసుఖములు కలుగజాలవు"- (గీత. 4-40). చిత్తశాంతికొఱకు భగీరథుడెట్టి ప్రయత్నము జేసెనో, జ్ఞానవాసిష్ఠమునందలి భగీరథోపాఖ్యానము చదివిన తెలియగలదు.

జి : జ్ఞానియగు నొక పురుషుడు నిర్వికల్పసమాధి యందే అధికకాలము గడపును. లోకవ్యవహారములయందు ప్రవేశింపడు. మఱియొకడు జ్ఞానియయ్యును లోకవ్యవహారములయందు ప్రవేశించును. వీరిద్దరు సమానులేనా?

వే : ఈ ప్రశ్న 'జ్ఞానవాసిష్ఠము' నందు కలదు. అచట వసిష్ఠమహాముని శ్రీరామచంద్రునిచే అడుగబడి ఇట్లు సమాధానము చెప్పినట్లున్నది:- వీరిద్దఱును అంతఃకరణమందు శీతలత్వము కలిగి యుండిరా - ఇరువురును సమానులే. శీతలత్వమనగా : తృష్ణాదిదోషములు హృదయములో లేకుండుట. విద్యారణ్యులవారు జీవన్ముక్తి ప్రకాశిక (జీవన్ముక్తి వివేకము) యం దీవిషయమును చర్చించి పై యిరువురి యందును సమాధియందుండువారే గొప్పవారని నిశ్చయించిరి. కాని నా యభిప్రాయమట్లు కాదు. సమాధికిని, ద్వంద్వ ప్రపంచమునకునుగూడ ననుగుణముగా ప్రవర్తించినవారే గొప్పవారు.

జి : జ్ఞానియై అంతశ్శీతలత్వము గల పురుషుడు లోక సంగ్రహార్థము లోకవ్యవహారములయందు ప్రవేశించిన లోకమునకు మేలు చేయుచున్నాడు. జ్ఞానియై అంతశ్శీతలత్వము గలవారు సమాధియందే యుండినచో వారు లోకమున కేమియు మేలు చేయరుకదా?

Dr K Dayanandaswamy ebooks

వే : మొదటివారి వలనవలెనే, రెండవవారి వలనను లోకహితము కలుగును. సమాధియందుండువారు లౌకిక వ్యవహారములయందు ప్రవేశింపక పోయినను వారి నాశ్రయించిన శిష్యుల ననుగ్రహించుచున్నారు. శిష్యులయందు మందాధికారులను దృష్టిచేతను, మధ్యమాధికారులను మనస్సుచేతను అనగా: మనస్సులో వీరు కృతార్థులు కావలయునని తలంచుట చేతను, ఉత్తమాధికారులను హస్తమస్తక సంయోగరూపమైన స్పర్శచేతను అనుగ్రహింతురని పెద్దలు చెప్పిరి. అదియునుగాక ఇట్టి సత్పురుషులను దర్శించినవారికి పాపక్షయ మగును. సేవించినవారికి పుణ్యము కలుగును. కనుక ఇదియును లోకహితమేకదా? జీవన్ముక్తునకు సమాధితో అవసరము లేదు. అదిగాక జీవన్ముక్తుడు కర్మలు చేయవలయుననిగాని, కర్మలను వదలవలెననిగాని సమాధియందే యుండవలెననిగాని విధిలేదు. విధినిషేధములు సామాన్యులకేగాని జీవన్ముక్తునకు లేవు. వారిని ఎట్టిశాస్త్రములును విధింపలేవు. బాలుడు విధికి లొంగపలసినది లేదు. ఇట్లే జీవన్ముక్తుడును శాస్త్రమునకు లొంగవలసినది లేదు. (వే.పం. 9-102, 103, 105, 106)

## (27) జ్ఞానికి ఆకాశగమనాది శక్తులుండునా?

జి : తత్త్వజ్ఞానిగాని, జీవన్ముక్తుడు పురుషుడు గాని శాపానుగ్రహశక్తులు, ఆకాశగమనాదులు, అణిమాది సిద్ధులు కలిగి ఉండునా?

వే : తత్త్వజ్ఞానము కలుగుటకు పూర్వము తపస్సునుగాని ఉపాసనలనుగాని చేసియుండినవారికే శాపానుగ్రహశక్తి కలుగను. అట్లే తత్త్వజ్ఞానమునకు పూర్వము యోగాభ్యాసము చేతగాని తపస్సుచేతగాని ఆకాశగమనాది శక్తులను అణిమాద్యష్ట సిద్ధులను ఆర్జించియుండి, అవి యన్నియును అస్థిరములని తలచి పరమపురుషార్థమగు ముక్తిని సాధింపవలయునని ఆసక్తి కలిగి తత్త్వజ్ఞానము నార్జించిన పురుషుని యందు అట్టి శక్తులుండును. అట్లుగాక కేవల తత్త్వజ్ఞానియందుగాని,

Dr K Dayanandaswamy ebooks



జీవన్ముక్తునియందుగాని ఆకాశగమనాది శక్తులుగాని, శాపానుగ్రహ శక్తులుగాని సహజముగ నుండవు. ఉదాహరణమునకు - కృష్ణద్వైపాయనులు, శుకమహర్షిని జనకమహారాజు దగ్గఱకు పంపునపుడు ఆకాశమార్గమునందే పొమ్మనెను. శుకమహర్షియు మేరు పర్వతమునుండి భరతఖండమునందున్న మిథిలానగరమునకు ఆకాశమార్గమునందే వచ్చినట్లు మహాభారత శాంతిపర్వమునందు చెప్పబడినది. కృష్ణద్వైపాయనాది మునులు కొందఱు అణిమాది సిద్ధులు గలవారుగను, జీవన్ముక్తులుగను నున్నట్లు తెలియుచున్నది.

కాని, ఇవన్నియును బ్రహ్మసాక్షాత్కారమునకు పూర్వమే యార్జించి యుండవలయును. బ్రహ్మసాక్షాత్కారమైన పిమ్మట ఎవ్వరును వీటిని సాధింపరు. ఏలయన: **"సంకల్ప ప్రభవాన్ కామాన్"** (గీత) సంకల్ప ముండినసే కోర్కె కలుగుచున్నది. కోర్కెగలవారే యీ సిద్ధుల నార్జింతురు. మఱియు ఆకాశగమనాదులు ఓషధులయొక్క మహిమచేతను, మంత్ర ప్రభావమునను ఆర్జింపవచ్చును. ఇవి పామరులకు వింతలుగా కనబడునేగాని బ్రహ్మపరోక్షము గల పురుషునకు వింతలుగా కనబడవు. ఏనుగుపైన అంబారిలో పోవువాడు శునకాదులపై నెక్కి పోవుటకెట్లు ఇచ్చగింపడో ఆ విధముగనే ఆత్మరతుడగు జ్ఞాని వీటిచే ఆనందింపడని పెద్దలు చెప్పిరి. కాని కృష్ణద్వైపాయనాదులు కొందఱు లోకానుగ్రహార్థమై యిట్టిమహిమలను అప్పుడప్పుడు చూపినట్లు గలదు.

బ్రహ్మజ్ఞాని నిర్మలచిత్తు డగుటచేతను, బ్రహ్మస్వరూపుడే యగుటచేతను ఆయన నోటవచ్చిన వాక్యము సత్యమే యగును. ఒకరిని ఆశీర్వదింప వలయుననిగాని నిందింప వలయుననిగాని అట్టివారికి అభిప్రాయము లేకపోయినను ఈశ్వరేచ్ఛచేతను, ఎదుటి వారి కర్మానుసారముగను శాపానుగ్రహరూపమైన వాక్కు వారినోటినుండి వెలువడవచ్చును. అది సత్యమే యగును. తత్త్వజ్ఞానము కలుగుటకు ముందు జ్ఞాన భూమికలయందు మొదటి మూడు భూమికలును తపస్సునకు చెందినవే.

Dr K Dayanandaswamy ebooks



ఆ తరువాత భూమికల నభ్యసించినవారు నిర్వికల్ప సమాధిని నభ్యసించిరి గనుక నిర్వకల్పసమాధియు గొప్పతపస్సే. అందువలన తత్త్వజ్ఞానులును, జీవన్ముక్తులును తపస్సు లేనివారని చెప్పుటకు వీలులేదు. అట్టి తపస్సు మహిమలకు పనికిరాదు. బ్రహ్మవేత్తలు పూర్వజన్మ జ్ఞానమును గాని, పరోక్ష జ్ఞానమునుగాని, యితర శక్తులనుగాని సంపాదింపవలయు నన్నచో ఇతరులకంటె సులభముగ పొందగలరు. 5, 6 జ్ఞానభూమికల యందున్నవారు సంకల్పమాత్రముననే పొందగలరు. కాని వారు సంకల్ప రహితులగుటచే వారియందు సిద్ధులుండవు. జ్ఞానార్జనకు పూర్వమే వారు అణిమాది సిద్ధులు సంపాదించి యుండినను, వారు సమాన్యముగ వాటిని ప్రదర్శింపరు. ఇది జ్ఞానుల పద్ధతి.

శ్రీ వివేకానంద స్వాములవారు పాతంజల యోగసూత్రముల వ్యాఖ్యానమునందు (1-17 సూత్ర వ్యాఖ్యానమున) ఇట్లు వ్రాసిరి.

"యోగసిద్ధులను బొందుట ముక్తి కానేరదు. అందులకై ప్రయత్నించుట ఐహిక సుఖాన్వేషణమే కాని మఱియొకటి కాదు. సుఖమనునది ఐహిక జీవనమునందు లేదు. కావున సుఖాన్వేషణము నిరర్థకము. ఈ పురాతన గుణపాఠమును గ్రహించుట మానవునకు దుస్సాధముగా నున్నది. ఎట్లో గ్రహించెనా, అట్టి మానవుడు ప్రపంచాతీతుడై ముక్తుడగుచున్నాడు. యోగసిద్ధులు పొందుటవలని ఫలమేమి? సంసార బంధమును మఱింత బలీయముగా జేసికొనుటయే, దుఃఖములను మఱింత దృఢ పఱచుకొనుటయే అందులకు ఫలము. శాస్త్రకారుని విధి ననుసరించి పతంజలి యోగసిద్ధులను వెల్లడించియున్నను, వీనిని గుఱించి జాగరూకులమై యుండవలయునని మాటి మాటికి మనలను హెచ్చరించుచునే యున్నాడు" (శ్రీ రామకృష్ణ మఠమువారి రాజయోగము.)

యోగమును ప్రతిపాదించు ఉపనిషత్తులయందు మఱియొక విధముగా చెప్పబడెను. ఎట్లనగా: కాశీయాత్ర చేయువానికి మార్గమధ్యము నందనేక పుణ్యతీర్థము లెదురైనట్లు అభిలషించినను, అభిలషింపక పోయినను

Dr K Dayanandaswamy ebooks


జీవన్ముక్తునకు తప్పక యోగసిద్ధులు కలుగుననియు, అలౌకిక గుణము లతని కలవడి యుండుననియు, అవి చూచి అతడు సిద్ధుడని తెలిసికొనవలయు ననియు యోగశిఖోపనిషత్తు చెప్పినది. (1-157 నుండి 160) ఇందువలన పాతంజల యోగులు మహిమలు ప్రదర్శింతురని తలంపవచ్చును.

## (28) విదేహ కైవల్యము (తురీయాతీతము)

విదేహముక్తిని గుఱించి యిదివఱలో జ్ఞానభూమికలు చెప్పిన సందర్భమునందు తురీయాతీతము సత్తా సామాన్యమను విషయ విచారమునందును చెప్పబడినది.* అంతకంటెను - విస్తరించి చెప్పనవసర ముండదు. కాని, జీవన్ముక్తుడును, తత్త్వజ్ఞానియు వీరిరువురు ప్రారబ్ధ భోగానంతరము పండిన ఆకు చెట్టునుండి రాలి క్రిందపడునట్లు దేహపతనానంతరము బ్రహ్మస్వరూపులే, బ్రహ్మమే యగుచున్నారు. ఈ విషయము -

**శ్లో॥ విదేహముక్తిరేవాత్ర తుర్యాతీత దశోచ్యతే ।**
**యత్ర నాసన్న సచ్చాపి నాహం నాప్యనహంకృతిః ॥**
**కేవల క్షీణ మనన ఆస్తే ఽద్వైతే ఽతినిర్భయః ॥** (న.వే.ఫ.నం.)

**తా॥** ఏ దశయందు సత్పదార్థముగాని, అసత్పదార్థముగాని, అహంకారముగాని, దానికంటె నితరములగు బుద్ధ్యాదులుగాని లేవో; ఏదశయందు నిస్సంకల్పుడును, నిర్భయుడునునై, పూర్ణభావమున నుండునో-అట్టి దశయే విదేహముక్తి యనియు, తురీయాతీత దశయనియు చెప్పబడును. ఇట్టి దశయందు పురుషుడు జీవించియుండెనా పైనున్న వస్త్రము జారి క్రిందపడిపోయినను తెలియదు.

ఇట్టి మహనీయులకు నమస్కరించుచున్నాను. వీరి ఆశీర్వాదము మాకు లభించుగాక!

---

* ఈ గ్రంథముయొక్క ప్రథమ భాగము 2, 4, 5, 46 అధ్యాయములు చూడుడు.

Dr K Dayanandaswamy ebooks



"స్థానం న మానం న చ నాద-బిన్దు-
రూపం న రేఖా న చ ధాతువర్ణమ్।
ద్రష్టా న దృశ్య శ్రవణం న శ్రావ్యం
తస్మై నమో బ్రహ్మ నిరఞ్జనాయ॥

- * -

ఇది, పరమేశ్వరానుగ్రహమువలన మట్టిబోయిన రామసుబ్బయ్యచే
రచియింపబడిన "బ్రహ్మ జిజ్ఞాస" ద్వితీయ భాగమునందలి
'జ్ఞానయోగ'మను మొదటి ప్రకరణము సంపూర్ణము.

**ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః**

*

Dr K Dayanandaswamy ebooks

ఓమ్
శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః

# బ్రహ్మజిజ్ఞాస

## (ద్వితీయ భాగము)

## రెండవ ప్రకరణము - రాజయోగము

**కం॥ మతిగల సాంఖ్యులు యోగా**
**న్వితులు నగు మహాత్ము లెవ్వనిం గని పునరా**
**గతి లేని సుగతి వడయుదు**
**రతర్క్య వైభవుని దలంతు నప్పరమాత్మున్.**

(ఆం.మ.భా.శాంతి. 4-229)

### (1) అవతారిక

**జిజ్ఞాసువు ప్రశ్న** : అయ్యా! నాయం దనుగ్రహముతో బ్రహ్మ విచారమును, బ్రహ్మవేత్త యగుటకు కావలసిన సాధన సంపత్తిని. ఉపాసనను, సన్న్యాసమును, తత్త్వజ్ఞానియొక్కయు జీవన్ముక్తునియొక్కయు లక్షణములను, జీవన్ముక్తికి కావలసిన వాసనాక్షయ మనోనాశములను సాధింపవలసిన విధమును, సమాధికి కలుగు విఘ్నములును, బాహ్యాభ్యంతర సమాధులు కలుగు విధమును, జ్ఞానికి ఆకాశగమనాది శక్తులుండవను విషయమును వివరించితిరి. 'జీవన్ముక్తుడు కోరినను, కోరకపోయినను అతనికి సిద్ధులు కలుగునని' యోగశిఖోపనిషత్తు చెప్పినట్లు చెప్పితిరి - యోగస్వరూప మెట్టిది? యోగమార్గము ఉపనిషత్తులకు సమ్మత మైనదేనా? దానికి ప్రథమాచార్యు లెవ్వరు? దానిని విస్తరింపజేసిన వారెవ్వరు? యోగజ్ఞానములకు గల పరస్పర సంబంధ మెట్టిది?

Dr K Dayanandaswamy ebooks



తత్త్వజ్ఞానమువలన మానవుడు ముక్తుడగునట్లు యోగవిద్యవలన ముక్తుడగునా? ఎట్లు ముక్తుడగును? యోగమార్గమున ముక్తుడైనచో జ్ఞానమని, యోగమని రెండు మార్గములేల? ఏ యొక్కటైనను చాలదా? ఈ విషయము లన్నియు దయయుంచి తెలుపుదురని ప్రార్థన.

## (2) యోగతత్త్వము

**వేదాంతి :** యోగదర్శనము ఇతర దర్శనములకంటె కొంత విలక్షణమైనది. ఇందు సాధనభాగము ముఖ్యము. మన యింద్రియ వ్యాపారములును, మనస్సును మేధస్సు నందలి ఒక్కొక్క కేంద్రమునుండి పనిచేయుచున్నవనియు, మేధస్సుతో సంబంధము లేనట్టి యింద్రియాతీతమైన జ్ఞానము కలదనుట భ్రమయనియు శారీరక శాస్త్రజ్ఞులు చెప్పుదురు. ఇంద్రియములతోను, మేధస్సుతోను సంబంధము లేని అనగా: అతీంద్రియ జ్ఞానమును, అద్భుతశక్తులను యోగులు పొందియుండుటను శారీరక శాస్త్రజ్ఞులు చూచినపుడు విస్మితులగుదురు. పరోక్షజ్ఞానము కలిగిన యోగులు ఎచ్చటనో జరిగి నట్టియు, నేత్రేంద్రియ గోచరము కానట్టియు, విషయముల నెట్లు చూడగలిగి రనుటకు ఎట్టి భౌతిక విజ్ఞానశాస్త్రము కాని, శారీరక శాస్త్రముకాని సమాధానము చెప్పలేదు.

సంకల్పమాత్రమున కొన్ని పదార్థములను సృష్టించు యోగులను చూచియున్నాము. ప్రాచీన భారతీయ విజ్ఞానసంపన్నులు, మానసాతీతములును, నిగూఢములును నగు ఆత్మశక్తులను అనుభవపూర్వకముగ చూచి వాని నితరులు తెలిసికొనుటకు గాను యోగ శాస్త్రములను రచియించిరి. ఇట్టి మహాద్భుత శాస్త్రము ఇతర దేశములయందు లేదు. ఈ శాస్త్రజ్ఞానము వలన దేహేంద్రియాద్యుపాధులకు భిన్నమైనట్టి ఆత్మ దేహమునందు కలదని, ఆత్మసాన్నిధ్యబలమున సాధకుడు యంత్రములతో బావినుండి నీటిని తోడినట్లు అద్భుతశక్తు లనేకములు పొందవచ్చునని రుజువైనది. కష్టపడి శరీరమును, చిత్తమును వశమొనర్చుకొను సాధకుడు (యోగి) ఈ క్రింది లాభములు పొందగలడు.

Dr K Dayanandaswamy ebooks



(1) యోగమువలన సమ్యక్ జ్ఞానము (లెస్సయగు జ్ఞానము) కలుగును. తన స్వరూపము నెఱిగి ప్రకృతిబంధమునుండి విముక్తి పొందగలడు. (2) అతీంద్రియ జ్ఞానమును అద్భుతశక్తులను పొందగలడు. (3) ఆరోగ్యవంతుడును, ఆయుష్మంతుడునునై యుండగలడు. చిత్తమునకు శాంతి లభించును. ఇట్టి సాధనవిధానము నీ శాస్త్రము బోధించుచున్నది.

నాశరహితమగు నీ యోగమును యోగి పూర్వజన్మమున నెంతవఱకు సాధించియుండెనో, అట్టి సాధనయం దల్ప భాగమైనను వ్యర్థముగ నశియింపకుండ, మఱుజన్మమున (పూర్వజన్మానుభవముతో) యోగమును ప్రారంభించుచున్నాడు. మనదేశమునం దప్పుడప్పుడు ఇట్టి యోగులు జన్మించి యిట్టి సత్యమును రుజువుచేయుచుందురు.

యోగశబ్దము అనేకములగు అర్థములయందు వాడబడుచున్నను ఈ శాస్త్రమున సూ॥ **యోగః చిత్తవృత్తి నిరోధః.** (పా.యో.సూ. 1-2) యోగమనగా: చిత్తవృత్తి నిరోధము. "**యోగమితి మన్యంతే స్థిరామింద్రియ ధారణాం**" స్థిరముగ ఇంద్రియములను ధరించుటయే యోగము. వేదాంతులును, సాంఖ్యులును చెప్పు మనోబుద్ధ్యహంకారములను మూటిని యోగులు చిత్తమందురు. సూత్రమున చిత్తనిరోధమని చెప్పక చిత్తవృత్తుల నిరోధము యోగమని చెప్పబడినది. చిత్తవృత్తి యననేమో పూర్వము కూటస్థ చిదాభాసుల (1-2-26) విచారమునందు చెప్పియుంటిని. చిత్తమునకు నింద్రియముల ద్వారా బాహ్యవస్తు సంయోగము కలిగినపుడు చిత్తమాయా వస్తురూపమును పొందుచున్నది. ఉదా:- ఘటమును చూచినపుడు పురుషసాన్నిధ్య ప్రభావమున చిత్తము ఘటాకారమును పొందుచున్నది. ఇట్లు ఘటాద్యాకారముగ పరిణమించిన చిత్తమునే చిత్తవృత్తియని యందురు. చిత్తము ఇట్లు బాహ్యవస్త్వాకారమును పొందకుండ సహజస్థితియం దుండుటయే యోగము.

ఈ యోగము (1) మంత్ర (2) లయ (3) హఠ (4) రాజ యోగములని నాలుగు విధములు. యోగతత్త్వోపనిషత్తు ఈ నాలుగింటిని

Dr K Dayanandaswamy ebooks



సంగ్రహముగ చెప్పినది. మహాభారత శాంతిపర్వమున భగవంతుడే యోగశాస్త్రకర్తయని చెప్పబడినది.

**కం॥ విను, యోగంబు హిరణ్యం**
**బన బరగును, యోగ గర్భుడగుటను విద్వ**
**జ్జనములు హిరణ్యగర్భుం**
**డని నను గొనియాడుదురు మహాగుణశాలీ !**

**(ఆం.మ.భా.శాంతి 6-439)**

యోగమునకు హిరణ్యమని పేరగుటవలన దాని గర్భమున నుండువాడు (యోగముచేత తెలియబడువాడు) అగుటచే తనకు హిరణ్యగర్భుడను పేరు కలిగినదని శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు చెప్పినట్లు కలదు. సమస్తజ్ఞానమునకు భగవంతుడే మూలము. అందువలననే భగవంతుడు గురువులకు గురువని చెప్పబడినది. హిరణ్యగర్భుడను ఋషి యోగశాస్త్రకర్త యని చెప్పుదురు. ఏ శాస్త్రముగాని దాని సమగ్ర స్వరూపముతో నొకవ్యక్తినుండి యొక్కసారిగ కలుగదు. అదివఱకు చెదరుగనున్న సిద్ధాంతములను, పూర్వుల యొక్క అనుభవమును, సంప్రదాయముగ గురుశిష్య పరంపరనుండి వచ్చిన వివేకమును సేకరించి స్వీయానుభవముతో చేర్చి శాస్త్రకర్త శాస్త్రమును రచించును. పతంజలిమహర్షి యోగశాస్త్రమునకు సంపూర్ణస్వరూపమును కలిగించి సూత్రములు రచించుటవలన యోగసూత్రములకు పాతంజల యోగ సూత్రములనియు, యోగమునకు పాతంజల యోగమనియు పేర్లు కలిగినవి. యోగసూత్రములకు వ్యాసుడు, (కృష్ణద్వైపాయన మునీంద్రులు కాదు) విజ్ఞానభిక్షువు మొదలగువారు భాష్యములు రచించిరి. వ్యాసుని భాష్యమునకు వాచస్పతి వ్యాఖ్యను రచించిరి. శ్రీ వివేకానంద స్వాములవారు యోగసూత్రములకు రాజయోగమనుపేర వ్యాఖ్యను రచించిరి. ఇది చాల ముఖ్యమగు గ్రంథము.

## (3) సాంఖ్యము - యోగము

సాంఖ్యసిద్ధాంతముతో యోగసిద్ధాంతమునకు సన్నిహిత సంబంధము కలదు. ఇవి రెండును ప్రత్యేకమైన రెండు దర్శనములైనను మొదట నీ

Dr K Dayanandaswamy ebooks



రెండును ఒక్క దర్శనముగా నుండెనేమోయని తోచును. లేదా, ఇవి రెండును కవలబిడ్డల వంటివని యైన చెప్పవచ్చును. మహాభారతమున సాంఖ్యప్రసక్తి వచ్చినప్పుడెల్లను(చాలవఱకు) యోగప్రసక్తి వచ్చుచుండును. బ్రహ్మసూత్రములయందు 2వ అధ్యాయారంభమున మొదటి అధికరణము నందు సాంఖ్యమును, రెండవ అధికరణమున యోగమును చర్చింపబడెను. శాంతిపర్వమున భీష్మని ధర్మరాజు యోగసాంఖ్యములం దేది యుత్తమోత్తమమార్గ? మని అడిగిన ప్రశ్నకు భీష్ముడు-

**కం॥ విను, సాంఖ్యమ్మును యోగము**
**నను పేళ్లులకాని దీనియం దదియును దా**
**న నిదియు దోచుచు నుండుం,**
**గను దత్త్వ విచారి యొకడకా నీ రెంటన్.** (ఆం.మ.భా.శాంతి)

తా॥ సాంఖ్యము యోగమునని పేళ్లుమాత్రమే కాని యీ రెండును ఒక దానియం దింకొకటి కలదనియు, నీ రెండును ఒక్కటిగ తత్త్వవేత్తలు చూతురనియు చెప్పెను.

ఇదిగాక అనుశాసనిక పర్వమునందలి హరసనత్కుమార సంవాదమునందును, ఉమామహేశ్వర సంవాదమునందును, అశ్వమేధ పర్వమునందలి శ్రీకృష్ణార్జున సంవాదమున (అనుగీతలయందు)ను సాంఖ్య యోగ మతములు ఒక్కచోటనే ఒకదాని తరువాత నొకటి చెప్పబడెను. దీనిని బట్టి సాంఖ్య, యోగ దర్శనములకు గల సన్నిహిత సంబంధము బోధపడుచున్నది.

సాంఖ్యదర్శనము మొదట ఈశ్వరాస్తిత్వమును గుఱించి తటస్థభావమును వహించినది. అంతమాత్రముచేత సాంఖ్యమతము నాస్తికమతము కాదు. ఈశ్వరుడు లేడని సాంఖ్యము వాదించదు. మఱేమనగా ఈశ్వరుడున్నా డనుటకు తృప్తికరమైన హేతువు లేదని మాత్రమే చెప్పును. శ్రుతులు ఈశ్వరాస్తిత్వమును గుఱించి చెప్పు వాక్యములని వారివాదము. సాంఖ్యతత్త్వమును పరిశీలించినచో సాంఖ్యులకు ఈశ్వరాస్తిత్వ విశ్వాసముతో అవసరము లేదని తోచును. వీరు చెప్పు ప్రకృతియే

Dr K Dayanandaswamy ebooks


ప్రపంచసృష్టిని చేయును. ప్రకృతియు దానివలన కలిగిన వికారములును కలిసి యిరువదినాలుగు తత్త్వము లగును.

**"న ప్రకృతి ర్న వికృతిః పురుషః"** - పురుషుడు ప్రకృతియు కాడు, వికృతియును కాడు. (వీరి సృష్టి విధానమును గుఱించి ఈ గ్రంథమునందలి 1-2-16 నందు చెప్పి యుంటిని) ప్రకృతి సాన్నిధ్యమున, ప్రకృతికార్యములను పురుషుడు తనవిగా భావించుటవలన పురుషునకు బంధమేర్పడినది. యథార్థమునకు పురుషుడు నిర్గుణుడు, నిష్క్రియుడు. ఇట్టి ప్రకృతి పురుష వివేకమువలన ప్రకృతి బంధమునుండి పురుషుడు విడివడుటయే మోక్షము. పైన చెప్పిన వారసనత్కుమార సంవాదమునందు ప్రకృతి, దాని వికారములు ఇరువది నాలుగనియు, ఇరువది యైదవవాడు పురుషుడనియు చెప్పబడినది. **ఆ పురుషుడే ప్రకృతి బంధమునందుండి విముక్తుడయిన పిమ్మట ఇరువది ఆఱవ తత్త్వముగ గణింపబడెను.** ఇది గమనింపవలసిన విషయము.

ప్రాచీనములని చెప్పబడు ఈశ్వర కృష్ణుని సాంఖ్యకారికల యందును, మహాభారత శాంతిపర్వమున జనకునకు పంచశిఖు డుపదేశించిన సాంఖ్యతత్త్వ ప్రకారమునందును, ఈశ్వర ప్రస్తావనము లేదు. కపిలమహర్షి ప్రణీతములని చెప్పబడు సాంఖ్య సూత్రములందును (సా.సూ. 1-60 నుండి 64 వఱకు) భాగవతపురాణము నందలి 'కపిలుడు దేవహూతి కుపదేశించిన సాంఖ్యతత్త్వము నందును, ఈశ్వరాస్తిత్వ మంగీకరింపబడుటయే గాక ఈశ్వరభక్తియును దాని కనుబంధముగ చెప్పబడెను. తరువాత వెలువడిన పురాణములయందు ఈ విధానమే అంగీకరింపబడెను. సాంఖ్యసూత్రములు రచింపబడిన కాలమున సమాజమునం దీశ్వరభక్తి అధికముగా నుండి యుండును. ఆ ప్రభావమే సాంఖ్యసూత్రములందును, పురాణములయందు చెప్పబడిన సాంఖ్యమతము నందును చొచ్చియుండును. సాంఖ్యసూత్రములయందు ఈశ్వరస్వరూపమిట్లు చెప్పబడెను:

**సూ॥ వ్యావృత్తోభయరూపః॥** (సా.సూ. 1-160)

Dr K Dayanandaswamy ebooks


ప్రకృతి, పురుషుడు నను వీరిరువుర స్వరూపముకంటెను విలక్షణరూపము కలవాడు ఈశ్వరుడు. ఇతడు జగత్సాక్షి; నిత్యముక్తుడు; ఉదాసీనుడు.

యోగులు ఈశ్వరాస్తిత్వమును అంగీకరించిరి. కాని అద్వైతులు, ద్వైతులు, విశిష్టాద్వైతులు చెప్పునట్టి ఈశ్వర స్వరూపమునకును; సాంఖ్యులు, యోగులు చెప్పునట్టి ఈశ్వర స్వరూపమునకును భేదము కలదు. సాంఖ్యులు, యోగులు చెప్పు ఈశ్వరుడు సృష్టికర్తగాని, లోకపాలకుడుగాని కాడు. యోగులిట్లు చెప్పిరి :

**సూ॥ క్లేశకర్మ విపాకాశయై రపరామృష్టః పురుష విశేష ఈశ్వరః॥**
(పా.యో.సూ. 1-24)

అవిద్యాదిక్లేశములు, ధర్మాధర్మములనెడి కర్మములు, అట్టి కర్మల ఫలమైన జన్మజరా మృత్యువులనెడి వికారములు, వీటిని కలిగించు వాసనలు లేని పురుష విశేషము ఈశ్వరుడు. అతని కంటె సమానుడుగాని, అధికుడుగాని లేడు.

ఈశ్వరుడు కలడనుటకు అనుమానమే ప్రమాణము (ప్రమాణములను గుఱించి ఈ గ్రంథమునందలి ప్రథమ భాగము 2-37 చూడు) లోకమున నొకని కంటె నింకొకనియందు జ్ఞానము అధికముగా గలదు. ఇట్టి హెచ్చు తగ్గులు ప్రత్యక్షముగ కనబడుటచే మనకు ప్రత్యక్షముగాని సర్వజ్ఞశక్తి యొకటి యుండితీరవలయును.

**సూ॥ తత్ర నిరతిశయం సర్వజ్ఞ బీజమ్.॥** (పా.యో.సూ. 1-25)

నిరతిశయము, సర్వజ్ఞతకు నిమిత్తకారణమునగు బీజమతడు. "అతడే గురువులకు గురువు." (పా.యో.సూ. 1-26)

"అతని పేరు ఓమ్" ప్రణవము (పా. యో. సూ. 1-27) అతని నామజపము చేతను, అతనిని భావించుట వలనను సమాధికి అంతరాయము తొలగి, యోగికి సమాధి సిద్ధించును. (పా. యో. సూ. 1-

 Dr.K.Dayanandaswamy ebooks

28, 29) దీనిని ఈశ్వర ప్రణిధానమందురు. (పా. యో. సూ. 1-23) యోగు లీశ్వరాస్తిత్వమును అంగీకరించుట వలన వీరిని సేశ్వరసాంఖ్యు లందురు. సేశ్వర సాంఖ్యు లందఱును సృష్టికి ఈశ్వరుడు నిమిత్త కారణమును, ప్రధానము ఉపాదాన కారణమునని చెప్పుదురు. కాని యిది సాంఖ్యమతమునకు సహజముగ కనబడదు. వేదాంతులనుండి గ్రహింపబడినదని తోచును. పురుష సాంగత్యమున ప్రకృతి తన సామ్యావస్థను కోల్పోయి, జగత్కల్పన మారంభించుననెడి ప్రాచీన సాంఖ్య సిద్ధాంతము ననుసరించి ప్రకృతికి పురుషులతోటి సాంగత్యము ఒకప్పుడు కలిగినది కాదు. నిత్యమయినది. నిత్యమయినదని అంగీకరించినచో ప్రకృతి విశ్రాంతి నొందక యెప్పటికిని విశ్వరచన జరిపించుచునే యుండవలయును. ప్రళయ మనునది యుండదు. అందువలన ఈశ్వరాస్తిత్వమును సాంఖ్యు లంగీకరించి యీ చిక్కును విడదీసికొని యుండవచ్చును.

పురుషుని భోగము కొఱకుగాని, మోక్షము కొఱకుగాని ప్రకృతి సృష్టిని సాగించు చున్నదని ప్రకృతికి స్వలాభ మేమియు లేదని చెప్పుదురు. తాను పురుషుని ప్రయోజనమునకై పాటుపడుచుండెనని ప్రకృతికి తెలియదు. ఇది సాంఖ్యయోగ తత్త్వముల సంగ్రహ స్వరూపము.

ఈ సాంఖ్యయోగ దర్శనములు బ్రహ్మసూత్రముల యందు స్మృతులని పేర్కొనబడినవి. ఇచ్చట స్మృతులనగా తత్త్వము నుత్పాదించు నట్టివని యర్థము. మన్వాదిస్మృతులు వర్ణాశ్రమ ధర్మములు, ఉపనయనము, సన్న్యాసము మొదలగు విధులాచరింపవలసిన విధానమును, వారసత్వము మొదలగు ధర్మార్థకామములను బోధించునట్టివి. సాంఖ్యయోగస్మృతు లన్ననో పరమ పురుషార్థమగు మోక్షమును బోధించును.

### (4) యోగము - జ్ఞానము

భగవద్గీతయందు ఆత్మసంయమ యోగమను నాఱవ యధ్యాయమున యోగమును గుఱించి చెప్పబడినది. పతంజలి మతముతో వేదాంతులు పూర్తిగా నేకీభవింపకున్నను సాధన విధానమునందు ఏకీభవింతురు.

Dr K Dayanandaswamy ebooks


యోగతత్త్వము ఉపనిషత్తులయందు గలదు. ప్రస్థాన త్రయమందు గల దశోపనిషత్తులు కాక తక్కిన 98 ఉపనిషత్తులలో యోగోపనిషత్తులు ఇరువది.*

ఈ యిరువది యుపనిషత్తులయందు కొన్నింటిలో యోగమే కాక వేదాంతము సహితము గలదు. ఇవిగాక శ్వేతాశ్వతరోపనిషత్తు మొదలగు వేదాంత ప్రతిపాదకములగు మఱికొన్ని యుపనిషత్తులయందు యోగము సహితము చెప్పబడెను. సాంఖ్యయోగములు రెండును ద్వైతమతములు. పతంజలి మహర్షి ద్వైతి. కాని యోగ ప్రతిపాద్యములగు నుపనిషత్తులు అద్వైతమునే చెప్పినవి. అద్వైతులవలెనే యోగులును జీవన్ముక్తి కలదని యంగీకరింతురు.

జ్ఞానులు కేవల తత్త్వజ్ఞానము వలననే ముక్తి కలుగుననియు, కేవల సాంఖ్యముగాని, కేవల యోగము మొదలయినవిగాని జ్ఞానమునకు సాధనములే గాని సాక్షాన్మోక్షప్రదములు కావనియు చెప్పుదురు. కేవల తత్త్వజ్ఞానము మాత్రమే మోక్షము నొసగ జాలదని యోగశాస్త్రము చెప్పును. కొందఱు యోగులు కేవలము యోగము మాత్రమే మోక్షసాధనమని చెప్పుదురు. మోక్షమునకు, జ్ఞాన-యోగములను రెండు సాధనము లవసరమని యోగశిఖోపనిషత్తు చెప్పుచున్నది. (1-12, 13)

**మం॥ యోగేన రహితం జ్ఞానం న మోక్షాయ భవే ద్విధే ।**
**జ్ఞానే నైవ వినా యోగో న సిద్ధ్యతి కదాచన ॥** (యో.శి. 1-51)

తా॥ యోగ రహితమైన జ్ఞానము మోక్ష మొసగుట కెట్లు సమర్థము కాజాలదో, అట్లే జ్ఞాన రహితమైన యోగముకూడ మోక్షము నివ్వజాలదు. మఱియు ఈ యర్థమునే శ్రుతులిట్లు చెప్పినవి :

---

* యోగోపనిషత్తులు : (1) హంస (2) అమృతబిందు (3) అమృతనాద (4) క్షురిక (5) తేజోబిందు (6) నాదబిందు (7) ధ్యానబిందు (8) బ్రహ్మవిద్యా (9) యోగతత్త్వ (10) త్రిశిఖి బ్రాహ్మణ (11) యోగచూడామణీ (12) మండల బ్రాహ్మణ (13) అద్వయతారక (14) శాండిల్య (15) యోగశిఖా (16) పాశుపత (17) యోగకుండలీ (18) దర్శన (19) మహావాక్య (20) వరాహోపనిషత్తులు.

Dr K Dayanandaswamy ebooks

మం॥ "యోగహీనం కథం జ్ఞానం మోక్షదం భవతి ధ్రువమ్ ।
యోగో ఽపి జ్ఞానహీనస్తు న క్షమో మోక్షకర్మణి ॥
తస్మాత్ జ్ఞానం చ యోగం చ ముముక్షు ర్దృఢ మభ్యసేత్ ॥

(ఈ మంత్రము యోగశిఖ యోగతత్త్వోపనిషత్తుల యందును కలదు)

"వినా చాభ్యాస యోగేన జ్ఞానదీపస్తథా న హి" (యో.కుం) యోగాభ్యాసము లేనియెడల జ్ఞానదీపము ప్రకాశింపదు. వేదాంతులు సాంఖ్యమతమును పూర్ణముగ అంగీకరింపనియట్లే పాతంజల యోగమతమునుకూడ పూర్ణముగ అంగీకరింపరు. వారి కీ యోగముతో అవసరము లేకయే నిశ్శ్రేయస (మోక్ష) సాధన మున్నది. "**శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః**" (బృ. 4-5-6) వేదాంతమును శ్రవణము చేయవలయును, మననము చేయవలయును, నిదిధ్యాసము చేయవలయును అని విధింపబడి యున్నందున వారి కీ యష్టాంగ యోగములతో అవసరము లేదు. అయినను జ్ఞానమార్గముతో (వేదాంతముతో) విరోధము రానంతవఱకు యోగమార్గము నంగీకరించి తక్కిన విషయములను నిరాకరించియున్నారు. ఈ విషయము బ్రహ్మసూత్రములయందు యోగ ప్రత్యుక్త్యధికరణమున శంకరులవారు :

సూ॥ ఏతేన యోగః ప్రత్యుక్తః ॥ (2-1-3)

అను సూత్రభాష్యమునందు విశదపఱచిరి.

ప్రపంచమున కొందఱు శారీరకముగ దుర్బలులై యుండినను మహాసూక్ష్మబుద్ధి కలవారును, వైరాగ్య సంపన్నులునై యుందురు. శ్రవణమాత్రముచేత చిత్తైకాగ్రత చేకూరగల యట్టి ముముక్షువులకు జ్ఞానయోగము సులభముగ నుండును. వీరు ఉత్తమాధికారులని వేదాంత శాస్త్రములందు కలదు. మఱికొందఱు దేహపటుత్వము కలిగి, శరీర పరిశ్రమలకు నోర్వగలిగిన వారై, బ్రహ్మచర్యానుష్ఠానము గలవారై యుందురు. అట్టి ముముక్షువులకు రాజయోగము సులభముగా నుండును. మలినవాసన గల మందాధికారులకును ఈ మార్గము సులభముగా తత్త్వజ్ఞానము కలిగించును.

Dr K Dayanandaswamy ebooks



శ్లో॥ ద్వౌ క్రమౌ చిత్తనాశస్య యోగో జ్ఞానం మునీశ్వర !
యోగస్తద్వృత్తి రోధో హి జ్ఞానం సమ్యగవేక్షణమ్*॥ (శాండిల్య)

తా॥ చిత్తనాశమునకు రెండు విధములున్నవి. (1) యోగము (2) జ్ఞానము. యోగమనగా చిత్తవృత్తులను నిరోధించుట. జ్ఞానమనగా చిద్రూపుడగు ప్రత్యగాత్మయొక్క జడములగు దేహేంద్రియాదులను 'నేతి' 'నేతి' యని నిషేధించుచు నిషేధావధియగు ప్రత్యగాత్మ నెఱుంగుట. మఱియు

శ్లో॥ అసాధ్యః కస్యచిద్యోగః కస్యచిత్ జ్ఞాన నిశ్చయః ।
ప్రకారౌ ద్వౌ తతో దేవో జగాద పరమేశ్వరః ॥ (జ్ఞా.వా. 6-20-60)

తా॥ ఒకనికి యోగమార్గము సులభముగా నుండును. మఱియొకనికి జ్ఞానమార్గము సులభముగా నుండును. కనుక పురుషులయొక్క యధికారము నాలోచించి పరమేశ్వరుడు యోగ, జ్ఞాన మార్గములను రెండింటి నుపదేశించెను.

## (5) యోగమున కర్హులు

శ్లో॥ బ్రాహ్మణ క్షత్రియ విశాం స్త్రీ శూద్రాణాం చ పావనమ్ ।
శాంతయే కర్మణా మన్యద్యోగా న్నాస్తి విముక్తయే ॥
(యోగ చింతామణి)

తా॥ బ్రాహ్మణులకును, క్షత్రియులకును, వైశ్యులకును, స్త్రీలకును, శూద్రులకును సకలకర్మ శాంతియైనట్టి (అనగా: సర్వకర్మ నివృత్తియైనట్టి) మోక్షమును కలిగించునట్టిది పరిశుద్ధమైన యోగమునకంటె వేఱు లేదు.

శ్లో॥ యువా వృద్ధో ఽతివృద్ధో వా వ్యాధితో దుర్బలో ఽపి వా ।
అభ్యాసా త్సిద్ధి మాప్నోతి సర్వయోగేష్వతంద్రితః ॥
(హఠయోగప్రదీపిక 1-65)

---

* ఈ శ్లోకము జ్ఞానవాసిష్ఠమునందు "యోగోజ్ఞానం చ రాఘవ" అన్న మార్పుతో నున్నది.

Dr K Dayanandaswamy ebooks

తా॥ యౌవనవంతుడైనను, వృద్ధుడైనను, అతివృద్ధుడైనను సర్వయోగములందును (మంత్ర, లయ, హఠ, రాజయోగములనుగాని లేక యోగాంగములను కాని) సోమరితనము లేక అభ్యాసము చేయుటవలన సిద్ధిని (యోగసిద్ధిని, లేక ముక్తిని, లేక సమాధిని) పొందును.

ఈ యోగము అధికముగా భుజించు వానికి గాని, బొత్తిగా తిననివానికిగాని, అధికముగా నిద్రించు వానికిగాని, నిద్రపోవని వానికిగాని సిద్ధింపదు (గీ. 6-16). తగిన ఆహారమును, తగిన సంచారమును, తగిన వ్యాపారమును, తగినంత మాత్రము నిద్రయును కలిగినవానికే ఈ యోగము సిద్ధించును (గీ. 6-17).

యోగ శాస్త్రమందు చెప్పినట్లు సగము కడుపునకు భుజించి, మిగిలిన సగములో సగమును నీటితో నింపి, మిగత పాతికభాగమును వెలితిగా నుంచవలయును.

## (6) యోగము అష్టాంగములు గలది

ఈ యోగమునకు ఎనిమిది అంగములు కలవు.

**సూ॥ యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార**
**ధారణాధ్యాన సమాధయో ఉష్టావంగాని ॥** (పా.యో.సూ. 2-29)

తా॥ అష్టాంగములు : 1. యమము. 2. నియమము. 3. ఆసనము. 4. ప్రాణాయామము. 5. ప్రత్యాహారము. 6. ధారణము.* 7. ధ్యానము. 8. సమాధి.

యోగచూడామ ణ్యుపనిషత్తునందు యమనియమములు రెండింటిని వదలి తక్కిన ఆఱుమాత్రమే యోగాంగములుగా గ్రహింపబడినవి.

## (7) యమము

యమమును గుఱించి యిట్లు చెప్పిరి.

---

* పాతంజలయోగ సూత్రములందును, త్రిశిఖి బ్రాహ్మణ, మండల బ్రాహ్మణాది శ్రుతులయందును ముందు ధారణ తర్వాత ధ్యానము చెప్పబడెను. కొందఱు ముందు ధ్యానమును, పిమ్మట ధారణను చెప్పిరి.

Dr K Dayanandaswamy ebooks



**సూ॥ అహింసాసత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహా యమాః॥**

(పా.యో.సూ. 2-30)

తా॥(1) అహింస (2) సత్యము (3) అస్తేయము (4) బ్రహ్మచర్యము (5) అపరిగ్రహము అనునవి యమ మనబడును. వీటి లక్షణములు ఈ క్రింది విధమున చెప్పబడినవి.

(1) **అహింస** : మనోవాక్కాయ కర్మలచే ఏ ప్రాణినీ హింసింప కుండుట. హింస చేయకుండుట.

(2) **సత్యము** : అనృతమాడకుండుట, ఎట్టి స్థితియందైనను సత్యనిష్ఠ గలిగియుండుట. సత్యనిష్ఠగల పురుషుడేమి చెప్పినను అది సత్యమే యగుచుండును.

(3) **అస్తేయము** : ఎవరి వస్తువు నైనను అపహరింపకుండుట.

(4) **బ్రహ్మచర్యము** : *ఇది యోగులకు కాని, జ్ఞానులకుకాని, మోక్షము సాధింపగోరు సాధకునకు అవశ్యముగ ననుష్ఠింపదగినది. బ్రహ్మచర్యము లేనిదే పరమాత్మ నెఱుంగుటకు సాధ్యము కాదు. దీనిని గుఱించి ఉపనిషత్తులయందును, యోగగ్రంథములయందును విస్తరించి చెప్పబడినది. వీర్యమును నష్టము కాకుండ రక్షించుకొనుటయే గాక మానసికముగ నైనను కామోద్రేకము కలుగనీయ కుండుటయే బ్రహ్మచర్యము. బ్రహ్మచర్యము లేనిదే యెట్టి యాధ్యాత్మికశక్తియు కలుగదు.

(5) **అపరిగ్రహము** : ఇతరుల యొద్ద ఏమియు తీసికొన కుండుట. యోగికి అస్తేయ మెట్లనుష్ఠింప దగినదో, అపరిగ్రహముకూడ నట్టిదే.

---

* బ్రహ్మచర్యమును గుఱించి "బ్రహ్మచర్యం నామ సర్వావస్థాసు మనోవాక్కాయ కర్మభిః సర్వత్ర మైథునత్యాగః" అని శాండిల్యోపనిషత్తు

**కాయేన వాచా మనసా స్త్రీణాం పరివివర్జనమ్,**
**ఋతే భార్యాం తథా తస్య బ్రహ్మచర్యం తదుచ్యతే,**
**బ్రహ్మభావే మనశ్చారం బ్రహ్మచర్యం పరంతప.** (దర్శనోపనిషత్తు)

Dr K Dayanandaswamy ebooks



ఏలయన ఒకరిచేత ఏదైన గ్రహించిన యెడల దాతయొక్క పాపములో కొంత యతనికి చెందునని శాస్త్రములు చెప్పుచున్నవి.

**సూ॥ అపరిగ్రహస్థైర్యే జన్మ కథంతా సంబోధః॥** (పా.యో.సూ. 2-39)

తా॥ జన్మమున నెవ్వరు అపరిగ్రహమును స్థిరముగ ననుష్ఠింతురో అట్టివారు తరువాత కలుగబోవు జన్మమునందు పూర్వజన్మ జ్ఞానము కలవారై యుందురు. వెనుకటి జన్మ పరంపరలు తెలిసికొనగలుగుటవలన నిక జన్మము కలుగకుండుటకు గట్టి ప్రయత్నము చేసి ముక్తులగుదురు.

మఱియు ఈ యమమును పది అంగములుగా ఉపనిషత్తులు చెప్పినవి.

**"అహింసాసత్యమ స్తేయం బ్రహ్మచర్యం దయార్జవమ్।**
**క్షమా ధృతి ర్మితాహార శ్శౌచం చేతి యమా దశ"॥**

అని త్రిశిఖ బ్రాహ్మణ శాండిల్య దర్శనోపనిషత్తులందు కలదు.

తా॥ (1) అహింస (2) సత్యము (3) అస్తేయము (4) బ్రహ్మచర్యము (5) దయ (6) ఆర్జవము (7) ఓర్పు (8) ధైర్యము (9) మితాహారము (10) శౌచము అని యమమునకు పదియంగములు చెప్పిరి.

ఈ యమమును యోగులేగాక సర్వదేశ సర్వకాలములయందును సర్వమతముల వారును అనుష్ఠింప దగును. ఇది మహావ్రతము.

## (8) నియమము

అష్టాంగ యోగమునందు ఇది రెండవది.

**సూ॥ శౌచ సంతోష తపస్స్వాధ్యా యేశ్వరప్రణిధానాని నియమాః॥**
(పా.యో.సూ. 2-32)

తా॥ (1) శౌచము (2) సంతోషము (3) తపస్సు (4) స్వాధ్యాయము

Dr K Dayanandaswamy ebooks



(5) ఈశ్వరారాధనము ననునవి నియమములు*

(1) **శౌచము** : అనగా: బాహ్యాంతరములయందు శుచి కలిగియుండుట. బాహ్యమనగా శరీరమును, వస్త్రములును, తానుండు పరిసర ప్రదేశములు, ఉపయోగించు ఆహార పదార్థములు శుచికలిగి యుండుట బాహ్యశౌచ మనబడును. మనస్సునందు కామక్రోధాదులగు వృత్తులకు చోటివ్వక మలినవాసనలను పోదోలి శుద్ధవాసనలు కలిగియుండుట అంతఃశౌచ మనబడును.

(2) సంతోష మనునది సర్వప్రాణులకు నవసరమే. యోగాభ్యాసకులకు ముఖ్యముగ అవసరమని చెప్పవచ్చును.

(3) **తపస్సు** : ఏకాదశి మొదలగు దినములయందు ఉపవాస ముండుట, జాగరణము చేయుట మొదలగునవి తపస్సనబడును.

(4) **స్వాధ్యాయము** : వేదాంత గ్రంథపఠనము, యోగశాస్త్ర పఠనము, మహాభారత భాగవతాది గ్రంథములు చదువుట, చదివి వినిపించుట మొదలగునవి స్వాధ్యాయము.

(5) **ఈశ్వరారాధనము** : ఈశ్వరప్రణిధానము. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేయుట, భగవదారాధన, యోగము నిర్విఘ్నముగా సిద్ధింపజేయుటకు ఈశ్వరుని శరణు పొందవలయును. ఈశ్వరానుగ్రహ మున్నయెడల యోగము (సమాధి) శీఘ్రముగ సిద్ధించును.

తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అను నీమూడును చేరి క్రియా యోగమనబడును. (పా.యో.సూ. 2-1) ముందు చెప్పబోవు సమాధు లత్యంత కష్టసాధ్యము లగుటచే ఆ సమాధులను సాధించుటకు కావలసిన సామర్థ్యమును ఈ క్రియాయోగముచే పొందవచ్చును. అనగా

* నియమమును గూర్చి శ్రుతులయం దిట్లున్నది.

తపస్సంతుష్టిరాస్తిక్యం దాన మారాధనం హరేః|
వేదాంత శ్రవణం చైవ హ్రీర్మతిశ్చ జపోవ్రతమ్|| (త్రి.బ్రా.)

తపస్సంతోష మాస్తిక్యం దానమీశ్వర పూజనమ్|
సిద్ధాంత శ్రవణంచైవ హ్రీర్మతిశ్చ జపోవ్రతమ్,|
ఏ తే చ నియమాః ప్రోక్తా|| .... అని. (దర్శన)

Dr K Dayanandaswamy ebooks



నిది ప్రథమసోపానము.

## (9) ఆసనము

అష్టాంగములలో ఇది మూడవది. ఏకాగ్రత కిది సహాయకారి. శరీరము నిటునటు కదలించుచున్నచో చిత్తమును స్థిరముగ నిలుపజాలము.

**సూ॥ స్థిర సుఖమాసనమ్॥** (పా.యో.సూ. 2-46)

ఈ సూత్రము సాంఖ్యదర్శనమునందు (3-34) ఇట్లే కలదు. మఱియొకచో **"స్థిర సుఖమాసన మితి న నియమః"** (సాం. సూ. 6-24) అని కలదు గనుక సుఖమును గలిగించునట్టిదే ఆసనము. ఇట్టిదే కావలయునను నియమ మవసరము లేదు.

తా॥ స్థిరమై సుఖకరమై యుండునట్టిది యాసనము. మనము కదలక స్థిరముగా నొకటే విధముగ శరీరమును నిలుపవలయునన్న కష్టతరముగ నుండును. కనుక ఆసనములలో సుఖకరములైన పద్మ సుఖాసనములు చిరకాల మభ్యసించిన యెడల ఆసనము సిద్ధించును. అట్టి ఆసనసిద్ధి కలిగిన పిమ్మట కొన్ని గంటల పర్యంత మిట్లే ఆసనమునం దుండినను కష్టమనిపించదు. సుఖముగ నుండును.

ఆసనము నభ్యసించుటకు (యోగాభ్యాసమునకు) ఒక మఠముగాని చిన్న గదిగాని యుండవలయును. అది శుభ్రముగను; అలికినట్టిదిగను; నల్లులు, దోమలు, సాలెపురుగులు మొదలగునవి లేనిదిగను నుండవలెను. దానియందు మిక్కిలి యెత్తైనది కాక, మిక్కిలి తక్కువైనదిగాక మెత్తగానుండు ఆసనము ఏర్పరచుకొనవలయును. నేలపైన మొదట దర్భాసనమువేసి దానిపైన కృష్ణాజినమును, దానిపైన వస్త్రమును పఱచి, అందు తూర్పుముఖముగా గాని, ఉత్తర ముఖముగాగాని పద్మాసనము నందుగాని, సుఖాసనమునందు గాని కూర్చుండవలయును. అట్లు కూర్చున్నపుడు వక్షము, కంఠము, శిరస్సు ఈ మూటిని ఉన్నతముగ, అనగా వంకర లేక నిక్కించి ఇష్టదేవతకు చేతులు మోడ్చి నమస్కరింప వలయును.

ఇట్లు కొంతకాలము ఆసనము సిద్ధించిన పిమ్మట నాడీ శోధనము

Dr K Dayanandaswamy ebooks

చేయవలయును. నాడీశోధనము చేసినయెడల నాడులు శుద్ధము కాగా ప్రాణాయామాభ్యాసము చేయుటకు సామర్థ్యము కలుగును.

## (10) ప్రాణాయామము

అష్టాంగములలో నిది నాల్గవది.

**సూ॥ తస్మిన్ సతి శ్వాస ప్రశ్వాస యోర్గతి విచ్ఛేదః ప్రాణాయామః॥**
(పా.యో.సూ. 2-49)

**తా॥** ఆసనము సిద్ధించిన పిమ్మట ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములయొక్క గతి నిరోధమగు ప్రాణాయామము సిద్ధించును. ఆసనము సిద్ధించి నాడీశౌచ మేర్పడిన పిమ్మటనే ప్రాణాయామము నభ్యసింపవలయును. ప్రాణమనగా: ప్రాణుల శరీర మందుండి ప్రాణులకు జీవాధారమైనట్టిది. ప్రపంచము నందలి సాముదాయిక శక్తియే ప్రాణము. ఇదియే ప్రతిశరీరము నందలి శక్తియునై ఊపిరితిత్తుల చలనమునందు మనకు స్పష్టముగా గోచరించుచున్నది. రాజయోగమునందు ప్రాణాయామము ముఖ్యమైనది. ఏలయన ప్రాణవాయువును నిలిపియుంచుటచేత చిత్తవృత్తులు నిరుద్ధ మగుచున్నవి. కనుక చిత్తవృత్తులు నిరుద్ధమగుటతో వాసనాక్షయ మగును. రాజయోగ మనుపదము వినినంతనే ప్రాణాయామము మన స్మృతి పథమున గోచరించును.

ప్రాణాయామము చేయు విధ మిట్లు చెప్పబడినది:- నాసికయొక్క ఎడమప్రక్క ఇడానాడియు, కుడిప్రక్క పింగల నాడియు, ఈ రెంటికి మధ్యస్థానమందు సూక్ష్మరూపమైన సుషుమ్నానాడియు నున్నవి. ఇడానాడికి చంద్రనాడియనియు, పింగళానాడికి సూర్యనాడియనియు, సుషుమ్నా నాడికి బ్రహ్మనాడియనియు పేర్లు.

కుడిచేతి బొటనవ్రేలితో కుడి నాసికా రంధ్రమును మూసి ఇడానాడిచే ఎడమ ముక్కు రంధ్రము నుండి వాయువును మెల్లమెల్లగా లోనికి పూరించవలయును. దీనికి పూరకమని పేరు. అట్లు పూరించిన వాయువును బయటకు రాకుండ ఆపవలయును. అనగా:- కుడిచేతి చూపుడు వ్రేలితోగాని

Dr K Dayanandaswamy ebooks



మధ్యవ్రేలితోగాని యెడమముక్కు రంధ్రమును కూడ మూయవలయును. ఇది కుంభకము. పిదప లోపలనున్న వాయువును పింగళానాడినుండి బయటికి మెల్లగా విడువవలయును. ఇదియే రేచకము. ఇదియొక ప్రాణాయామము.

ఇప్పుడు పింగళానాడిచేత పూరించి మఱల విధిప్రకారము కుంభించి, అన్యమైన నాసికారంధ్రము (ఇడానాడి) చేత మెల్ల మెల్లగా రేచింపవలయును. రేచించిన నాడిచేతనే పూరింపవలయును. పూరించిన నాడిచేత మరల పూరింపరాదు. వాయువును రేచించిన పిమ్మట కొంతకాలము పూరింపకుండ అట్లే నిలిపిన యెడల దానిని బాహ్యకుంభక మందురు.

ఈ సాధనకు కాలనియమమును పాటింపవలయును. ఎట్లనగా: ఇడానాడిచేత పూరకము 16 మాత్రల కాలమును, కుంభకము 64 మాత్రల కాలమును, పిమ్మట రేచకము 32 మాత్రల కాలమును చేయవలయునని యోగతత్త్వ, త్రిశిఖ, బ్రాహ్మణ శ్రుతులు చెప్పుచున్నవి.

ఇచట మాత్రయనగా: వేగముగా హస్తముచే మోకాలిని ప్రదక్షిణము చేసి చిటిక వేయునంతకాలము.

ఇచ్చట అభిప్రాయభేదము కలదు. ఉచ్ఛ్వాసనిశ్వాసములు ఒక పర్యాయము చేయుటకు తగినంత కాలము మాత్రాకాలమని యోగ చూడామణి చెప్పినది. ఇట్లు ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము, అర్ధరాత్రము - ఈ నాలుగుకాలములందును 80 కుంభకములు అభ్యాసము చేయవలయును. ఇట్లు ఒక్కమాసము చేసినయెడల నాడీశుద్ధి కలుగును. పిమ్మట ఈ సంఖ్యను క్రమముగా హెచ్చింపవలయును.

వాయువు కుంభించుటవలన దేహమంతయు, నిండుగ వాయువును పూరించుటచేత నాడులన్నియు వాయుసంపూరితము లగును. ఇట్లు చేయుట వలన దశవిధ వాయువులు మిక్కిలి చలనము పొందును. హృదయ కమలము వికసించును. ఇట్లు మూడు సంవత్సరములు అభ్యసించినవారికి యోగసిద్ధి కలుగునని శాస్త్రములు చెప్పుచున్నవి.

Dr K Dayanandaswamy ebooks



ప్రాణాయామముయొక్క ఫలము ఇట్లు చెప్పబడినది :

మం॥ ప్రస్వేదజననం యస్య ప్రాణాయామేషు సోఽధమః।
కంపనం వపుషో యస్య ప్రాణాయామేషు మధ్యమః।
ఉత్థానం వపుషో యస్య స ఉత్తమ ఉదాహృతః॥
(త్రి.బ్రా. 110, 111)

తా॥ ప్రాణాయామాభ్యాసము చేయునప్పుడు దేహమునందు చెమట పట్టునేని అది అధమ ప్రాణాయామమనియు, దేహమునందు కంపనము అనగా చలనము కలిగెనేని అది మధ్యమ ప్రాణాయామమనియు, ప్రాణాయామము చేయునపుడు దేహమునకు ఉత్థానము (పైకి లేచుట) కలిగిన యెడల అది ఉత్తమ ప్రాణాయామమనియు ననబడును.

అధమ ప్రాణాయామము వలన వ్యాధి కలుగును, పాపములు నశించును. మధ్యమ ప్రాణాయామమువలన పాపములు రోగములు నశించును. ఉత్తమ ప్రాణాయామమువలన మలమూత్రములు అల్పమగును. ఇంద్రియ పాటవము, కాలత్రయ పరిజ్ఞానము మొదలగునవి కలుగును. ప్రాణాయామమునకు పర్యవసానము కుండలినీశక్తిని మేలుకొలుపుటయే. "యోగ శ్చిత్త వృత్తి నిరోధః" యోగమనగా: చిత్తవృత్తి నిరోధము. చిత్తవృత్తి నిరోధము ప్రాణాయామముయొక్క ఫలమే.

## (11) ప్రత్యాహారము

యోగాంగములలో నిది యైదవది.

సూ॥ స్వవిషయాఽసంప్రయోగే చిత్త స్వరూపానుకార
ఇవేంద్రియాణాం ప్రత్యాహారః॥ (పా.యో.సూ. 2-54)

తా॥ శ్రోత్రాదులగు ఇంద్రియములు శబ్దాది విషయములను విసర్జించి చిత్తముయొక్క స్వరూపమును పొందుటయే. అనగా మనసున నైక్యమగుటయే ప్రత్యాహారము.

## (12) ధారణ*.

* సాంఖ్యులు ధ్యానము తరువాత ధారణ చెప్పిరి.

Dr K Dayanandaswamy ebooks



యోగాంగములయం దిది ఆఱవది

**సూ॥ దేశబంధ శ్చిత్తస్య ధారణా॥** (పా.యో.సూ 3-1)

తా॥ శరీరమునందుగాని, బాహ్యమునందుగాని ఏదియో ఒకచోట చిత్తమును నిలుపుట ధారణ యనబడును. అనగా హృదయ స్థానమున చిత్తమును నిలిపి శరీరమునందలి యితర భాగములనుండి స్పర్శానుభవమును పొందక మనస్సును ఆలక్ష్యమునందే నిలుపుట

## (13) ధ్యానము

యోగాంగములయం దిది ఏడవది.

**సూ॥ తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్॥** (పా.యో.సూ. 3-2)

తా॥ పైన చెప్పిన లక్ష్యమునందు అవిచ్ఛిన్న తైలధారవలె (ఆముదమునో తైలమునో ఒక పాత్రయందిడి వేఱొక పాత్రలోనికి ధార తెగిపోకుండ పోయుటవలె) మనస్సును ఏకభావ ప్రవాహముగ కొంత కాలము నిలుపగలుగుటయే ధ్యానమనబడును.

**సూ॥ రాగోపహతిః ధ్యానమ్ ॥** (సాం.సూ. 3-30)

రాగ నివృత్తియే ధ్యానము.

**సూ॥ వృత్తినిరోధాత్ తత్సిద్ధిః॥** (సాం.సూ. 3-31)

వృత్తినిరోధమువలన (ప్రమాణ, విపర్యయ, వికల్ప, నిద్ర, స్మృతులను నిరోధించుటవలన) ధ్యానము సిద్ధించును.

**సూ॥ ధ్యానం నిర్విషయం మనః॥** (సాం.సూ. 6-25)

**మం॥ అభేదదర్శనం జ్ఞానం ధ్యానం నిర్విషయం మనః ॥**

జ్ఞాన మనగా ప్రపంచమునందలి నానాత్వమునందు ఏకత్వమును. అభేదమును దర్శించుట; ధ్యానమనగా మనస్సును నిర్విషయముగా

Dr K Dayanandaswamy ebooks

చేయుట అని స్కందోపనిషత్తు.

**మం॥ అథ ధ్యానం, తద్ద్వివిధం, సగుణం నిర్గుణం చేతి।**
**సగుణం మూర్తిధ్యానమ్, నిర్గుణ మాత్మయాథాత్మ్యం॥** (శాండిల్య)

సగుణమని, నిర్గుణమని ధ్యానము రెండు విధములు. మూర్తిధ్యానము సగుణము. ఆత్మయొక్క యథార్థస్వరూపధ్యానము నిర్గుణము.

**మం॥ యది శైలసమం పాపం విస్తీర్ణం బహుయోజనం।**
**భిద్యతే ధ్యానయోగేన నాన్యో భేదః కదాచన॥** (ధ్యానబిందు-1)

తా॥ అనేక యోజనముల విస్తీర్ణము గల పర్వతము వంటి పాపరాశియైనను ధ్యానయోగమువలన నశించును.

## (14) చిత్తముయొక్క అవస్థలు

ఇచట చిత్తమును గుఱించి కొంత చెప్పవలసి యున్నది. చిత్తమునకు అయిదు భూమికలు (అవస్థలు) కలవు.

(1) క్షిప్తము (2) మూఢము (3) విక్షిప్తము (4) ఏకాగ్రము. (5) నిరుద్ధము.

(1) క్షిప్తముయొక్క లక్షణము : ప్రవృత్తి అనగా: చిత్తము సుఖ దుఃఖములయందు తగులుకొని యుండుటయు; వాసనాత్రయమును, అసురసంపదయును, కేవల రజోగుణాధిక్యమును కలిగియుండుట.

(2) మూఢము : సోమరితనము, మాంద్యము, నిద్ర - వీటియందు ప్రవర్తించు చిత్తము. ఇది తమోగుణ సంబంధ మైనదియును, ప్రమాదమునకు కారణ మైనదియు నైయున్నది. ఈ రెండింటిలో ధ్యానము కుదురదు.

(3) విక్షిప్తము : చిత్తమును ఏకాగ్రము చేయుటకు ప్రయత్నించుట. అనగా: ఒకానొకప్పుడు ధ్యానమునకు యోగ్యముగ నుండు చిత్తము. ఇచ్చట సత్త్వగుణ మిశ్రమగు రజోగుణాధిక్యము కలిగియుండును.

(4) ఏకాగ్రము: చిత్తము లక్ష్యము నందుంచుట. అట్టి సమయమునందు

 Dr K Dayanandaswamy ebooks

కాలమునుగూర్చిన భావన మనకేమాత్రము కలుగకుండుట. ఏక విషయమునందు అవిచ్ఛిన్న తైలధారవలె వృత్తి సంతానము కలుగజేయు చిత్తము. ఇది సత్త్వగుణోద్రేకమువలన కలుగును.

(5) నిరుద్ధము: ఏకాగ్రస్థితినుండి చిత్తమును సమాధిస్థితికి కొనిపోవు పద్ధతి.

జ్ఞానయోగమున చెప్పిన లయ, విక్షేప, కషాయ, రసాస్వాదనా, సమప్రాప్తులను యోగులు చెప్పు నీయైదవస్థలతో పోల్చవచ్చును.

## (15) నిరోధ సంస్కారము

చిత్తము విషయముల వైపునకు పోవుచుండును. అట్టి వేగము నరికట్టవలయును. ఎట్లనగా: ఒక స్త్రీని చూచినప్పుడు ఆమె సౌందర్యముచే మనస్సాకర్షింపబడునేని ఆమె యాకృతి చిత్తమున నిలిచిపోవును. అదియొక సంస్కారమగును. అప్పుడు జిజ్ఞాసువు ఇట్లు చింతింపవలయును. 'నేను దేనిని చూచి మోహించితిని! స్త్రీ సౌందర్య మనునది కేవల మాంసము చర్మమేగదా! అది యెంత హేయమైనది! స్త్రీ నరకద్వారమని పెద్దలు చెప్పిరిగదా? ఛీఛీ! ఇట్టిదానిచే నాకర్షింపబడితినే!' అని సిగ్గుపడవలయును. ఇట్టి దోషవిచారము లెస్సగా చేసిన యెడల మరల ఆ స్త్రీమూర్తి చిత్తమున తోచినప్పుడు దోషవిచారము సహితము వెనువెంటనే తోచును. దీనిని నిరోధ చిత్తవృత్తి యందురు. ఇట్లు విషయసంబంధమగు సంస్కారము చిత్తమున కలిగినప్పుడెల్లను అప్రయత్నముగ నిరోధ సంస్కారము (నిరోధచిత్తవృత్తి) సహితము కలుగుచుండును. ఇట్లు కలుగుటచే తుదకు చిత్తవృత్తులన్నియు శమించి సమాధి ఏర్పడును. ఈ సమాధి నభ్యసించుచు రాగా అసంప్రజ్ఞాత సమాధి కలుగును.

## (16) సమాధి

యోగాంగములలో నిది యెనిమిదవది.

**సూ॥ తదేవార్థమాత్ర నిర్భాసం స్వరూపశూన్య మివ సమాధిః॥**

Dr K Dayanandaswamy ebooks

(పా.యో.సూ. 3-3)

తా॥ రూపములను విడిచి అర్థమును మాత్రమే భాసింపజేయు చున్నప్పుడది సమాధి యనబడును.

ఈ సమాధివలన ముక్తి సిద్ధింపదు. దీని నభ్యసించిన పిమ్మట యోగులు వివిధ విషయములందు సంయమనముచేసి వివిధములగు విభూతులు పొందగలుగుచున్నారు.

ఆలంబన, లేక ధ్యేయవస్తువు పైన మనస్సును పంద్రెండు క్షణముల కాలము నిలుపునప్పుడది ధారణ యనబడును. ఇట్టి పంద్రెండు ధారణలు చేరిన నొక ధ్యానమగును. ఇట్టి పంద్రెండు ధ్యానము లొక సమాధి యగును. ధ్యాన, ధారణ, సమాధులు - ఈ మూడును చేరి సంయమన మనబడును (పా. యో. సూ. 3-4). ధ్యాన ధారణ సమాధులు ఒకదాని వెంబడి నొకటిగా నీ మూడును ఏకమగుట యని యర్థము.

కొందఱు పెద్దలు ప్రత్యాహారము తరువాత ధ్యానము, దాని తరువాత ధారణ, దానిపిమ్మట సమాధియని చెప్పుదురు. 7 సెకండ్ల కాలము మనస్సు లక్ష్యమందు ఏకాగ్రము చేయుట ధ్యానమనియు, దానికి 7 రెట్లెక్కువ కాలము అట్లుండుట (అనగా : 49 సెకండ్లు) ధారణ యనియు, దానికి 7 రెట్లు ఎక్కువ (5 నిమిషములు 43 సెకండ్లు) కాలము లక్ష్యమునందు చలించకుండుట సమాధియనియు చెప్పుదురు.

సమాధులు సంప్రజ్ఞాత సమాధియనియు, అసంప్రజ్ఞాత సమాధి యనియు రెండు విధములుగ నున్నవి.

సంప్రజ్ఞాత సమాధి:

సూ॥ వితర్క విచారానందాస్మితారూపానుగమా

---

* బ్రహ్మాకార మనోవృత్తి ప్రవాహోఽహంకృతిం వినా।
సంప్రజ్ఞాత సమాధిస్స్యాద్ధ్యానాభ్యాస ప్రకర్షతః॥ (ముక్తి 2-58)

తా॥ దేహేంద్రియాదికమునందు అహంభావమును (నేనను అభిమానము) వదలి ధ్యానాభ్యాసాతిశయమువలన కలిగిన బ్రహ్మమే నేననెడి మనోవృత్తిరూప ప్రవాహమే సంప్రజ్ఞాత సమాధి.

Dr K Dayanandaswamy ebooks



త్సంప్రజ్ఞాతః (పా.యో.సూ. 1-17)*

తా॥ వితర్కము, విచారము, ఆనందము, అస్మితము, అను స్థితులతో కూడిన సమాధిస్థితిని సంప్రజ్ఞాతసమాధి యందురు.

(1) **వితర్కమనగా** : ప్రకృతియందలి స్థూలతత్త్వములను (పృథివ్యాది స్థూలభూతములను) ధ్యేయములుగా గ్రహించి ధ్యానించుట.

(2) **విచారమనగా:** వితర్కమువలన ధ్యాన మభివృద్ధి చెంది యుండును గనుక యోగి సూక్ష్మభూతములను (తన్మాత్రలను) ధ్యేయములుగా గ్రహించి ధ్యానించుట.

(3) **ఆనందమనగా:** ఇచ్చట యోగి స్థూల సూక్ష్మ భూతముల రెండింటిని విడిచి, మనస్సునే ధ్యేయముగా (ఆలంబనముగా) చేసి, మనస్సును రజస్తమో గుణరహితమైన దానినిగా ధ్యానించుట.

(4) **అస్మితమనగా:** ఇచ్చట కూడ మనస్సే ధ్యేయమై యుండును. కాని పైమూడు స్థితులకంటె ఇచ్చట చిత్తము పరిపక్వమై యుండి సాత్త్వికస్థితియం దుండును.

ఇది సిద్ధులను కోరు వారి కుపయోగపడును. నేనను అహంకార మిచ్చట మిగిలియుండును. చిత్తవృత్తులు శాంతించి యుండును గాని, బీజరూపమున సంస్కారము శేషించి యుండును. సమయము వచ్చినపుడు మొలకలెత్తుటకు వీలుండును. కనుక దీనిని సబీజసమాధి యందురు. దీనిని జ్ఞానయోగమునందు చెప్పిన సవికల్ప సమాధితో పోల్చవచ్చును. ధారణధ్యాన సమాధులకు యమ, నియమ, ఆసన, ప్రాణాయామములు బాహ్యాంగములు. ధ్యాన, ధారణ సబీజ సమాధులను బొందిన యోగి సర్వశక్తి గలవాడును, సర్వజ్ఞుడును కావచ్చును. కాని, ముక్తుడు కాజాలడు. ధారణ, ధ్యాన, సవికల్ప సమాధులు మూడును చిత్తమును నిర్వికల్పముగ జేయజాలవు. ఇందు పునర్జన్మమును కలిగించుటకు కావలసిన కర్మబీజములు శేషించియుండును. యోగులు చెప్పినట్లు కర్మబీజములు దగ్ధపటల మైనపుడు

Dr K Dayanandaswamy ebooks

మాత్రమే ముక్తి కలుగును. అణిమాదిసిద్ధులు కర్మబీజములను దగ్ధము జేయజాలవు.

**అసంప్రజ్ఞాత సమాధి:**

సూ॥ విరామప్రత్యయాభ్యాస పూర్వ స్సంస్కార
శేషో ఽన్యః* (పా.యో.సూ. 1-18)

తా॥ ఈ సమాధియందు నేనను అహంకార ముండదు. బీజరూపమున నున్న చిత్తవృత్తులు నశించును. కర్మబీజము దగ్ధమై పోవును. కావున నిది నిర్బీజసమాధి యనబడును. ఇచట వాసనాక్షయ మనోనాశములు కలుగును. ఈ సమాధిని అభ్యసించిన యోగి పరమాత్మను తెలిసికొను చున్నాడు. ఇది ముక్తి ప్రదము. ఇది జ్ఞానయోగమునందు చెప్పిన నిర్వికల్పసమాధి.

రాజయోగమునందలి మొదటి రెండంగములను ఎట్టి వారైన నభ్యసింపవచ్చును. తక్కిన ఆఱు అంగములను యోగియగు గురువు వలననే యభ్యసింపవలయును. లేనిచో ప్రమాదము గలుగుట కవకాశ ముండును.

## (17) యోగము నాల్గు విధములు

ఈ మహాయోగము మంత్ర, లయ, హఠ, రాజయోగములను నాలుగు విధములని చెప్పియుంటిని. సంగ్రహముగ వాటియొక్క స్వరూపమిది:

---

*మం॥ ప్రశాంత వృత్తికం చిత్తం పరమానంద దీపకమ్.
అసంప్రజ్ఞాత నామాయం సమాధిర్యోగినాం ప్రియః. (ముక్తి 2-59)

తా॥ చిత్తము తనకంటె భిన్నములగు సకలవృత్తులు నశించుటచేత వృత్తి శూన్యమైనదై, పరమానంద బోధమై, యెప్పుడుండునో యోగులకు ప్రియమగు ఆ స్థితి అసంప్రజ్ఞాత సమాధి యగును.

Dr K Dayanandaswamy ebooks

మంత్రయోగము : "సకారం చ హకారం చ జీవో జపతి సర్వదా" (అని బ్రహ్మ విద్యోపనిషత్తు). సకల ప్రాణులును ఉచ్ఛ్వాస నిశ్శ్వాస రూపముగా హంస మంత్రమును జపించుచున్నవి.

**"సహస్రమేకం ద్వ్యయుతం షట్ఛతం చైవ సర్వదా|**
**ఉచ్చరన్పఠితో హంసస్సోఽహమి త్యభిధీయతే||** (అని బ్రహ్మవిద్య).

అనగా: ప్రతివారును అహోరాత్రమునకు 21600సార్లు హంస మంత్రమును జపించుచున్నారు. ఎట్లనగా 'హ' కారోచ్చారణమువలన దేహమునందలి శ్వాస వెలుపలికి పోవుచున్నది. 'స' కారోచ్చారణమువలన లోపలికి వచ్చుచున్నది. యోగులయందు మాత్రము గురువాక్యానుసారము ఈ హంసమంత్రము విపరీతముగ సుషుమ్న యందు జపింపబడును. విపరీత మనగా :"**సోఽహం, సోఽహం**" అని యగుచున్నది. దీనినే **"అజపగాయత్రి"** యని యందురు. మంత్ర యోగమును గుఱించి బ్రహ్మ విద్యోపనిషత్తు విస్తరించి వివరించినది. **"హంసవిద్యామృతే లోకే నాస్తి నిత్యత్వ సాధనమ్"** హంసవిద్య తప్ప నిత్యత్వసాధనము మఱియొకటి లోకమున లేదని చాటినది. **"హంస ప్రణవయో రభేద"** హంస మంత్రమునకు ప్రణవమునకు అభేదమని పాశుపత బ్రహ్మోపనిషత్తు చెప్పినది.

**అజపా నామ గాయత్రీ యోగినాం మోక్షదా సదా|** (ధ్యాన - 63)

**హఠయోగము** : పూర్వము చెప్పిన రీతిగా 'హ' కారముచేత సూర్యుని, 'స' కారముచేత చంద్రుని గ్రహింపవలయును. ఈసూర్యచంద్రుల యొక్క ఐక్యము హఠయోగములో చెప్పబడును. ఈ హంసమంత్ర సంబంధమువలన పశ్చిమమార్గమందు హఠయోగ మేర్పడుచున్నది. ఇంద్రియ గోళములను బలవంతముగా మూసి (బిగియించి) కుంభకము చేయుట హఠయోగమని చెప్పుదురు. దీనిని వేదాంతులు గౌరవింపరు. హఠముచేత మనో నిరోధము కానేరదని వేదాంతుల మతము.

**లయయోగము** : హఠయోగాభ్యాసముచేత క్షేత్రజ్ఞ పరమాత్మలకు ఐక్యము సాధించిన యెడల చిత్తము లీనమై పోవుచున్నది. అప్పుడు

Dr K Dayanandaswamy ebooks

వాయువు చలనము నొందక స్థిరత్వమును పొందుచున్నది. ఇట్టి మనోలయమే లయయోగము. దీని యందు స్వాత్మానంద రూపమగు పరమ సౌఖ్యము చేకూరును.

**రాజయోగము** : రాజయోగమను పదమునకు అనేకులు అనేకములగు అర్థములను చెప్పుదురు. కేవల మోక్షమే పర్యవసానముగ (ఫలముగ) పైన చెప్పిన అష్టాంగ యోగము నభ్యసించుటయే రాజయోగమని ఎక్కువ ప్రచారములో నున్నది. అష్టాంగ యోగమును మంత్ర, హఠ, లయ, యోగులు కూడ నభ్యసింపవలసినదే. అష్టాంగ యోగములయందు యమ నియమముల రెండింటిని వదలి హఠయోగులు తక్కిన యాఱంగముల నంగీకరింతురు, (యో.ప్ర. 3-2) కాని కొంద ఱారెండును కలుపుకొని యెనిమిది యంగములందురు. హఠయోగ రాజయోగములు రెండును నొకదాని కొకటి సహకారులనియు, హఠయోగమునకు రాజయోగము ఫలమనియు చెప్పుదురు (హఠ.ప్ర. 2-76, 77). పైన చెప్పిన మంత్రయోగ, లయయోగ, హఠయోగములు రాజయోగ ఫల వాప్త్యర్థమై యొప్పుచున్నవని చెప్పుదురు (యో.ప్ర. 4-1). రాజయోగమనగా: స్త్రీ దేహమునందు జననేంద్రియ మధ్యభాగమునందున్న రజస్సుతో పురుషునియొక్క రేతస్సును చేర్చుటయే యని యోగశిఖ (1-136, 137) చెప్పినది.* కాని దానియొక్క అర్థమిదికాదు. మఱియేమనగా: కుండలినీశక్తిని సుషుమ్నాద్వారమున సహస్రారమునందు చేర్చుటయే దీని భావము.

## (18) తారకము

యోగులు తారకమును గుఱించి చెప్పుదురు. ఇది రాజయోగమం దంతర్భూతమందురు. తారకము రెండువిధములు. (1) పూర్వతారకము (2) ఉత్తరతారకము. దీనికి అమనస్కమని మఱియొకపేరు.

---

*మం|| యోనిమధ్యే మహాక్షేత్రే జపాబంధూక సన్నిభమ్|
రజోవసతి జంతూనాం దేవీ తత్త్వ సమావృతమ్|
రజసో రేతసో యోగాద్రాజ యోగ ఇతి స్మృతిః||

 Dr.K Dayanandaswamy ebooks

తారకము మూర్తితారకమని, అమూర్తితారకమని రెండు విధములు. మూర్తితారకమనగా: మూలాధారాది చక్రములయందు ఆయా మూర్తులను దర్శించుట. అమూర్తి తారకమనగా: భ్రూమధ్యస్థానమునందుగాని అంతకు పై భాగమునందుగాని మనసును చేర్చుట. వీటి వివరము తెలియగోరువారు మండల బ్రాహ్మణోపనిషత్తును అద్వయతారకోపనిషత్తును చూడవలయును.

తారక మనుటకు సంసారమునుండి తరింపజేయు నట్టిదని యర్థము. అట్టి జ్ఞానమైనను, మంత్రమైనను మఱియేదైనను తారకమే. పతంజలి మహర్షి :

సూ॥ తారకం సర్వవిషయం సర్వధా విషయ మక్రమం చేతి
వివేకజం జ్ఞానమ్॥ (పా.యో. 3-55)

తా॥ వివిధ పరిణామములలో నున్న సర్వవిషయములను ఏకకాలము నందు తెలిసికొనునట్టి వివేకజన్యజ్ఞానము తారక (రక్షక) జ్ఞాన మనబడును. అనగా: మహదాది సమస్త విషయములను తెలిసికొనవలెనని యర్థము.

## (19) నాడీ మండలము

అనేక శతాబ్దములకు పూర్వమే ఈ దేశమునందలి పెద్దలు సజీవమగు మానవశరీరమును గుఱించి అనేక పరిశోధనలు చేసి అపారమైన జ్ఞానమును ఆర్జించిరి. వారు తెలిసికొన్న విషయములను యోగశాస్త్రములయందు రచియించిరి. ఇంతవఱకు తెలిసికొన్నదంతయు తెలిసికొనవలసిన దానిలో అత్యల్పమే యయియున్నది.

మానవుని శరీరమున మూలాధారము మొదలుకొని బ్రహ్మరంధ్రము వఱకును వీణాదండము (బ్రహ్మదండము) గణుపుగల వెదురు కఱ్ఱవలె నున్నది. మూలాధారచక్రమందలి త్రికోణమునందు సుషుమ్నానాడి యున్నది. దానికి ఇరుపార్శ్వములయందును ఇడ, పింగల యను నాడులు విలంబినియను నాడితో కలిసి నాభిస్థానము నాశ్రయించి యున్నవి. విలంబిని యను నాడి నాభిస్థానము నాశ్రయించియున్నది. శారీరక శాస్త్రజ్ఞులు, వెన్నుపామునందున్న జ్ఞానాత్మకమగు తంతువులు మన యింద్రియా

Dr K Dayanandaswamy ebooks

నుభవములను మేధస్సునకు గొనిపోవుననియు, వీనినే బోధకనాడులనియు (Sensory Nerves), మేధస్సునుండి వార్తలను బయటికి తెచ్చునట్టి చలనాత్మకములగు నాడులను ప్రవర్తక నాడులనియు (Motor Nerves) అందురు. జ్ఞానాత్మక తంతువులనే యిడానాడియనియు, చలనాత్మకములగు తంతువులనే పింగాలానాడియనియు మనము భావించవచ్చును. మేధస్సునకు వార్తలు తీసికొనిపోవునట్టి కేంద్రాభిముఖ వాహినులును, మేధస్సునుండి బయటికి తెచ్చునట్టి కేంద్రప్రసార వాహినులును ముఖ్యముగా ఈ మార్గమునందే ప్రవహించుచుండును.

నాభిస్థానమందుండి తిర్యగూర్ధ్వఅధో ముఖములు గల నాడు లుత్పన్నములైనవి. ఇచ్చట కోడిగ్రుడ్డువలె నుండు స్థానమునుండి 72000 నాడులు పుట్టినవి. ఇందులో 72నాడులు మాత్రమే ముఖ్యమైనవి. ఈ72నాడులలో ప్రాణ వాహినులైన 10 నాడులు మిక్కిలి ప్రధానములైనవి. హృదయకమలమున 101 నాడులు కలవనియు, ఒక్కొక్కదానినుండి 100 శాఖానాడులును, ఆ శాఖానాడులకు ప్రతిశాఖానాడులును కలవనియు, ఇవి యన్నియు చేరి 72, 72, 10, 201నాడులు అగుచున్నవనియు, ఈనాడులన్నింటిలో వ్యానవాయువు సంచరించుచున్నదనియు ప్రశ్నోపనిషత్తు చెప్పినది (ప్రశ్న. 3-6).

ఈ నాడులలో ఇడా, పింగలా, సుషుమ్నా నాడులు ముఖ్యమైనవి. (ఈ పదినాడులయొక్క నామములు, స్థానములు, వీటి కార్యములును యోగచూడామణ్యుపనిషత్తు నందును, యోగశిఖ 5వ అధ్యాయములోని 16 నుండి 20 మంత్రములవఱకును చెప్పబడినవి. 72 నాడులయొక్క పేర్లను హంసోపనిషత్తు చెప్పినది.

యోగశిఖయం దిట్లు గలదు. సుషుమ్నా నాడి ననుసరించి 72000 నాడులు రంధ్రాత్మకములై, వాయుగోచరములై ఊర్ధ్వ అధోభాగములకు వ్యాపించి సర్వద్వార నిరోధకములై రంధ్రాన్వితములై యున్నవి. ఈనాడులలో హృదయకమలము నాశ్రయించియుండు నాడులు నూట ఒక్కటి.

Dr.K.Dayanandaswamy ebooks

నూటఒక్కటిలో శిరోమధ్య భాగమునందుండు సహస్రార కమలమునందలి బ్రహ్మరంధ్రము వఱకు వ్యాపించియున్న సుషుమ్నానాడి యొకటి కలదు. ఇది అన్ని నాడులకంటెను శ్రేష్ఠమయినది. పాపరహిత మైనది. ఇది వీణాదండమునందు మూలాధారము మొదలు బ్రహ్మ రంధ్రాంతము వఱకు వ్యాపించియున్నది. దీనినే బ్రహ్మనాడి యందురు.* ఇది బోలుగా నున్నది. దీనియందు సన్నని రంధ్రము కాలువవలె నుండును. అజ్ఞానులయందు సుషుమ్నయొక్క రంధ్రము మూసికొని యుండును. జ్ఞానులయందు అది విచ్చియుండును. జలగ రక్తమును పీల్చునట్లిది బాహ్యపదార్థ తత్త్వబోధముల నన్నింటిని గ్రహించుచున్నది. అప్పుడే బ్రహ్మజ్ఞానోదయ మగుచున్నది. సుషుమ్న మహిమ యింతటిదని చెప్పుటకు సాధ్యము కాదు. యోగులైనను, జ్ఞానులైనను మఱి యెట్టి వారైనను ముక్తులగువా రందఱకు సుషుమ్న వికాసము చెందియుండవలెను. ఇడా, పింగలా, సుషుమ్నలను మూడునాడులు భ్రూమధ్యమందు కలియుననియు, దానిని త్రివేణి సంగమమనియు చెప్పుదురు. ఇడా పింగలా నాడులు రెండును నాసికాగ్రముతో నిలిచిపోవును. యోగులకు

---

* మూలాధార త్రికోణస్థా సుషుమ్నా ద్వాదశాంగులా
మూలార్థ భిన్నవంశాభా బ్రహ్మనా డీతి సా స్మృతా॥
ఇడా చ పింగలాచైవ తస్యాః పార్శ్వద్వయే గతే,
విలంబిన్యా మనుస్యూతే నాసికాంతముపాగతే॥ (యో.శి. 5-17, 18)

శతం చైకా చ హృదయస్య నాడ్య
స్తాసాం మూర్ధానమభినిస్సృతైకా।
తయోర్ధ్వమాయ న్నమృతత్వమేతి
విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవంతి॥ (యో.శి. 6-4)

ఏకోత్తరం నాడీశతం, తాసాం మధ్యే పరా స్మృతా।
సుషుమ్నాతు పరే లీనా విరజా బ్రహ్మ రూపిణీ॥ (యో.శి. 6-5)

(శతంచైకా చ అను మంత్రము కఠోపనిషత్తునందును గలదు. దాని నిదివఱకే ఉదహరించియుంటిని.) హృదయమునందుండి బయలు వెడలిన నూట ఒక్క నాడులలో ఒకటియగు బ్రహ్మనాడియును, సుషుమ్నా నాడియును నొకటియేగాని వేఱువేఱుగాదు. వేఱువేఱని యర్థ మిచ్చునట్లు కొన్ని గ్రంథములయందు వ్రాయబడినది.

Dr K Dayanandaswamy ebooks



ప్రాణవాయువు సుషుమ్న యందుండును. ఇతరులకు ఇడానాడియందు గాని, పింగలా నాడి యందుగాని యుండును అనగా: కొంతకాలము ఇడయందును, మఱికొంత కాలము పింగలయందును నుండునని యర్థము.

## (20) షట్చక్రములు

సుషుమ్నాద్వారమందు అచ్చటచ్చట కమలములు లేక చక్రములు గలవని యోగులు భావింతురు. శారీరకశాస్త్రజ్ఞులు వెన్నుపామునందు గలవని చెప్పు నాడీకేంద్రములనే యీ కమలములని చెప్పవచ్చును. ఇవి మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, ఆజ్ఞా, విశుద్ధ చక్రములు. వాటి స్వరూపమును ఇట్లు చెప్పుదురు :

(1) **మూలాధారచక్రము** : ఇది గుదమునకు పైన, లింగమూలము యొక్క క్రింది ప్రదేశమునందు, సుషుమ్నా నాడికి అంటుకొని క్రింది ముఖము గలదియై యున్నది. ఇది నాలుగురేకులు గల్గది. ఈ రేకులయందు బిందువుతోకూడిన (బిందుపూర్వకమగు) వ, శ, ష, స అను నాల్గు అక్షరములు ఆ పద్మదళముల యందున్నట్లు యోగులు భావింతురు. ఇది పసుపురంగు కలది. ఈ పద్మముయొక్క కర్ణికయందు త్రికోణము కలదు. ఇది పృథ్వీతత్త్వము. లంబీజము. చతురస్రము. అధిదేవత వినాయకుడు. సమస్త శక్తులకును మూలమగు కుండలినీశక్తి దీనియం దుండుటవలనను, సుషుమ్నా ద్వారమిం దుండుటవలనను దీనికి మూలాధారమని పేరు.

(2) **స్వాధిష్ఠానము** : ఇది లింగ మూలమునందు సుషుమ్నానాడికి సంబంధించియున్నది. ఇది ఆఱుదళములు గలది. ఈదళములయందు బిందుపూర్వకమగు బ, భ, మ, య, ర, ల అను అక్షరములు కలవు. ఇది సిందూరవర్ణము గలది. జలతత్త్వము. వంబీజము అర్ధచంద్ర మండలాకారముగ నుండును. అధిదేవత బ్రహ్మ.

(3) **మణిపూరకము** : మణివలె ప్రకాశించుచున్నది. కనుక దీనికీపేరు కలిగినది. ఇది నాభియందు గలదు. ఈ పద్మమునకు పదిరేకులు గలవు

Dr K Dayanandaswamy ebooks


వాటియందు బిందువుతో కూడిన డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ అను అక్షరములు కలవు. ఎఱ్ఱని రంగు కలది. అగ్నితత్త్వము. రంబీజము. అధిదేవత విష్ణువు.

(4) **అనాహతము** : ఇది హృదయ ప్రదేశమందు గలదు. ఇది మంకెనపూవురంగువంటి రంగుకలది. పండ్రెండు రేకులు గలవు. ఆ రేకులయందు సిందూరవర్ణమువలె, బిందువుతో కూడిన క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ అను పండ్రెండు అక్షరములు గలవు. ఇది కొట్టకయే శబ్దించునది గనుక దీనికీపేరు కలిగినది. (ఎనిమిది దళములుగల హృదయ పద్మమునకంటె ఈ చక్రము భిన్నమైనది. హృదయపద్మము అనాహతమునకు క్రిందుగా నుండును. ఇచ్చట యోగులు వారి యిష్టదేవతను ధ్యానింతురు.)

(5) **విశుద్ధచక్రము** : ఇది కంఠమూలమునందు గలదు. ఇది గొప్ప ప్రకాశముకల్గి పరిశుద్ధమైన దగుటవలన దీని కీపేరు గల్గినది. ఇది పదియాఱు రేకులు గలది. అందు బిందువుతో కూడిన అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః అను అక్షరములు (అచ్చులు) గలవు. ఇది ఆకాశతత్త్వము. తెల్లనిరంగనియు, బూడిద రంగనియు చెప్పుదురు. హంబీజము. అధిదేవత జీవుడనియు, అర్ధనారీశ్వరుడనియు భేదాభిప్రాయములు గలవు.

(6) **ఆజ్ఞాచక్రము** : పైననుండి యోగి యిచ్చట ఆజ్ఞలు స్వీకరించు చున్నాడు కనుక దీనికి ఆజ్ఞాచక్ర మనిపేరు. ఇది కనుబొమల మధ్య నున్నది. ఇది రెండు రేకులు గలది. అందు 'హం' 'క్షం' అను రెండు అక్షరములు గలవు. 'హంస'యను రెండుఅక్షరము లుండునని కొందఱందురు. ఇది శుద్ధస్ఫటికవర్ణము గలదనియు, కర్పూర వర్ణమువంటి వర్ణము కలదనియు చెప్పుదురు. మనస్తత్త్వము. అధిదేవత పరబ్రహ్మము. యోగులయం దీచక్రములు (కమలములు) ఊర్ధ్వముఖముగా నుండును. తక్కిన వారియందు

* "సర్వ వర్ణాత్మకం పత్రం పద్మానాం పరికీర్తితమ్।
దక్షిణావర్తయోగేన లిఖితం చింతయేద్ధియా"॥

Dr K Dayanandaswamy ebooks



అధోముఖముగా నుండును. కమలదళమందలి అక్షరములు ప్రదక్షిణముగా వ్రాయబడినట్లు చింతింపవలయును.* ఇచ్చట అక్షరము లనగా: మంత్రములు. ఆ మంత్ర దేవతలే ఆయా దళములం దాయా వర్ణరూపములుగా కలవని భావింపవలెను.

## (21) సహస్రారము

ఇది వేయి రేకులు గల పద్మమగుటవలన దీనికి సహస్రారమని పేరు. కపాలమునందు నెముకల తొట్టివలె నుండును. దానిలో ద్రవపదార్థము గలదనియు, దానియందు మెదడున్నదనియు శారీరక శాస్త్రజ్ఞులు చెప్పుదురు. యోగులు అమృత సరోవరమునందు సహస్రార పద్మము కలదని చెప్పుట దీనికి సరిపోవును. ఇది అధోముఖమై యుండును. 'అ' మొదలు 'క్ష' వఱకును గల ఏబది అక్షరములు ఇరువదిసార్లు ఆవర్తించిన వేయి దళములకు సరిపడునట్లు తలపవలెను. ఇది తెల్లని రంగు కలది. దీనికర్ణిక యందు 'ఓమ్' అను ప్రణవాక్షరము గలదు. ఆకర్ణిక పరమాత్మకు స్థానమై యున్నది. పరమశివునికి ఉనికియని చెప్పుదురు. ఇదియే వెన్నెలలోకము శివాశివులకు (శివశక్తులకు) సంయోగము కల్గుస్థానము. ఈ కర్ణికమధ్య త్రికోణము కలదు. శైవులు, శాక్తులు, వైష్ణవులు తదితరులు వారివారి యిష్టదేవతల పాదపద్మములు ఈ కర్ణికయందు కలవని యుపాసింతురు. యోగులు తమ గురువుయొక్క పాదపద్మములు ఇచ్చట నున్నట్లు భావింతురు. దీనియందు బ్రహ్మరంధ్ర మున్నది. ఆ బ్రహ్మరంధ్రమునుండియే దేవయాన మార్గమున బ్రహ్మలోకమునకు పోవు ఉపాసకులు నిర్గమింతురు. అనగా ఉత్క్రాంతి నొందుదురు.

## (22) కుండలినీశక్తి

ఇది మూలధార చక్రమునందు చుట్ట చుట్టుకొని సర్పమువలె నిద్రించుచుండును. ఈ కుండలినీశక్తియే సమస్త శక్తులుగల శక్తిరూపిణి. పరాశక్తి. కుండలినిని ప్రబోధించవలెను. ఆ విధానము యోగ కుండలినీ ఉపనిషత్తునందిట్లు చెప్పబడినది.

Dr K Dayanandaswamy ebooks

సత్త్వ గుణాధిక్యము గల బుద్ధితో ప్రాణాయామము అభ్యసింపవలయును. అట్లభ్యసించినయెడల సుషుమ్నయందు చిత్తము లయించును. వాయువు కూడ చలించదు. కేవల కుంభకమువలన నాడులయందున్న మలము శుష్కించి యుండును. సుషుమ్నయందు ప్రాణగతికూడ స్తంభితమయి యుండును. అధోగతి కల్గిన అపానమును బలాత్కారముగా ఊర్ధ్వగమనము కల్గునట్లు చేయవలెను. ఈ అభ్యాసమునకు మూలబంధమని పేరు. ఈ అభ్యాసమువలన అపానము ఊర్ధ్వగమనము గలదియై ఉదరము నందున్న జఠరాగ్నితో కలియుచున్నది.

**మం॥ ప్రాణస్థానం తతో వహ్నిః ప్రాణాపానౌ చ సత్వరమ్**
**మిలిత్వా కుండలీం యాంతి ప్రసుప్తా కుండలాకృతిః।**
**తేనాగ్నినా చ సంతప్తా పవనేనైవ చాలితా**
**ప్రసార్య స్వశరీరం తు సుషుమ్నావదనాంతరే॥**

(యో.కుం. 1-65, 66)

తా॥ ఈ విధముగా జఠరాగ్నితో కలసిన అగ్నియు, ప్రాణాపానములును కలిసి కుండలిని పొందుచున్నవి. చుట్టచుట్టుకొనియుండు పామును కఱ్ఱచేత కొట్టిన అది చుట్టను వదలి తన శరీరము నెట్లు నిడుపుగా చేయునో అవిధముగనే కుండలినియును నిదురలేచి శరీరమును నిడువుచేసి సుషుమ్నాద్వారమును ప్రవేశించుచున్నది.

ఈ కుండలినిని ఎవరు మనస్సుచేత తెలిసికొను చున్నారో అట్టివారు సర్వపాపములనుండి విముక్తు లగుచున్నారు అని అద్వయ తారకోపనిషత్తు చెప్పినది.*

కుండలిని మూలాధారమునుండి సహస్రారమును చేరునప్పుడు మార్గమునందున్న కమలములను తగులుచుండును. అట్టు ఒక్కొక్క కమలమును చేరినప్పుడు యోగికి ఒక్కొక్క విధమైన అనుభవము

---

* దేహమధ్యే బ్రహ్మనాడీ సుషుమ్నా సూర్యరూపిణీ పూర్ణచన్ద్రాభా వర్తతే. సా తు మూలాధారా దారభ్య బ్రహ్మరన్ధ్రగామినీ భవతి, తన్మధ్యే తటిత్కోటి సమాన కాన్త్యా మృణాళ సూత్రవత్సూక్ష్మా కుణ్డలినీతి ప్రసిద్ధా>స్తి, తాం దృష్ట్వా మనసైవ నరస్సర్వపాప వినాశద్వారా ముక్తో భవతి. (అద్వయ తారకోపనిషత్తు)

Dr K Dayanandaswamy ebooks



కల్గుచుండును. అది అతీంద్రియమయిన అనుభవమై యున్నది. అందువలన యోగికి తాను యోగమందు కృతకృత్యు డగుచున్నానని నమ్మకము కల్గుచుండును. వివేకానందస్వాములవారు వారి "రాజయోగము" నందు కుండలినీశక్తి ప్రబోధమును ఇట్లు చెప్పిరి:

"అతీంద్రియ జ్ఞానమును ఆత్మసాక్షాత్కారమును నగు దివ్య జ్ఞానమును బడయుటకై కుండలినీ ఉద్బోధన మొక్కటియే మార్గము. భగవత్ప్రీతిచేకాని, మహాపురుషుల యనుగ్రహమువలనగాని, నిత్యానిత్య వస్తువివేచనా సామర్థ్యము వలనగాని బహువిధములుగా కుండలినీశక్తిని మేల్కొలుపవచ్చును. అప్రాకృతమనియు, అలౌకిక మనియు చెప్పబడుశక్తి, జ్ఞానము లెచ్చట ప్రకాశించుచుండునో అచ్చట కుండలినీశక్తి సుషుమ్నా ద్వారమునందు ప్రవేశించియున్నదని యూహింపవలయును. సాధారణముగా నిట్టి సందర్భము లన్నింటియందును కుండలినీశక్తియం దొక లవలేశమును మేల్కొల్పునట్టి సాధన నేదియో యొక దానిని తమకు తెలియకయే జను లవలంబించుచుందురు. ఎఱుకతో నొనర్చినను ఎఱుక లేకయే యొనర్చినను ఉపాసనల కన్నిటికిని ఇదియే పరమ ప్రయోజనము."

"మృత్యువక్త్రగత న్యాపితస్య మృత్యుభయం కుతః."

ఎవడు కుండలినిని లేపునో అతనికి మృత్యుదేవత ముఖము చూచినను మరణభయ ముండజాలదని యోగశిఖ చెప్పినది.

శ్రీ శంకరాచార్యులవారు కుండలినీశక్తిని 'సమయకళ' అను దేవతగా నిట్లు స్తోత్రము చేసియున్నారు:

శ్లో॥ మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృది మరుత మాకాశ ముపరి ।
మనో௨పి భ్రూమధ్యే సకలమపి భిత్వా௨௨కులపథం
సహస్రారే పద్మే సహ రహసి పత్యా విహరసి ॥

(సౌందర్యలహరి 9 శ్లో॥)

తా॥ మూలాధార, మణిపూరక, స్వాధిష్ఠాన, అనాహత, విశుద్ధ,

Dr K Dayanandaswamy ebooks

ఆజ్ఞాచక్రములయం దున్న పృథివ్యాది పంచభూతములను మనస్సును దాటినదై, సుషుమ్నా మార్గమును భేదించి (దేవి) తన భర్తయగు సదాశివునితో కలిసి క్రీడించుచున్నది.

పై శ్లోకమునందు పంచభూతములను, మనస్సును దాటినదని చెప్పుటవలన ఇరువదినాల్గు తత్త్వములను "నేతి నేతి" ("ఇది కాదు" "ఇది కాదు") యని త్రోసివేసి తుదకు సదాశివునితో అద్వైతభావము కలిగిన శివశక్తి సమ్మేళనమును అద్వైతమతాచార్యులు యోగమార్గముచే పేర్కొని యున్నారు.

కుండలిని సహస్రారమును చేరి అచ్చటనున్న బ్రహ్మబిలమును తాకుచున్నది. ఆ బ్రహ్మరంధ్రమే తురీయాతీతమునకు స్థానము. ఇందుకు శ్రుతి:-

**"తుర్యాతీతం పరం బ్రహ్మ బ్రహ్మరంధ్రే తు లక్షయేత్।**
**జాగ్రద్వృత్తిం సమారభ్య యావద్బ్రహ్మ బిలాంతరమ్।**
**తత్రాత్మా ఉయం తురీయ స్స్యాత్ తుర్యాంతే విష్ణు రుచ్యతే॥"**

(త్రి.బ్ర. 155, 156)

తా॥ తురీయాతీతమైన పరబ్రహ్మమును బ్రహ్మరంధ్రమందు లక్ష్యము చేసికొనవలెను. జాగ్రద్వృత్తి మొదలుకొని బ్రహ్మబిలాంతరమువఱకును నుండు ఆత్మచైతన్యము తురీయమనియు, తురీయాతీత మనునది విష్ణువనియు చెప్పబడెను.

జి : అసంప్రజ్ఞాత సమాధి నొందిన యోగి జ్ఞానివలె కైవల్యమును బెందునా?

వే : అద్వైత సిద్ధాంతము ననుసరించి జీవన్ముక్తునకును, తత్త్వజ్ఞానికిని సద్యోముక్తి కలుగుచున్నది. యోగులు జీవన్ముక్తి నంగీకరింతురు. యోగికి తత్త్వజ్ఞానము కలుగక, కేవల యోగశక్తిచే సహస్రారమునందలి బ్రహ్మరంధ్రమును భేదించి, దేహమును వదలినచో సగుణ బ్రహ్మోపాసకుల వలెనే అతనికిని అర్చిరాది మార్గమున క్రమముక్తి మాత్రము కలుగును.

Dr K Dayanandaswamy ebooks



జీవన్ముక్తిగాని, దేహావసాన సమయమున సద్యోముక్తి (ఉత్క్రాంతి లేక పోవుట) గాని కలుగదు. యోగమేగాక తత్త్వజ్ఞానము సహితము కలిగి యుండెనేని జీవన్ముక్తి కలుగుచున్నది. అట్టివారికి సద్యోముక్తి కలుగును*. కనుకనే **"జ్ఞానే నైవ వినా యోగో న సిద్ధ్యతి కదాచన"** (యో.శి. 1-51) జ్ఞానరహిత యోగము మోక్షము నొసగజాలదని శ్రుతి చెప్పినది. కేవల సమాధి సిద్ధించినంత మాత్రమున యోగి సమస్తమును బ్రహ్మస్వరూపముగ చూడలేదు కదా?

**'సర్వం ఖల్విదం బ్రహ్మ'**- సమస్తమును బ్రహ్మమే, **'నేహ నానాస్తి కించన'** అంతకంటె నితర మేమియును లేదు అను అనుభవమునకు వచ్చునంతవఱకును సద్యోముక్తి యుండదు. కనుకనే జ్ఞానయోగమున బాహ్యసమాధులుకూడ చెప్పబడినవి. జ్ఞానమును యోగమును సిద్ధించిన మహాత్ములు ధన్యులు. ఇట్టి మహాత్ములకు నమస్కరించుచున్నాను. అట్టి యోగి జనులయొక్క స్నేహమును వారి ఆశీర్వాదమును మన అందఱికిని లభించునట్లు పరమేశ్వరు డనుగ్రహించు గాక!

- * -

**"నమో విజ్ఞానరూపాయ పరమానంద రూపిణే।**
**కృష్ణాయ గోపీనాథాయ గోవిందాయ నమో నమః॥"**

ఇది, పరమేశ్వరానుగ్రహమువలన మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యచే
రచియింపబడిన "బ్రహ్మ జిజ్ఞాస" ద్వితీయ భాగమునందలి
'రాజయోగమ'ను రెండవ ప్రకరణము సంపూర్ణము

**ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.**

---

* క్రమ ముక్తిని గుఱించి యీ గ్రంథమునందు 1-3-7,8 యందును, సద్యోముక్తిని గుఱించి 1-3-11 నందును చూడుడు.

Dr K Dayanandaswamy ebooks

ఓమ్
శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః

# బ్రహ్మజిజ్ఞాస

## (ద్వితీయ భాగము)

## మూడవ ప్రకరణము - కర్మయోగము

"కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనమ్|
వాసుదేవం జగద్యోనిం నౌమి నారాయణం హరిమ్||"

### (1) అవతారిక

జిజ్ఞాసువు : అయ్యా! మోక్ష సాధనములగు జ్ఞానయోగ, రాజ యోగముల గుఱించి వింటిని. కర్మయనియు, కర్మయోగమనియు పెద్దలు చెప్పుచుందురు. కర్మయన నేమి? కర్మయోగమన నేమి? ఇవి మోక్షసాధనము లగునా? ఈ రెండును సనాతనములా? వేద సమ్మతము లగునా? అనుగ్రహించి తెలుపుడు.

**వేదాంతి :** అపవర్గ (మోక్ష) సాధనములయందు కర్మయోగ మొకటియై యున్నది. కొందఱు పెద్దలు కర్మయోగము స్వయముగ మోక్షము నొసగజాలదనియు, అది కర్మ యోగికి చిత్తశుద్ధిని కలిగించుటద్వారా జ్ఞానమును, జ్ఞానము వలన మోక్షమును కలుగజేయుననియు చెప్పుదురు. ప్రవహించుచున్న యొక యుపనదీ జలములయం దొక చెండును వేసినయెడల అది మహానదియందు చేరి సముద్రమున చేరునట్లు కర్మయోగము సహితము ముక్తి నిచ్చుచున్నది. ముఖ్యముగా నీ కర్మయోగమును ప్రతిపాదించునది భగవద్గీత. గీత తదితర మోక్షసాధము లను చెప్పినప్పటికిని ప్రధానముగా కర్మయోగమునే చెప్పినదని శ్రీ లోకమాన్య బాలగంగాధరతిలక్ గారు

Dr K Dayanandaswamy ebooks



గీతారహస్యమునందు వివరించిరి. జ్ఞానము కలిగిన పిదప సన్న్యసింపవలయునా? ఫలాపేక్ష లేక కర్మల నాచరింపవలయునా? యను విషయమై కర్మల నాచరింపవలయునని గీత ఆదేశించుచున్నట్లు. లోకమాన్యులు తమ గీతారహస్యమున సిద్ధాంతము చేసిరి. గీతయందలి మూడవ అధ్యాయమునకు కర్మయోగ మని పేరు. 'యోగ' శబ్దమునకు ఇతరత్ర యే అర్థము చెప్పియుండినను గీతయందు కర్మయోగ మనియే యర్థము.

"యోగః కర్మసు కౌశలం" (గీత. 2-50) యోగ మనగా: శేషమగు కర్మకౌశలము లేక యుక్తి, చాతుర్యము, నేర్పరితనము అని యర్థము. అట్లయినచో ఇచ్చట నేర్పరితనమేమి? యుక్తి యెట్టిది? అనగా: పాపపుణ్యములను దరిచేరనీయక ఫలాపేక్షా రహితముగాగాని, ఈశ్వరార్పణ బుద్ధితోగాని, కర్మను చేయుటయే యుక్తి, చాతుర్యము మొదలగునవి. కనుక దీనికి కర్మయోగమనిపేరు పెట్టబడెను.

## (2) యజ్ఞ చక్రము

'కర్మ' శబ్దము 'కృ'ధాతువు నుండి కలిగినందున దానికి 'చేయుట', 'వ్యాపారము', 'నడవడి' అనునవి సమానార్థములు. ప్రాచీన వైదిక ధర్మావలంబులు వైదిక గ్రంథములయందు చెప్పిన యజ్ఞాదులనే కర్మలని చెప్పుదురు. వేదచోదిత మైనందున యజ్ఞార్థము చేయబడిన యే కర్మయైనను బంధహేతువు కాదని వారిమతము. యజ్ఞమనగా బంధహేతువు కాదని వారిమతము. యజ్ఞమనగా నేమి? అను మఱియొక ప్రశ్న కలుగుచున్నది. (పూర్వ) మీమాంసా మతానుసారము వైదిక గ్రంథములయందు చెప్పిన విధమున అగ్నియందు హవిస్సును హోమము చేయుట యజ్ఞమనబడును. (దీనికే క్రతువను మఱియొక పేరు గలదు.) భగవద్గీత 'యజ్ఞ' శబ్దమునకు విశాలమగు (వ్యాప్తమగు) అర్థమును చెప్పియున్నది. దానినే మనమిచ్చట గమనింపవలయును. గీత యిట్లు చెప్పినది :

"బ్రహ్మదేవుడు సృష్టి కాలమున యజ్ఞముతోగూడిన ప్రజలను సృజించి వారితో నిట్లు పలికెను. 'మీరు ఈ యజ్ఞముచేత వృద్ధిని పొందుడు.

Dr K Dayanandaswamy ebooks


ఇది మీకు కోరిన కోరికల నిచ్చునది యగుగాక (గీత. 3-10). ఈ యాగములచేత దేవతలను వృద్ధిపొందింపుడు. ఆ దేవతలు మీకు మేలు చేయుదురు. ఇట్లు మీరన్యోన్యము ప్రేమించుచు శ్రేయమును పొందుడు (గీత. 3-11). దేవతలను సంతోషపెట్టక యెవ్వడు తానే తినుచున్నాడో వాడు దొంగయే (గీత. 3-12). యజ్ఞశేషమును భుజించెడి సత్పురుషులు సర్వపాపములనుండి విముక్తు లగుచున్నారు" (గీత. 3-13)

యజ్ఞమనగా : అగ్నిహోత్రమున తిలతండులాదులు వేసి వ్రేల్చుటయు పశువధ చేయుటయు మాత్రమే కాదని చాతుర్వర్ణ్యోచితకర్మ సహితము యజ్ఞమే యని చెప్పబడెను. ఏలయన, సంఘముయొక్క ధారణ పోషణములు దేనివలన జరుగునో అదియే యజ్ఞము. అట్టిది అగ్నిహోత్రమున ఆజ్యాదులు వేసినంత మాత్రమున కాజాలదు. పొలమును దున్ని పైరుపెట్టవలయును. దానివలన మానవులకు కావలసిన అన్నము లభించుచున్నది. అన్నము తిని భూతములు జీవించుటవలన వానినుండి మరల భూతములు పుట్టుచున్నవి. మేఘమువలన అన్నము కలుగుచున్నది. మేఘము సూర్యుని వలన కలుగుచున్నది. గాలివలన మేఘము వర్షించుచున్నది. వర్షమువలన పైరు పండుచున్నది. పొలము పండినపుడు మానవులేగాక పక్షులును ఇతర ప్రాణులును పొలములోని ధాన్యాదులను తిని జీవించుచున్నవి. కొన్ని వృక్షములను పెంచుటవలన వాని ఫలమును దిని పక్షిజాతి వర్ధిల్లుచున్నది. పక్షుల ఱెక్కలవలనను, వృక్షములవలనను, గాలివీచుట వలనను, మేఘము వచ్చి వర్షించుచున్నది. వర్షమువలన పైరులు వృక్షములు వృద్ధినొందుచున్నవి. ఈ విధముగా ఈ యజ్ఞచక్రము పరస్పర సహకారముతో తిరుగుచున్నది.

ఈ యర్థమే గీతయందు (3-14, 15, 16) ఈ క్రింది విధముగా చెప్పబడినది. "పరబ్రహ్మ నుండి బ్రహ్మమును (ప్రకృతి లేక, సగుణ బ్రహ్మమును), బ్రహ్మమునుండి కర్మమును (యజ్ఞము), కర్మమువలన మేఘమును, పర్జన్యునివలన అన్నమును, అన్నము వలన భూతములును, భూతములవలన యజ్ఞమును కలిగినవి. ఎవ్వడు యజ్ఞము చేయక నిరుద్యోగియై, సోమరియై యుండునో అతడు ఈ యజ్ఞచక్ర (జగచ్చక్ర)

Dr K Dayanandaswamy ebooks



మును అనువర్తింపనివాడు. నిరర్థక జీవనము గలవాడు."

అనగా: ఎవ్వరు తమ విధ్యుక్త కర్మమును చేయరో వారు సమాజముయొక్క భారమును ఇతరులతో పాలుపంచుకొనక భారమును ఇతరులపైన నుంచిన వారని భావము. పైన చెప్పబడిన యజ్ఞచక్రమే లోకరక్షకుడగు విష్ణుదేవుని హస్తమునందలి సుదర్శన చక్రము.

సుమా రఱువది సంవత్సరములకు పూర్వమున రావి, మఱ్ఱి, వేప, మామిడి మొదలగు గొప్పవృక్షములు అచ్చటచ్చట పెంచుచుండెడి వారు. నలువది సంవత్సరముల క్రిందటి కంటెను ప్రస్తుతకాలమున పక్షుల సంఖ్య చాల తగ్గిపోయినది. ప్రస్తుతకాలమున నారింజ, మామిడి మొదలగు వృక్షములకు అంట్లుగట్టి చిన్నచిన్న చెట్లుగా పెంచి వాటిని స్వప్రయోజనమునకై (ధనార్జనమునకుగాను) ఉపయోగించుచు పక్షులు వ్రాలకుండ వాటిని రక్షించుచున్నారు. కాబట్టి రావి, మఱ్ఱి వంటి పెద్దవృక్షముల సంఖ్య తగ్గిపోయినది. వర్షము సహితము పూర్వమునకంటె తగ్గిపోయినది. ఇట్లు అన్నమును వృద్ధి పొందించుట మాత్రమేగాక భూమినుండి ఖనిజ సంపదను పైకి తీయుట, ఆనకట్టలు కట్టుట, మానవ సమాజమున కవసరమగు నట్టి సామగ్రిని తయారుచేయుట - మొదలగునవి యును నొకవిధమగు యజ్ఞమే యగును. ఏలయన, నిదియును సమాజము నిలుచుటకు తోడ్పడుచున్నది.

జి : గీతయందు యజ్ఞశేషమును భుజించిన వారు విగత పాపులగుదురనియు, దేవతలను సంతృప్తులను చేసి వారివలన ఇష్టకామముల పొందుదురనియు నున్నది గదా? వర్ణోచిత వ్యాపారమువలన దేవత లెట్లు సంతృప్తు లగుదురు? మనకు ఫలమెట్లు గలుగును?

వే : గీతయందు అనేక విధములగు యజ్ఞములు చెప్పబడినవి. వాటినిచ్చట చెప్పెదను. "కొందఱు కర్మనిష్ఠులు ఫలాపేక్షతో దేవతా యజన సాధనమైన యజ్ఞమును చేయుచున్నారు. మఱికొందఱు బ్రహ్మమను నగ్నియందు కర్మమను హవిస్సును హోమమును చేయుచున్నారు (గీత. 4-25). కొందఱు (నైష్ఠిక బ్రహ్మచారులు) శ్రోత్రము మొదలైన యింద్రియము

Dr K Dayanandaswamy ebooks



లను, నిగ్రహమనెడి యగ్నియందు హోమము చేయుచున్నారు. మఱికొందఱు విషయములను నింద్రియములనెడి యగ్నియందు హోమము చేయుచున్నారు (గీత. 4-26). కొందఱు ఇంద్రియముల యొక్కయు, ప్రాణముయొక్కయు, వ్యాపారమును ఆత్మసంయమన రూపమగు నగ్నిహోత్రమునందు హోమము చేయుచున్నారు (గీత. 4-27).

మఱి కొందఱు పుణ్యతీర్థములయందు ద్రవ్యదానమను యజ్ఞమును చేయుచున్నారు. కొందఱు తపోయజ్ఞమును (కృచ్ఛ్రాది తపములను), కొందఱు ప్రాణాయామాది యోగములను యజ్ఞకర్మను, ఇంకను కొందఱు ఇంద్రియములను జయించుట యను యజ్ఞ కర్మను, మఱికొందఱు కఠినమైన నియమము గల యజ్ఞకర్మను జేయుచున్నారు (గీత. 4-280). కొందఱు అపానవ్యాపారము నందు ప్రాణవ్యాపారమును, ప్రాణవ్యాపారము నందు అపాన వ్యాపారమును వ్రేల్చుచున్నారు. మఱికొందఱు ప్రాణాపాన వాయువుగల గతులను నిగ్రహించి వ్రేల్చుచున్నారు (గీత. 4-29). మఱికొందఱు పరిమితమైన ఆహారము గలవారై వాయు విశేషములను (ప్రాణములనే ప్రాణములయందు) వ్రేల్చుచున్నారు. వీరందఱు యజ్ఞములచే క్షీణ పాపులును, యజ్ఞవేత్తలును, మఱియు యజ్ఞము చేయగా మిగిలిన పదార్థమును భుజించినవా రగుటచే సనాతనమగు బ్రహ్మమును బొందుదురు. యజ్ఞము చేయనివారికి ఇహలోకమే సిద్ధింపదు, పరలోక మెట్లు సిద్ధించును?" (గీత. 4-30, 31)

కనుక పైన చెప్పబడిన వన్నియు యజ్ఞములే. యజ్ఞముయొక్క స్వభావము త్యాగము. యజ్ఞము చేయువాడు యజమాని అనబడును. యజమాని తనకున్న దానిలో కొంత త్యాగము చేయుటయే యజ్ఞ కర్మయందున్న నిగూఢమగు అర్థము. త్యాగమువలన సహజముగ కొందఱకు మేలు కలుగుచున్నది. ఏదియో యొకవిధమగు పరోపకార మిందిమిడియున్నది.

సమస్తప్రాణుల హృదయములయందు నీశ్వరుడు నివసించు చున్నాడు. భూతములను తృప్తిపరచుట యీశ్వరుని తృప్తిపరచుటయే. ఇట్టి యజ్ఞములచేత నితరులు అన్నము గలవారలైరి. దరిద్రులకును, కష్టించి పనిచేయలేని వికలాంగులకును, అతిథులకును అన్నమిడుట మనుష్యయజ్ఞము.

Dr K Dayanandaswamy ebooks



మానవసేవయే మాధవసేవ. ఇట్టి యజ్ఞముచేత నీశ్వరుడు సంప్రీతుడైన దేవతలందఱును సంతుష్టు లగుదురు. కనుక సమాజముయొక్క ధారణపోషణ లెట్టి కర్మవలన జరుగునో అదియే యజ్ఞము. అమెరికా, రష్యా మొదలగు దేశముల యందు వేదచోదితముగ అగ్నియందు హోమముచేయు యజ్ఞకర్మలు చేయకున్నను వారు తాము తిని యితర దేశములకు తిండిగింజలను అమ్మగలుగుచుండుట మనకు తెలిసినదే.

మానవులు కేవలము అన్నము కొఱకుగానే జీవించి యుండలేదు. వారు కల్యాణ ప్రదమగు మఱియొక ధర్మమును కూడ ఆచరించవలసి యున్నది. అదియే బ్రహ్మయజ్ఞము. యజ్ఞములోకెల్ల బ్రహ్మయజ్ఞము శ్రేష్ఠమైనది. (గీత. 4-33). బ్రహ్మయజ్ఞము వలన నాశరహితమైన అమృతమును పొందుచున్నారు. ఇందువలన వేదములయందు చెప్పిన శ్రౌతకర్మములు చేయుట తప్పని అర్థము కాదు. కాని, వాటివలన కలుగు ఫలముకంటె అధిక తరమగు ఫలము ఇతర యజ్ఞమువలన కలుగుచున్నది. అదిగాక యజ్ఞాది శ్రౌతకర్మలు చేయునప్పుడు "మిథ్యాప్రయుక్తో యజమానం హినస్తి" యజ్ఞములు చేయునపుడు అలక్ష్యముతోగాని, శాస్త్రోక్త క్రమమును వదలిగాని అనుష్ఠించిన పక్షమున అది యజమానిని (యజ్ఞము చేయువానిని) చంపును అనియును; "జ్ఞానదోష పరిభ్రష్టశ్చాండాలీం యోని మాస్థితః" దేశకాల పాత్రములయొక్క జ్ఞానములేక యజ్ఞముచేసిన యజమానుడు చండాలు డగునని చెప్పబడియున్నది. ఏ కారణమువలన నైనను, యజ్ఞము పూర్తిగాకున్న యజమాని వంశము నాశమగును. ఈకారణములవలన సహితము ఇట్టి యజ్ఞములు ప్రోత్సహింపదగినవి కావు.

యజ్ఞములు విరివిగా చేయబడిన పూర్వకాలము నందలి ఆ సమాజము, అప్పటి వ్యక్తులు, అప్పటి దేశకాల పరిస్థితులును; ఇప్పటి సమాజము, ఇప్పటి వ్యక్తులు, ఇప్పటి పరిస్థితులును వేఱువేఱగుటచే ఇప్పుడు చేయదగిన యజ్ఞములు అప్పటి యజ్ఞములకంటెను భిన్నమైనవిగానే యుండవలెను. ప్రస్తుతము ప్రతిమనుజుడు స్వధర్మమును తప్పక ఆచరించునేని యదియే యజ్ఞము, దానిచేతనే పరమేశ్వరుడు సంప్రీతుడగును. చాతుర్వర్ణ్య విహిత ధర్మమనగా నేమో ముందు చెప్పెదను. భగవద్గీత కర్మను కర్మ-వికర్మ-

Dr K Dayanandaswamy ebooks



అకర్మలని మూడు విధములుగ చెప్పియున్నది. దానిని వివరింతును.

### (3) కర్మ-వికర్మ-అకర్మ

భగవానుడు అర్జునునకు ఇట్లుపదేశించెను:

శ్లో॥ **కిం కర్మ కిమకర్మేతి కవయో ఽప్యత్ర మోహితాః ।**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్జ్ఞాత్వా మోక్ష్యసే ఽ శుభాత్ ॥**

శ్లో॥ **కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥** (గీత. 4-16, 17)

తా॥ కర్మయనగా నెట్టిది? అకర్మయనగా నెట్టిది? అను నీ విషయమున బుద్ధిమంతులు సహితము మోహమును బొందుచున్నారు. దేనిని తెలిసికొనుటవలన అశుభమయిన సంసారమునుండి మోక్షమును పొందగలవో, అట్టి కర్మను నీకు చెప్పెదను. శాస్త్ర సమ్మతమయిన కర్మ యిట్టిదనియు, వికర్మ (నిషిద్ధ కర్మ) యిట్టిదనియు, అకర్మ యిట్టిదనియు తెలిసికొనవలసియున్నది. వీటి యథార్థస్థితి తెలిసికొనుట అతికష్టము.

కర్మయననేమో యిదివఱకే చెప్పియుంటిని. శాస్త్రోక్తప్రకారము శరీరము, మనస్సు- వీటితో చేయబడు వ్యాపారము లేక 'క్రియ' నడవడి యనునవియేగాక, మానసికముగను శారీరకముగను మానవుడు చేయు ప్రతిక్రియయు కర్మయే యగును. ఊపిరిపీల్చుకొనుట, కనురెప్ప లల్లార్చుట, గుండెకొట్టుకొనుట, తుదకు ఊరక కూర్చుండుట - యివియన్నియు కర్మలే యగును. కాని కర్మసిద్ధాంత దృష్టితో చూచినచో నివి కర్మలు కానేరవు. (కర్మసిద్ధాంతమును గుఱించి యిదివరలో ఈ గ్రంథము 1-2-18లో చెప్పిన దానిని చూడుడు). కర్మసిద్ధాంతము ననుసరించి యేకర్మ చేయుటవలన ఫలము కలుగునో-అనగా పుణ్యమో, పాపమో కర్తకు కలుగునో, యే కర్మలు చేయవలసియుండి చేయక పోవుటచేత (ఊరక యుండుటచేత) పుణ్యమో, పాపమో కలుగుచున్నదో, అట్టి బంధహేతువగు వ్యాపారమే కర్మయనబడును. అదృష్టిచేత కనురెప్పలార్చుట, ఊపిరిపీల్చుట మొదలగునవి కర్మలు గానేరవు.

Dr K Dayanandaswamy ebooks



అకర్మయనగా : కర్మాభావమనియు కర్మలను వదలి సన్న్యసించుట యనియును పూర్వాచార్యులనేక విధములుగా వ్యాఖ్యానము చేసిరి. అకర్మయనగా కర్మస్వరూప త్యాగము కాదనియు, కర్మఫలత్యాగమే దాని యర్థమనియు లోకమాన్య శ్రీ బాలగంగాధరతిలక్ గారి వ్యాఖ్యానము. కర్మలను సన్న్యసించినంత మాత్రమున అకర్మ సిద్ధింపదు. ఎట్లనగా అధర్మముచేత ధర్మము, అసత్యముచేత సత్యము చెడిపోవుచున్న సమయమున సత్యధర్మములను రక్షించుటకు సమర్థులై యుండియు ఉపేక్షించి యూరకున్నవారు పాపమును బొందుదురని చెప్పబడెను. ఇంతయేల? మనము చూచుచుండగనే ఒక పసిబాలుడు బావిలోపడి చనిపోవు స్థితియందుండగా వాడు బావిలో పడకుండ పట్టుకొని నిలుపగలిగియు అట్లు చేయక చూచుచుంటిమేని, అదియును కర్మయే యగును. దీనివలన పాపము కలుగును. పాపమువలన దుష్టయోనుల యందు జన్మము కలుగును.

కావున అకర్మయనునది ఎట్లు సిద్ధించుననగా: ఎప్పుడు కర్మఫలమును మనము కోరమో, ఎప్పుడు నేను కర్తను, నేను చేయుచుంటిని అను అహంభావమును వదలి కర్మలు చేయబడునో, అప్పుడు కర్తకు కర్మఫలమంటదు. ఫలము నిచ్చుటకు శక్తిలేని అట్టికర్మ అకర్మ యనబడును. దీనికి స్వర్గనరకములుగాని పునర్జన్మగాని కలిగించు శక్తిలేదు. కనుక కర్మసిద్ధాంతము ననుసరించి యిది కర్మ గానేరదు. కర్మకానిదనగా అకర్మయని యర్థము. "కర్మ శూన్యత యనునది లోకమున లేదు" (గీత. 3-5) "నేను కర్మను వదలితిని" అనుటకు సాధ్యపడదు.

కర్మ స్వర్గాదిఫలము నపేక్షించిగాని, యే ఫలమునైన కోరిగాని చేయబడునేని యది వికర్మ యనబడును. వికర్మ యనగా నిషిద్ధ (విపరీత)మైన కర్మయని యర్థము. స్వర్గఫలము నిచ్చు పుణ్యకర్మను నిషిద్ధమైనదని చెప్పుటకు కారణ మేమన అది స్వర్గఫలము నిచ్చి జన్మమును కలిగించుటద్వారా సంసారమను సుడిగుండములో త్రోయుచున్నది. కనుక ముముక్షువుల దృష్టియందు, లేక వేదాంత శాస్త్రదృష్టిచేత అది నిషిద్ధమైనదని చెప్పబడినది. ఏది వికర్మయని చెప్పబడెనో ఆ వికర్మయే ఫలాపేక్షను వదలి ఈశ్వరార్పణ బుద్ధితోగాని, లోకకల్యాణ బుద్ధితోగాని చేయబడునేని యది అకర్మయనబడును. దీనినే కర్మయోగ మందురు. వికర్మకును,

Dr K Dayanandaswamy ebooks

అకర్మకును ఆచరణయందు భేదము లేదు. సంకల్పమునందు మాత్రమే భేదము కలదు.

ఈ విషయ మింకను చక్కగా బోధపడుటకు దృష్టాంతము చెప్పెదను. 'వసనాభి' మొదలగు పాషాణద్రవ్యముల భక్షించినవారు మృతిచెందుదురు. పొరపాటున నైనను విషము తినరాదు. కనుక దానికి దూరముగా నుండవలెనని జాగ్రత్తపడుదురు. అట్లే సన్న్యాసులు, కర్మవలన బంధము కలుగునని కర్మకు దూరముగా నుండవలెనని కర్మ సన్న్యాసము చేయుదురు. వైద్యులు 'నాభి' మొదలగు పాషాణములకు విరుగుడు - శుద్ధి చేసి దానిని ఔషధముగా రోగులకు తగిన మోతాదులో నిచ్చి మృత్యుముఖమున పడబోవు కొందఱు రోగులను రక్షించుట మన మెఱుగుదుము. ఏది విషమని, మృత్యువును కలిగించునని దూరముగా నుంచబడెనో, అదియే శుద్ధి చేయబడిన పిమ్మట అమృతమైనది.

ఇట్టి వైద్యుల వంటివారు జనక మహారాజు మొదలగు కర్మయోగులు. వీరు కర్మను శుద్ధిచేసిరి. ఆ శుద్ధి యేమనగా: కర్మయొక్క ఫలము నపేక్షింపక కర్మచేయుటయే. లేదా, కర్మఫలమును ఈశ్వరార్పణము చేయుటయే. ఫలాపేక్షతో చేయబడిన వికర్మ మృత్యురూపమైన సంసారమునందు త్రోయును గనుక శుద్ధిచేయని విషమువంటిది. ఫలాపేక్షా రహితమైన కర్మయందు కర్మత్వము లేదు. సామాన్యమానవుడు ఫలము నపేక్షించియే కర్మచేయుట కారంభించుచున్నాడు. ఫలాపేక్ష లేనివాడు ఆరంభరహితుడని గీతయందు చెప్పబడెను. కర్మయందు కర్మత్వము లేక పోవుట యనగా వేయించబడిన విత్తనములు మొలకెత్తుటకు సమర్థములు గానియట్లు అకర్మ సంసారమునందు త్రోయజాలకుండుట యని భావము. ఇదియే కర్మయోగము నందలి రహస్యము. ఈ కర్మాకర్మల విషయమై గీతయంధు మఱియొక విధముగా చెప్పబడెను.

కర్మ సాత్త్వికమనియు, రాజసమనియు, తామసమనియు మూడు విధములు. గీతయందు (అ. 18-23, 24, 25) చెప్పబడిన రీతిగా సాత్త్విక కర్మ యనునది అకర్మ. ఇది అహంకార మమకారములు వదలి ఫలాపేక్షా

Dr K Dayanandaswamy ebooks


రహితముగా చేయబడుచున్నందున అకర్మ యనబడెను. ఫలాశతోను అహంకారముతోను మిక్కిలి ప్రయాసతోను చేయబడునది రాజసకర్మ, ఇదియే వికర్మ, తన సామర్థ్యము విచారింపక మోహముతో ప్రారంభించినది. అనుబంధము, హింస, నాశము - ఇవి గల కర్మ తామసకర్మయని చెప్పబడెను. ఇది మిక్కిలి పాపహేతువు.

"ఏ పురుషునికి అహంకారము లేదో, యెవడు కర్మఫలమందు ఆసక్తిలేక యున్నాడో, అట్టివా డీజనుల నందరిని చంపినను చంపినవాడు కాడు. అతడు బద్ధుడును కాడు" (గీత. 17-18) అని చెప్పబడెను. మఱియు

శ్లో॥ కర్మణ్యకర్మ యః పశ్యే దకర్మణి చ కర్మ యః ।
స బుద్ధి మాన్మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్॥ (గీత,4-18)

తా॥ ఎవడు కర్మయందు కర్మాభావమును, కర్మాభావమునందు కర్మను, అనగా వ్యాపార మాత్రమయిన కర్మయందు అకర్మను, అకర్మయందు కర్మను తెలిసికొనుచున్నాడో ఆ పురుషుడు మనుష్యు లందరిలో బుద్ధిమంతుడును, యోగియు, నెల్లకర్మలు చేసినవాడును అగును.

పైన చెప్పిన అన్ని విషయముల యొక్క సారాంశమే పై శ్లోక తాత్పర్యమని బోధపడుచున్నది. దీనికి మఱియొక అర్థమును కూడ చెప్పుదురు:

కర్మయనగా - ప్రపంచ సృష్టియనియు, అకర్మయనగా బ్రహ్మమనియు, ప్రపంచ సృష్టియందు బ్రహ్మమునకు కర్తృత్వము లేక పోవుటవలన (అనగా: సూది అయస్కాంతముచే ఆకర్షింపబడినను, అయస్కాంతమునకు కర్తృత్వము లేని యట్లు) బ్రహ్మము అకర్త యగుటచే అకర్మయనియు చెప్పిరి.

ఇచ్చట గమనింపవలసిన విషయమిది : పైన నుదాహరించిన గీత. 4-18 శ్లోకమునందు చెప్పబడిన యలిప్తత అనగా కర్మయందకర్మను, అకర్మయందు కర్మను చూచుట సామాన్యుల దృష్టికి సాధ్యము కాదనియు, తత్త్వజ్ఞానికన్ననో యవిద్య నశించియుండుటచే అహంకార మమకారము

Dr K Dayanandaswamy ebooks



లతనికి లేనందున అతనికి మాత్రమే సాధ్యమగుననియు, కనుక జ్ఞానులకొఱకే నిష్కామ కర్మాచరణమను కర్మయోగము చెప్పబడినదనియు కొందఱి యభిప్రాయము. జ్ఞాని కాకపోయినను కర్మయోగము చెప్పబడినదనియు కొందఱి యభిప్రాయము. జ్ఞాని కాకపోయినను కర్మయోగము సిద్ధింపవచ్చునని శ్రీ వివేకానందస్వాములవారి యభిప్రాయము. గీత. 4-18వ శ్లోకమునందు చెప్పిన అలిప్తతను సామాన్యులు సాధింపవలయు నన్నచో మొదట స్వధర్మ నిర్వహణమును తద్వారా కర్మయోగమును అలవరచుకొనవలయును.

## (4) కర్తవ్యము-స్వధర్మము

'కర్తవ్యము' అను పదములోని అర్థము కంటెను 'ధర్మ' శబ్దమునకు గల అర్థము చాల పవిత్రమును, సువిశాలమును అయియున్నది. ఉదాహరణమునకు ఒక పురుషుడు వృద్ధాప్యమునందున్న తన తల్లి దండ్రులకు అన్నవస్త్రము లిచ్చి పోషించుట తన కర్తవ్యమని యెంచి వారికి ప్రతినెలకును కొంత ధనమును ఇచ్చుచుండును. కాని వాని తల్లిదండ్రులయందు వానికి భక్తిగాని, గౌరవముగాని లేకుండును. వారి యోగక్షేమములయందు ఆసక్తియు వాని కుండదు. వారికి అన్నవస్త్రములకు ఎంతధనము తాను ఇచ్చుకొనవలయునో అంతధనము ఇచ్చుటతో తాను చేయవలసిన దంతయు చేసితినని తన కర్తవ్యము (Duty) పాలింపబడెనని అతడు తలంచును. మఱియొకడు వృద్ధులగు తన తల్లిదండ్రులకు అన్న వస్త్రము లిచ్చుటయేగాక; వారియందు భక్తియు, గౌరవమును గలవాడై వారి యోగక్షేమములందు శ్రద్ధాళువై వారి నారాధించుచుండును. అట్లు వారి నారాధించుట తన గొప్పతనము కాదనియు, తనధర్మమును మాత్రమే నిర్వహించు చున్నాననియు తలంచును. మొదటివాడు చేయునది కర్తవ్య నిర్వహణము, రెండవవాడు చేయునది స్వధర్మ నిర్వహణము. కర్తవ్య నిర్వహణమునందు శరీరేంద్రియ వ్యాపారము మాత్రమే గలదు. హృదయప్రవృత్తి లేదు. అదిగాక వాని కర్మయందేదో ఒక విధమగు ఒత్తిడి యున్నది. అనగా-లోకు లేమనుకొందురో యనిగాని, మరి యేదియో యొక నిర్బంధముగాని యున్నది. చిత్తశుద్ధి లేదు. రెండవ వాని స్వధర్మ

Dr K Dayanandaswamy ebooks


నిర్వహణమందు హృదయ ప్రవృత్తియు, చిత్తశుద్ధియు గలవు. కర్తవ్యము స్వధర్మము నను నీరెంటికిని గల భేదమిది. స్వధర్మ నిర్వహణపరునకు ఎట్టి యుత్తమ శీలము లభించునో, అట్టి శీలమును కర్తవ్యపాలనము చేయువాడు పొందలేడు. స్వధర్మ నిర్వహణమునందు క్రమముగా స్వార్థము నశించును. అదియే కర్మయోగమునకు గొనిపోవును.

## (5) ధర్మాధర్మములు

ధర్మ మనగానేమి? ఈ ప్రశ్నకు తృప్తికరమగు సమాధానము చెప్పుట చాలకష్టము. ప్రపంచమున నాగరకత గల అన్ని దేశములయందును ధర్మాధర్మములను గుఱించిన చర్చ విశేషముగ జరిగి ఆ విషయమై అనేక గ్రంథములు వెలువడినవి. మహాభారతమువంటి ధర్మగ్రంథము ప్రపంచమున లేదని గొప్పపండితు లందఱు అంగీకరించి యున్నారు. ఏమైనను ధర్మాధర్మముల స్వరూప మిట్టిదని అందఱకును సమ్మతమైన యొక నిర్ణయమునకు రాలేకపోయిరి. యుధిష్ఠిరుడన్నట్లు "మహాజనో యేన గత స్స పంథా" మహాజనులు ఏ మార్గమున నడచిరో అదియే ధర్మమార్గము అని చెప్పబడెను. కాని అదియును తృప్తికరమైనది కాదు. ఏలయన దేవరాజగు ఇంద్రుడు అహల్యాజారు డాయెను. కనుక మహాత్ముల నడవడి నాదర్శముగా గైకొనక వారు చెప్పిన వాక్యములును, అంతరాత్మ ప్రబోధమును, పూర్వులనుండి పరంపరగ అనుష్ఠింపబడునట్టి యాచారమును, సమాజముయొక్క కల్యాణమునకు తోడ్పడునట్టిదియును నగు విధానమే ధర్మము. అందులకు విరుద్ధమైనది అధర్మము.

ఇదిగాక మాతృ ధర్మము, పితృధర్మము, పుత్రధర్మము మొదలగు ధర్మము లనేకములు గలవు. (1) ధైర్యము (2) ఓర్పు (3) దమము (4) దొంగిలింపకుండుట (5) శౌచము (6) ఇంద్రియ నిగ్రహము (7) ధీ (8) విద్యా (9) సత్యము (10) క్రోధరాహిత్యము -అనునవి ధర్మ లక్షణములని మనుస్మృతి చెప్పినది. (మను. 6-92) సమస్త మానవకోటికి వర్తించునట్టి

Dr K Dayanandaswamy ebooks



సర్వధర్మసార మగునది శ్రీ మదాంధ్ర మహాభారతమునం దిట్లు చెప్పబడినది.

**కం|| "ఒరు లేయవి యొనరించిన**
**నరవర! యప్రియము తన మనంబున కగు దా**
**నొరులకు నవి సేయకునికి**
**పరాయణము పరమధర్మ పథముల కెల్లన్."**

ఇతరు లేవి తనకు చేసిన తన మనస్సునకు ప్రియము కాదో అట్టి వానిని తా నితరులకు చేయకున్న చాలును. ఇదియే యుత్తమ ధర్మమార్గముల కెల్లను శ్రేష్ఠమైనది. ఈ ధర్మసూత్రమును సర్వదా మనస్సున ననుసంధించుకొని దాని యర్థమును ఆచరణయం దుంచిన చాలును.

ధర్మాచరణమువలన పుణ్యము, అధర్మాచరణము వలన పాపమును కలుగును. సామాన్యజనులు ధర్మాధర్మములను గుఱించి నిర్వచనము చేయలేక పోయినను స్థూలముగా వాటిస్వరూపము నెఱుగుదురు. పరధన, పరదారా పరిగ్రహా, పరపీడన, పరహింసా, అనృత భాషణాదులు అధర్మ (పాప) కృత్యములని అందఱు నెఱుగుదురు.*

పాపాత్ములును, కుచ్చితులును కర్మయోగులు కాజాలరు. ధర్మ, అర్థ, కామ, మోక్షము లనునవి చతుర్విధ పురుషార్థములు. ఈ నాలుగింటిని ఈ క్రమమున కూర్చియుండుట పూర్వుల గొప్పతనమును చాటుచున్నది. మొదట ధర్మమును, చివర మోక్షమును, మధ్య అర్థకామములను చేర్చిరి. ధర్మ వ్యతిరేకములగు అర్థకామములు త్యాజ్యములు. మోక్ష ప్రతిబంధకములగు తక్కిన ధర్మార్థ కామములు, ఫలరహితములు. మొదటి మూడును మోక్షధర్మమునకు తోడ్పడునవిగా నుండవలెనను తలంపుతో మోక్ష శబ్దమును కడపట చేర్చిరి.

---

* ఈ ధర్మములు సర్వమానవ కోటికి సంబంధించినవి. ఏసుప్రభువు ధనవంతుడైన ఒక యువకునితో చెప్పిన మాటలివి : "నరహత్య చేయకుందువు గాక; వ్యభిచారము చేయకుందువు గాక; దొంగిలింపకుందువుగాక; అబద్ధసాక్ష్యము పలుకకుందువు గాక; నీ తండ్రిని నీతల్లిని గౌరవించుదువు గాక యనెను." (బైబిలు, అర్స్యలూక్కాను విశేషములు. 18)

Dr K Dayanandaswamy ebooks


ధర్మశబ్దము మొదట ఏల చేర్చిరనగా: ధర్మమునందే సమాజము నిలిచియున్నది. ధర్మమెప్పుడు సంపూర్ణముగ నశించిపోవు కాలము వచ్చునో అప్పుడు భగవంతు డవతరించి ధర్మము నుద్ధరించును. ఏలయన, ధర్మము సంపూర్ణముగ నశించినచో సమాజము నిలువజాలదు. మానవుడు ధర్మమునకు కట్టుబడి యుండవలెను. కాని ధర్మము లన్నిటికంటెను నుత్తమ ధర్మమగు మోక్షధర్మమునకు తక్కిన ధర్మములు అడ్డువచ్చినచో వాటిని వదలి వేయవచ్చును. ఇచ్చట నింకొక విషయము జ్ఞప్తియందుంచు కొనవలెను. ఒక కాలమునందు సమాజమున నొకానొక విధానము ధర్మముగా నుండును. ఆకాలమున నది సమాజమునకు హితకారియై యుండును. ఆవిధానమే యింకొక కాలమున సమాజమునకు హాని కలిగించునదైనచో అప్పుడది ధర్మము కాజాలదు. అప్పుడు దానిని అధర్మమని యెంచి త్యజింప వలయును. ధర్మ మెప్పుడును సమాజమునకు హిత మొనర్చునదిగా నుండవలెను.

## (6) స్వధర్మాచరణమననేమి?

ప్రతివ్యక్తియు స్వధర్మము ననుష్ఠింపవలయును. స్వధర్మమనగా నేమి? గీతయందు ఏయే వర్ణములవారి కుచితమగు వ్యాపారము ఆయా వర్ణముల వారికి స్వధర్మ మగునని చెప్పబడెను.

**"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః"** (గీత. 4-13)

తా॥ నాల్గు వర్ణములు సత్వాది గుణములయొక్కయు, తపశ్శమాది కర్మలయొక్కయు విభజనము ప్రకారము తనచేత సృజింపబడెనని భాగవానుడు చెప్పెను.

**"బ్రహ్మణో శ్వేతవర్ణః, క్షత్రియో రక్తవర్ణః, వైశ్యః పీతవర్ణః, శూద్రః కృష్ణవర్ణః ఇతి నియమాభావాత్"** అని వ్రజసూచికోపనిషత్తు.

వర్ణమనగా రంగు. ఈ రంగులు తెలుపు, ఎఱుపు, పసుపు, నలుపు. ఈ నాల్గువర్ణములు కలవారు క్రమమున బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులని చెప్పబడెను. ఈ రంగులేవి? ఇవి దేహవర్ణమునుబట్టి నిర్ణయింప

Dr K Dayanandaswamy ebooks



వలయునా? లేక గుణమును బట్టి నిర్ణయింప వలయునా? శరీరము (చర్మము) పైనున్న రంగునుబట్టి నిర్ణయము చేయుటకు వీలులేదు. అట్లు చేసిన యెడల యూరోపియన్ జాతులవారు తెల్లని వర్ణమువారు గనుక బ్రాహ్మణులనియు, తామ్రవర్ణులైన అరబ్బులు క్షత్రియులనియు, పీతవర్ణులైన చైనావారు వైశ్యులనియు, నీగ్రోలు శూద్రులనియు, భారతీయులు సంకరులు (అన్ని వర్ణములు కలసినవారు) అనియును చెప్పవలసివచ్చును. కనుక ఈ వర్ణములు చర్మమునకు చెందినవి కావనియు, ఇవి గుణముల (అంతఃకరణమున)కు సంబంధించిన వనియు అర్థము చేసికొనవలయును. సత్యమగు తాత్పర్యము కూడ నదియే.

**"గుణకర్మవిభాగశః"** అనుటలో గుణమునుబట్టి కర్మనుబట్టి విభజింపబడెను అనుటవలన వర్ణము (రంగు) గుణముదేకాని శరీరముపైన కనబడునది కాదు. ఇదియే వజ్రసూచికోపనిషత్తు చెప్పినది. ఈశ్వరసృష్టి ననుసరించి యే మనుజు డేరంగునకు చెందినవాడో పరిశీలించి సమాజమును నాలుగు వర్ణములుగా మహర్షులు విభజించిరి. ఎట్లనగా :- తెల్లనివర్ణము సత్త్వగుణము. రాజసతామస గుణముల నణగద్రొక్కిన సత్త్వగుణము గలవారు (అనగా : సత్త్వ గుణము ప్రధానముగా గలవారు) బ్రాహ్మణులు. ఎఱ్ఱని రంగు రజోగుణము. సాత్త్విక తామస గుణముల నణగ ద్రొక్కినట్టి రజోగుణ ప్రధానులు క్షత్రియులు. పచ్చనిరంగు తమోగుణము. సాత్త్విక రాజసగుణముల నణగ ద్రొక్కినట్టి తమోగుణము గలవారు వైశ్యులు. నలుపు మిక్కిలి తమోగుణము. ఇది గలవారు శూద్రులు. శ్రీశంకరులవారు ఇంకొక విధముగ చెప్పిరి. సత్త్వగుణ ప్రధానులు బ్రాహ్మణులు. సత్త్వముతో కూడిన రజోగుణము ప్రధానముగా గలవారు క్షత్రియులు. తమస్సుతోకూడిన రజోగుణము ప్రధానముగా గలవారు వైశ్యులు. రజస్సుతో గూడిన తమోగుణము ప్రధానముగా గలవారు శూద్రులు. ఆయా గుణములు గలవారు ఆయా గుణములచేత ప్రేరేపింపబడిన కర్మలనే చేయుచుందురు.

లోకసంగ్రహార్థమై వర్ణాశ్రమ ధర్మముల నేర్పరచిన మహర్షులు సర్వజ్ఞులు. సమాజము యొక్క ధారణ పోషణములే గాక మానవునికి మోక్షప్రాప్తికి అడ్డురాని విధమున ధర్మముల నేర్పరచిరి. ఏయే వర్ణమునకు చెందినవా రెట్టి వ్యాపారమునందు ప్రవర్తింపవలయునో, వారి ధర్మము లెట్టివో ప్రాచీన గ్రంథములయందు చెప్పిరి. అందు కొన్నింటిని ఇచ్చట

Dr K Dayanandaswamy ebooks


చెప్పెదను. గీతయొక్క 18-వ అధ్యాయమందు 41,42,43,44, శ్లోకములయొక్క తాత్పర్యమిట్లున్నది.

అంతరింద్రియ బహిరింద్రియ నిగ్రహము, దయ, తపస్సు, శుచిత్వము, ఓర్పు, ఋజుత్వము, జ్ఞానము, విజ్ఞానము, దేవుడు కలడని నమ్మకము, ఇతరులకు జ్ఞానబోధ - ఇవి బ్రాహ్మణులకు స్వాభావిక కర్మలై యున్నవి.* (గీత. 18-42)

శౌర్యము, తేజస్సు, ధైర్యము, సామర్థ్యము, యుద్ధమునందు వెనుదిరుగకుండుట, దానము, దొరతనము - ఇవి క్షత్రియులకు స్వాభావికమైన కర్మలు. (గీత. 18-43).

వ్యవసాయము, గోరక్షణము, వ్యాపారము - ఇవి వైశ్యులకు స్వాభావిక కర్మలు. సేవ శూద్రులకు స్వాభావికమైన కర్మ. (గీత. 18-44)

మహాభారతమునందలి శాంతిపర్వమున భృగు భరద్వాజ సంవాదమునం దిట్లున్నది:-

**సీ|| ఆగమ సత్య ధర్మాచార తపముల**

---

* మహాభారతమునందలి సనత్సుజాతీయమునందు బ్రాహ్మణులు తప్పక యాచరించవలసిన విధులు ఈ క్రింది విధమున చెప్పబడినది.

**శ్లో|| జ్ఞానం చ సత్యం చ దమః శ్రుతం చ**
**హ్యమాత్సర్యం హ్రీ స్తితిక్షా౽నసూయా||**
**యజ్ఞశ్చ దానం చ ధృతిర్యమశ్చ**
**మహావ్రతా ద్వాదశ బ్రాహ్మణస్య||** (3-20)

తా|| జ్ఞానము (తత్త్వార్థమును తెలిసికొనుట), యథార్థ భాషణము, మనోనిగ్రహము, అధ్యాత్మ శాస్త్రశ్రవణము, సర్వభూతములయందు మత్సరము లేకుండుట, చేయరాని కార్యములు చేయుటకు సిగ్గుపడుట, సుఖదుఃఖాది ద్వంద్వములను సహించుట, పరుల దోషమును బయటపెట్టకుండుట, అగ్నిష్టోమాది యజ్ఞములు చేయుట, దానమిచ్చుట, విషయముల సాన్నిధ్యమున నింద్రియములను నిగ్రహించియుండుట, ఉపరతి - అనునవి పండ్రెండును బ్రాహ్మణ ధర్మములు. శ్లోకమున 'మహావ్రతా' అని యున్నందున విడువక ఆచరింపవలెనని భావము.

 Dr K Dayanandaswamy ebooks

కునికిపట్టులుగాగ వనజ భవుడు
గలిగించె మును బ్రాహ్మణుల మఱి కల్పించె
నృప వైశ్యశూద్రుల నిర్మలాత్మ
బ్రాహ్మణాదికముగ బరగు నన్నాలుగు
జాతుల యుజ్జ్వల చ్ఛాయలోలి
సొంపార ధెలుపును, గెంపును, బసుపు చా
యయు, గప్పునయ్యు నంబ్రార్య వర్యు

ఆ॥ లాత్మకర్మ మెడలి యనులోమవృత్తి నె
జ్జాతి పొచ్చు నన్య జాతిపనికి
దానికట్టి భంగి దలకొను బెక్కులు.
పనులజేసి జారతనము వచ్చు.

దీనివలన తొలుత గుణమునుబట్టి కులోచితమైన వృత్తి ఏర్పడెను. తర్వాత గుణము మారినను కులము మారలేదు. వృత్తి మారినపుడు రంగును మారునని పై పద్యమునందలి తాత్పర్యము. మఱియు శాంతిపర్వమునందలి వృత్తగీతయందు తెలుపు మొదలైన వర్ణములు జీవావస్థలు ఛాయలై యుండుననియు అవి ఆఱని చెప్పబడెను. శాంతిపర్వమునందే మఱియొక్కచోట భీష్ముడు ధర్మరాజునకు వర్ణాశ్రమ ధర్మములను చెప్పినట్లు కలదు. ఆనుశాసనిక పర్వమునందలి ఉమామహేశ్వర సంవాదమునందును ఈ వర్ణవ్యవస్థను గూర్చి చెప్పబడెను. (గ్రంథ విస్తరణ భీతిచే వాటిని ఇచ్చట నుదాహరింప లేదు.) పర్యవసాన మేమనగా: పుట్టుకచేత వర్ణమును నిర్దేశించుటకు వీలులేదనియు, గుణమే కులమును నిర్ణయించుచున్నదనియు, గుణము మారినప్పుడు కులము సహితము మారినదనియు పూర్వుల నిశ్చయము. ఈ విధానము ననుసరించియే వసిష్ఠ, వ్యాస, నారద, జాబాల, సత్యకామాదులు బ్రాహ్మణకులములో

---

* వర్ణవ్యవస్థను గుఱించి ఈ గ్రంథముయొక్క ప్రథమభాగము మొదటి ప్రకరణమున చర్చింపబడెను. పూర్వ మొక కులమునుండి మఱియొక కులమునకు మార్పు జరిగినకథ ఇచ్చట వివరించితిని. కనుక ఇచ్చట ఆ విషయము చర్చింపలేదు.

Dr K Dayanandaswamy ebooks

చేర్చుకొనబడిరి. మొదట చేసిన ఈ కట్టుబాటు సంఘశ్రేయమునకు తోడ్పడినది. ప్రస్తుతకాలమున ఈ పద్ధతి చెడిపోయినందున వర్ణవ్యవస్థ నామమాత్ర మయినదని పెద్ద లంగీకరించిరి.*

గీతయందు చెప్పినట్లు ఏ గుణము కలవాడు అట్టిగుణమునకు సహజమగు కర్మలు చేయుట సులభమగును. గుణమునకు విరుద్ధమయిన కర్మలు చేయుట అస్వాభావికము. ఉదాహరణమునకు - అధికమగు సత్త్వగుణము ప్రకాశవంతమును, శుద్ధమును, జ్ఞాన జనకమును నయినది. ప్రవృత్తికలది కాదు. అట్టివారికి తపస్సు, వేదాధ్యయనము, లోకులను జ్ఞానమార్గమునందుంచుట మొదలగునవి వారికి సులభమగు కార్యములు. అట్టివారు లౌకిక వ్యాపారమునందు ప్రవృత్తులు కారు, వారు లౌకిక వ్యాపారములు చాల ప్రయాసతో చేయవలసియుండును. రజోగుణాధిక్యము వలన ప్రవృత్తియు, లోకవ్యవహారములందు సామర్థ్యమును కలుగును. తమోగుణాధిక్యము కలవాడు జ్ఞానహీనుడు, స్తబ్ధుడు. లౌకిక పారమార్థిక విషయముల రెండింటికిని అసమర్థు డగుటవలన పైవారిచేత ఆజ్ఞాపింప బడుచుండును.

పూర్వులు ఎవడెట్టి గుణము కలవాడో వానిని తదనుగుణమైన వ్యాపారమునందు ప్రవేశపెట్టి అట్టివారి నందఱిని ఒక సంఘముగచేసి అదియొక కులమని నిర్ణయించిరి. వారి వారి కులోచిత వ్యాపారము వారిధర్మమని కట్టుదిట్టము చేసిరి. ఈ విధముగ ప్రతివ్యక్తికిని అత డేసంఘమునకు (కులమునకు) చెందిన వాడో అట్టి ధర్మమొక్కటి యేర్పడెను. అదియే వానికి స్వధర్మము. దాని ననుసరించుటయే స్వధర్మపాలనము. స్వధర్మమును గుఱించి శ్రీ వివేకానందస్వాములవారి వాక్యముల నుదాహరింతును.

"............కులములో నొక్కొక్క దానికి విధింపబడియున్న జాతి ధర్మము - స్వధర్మము. అనగా: ఆయా మానవుని శక్త్యనుసారమును, దశానుసారమును విధింపబడియున్న కర్తవ్య కర్మములను అనుసరించుట. ఇవియే వైదికమతమునకును వైదిక సంఘమునకు మూలాధారములు...... ఈ జాతి

Dr K Dayanandaswamy ebooks



ధర్మము ఈ స్వధర్మము. ప్రతిదేశమందలి ప్రతిసంఘము బాగుపడు మార్గము-చివరకు ముక్తికి అధిరోహింపజేయు నిచ్చెన. ఈ జాతిధర్మము, ఈ స్వధర్మము క్షీణించిపోవుట చేతనే మనదేశమునకు పతనము కలిగినది. కాని ఈకాలమున అగ్రకులమువారు సామాన్యముగా కైకొను అర్థమున జాతిధర్మము లేక (స్వధర్మము) మనము తప్పించు కోవలసిన క్రొత్త ఆపద యగుచున్నది. జాతిధర్మమును గూర్చిన కూలంకష జ్ఞానము తమకు కలదని వారి భావము. కాని నిజమునకు వారికి అది తెలియనేతెలియదు. తమ గ్రామమున అనుసరింపబడు ఆచారమే వేదప్రతిపాదిత సనాతనాచారమని తలచి, అధికారము లన్నియు తమవిగనే భావించు కొనువారు నాశమున కేగుచున్నారు. నామాటలు వంశపారంపర్య కులవ్యవస్థను గూర్చిగాని గుణభేదములచే నిర్ణయింపబడు కులవ్యవస్థను గూర్చికాదు. గుణనిర్ణీత కులవ్యవస్థయే ప్రథమమున నుండినదని నేను అంగీకరింతును. కాని రెండు మూడు పురుషాంతరములలో గుణములకు బదులు జన్మమునకు ప్రాధాన్య మీయబడెను. ఇందుచే మన జాతీయ జీవనము యొక్క అయువుపట్టునకు దెబ్బతాకినది. లేనిచో మనమిట్టి పతనస్థితి కేలకూలితిమి?"*

ప్రస్తుత కాలమున మనస్వధర్మ మననేమియో మనము పూర్వపు ధర్మశాస్త్రములనుండి తెలిసికొనలేము. ఏలయన అంబష్ఠుడే వైద్యము చేయవలయునని మనుస్మృతి చెప్పినది (మనువు. 10-47). ప్రస్తుతము ఒక్క కులమునుండియే మనకు కావలసిన గొప్పవైద్యులను పొందలేము. ఇట్టిచిక్కు లనేకము లున్నవి. కనుక ప్రస్తుత పరిస్థితులకు మన్వాది స్మృతులు సరిపడవు. లేదా వాటినే కాలానుగుణముగా మార్పుచేసికొన వలెను. అటుగాక కొందఱు చెప్పునట్లు పూర్తిగా ధర్మశాస్త్రములను అనుసరింతుమేని తినుటకు తిండిలేక స్వాతంత్ర్యము లేక పరజాతులకు బానిసలమై యుండవలసివచ్చును.

గీతయందు చెప్పినరీతిగా నెవరు ఏవర్ణమునకు (సత్త్వాది గుణములకు)

---

* ఈ భాగము మద్రాసు శ్రీ రామకృష్ణ మఠాధ్యక్షునిచే ప్రకటింపబడిన శ్రీ వివేకానందస్వామివారి "కులము, సంస్కృతి, సామ్యవాదము" అను గ్రంథమునుండి. అనువాదకులు శ్రీ కందుకూరు మల్లికార్జునం.

Dr K Dayanandaswamy ebooks


చెందినవారో ప్రపంచమునందంతటను అట్టివారు ఆయా వర్ణోచిత (గుణోచిత)మైన వ్యాపారమునే చేయుచున్నారు. సత్త్వ గుణాధిక్యము కలవారు రష్యాలో నున్నను, అమెరికాలో నున్నను, ఏ దేశములం దున్నను దైవారాధన, దయ, సత్యము మొదలగు ఉత్తమ గుణములు గలవారై బ్రాహ్మణోచిత కర్మములనే చేయుచున్నారు. అట్లే తమోగుణాధిక్యము కలవార లెచట నున్నను శూద్రోచితకర్మ (సేవ) చేయుచున్నారు. ఈవ్యవస్థ ఈశ్వరసృష్టి. ఈశ్వర నియామకము. మన మతము నందున్న కులతత్త్వములు సంఘముచేత కల్పింపబడినవి.

పైన చెప్పినవిధముగ నేర్పడిన వర్ణవ్యవస్థ తారుమారైనది. దానినిప్పుడు సవరించుటకు సాధ్యపడదు. ఈ సాంఘిక నియములను ఈ నాడేగాక ప్రాచీన కాలము నందును బలవంతులైనవా రుల్లంఘించి యున్నారు. ఉదాహరణమునకు-పరశురాముడు బ్రాహ్మణుడయ్యును క్షత్రియోచితమైన కర్మలకు పాల్పడెను. బ్రాహ్మణకుల సంజాతులగు ద్రోణ, కృప, అశ్వత్థామాదులు శస్త్రోపజీవులైరి. "క్షత్రియుడాపద నొందినప్పుడు వైశ్యవృత్తితో జీవింపవచ్చునుగాని బ్రాహ్మణ వృత్తితో జీవింపరాదు." (మను. 10-95) అని మనువు కట్టెవిరిచినట్లు చెప్పి యున్నాడు. కాని పాండవులు ఏకచక్రపురమున బ్రాహ్మణవృత్తితో కొంతకాలము జీవించిరి. పురాణములనుండి యిట్టి దృష్టాంతము లనేకములు చూపవచ్చును. దుర్బలులు సంఘనియమముల (వారివృత్తుల) నుల్లంఘించినపుడు శిక్షింపబడిరి. అది యట్లుండనిండు. ఇప్పుడు స్వధర్మానుష్ఠాన మనగానేమి? అను ప్రశ్న సహజముగనే బయలుదేరు చున్నది. ఇందుకు సమాధానమిది:

పూర్వజన్మ సంస్కారవశమున వర్తమాన జన్మమునందు వారి వారి కర్మానుసారమైన వ్యాపారమునందు (వృత్తి యందు) ఆసక్తి కలిగి అట్టి వృత్తులయందు ప్రవేశించి దానియందభివృద్ధి పొందుచున్నారు. ఎవరేవృత్తియం దున్నారో వారు దానినే చిత్తశుద్ధితో చేయవలయును. అదియే స్వధర్మ నిర్వహణము.

స్వకులోచితమైన కర్మ (వ్యాపారము)గాని, కులధర్మము గాక పోయినను

 Dr K Dayanandaswamy ebooks

తంత్రితాత లవలంబించినదిగాని, ఆ రెండు విధములైన వ్యాపారములు గాక బుద్ధిపూర్వకముగ తానవలంబించి నట్టిదిగాని, యెవరెట్టి వ్యాపారమును చేయుచున్నారో వారి కదియే స్వధర్మము. తనకు కష్టమని తోచినప్పుడుగాని, దానియందు దోషమున్న దనిగాని దానిని వదలరాదు. "సమస్త కర్మములయందును నేదోయొక దోషముండును" (గీత.18-49).

మఱియొకడు మఱియొక కార్యము చేయుటవలన లాభపడుచున్నాడని దానికొరకు పరుగిడరాదు. అది వానికి పరధర్మమగును. ఉదాహరణమునకు: ఒకడు సైనికుడుగా చేరి, కొంతకాల మా యుద్యోగమునందుండి, యుద్ధము వచ్చినపుడు అయ్యో! సోదర మానవుని నెట్లు చంపుదుననిగాని, యుద్ధమున మృతిబొందుదునేమో యనిగాని భయపడి దానిని వదలివేయరాదు. గీతయందు :

శ్లో॥ శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ (గీత. 3-35)

తా॥ స్వధర్మము గుణము లేనిదైనను, పరధర్మమునకంటె శ్రేష్ఠము. తనధర్మమునందు మరణమైనను శ్రేష్ఠము. పరధర్మము భయమును కలిగించునది. అనగా మంచిదికాదు. దీని భావమేమనగా: యుద్ధము మంచిదికాదని సైనికులందఱును యుద్ధమును మాని వారి యిండ్లకు పోయిరేని వారిస్థానమున నిలుచువా రెవ్వరు? వారు సమాజమునకు ద్రోహము చేసినవా రగుదురు. స్వధర్మమును చిత్తశుద్ధితో పాలించుటయే ధర్మము.

ఉదాహరణము : వ్యాపారి (వర్తకుడు) న్యాయమైన లాభములకు సొమ్మును విక్రయింపవలయును. తనవద్ద క్రయ విక్రయములు చేయుటకు వచ్చినవాడు బాలుడుగాని, ఎట్టివాడుగాని, రాజ్యపాలకుడుగాని అందఱిని సమదృష్టితో చూచి యొక విధమగు లాభమునకే క్రయ విక్రయములు చేయవలెను. మహాభారతమునందలి తులాధారుడను వైశ్యశిఖామణికథ యిందుకు దృష్టాంతము.

Dr K Dayanandaswamy ebooks

ప్రభుత్వోద్యోగియు, ధర్మమును తప్పక తన విధాయక కృత్యమును నెరవేర్పవలెను. ఒకగృహస్థుని యింటి సొమ్మును దొంగిలించిన చోరుని పట్టుకొని న్యాయాధిపతి యెదుట పెట్టవలసిన ధర్మము పోలీసు ఉద్యోగిదై యున్నది. ఆ యుద్యోగి దొంగవలన కొంత సొమ్మును లంచముగా తీసికొని దొంగను వదలివేయుట స్వధర్మహాని, అదేవిధముగనే న్యాయాధిపతియు లంచము తీసుకొని ఉద్యోగిగా తనధర్మమును తప్పినవాడగుచున్నాడు. అందులకు కారణమతడు ప్రతిఫలము నపేక్షించుటయే. ఫలాపేక్ష లేకయే స్వధర్మమును నిర్వహింప వలయును. ఇచ్చట "ఫలాపేక్ష"యను మాటకు జీతము తీసికొనకయే ఉద్యోగము చేయుమని యర్థముకాదు. జీతమును ఉద్యోగి ప్రత్యేకముగా కోరవలసిన పనిలేదు. దానంతటనదియే ప్రభుత్వమునుండి లభించును. కృషీవలుడు భూమిని దున్ని పైరుపెట్టిన యెడల అతడు ఫలమును కాంక్షింపక పోయినను ఫలము లభించుచునే యున్నది.

ఫలాపేక్ష రహితముగా స్వధర్మ నిర్వహణము చేయుట యనగా : జీతబత్తెములను తప్ప యుద్యోగి మఱెట్టి ఫలమును నపేక్షింపరాదు. అతడు చేయుచున్న యుద్యోగము ఈశ్వర ధర్మమనియు, ఈశ్వరాజ్ఞను పాలించుచున్నాడనియు భగవంతుడే తనకు జీతము నిచ్చుచున్నాడనియు భావించిన చాలును. అదియే అతనిని కర్మయోగమునకు కొనిపోవును. కొందఱుద్యోగులు అక్రమార్జనముతో లక్షలకొలది ద్రవ్య మార్జించుచున్నారు. వారు శ్రీమంతులగుట చూచి యితరులును 'మే మేల లంచము తీసికొనరాద"ని అధర్మపరులైనచో నప్పుడు సమాజ మెట్లుండునో యోచింపుడు. అపుడీదేశము, పురాణములయందు చెప్పబడిన నరకమునకంటెను భయంకరముగ నుండును. స్వార్థరహితులై

---

* మహాభారతమునందు, కౌశికునకు ఉపదేశమిచ్చిన పతివ్రత, ధర్మవ్యాధులయొక్కయు జాజలికి నుపదేశమిచ్చిన తులాధారునియొక్కయు కథలు స్వధర్మ నిర్వహణకు దృష్టాంతములుగ చెప్పబడినవి.

Dr K Dayanandaswamy ebooks

స్వధర్మాచరణము చేసిన మహనీయులకు ఉద్యోగ విరమణ కాలమున ఉపకార వేతనము తప్ప మఱేమియు మిగులక పోయినను అట్టివారు భగవంతునికి ప్రీతిపాత్రులైన ఆయనబిడ్డ లగుచున్నారు. అంతకంటెను వారికి కావలసిన మహాభాగ్య మేమున్నది*

## (7) కర్మయోగము సులభ మగుటెట్లు?

కర్మయోగము సులభముగా లభ్యము కావలయునన్న ముఖ్యముగా రెండంశములను దృఢముగా నమ్మినవాడై యుండవలయును. (1) దేవుడున్నాడు. అతడు సర్వజీవులను పోషించువాడు. అతని యనుగ్రహము పైననే సర్వజీవులయొక్క శుభాశుభఫలము లాధారపడియున్నవని నిశ్చయ ముండవలెను. లేదా, హిందూ బౌద్ధ సిద్ధాంతముల యందు చెప్పిన కర్మసిద్ధాంతము ననుసరించి జీవులు వారివారి కర్మానుసారముగ సుఖ దుఃఖముల ననుభవించుచుందురని నమ్మవలయును. ఇందులో నే యొక్కటి సంపూర్ణముగ నమ్మినను "నేను ద్రవ్యమార్జించి పెట్టకపోయినచో వృద్ధాప్యమందు నా గతి యేమికావలయును? నా యనంతరము నాఆలుబిడ్డ లెట్లు జీవింతురు?" అని భయముండదు. పై రెండు సిద్ధాంతములలో దేనినేనియును పూర్తిగా నమ్మనివారును, కొంతనమ్మి కొంత నమ్మనివారును పై భయమునకు లోనగుచున్నారు. అందువలన వారు స్వార్థమును త్యజింపలేకయున్నారు.

పై రెండు సిద్ధాంతములలో రెండింటినిగాని, ఏదేని ఒక దానినిగాని నమ్మినవానికి కర్మయోగము అత్యంత సులభము. తక్కినవారికి కష్టతరము. కనుకనే గీతయందు "నాభక్తుడవు కమ్ము (గీత. 9-34). నన్నే శరణుపొందుము. నీ యోగక్షేమములను నేను విచారింతును" (గీత18-66). అని భగవానుడు పలుమారులు బోధించుట కనబడుచున్నది. పైరెండు సిద్ధాంతములను నమ్మనివాడైనను, దేవుడు లేడను నాస్తికులైనను కర్మయోగులు కావచ్చునని వివేకానంద స్వాములవారు చెప్పిరి. కాని ఎట్టివారైనను కాలానుగుణమైన ధర్మమార్గమును తప్పినవారికిని, కపటచిత్తులకును కర్మయోగ మలవడదు.

Dr K Dayanandaswamy ebooks


ధర్మార్థకామములు మూడును ధర్మమునకు వ్యతిరేకము కాకూడదు. పరమ పురుషార్థమైన మోక్షమునకు ప్రతిబంధక మైనపుడు తప్ప ఇతరత్ర ధర్మమును వదలరాదు. ధర్మమెప్పుడును సమాజమునకు మేలును కూర్చునదిగా నుండవలెను. ఒకవేళ నాస్తికుడైనను ఆయా కాలానుగుణమైన ధర్మమునకు లోబడినవాడై, లోకకల్యాణమే తన ధర్మమని భావించిన వాడు కర్మయోగి యగును. శ్రీ వివేకానందస్వాములవారు కర్మయోగమను వారి ఉపన్యాసమున ఇట్లు చెప్పియున్నారు.

*"కర్మయోగి యగువా డేసిద్ధాంతమును విశ్వసించ నక్కరలేదు. భగవంతుని యస్తిత్వమును గూడ నాతడు నమ్మనక్కరలేదు. స్వార్థరాహిత్యమును సాధించుటయే అతని ముఖ్యాశయము. అతడు దానిని స్వయముగా సాధింపవలయును. అతని జీవితమందలి ప్రతి క్షణమును ఆదర్శానుభవమై యుండవలయును. ఏలయన జ్ఞాని దేనిని తన వివేకముచేతను, భక్తుడు తన ప్రేమచేతను సాధింపజూచునో, ఆ పరతత్త్వమునే ఎట్టివాదములను సిద్ధాంతములను అపేక్షింపక కర్మయోగి తన కర్మాచరణముచేతనే సాధింపవలసియున్నది."

'కర్మయోగము' నందే మఱియొకచోట ఇట్లు చెప్పిరి:

"........ భక్తుడు తన ప్రార్థనమువలనను, జ్ఞాని తన విజ్ఞానమువలనను ప్రాప్తించునట్టి పరమావధినే ప్రాపించుచున్నాడు. కావున స్వార్థరాహిత్య మనునది జ్ఞానికిని, కర్మికిని, భక్తునకు గూడ సమావేశ నిలయమగు గమ్యస్థానమై యున్నది."

## (8) కర్మయోగమువలన మోక్షమెట్లు సిద్ధించును?

నిష్కామకర్మమను విషయమును పరిశీలించినచో జ్ఞానమువలన మమకారములు విడువవలయునని చెప్పుదురు. ఇవి విడువనిదే జ్ఞానము సిద్ధింపదు. జ్ఞానము లేక మోక్షము సిద్ధింపదు. అహంకార మమకారములు

* అనువాదము శ్రీ చిరంతనానందస్వామి.

Dr K Dayanandaswamy ebooks


విడువనిదే ముక్తి సిద్ధింపదు. అహంకార మమకారములు విడువనిదే ముక్తి సిద్ధింపదని అన్ని సంప్రదాయములవారును నంగీకరింతురు. ఈ యహంకారమే కర్మను ప్రేరేపించుచున్నది. కర్మ చేయుటకుముందు ఫలాపేక్ష కలుగుచున్నది. ఫలాపేక్ష లేనిదే యే కర్మమును ప్రారంభింప బడుటలేదు. ఒక్కసారి ఫలాపేక్షతో కర్మ చేసినంతనే ఆ కర్మఫలమును తప్పక యనుభవించవలసియున్నది. నిష్కామకర్మాచరణ మనునది యహంకారమును వదలుకొన్నపుడే సాధ్యమగుచున్నది. 'నా కొఱకు', 'నా వారికొఱకు' అను భావము లేకపోవుటయే దీని యర్థము.

అహంకారముతో కూడిన కర్మాచరణమే ప్రవృత్తి, అదియే కర్మత్వము గల వ్యాపారము. అహంకార మమకారములను వదలుకొనుటయే నివృత్తి. ఇందు కర్మకు కర్మత్వము లేదు. ప్రవృత్తివలన సంసారము, నివృత్తివలన మోక్షము సిద్ధించును. తామరాకుపైన నీటిబిందువు నిలిచియుండినను అది తామరాకు నంటలేదు. ఇదియే యిందులోని సూక్ష్మము. ఇట్టి కర్మయోగి రాజదండమును చేబూని భూమినంతయు పరిపాలించు చుండినను, భయంకర రణరంగ మధ్యమున నిలిచి సేనలను శత్రువులపైకి పురికొల్పుచు యుద్ధము చేయుచుండినను; ఏ కర్మను చేయనివాడే యగును. కోర్కెలను జయించనివాడు సన్న్యసించి కొండ గుహలో కూర్చుండి యేకర్మను చేయకుండినను సమస్తకర్మలు చేసినవాడే యగుచున్నాడు.

జి : ఇచ్చట నొక సంశయము కలుగుచున్నది. సాధన చతుష్టయము సాధించిన అధికారి శ్రవణాదులు చేయుటవలన అవిద్య నశియించి తత్త్వజ్ఞానము కలుగునని జ్ఞానయోగమున చెప్పితిరి. అవిద్య నశింపనిదే దాని కార్యములగు అహంకార మమకారము లెట్లు నశించును?

వే : అహంకార మమకారములు వదలుకొనుటకు జ్ఞానయోగ మొక్కటియే మార్గము కాదు. జ్ఞానయోగులకు సహితము వైరాగ్యము ప్రధానము కదా? అట్లే కర్మయోగులయందు సహితము కోర్కెలు లేనివారికి

Dr K Dayanandaswamy ebooks



పరమేశ్వరానుగ్రహమున హృదయ గ్రంథి క్షీణించుచున్నది. దానితో అహంకార మమకారములు క్షీణించుచున్నవి. అందువలన జననమరణ రూపమైన సంసార ప్రవాహము ఇంకిపోవుచున్నది. ఇది సరికాదని మఱియొక పక్షమునందుండి చూచినను కర్మయోగమువలన చిత్తశుద్ధియును, చిత్తశుద్ధివలన తత్త్వజ్ఞానమును, తత్త్వజ్ఞానమువలన ముక్తియు కలుగుచున్నది గదా? తత్త్వజ్ఞానము కలిగినపిమ్మట లోక సంగ్రహార్థమై (లోకులను బుద్ధిమంతులనుగా జేయుటకొఱకు) ఫలాపేక్ష లేక కర్మలాచరించినను, విద్వత్సన్న్యాసము స్వీకరించినను, నీ రెండు నొకటియే యైనను కర్మయోగమే మంచిదని గీత చెప్పుచున్నది. ఈ యిరువురకును గమ్యస్థాన మొక్కటియేయని గీత యీ క్రింది విధమున చెప్పినది:

జ్ఞానముతో కూడిన కర్మసన్న్యాసమును (సాంఖ్యమును), కర్మ యోగమును, భిన్నమైన ఫలముల నిచ్చునని మూఢులు మాత్రమే చెప్పుదురు. పండితులు (జ్ఞానులు) అట్లు చెప్పరు. కర్మసన్న్యాస కర్మయోగములలో ఏయొక దానిని లెస్సగా అభ్యసించినను అట్టివానికి ఆ రెంటియొక్క ఫలము కలుగుచున్నది (గీత. 5-4).

సాంఖ్యులు (జ్ఞాన నిష్ఠులు) ఏస్థానమును పొందుదురో కర్మయోగు లును ఆస్థానమునే పొందుచున్నారు. జ్ఞానయోగ కర్మయోగములు రెండును సమానమైన ఫలము కలవని ఎవడు చూచుచున్నాడో అతడు లెస్సగా తెలిసినవాడు (జ్ఞాని) (గీత. 5-5).

ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేయుటయను కర్మయోగముయొక్క మఱియొక రూపమునకు గూడ ఫలమిదియే యగుచున్నది. ఎట్లన:- యజమాని సేవయందు నియుక్తుడైన మానవుడు తాను చేయు కర్మలయొక్క ఫలమును తానెట్లు పొందలేడో అట్లే "నేను పరమేశ్వరుని జంటను. ఆయనసేవ చేయుటకై నేనీలోకమున జన్మించితిని. నేను చేయు సమస్త కర్మఫలమును యజమానికే చెందు'నను అచంచలబుద్ధితో చేయుట. దీనిని భక్తియోగమం...

Dr K Dayanandaswamy ebooks



దాసభావమని యందురు.

జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగములను నీ నాలుగు సంప్రదాయములును నొకదానితో మరియొకటి అప్పుడప్పుడు కలియుచుండును. అయినను నీ నాలుగింటిలో నేది సాధకునిచేత ప్రాముఖ్యముగా గైకొని యాచరణలో పెట్టబడునో అతడట్టి సంప్రదాయమునకు చెందిన వాడని పిలువబడును.

**శ్లో॥ తస్మాదసక్త స్సతతం కార్యం కర్మ సమాచార ।**
**అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః॥** (గీత. 3-13)

తా॥ ఆ కారణమువలన అసక్తుడవై చేయదగిన కర్మలను చేయుము. ఏలయన ఫలాపేక్షారహితముగ కర్మలు చేయు పురుషుడు మోక్షమును పొందుచున్నాడు.

ఇట్టి కర్మయోగము ననుష్ఠించిన మహనీయులకు నమస్కరించుచున్నాను. వారి ఆశీర్వాదములు మాకు లభించుగాక!

- * -

**"వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్।**
**దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్॥"**

ఇది పరమేశ్వరానుగ్రమువలన మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యచే రచియింపబడిన 'బ్రహ్మజిజ్ఞాస' ద్వితీయ భాగమునందలి 'కర్మయోగ' మను మూడవ ప్రకరణము సంపూర్ణము.

**ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః**

*

Dr K Dayanandaswamy ebooks

ఓమ్
శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# బ్రహ్మజిజ్ఞాస

## (ద్వితీయ భాగము)

## నాలుగవ ప్రకరణము - భక్తియోగము

**శ్లో|| "వేదాంతనాథం స్వకృతైకదానం**
**హతాభిమానం త్రిదశ ప్రధానమ్ ।**
**గజేంద్రయానం విగతావసానం**
**శ్రీ రామచంద్రం సతతం నమామి"||**

### (1) భక్తి మార్గము

భక్తిమార్గము అనాదియైనది. ఇది యే కాలమునందుండి ప్రారంభింపబడెనో చెప్పలేము. కనుక అనాదియని చెప్పవలసివచ్చెను. వేదకాలమునం దొకవంక వేదపఠనమును, బహుదేవతా ప్రీత్యర్థమై జరుగుచుండు వేదచోదిత యజ్ఞయాగాది కర్మకాండమును సాగిపోవుచున్న కాలము నందే ఏకేశ్వరోపాసనా రూపమగు భక్తియును ప్రచారము నందుండినట్లు తెలియుచున్నది. ఒకొక్కప్పు డీరెండింటికిని సంఘర్షణ కలిగినట్లు సహితము కనబడుచున్నది. భాగవతము నందలి దక్షాధ్వరధ్వంస కథనమును పరిశీలించితి మేని యీ విషయము బోధపడగలదు. అందు బ్రాహ్మణ ధర్మప్రచారకుడగు దక్షప్రజాపతి యీశ్వరధిక్కారము చేసినపుడు భగవద్భక్తుడగు నందికేశ్వరు డిచ్చిన యుపన్యాసమును, భగవద్భక్తులును, బ్రాహ్మణులును నొకరినొకరు శపించుకొనుటయును గమనింపదగినది. వేదములయందలి కర్మకాండమును, ఉపనిషత్తులయందలి జ్ఞానమును అందరికిని అందుబాటులో లేనివి కనుక సర్వజన సులభమగు భక్తిమార్గము అధికముగ ప్రచారములోనికి తెచ్చిన మహనీయుడు నారద మహర్షి.

Dr K Dayanandaswamy ebooks

ఈ మహర్షి శూద్ర కులజుడుగా పుట్టి దేవఋషి యయ్యెను. దశోపనిషత్తుల తరువాత పుట్టిన శ్వేతాశ్వత రోపనిషత్తునందు భక్తిని గుఱించి స్వల్పముగ చెప్పబడినది. భగవద్గీతయందు భక్తితత్త్వము పరిపూర్ణత నొందెను. రామాయణ, మహాభారతములయందును భక్తితత్త్వ మనేక విధముల చెప్పబడెను. భక్తిమార్గ ముపనిషత్తులనుండి పురాణములలోనికి గైకొనబడెనో, లేక, ఉపనిషత్తులకున్న గౌరవమును జూచి తమ తమ భక్తిమార్గము లుపనిషత్సమ్మతములని తెలుపుటకు పురాణములనుండి యుపనిషత్తులలోనికి గైకొనబడెనో చెప్పుట కష్టము. అష్టోత్తర శతోపనిషత్తుల కూర్పునందు మొదట శైవోపనిషత్తులును, పిమ్మట వైష్ణవోపనిషత్తులును, ఆ తరువాత శక్త్యుపనిషత్తులును కనబడు చున్నందున ఆ క్రమమును అనుసరించియే శైవ, వైష్ణవ, శాక్త, రాధాకృష్ణ (గౌరాంగ) మతములు విశేష ప్రచారములోనికి వచ్చిన ట్లూహించు కొనవచ్చును.

భక్తితత్త్వమునందు వాసుదేవ భక్తియు సనాతన కాలమునుండి ప్రచారము నందున్నట్లు తెలియుచున్నది. మహాభారత శాంతిపర్వమునం దీవిషయము గలదు. అందు భాగవత ధర్మము లనబడు నారాయణీయ ధర్మములు ఎచ్చట నుండి యెట్లు ప్రచారమునకు వచ్చినదియు చెప్పబడెను. లోకానుగ్రహముకొఱకు శ్రీమన్నారాయణుడు, ధర్ముడను మహర్షికి నరుడు, నారాయణుడు నను పుత్రద్వయముగా బదరికాశ్రమమున తపంబు సేయుచుండగా నారద మహర్షి అచ్చటికేగి నారాయణ దేవుని భక్తితో సేవించి 'ఆరాధనీయమైన దేదియో ఆనతి'మ్మన ఆ దేవుడు నారద మహర్షికి జ్ఞానముతో చేరిన ఈ భక్తిమార్గము నుపదేశించెను. నారదమహర్షి నారాయణదేవుని మూలరూపమును చూపుమని ప్రార్థింపగా "నీవు పరమైకాంతి వగుదువేని నీ కట్టి యనుగ్రహము కలుగు"నని యానతిచ్చి యత్యాదరంబున వీడుకొలిపెను. నారదమహర్షి వియద్వీథి మేరు పర్వతమునకుం జని యందు నియతాత్ముడై యుండ నా మహర్షికి, మేరుపర్వతము కడనున్న క్షీరసాగరమును, దాని కుత్తరమున నున్న శ్వేతద్వీపంబును, అందు నిరాహారులు నింద్రియ వృత్తిరహితులు, నస్వేదులు, సుగంధిశ్వేతాంగులు నగు పురుషులు మనోవీథిలో తోచిన

Dr K Dayanandaswamy ebooks


శ్వేతద్వీపంబునకు పోయి యచ్చటనున్న వారలచే నాదరింపబడి దుష్కర తపోనిష్ఠతో విష్ణుదేవుని స్తుతిచేయుచుండ నారాయణుండు మహాద్భుతంబైన దివ్యరూపంబుతో ప్రత్యక్షమై నారదమహర్షికి భాగవత ధర్మముల నుపదేశించెనని చెప్పబడినది.

ఇట్లు నారదమహర్షి శ్వేతద్వీపంబున పరమపురుషుని యనుగ్రహము బడసి, మరల బదరికాశ్రమంబునకు పోయి నరనారాయణుల దర్శించి వారికి జరిగిన సంగతి నివేదించి, అచ్చట కొంతకాల మేకాంతికుడై యుండి హిమవన్నగంబున నున్న యాశ్రమంబునకు పోయినట్లు గలదు. *నారాయణునివలన చెప్పబడినందున నారాయణీయములనియు, ఏకాంతిక ధర్మములనియు, సాత్వతములనియు, **భాగవత ధర్మము లనియు, పాంచరాత్రములనియు నీ భాగవత ధర్మములకు పేర్లు గలిగినవి.

---

* భక్తితత్త్వము మొదట భారతీయు లెఱుగరనియు, విదేశముల నుండి (శ్వేత ద్వీపమునుండి) కొనిరాబడినదని చెప్పుటవలన క్రైస్తవుల బైబిల్ నుండి గైకొనబడెననియు, కొందఱు పాశ్చాత్యపండితులు తలచిరట. నారదమహర్షి బదరికాశ్రమమున తొలుత నారాయణదేవుని దర్శించి నప్పుడే యీ భక్తిమార్గ ముపదేశించెను. అయినను నారదమహర్షి

కం|| **లోకేశ! నీవు ధర్మ**
**శ్రీ కావలిగాగ నవతరించుట విద్వ**
**ల్లోకంబు సెప్పు నమ్మూ**
**లాకృతి యెట్లుండునో దయాత్మకమూర్తీ!** (ఆం.మ.భా.శాంతి 6-354)

అని ప్రార్థించుటవల్ల భగవంతుడు ఏకాంతివగుమని చెప్పుటయు మహర్షి శ్వేతద్వీపమునకు జనుటయు జరిగినది. కాని నారాయణదేవుడు నారద మహర్షికి బదరికాశ్రమమునందే యీతత్త్వ ముపదేశించెను. దానినే భగవంతునివలన శ్వేతద్వీపమున మహర్షి మరల వినెను. భారతవర్ష మనునది యిప్పటి మన భారతఖండము మాత్రమేకాదు. దాని సరిహద్దులెంత వఱకు వ్యాపించియుండెనో యిప్పుడు చెప్పలేము.

**కృష్ణభగవానునకు సాత్వతుడను పేరు గలదు. ఆయనచే బోధింపబడిన మతమగుటవలన భాగవత ధర్మములకు సాత్వతములని పేరు గలిగినది. విష్ణుసహస్రనామ స్తోత్రమునందు 512వ నామము "సాత్వతాం సతిః" అని యున్నది. అనగా సాత్వతులకు యోగ క్షేమములను చేయువాడు' సాత్వతుడు, నందాదులగు గోపకులో, లేక వసుదేవాదులో యైయుందురు.

Dr K Dayanandaswamy ebooks



నారదమహర్షి సామాన్యవ్యక్తి కాడు. భాగవతపురాణమునందు శ్రీమన్నారాయణుని యేకవింశతి అవతారములలో నారదావతార మొక్కటియని చెప్పబడినది. ఈమహర్షి వేదములను, వేదాంగములను ఉపనిషత్తులను, అందలి సగుణ నిర్గుణోపాసనలను, బ్రహ్మతత్త్వజ్ఞానము నెఱిగియు మహాయోగియై, తపస్వియై, వియద్గమనాది శక్తులు కలిగియుండెను. ఇట్టి మహర్షిని నారాయణదేవుడు "పరమైకాంతి వగుము, నీకట్టి పెంపు సంపాదించెదను" అని చెప్పుటవలన భగవంతుని సగుణ, సాకారమూర్తిని దర్శించుటకు వేదవిహిత కర్మానుష్ఠానము, ఉపాసనలు, బ్రహ్మజ్ఞానము మొదలగు అర్హతలు చాలవనియు, పరమైకాంతభక్తి కావలసియున్నదనియు, ఇట్టి యేకాంతభక్తి కర్మ-జ్ఞాన-ఉపాసనల కంటె భిన్నమైనదనియు తెలియుచున్నది.

నారదమహర్షి యీ భాగవత ధర్మములను బ్రహ్మసభయందున్న సిద్ధసాధ్యాదులకు వినిపించెను. క్రమముగ వాఙ్మయరూపమగు నీ యమృతము లోకమున వ్యాపించెను. దీనిని శంతను డెఱిగి భీష్మనకును, భీష్ముడు యుధిష్ఠిరునకును చెప్పినట్లు గలదు. మఱియు, నారదమహర్షి యీభక్తిసుధను యోగ్యత గలవారికెల్ల జాతిలింగభేదము లేక లోకమున ప్రసరింపజేసెను. ప్రహ్లాదునకు ఈ ధర్మమునే యుపదేశించినట్లు గలదు. ప్రహ్లాదుడు దైత్యబాలుర కీబ్రహ్మతత్త్వజ్ఞానయుత మగు వాసుదేవభక్తిని జెప్పగా వారాశ్చర్యపడి నీ కెవ్వరిట్టి బోధ నొసంగిరని ప్రశ్నించిరి. వారికి ప్రహ్లాదుడు "తొల్లి నేను దివ్యదృష్టిగల నారదమహామునివలన సవిశేషంబైన యీజ్ఞానంబును, పరమ భాగవత ధర్మంబును వింటి" ననియును

**"నరుడుం దానును మైత్రితో మెలగుచున్ నారాయణుం డింతయున్**
**వరుసన్నారద సంయమీశ్వరునకున్ వ్యాఖ్యానముం జేసె మున్"**

(ఆంధ్రభాగవతము)

అనియును వచించెను.

Dr K Dayanandaswamy ebooks



జ్ఞానపూర్వకమగు నీభక్తిమార్గము మహాభారత శాంతిపర్వమునందే గాక భగవద్గీతయందును సవిస్తరముగ చెప్పబడినది. పరమేశ్వరార్పణ బుద్ధితో చేయబడిన కర్మయోగమును, వాసుదేవభక్తియు అను నీ మోక్షధర్మమును మొదట భగవంతుడు సూర్యునకును, సూర్యుడు వైవస్వత మనువునకును, మనువు ఇక్ష్వాకునకు నుపదేశింప ఇట్లు పరంపరగా వచ్చిన యీ విద్యను రాజర్షులు తెలిసికొనిరి. కొంతకాలమున కీవిద్య నశించెను (గీత. 4-1,2). శ్రీకృష్ణావతారమున మరల భగవంతుడు గీతల రూపమున దానిని పునరుద్ధరించెను. **'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'** - అన్ని ధర్మములు వదలి నన్నొక్కనినే శరణుపొందుము అను వాక్యముతో గీత నుపసంహరించి యున్నందున గీతయొక్క ముఖ్యోద్దేశము ప్రవృత్తిపరమును, జ్ఞానయుతమును నగు వాసుదేవభక్తియే యని తెలియుచున్నది.

వాసుదేవభక్తి పైన చెప్పిన విధమున శాంతిపర్వమునను, గీత యందును; విష్ణు, భాగవత, పురాణములయందును, నారద పాంచ రాత్రములు, నారదభక్తిసూత్రములు, శాండిల్యభక్తి సూత్రములు మొదలగు గ్రంథములయందును గలదు. ఇట్లు మొదట మహాభారతమునందు గల ప్రవృత్తి పరమైనదియు, జ్ఞానపూర్వకమునగు నీ భాగవత ధర్మము పురాణములోనికి గైకొనబడినది. దక్షిణదేశమున నీ భాగవత ధర్మములు ఆళ్వారులవలన ప్రచారమునకు తేబడెను. కడపటి యాళ్వారుల నుండి నాథమునులును, వారినుండి పరంపరగా శ్రీ రామానుజాచార్యులవారును కొన్ని మార్పులతో ప్రచారములోనికి తెచ్చిరి. ఈ ధర్మము వైష్ణవమను పేర ప్రసిద్ధిచెందెను. శ్రీరామానుజులవారు విశిష్టాద్వైతముతో చేర్చి శ్రీ వైష్ణవమను పేరను, ఇతరులు వైష్ణవమను పేరను వ్యాప్తి నొందించిరి.

పురాణములు శివ, కేశవ, దేవీసంబంధమగు భక్తిని కొలదిమార్పులతో ప్రచారము చేసినవి. అందులో ఏ పురాణము ఏ దేవుని గుఱించి చెప్పునో, ఆ దేవునకు తక్కిన దేవతలందఱు భక్తులైనట్లు చెప్పబడినది.

Dr K Dayanandaswamy ebooks



పురాణములు* 18. ఇవన్నియును వేదవ్యాసుడను కృష్ణద్వైపాయన మునీంద్ర విరచితములని ప్రతీతి. కాని, యివి భిన్న భిన్న వ్యక్తులచే రచియింపబడి యుండవలెను. ఏలయన పరస్పర విరోధము గల పురాణగాథలను, పరస్పర భిన్నములగు మతవిషయములను ఒకదానితో మఱియొక దానికి విరోధము రాకుండ సమన్వయ పఱచుట సాధ్యము కానిపని. దశోపనిషత్తుల యందలి ఆధ్యాత్మిక విషయములు సామాన్యులకు దురవగాహములు గనుక వాటిలో కొన్నింటిని కథారూపమున రచించుటచేతను, ఐతిహాసిక పురుషులగు భీష్మాదులచేత యుధిష్ఠిరాదులకు చెప్పించు నెపముననను, ఆ యాధ్యాత్మిక తత్త్వమును, భక్తితత్త్వమును పురాణములు లోకమునకు చాటి మేలుచేసినవి. ఐతే, కొన్ని పురాణములందు అర్థవాదము విశేషముగా నున్నది. కొన్నింటియందు ధర్మశాస్త్రములయందు చెప్పిన కులతత్త్వములు మితిమీఱి చెప్పబడినవి. వాటిని త్రోసివేసి భక్తితత్త్వమును మాత్రము మనము గైకొను టుచితము.

## (2) భక్తి యనగా నెట్టిది?

భక్తి యనగా నెట్టిది? శ్రీ శంకరులవారు భక్తియొక్క నిర్వచన మీ విధముగ చేసియున్నారు.

శ్లో॥ **అంకోలం నిజబీజసంతతి రయస్కాంతోపలం సూచికా**
**సాధ్వీ నైజవిభుం లతా క్షితిరుహం సింధుస్సరి ద్వల్లభమ్ ।**
**ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదారవిందద్వయం**
**చేతోవృత్తిరుపేత్య తిష్ఠతి సదా సా భక్తి రిత్యుచ్యతే ॥**

(శివానందలహరి. 16 శ్లో.)

---

* ఈ క్రింద కనబఱచినవి పదునెనిమిది పురాణములు :

(1) బ్రహ్మ (2) పాద్మ (3) విష్ణు (4) శివ (5) భాగవత (6) భవిష్య (7) నారద (8) మార్కండేయ (9) అగ్ని (10) బ్రహ్మవైవర్త (11) లింగ (12) వామన (13) స్కాంద (14) మత్స్య (15) కూర్మ (16)వరాహ (17) గరుడ (18) బ్రహ్మాండ పురాణములు.

**ఉపపురాణములు** : (1) నారసింహ (2) నందీశ్వర (3) సాంబపురాణములు.

Dr K Dayanandaswamy ebooks



తా॥ ఊడుగ చెట్టునుండి విత్తనములు క్రింద రాలి తిరిగి (ఉరుమురిమినపుడు) ఆ చెట్టునకే పోయి యంటుకొనుటయు, అయస్కాంతపు రాతియొద్దకు సూది పోవుటయు, పతివ్రత తనపతి ననుసరించుటయు, తీగ (ప్రాకుటకు నేల యెంతయున్నను) సమీపము నందలి చెట్టునకే ప్రాకుటయును, నది సముద్రమునే చేరుటయును నెట్లు సహజమో, యట్లే చిత్తము పరమేశ్వరుని పాదారవిందముల కడకు సహజముగనే యేలపోవుచుండునో దానినే భక్తియని చెప్పుచున్నారు.

నారదభక్తి సూత్రములయందు "**సా తస్మిన్ పర (మ) ప్రేమరూపా**" (నా. భ.సూ.2) తా॥ ఆ భక్తి పరమేశ్వరుని యెడల పరమప్రేమరూపముగా నున్నది. అనగా: ఈశ్వరుని యెడల గల యుత్తమమగు ప్రేమ యేదియో అదియే భక్తి యనబడును. ప్రేమ అనగా నేమి? యను ప్రశ్నకు సమాధానము అనుభవైక వేద్యమేకాని యిట్టిదని నిర్వచించుటకు వీలుకానిది. **సూ॥ అనిర్వచనీయం ప్రేమస్వరూపమ్.** (నా.భ.సూ. 51) అని చెప్పబడినది.

మం॥ **........భక్తి రస్యభజనం తదిహాముత్రోపాధి నైరా
శ్యేనాముష్మిన్ మనః కల్పనమ్.**

(గోపాలపూర్వతాపిన్యుపనిషత్తు)

ఇహపరసంబంధమైన యెట్టి ఫలమును కోరక భగవంతుని సేవ చేయుటయే భక్తి. ఇందుకొక దృష్టాంతమును చెప్పెదను. ఒక వ్యక్తి ధనమును కోరి భగవంతుని భజించిన యెడల ఆ వ్యక్తి భగవంతునికంటెను, ధనమునే యెక్కువగ ప్రేమించియున్నాడనుట నిర్వివాదమేకదా? ధనమునందు గల ప్రేమచేతనే గదా భగవంతుని భజించినది? భగవంతుని యెడల గల పరమప్రేమయే గదా భక్తియని చెప్పిరి.

నారద పాంచరాత్రమునందు భగవంతుడు నావాడనెడి మమకారమే భక్తియని భీష్మ, ప్రహ్లాద, ఉద్ధవ, నారదులు నుడివినట్లు కలదు. మఱియు అవిచ్ఛిన్న తైలధారవలె భక్తుని చిత్తము భగవంతునివంకకు నిరంతరము పోవుటయే భక్తియనికూడ చెప్పబడినది. "**స్వస్వరూపానుసంధానం భక్తిః**" అని శ్రీ శంకరులవారు వేఱొకచో చెప్పిరి. (వి.చూ. 32)

Dr K Dayanandaswamy ebooks



సూ॥ సా పరానురక్తి రీశ్వరే (శాం.భ.సూ. 2) భగవంతునియెడ గల పరమప్రీతి (గాఢానురాగము) భక్తియని శాండిల్య భక్తి సూత్రములయందు చెప్పబడినది.

దార, పుత్ర, మిత్ర, బంధు, గృహ, క్షేత్ర, ధన, కనక, వస్తు, వాహనాదులందలి యనురాగము (ప్రీతి) భక్తి కానేరదు. భక్తి ప్రధానముగా నెవరియెడల నుండవలయునో వారియెడల పూజ్యభావ ముండవలయును. భగవంతుని యెడల నున్నంతటి పూజ్యభావము ప్రపంచమునం దెవ్వరియందుగాని, ఎట్టివస్తువు నందుగాని యుండరాదు. భగవంతుని యెడల గల యట్టి పూజ్యభావమే భక్తి యనిపించుకొనును. పరమేశ్వరుని గుఱించిన జ్ఞాన మున్నంతమాత్రమున అది భక్తి యనిపించుకొన జాలదని శాండిల్యమహర్షి (శాం.భ.సూ. 4) చెప్పిరి. భక్తిని గుఱించి యనేకులు అనేక విధములుగా నిర్వచించియున్నారు. "భగవానుని గూర్చి నిక్కము, నిష్కళంకమునగు నన్వేషణమే భక్తి" యని శ్రీ వివేకానంద స్వాములవారు నుడివిరి.

భక్తిని గుఱించి శ్రీ రామానుజాచార్యులవారు శ్రీభాష్యము 1-1-1 సూత్రమునకు వ్రాసిన భాష్యము లఘుసిద్ధాంతమున ఇట్లు చెప్పిరి. "ధ్రువమైన స్మృతియే (ఉపాసనమే) భక్తియనియును పిలువబడుచున్నది. ఉపాసన, భక్తి శబ్దములు పర్యాయ శబ్దములు కదా? శ్రుతిస్మృతులు గూడ నిటులనే చెప్పుచున్నవి" (శ్రీమదాంధ్ర శ్రీ భాష్యము)

ధ్రువస్మృతి యనగా: వేఱొక చింతలేక తదేక చింతతో నుండుట. ఎడతెగని స్మరణము. ఉపాసన యనగా: ధ్యానము ఎవరెట్లు చెప్పినను భక్తి యిట్టిదని పూర్ణముగ నిర్వచనము చేయుట కష్టము. అది వాఙ్మానసముల కతీతమైనదని చెప్పవచ్చును. భక్తిని గుఱించి చెప్పబడిన నిర్వచనములు భిన్నభిన్నములుగ కనబడినను అనుభవమునుబట్టి వాటి తాత్పర్య మొక్కటియేయని చెప్పవచ్చును. ఒకచోట స్వల్పభేద మున్నను నది గణింపదగినది కాదు. అన్యచింతనములేక భగవంతునియందు నిరంతరము చింతనము కలిగియుండుట యనుదానిలో తక్కినవన్నియును జేరుచున్నవి.

Dr K Dayanandaswamy ebooks



ఎట్లన : ఈశ్వరునియెడల పరమప్రేమయు, పరానురక్తియు లేనియెడల నిరంతర స్మరణము జరుగదు. మన నిత్యానుభవమున చూచుచున్న విషయమొక్కటి గమనింతము. ఒక జవుళివ్యాపారిని (బట్టల వర్తకుని) దృష్టాంతముగ గైకొందము. అత డుదయమున నిద్రలేచి, కాల్యకృత్యములు తీర్చుకొని కొట్టును (అంగడిని) తెఱచి రాత్రి యగువఱకు ఆ వ్యాపారమునందే నిమగ్నుడై యుండును. భోజనకాలమునందైనను అతనికి వ్యాపారచింతనమే. రాత్ర కొట్టును మూసివేసి యిల్లు చేరినను అతని కాచింతనమే యుండును. అదే తుదకు సంస్కారరూపమై సూక్ష్మముగ మనస్సున చేరియుండి కొంతకాలమైన పిమ్మట వ్యాపారసంబంధమైన స్వప్నములే కలుగును. ఇతందయు ధనమునం దాతనికి గల ప్రేమవలననేగదా కలిగినది. అస్థిరమగు అర్థమును ప్రేమించి, దానికొఱకింత తపస్సు చేయవలసి యుండగా పరమేశ్వరుని యనుగ్రహము సంపాదింపవలయునన్న ఆయన నెంతగా ప్రేమింపవలయును? భగవానుని కొఱకు రేయింబవళ్లు ఎంత తపింపవలయును? ప్రపంచము నందలి పరమేశ్వరు నొక్కనినే ప్రేమించినప్పుడుగదా మన కాయన లభించును?

భగవంతుని యెడల నెడతెగని స్మరణము కలిగియుండవలెను. అట్లుండిన 'భగవంతుడు నావాడు', 'నేను భగవంతునివాడను' అను నిశ్చయము కలిగియుండును. కనుక యెడ తెగని స్మరణము, పరమప్రేమ, పరానురక్తి, భగవానుడు నావాడను నిశ్చయము, భగవంతు డెక్కడున్నాడు? ఆయన నెట్లు దర్శింతునను అన్వేషణము- ఇవియన్నియు నొక్క విధమైన అనుభవమును గురించిన నిర్వచనములే. భగవంతుని యెడల ఎడతెగని స్మరణమును గుఱించి శ్రీమదాంధ్రభాగ వతమునందలి ప్రహ్లాదోపాఖ్యానమున నిట్లు చెప్పబడినది :

శా॥ పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాస లీ
లా నిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారిసుతు డేతద్విశ్వమున్ భూవరా!

(భాగ. 7-123)

Dr K Dayanandaswamy ebooks


ఈ విధముగ ప్రహ్లాదుడు ఏ కార్యము చేయుచుండినను భగవత్పాద పద్మ చింతనామృతము గ్రోలుచుండెనని తాత్పర్యము. గోపికల చరిత్రయు నిట్టిదే.

తే॥ కలవరించియు గృష్ణాఖ్య, తెలివినున్న
యపుడు గృష్ణాఖ్య, యేమరినట్టివేళ
యందు గృష్ణాఖ్య దక్క నయ్యంగనలకు
రాదు వేఱొకవాక్యంబు రసనతుదకు. (హరి.పూ. 8-20)

ఇట్లుండినవారికి అప్రయత్నముగనే మనస్సు భగవంతుని వైపునకు పోవుచుండును. దానినే 'శివానందలహరి' యందలి 'అంకోలం నిజబీజసంతతి' అను శ్లోకమున తెలియజేసియున్నారు. కనుక భక్తిని గుఱించి పెద్దలు చేసిన వివిధములగు నిర్వచనములయందున్న తాత్పర్యమొక్కటే.

జి : భక్తికిని, ఉపాసనకును భేదము లేదా?

వేదా : శ్రీరామానుజాచార్యులవారి మతమున రెండును నొక్కటియే. ద్వైతాద్వైత మతస్థాపకులగు శ్రీ నింబార్కాచార్యులవారు భక్తిని గుఱించి "అవిచ్ఛిన్న ధారారూపమగు దైవ విశేషణ స్వభావ క్రమానుభూతియే భక్తి" యనియును, "భక్తియనగా: నుపాసనకాదు, ప్రేమయే" అనియును చెప్పియున్నట్లు శ్రీయుతులు డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు వ్రాసి యున్నారు. (భా.త. 5 భా. 10-15) ఉపనిషత్తులయందు చెప్పబడిన పంచాగ్నివిద్య మొదలగు విద్యలే (ఉపాసనలే) భక్తియని యంగీకరించి నచో, అది నారదభక్తి సూత్రములయందును, శాండిల్య భక్తిసూత్రముల యందును చెప్పబడిన భక్తియొక్క నిర్వచనమునకు సరిపడదు. అదియునుగాక పురాణములయందును, ఇతిహాసముల యందును చెప్పబడిన భగవద్భక్తుల చరిత్రలతోను సరిపడదు.

Dr K Dayanandaswamy ebooks


## (3) భక్తికి అధికారులు

భక్తియోగమునకు సమస్త ప్రాణులకును అధికారము గలదు. ద్విజులకు మాత్రమే భక్తియందధికారము గలదని శ్రీరామానుజాచార్యుల వారిమతము.

జి : శూద్రాదులు భక్తికి సహిత మనధికారులని చెప్పుటలో వారియుద్దేశ మేమి? శ్రీ రామానుజాచార్యులవారు అజ్ఞానుల నుద్ధరించుటకై యవతరించిరనియు, కరుణామూర్తులనియు విందుము గదా? వేదాధికారము లేని వారికి జ్ఞాన కర్మలయం దధికారము లేదని బ్రహ్మ సూత్రములకు వారు రచియించిన శ్రీ భాష్యమున వ్రాసిరి. ఆ విషయ మిదివఱలో చెప్పితిరి. భక్తికి సహితము శూద్రాదు లనధికారులనుట ఆశ్చర్యమును గలిగించుచున్నది.

వే : నీవన్నట్లు శ్రీ భాష్యకారులు (శ్రీ రామానుజుల వారు) మహనీయులే. శ్రీ శంకర, శ్రీరామానుజ, శ్రీమధ్వాచార్యులు లోకోద్ధరణకై జన్మించిన వారే. బ్రహ్మజ్ఞానమునకు శూద్రాదు లధికారులని నేనిదివఱకే యజుర్వేదము మొదలు పురాణాదుల వఱకును అనేక శాస్త్రములనుండి ప్రమాణములను చూపియుంటిని.* భక్తికి మానవులకేగాక, సమస్త ప్రాణులకును నధికారము కలదు. శ్రీ భాష్యకారులు శూద్రాదులు భక్తి కధికారులు కారనుటకు కారణ మీ క్రింది విధమున నుండును:--

వేదములయందు చెప్పబడిన యజ్ఞకర్మలను ఈశ్వరార్పణ బుద్ధితో చేసినవారికి వారి పూర్వజన్మ కృతమైన పాపము నశించును. అట్లు పాపము నశించిన వారికి చిత్తశుద్ధి కలుగును. చిత్తశుద్ధి కలిగినవారికి జీవేశ్వర స్వరూపజ్ఞానము కలుగును. అట్టి జ్ఞానమువలన జీవుడు ఈశ్వరునకు శేషభూతుడనియు, ఈశ్వరుడు శేషియనియు నిశ్చయము కలుగును. అట్టి జ్ఞానసంపన్నునకు భగవంతునియందు భక్తి కలుగును. కనుక భక్తికి సాధనము జ్ఞానము. జ్ఞానమునకు సాధనము పరమేశ్వరార్పణ బుద్ధితో చేయబడిన యజ్ఞాది కర్మలు. యజ్ఞాది కర్మలకు శూద్రాదు లర్హులు కారు కనుక వారికి కర్మానుష్ఠానము లేదు. అందువలన చిత్తశుద్ధి కలుగదు.

---

* ఈ గ్రంథముయొక్క ప్రథమ భాగమునందలి మొదటి ప్రకరణమును చిత్తగింపుడు.

Dr K Dayanandaswamy ebooks



చిత్తశుద్ధి లేకపోవుటవలన జ్ఞానమున కర్హులు కారు. ఆ కారణమువలన జ్ఞానకర్మలపైన ఆధారపడిన భక్తిని శూద్రాదులు సాధింపలేరు. కనుక శూద్రాదులకు జ్ఞానకర్మలయందు అధికారము లేని యట్లే భక్తియందును అధికారము లేదు. భక్తిమార్గము చాలకష్ట మగుట వలన శూద్రాదు లర్హులు కారని కూడ వారిభావమై యుండును.

ఇట్టి యభిప్రాయము ననుసరించి చూచిన శూద్రాదులేగాక బ్రాహ్మణాది త్రైవర్ణికులయందును వేదములు చదువనివారును, యజ్ఞమును చేయనివారును భక్తియోగమున కర్హులు కారని చెప్పవలసివచ్చును. ఒకవేళ యజ్ఞయాగాది కర్మలు చేసిన ద్విజులైనను వారు జ్ఞానము కలిగి యుండవలెను. జ్ఞానమనగా: అద్వైత (వేదాంత) జ్ఞానముగాని, ద్వైత వేదాంత జ్ఞానముగాని, మఱెట్టి వేదాంత జ్ఞానముగాని కలిగియుండినను ప్రయోజన ముండదని, ఆత్మ భగవంతునికి శేషభూతు డను నిశ్చయజ్ఞానమే కలిగియుండవలయునని, అట్లుండిననే భక్తికలుగుట కవకాశ మున్నదని తెలియుచున్నది. కనుక అట్టివారే భక్తిమతమున కర్హులు, తక్కినవార నర్హులని శ్రీరామానుజులవారి భావము.

శ్రీ భాష్యకారులు బ్రహ్మసూత్రములకు రచియించిన శ్రీ భాష్యము నందు (బ్ర.సూ. 1-1-1) ఇట్లు వ్రాసిరి :

**శ్లో॥ పురుష స్స పరః పార్థ! భక్త్యా లభ్యస్త్వనన్యయా॥** (గీత. 8-22)

ఓయి అర్జునుడా! అట్టి పురుషోత్తముడు భక్తితో పొందదగినవాడు.

ఇట్లు ధ్రువానుస్మృతి యనంబడు భక్తికి హేతువులు యజ్ఞాది కర్మలని "**యజ్ఞాది శ్రుతేరశ్వత్,** (బ్ర.సూ. 3అ. 4పా. 26 సూ.) అను సూత్రముచే బ్రహ్మ సూత్రకారులు సహిత మంగీకరించియున్నారు." (ఆంధ్ర శ్రీ భాష్యము.)

అనగా : యజ్ఞాదికర్మలు బ్రహ్మజ్ఞానమునందు ఇచ్ఛను కలుగజేయు చున్నవని యీ సూత్రతాత్పర్యము. శ్రీ భాష్యకారుల మతము ననుసరించి పరమాత్మోపాసనకు కర్మ అంగభూత మైనదనియు, మనుజుడు యావజ్జీవము వర్ణాశ్రమోచితకర్మ నాచరించుచు అజ్ఞాన కర్మలు చేయవలయునని యేర్పడినది.

Dr K Dayanandaswamy ebooks



చిత్తశుద్ధికొఱకు యజ్ఞాదికర్మలే చేయవలెననియు, లేనియెడల పూర్వజన్మకృత పాపరాశి నశింపదనియు చెప్పుట శాస్త్రసమ్మతము కాదు. వేదమంత్రములతో చేయు యజ్ఞాది కర్మలతో నిమిత్తము లేకయే మానవుడు చిత్తశుద్ధిని పొందుట కనేకసాధనములు శాస్త్రములయందు చెప్పబడినవి. **"సర్వాపేక్షా చ యజ్ఞాదిశ్రుతే రశ్వవత్"** అను పై సూత్రము బ్రహ్మసూత్రములయందలి సర్వాపేక్షాధికరణములోనిది. జ్ఞానము కలుగుటకు శమాదు లంతరంగ సాధనములని తదనంతర సూత్రమునందు (అనగా : బ్ర.సూ. 3-4-27) చెప్పబడినది. శమాదులనగా : శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము. చిత్తశుద్ధి, శమాదులవలనేగాక జపమువలనగూడ పాతకము నశించి చిత్తశుద్ధి కలుగునని శాస్త్రముల యందు చెప్పిన విషయము ప్రసిద్ధమే. అదిగాక యజ్ఞములలో జపయజ్ఞమును బ్రహ్మయజ్ఞమును చేరియే యున్నవి. "మోక్షాపేక్ష గలవారు వేదములయందు చెప్పబడిన యజ్ఞాది కర్మలను చేయరాదని శ్రుతి నిషేధించియున్నది." (ముండక 1-2-7) ఈ విషయ మిదివఱకే చెప్పి యుంటిని,* కనుక చిత్తశుద్ధికి వేదములయందు చెప్పిన యజ్ఞాది కర్మలు మాత్రమే సాధనములు కావు. భక్తి కలుగుటకు భక్తులయొక్క సాహచర్యము, జపము ముఖ్యసాధనములు. అంతకు మించిన సాధనములు లేవు. మహాభారతమున యుధిష్ఠిరుడు భీష్మునిట్లు ప్రశ్నించినట్లున్నది:

శ్లో॥ **కో ధర్మః సర్వధర్మాణాం భవతః పరమో మతః ।**
**కిం జపన్ముచ్యతే జన్తుర్జన్మ సంసారబంధనాత్ ॥**

(విష్ణు సహస్రనామ స్తోత్రము - 3)

తా॥ అన్ని ధర్మములలోను ఏ ధర్మము నీకు శ్రేష్ఠమైనదిగ నిశ్చయమై యున్నది? పుట్టుకగల ప్రాణిలోకము దేనిని జపించుటవలన జన్మ సంసారబంధమునుండి విముక్తి నొందుచున్నది? అని ప్రశ్నించెను. ఇచ్చట పైశ్లోకమున "జన్తుః అని యున్నది. శ్రీశంకరాచార్యులవారు వారి భాష్యమున **"జన్తుః జననధర్మా, అనేన జన్తుశబ్దేన జపార్చన స్తవనాదిషు యథాయోగ్యం**

---

* (1) ఈ గ్రంథమునందలి జ్ఞానయోగ ప్రకరణము, (2) యజ్ఞదానతపములు అను విషయము నిట ననుసంబంధింపవలయును.

Dr K Dayanandaswamy ebooks



సర్వ ప్రాణినా మధికారం సూచయతి" అని వ్రాసిరి. అనగా జన్తుశబ్దము చేత జపము, అర్చనము, స్తోత్రము మొదలగు వానియందు పుట్టుకగల సమస్తప్రాణులకును యోగ్యతానుసారముగ నధికారము కలదనుటను తెలుపుచున్నది అని తాత్పర్యము.

కనుక భక్తికి మానవులేగాక సమస్తప్రాణులును అధికారులేయని మహాభారత తాత్పర్యమై యున్నది. పై వాక్యములవలనను శూద్రులు పురాణములు పఠింపవచ్చునని బ్రహ్మసూత్ర భాష్యమున (అపశూద్రాధి కరణమున) వ్రాసి యున్నందునను, భక్తికి శూద్రాదు లధికారులని శ్రీశంకరుల వారంగీకరించిరి.

ఆళ్వారులలో ద్విజులేగాక ఒక హరిజనుడును, పెక్కండ్రు శూద్రులు, ఒక స్త్రీయును నున్నారు. వారు యజ్ఞకర్మలను చేసినవారు కారు. వారు భక్తులెట్లయిరి? వారు భక్తులగుటకు వారి పూర్వజన్మ సుకృతమో, భగవంతుని యనుగ్రహమో కారణమై యుండవచ్చు ననిన ఆ రెండును లేక బ్రాహ్మణుడైనను భక్తుడు కాగలడా? భక్తుడు సర్వ వర్ణాతీతుడని విశిష్టాద్వైతు లంగీకరించిరి.

జి : భక్తి పరమ ప్రేమరూప మనిగదా చెప్పితిరి. ప్రేమకు యజ్ఞముల సంబంధ మేమున్నది?

వే : నీవన్నది వాస్తవమే. భగవంతునియెడల ప్రేమ జనించుటకు కారణము లనేకములు కావచ్చును. అట్టిప్రేమను పోషించు సాధనములు సహిత మనేకములు. అద్వైతమతమును ఖండించి విశిష్టాద్వైతమతము ప్రస్థానత్రయమునకు సమ్మతమైన మతమని నిరూపించవలసిన బాధ్యతను శ్రీభాష్యకారులు (శ్రీరామానుజాచార్యులు) వహించిరి. శ్రీభాష్యమున అద్వైతమతము వేదబాహ్యమనియు; సాధనచతుష్టయము కలవారు శ్రవణాదుల కర్హులని అద్వైతులు చెప్పిరి.

కనుక సాధనచతుష్టయ మలవరచుకొనుటకు వేదకర్మతోగాని, యుపాసనతో గాని సంబంధము లేదనియు; ఆ కారణమున శూద్రాదులు అద్వైతవిచారము చేయవచ్చుననియు చెప్పియున్నందునను అద్వైత

Dr K Dayanandaswamy ebooks



మతమునకు విరుద్ధమైన విశిష్టాద్వైతమతము ననుసరించి భక్తి, కర్మ, జ్ఞానములపై నాధారపడియున్నదని చెప్పియున్నందునను, శూద్రాదులు భక్తికి అధికారులు కారని శ్రీభాష్యకారులు చెప్పవలసివచ్చినది. మఱియు వీరి భక్తి-ధ్యానము ప్రధానముగా గలది యగుటవలన ప్రేమరూపమగు భక్తికంటె కొంత వేఱైనదని చెప్పవలసివచ్చును. వీరి భక్తిని గుఱించి శ్రీయుతులు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణపండితులు చెప్పిన వాక్యముల నిచట నుదాహరింతును :

"రామానుజుని భక్తి తత్పూర్వుల భక్తికంటెను, ననంతర కాలికుల భక్తికంటెను నధికముగా దాత్త్వికము, నియమబద్ధము నైనది" (భా.త. 5 భాగము 9-5) మఱియు,

"రామానుజు ననుసరించి భక్తియనగా బ్రశాంతధ్యానమూలమున నీశ్వర సాన్నిధ్యమును గాంచుటే." (భా.త. 5. భా. 9-15) రాజయోగము నందు ధ్యానమునకు* ఆలంబనము (ధ్యేయము) ఏదియైన కావచ్చును. శ్రీ రామానుజులవారి మతమునందు శ్రీమన్నారాయణుడే ధ్యేయము. రెండింటికిని గల భేదమిది.

శ్రీ భాష్యకారులు ఆళ్వారులయొక్క భక్తిమతమునకు జైమిన్యాచార్యులవారి పూర్వమీమాంసామతమును జతపఱచి విశిష్టాద్వైతమును రూపొందించిరి.

పూర్వమీమాంసామతము వేదములయందు చెప్పబడిన యజ్ఞాదికర్మ మతమును స్థాపించినది. శ్రీభాష్యకారుల కాలముననే యజ్ఞాదులయందు ప్రజలకు ప్రీతి తగ్గిపోయి యజ్ఞముల స్థానమున దేవాలయములు, విగ్రహారాధనమును ప్రబలినవి. అగ్నిహోత్రమునకు మారుగా దేవాలయముల యందు అఖండ జ్యోతి (దీపారాధనము) ప్రబలినది. జైమిని మీమాంసా మతమును పునరుద్ధరించుటయు, దేవాలయములయందు దేవతాపూజను పెంపొందించుటయు నను పరస్పర విరుద్ధములగు నీ రెండు

---

* ధ్యానమును గుఱించి 152, 153 పుటలలో చెప్పియుంటిని. దాని నిచ్చట అనుసంధించుకొనవలయును.

Dr K Dayanandaswamy ebooks



విధానములును శ్రీభాష్యకారులకు ఇష్టమైనవే. ఆ కారణమున సహితము భక్తుడు కాగోరు ద్విజుడు యజ్ఞకర్మను చేయవలయునని నియమించి యుందురు. ఇది ఎట్లున్నదనగా: పూర్వము భారతయుద్ధానంతరము యుధిష్ఠిరుడు రాజ్యపాలనము చేయుచున్న కాలమున, ధర్మరాజు తన దర్శనముగోరు రాజులు మొదట ధృతరాష్ట్రుని దర్శనము చేసికొనిననే తన దర్శనము లభించునని (యుధిష్ఠిరుడు) నియమ మేర్పరచెనట, అట్టి యేర్పాటు లేకుండిన ధృతరాష్ట్రుని నెవ్వరును గౌరవించరని అందలి ఆంతర్యము. అదేవిధముగ శ్రీభాష్యకారులును యజ్ఞాది కర్మల నాచరించినవారే జ్ఞాన, భక్తియోగముల కధికారు లనుటలో గల ఆంతర్యమును మన మూహింపవచ్చును.

పూర్వమీమాంసామతమును గుఱించి శ్రీయుతులు సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు ఇట్లు చెప్పిరి. "మీమాంస ప్రత్యక్షముగా బహు దేవతారాధనాపరమును, పరోక్షముగా నాస్తికమునై యున్నది." (భా. త. 4-6-1) మఱియు నిట్లనిరి. "పూర్వమీమాంసలో నీలోప మసంతృప్తి హేతువగుటచే ననంతర రచయితలు రహస్యముగా దేవునందు జేర్చిరి." (భా. త. 4-6-17) శ్రీభాష్యకారులు పూర్వ మీమాంసకు భక్తిమార్గముతో లంకె కలుపుటచే దానిని దోషరహితముగ జేసితిమని తలంచియుందురు.

ఇతర భక్తి ప్రస్థానములయందు భక్తిమతమునకు జాతి, లింగ, భేదములను పాటింపక అందఱును భక్తి కధికారులే యని చెప్పబడెను. భాగవత పురాణమువంటి భక్తిప్రస్థానము పూర్వమీమాంసకుల యజ్ఞకర్మలను త్రోసివేసి కేవల భక్తిని మాత్రమే ప్రచారము చేసినది. భాగవతమునందలి చతుర్థ స్కంధమున ప్రాచీనబర్హి యను రాజునకు నారదమహర్షి పురంజనోపాఖ్యానము మొదలగు తత్త్వోపదేశములు చేసిన పిమ్మట ఇట్లు చెప్పిరి :

మ॥ ఘనవిస్తార మపార మద్వయ మనంగా నొప్పు వేదంబు దా
మనువర్తించు మంత్రయుక్తి వివిధంబైనట్టి దేవాఖ్య శో

Dr K Dayanandaswamy ebooks



భన సామర్థ్యముచేత నింద్రముఖరూపం బిష్టదైవంబుగా
గని వేడ్కల్ భజియించువారలు గనంగా నేర్తురే యీశ్వరున్!
(అం.భాగ.చ. 334)

గొప్పగా విస్తరించినదియు, పారము లేనిదియు, సాటిలేనిదియు అని చెప్పబడు వేదము ననువర్తించుచు వేదమంత్రములచేత ఇంద్రాది దేవతలను ఇష్టదైవములుగా కోరికతో భజియించువారు ఈశ్వరుని గుర్తెరుగలేరని తాత్పర్యము.

భాగవత దశమస్కంధమునందలి ఒక ఘట్టము నిచ్చట సంగ్రహముగా వివరించుటావశ్యకము. శ్రీ కృష్ణభగవానుడు గోపకులతో గోవులు మేపుచున్న కాలమున గోపకులు ఒకనాడాకలిగొని అన్నము నర్థింప భగవానుడు 'భక్తురాండ్రగు విప్రభార్యలవలన ప్రసన్నుడై గోపకులతో 'ఇచ్చటికి సమీపమున కాళిందీతీరమున బ్రహ్మవాదులైన బ్రాహ్మణులు యజ్ఞము చేయుచున్నారు. వారి నడుగుడు, అన్నమును పెట్టెదరు' అని పంపెను. గోపకులు బ్రాహ్మణుల నన్నమర్థింప వారు "దుర్మతులై లేదులేదు పొమ్మ'నిరి. అంత గోపకులు నిరాశులై వచ్చి ఆ సంగతి హరి కెఱిగింప హరి లౌకికానుసారి యగుచు "మీ రయ్యార్యుల నడుగక వారి భార్యలకు మా రాక జెప్పుం డన్నంబు బెట్టెదరని పంచిన వారలు సని బ్రాహ్మణసతులకు హరి సందేశ మెఱిగింప 'సంభ్రమానందంబులు డెందంబుల సందడింప భక్ష్య భోజ్య లేహ్య చోష్య పానీయ భేదంబులు గలిగిన అన్నంబు గైకొని బిడ్డలు, మగలు భ్రాతలు అడ్డము వచ్చి వలదన్నను వినక చని గోవిందుని గని హరి లలితరూపమును లోగొని మనమున బరిరంభణంబులు గావించుకొని హృదయజనిత తాపమును పోగొట్టుకొని భగవానుని గోపకులను వారు తెచ్చిన అన్నము అరగింపజేసి కృతార్థలైరి. బ్రాహ్మణు లాసంగతి యెఱింగి తమలో నిట్లనుకొనిరి :

చం॥ "కటకట మోసపోయితిమి కాంతలపాటియు బుద్ధిలేదు"

అని దుఃఖించి తమ్ము తాము నిందించుకొనిరి. అది కాక వారిట్లనుకొనిరి:

Dr K Dayanandaswamy ebooks



కం॥ జపహోమాధ్యయనంబులు
దపములు వ్రతములును లేని తరుణులు హరి స
త్కృప బడసి, రన్ని గలిగియు
జపలత బొందితిమి భక్తి సలుపమి నకటా!

(భాగ. 10. పూ. 872-873)

అని విచారమును బొందిరి. జపము, హోమము, వేదపఠనము, తపము, వ్రతము- ఇవి కలిగియుండిన బ్రాహ్మణులకు భగవంతుని కృప లభింపకపోవుటవలన నివి యేవియు భగవదనుగ్రహమును సంపాదింపజాలవని, భక్తియొక్కటియే భగవత్కృపను సాధింపగలదని విదితమైనది. బ్రాహ్మణులకు భక్తి కలుగక పోవుటకును వారి పత్నులకు భక్తికలుగుటకు కారణమేమియో యోచింపుడు. పూతన, శకటాసుర, తృణావర్త, వత్సక, బక, గార్దభ ధేనుకాదులగు రాక్షసుల సంహరించుటయు, కాళియనాగుని మదమడంచుటయు, యమళార్జునభంజనము మొదలగు శ్రీకృష్ణలీలలు అప్పటికే జరిగియున్నవి. కనుక బ్రాహ్మణులు వినియుందురు. అయినను శ్రీకృష్ణుడు భగవంతుడని యెఱుగుటకు అభిజాత్యము, విద్యాగర్వము వారి కడ్డుపడినవి. వారి భార్యల కారెండును లేవు. కనుక వారు సులభముగనే శ్రీకృష్ణుడు భగవంతుడని యెఱిగిరి.

దీనిని బట్టియును, భాగవత పురాణమునందలి ఈ క్రింది వాక్యములవల్లను శూద్రాదులు భక్తికధికారులని స్పష్టమగుచున్నది :

కం॥ దానవ దైత్య భుజంగమ
మానవ గంధర్వ సుర సమాజములో ల
క్ష్మీనాథు చరణకమల
ధ్యానంబున నెవ్వడయిన ధన్యతనొందున్.

ఆ॥ దనుజ భుజగ యక్ష దైత్య మృగాభీర
సుందరీ విహంగ శూద్ర శబరు
లైన బాపజీవులైన ముక్తిని బోదు
రఖిల జగము విష్ణు డనుచు దలచి. (అం.భా.సప్త. 2

Dr K Dayanandaswamy ebooks



ఈ సందర్భమున శ్రీ కాళహస్తీశ్వర శతకమునందలి యీ క్రింది పద్యము ఇచట స్మరింపబడుచున్నది.

**శా॥ ఏ వేదంబు పఠించె లూత, భుజగం బేశాస్త్రము ల్చూచె, దా**
**నేవిద్యాభ్యసనం బొనర్చె గరి, చెంచేమంత్ర మూహించె, బో**
**ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా? కావు. మీపాద సం**
**సేవనాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!** (ధూర్జటికవి)

తా॥ శ్రీ కాళహస్తీశ్వరుని సేవించిన సాలెపురుగు ఏ వేదమును పఠించినది? సర్ప మే శాస్త్రములు చూచినది? హస్తి యేవిద్యల నభ్యసించినది? తిన్న డేమంత్రమును జపించెను? నీ పాదపద్మముల యందలి సేవానురక్తితప్ప చదువులతో బోధ కలుగునా? కలుగదు.

మనలో భాగవతమునందలి గజేంద్రమోక్షణ కథను వినని వారుండరు. "దంతి యూథపు చందంబున భక్తి సేయవలయున్" అని భాగవతమే చెప్పినదికదా?

మహాకాళమందు శివు నర్చించిన శ్రీకరుడను గోపబాలుడును, వేణుగానముచే శివుని మెప్పించిన ఆనాయనార్ అను గోపబాలుడును, ఘంటాకర్ణుడను పిశాచమును (కృష్ణభక్తుడు) వేదము చదివి యజ్ఞములు చేసిరా? వీరికి భక్తి అలవడుటకు హేతువేమి?

సుప్రసిద్ధ వైష్ణవాచార్యులగు చైతన్యుడు (గౌరాంగ దేవుడు) మునల్మానులను తన మతములో స్వేచ్ఛగా కలుపుకొనెను. ఆ ముస్లిమ్ భక్తుడే తరువాత హరిదాసను పేర ప్రసిద్ధి నొందెను. వైష్ణవగురువగు శ్రీ రామానందస్వామి వర్ణభేదమును నిషేధించెను. నారద భక్తిసూత్రములు, శాండిల్య భక్తిసూత్రములు భక్తికి మానవులందఱు అధికారులే యని వచించినవి.

## (4) భక్తిమహిమ

జి : కర్మ, జ్ఞాన, పాతంజల యోగములకు శాస్త్రవిధి యున్నట్లు భక్తిని విధించునట్టి శాస్త్ర మేదైన కలదా?

Dr K Dayanandaswamy ebooks



వే : నాకు తెలిసినంత వఱకు అట్టి శాస్త్ర మేదియును లేదు. కాని భక్తుల అనుభవములనుబట్టి భక్తి పలువిధములని తెలిసికొని వాటి భేదములు వివరించుచు కొందఱు మహాత్ములు కొన్ని గ్రంథములను రచియించిరి. పరమేశ్వరుని యెడల గల పరమప్రేమయే భక్తియని నారదమహర్షియు, పరమేశ్వరుని యెడల గల పరమానురక్తియే భక్తియని శాండిల్య మహర్షియు చెప్పిన వాక్యములు వింటివికదా? అట్టిప్రేమ, అట్టి పరమానురక్తి ఈ విధముగా కలుగునని చెప్పు శాస్త్రమేదియును లేదు. అది పరులు చెప్పినగాని, యథేచ్ఛగగాని, యేమిచ్చినగాని, అరణ్యమున కేగి తపము చేసినగాని కలుగదనియే గదా పెద్దలవాక్యము. **"సూ॥ న క్రియా. కృత్యనపేక్షణాత్, జ్ఞానవత్"** 'ఈ భక్తిజ్ఞానమువలె అనుష్ఠానకర్తయొక్క అధీనమున లేదు' అని శాండిల్య భక్తిసూత్రము. అయితే భక్తులకు భక్తి యెట్లు కలిగినదనగా దానంతట అదియే కలిగినదని చెప్పవలయును. లేదా పూర్వజన్మ సంస్కారము వలననో, యీశ్వరానుగ్రహముననో కలిగినదని చెప్పవలయును.

**"ప్రాక్పుణ్యాచల మార్గదర్శిత సుధామూర్తిః ప్రసన్న శ్శివః"** (శివానందలహరి) పూర్వజన్మమున పురుషు డార్జించిన పుణ్యారాశియనునుదయాచలము మీదుగా తనయమృత శరీరమును భక్తలోకమునకు కనబఱచునట్టి చంద్రుని వంటి స్వచ్ఛమగు ఆనందరూపుడా! అని శంకరుల వారన్నారు. మొదట భక్తిబీజ ముండెనేని దానిని భక్తులయొక్క సాంగత్యమువలనను, భగవత్కథా శ్రవణములవలనను పోషించుకొనవచ్చును. భగవంతుడు భక్తునినుండి కోరునది భక్తి మాత్రమే. శౌచము, కర్మానుష్ఠానము (యజ్ఞములు) జపమాలలు త్రిప్పుట, ఊర్ధ్వపుండ్ర త్రిపుండ్ర ధారణములు, నైవేద్యము, బ్రాహ్మణత్వము - ఇవి యేవియును భగవంతుని మెప్పింపజాలవు. ఆయనను ప్రేమించినపుడే ఆయనకృపకు పాత్రుడగును. అట్టివాడే భక్తుడు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవించిన తిన్నని చరిత్ర భక్తియొక్క శాస్త్రమునే మార్చి వేసినది. అతని శివపూజా విధానమెట్టిదో చూడుడు : నదీజలమును నోటిలో నుంచుకొని, రెండు చేతులలో రెండు దొప్పల నిండ అడవి మృగముల మాంసమును పట్టుకొని, శివలింగమును సమీపించును. అతనికి

Dr K Dayanandaswamy ebooks


పూర్వము శైవబ్రాహ్మణుడు శివుని పూజించి శివలింగముపై సమర్పించియుండిన పుష్పమును పత్రిని చెప్పుకాలితో త్రోసివేయును. నోటనున్న నీటిని శివలింగముపై ఉమియును. అది యభిషేక మనుకొనువాడు. అతడు తెచ్చిన కరకుట్లను (కాల్చబడిన మాంసపుముక్కలు) శివుడు భుజియించు నంతవఱకును వదలు వాడు కాడు. శివుడామాంసమును భుజించిన తరువాత తిన్నడు యథేచ్ఛగ చనుచుండును. ఇట్లుండ శివపూజచేయు శైవబ్రాహ్మణుడు శివలింగముపైనున్న రోతను చూచి దుఃఖపడగా శివుడతని నోదార్చి తిన్నని విధమును చెప్పి వెనుక దాగియుండి తిన్నని భక్తిని ప్రత్యక్షముగ చూడు మనెను. ఆ సందర్భమున శివుడానతిచ్చిన వాక్యములివి:

**కం॥ తవతవ పడనేటికి మది**
**శివగోచర! నీకు? నన్ను జెంచొకడు శ్రుతి**
**వ్యవహారేతర మతమున**
**దవిలి మహాభక్తి గొలువ దయ పుట్టుటయున్.**

(శ్రీకాళహస్తి మాహాత్మ్యము, తృ-103)

అనంతరము తిన్నడచ్చటికి వచ్చి శివుని దర్శింప మహాదేవుని కంటినుండి నీరు గారుటయు, తిన్నడు తనకంటిని తీసి దేవునకు సమర్పించుటయు, దేవుని రెండవ కంటినుండి నీరుగారిన తిన్నడు తన రెండవ కనుగ్రుడ్డును తీసి సమర్పించుటయును అందఱెఱింగిన కథయే. ఇది పురాణ ప్రసిద్ధమైన గాథ. కేవల కల్పితగాథ కాదు. శంకరాచార్యులవారు శివానందలహరియందు ఈ విషయమిట్లు వ్రాసిరి:-

**శ్లో॥ మార్గావర్తితపాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే**
**గండూషాంబునిషేచనం పురరిపో ర్దివ్యాభిషేకాయతే ।**
**కించిద్భక్షిత మాంసశేషకబళం నవ్యోపహారాయతే**
**భక్తిః కిం న కరోత్యహో వనచరో భక్తావతంసాయతే ॥**

తా॥ హే! పశుపతే! పలుమారు దారి నడచిన చెప్పు నిను శుభ్రపఱచు

Dr K Dayanandaswamy ebooks

కుంచె యయ్యెను. పుక్కిలించిన నీ రుమియుటయే గంగాజలముతో నిన్ను అభిషేకించి నట్లాయెను. కొంచెము తినగా మిగిలిన మాంసపు తునక నీకు నైవేద్య మాయెను. ఆ కిరాతకుడే భక్తావతంసుడయ్యెను. అహో! యేమి చిత్రము! భక్తి ఏమిచేయదు?

ఇట్టిదే హరివంశమునను, ఉత్తర హరివంశమునను ఒక కథ గలదు. కృష్ణభగవానుడు బదరికాశ్రమమున శివుని గుఱించి తపమాచరించు చుండగా శ్రీ కృష్ణభక్తుండగు ఘంటాకర్ణుండను నొక పిశాచము, అతని సోదరుడగు కాలాంతకుని, పిశాచగణములను వెంటనిడుకొని కోలాహలము చేయుచు భగవానుని కడకు వచ్చెను. భగవాను డాఘంటాకర్ణుని సద్దుచేయక దూరముగా తొలగిపొమ్మనెను. ఘంటాకర్ణు డచ్చటనుండి కొంత తొలగిపోయి ధ్యాననిష్ఠయందుండి ధ్యానమునందు నిత్యమును చూచు భగవన్మూర్తికిని; తానింతకుముందు సంభాషించిన వ్యక్తి (శ్రీకృష్ణ భగవానుని) ఆకారమునకును భేదము లేకుండుటను జూచి, తన యిష్టదైవమగు శ్రీకృష్ణుడే యెదుట నున్నాడని భగవానుని జేరి సాష్టాంగదండ ప్రణామ మాచరించి, బ్రాహ్మణ కళేబరమునుండి తెచ్చిన మాంసము నొక కపాలమునం దుంచి కృష్ణభగవానునికి నైవేద్యముగ సమర్పించెను. ఆ సందర్భమున ఘంటాకర్ణుడన్న వాక్యము లివి:-

గీ|| ఆరగింపవె దేవ! మాయందు విందు
వేలుపన్న బాటింతురు విప్రమాంస,
మిచట మత్తీతి సేసి నన్నేలుకొనుము,
భక్తిగాని నీకేమియు బ్రాతి గాదు.

(ఉత్తర హరివంశము 2-149)

జి : నరహంతకుడును, పాపకర్ముడును, అశుచియు నగు పిశాచమును భక్తుడనుట యెట్లు సరిపడును?

వే : ఘంటాకర్ణుడు మహాత్ముడు. అతనిని గుఱించి ఎఱ్ఱాప్రగ్గడ

Dr K Dayanandaswamy ebooks

'హరివంశము' నందు గల శ్రీకృష్ణభగవానుని వాక్యములనే యిచ్చట ఉదాహరింతును :

"వీడు ధననాథునకు ననుంగు బంటగుట నమ్మహాదేవ సఖువలనం బరమజ్ఞానంబు వడసి పూర్వపుణ్య వాసనానురూపంబుగా బొడమిన భక్తికిం బ్రోదిగా ననవరతంబును గృష్ణ, కేశవ, వాసుదేవ, జనార్దనాది నామంబులను గీర్తించుచు మృగంబుల వధియించుతఱి దన్మాంసఖాదనం బొనరించునెడ దదీయరుధిరపానంబు సేయునప్పుడు సర్వావస్థల యందును సమస్తకరణంబులు నాయందు నర్పితంబు గావించు గావున నవ్విశిష్టకర్మంబు పక్వంబై యిట్టి పదం బొదవె. వీనిం గృతార్థు జేయుదు" అని నిశ్చయించి భగవంతు డాతని దేహమున తన హస్తము నుంప ఘంటాకర్ణుండు పిశాచ దేహంబు వదలి దివ్యదేహంబు ధరియించి భగవంతుని స్తుతించెను. భగవాను డాతనికి ఇంద్రాధిపత్య తుల్యంబగు స్వర్గమును, కల్పాంతమున సాయుజ్యముక్తియు కలుగున ట్లనుగ్రహించెను.

భక్తి గలిగి నిరంతరము భగవంతుని స్మరించు పురుషుడేకార్యము చేసినను భగవదర్పితముగనే చేయును. భక్తి లేనివాడు భగవంతునికి చక్కెరపొంగలి, పులిహోర, పెరుగన్నము, ఫలములు, పారిజాత పుష్పములు సమర్పించినను వ్యర్థమే. భక్తుడు దేనిని ప్రీతితో భుజించునో దానిని భక్తితో సమర్పించినచో నదియే భగవంతునకు ప్రీతిని కలిగించును. పదార్థము ప్రధానము గాదు, భక్తిప్రధానము.

భక్తి యీవిధముగా అనుష్ఠింపవలయునని శాస్త్రవిధి యేదియును లేదు. కాని భక్తిమార్గము అశాస్త్రీయము కాదు. చాల పూజ్యమైనట్టిది. సర్వశాస్త్రములకు సమ్మత మగునట్టిది. భగవంతుని మహిమ యిట్టిదని చెప్పుటకు సాధ్యము కానియట్లే భక్తిమహిమయు నింతటిదని చెప్పుటకు సాధ్యము కాదు. ఏ ప్రాణియైనను భక్తి యను ధనముతో భగవంతుని దాసునిగా కొనవచ్చుననియు, భక్తులకొఱకు భగవంతుడు దాసుడై నీచకార్యములు చేసి యుండెననియు భక్తుల చరిత్ర చెప్పుచున్నది. ఆ కథలన్నియు నూహాకల్పితములని త్రోసివేయుటకు మనకధికారము లేదు.

Dr K Dayanandaswamy ebooks


భగవంతునకును భక్తునకును భేదము లేనప్పుడు భక్తున కసాధ్య మేమిగలదు? అయినను భగవద్భక్తులలో కొందఱీలోకమున మరణ పర్యంతము అనేక కష్టముల ననుభవించి యుండిరని చరిత్రలు చెప్పుచున్నవి. వారట్టి కష్టములను కష్టములుగా భావించిరో, లేదో చెప్పలేము.

గీతయందలి 9, 12 అధ్యాయములయందు భక్తిమార్గము చెప్పబడినది. అందు 9వ అధ్యాయమునకు "రాజ విద్యా రాజగుహ్యామ"ని నామకరణము చేయబడినది. అచట భగవంతుడు భక్తిమార్గమునే యర్జునున కుపదేశించెను.

"నీవు అసూయ లేనివాడవు కావున గుహ్యములలో గుహ్యమయినది (మిక్కిలి గోప్యమయినది)యును, విజ్ఞాన సహితము నగు జ్ఞానము నీకు చెప్పుచున్నాను. దానిని తెలిసికొనుటవలన పాపములనుండి ముక్తుడ వగుదువు. ఇది విద్యలన్నింటిలోను శ్రేష్ఠమైనది. (రాజు) కనుక రాజవిద్య. రాజ విద్య యనగా: పూర్వము రాజులచేత తెలిసికొనబడి యితరులకు చెప్పక గోప్యముగా నుంచబడి, పిమ్మట వారినుండి తక్కిన వర్ణముల వారికి తెలుపబడినదనియు, అందువలన రాజవిద్యయను నామకరణము కలిగినదనియు కొందఱు చెప్పుదురు. గుహ్యము లన్నింటిలోను శ్రేష్ఠమైనది (రాజు) కనుక రాజగుహ్యమని మఱికొందఱందురు. మఱియు, ఇది పవిత్రమును, ఉత్తమమును, ప్రత్యక్షముగా తెలియదగినదియు, ఆచరించుటయందు సుఖకరమును, అవ్యయమును నగు ధర్మమై యున్నది. కనుక ఓ పరంతపా! ఈ ధర్మమునందు శ్రద్ధ లేనివాడు మృత్యువుతోకూడిన సంసారములో తిరుగుచు నన్ను పొందలేకయున్నాడు." (గీత.9-1,2,3.)

అని చెప్పి, కడపట "ఓ అర్జునా! నీవు నాయందే మనస్సును చేర్పుము. నాభక్తుడవు కమ్ము. నన్ను పూజింపుము. నాకే నమస్కరింపుము. ఇట్లు మత్పరాయణుడవై నాయొక్క యోగము నవలంబించిన యెడల నన్ను పొందుచున్నావు." (గీత. 19-34) అని చెప్పెను. అర్జునునికి భగవానుడు విశ్వరూపము చూపినపుడు :

Dr K Dayanandaswamy ebooks


"ఈ విశ్వరూపమును భక్తులు తప్ప అన్యు లెవ్వరును చూడజాలరు." (గీత. 11-53, 54) అని చెప్పెను.

గీతయొక్క 12వ అధ్యాయమునకు భక్తియోగమని పేరు పెట్టబడెను. ఈ అధ్యాయము నుపసంహరించుచు భగవంతు డిట్లుచెప్పెను:- "యే తు ధర్మ్యామృత మిదం" "ఎవరు, పైన చెప్పిన అమృతతుల్యమైన యీ ధర్మమును అనగా భక్తి యోగమును మత్పరులగుచు శ్రద్ధతో నాచరింతురో అట్టి నాభక్తులు నాకు మిక్కిలి ఇష్టు లగుచున్నారు."(గీత. 12-20)

ఈ విధముగా చెప్పుటవలన భక్తిమార్గముయొక్క గొప్పతనము మనకు విశదమగుచున్నది. మఱియు, భక్తికి వేఱొక సాధన మవసరము లేదు. భక్తి తనకు తానే ప్రమాణము. భక్తియే ఫలస్వరూప మగుటవలన ఇతర మార్గములకంటె నీ మార్గము శ్రేష్ఠమని చెప్పుదురు. ప్రపంచము నందలి మానవకోటిలో అత్యధికసంఖ్యాకు లీమార్గమునే యనుసరించు చున్నారు. ఇది పరమ శ్రేయఃప్రద మైనదియు, అత్యంత దుఃఖ నివారకమును, పరమానంద దాయినియునై యున్నది. అదియునుగాక భక్తిమార్గము సులభమును సహజమునునై యున్నది. 'భక్తిని విడిచి ముక్తిలేద'ని సామెత కలదు. జ్ఞానియైనను, యోగియైనను భగవద్భక్తి లేనిదే ముందునకు సాగిపోలేడు. భాగవతమునందు వ్యాసభగవానునితో నారద మహర్షి ఈ విధముగా చెప్పినట్లు కలదు.

"మునీంద్రా! నిర్గతకర్మంబై, నిరుపాధికంబైన జ్ఞానంబు హరిభక్తి లేకున్న విశేషంబుగా శోభితంబు గాదు. ఫలంబు గోరక కర్మంబీశ్వరునకు సమర్పణంబు సేయకున్న నది ప్రశస్తంబై యుండదు. భక్తిహీనంబులైన జ్ఞాన వాచా కర్మ కౌశలంబులు నిరర్థకంబులు."

(ఆంధ్రభాగవతము-ప్రథమస్కంధము)

"పక్షికి రెండు రెక్కలును, ఒకతోకయు నెట్లవసరమో యట్లే ముముక్షువునకు భక్తిజ్ఞానములు రెండును రెండు రెక్కలనియు, యోగము

Dr K Dayanandaswamy ebooks



చుక్కానివంటి తోక" యనియు శ్రీ వివేకానంద స్వామివారు చెప్పియున్నారు. కనుక భక్తిలేక జ్ఞానముమాత్రమే యుండిన యెడల నొక రెక్కలేని పక్షి పైకి ఎగురలేనట్లు మానవుడు ముక్తి పొందలేడని యర్థము.

**కం|| శ్రేయములు గురియు భక్తిని**
**జేయక, కేవలము బోధ సిద్ధికి దపముం**
**జేయుట విఫలము, పొల్లున**
**నాయము సేకుఱునె తలప నధికంబైనన్?**

(ఆంధ్రభాగవతము-దశమ స్కంధము)

పొట్టు ఎంత యధికమైనను దానియందు ఆయము లభించనియట్లు మోక్షప్రదమగు భక్తిని చేయక కేవల బోధసిద్ధికి (బ్రహ్మతత్త్వజ్ఞాన మిట్టిదని తెలిసికొనుటకు) చేసిన తపము విఫల మగునని యీ పద్యమందలి తాత్పర్యము.

ఇచ్చట జ్ఞానమనగా:- కేవలము వేదాంతశాస్త్రములను చదువుటవలన కలిగిన జ్ఞానమే యనియు, బ్రహ్మైక్య జ్ఞాననిష్ఠ గల (బ్రాహ్మీస్థితి గల) జ్ఞానియొక్క (అనుభవపూర్వక) జ్ఞానమును గుఱించి (యిచ్చట) చెప్పబడ లేదనియు బ్రహ్మవాదులు చెప్పుదురు.

## (5) జ్ఞానము - భక్తి

సాధనావస్థలో భక్తి ఉపాసనములయందు పూజించు వానికి (ఉపాసకునకును) పూజింపబడు వస్తువునకును (ఉపాస్యమునకును) భేదముండును. సాధన ముగిసిన సిద్ధావస్థయందు భేదముండదు.

భక్తునకు కావలసినవి శ్రద్ధ, ప్రేమ, భావబలము - ఇవి యుండిన చాలును. ఇవన్నియును మనస్సునకు సంబంధించినవేగాని, బుద్ధికి సంబంధించినవి గావు. బుద్ధికి సారాసార విచారము చేసి నిశ్చయించుట

Dr K Dayanandaswamy ebooks


యొక్కటియే వ్యాపారము. తక్కిన కార్యములయందు బుద్ధికి ప్రవేశము లేదు. తక్కిన వన్నియు మనోవ్యాపారములే. కనుక భక్తునకు బుద్ధితో పని లేకపోయినను బుద్ధి శుద్ధమై యుండిన యెడల సాత్త్వికముగా నుండును. సాత్త్వికబుద్ధి జ్ఞానజనకము. సాత్త్వికబుద్ధి గల భక్తునకు సాత్త్వికశ్రద్ధయు, స్వార్థరహితప్రేమయు భగవంతునియెడ కలుగును. అట్టివారికి పరమేశ్వర సంబంధమైన జ్ఞానము లేదని చెప్పలేము. ఒకానొకనియందు బుద్ధి శుద్ధముగా లేకుండిన అతనికి భగవంతునియందు శ్రద్ధాభక్తు లుండినను పరమేశ్వర సంబంధమగు జ్ఞానము (పరమేశ్వరు డిట్టివా డను జ్ఞానము) కలుగుటకు వీలులేదు. అట్టివారు కొందఱు యక్షరాక్షసాది క్షుద్రదేవతల నారాధింతురు.

మఱికొందఱు మూఢబుద్ధులై పరులను పీడించి లోకమున కుపద్రవకారులైరి. ఉదాహరణమునకు : కాళహస్తీశ్వరుని, ఒక సర్పము మణులతోను, ఒక యేనుగు పద్మములతోను పూజించుచుండినవి. వీటికి పరమేశ్వరుని సత్యస్వరూప మిట్టిదని తెలిసికొను బుద్ధిలేదు. మనస్సుమాత్రమే కలదు. కనుక నొకదానియొక్క పూజావిధానమును మఱియొకటి సహించలేకపోయినవి. భగవంతుని నెవరెట్లు సేవించినను ఆయనకు కావలసినది వారి భక్తియే యను భావము, నా రెంటికి నుండియున్న నవి సోదరభావమున నన్యోన్యప్రేమతో కలసి భగవంతుని సేవించి యుండియుండును. అదేవిధముగనే విక్షణావిరహిత బుద్ధులగు కొందఱు ముసల్మానులు హిందువుల దేవతావిగ్రహముల ధ్వంసము చేసిరి. అట్టి వారిని భగవద్భక్తులుగా కొందఱు ముసల్మానులు భావించుచున్నారు. వారనుకొన్న ట్లట్టివా రొకవిధమగు భగవద్భక్తులే యని మనమంగీకరించినను, దేవతావిగ్రహములను పడగొట్టినవారికి భగవంతుడు సర్వవ్యాపియనియు, సర్వమునందును నుండువాడనియు తెలిసికొనజాలు. పరమేశ్వర సంబంధమగు జ్ఞానము లేకపోవుటచే అట్టి జ్ఞానము కల్గియుండు విగ్రహారాధకుల భావమును తెలిసికొనలేక, తమ సిద్ధాంతమే సరియైనదని మూఢమగు నమ్మకముతో అట్టి యకృత్యమును జేసిరి. ముసల్మానులేగాక పరమతమును ద్వేషించువా రందఱును

Dr K Dayanandaswamy ebooks

అట్టివారే.

జి : అయ్యా! ఏసుక్రీస్తుగారును, మహమ్మదుగారును దేవుని ఆదేశమును లోకమునకు బోధించిరని ఆయా మతములవారు చెప్పుదురు గదా! దీని భావమేమి?

వే : ఎవరికి స్వార్థము లేదో, ఎవరహంకార రహితులో, అట్టివారు చేయు ప్రతికార్యమును వారిచేత భగవంతుడే చేయించుచున్నాడు. సామాన్యు లగువారి విషయమునను నిట్టులే, నీ వొక దరిద్రునకు ప్రతిఫలమును కోరక కొంత ధనమును సహాయము చేసితివేని ఆ బీదవానికి నీ ద్వారమున భగవంతుడు సహాయము చేసినట్లు తలంపుము. ఈ సూత్రము ననుసరించి ప్రతి మంచికార్యమును, ప్రతివ్యక్తియు, వాని హృదయాంతర్వర్తియగు నీశ్వరుని ప్రేరణమువలననే చేయుచున్నాడు. ఏసుక్రీస్తుగారు యూదులకు భక్తిపరమగు ధర్మమును బోధించిరి గాని, తత్త్వజ్ఞానపరమగు భక్తిని బోధింపలేదు. కారణమేమనగా: ఆ కాలమునం దాదేశమునందుండు ప్రజలలో (యూదులలో) ధర్మవర్తనము కొఱవడి యున్నందున ధర్మానుష్ఠానము లేనివారికి తత్త్వజ్ఞానపరమగు భక్తిని బోధించినయెడల వారు దానిని చక్కగా అర్థముచేసికొనలేరు. కనుక అట్టివారి కది హితకారి కాదని భగవంతుని సంకల్పము.

ఎట్లనగా: వారము దినముల క్రిందట పుట్టిన బిడ్డకు తల్లి చనుబాలు మంచి యాహారమగును; జీర్ణముకాని ఆహారము విపరీత ఫలము నిచ్చును. అరబ్బుల విషయమునను మహమ్మదుగారి విషయమునను నిట్లే అర్థము చేసికొనవలయును. ఆయా కాలములయం దాయా సమాజములయందున్న వారి యోగ్యత ననుసరించి భగవంతుడు తన ప్రవక్తలచేత ఆయా బోధలు చేయించెనని మనము భావింపవచ్చును. భారతదేశము నందన్నవో వేలకొలది సంవత్సరములకు పూర్వమే ప్రాచీనోపనిషత్తులయందు చెప్పబడిన నిర్గుణ బ్రహ్మతత్త్వమును, సగుణబ్రహ్మోపాసనలును, తదనంతరోపనిషత్తులయందు చెప్పబడిన సాంఖ్య యోగ దర్శనములును; వేదచోదిత కర్మానుష్ఠానమును, నిష్కామ కర్మాచరణమును, విరివిగా

Dr K Dayanandaswamy ebooks


ప్రచారమునం దుండియుండినవి. వాటితో కూడ వైదికభక్తి అనగా జ్ఞానపరమగు (జ్ఞానయుతమగు) వాసుదేవ భక్తిని భగవద్గీత అనేక విధముల బోధించియున్నది. ఈభక్తి విధానముయొక్క విశిష్టతను తెలిసికొనలేని హిందువులయందు సహితము కొందఱు శివకేశవులయందు "మా దేవుడధికుడు, మా దేవుడధికు" డని యుద్ధములు చేసియుండిరి. వారికి పరమతసహనము లేకపోవుటకు కారణము అట్టివారి బుద్ధి శుద్ధము కాకపోవుటయే. అనగా: తామస బుద్ధులగుటయు పరబ్రహ్మ సంబంధమగు సత్యజ్ఞానము లేక పోవుటయునే, కనుక కొంతవఱకైనను భక్తునకు బ్రహ్మజ్ఞాన ముండవలయును. అట్టి జ్ఞానముతో చేరియుండు భక్తియే శ్రేష్ఠమగు భక్తి, దానిని వైదికభక్తి యని చెప్పవలెను. గీతయొక్క 17వ అధ్యాయమునందు శ్రద్ధాస్వరూపము వివరింపబడినది.

ప్రతిమనుజునకు వానివాని పూర్వజన్మ వాసన, ననుసరించి శ్రద్ధ సాత్త్వికముగనో, రాజసముగనో, తామసముగనో యుండును. శ్రద్ధయనగా: విశ్వాసము. అనగా: ఈ విధముగా చేసిన మన యభీష్టము నెరవేరునను నమ్మకము. మానవుడు చేయుకర్మకు తగిన ఫలము వానికి కలుగుటకు వాని శ్రద్ధయే ప్రధానము. మానవున కుండు సాత్త్వికాది గుణ భేదములనుబట్టి శ్రద్ధయు సాత్త్వికాది త్రివిధ భేదములు కలిగి యుండును. కనుక భక్తుడు సత్త్వగుణపోషణమును, నుపనిషత్తులయందు చెప్పబడిన బ్రహ్మజ్ఞానమును తెలిసికొని యుండిన నది యుత్తమభక్తి యనబడును. భగవద్గీత జ్ఞానముతో కూడిన భక్తిమార్గమునే బోధించినది. కనుకనే గీత యిట్లు చెప్పినది. "ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని - అను నలుగురు భక్తులలోను నిత్యయోగియై ముఖ్యభక్తి గలిగినట్టి జ్ఞానియే అధికుడగుచున్నాడు. జ్ఞానికి నేను మిక్కిలి ప్రియుడను, అజ్ఞానియు నాకు మిక్కిలి యిష్టుడైనవాడు గదా!" (గీత. 7-17, 18) ఇది, ముందు చెప్పబోవు 'పరాభక్తి', 'ముఖ్యభక్తి' అను భక్తి విధానములలో చేరును.

భక్తి, జ్ఞానములయం దేది శ్రేష్ఠమగు మార్గము? అను వివాదము సహితము కలదు. ఈ రెండును రెండు భిన్న మార్గములైనను తుదకు

Dr K Dayanandaswamy ebooks



వీటి గమ్యస్థాన మొక్కటియే యనునది సంశయరహితమగు విషయము. జ్ఞాని సాధనచతుష్టయమును సాధించి శ్రవణ, మనన, నిదిధ్యాసలు చేసి, తత్త్వజ్ఞానమును పొందుచున్నాడు. నిదిధ్యాస దృఢమై సమాధియగుచున్నది. సమాధియందు జగత్తు తోచదు. తోచుట లేదనగా బ్రహ్మపరోక్షజ్ఞానము కలిగినదని యర్థము. ఇక భక్తియొక్క ఉన్నతావస్థ (ఉన్నత భూమిక) యందలి యనుభవమును ప్రహ్లాదుని గుఱించి యిదివఱలో చెప్పినట్లు భాగవతము నందలి "పానీయంబులు....." అను పద్యమును స్మరించుకొనుము. "......శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సంధానుండై మఱచెన్ సురారిసుతు డేతద్విశ్వమున్ భూవరా", "మరచెన్ సురారిసుతు డేతద్విశ్వమున్" జగత్తును మఱచెను. "జగత్తు తోచలేదు" అనగా జ్ఞానుల నిర్వికల్ప సమాధియే భక్తునకు సిద్ధించెనని తాత్పర్యము. జ్ఞానము, భక్తి వీటియందొకటి యెక్కువనిగాని, మఱియొకటి తక్కువని గాని చెప్ప వలనుపడదు.

## (6) భగవంతుడు

భగవంతుని యెడగల పరమప్రేమయే భక్తియని చెప్పబడెను. పరమేశ్వరు నేవిధముగా భజింపవలయును? మనోవాక్కుల కందని పరమేశ్వరు నెట్లు సేవింపవలయును? దేశకాల వస్తువులచేత నపరిచ్ఛిన్నమై, సజాతీయ విజాతీయ స్వగత భేదరహితమై, ఆది మధ్యాంతములు లేనిదగు పరతత్త్వమును భక్తుడు మనమున నిలుపుటెట్లు? ఇదివఱలో పరతత్త్వము గుణ ప్రధానమగు మాయతో చేరి ఈశ్వరుడాయె ననియు, ఆయనయే సగుణబ్రహ్మమనియు చెప్పియుంటిని (ఈ గ్రంథము 1-2-7). ఆ ఈశ్వరుడే జగదుత్పత్తి స్థితి లయములకు కారణమై జగన్నియామకుడునై యున్నాడు. *భక్తులు వివిధరూపములతోను వివిధ పద్ధతులతోను భజించునది యీ యీశ్వరునే. శుద్ధబ్రహ్మము కేవల బుద్ధి, లేక జ్ఞానమునకు మాత్రమే గమ్యుడు.

---

* విశిష్టాద్వైతులు పరమేశ్వరుని సగుణుడని చెప్పుదురు. నిర్గుణుడని చెప్పు శ్రుతివాక్యములకు ప్రకృతి గుణములకు అతీతమైన అనంత కల్యాణగుణ విశిష్టుడని యర్థము చెప్పుదురు. అందువలన వారికి పరమేశ్వరుడు సగుణుడనియు, నిర్గుణుడనియు భేదము లేదు.

Dr K Dayanandaswamy ebooks



నిర్గుణ బ్రహ్మము నెఱుంగుటకు మహాసూక్ష్మబుద్ధి కావలయును. బ్రహ్మానుభవమును పొందుట చాల దుర్లభము. ఉపాసన మనస్సునకు సంబంధించినది. ఉపాసనకు కావలసినది ప్రేమ, శ్రద్ధ; శ్రద్ధయు, జ్ఞానమును, మనస్సును, బుద్ధియును వీటి కెప్పుడును సంబంధము కలదు. మిగుల సూక్ష్మమై యున్నతమైన మనస్సే బుద్ధి; కనుక జ్ఞానమును భక్తియును ప్రారంభమున వేఱువేఱుగా కనబడినను పోను పోను రెండును ఒకటియే యగుచున్నవి. మనస్సుచేత మొదట సగుణబ్రహ్మము నుపాస్యముగా నుంచుకొనినను, పిమ్మట ఉపాస్య-ఉపాసక భేదము నశించి అద్వితీయమగు నిర్గుణ బ్రహ్మమే, సవికల్ప సమాధియే యున్నత స్థితిని చెందినపుడు నిర్వికల్ప సమాధి యగుచున్నదని చెప్పియుంటిని. సగుణ బ్రహ్మమునుండియే నిర్గుణబ్రహ్మప్రాప్తి కలుగును.

ఉ॥ "కారణకార్య హేతువగు కంజదళాక్షునకంటె నన్యు లె
వ్వారును లేరు, తండ్రి భగవంతు ననంతుని విశ్వభావనో
దారుని సద్గుణావళు నుదాత్తమతిం గొనియాడకుండినం
జేరవు చిత్తముల్ ప్రకృతిజెందని నిర్గుణమైన బ్రహ్మమున్."
(శ్రీమదాంధ్ర భాగవతము 2-211)

కనుక జ్ఞానము, భక్తియు, బుద్ధియు, ప్రేమయును ఒక దానియం దొకటి గుంభితమై యున్నవని పెద్దలు చెప్పిరి. భగమనగా: షడ్గుణైశ్వర్యము. భగము గలవాడు భగవంతుడు.

శ్లో॥ "ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య *యశసశ్శ్రియః ।
వైరాగ్యస్యాథ మోక్షస్య, షణ్ణాం భగ ఇతీరణా ॥"

తా॥ (1) ఐశ్వర్యము (మాహాత్మ్యము) (2) సమగ్రత (3) వీర్యము (ధైర్యము) (4) యశస్సు (5) వైరాగ్యము (జ్ఞానము) (6) మోక్షము- ఈ యారు

---

* ఈ శ్లోకమున "ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య" అని విష్ణుసహస్రనామ స్తోత్రమున శాంకర భాష్యమున గలదు. (శ్లో. 73) (1) సంపూర్ణైశ్వర్యము, (2) ధర్మము, (3) యశము, (4) సంపద, (5) వైరాగ్యము, (6) మోక్షము అని అచ్చట చెప్పబడినవి.

Dr K Dayanandaswamy ebooks



భగమనబడును. ఇట్టి షడ్గుణైశ్వర్య సంపన్నుడు భగవంతుడు. భక్తానుగ్రహముకొఱకు శివ, కేశవ, శక్తిరూపమున వెలయుచుండును. శివకేశవులయందు భేదభావ ముంచరాదు. భేదబుద్ధు లగువారు ఈ క్రింది శ్రుతివాక్యములను వినియుండ రేమో.

**మం॥ శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే।**
**శివస్య హృదయం విష్ణు ర్విష్ణోశ్చ హృదయం శివః॥**
**యథా శివమయో విష్ణు రేవం విష్ణుమయ శ్శివః।**
**యథాంతరం న పశ్యామి తథా మే స్వస్తి రాయుషి॥**
**యథాంతరం న భేదాఃస్యు శ్శివకేశవయో స్తథా॥** (స్కందోపనిషత్తు)

కనుక శివకేశవుల మధ్య భేదమును పాటించరాదు.

శివకేశవుల కభేదమును చెప్పు స్కందోపనిషత్తువంటి యుపనిషద్వాక్యములేగాక శ్రీమద్భాగవతము, మహాభారతము, హరివంశము మున్నగు నుత్తమ గ్రంథములు శివకేశవ భక్తులను సమానముగ ప్రచారము చేసియున్నవి. శివుడు విష్ణువును స్తుతించినట్లు భాగవతమునందలి రుద్రగీతలయందును, శ్రీకృష్ణభగవానుడు శివునిగుఱించి తపమాచరించినట్లు హరివంశమునను గలదు. వాటిననుసరించియే హరిహరమూర్తి యారాధనము ప్రచారమునకు వచ్చియుండును. తిక్కనసోమయాజిగారు మహాభారతమును హరిహర దేవున కంకిత మిచ్చియుండుట లోక విదితమే. కేవల హరిహరుల ఐక్యభావనతో మాత్రమేగాక, హరి హర హిరణ్యగర్భుల ననేక రూపముల సేవించుట (ఉపాసించుట) సహితము శ్రుతులకు సమ్మతమే. అత్రిమహామునికి పుత్రుడై యవతరించిన దత్తాత్రేయ మహాముని త్రిమూర్త్యాత్మక స్వరూపుడు (మూడు శిరములు ఆఱుబాహువులు కలిగి ముగ్గురు మూర్తుల యేకైక మూర్తి). ఈ మహాత్ముని శాండిల్యోపనిషత్తు స్తుతించినది.

శ్రీమద్భాగవతము నందలి శ్రీ మన్నారాయణ కవచము నందు 'యోగభ్రంశంబువలన యోగనాథుండయిన దత్తాత్రేయుండు రక్షించు'నని

Dr K Dayanandaswamy ebooks



చెప్పబడినది. మరియు వీరిని విష్ణువుయొక్క అవతారమని భాగవతము పేర్కొన్నది.

భగవంతుని పురుషమూర్తిగా భావించి సేవించుటే గాక స్త్రీమూర్తిగ నుపాసించియు నున్నారు. ఆమెయే దేవి, శక్తియని చెప్పబడెను. అష్టోత్తర శతోపనిషత్తులయందు శక్త్యుపనిషత్తులు ఎనిమిది గలవు.* వీటి ననుసరించిన దేవీ సంబంధమగు పురాణములు, తంత్రములు వెలువడినవి. శ్రీకాళిదాస, శ్రీశంకరాచార్యులవంటి మహాత్ములు దేవిని పరదేవతగా స్తుతించియున్నారు. ఈమెయే మోక్ష ప్రదాత్రి యనిరి.

తిరుపతి తిరుమలయందు వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారు సర్వదేవతా, స్వరూపులని అన్ని (వైదిక) మతములవారు సేవింతురు. శ్రీస్వామివారు జటాధారియు, నాగభూషణులును నగుటవలన శివుడని శైవులును; చతుర్భుజములు, శంఖచక్రములు, వక్షఃస్థలమున లక్ష్మీదేవియు నుండుట వలన విష్ణుదేవుడని వైష్ణవులును; పద్మముపై శ్రీపాదముల నుంచి నిలిచియుండుటవలన బ్రహ్మదేవుడని హైరణ్యగర్భులును; స్వామివారి దేవాలయ ప్రాకారమునకు నాలుగు మూలలయందును సింహవిగ్రహము లుండుట వలనను, స్వామి వారికి 'బాలాజీ' ** అను నామధేయ ముండుటయు కారణములుగా 'దేవి' యని శాక్తేయులును - తమతమ యిష్టదేవతగా సేవించుచున్నారు. నిజమునకు స్వామివారు సర్వదేవతా స్వరూపులే గదా!

శివ కేశవ శక్తులయందు భేదము పాటింపకుండుటయందు శ్రీ శంకరాచార్యులవా రాదర్శప్రాయులు. వీరు 'శ్రీ లక్ష్మీనరసింహ స్తోత్రము'చే విష్ణువును, 'కనక ధారాస్తవము'చే లక్ష్మీదేవిని, 'శివానందలహరి'చే శివుని, 'సౌందర్యలహరి'చే దేవిని (పార్వతిని) స్తుతించియున్నారు. భక్తిభావము

---

* శక్త్యుపనిషత్తులివి : (1) సీతా (2) త్రిపురతాపినీ (3) దేవీ (4) త్రిపుర (5) భావనా (6) సౌభాగ్యలక్ష్మీ (7) సరస్వతీరహస్య (8) బహ్వృచములు.

** బాలాజీ అనగా 'బాలా' అనునామము దేవికి కలదు. గౌరవార్థము 'బాలాజీ' అనుటవలన దేవీనామము.

Dr K Dayanandaswamy ebooks



నుద్దీపింపజేయు నీ స్తోత్ర రత్నములతో సరితూగునట్టి స్తోత్రములు దుర్లభములు.

జగన్నియామకుండగు పరమేశ్వరు డధర్మముచేత ధర్మము నశించునపుడును, అసాధువులచేత సాధువులు బాధపడునపుడును, ధర్మసంస్థాపనార్థము, సాధు సంరక్షణార్థము యుగ యుగములయందును ఆత్మమాయచే నవతరించుచుండును (గీత. 4-7, 8). అట్టి భగవ దవతారములను సేవించినను పరమేశ్వరుని సేవించినట్లె యగును.

## (7) శ్రీరామకృష్ణావతారములు

భగవంతుడగు శ్రీ మన్నారాయణు డనేకావతారములను ధరించి యున్నను అందు ముఖ్యములు శ్రీనరసింహ, శ్రీరామ, శ్రీకృష్ణావతారములు. అందును శ్రీరామ శ్రీకృష్ణావతారములు ముఖ్యములు. కొందఱు శ్రీరామ, శ్రీకృష్ణులు వీర పురుషులు మాత్రమేయనియు, దుష్టసంహారము చేయుటవలన లోకులు సంతసించి వారిని పూజించిరనియు, అది వీర పురుషారాధనమనియు (Hero worship), తరువాత కొంతకాలమునకు వారిపై మూఢభక్తి కలిగి వారిని దేవుని యవతారముగ భావించి ఆరాధించిరనియు చెప్పుదురు. ఈ మాటలు వైదికమతమునకు సమ్మతమైనవి కావు. ఏలయన: దుర్మార్గుడును, లోకకంటకుడును నైన రావణుని మాంధాత జయింపగలిగెను. వాలి రావణుని చంకలో నిడుకొని సప్తసముద్రములు త్రిప్పెను. కార్తవీర్యార్జునుడు రావణుని యుద్ధమున జయించి చెఱసాలయందు బంధించెను. భీమార్జునులు దుర్మార్గుల ననేకులను సంహరించిరి. ఇట్లు దుర్మార్గులను జయించిన మాంధాత, వాలి మొదలగు వీరులను భగవంతుని యవతార పురుషులని చెప్పుటలేదు. శ్రీరామకృష్ణులు ఈశ్వరుని అవతారమని చెప్పుటలో నెంతో యర్థమున్నది. దానినంతయు నిర్మల చిత్తముతో నవగాహన చేసికొనవలయును.

రామకృష్ణులను పాకృత జనులవలె జనన జరా మరణములు కలవారినిగా తలపరాదు. ప్రాకృత జీవులు వారివారి కర్మానుసారము అవిద్యకు లోబడి జనన మరణములను పొందుచుందురు. ఆ యవతార

Dr K Dayanandaswamy ebooks



పురుష లట్లుకాదు. సూ. "**తచ్చ దివ్యం స్వశక్తి మాత్రోద్భవాత్.**" (శా.భ.సూ. 48) ఆ శరీరము దివ్యము, స్వశక్తివలన కలిగినది.

రామకృష్ణులు ప్రాకృతులవలె కర్మబద్ధులు కారు. వారికి కర్మయే లేదు. కౌసల్యా దేవకీ దేవుల గర్భములందు వారు జన్మింపలేదా? యనిన, భగవంతుడు స్వసంకల్పము చేతనే స్వకీయమాయచే నట్లవతరించెను. శ్రీరాముడు పరబ్రహ్మ మనుటను శ్రుతులిట్లు చెప్పుచున్నవి

**మం॥ రామ ఏవ పరబ్రహ్మ రామ ఏవ పరంతపః ।**
**రామ ఏవ పరం తత్త్వం శ్రీరామో బ్రహ్మతారకం ॥**

(రామ రహస్యోపనిషత్తు)

శ్రీరాము డొక్కడే పరబ్రహ్మము. ఆయనయే పరంతపుడు, పరతత్త్వము, బ్రహ్మము, తరింపజేయువాడు.

**మం॥ అకారాక్షర సంభూత స్సౌమిత్రి ర్విశ్వభావనః ।**
**ఉకారాక్షర సంభూత శ్శత్రుఘ్న స్తైజసాత్మకః ॥**
**ప్రాజ్ఞాత్మకస్తు భరతో మకారాక్షర సంభవః ।**
**అర్ధమాత్రాత్మకో రామో బ్రహ్మానందైక విగ్రహః ॥**
**శ్రీరామ సాన్నిధ్య వశా జ్జగదాధారకారిణీ ।**
**ఉత్పత్తిస్థితి సంహారకారిణీ సర్వదేహినామ్ ॥**
**సా సీతా భవతి జ్ఞేయా మూల ప్రకృతి సంజ్ఞికా ।**
**ప్రణవత్వా త్ప్రకృతి రితి వదంతి బ్రహ్మవాదినః ॥**

(రామతాపన్యుపనిషత్తు)

తా॥ లక్ష్మణుడు అకారాక్షరమందు కలిగిన విశ్వుడు, శత్రుఘ్నుడు ఉకారాక్షర సంభూతుడగు తైజసుడు, భరతుడు మకారాక్షర సంభూతుడగు ప్రాజ్ఞుడు. శ్రీరాముడు అర్ధమాత్రయగు ఆనందైక స్వరూపుడగు బ్రహ్మము; శ్రీరామసాన్నిధ్యమాత్రమున జగత్తును ధరించునట్టిదియు, జగదుత్పత్తి సంహార కారిణియు, సర్వదేహములయందును గల మూలప్రకృతియే సీతాదేవియని బ్రహ్మవాదులు ప్రణవముతో పోల్చి చెప్పిరి.

Dr K Dayanandaswamy ebooks



మం.॥ "శ్రీరామసాన్నిధ్య వశాజ్జగదానందకారిణీ ।
ఉత్పత్తిస్థితి సంహారకారిణీ సర్వదేహినాం ।
సీతా భగవతీ జ్ఞేయా మూలప్రకృతి సంజ్ఞితా"॥ (సీతోపనిషత్తు)

మం॥ కలాతీతా భగవతీ స్వయం సీతేతి సంజ్ఞితా ।
తత్పరః పరమాత్మా చ శ్రీరామః పురుషోత్తమః॥ (సారసారోపనిషత్తు)

శ్రీ కృష్ణభగవానుని గుఱించి శ్రుతులిట్లు చెప్పుచున్నవి.

మం॥ ఏకమే వాద్వయం బ్రహ్మ మాయయా చ చతుష్టయమ్ ।
రోహిణీతనయో విశ్వః అకారాక్షర సంభవః ॥

తైజ సాత్మకః ప్రద్యుమ్న ఉకారాక్షర సంభవః ।
ప్రాజ్ఞాత్మకో ఽనిరుద్ధో ఽసౌ మకారాక్షర సంభవః ॥

అర్ధ మాత్రాత్మకః కృష్ణో యస్మి న్విశ్వం ప్రతిష్ఠితమ్ ।
కృష్ణాత్మికా జగత్కర్త్రీ మూలప్రకృతి రుక్మిణీ ॥

వ్రజస్త్రీ జనసంభూత శ్రుతిభ్యో బ్రహ్మసంగతః ।
ప్రణవత్వేన ప్రకృతిత్వం వదంతి బ్రహ్మవాదినః ॥
(గోపాలతాపన్యుపనిషత్తు)

తా॥ బలరాముడు అకారాక్షర సంభూతుడగు విశ్వుడు, ప్రద్యుమ్నుడు ఉకారక్షర సంభూతుండగు తైజసుడు, అనిరుద్ధుడు మకారాక్షర సంభూతుడగు ప్రాజ్ఞుడు. రుక్మిణీదేవి జగత్కర్త్రియగు మూలప్రకృతి. వ్రజస్త్రీలు శ్రుతులు. ఎవనియం దీవిశ్వము ప్రతిష్ఠింపబడినదో అట్టి అర్ధమాత్రాత్మక స్వరూపుడు. శ్రీ కృష్ణభగవానుని ఈ విధముగా బ్రహ్మవాదులు ప్రణవముతో పోల్చి చెప్పిరి.

మం॥ గోప రూప హరి స్సాక్షాత్ మాయావిగ్రహధారణః ।
శేషో నాగో భవే ద్రామః కృష్ణో బ్రహ్మైవ శాశ్వతమ్ ॥

తా॥ గోపరూపధరుడైన హరి మాయామానుష విగ్రహుడు. ఆదిశేషుడే బలరాముడు. శాశ్వతుడగు పరబ్రహ్మమే శ్రీకృష్ణభగవానుడని శ్రీకృష్ణోపనిషత్తు చెప్పినది.

Dr K Dayanandaswamy ebooks


శ్రీరామ శ్రీకృష్ణులు వీరపురుషులేగాక వారు జీవులను సంసార పారావారమునుండి తరింపజేయగల శక్తిగలవారు. ఈ యవతారముల కాలములయందు ముక్తులు కావలసిన పుణ్యజీవు లందందు జన్మించి యీ యవతార పురుషులతో మాతృ, పితృ, భ్రాతృ, కళత్ర, పుత్ర, మిత్రాది సంబంధములు కలిగి జీవితములు ధన్యము చేసికొని పరమపదము చెందుచుందురు. అందులకే యీ యవతారములు కలుగుచుండును. ఈ యవతార పురుషుల జన్మము నొక వెల్లువతో పోల్చి "వెల్లువ వచ్చినపుడు కుంటలు, చెరువులు, బావులు, నదులు, సమస్తమును నిండిపోవునట్లు సమస్త జనులును ముక్తులై"రని శ్రీరామకృష్ణ పరమహంసగారు చెప్పియున్నారు.

శ్రీకృష్ణుడు తాను పరమేశ్వరుడనని గీతయందు చెప్పిన వాక్యములలో కొన్నింటి నిచట నుదాహరించుచున్నాను. "సమస్తలోక నియామకుడను." (గీత 5-29), "నా ప్రకృతులు రెండు గలవు. ఒకటి అపర. రెండవది పర" (గీత 7-4, 5), "నన్నాశ్రయించుకొనియుండు నీ రెండు ప్రకృతులద్వారా సమస్త జగత్తుయొక్క సృష్టి స్థితి లయములకు నేను కారణ భూతుడ నగుచున్నాను." (గీత 7-6), "సత్త్వరజస్తమో గుణాత్మకమగు నా మాయచేత సర్వజగత్తు మోహింపబడినందున పరుడను, అవ్యయుడను నగు నన్ను తెలిసికొనలేరు" (గీత. 7-13)- ఈవిధముగ గీత 7-14; 7-15; 9-4; 5; 9-11; 12; 15-17; 18 శ్లోకములయందును మఱికొన్ని శ్లోకములయందును, భగవానుడు తాను పరబ్రహ్మ మని స్వయముగ చెప్పియున్నాడు,

## (8) పరాభక్తి (పరభక్తి)

భక్తి రెండువిధములై యున్నది. (1) పరాభక్తి (2) అపరాభక్తి. ఈ అపరాభక్తినే గౌణభక్తియని యందురు. అపరాభక్తి పూర్తియై పరాభక్తి స్థితిని చెందుటకు ముందు ఈ మధ్యస్థితిని ముఖ్యభక్తియని యందురు. ఈ విధముగ చూచినచో భక్తి మూడువిధములని చెప్పవచ్చును. శ్రీ వైష్ణవులు పరమభక్తియని మఱియొక విధమును చెప్పుదురు.

Dr K Dayanandaswamy ebooks



భక్తియొక్క సిద్ధావస్థను పరాభక్తి యందురు. నారద భక్తిసూత్రముల (మతము) ననుసరించి పరాభక్తి యనునది ముక్తికి సాధనము కాదు. అదియే ముక్తి. కైవల్యమునకును పరాభక్తికిని భేదము లేదు. జీవన్ముక్తుడును, పరాభక్తుడును నొక్కటియే. గీతయందు చెప్పబడిన భక్తునకును (గీత 12 అ. 13 శ్లోకము నుండి 19 వఱకు), సాంఖ్యయోగాధ్యాయమున (61 నుండి 71వ శ్లోకము వఱకు) చెప్పబడిన స్థితప్రజ్ఞునకును భేదము లేదు. సంపూర్ణవైరాగ్య (పరవైరాగ్య)ము కలిగి భక్తిమార్గమునం దనేకావస్థలను గడచిననేగాని పరాభక్తి సిద్ధింపదు. ఇది సాధన క్రమములనెల్ల నతిక్రమించిన సిద్ధావస్థ. సాధకుడగు భక్తుడు సాధనావస్థయందు ధ్యేయముగా నేదైన విగ్రహమును గాని, ప్రతీకమునుగాని యుంచుకొని (ఆలంబనము చేసికొని) సాధన ప్రారంభించినను తుదకు అహంకారాదు లకు నధిష్ఠాన మగు ఆత్మను దర్శించి అనగా: ఆత్మానుసంధానము చేసి జీవబ్రహ్మైక్యస్థితిని పొందినపుడే పరాభక్తి యగు ననియు, అంతకు తక్కువైన స్థితి పరాభక్తి కానేరదనియు చెప్పిరి.

పాతంజల యోగసూత్రములయందు చెప్పినట్లు ఈశ్వర ప్రణిధానము వలన యోగము (సమాధి) సిద్ధించును. ఆయీశ్వర ప్రణిధానము గౌణభక్తియనియు, దానివలన సమాధి సిద్ధించిన పిదప పరాభక్తి సిద్ధించుచున్న దనియు శాండిల్యమహర్షి చెప్పిరి. **సూ॥ గౌణ్యా తు సమాధి స్సిద్ధిః (శాం.భ.సూ. 20).** జ్ఞానులు ఎట్టి సమాధివలన బ్రహ్మజ్ఞానము దృఢమగునని చెప్పిరో ఆ సమాధినే భక్తిమార్గీయులు, పరాభక్తియని చెప్పిరని తెలియుచున్నది. **"స్వస్వరూపానుసంధానం భక్తి రిత్యభిధీయతే"** స్వస్వరూపాను సంధానమే భక్తియని చెప్పిన శ్రీ శంకరులవారి వాక్యమునందలి భావ మిచ్చట సరిపడును.

ఈ పరాభక్తి స్థితియందు సంకల్పము లుదయింపక నిర్వికల్పముగా నుండును. ఇచ్చట అహంకారము నశించి జ్ఞానేచ్ఛాక్రియాశక్తులకు నైక్యము కలిగియుండును. అట్టిస్థితియందున్న భక్తు లహంకార మమకారములు నశించినవారై యుందురు. వారీశ్వర ప్రేరితులై యీశ్వరేచ్ఛానుసారము కర్మల నాచరింతురు. ఈ స్థితియందు భగవంతుడు భక్తుడన్న భేదభావము

Dr K Dayanandaswamy ebooks



నశించి యుండును. ఈభక్తిమార్గమునకును, జ్ఞానమార్గమునకును ఆరంభమున ఆచరణయందు స్వల్పభేద ముండునేగాని ఆదర్శమునందు భేదముండదు. "జీవాత్మయే పరమాత్మయను భావము దృఢమై చిత్కళామాత్ర బ్రహ్మమే యెప్పు డనుభవసిద్ధ మగునో యప్పుడది పరాభక్తి యగును. తత్పూర్వస్థితి ఎన్నడును పరాభక్తి కాజాల"దని నారదభక్తి సూత్రముల వ్యాఖ్యానమునందు చెప్పబడినది. ఇట్టి పరాభక్తి పురుషుని ప్రయత్నమువలనను పరమేశ్వరుని యనుగ్రహమువలనను కలుగును. కొందఱిట్టిస్థితిని పొందినను నచటినుండి క్రింది మెట్టునకు దిగివచ్చి ధ్యాసమాత్ర భేదభావమున ఆనందము ననుభవించు చుందురు. విశిష్టాద్వైతులు చెప్పు 'పరమభక్తి' యీ పరాభక్తికంటె భిన్నము.

## (9) ముఖ్యభక్తి

ముఖ్యభక్తి యనునది భక్తియందలి సాధనము లన్నియు దాటిన పిమ్మట సిద్ధించుచున్నది. అనగా: ఇది సాధనము లన్నింటికిని పర్యవసానమని తాత్పర్యము. ఇదియును పరాభక్తియందు భగవంతునకును, భక్తునకును నభేదమై యుండగా ఇచ్చట నామమాత్ర భేదముండును. ఆ భేదము సహితము కల్పితమే. బ్రహ్మానందానుభవము కొఱ కాభక్తుడే యట్టి భేదమును కల్పించుకొని యుండును. ముఖ్యభక్తికిని, పరాభక్తికిని గల భేదమును నారదమహర్షివంటి మహనీయులేగాని అన్యు లెఱుగరని చెప్పిరి. ఇది అనిర్వచనీయమగు ప్రేమరూప మైనదనియు, "**సూ|| అనిర్వచనీయం ప్రేమ స్వరూపమ్**" (నా.భ.సూ. 51), పరాభక్తి పరమప్రేమరూప మనియు (నా.భ.సూ. 2) నారదభక్తి సూత్రములయందు చెప్పబడినది. దీనిని గీత యేకభక్తియని చెప్పినది.

శ్లో|| **తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే |**
**ప్రియో హి జ్ఞానినోఽ త్యర్థ మహం స చ మమ ప్రియః||**(గీత.7-17)

ఈశ్లోకమునకు పూర్వశ్లోకమునందు (1) ఆర్తుడు, (2) జిజ్ఞాసువు, (3) అర్థార్థి, (4) జ్ఞాని యని నలుగురు నా భక్తులని భగవంతుడు చెప్పెను. నలుగురిలో కడపటివాడగు జ్ఞాని యీ శ్లోకమునందు ముఖ్యభక్తుడుగాను

Dr K Dayanandaswamy ebooks



భగవంతున కత్యంత ప్రియుడుగాను వర్ణింపబడెను. ఈ శ్లోకముయొక్క భావ మేమన నలుగురిలో ముందు చెప్పబడిన ముగ్గురు తమ కోరికలు తీరినంతనే భగవంతుని మఱచుచున్నారని; జ్ఞానియన్ననో భగవంతునికిని తనకును అభేద మగుటవలనను, కోరికలు లేనివాడగుటవలనను నిరంతరము అవిచ్ఛిన్న తైలధారవలె పరమేశ్వరుని నారాధించుచున్నాడు. కనుకనే అతడు నా కత్యంత ప్రియుడని భగవంతుడు చెప్పెను. జ్ఞాని భక్తులకంటె పై వాడనియు, జ్ఞానిని భక్తులలో చేర్చుట భక్తిని గౌరవించుటకే యనియు జ్ఞాననిష్ఠులు చెప్పుదురు.

ఈ ముఖ్యభక్తి గౌణభక్తికంటె నతీతమైనది. నారద ప్రహ్లాదులవలె ఫలాపేక్షా రహితముగ చిత్తము భగవంతు ననుసరించుటయే దీని లక్షణమని చెప్పవచ్చును. ఇదియును పరాభక్తివలె నిర్వచించుటకు సాధ్యము కాదనియే నుడివిరి. అయినను భక్తులు వారి యనుభవములను ఈ క్రింది విధముగ చెప్పిరి :

శ్లో॥ హంసః పద్మవనం సమిచ్ఛతి యథా నీలాంబుదం చాతకః
కోకః కోకనద ప్రియం ప్రతిదినం, చంద్రం చకోరస్తథా ।
చేతో వాంఛతి మామకం పశుపతే చిన్మార్గమృగ్యం విభో
గౌరీనాథ భవత్పదాబ్జయుగళం కైవల్యసౌఖ్యప్రదమ్ ॥

(శివానందలహరి 59)

తా॥ ఓ పరమేశ్వరా! హంస పద్మవనమును, చాతకపక్షి మేఘమును, చక్రవాకపక్షి సూర్యుని, చకోరపక్షి చంద్రుని కోరునట్లు, నిర్గుణబ్రహ్మ ప్రాప్తిని ప్రసాదించునట్టి నీపాద పద్మములను నాచిత్త మెప్పుడును కోరుచున్నది.

తే॥ ఇనుమయస్కాంత సన్నిధి నెట్లు భ్రాంత
మగు, హృషీకేశు సన్నిధి నా విధమున
గరగుచున్నది దైవయోగమున జేసి
బ్రాహ్మణోత్తమ! చిత్తంబు భ్రాంత మగుచు.

Dr K Dayanandaswamy ebooks


ఇనుము అయస్కాంతముకడకు ఎట్లు పోవునో అట్లే భగవంతుని సన్నిధిని తన చిత్తము కరగిపోవుచున్నదని ప్రహ్లాదుడు వచించెను.

## (10) ఏకాంతికభక్తి

దీనినే యేకాంతిక భక్తియనియు ఏకాంత భక్తియనియు పిలుతురు. ఏకాంతభక్తిని గుఱించి నారదభక్తిసూత్ర వ్యాఖ్యానమం దిట్లున్నది. "ఎప్పుడు వృత్తి స్తంభనంబగునో అప్పుడది ఏకాంతభక్తి యగును. ఆస్థితిని పరాభక్తి యనికొందఱును, జ్ఞానంబని కొందఱును వచియింతురు. ఇట్టి నామభేదంబునజేసి స్థితిభేదంబు నూహింపరాదు. ఆస్థితిలోనున్న వానిని జ్ఞానియన్నను భక్తుడన్నను నొక్కటే యగును." (నా.భ.సూ. 6)

**సూ॥ భక్తా ఏకాంతినో ముఖ్యాః॥** (నా.భ.సూ. 67)

**తా॥** ఎవరు కేవల ప్రేమార్థము భగవంతుని ప్రేమింతురో వారు ఏకాంత భక్తులు.

మహాభారత శాంతిపర్వమునందు ఏకాంతికభక్తి, ఏకాంతిక ధర్మములను గుఱించి చెప్పబడినది. అందు శ్వేతద్వీపవాసియగు నారాయణుడు నారదమహర్షికి ప్రత్యక్షమై తన మూలస్వరూపము చూపి భాగవత ధర్మముల నుపదేశించినట్లు చెప్పియుంటిని. ఆయుపదేశమునందు "వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధములను చతుర్విధ వ్యూహములుగా తా నుందుననియు, అందు వాసుదేవుడైన తానే ఆత్మయు, సాక్షియు, క్షేత్రజ్ఞుడును నని తెలిసికొనుటయే యేకాంతికభక్తి యగు ననియు నుపదేశించెను. నారదమహర్షి అహంకార రహితుడును, నేకాంతిక భక్తుడును నగుటవలన నతనికి తన దర్శనము లభించినదని నారాయణుడు చెప్పెను. మఱియు, నిరాహారులు, ఇంద్రియ వ్యాపారములు లేనివారు, నిస్స్వేదులు (చెమట లేనివారు), సుగంధ పరిమళ దేహులు, మౌనము ధరించినవారు, ధ్యాన నిమగ్నులు నగు శ్వేతద్వీప వాసులను నారదమహర్షికి చూపి "వీరు ఏకాంతికులు, వీరు నాకత్యంత ప్రియులు"నని వచించెను.

Dr K Dayanandaswamy ebooks


నారద మహర్షి బదరికాశ్రమమున నున్న నరనారాయణులను కలిసికొన్నప్పుడు ఏకాంతిక భక్తి ప్రసంగమే కలిగెను. ఈ విషయ మిదివఱకే కొంత చెప్పియుంటిని. ఏకాంత భక్తులనగా: సత్త్వ గుణ ప్రధానులును, నిరపేక్షులును, నాత్మారాములును నయియుండు నట్టివారు. వీరు ముక్తినిసైతము కోరరు. "ఏకాంతులెవ్వని నేమియు కోరక భద్రచరిత్రంబు బాడుచుందురు." అని గజేంద్రుడు చెప్పెను. ఇందు జ్ఞాన, జ్ఞేయములను వృత్తి స్తంభించును. ఇంతకంటె తక్కువ స్థితి గౌణభక్తి.

## (11) గౌణభక్తి (అపరాభక్తి)

భక్తిని సాధనావస్థయందు గౌణభక్తి యందురు. దీనినే అపరాభక్తియని యందురు. లోక సామాన్యముచే భక్తియని పిలువబడుచున్న దిదియే. భగవంతుని యెడలగల ప్రేమరూపమైన భక్తియే ముక్తిరూపమనియు, అనుభవరూప మనియు, ఆనందరూపమనియు భక్తిశాస్త్రములు పఠించినట్టి వారును, భక్తులును మాత్రమే యెఱుగుదురు. తదితరు లెఱుగరు. లోకమున సామాన్యులు భక్తియనగా భగవంతుని భజించుట యని మాత్రమే యెఱుగుదురు. భజనమనగా: వేణు, వీణా, తంబుర, మృదంగ, తాళాది జంత్ర సాధనములతో శ్రుతి కలిపి భగవంతుని స్తోత్రరూపమగు కృతులను కీర్తనలను గానము చేయుట. జంత్రవాద్యాదులేవియు లేక కేవలము **"హరే రామ హరే రామ రామ రామ హరే హరే"** అని నామసంకీర్తనము చేయుట, భగవత్కథలను వినుట, వినిపించుట, భగవంతుడు అవతారములయందు జరిపిన దివ్యాద్భుత లీలలు స్మరించుట, ప్రార్థించుట మొదలగునవి భజనములో చేరును. ఇవన్నియు పరాభక్తికి సాధనము లగుటచే నివి అపరాభక్తి యనియు గౌణభక్తియనియు పిలువబడును.

గౌణభక్తి యనగా : గుణములకు సంబంధము గల భక్తియని యర్థము. గుణములనగా: సత్త్వరజస్తమోగుణములు, ఈభక్తి గుణభేదములనుబట్టి మూడు విధములుగను, సంకల్పభేదములను బట్టి మూడు విధములుగను నున్నది. మొదట సాధన మనోగతమై యుండును. మనస్సు వివిధ వాసనలతో చేరియుండును. కనుక మనస్సు సాత్త్వికము, రాజసము, తామసము అని మూడు విధములు. భక్తి ఆయా పురుషుల

Dr K Dayanandaswamy ebooks



వాసనలబట్టి యుండును. సాత్త్వికమగు మనస్సనగా: సత్త్వగుణ మధికముగా కలదని యర్థము. అట్లే రజస్తమోగుణముల నూహించు కొనవలయును. అట్టి సాత్త్వికాది గుణయుతమైన మనస్సునందు ప్రతిఫలించిన భక్తిభావములు సత్త్వాదిగుణ సంబంధమైనవిగా నుండును. తమోగుణ సంబంధమైన భక్తిని తామసభక్తి యందురు. ఇది మూఢాచారములు, మూఢ విశ్వాసములు కలదియై యుండును. సాధ్యసాధక జ్ఞానము సమగ్రముగా నుండదు. రాజసికభక్తి కేవలము స్వప్రయోజనము కొఱకై యుండును. ఇచ్చట సాధ్యసాధక జ్ఞానము కొంతవఱకు మాత్రమే యుండును. సాత్త్వికభక్తికి సాధ్యసాధక జ్ఞానము పూర్ణముగా నుండును. ఇచ్చట స్వార్థమగు కోరికలేవియు నుండవు. భగవంతుని ప్రీతికొఱకై భగవంతు నారాధించును.

సంకల్ప భేదమునుబట్టి భక్తులు నాలుగు విధములుగ నున్నారు.

శ్లో॥ **చతుర్విధా భజంతే మాం జనా స్సుకృతినో ఉర్జున! ।**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ!॥** (గీత. 7-16)

తా॥ అర్జునా! నన్నాశ్రయించు పుణ్యపురుషులు నాలుగువిధములుగ నున్నారు. ఎవరనిన: ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని.*

(1) **ఆర్తుడు** : ప్రాణాపాయ సమయమునందును, తమ శరీరమునకు బాధ కలిగినపుడును, ప్రాణరక్షణమును, బాధానివారణమును కోరునట్టివాడును, ప్రాణముకంటెను ప్రేమాస్పదమగు మానమునకు భంగము కలుగునప్పుడు మానభంగము కాకుండ కాపాడుమని మొఱయిడువాడును ఆర్తుడు. ఇట్టివారు గజేంద్రుడు, ద్రౌపది మొదలగువారు, చోర వ్యాఘ్రాదులచే పీడింపబడిన వారును ఆర్తులే. ఆర్తుడు రజస్తమో గుణము లధికముగా గలవాడైన తనకును తన వారికిని కలిగిన కష్టమును మాత్రమే బాపుమని భగవంతుని కోరును. సత్త్వ గుణము గలవాడైన లోకమునకు కలిగిన కష్టములను బాపుమని భగవంతుని ప్రార్థించును.

* శ్రీ రామానుజాచార్యులవారి భాష్యమున (1) ఆర్తుడు (2) అర్థార్థి (3) జిజ్ఞాసువు (4) జ్ఞాని క్రమమును కూర్చి అందుత్తరోత్తరుల అధికులని వ్రాసి యున్నారు.

Dr K Dayanandaswamy ebooks



(2) **జిజ్ఞాసువు** : భగవంతుని పొందవలెనను నిచ్ఛ లేదా భగవంతుని తెలిసికొనవలయునను ఇచ్ఛ గలవాడు జిజ్ఞాసువు. ఈశ్వర దర్శనము కోరి అన్నపానాదులయందు అపేక్ష లేక యెప్పుడు భగవంతుని దర్శనము లభించునా? యని క్షణ మొక యుగముగా గడపుచు దీనునివలె విలపించువాడు. ఇట్టిది సత్త్వ గుణాధిక్యమువలనను, సాత్త్విక శ్రద్ధవలనను కలుగును. గోపికలు, శ్రీపరాంకుశయోగి, శ్రీరామకృష్ణ పరమహంసగారును ఇట్టి జిజ్ఞాసువులలో చేరుదురు. జిజ్ఞాస తామస భక్తి కలవానియం దుండదు. రాజస భక్తికలవారి యందు కొలదిగా నుండును. సాత్త్వికభక్తి కలవారియందు మాత్రమే తనతో బాటు లోకు లందఱును భగవంతుని తెలిసికొందురు గాక! యను జిజ్ఞాస యుండును.

(3) **అర్థార్థి** : ఇతడు రజస్తమోగుణములతో కూడిన బుద్ధికలవాడై స్వలాభముకొఱకై యర్థము నిమ్మని భగవంతుని కోరును. సాత్త్వికభక్తి కలవాడు లోకుల క్షేమముకొఱకై దేవుని ప్రార్థించును.

(4) **జ్ఞాని** : ఆత్మ జ్ఞానము కలవాడు.

తామసభక్తి కంటె రాజసభక్తియు, దానికంటె సాత్త్విక భక్తియు శ్రేష్ఠము. సాత్త్వికభక్తివలన ఆనందమును, పరాభక్తివలన పరమానందమును కలుగును. సామాన్య జిజ్ఞాసువులు తీరిక కాలమునందు గ్రంథపఠనము చేయుచు, తెలియని విషయములను తెలిసినవారి నడిగి తెలిసికొనుచు, క్రమముగ జ్ఞానాభివృద్ధి చేసికొనుచుందురు. పైన చెప్పిన నలుగురును భక్తులనుటవలన ఒక తండ్రియొక్క నలుగురు పుత్రులలో యోగ్యతయందు తారతమ్య మున్నను నలువురును తండ్రికి ప్రీతిపాత్రు లైనట్లు భగవంతునకు ప్రీతిపాత్రులే యైనను వారిలో జ్ఞాని శ్రేష్ఠుడగుటవలన భగవంతునకు మిక్కిలి ప్రీతిపాత్రుడు. అతడే ముఖ్యభక్తుడు.

గీత యే దృష్టితో ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞానియని నలువురను భక్తులలో చేర్చి వారియందు న్యూనాధిక్యములు కనుబరచినదో, ఆ విధముగనే మఱియొక మెట్టు క్రిందికి దిగి చూచినచో, చదువురాని వాడును, అల్పవిద్య

Dr K Dayanandaswamy ebooks



గలవాడును, నుత్తమ సంస్కారము లేనివాడును నగు నొకవ్యక్తి ఒకఱాతిని తీసికొని దానిపై నొక చెంబెడునీళ్ళు చల్లి ఆఱాతికి పసుపు కుంకుమ బొట్లుపెట్టి, అదియొక దేవతయని భావించి దానియెదుట నొక కోడినో మేకనో నరికి, ఖండితశిరము నాదేవత ముందుంచి దేవత దానిని స్వీకరించినట్లు తృప్తిపడును. విద్యావివేకములు గల మఱియొకడు దేవాలయమును నిర్మించి అందు ఆగమ మంత్రములతో దేవీ విగ్రహమును ప్రతిష్ఠించి (ప్రాణ ప్రతిష్ఠచేసి) ఆ దేవి యెదుట బలి సమర్పించును. ఇంక కొందఱు వారిగృహములయందే విగ్రహమునో, సాలగ్రామమునో పటము (చిత్తరువు)నో పెట్టి ప్రతిదినమును కొంతసేపు పూజించుచున్నారు. ఆ ముువ్వురును తదితర కాలమును దారపుత్రాది సేవయందు గడుపుచుందురు. ఇట్టివా రందఱును భక్తులు కారు. వీరిని ఆస్తికులని మాత్రమే పిలువ వలయును. భగవంతునియందు భక్తునకు నిరంతరము స్మరణ ముండవలయును. ఆస్తికునకు, భక్తునకును తారతమ్యమును చూపుటకు వారిరువురను వేఱు వేఱు నామములతో (ఆస్తికుడు, భక్తుడు అని) పిలువవలయును.

భక్తిమార్గము అతినీచస్థానమగు క్రిందిమెట్టునుండి సాధకుడు భగవంతుని చేరువఱకు అనేక సోపానక్రమమున నున్నది. సోపానముల నన్నింటిని ఎక్కిన పిమ్మటనే నిజమైన భక్తికలిగి భక్తుడు భగవంతుని ప్రేమించుచున్నాడు. జ్ఞాన భూమికలవలెనే భక్తి భూమికలు భక్తిశాస్త్రములయందు చెప్పబడినవి. నారదభక్తి సూత్రములవంటి గ్రంథములనుండి వాటిని తెలిసికొనవలెను. భారతదేశమున అన్నితరగతుల వారికి వారివారి యోగ్యతానుసారమగు భక్తిసాధన విధానమును బోధించిరి. హరిజనులయందు శైవులు, వైష్ణవులు అను రెండు తెగలు గలరు. శైవులు భగవంతుని భజించుట యన్న చిందుత్రొక్కుట (చిందు=శివతాండవము) అందురు. దానితో వారికి ముక్తి కలుగునందురు. ఈ విధముగ నెవరెవ రేయే స్థానమునం దున్నారో వా రాయా స్థానమునం దుండియే వారి వారి యోగ్యతానుసారము తమకు లభించిన సాధనయను కాలిబాటగుండ భక్తియను రాజమార్గమును జేరి అందుండి పయనించి ముక్తిసౌధమును చేరుదురు.

Dr K Dayanandaswamy ebooks



## (12) సకామభక్తునకు ముక్తి కలదా?

భగవంతుని ఏదేని యొక కోరికతో భజియించువాడు రాజస తామసభక్తులలో చేరుచున్నాడు. ఇట్టి వానికి ముక్తి కలదా? యను సంశయము కలుగును. ఏలయన: వీరికి హృదయగ్రంథి విచ్ఛేదము కాలేదు.

అదిగాక, భక్తిశాస్త్రములయందు చెప్పిన విధమున భగవంతుని యెడల శ్రేష్ఠమగు ప్రేమయే గదా భక్తి. కాని యెవరైనను ధనమునో, భార్యనో, విద్యనో గోరి భగవంతుని భజించిన ఎడల నట్టివారికి ధనాదులలోనే యొకదానియందే ప్రేమ కలదని భగవంతునియెడల ప్రేమ లేనేలేదని చెప్పుటకు వీలులేదు. అది లోకానుభవమునకు సరిపోవుట లేదు. ఎట్లన: బాలుడొకడు వాని తల్లిని మిఠాయి నిమ్మని కోరును. తల్లి మిఠాయి నివ్వకున్న వాడేడ్చును. తల్లి వానికి మిఠాయి నొసగిన సంతసించును. వానికి ప్రేమ మిఠాయియెడల మాత్రమే కలదని తల్లియెడల ప్రేమలేదని చెప్పవచ్చునా? అట్లే భగవంతుని ధనము నిమ్మని కోరినవాడు ధనమును ప్రేమించినవాడైనను, భగవంతుని సహితము ప్రేమించియే యున్నాడు.

మన యభీష్ట వస్తువు నెవరినుండి పొందుచున్నామో, వారు మనము ప్రేమించిన దానిని మనకు లభింపజేయుటకు సాధనభూతు లగుటవలన వారినికూడ ప్రేమింతుము. అభీష్ట పదార్థమునందున్న ప్రేమ దానిని సాధించు సాధనములయందును నుండును. భార్య సుఖసాధనము గనుక సుఖమునే ప్రేమించినను సుఖసాధనమగు భార్యనుకూడ ప్రేమింతుము. అందువలననే గీతయందు (గీత. 7-16) అర్థార్థి సహితము భక్తులలో చేర్చి చెప్పబడెను. కాని సకాము డుత్తమభక్తుడు కాడు. ఏలయన: వాడు కోరిక తీరినంతనే భగవంతుని మఱచిపోవచ్చును.

కొందఱు మొదట సకాములై యుండి పిమ్మట నిష్కామ భక్తు లగుదురు. పూర్వము కర్దమ ప్రజాపతి భార్యను గోరి తపమాచరించెను. విష్ణుదేవుడు ప్రసన్నుడై "స్వాయంభువుని కుమార్తెయగు దేవహూతి భార్య యగుననియు, మీ దంపతులకు నేను కపిలుడను నామమున పుత్రుడనై జన్మింతు" ననియు వరమిచ్చెను. ఆ విధముగనే జరిగెను. కపిలమహర్షి తల్లిదండ్రులకు తత్త్వోపదేశము చేసి వారిని సంసారమునుండి తరింప జేసినట్లు భాగవతమునందు గలదు.

Dr K Dayanandaswamy ebooks


శ్రీమదాంధ్ర భాగవతమునందలి చిత్రకేతూపాఖ్యానమున ఇట్లు చెప్పబడినది : "విషయకాములేని నిన్ను సేవించినవారు వేచిన విత్తనంబునుంబోలె దేహాంతరోత్పత్తి నొందకుండుదురు." ఇట్లు చెప్పుటకు కారణమేమన: మొదట సకాములైన భక్తులు క్రమముగ భగవదను గ్రహముచేత నిష్కాము లగుదురు. నిష్కామత్వము సిద్ధింపగనే ముక్తియును సిద్ధించును. ఈయర్థమును తెలుపునట్టి వాక్యములు శ్రీమదాంధ్ర భాగవతమునందలి ధ్రువోపాఖ్యానమునను గలవు. ధ్రువుడు భగవంతుని స్తుతించుచు నిట్లు చెప్పెను. "సకాములైన దీనులను, గోవు వత్సంబును స్తన్యపానంబు చేయించుచు వృకాది భయంబువలన రక్షించు చందంబునం గామప్రదుండవై సంసారభయంబువలనం బాపుదువు." అనగా: గోవు దూడకు పాలనిచ్చి పోషించుటయును, తోడేలు మొదలగు వాటినుండి రక్షించుటయునను రెండు విధములగు లాభములను చేకూర్చునట్లు భగవంతుడు భక్తుల కోరికల నిచ్చుటయేగాక వారిని నిష్కాములుగ చేసి ముక్తి నొసంగునని యర్థము. ధ్రువుడును మొదట తండ్రి యంకపీఠము నెక్క సంకల్పమున తపమాచరించెను. భగవంతుడు ప్రత్యక్షమై వరము కోరుమనిన నేమియును కోరక పోయెను. భగవంతు డాతని మనోగతము నెఱిగియున్నందున నున్నతపథంబును, రాజ్యప్రాప్తియు, తర్వాత కైవల్యమును కలుగునని వరముల నిచ్చి తిరోహితుడయ్యెను. పిమ్మట ధ్రువుడు "నేను ముక్తిని కోరనైతినే" యని చింతించెను.

భాగవత పురాణమందలి ధ్రువుని చరిత్రవంటిదే శివపురాణమునందు ఉపమన్యుని కథ కలదు. దాని నిచట సంగ్రహముగ తెలిపెదను. ఐదేండ్ల వయస్సుగల యుపమన్యుడను మునికుమారుడు తల్లితో మేనమామల యింటికిపోయి, అందు కొంత కాలముండి తిరిగి స్వగృహమున కరుదెంచెను. ఆ బాలుడు త్రాగుటకు పాలనిమ్మని తల్లిని కోరెను. తల్లి రాగిపిండిని నీటిలో కలిపి యివ్వగా బాలుడు దానిని చూచి "అమ్మా! యివి పాలు కావు; నన్నిట్లు మోసగించెదవా?"యని యనెను. అతని తల్లి "నాయనా! నీవు మేనమామల యింట పాలు త్రాగితివి. ఇచ్చట మనకు గోవులు లేవు. పాలు లేవు. నేను పాలనెట్లు తేగలను? నీకు పాలు కావలెనేని

Dr K Dayanandaswamy ebooks



లోకనాథుడైన శివుని ప్రార్థింపుము. ఆయన అనుగ్రహించి మనకు ధనము, గోవులు ప్రసాదించిన పాలు లభించు"ననెను.

ఉపమన్యుడు శివునిగుఱించి తపస్సుచేయుటకు నిశ్చయించెను. తల్లి తపమునకు అనుజ్ఞ నిచ్చి శివపంచాక్షరీ మంత్రము నుపదేశించి పంపెను. ఉపమన్యుడు గొప్ప తపస్సుచేసెను. శివుడనుగ్రహించి యతనిని పరీక్షించుటకు ఇంద్రుని రూపమున ప్రత్యక్షమై వరముల నిచ్చెద కోఱుకొమ్మనెను. ఉపమన్యుడు కృత్రిమేంద్రుడు శివుడని యెఱుగక "నేను శివునివలన తప్ప నితరులవలన త్రైలోకాధిపత్యము నైనను గైకొన"నని నిరాకరించెను. శివుడతనికి తన నిజస్వరూపమును చూపి క్షీరసాగర మాతని ఆశ్రమమున నుండునట్లును, కల్పాంతము వఱకును జీవించి యనంతరము తనసన్నిధి చేరునట్లును ననేక వరముల నిచ్చెను. ఏ విధముచేతనైనను భక్తి కలిగెనేని యది క్రమముగా వృద్ధియై ముక్తిని కలిగించును.

## (13) భక్తిభావము బహువిధములు

శ్లో॥ శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్ ॥*
(భాగవతము, సప్తమస్కంధము)

తా॥ శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మార్పణము అను నీ తొమ్మిదియును భక్తిమార్గములు అని ప్రహ్లాదుడు చెప్పెను. ఈ తొమ్మిది విధములగు భక్తి మార్గములయం దేదియైనను భక్తుని భగవంతుని సన్నిధికి చేర్చునని భక్తుల మతము.

---

*పై శ్లోకమునకు పోతనకవిగారి స్వేచ్ఛానువాదము.

మ॥ తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీతొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు-దలతున్ సత్యంబు దైత్యోత్తమా!

Dr.K.Dayanandaswamy ebooks

శ్లో॥ నాలం వా సకృదేవ దేవ భవతస్సేవా నతిర్వా నుతిః
పూజా వా స్మరణం కథాశ్రవణ మప్యాలోకనం మాదృశామ్।
స్వామిన్న స్థిరదేవతానుసరణాయాసేన కిం లభ్యతే
కా వా ముక్తిరితః కుతో భవతి చేత్కిం ప్రార్థనీయం తథా॥
(శివానందలహరి)

తా॥ ఓ మహాదేవా! నీకు కాయికముగా చేయు నమస్కారమేని, వాక్కుతో చేయునట్టి స్తోత్రమేని, పూజయేని, మనస్సులో స్మరించుటయేని, నీ కథలను చెవులతో వినుట యేని, కన్నులతో నీ మూర్తిని జూచుటయేని యొకసారి మాత్రమునకే నావంటివానికి ముక్తిప్రద మగుచుండగా (పై వాటిలో దేనిచేతనో యొకదానిచేత ముక్తి కలుగుచుండగా) అస్థిరమైన యితర దేవతలను భజించుటవలన లాభమేమి?

నారద భక్తిసూత్రములలో భక్తి పదకొండువిధములని చెప్పబడినది. (నా.భ.సూ. 82) అందులో నొక్కొక్క విధమును నొక్కక్కరు విశేషముగ సాధించిరి. భగవద్భక్తి పై పదునొకండు విధములనియే నిర్ధారణ చేయుటకు వీలులేదు. శ్రీరామకృష్ణ పరమహంసగారు పందొమ్మిది విధములగు భక్తిభావముల సాధించిరని తెలియుచున్నది. పరమహంసగారి వాక్యముల నిట నుదాహరింతును. "వివిధములైన పందొమ్మిది భక్తిభావము లొకరియందే వ్యక్తమగుట భక్తి గ్రంథములలో మహాభావమని చెప్పబడియున్నది. వీనిలో నొకదాని నొందుటకే సామాన్యునకు యావజ్జీవము పట్టును. కాని (తన్నుద్దేశించుచు) యీ శరీరమం దాపందొమ్మిది భావములును పూర్తిగా వ్యక్తమైనవి." (రామకృష్ణ లీలామృతము) భక్తి భావము లింకెన్ని విధములైన కావచ్చును.

ఇందులో నేయొకటైనను ముక్తిప్రదమే యని భక్తుల చరిత్రయందు దృష్టాంతములు కలవు. భక్తి యెన్ని విధములైనను కాయిక, వాచిక, మానసికములను త్రివిధములగు భక్తిమార్గములలోనే చేరును.

**వాచికభక్తి** : శ్రీ నంబాడువాన్ అను హరిజన కులమునకు చెందిన భక్తుని చరిత్ర యొక దృష్టాంతము. ఈ మహనీయుడు ప్రతిదినము

Dr K Dayanandaswamy ebooks



తాను నివసించు గ్రామమునకు కొంతదూరమునందున్న యొక వైష్ణవక్షేత్రమునకు పోయి యచ్చట స్వామి యాలయము ముందు నిలిచి స్వామిని మంగళకైశికీ రాగమున సంకీర్తనము చేయుచుండెడివాడు. ఆ విధముగ పది సంవత్సరములు కైంకర్య మొనర్చెను. ఒకనాడు కైంకర్యమునకై పోవుచు త్రోవతప్పి యరణ్యమునకు పోయి యచ్చటనొక బ్రహ్మరాక్షసునకు చిక్కెను. ఆరాక్షసు డాభక్తుని భక్షించుటకు సిద్ధపడగ బ్రహ్మరాక్షసునితో భక్తుడిట్లు చెప్పెను : "నేను భగవంతుని సంకీర్తనము చేయుటకు పోవుచున్నాను; ఆ కార్యము పూర్తిచేసి వచ్చెదను. అప్పుడు నీవు నన్ను భక్షింపవచ్చును. అందుకు నీ వంగీకరింపుము." అందుపై వారిరువురకు కొంత సంభాషణ జరిగిన పిదప బ్రహ్మరాక్షసుడు భక్తుడు కోరినట్లంగీకరించెను.

శ్రీనంబాడువాన్ ఎప్పటివలెనే స్వామిసంకీర్తనము చేసి బ్రహ్మరాక్షసుని కడకు వచ్చి భక్షింపుమని చెప్పెను. బ్రహ్మరాక్షసుడు విస్మితుడై యిట్టి సత్యనిష్ఠయు, దైవభక్తియు లోకమున దుర్లభమని తలచి భక్తుని పాదములపై బడి "నీవు భగవంతుని స్తుతించిన గానఫలములో కొంత నాకు దానమిమ్మని" ప్రార్థించెను. కాని భక్తుడు సంకీర్తనలఫల మనంతమని దానియందు కొంత దాన మివ్వనని చెప్పి, దుఃఖించుచున్న బ్రహ్మరాక్షసునియందు దయగలవాడై "యూరడిలు" మని పలికెను. "ఊరిడిలు" మను మాట వెడలగనే బ్రహ్మరాక్షసుడు శాపవిముక్తి నొంది బ్రాహ్మణుడై భక్తునకు నమస్కరించి బదరి కాశ్రమమునకు తపమునకు పోయెను.*

నాయనార్లలో నొకరగు గోపబాలుడు గోవులను మేపుకొనుచుండెడివాడట. గోవుల నడవికి తోలుకొని పోయి యచట వేణుగానము చేయుచు శివసంకీర్తనము చేయుచుండెడివాడు. అతనికి పరమశివుడు ప్రమథులతో ప్రత్యక్షమై ముక్తి నొసగినట్లు చెప్పెదరు.

---

* "ఆముక్తమాల్యద" యందలి మాలదాసరి కథయందు చెప్పబడిన మాలదాసరియే ఈ నంబాడువాన్ అను హరిజన భక్తుడు.

Dr K Dayanandaswamy ebooks



**దాస్యభక్తి (కాయిక భక్తి) :** దాస్యభక్తికి మొదట పేర్కొనదగిన మహనీయుడు హనుమంతుడు భక్తుడు తాను భగవంతునికి దాసుడనని చెప్పుకొనుటకు సంతోషించును. **"దాసో உహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః"** నేను రాముని దాసుడనని హనుమంతుడు లంకలో ఎలుగెత్తి చాటెను. శ్రీకాంచీపూర్ణులనువారు (శ్రీ తిరుక్కచ్చినంబి) కంచిలో వేంచేసియుండు శ్రీ వరదరాజస్వామివారికి నెల్లప్పుడు వింజామరము వీచుట (ఆలవట్ట కైంకర్యము) చేయుచుండెడివారట. వీరు శ్రీవరదరాజ స్వాములవారికి అంతరంగిక భక్తులని ప్రసిద్ధి. ఆళ్వారులలో నొకరగు శ్రీవిప్రనారాయణులు (తొండరడిప్పొడియాళ్వార్లు) పుష్పవాటికను పెంచి పుష్పముల సేకరించి శ్రీరంగనాథస్వాములవారికి పూలంగి సేవ చేయుచుండెడివారు. ఇట్టివి కాయికభక్తిలో చేరును. నమస్కరించుట కాయికభక్తిలో చేరును.

**మానసికభక్తి** : ఈభక్తులలో మొదట పేర్కొనదగిన మహనీయుడు ప్రహ్లాదుడు.

ఒకానొక భక్తుడు భగవంతుడు సర్వవ్యాపియనియు, సర్వభూత హృదయాంతర్వర్తి యనియు, సర్వదేహములు దేవాలయములనియు, సమస్త ప్రాణులను ప్రేమించుచు ఎవరి కైనను కష్టము కలిగినపు డాదుకొనుచు వారికి ధైర్యము చెప్పుచు సేవచేయుచుండును. అతడు భగవంతుని కైంకర్యమునే చేయుచుంటినని భావించును. అత డూర్ధ్వ పుండ్రములుగాని, తులసిమాలలుగాని, విభూతిగాని, రుద్రాక్షలుగాని ధరింపకుండినను, దేవాలయమునకు వెళ్ళకపోయినను దేవునికి దాసుడే యగును. ఆయన చేయునది భగవత్సేవయే. దీనిలో కాయిక, వాచిక, మానసికములగు భక్తివిధానములు గలవు. కాయిక వాచికములయందు మానసిక భక్తికూడ నుండును. మనస్సు లేనిదే కాయిక భక్తికాని, వాచిక భక్తికాని చేయుటకు సాధ్యము కాదు.

కాని, దక్షిణ దేశమునందు కూలితీసికొని భజన చేయుదురు. వారొప్పుకొన్న కాలపరిమితికంటె ఎక్కువకాలము భజన చేయరు. వీరికి

Dr K Dayanandaswamy ebooks



భక్తిలేదు. అన్ని విధములగు వృత్తులవలెనే అదియును నొక వృత్తిగనే చేయుదురు. ఇచ్చట కాయిక వాచికములు మాత్రమే పనిచేయునుగాని మనస్సు భగవదర్పితము కాదు. ఒప్పుకున్న కాలము కొఱకును, కూలికొఱకును నిరీక్షించుచుందురు. అట్టి వారలలో నొకానొకడు కూలి తీసికొన్నను భక్తిగలవాడై యుండును. మనోవాక్కాయములలో దేనికి ప్రాధాన్య మివ్వబడునో దాని కాపేరు పెట్టబడినది. ఒక్కొక్క రొక్కొక్క విధమగు భక్తివిధానమునకు ప్రాముఖ్య మిచ్చుటవలన భక్తుల యనుభవములను చూచి శాస్త్రకారులు భక్తి భావము లిన్నివిధములని వ్రాసిరి. .

"**సూ॥ పూజాదిష్వనురాగ ఇతి పారాశర్యః**" భగవంతుని పూజించుట మొదలగువానియందలి యనురాగము (కాయికభక్తి) భక్తియని వ్యాసమహర్షి యు, **సూ॥ "కథాదిష్వితి గర్గః"** భగవత్కథాదులను వినుట (చెప్పుట) భక్తి (వాచికభక్తి) యగునని గర్గమహర్షియు; **సూ॥ "ఆత్మరత్యవిరోధేనేతి శాండిల్యః"** ఆత్మానందానుభవమునకు అడ్డు కలుగని విధమున మెలగుటయే భక్తి (మానసికభక్తి) యగునని శ్రీశాండిల్య మహర్షియు చెప్పిరని నారద భక్తిసూత్రములందు (నా.భ.సూ. 16, 17, 18) కలదు.

ఈ భక్తి శాంతమని, తీవ్రమని రెండువిధములు. **శాంతభక్తి యనగా:** భక్తు డేయొడిదుడుకులు లేక నెమ్మదిగా భక్తిమార్గమున పయనించుట. భక్తుడు ప్రశాంతచిత్తమున అంతరంగమునందే భగవంతుని సేవించును.

**తీవ్రభక్తి** : భగవంతుని శీఘ్రముగా పొందవలయునను నావేశముతో తీవ్రభక్తిని సలుపుదురు. అనగా: ఈ దినము భగవంతుడు దర్శనము కానియెడల శూలముతో పొడుచుకొందుననియో, తల బ్రద్దలుకొట్టుకొందు ననియో సంకల్పించి యట్టి కార్యములు చేయబూనుట. వీరశైవమత స్థాపకులగు శ్రీ బసవేశ్వరుల భక్తి ఈ తీవ్రభక్తికి చెందినది. వీరు గొప్పభక్తులు. శాంతభక్తి యత్యుత్తమ మైనదని పెద్దల యభిమతము.

**సఖ్యభక్తి** : భగవంతుడు తమకు మిత్రుడని సేవించుట. శ్రీరామావతారమున గుహుడు, సుగ్రీవుడు, విభీషణుడు; శ్రీకృష్ణావతారమున శ్రీ సుదామాది గోపకులు, ఉద్ధవుడు, అర్జునుడు. ఇతర కాలములయందు

Dr.K.Dayanandaswamy ebooks

సహితము సఖ్యభక్తి గల కొందఱు భక్తులు భగవంతుని స్నేహితునిగా భావించి తమ కష్టములను కోరికలను ప్రార్థనారూపమున విన్నపము చేయుటయు భగవంతుడు ప్రసన్నుడై వారికి తోడ్పడినట్లును గాథలు కొన్నిగలవు.

**వాత్సల్యభక్తి** : పరమేశ్వరుని పుత్రునిగా పొందగోరి ఆయన నుపాసించుట. పూర్వము అదితికశ్యపులు, కౌసల్యా దశరథులు, దేవకీవసుదేవులు, యశోదానందులు భగవంతుడు తమకు పుత్రుడుగా గోరి తపమాచరించి మరుజన్మమున పుత్రునిగా బడయగలిగిరి. ఇది పురాణ ప్రసిద్ధము. ఇటీవల దాదాపు నూరు సంవత్సరముల క్రిందట భగవంతుని పుత్రునిగా పొందగలిగిన యొక మహనీయుని గుఱించి 'శ్రీ రామకృష్ణలీలామృతము' న చెప్పిన యుదంతము నిట సంగ్రముగ చెప్పెదను.

జటాధారియగు నొక సాధువు ఊరూరు దిరుగుచు శ్రీ రామకృష్ణ పరమహంసగారున్న దక్షిణేశ్వరమునకు వచ్చి పరమహంసగారితో పరిచయము కలిగి అచ్చటనే కొంత కాలముండిరి. ఆ సాధువు చిరకాలోపాసనచే శ్రీరామచంద్రుని ప్రత్యక్షము చేసికొని శ్రీరాముని బాలరూపమున తన వెంట నుండునట్లు వరము బడసెను. శ్రీరాముడు బాల విగ్రహరూపముతో నాయన వెంట నుండెను. లోకులకు బాలరాముడు విగ్రహముగా కనబడును. సాధువున కట్లుగాక యతని యిష్టదైవమగు బాలరాముడు (రామలాలా)గా నుండును. జటాధారి బాలరాముని ఎట్లు ప్రేమించియుండెనో యెవ్వరు చెప్పగలరు? రామలాలాకు నిత్యము స్నానము చేయించును, భోజనము పెట్టును. తన ప్రక్కన పరుండబెట్టుకొనును, ఆటలాడుకొనును, అడిగిన వన్నియు తెచ్చియిచ్చును. రేయింబవళ్ళు సాధువునకు బాలరాముని సేవయే. శ్రీ రామకృష్ణ పరమహంసగారితో సహితము బాలరామున కట్టి సంబంధమే యేర్పడెను. భక్తు లేవిధముగ కోరి యుపాసించిన భగవంతు డావిధముగా ననుగ్రహించును.

Dr.K.Dayanandaswamy ebooks

మధురభక్తి : పైన చెప్పిన అన్నింటికంటెను అత్యుత్తమ మైనది మధురభక్తి. దీనినే మధురభావ మందురు. ఇది వైష్ణవ సాధనలలో నగ్ర గణ్య మైనదని చెప్పుదురు. భగవంతుడు తనకు భర్తయని, ఆయనకు తాను భార్యనని భావించి ప్రేమించుటయే దీని యర్థము. దీనికి గోపికల చరిత్రయే నిదర్శనము. గోపికల తరువాత చెప్పదగిన వారు గోదాదేవి (ఆండాళమ్మ)గారు. ఈమె కులమేదియో తల్లిదండ్రు లెవరో తెలియదు. జనకమహారాజునకు సీతాదేవి లభించినట్లు శ్రీ విష్ణుచిత్తులవారికి తులసీవనములో నీమె లభించినది. *శ్రీ పెరియాళ్వారు (విష్ణుచిత్తులు) విల్లిపుత్తూరులో వేంచేసియుండు శ్రీ వటపత్రశాయిస్వామి వారికి సమర్పించుటకు కట్టిన పూలమాలలను పూసెజ్జలో పెట్టియుండగా ఆపూలదండలను గోదాదేవి ధరియించి బావిలో తన నీడను చూచికొని పిమ్మట వాటిని పూలబుట్టలో పెట్టుచుండెను.

ఒకనాడు పెరియాళ్వారది చూచి మిక్కిలి వ్యథగొని యపరాధమును క్షమింపుమని భగవంతుని ప్రార్థించిరి. స్వామి యాళ్వారులకు స్వప్నమున దర్శనమిచ్చి "నీ కుమార్తె ధరించిన పూలమాలలే మాకు మిక్కిలి ప్రీతికరములైనవి. ఇకమీదకూడ నామె ధరించిన పిమ్మటనే మాకు సమర్పింపు" మని అనతిచ్చిరి. అందువలన గోదాదేవిని "చూడిక్కొడుత్తనాచ్చియారు" అని అందురు. (అనగా: చూడి=తన కొప్పున ముడుచుకొని; కొడుత్త నాచ్చియర్= సమర్పించినట్టి అమ్మగారు)

ఈమె భగవంతుని ప్రేమించి భగవంతుని భర్తగా బడయవలయునను సంకల్పము కలిగి, యట్లెవ్వరైన పూర్వము చేసియుండిరాయని యోచించి, గోపికలు శ్రీకృష్ణభగవానుని ప్రేమించి పొందగలిగిరి గదా యని తలచి, గోపికలవలెనే నామెయు తన వేష భాషలను దిద్దుకొని, తాను బ్రాహ్మణులు పెంచిన బిడ్డయను భావమును మఱచి, తానొక గోపికయని భావించెను. గోపికలు మార్గశిర మాసము(ధనుర్మాసము)న నోము నోచిరని (కాత్యాయనీవ్రతము నాచరించిరని) యీమెయు నోము ప్రారంభించి దినమున కొక్క పాశురము (పద్యము) చొప్పున ముప్పది దినములు ముప్పది

* దివ్యసూరి చరితము సర్గ 9. శ్లోకము 8-9.

Dr K Dayanandaswamy ebooks


పాశురములు తమిళభాషయందు ఛందో బద్ధముగ రచియించి ఆ పాశురముల మాలను స్వామికి సమర్పించి మేలుకొలుపు పాడిరి. లోకము లన్నింటిని భగవంతుడు నిద్రనుండి మేల్కొల్పుచుండ నీమె భగవంతునే నిద్ర లేపినది. భగవంతుడు ధరియించి తీసివేసిన తులసి, పుష్పమాలికలను భక్తులు ధరియించుచుండగా ఈమె ధరించి తీసివేసిన పుష్పమాలలను భగవంతుడు మిక్కిలి ప్రీతితో ధరించెను.

ఈమె సమర్పించిన ముప్పది పాశురముల గ్రంథము "తిరుప్పావై" (దివ్యమగు నోము) భక్తులచే మిక్కిలి భక్తితో చూడబడుచున్నది. ఈమె ఒక మాసము వ్రతము నాచరించిన దినములలో భగవంతునకు నైవేద్యము సమర్పించి దినమున కొక్క పర్యాయముమాత్రమే భగవచ్ఛేషమును భుజించుచు భూమిపై బరుండి రంగేశునందే లగ్నమైన హృదయముతో నుండి వ్రతసమాప్తి దినమున గోదాదేవి స్వప్నమున మందస్మిత ముఖారవిందముతో శ్రీరంగనాథస్వామి ప్రత్యక్షమై, 'బాలికా! నీ స్తోత్రము నకును, నీవు ధనుర్మాసమున సలిపిన నోమునకును, అర్చనావిశేషమునకును సంతసించితిని.

శ్లో॥ **త్వత్పాణి గ్రహణం శీఘ్రం కరిష్యామి న సంశయః ।**
**ఇత్యుక్త్వా సర్వ భోగాంశ్చ గోదాయై ప్రదదౌ హరిః ॥**
(ప్రసన్నామృతము 91-88)

తా॥ 'శీఘ్రముగా నిన్ను వివాహ మాడుదును. సంశయము లే'దని పలికి హరి గోదాదేవికి సర్వభోగముల నొసంగెను.

శ్లో॥ **యస్మిన్దినే సర్వభోగాంశ్చ్ గోదా బుభుజే తతః ।**
**భోగీతి నామ తస్యాసీ ద్దివసస్య తదాఽనఘ ॥** (ప్ర.ప్ర. 91-39)

తా॥ ఏ దినమున గోదాదేవికి స్వామి సర్వభోగముల నొసగెనో ఆ దినమునకు 'భోగి' యనుపే రప్పటినుండి కలిగెను.

ఈమె శ్రీరంగమునకు వేంచేసి శ్రీరంగనాథస్వామి వారిని వివాహమాడి అచ్చటనున్న వారందఱు చూచుచుండగా స్వామి పవ్వళించియుండు

Dr K Dayanandaswamy ebooks



శేషశయనము నెక్కి స్వామి పాదములకడ కూర్చుండి యదృశ్య యయ్యెను. స్వామి విల్లిపుత్తూరునకు పోయి అచ్చట వివాహ మాడినట్లు 'ఆముక్త మాల్యద' యందు గలదు. ఈమె సంకల్పశక్తి వర్ణనాతీతము. అట్టి వజ్రసంకల్పము గలవారికి లోకమున నసాధ్యమైన దేది? ఈ మధురభక్తి పురుషులకన్నను స్త్రీలకు నెక్కువ ప్రయోజనకారి. వారికిది సహజముగ నుండును. మానవుని భర్తగా ప్రేమించినట్లే భగవంతుని భర్తగా ప్రేమించుట.

శ్రీరామానుజాచార్యులవా రొక దినమున పెరియనంబిగారి యింటికి భిక్షకు వెళ్ళగా వారి కుమార్తెయగు అత్తుళాయమ్మగారు గోదాదేవిగారి పాశురము పాడుచు వచ్చి తలుపు తెఱచిరట. శ్రీరామానుజాచార్యుల వా రామెను చూచి గోదాదేవియే యని ధ్యానించుచు భక్తిపరవశులై క్రిందపడిపోయిరట. ఈ యైతిహ్యమువలన శ్రీరామానుజాచార్యుల వంటివారికి గోదాదేవియందు గల భక్తి వ్యక్తమగును.

శ్లో॥ స్వోచ్ఛిష్ట మాలికా బంధగంధబంధుర జిష్ణవే ।
విష్ణు చిత్త తనూజాయై గోదాయై నిత్యమంగళమ్ ॥

ఈ మధుర భావమును (భక్తిని) వైదికభక్తి సంప్రదాయమునకు చెందినవారలే గాక అన్యమతములకు చెందిన కన్యలు కొందఱు వారి వారి శక్త్యనుసారము సాధించిరని కొన్ని యైతిహ్యములవలన తెలియుచున్నది. కొందఱు క్రైస్తవ కన్యలు భగవంతుడే తమ భర్తయని భావించి అట్టి భావమునందే యావజ్జీవము గడిపిరనియు, ఒక ముస్లిమ్ కన్యకామణి శ్రీ సంపత్పుత్రులను (రామ ప్రియులను ఉత్సవ విగ్రహమును) ప్రేమించి వారిని తన భర్తగా భావనచేసి కృతార్థురా లాయెననియు చదివియున్నాము (ప్ర.ప.అ. 47, 48). కొందఱు కన్యలు మధురభక్తి కలవారు గాకున్నను పూర్వజన్మ తపఃప్రభావమువలన భగవంతుని సులభముగనే భర్తగా బడయగలిగిరి. ఉదాహరణమునకు: శ్రీ వేంకటరమణస్వామిని పద్మావతీదేవియు, శ్రీ రంగనాథస్వామిని నిచుళాదేవియు వివాహమాడినట్లు.

Dr K Dayanandaswamy ebooks



జి : దేవుడు వివాహ మాడెననియు, భార్యతో కాపురము చేసెననియు చెప్పునట్టి మాటలు అనాగరిత గల మోటుయుగమునకు చెందినవి గావా? తత్త్వవేత్తలు పరిహసించరా?

వే : నీవన్నట్లు దేవునకు భార్య గలదను భావము అజ్ఞానజనితమే. కాని, గోదాదేవి మొదలగువారి వివాహ విషయము తత్త్వవేత్తలు కాదని త్రోసివేయరు. జలము తరంగ మగునట్లు మలినరహితమగు చిత్తమెట్లు భావించిన అట్టి యాకృతి నొందును. చిత్తమేగదా జగద్రూపమున తోచుచున్నది? మొదట ఈశ్వరుడు సృష్టి చేయవలెనని సంకల్పించె ననియు, తదనంతరము సృష్టి గలిగెననియు నుపనిషత్తులనుండి తెలిసికొని యుంటిమి. దానిభావమేమి? ఈశ్వర సంకల్పమే జగద్రూప మైనదిగదా? మానవుని యందలి నిర్మల చిత్తమునకును ఈశ్వర సంకల్పమునకు భేదము లేదు. కనుక గోదాదేవి అమలిన చిత్తమే భగవదాకారము నొంది ఆమెను వివాహ మాడెనని తత్త్వవేత్తలు నమ్ముదురు. ఇక విష్ణుదేవుని అర్చావతారములను గుఱించి ముందు చెప్పినప్పుడు మరికొన్ని విషయములు తెలియగలవు. అప్పుడు నీకు గల సంశయములు తొలగగలవు. మధురభక్తిని గుఱించి యింకను వినుము.

శ్రీకృష్ణ చైతన్యులవారు (గౌరాంగ దేవుడు) ఈ మధురభావమునకు ఎక్కువగా ప్రాముఖ్య మిచ్చిరి. శ్రీలక్ష్మీ నారాయణుల స్థానమున రాధాకృష్ణులను భావించి వారిప్రేమ నాదర్శముగా గైకొనిరి. శ్రీరామకృష్ణ పరమహంసగా రీ మధురభావ భక్తియం దాఱు నెలలు గడిపిరట. వారు తాము రాధననియు శ్రీ కృష్ణుడు తనకొఱకై వచ్చుననియు భావించుచుండెడివారు. స్త్రీ వేషము ధరించెడివారు. ఆళ్వారులలో కొందఱు తాము స్త్రీలుగాను, భగవంతుడు తమ భర్తగాను భావించెడివారు.

ఆళ్వారులలో ముఖ్యులగు పరాంకుశయోగి (నమ్మాళ్వార్లు) ఈ మధురభక్తికి చెందిన భక్తులు. వారు తాము స్త్రీ (నాయిక) ననియు, పెరుమాళ్లు తమ భర్త (నాయకుడు) అనియు భావించి ప్రియుని దర్శనము

Dr K Dayanandaswamy ebooks



లభింపనందున విరహవేదన ననుభవించుచు అచ్చట కనబడిన తుమ్మెదలు, హంసలు, చిలుకలు, కోయిలలు, సారసపక్షులతో తమ ప్రియుడగు తిరువణ్ వణ్డూరులో వేంచేసియున్న స్వామికి సందేశము పంపుచుందురు. ఈ యాళ్వారులు రచియించిన 'తిరువాయిమొళి' దివ్య ప్రబంధమునందలి కొన్ని వాక్యముల నిట నుదాహరింతును. "ఆడు పక్షులతో చేరి యెల్లప్పుడు సుఖించుచున్న ఓ హంసపక్షులారా! తిరువణ్ వణ్డూరులో వేదఘోషమును విని యానందించుచున్న యతిసులభుడైన సర్వేశ్వరుని వద్దకువెళ్ళి ఒక స్త్రీ నీయానందాతిశయముచే గరగుచున్నదని వానిచెవిలో పడవేయుడు. (తిరు 6-1-4) నాదుఃఖమును చెప్పుడు" (తిరు 6-1-2), "నీరక్ష్యకోటిలోచేరి యీపె యిట్లువస్థపడుచున్నదని నన్ను విన్నవించుడి" (తిరు. 6-1-10), "శ్రీ భూనీళాదేవులకు నాకును ప్రాణనాథా!" (తిరు. 7-2-9).

## (14) గోపికల భక్తి

విష్ణుభక్తిని గుఱించి చెప్పవలసి వచ్చినపుడు గోపికల ప్రసక్తి రాకమానదు. విష్ణుభక్తిని బోధించు విష్ణుపురాణము, భాగవతపురాణము, హరివంశము, నారదభక్తి సూత్రములు.* శాండిల్య భక్తిసూత్రములు**. ఆళ్వార్లు, ఆచార్యులు మొదలగు భక్తులు భక్తిని గుఱించి వ్రాసిన దివ్యప్రబంధములు మొదలగు గ్రంథములయందు గోపికల చరిత్రకు అత్యంత ప్రాముఖ్య మీయబడినది. ఈ గోపిక లెవ్వరు? పూర్వజన్మమున అత్యంత విశుద్ధ చరిత్రులును, భగవద్భక్తులును నైయుండిరని చెప్పుటకు సంశయము లేదు. గోపాలతాపిన్యుపనిషత్తునందు శ్రుతులు గోపికలుగా జన్మించిరని చెప్పబడెను.*** శ్రుతులకు శరీరముగాని కర్మబంధముగాని లేనందున జన్మము కలుగుననుట దురూహ్యము. ఇచ్చట 'శ్రుతులు' అని

---

* సూ॥ యథా వ్రజగోపికానామ్. (నా.భ.సూ. 21)

** సూ॥ అత ఏవ తదభావా ద్వల్లవీనామ్ (శాం.భ.సూ. 1, 2, 14)

*** కృష్ణాత్మకా జగత్కర్త్రీ మూల ప్రకృతి రుక్మిణీ, వ్రజస్త్రీ జనసంభూత శ్రుతిభ్యో బ్రహ్మసంగతః.

Dr K Dayanandaswamy ebooks

చెప్పుటవలన శ్రుతులు వినిన జ్ఞానసంపన్నులగు ఋషులని మన మర్థము చేసికొన్నచో సరిపోవును. "గాయత్రీ ఛందసా మహం" (గీ. 10-35) అని గీత కొనియాడ గాయత్రి "గాయత్రీ ఛందసాం మాతా" అని ప్రసిద్ధి కలదు గనుక అట్టి వేదమాతయగు గాయత్రి ఒక గోపబాలిక. ఆమెను బ్రహ్మ వివాహ మాడెనని యొక కథ గలదు. ఈ రెండింటియొక్క యంతరార్థమేమో తత్త్వజ్ఞులు విచారింపవలెను.

శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సహితుండై వనవాసమునం దున్నప్పు డచ్చట నున్న తపస్సంపన్నులగు మునులు సర్వాంగసుందరుడగు శ్రీరామచంద్రుని సుందరరూపమును చూచి విస్మితులై యాయన నాలింగనము చేసికొనవలెనని కోర్కె గలవారై వారి వాంఛితమును శ్రీరామునకు తెలియజేసిరి. శ్రీరామచంద్రుడు వారలతో 'ఈ యవతారమందు మీకోరిక తీర్పజాలనని కృష్ణావతారమున మీరు గోపికలై పుట్టినప్పుడు నాయాలింగన సౌఖ్యము మీకబ్బు'నని చెప్పియున్నందున ఆ ఋషులే గోపికలై పుట్టిరని కృష్ణోపనిషత్తు** చెప్పుచున్నది. ఇందువలన గోపాలతాపిన్యుపనిషత్తు చెప్పిన శ్రుతులును, ఈ ఋషులును నొక్కటియే యని మన మర్థము చేసికొనవచ్చును. గోలోకము నందున్న గోపికలే యీ లోకమున గోపికలై జన్మించిరని బ్రహ్మవైవర్త పురాణము చెప్పినది.

గోపికలు వారి పూర్వజన్మ పుణ్యసంస్కార బలమున శ్రీకృష్ణుడు పరమేశ్వరుడని శాస్త్రములయొక్కగాని, గురువులయొక్క సహాయముగాని లేకయే తెలిసికొనిరి. శ్రీకృష్ణభగవాను డొక శరద్రాత్రివేళ కాళిందీతీరమున నుండి వేణుగానము చేసి గోపికల చిత్తములు తన వైపునకు మరలునట్లు ప్రేరేపించెను. వేణుగానాకర్ణనముచే వారి చిత్తములయందు దాగియున్న

---

** ఓం శ్రీ మహావిష్ణు సచ్చిదానంద లక్షణం రామచంద్రం
దృష్ట్వా సర్వాంగ సుందరం మునయో వనవాసినో విస్మితా
బభూవు స్తం హోచుర్నో ఒనద్య మనతారా న్వైగణ్యంతే
ఆలింగామో భవంతమితి, భవాంతకే కృష్ణావతారే యూయుం
గోపికా భూత్వా మామాలింగథ. (కృష్ణోపనిషత్తు)
ఈ విషయము కొన్ని పురాణములయందును గలదు.

 Dr K Dayanandaswamy ebooks

పూర్వవాసనలు బహిర్గతము లయ్యెను. దానితో వారికి శ్రీకృష్ణుడు పరమేశ్వరుడన్న జ్ఞానముకూడ జనించెను. ఆ రాత్రివేళ తన కడకు వచ్చిన గోపికల చిత్తములను పరీక్షించుటకు భగవంతుడు ధర్మోపదేశము చేసినపుడు గోపికలు భగవానున కిచ్చిన సమాధానమునందు వారి భావము స్పష్టమయినది. ఎట్లన:

**"పతి పుత్రాదిక నామమూర్తి వగుచున్ భాసించు నీ యందు త**
**త్పతి పుత్రాదిక వాంఛలన్ సలిపి సంభావించు టన్యాయమే."**

పతిపుత్రాది సమస్త రూపములు నీవే, నీవు కాని దీప్రపంచమున నొక పరమాణువైనను లేదు. సమస్తరూపుడవగు నీయందు సమస్త పదార్థములయందు గల ప్రేమను ఏకముచేసి యట్టి ప్రేమను నీయందే నిలుపుట యన్యాయ మెట్లగును? అని తాత్పర్యము. **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** - సర్వమును బ్రహ్మమే. **"నేహ నానాస్తి కించన"** - ఇతరమైన దేదియును లేదని జ్ఞాననిష్ఠు లెట్టి యనుభూతిని పొందిరో, గోపికలును అట్టి యనుభూతినే పొందిరి. అనగా: సర్వమును శ్రీకృష్ణ మయముగా చూచిరి. ఈ సమాధానము వలననేగాక గోపికాగీతలయందును భ్రమరగీతలయందును శ్రీ కృష్ణుడు ప్రాకృతమానవుడు కాడని పరంధాముడని స్పష్టపరచిరి.

దారుకా వనమునందలి మునిపత్నులు శివుని మాయికమగు యౌవన సుందర సుకుమార రూపమును చూచి ముగ్ధలై కామించి శివునివలన దేహసౌఖ్యమును పొందిరి. కాని వారాపురుషుడు జగదధీశ్వరుడగు శివుడని యెఱుగరు* మునిపత్నులకును, గోపికలకును గల భేదమిది. విష్ణు పురాణము నందు గోపికలు, శ్రీకృష్ణుడు భగవంతుడని యెఱుగకుండినను ముక్తలైరని చెప్పబడినది. శ్రీకృష్ణుడు జారుడన్న భావమే గోపికలకుండెగాని పరబ్రహ్మమని వారెఱుగరని, అట్టివారు ముక్తి యెట్లు పొందిరని పరీక్షన్మహారాజడిగిన ప్రశ్నకు శుకమహర్షి యిచ్చిన సమాధానమిది.

---

* దారుకా వనమునందలి శివలీలలు ఆంధ్ర శివపురాణము లింగ వైభవ ఖండమునను, ఆంధ్ర వామన పురాణము పంచమస్కంధమునను చూడవచ్చును.

Dr K Dayanandaswamy ebooks

మ॥ మును నేజెప్పితి జక్రికిన్ బగతుడై మూఢుండు చైద్యుండు పెం
పున గైవల్య పదంబు నొందె బ్రియులై పొందంగ రాకున్న దే
యనఘుం డవ్యయు డప్రమేయు డగుణుం డైనట్టి గోవింద మూ
ర్తి నరశ్రేణికి ముక్తిదాయిని సుమీ తెల్లంబు భూవల్లభా!
(భాగ-ద-పూ-971)

తా॥ ఓ రాజా! మూఢుడగు శిశుపాలుడు భగవంతుని శత్రువై యుండియు కైవల్యమును బొందియుండగా ప్రియురాండ్రగు గోపికలకు కైవల్య మేల కలుగదు? గోవిందుని రూపముతో నెవరి కెట్టిసంబంధ మున్నను వారందఱు ముక్తు లగుదురని చెప్పెను.

శ్రీకృష్ణుడు సర్వేశ్వరుడని గోపికలకు తెలియక పోయినను ముక్తలైరని చెప్పుటలో గల యాంతర్య మేమన, భగవంతునితో నెవరి కెట్టి సంబంధము కలిగినను వారికది ముక్తిని కలిగించునని తెలుపుటకే అట్లు శుకమహర్షి చెప్పెను గాని, గోపికలకు శ్రీకృష్ణుడు భగవంతుడని తెలియునా? తెలియదా? అను ప్రశ్నకు తెలియదని చెప్పిన సమాధానము కాదది. శ్రీకృష్ణుడు భగవంతుడే అప్పుడప్పు డవతరించు చుండెనని గోపికలకు తెలిసియున్నట్లు ప్రమాణము :

శ్లో॥ న ఖలు గోపికా నందనో భవా
న్నఖిల దేహినాం అంతరాత్మదృక్ ॥ (గోపికాగీతలు)

తా॥ కృష్ణా! నీవు యశోదానందనుడవు కావు. సమస్త ప్రాణుల యందును అంతరాత్మవై సాక్షిరూపమున నున్నావు-

అని చెప్పినందున వా రాత్మ స్వరూపము నెఱిగిరనియు, సర్వాంతరాత్ముండగు సాక్షియే కృష్ణ పరమాత్మయని వారి నిశ్చయమనియు తెలియుచుండుట లేదా? ఇట్టి ప్రమాణము లెన్నియో గలవు.

గోపికల చిత్తమునందు గోవిందుని మూర్తి హత్తుకొనియున్నది. మనస్సు లక్కవంటిది. లక్కకు నిప్పుసెగ సోకినప్పుడు ద్రవించును. ఆ సమయమున మనమేదేని యొక ముద్రను దానిపై నుంచిన నది యటే యుండును. కరగిన లక్క తిరిగి స్వాభావిక స్థితినొందును (గట్టిపడు

Dr K Dayanandaswamy ebooks

అట్లే కామము క్రోధము, భయము, స్నేహము, హర్షము, శోకము మొదలగు వాటిచే మనస్సుద్దీప్తమయినను అవి లేని సమయమున మనస్సు ఎప్పటివలె కఠినమగును. మనస్సు ద్రవించిన సమయమున విషయము మనసులో ప్రవేశించి సంస్కార రూపమున నచట స్థిరమగుచున్నది. దానిని స్థాయిభావమని చెప్పుదురు. గోపికల చిత్తమునందు గోవిందుని మూర్తి స్థాయిభావము నొందియున్నది. గోపికలు నడుచుచున్నను. కూర్చున్నను, పాలు పితుకుచున్నను, పెరుగు చిలుకుచున్నను కృష్ణభక్తి ప్రపూర్ణ హృదయములతో చిత్తము గోవిందుని యందే లగ్నమైయుండ, కృష్ణ సంకీర్తనము చేయుచు, తీరిక కలిగినపు డేకాంతమున కృష్ణలీలలను నటించుచు, బాలకృష్ణుని చేష్టలు చెప్పుకొనుచు, సర్వమును కృష్ణమయముగా చూచుచు, శ్రీకృష్ణ దర్శన స్పర్శనాదులవలన పరమానందముచే మైమఱచుచు, దినమొక క్షణమువలె గడిపిన గోపికలయొక్క పరమాద్భుత లీలలే తరువాత భక్తకోటికి నుత్తేజనమును కలిగించినవి.

గోపికల బృందావన లీలలు నింబార్క, జయదేవ, గౌరాంగ, వల్లభాచార్యాదుల మతముల కంకురార్పణ చేసినవని పెద్దలు చెప్పిరి.

గోపికాగీతలు, భ్రమరగీతలు విని యానందాశ్రువులు విడువనివారు భక్తులు కానేరరు. శ్రీ రామకృష్ణ పరమహంస గోపికా కృష్ణలీలలు వినినంతనే తన్మయత్వముచేత సమాధిస్థితి నొందెడివారట.

భగవానుడొక శరద్రాత్రియందు కాళిందీ తటమున నుండి వేణుగాన మొనర్చెను. అప్పుడు కొందఱు గోపికలు ఇంటిలోనివారు వలదన్నను వినక భగవానుని కొఱకై పరుగిడిపోయిరి. మఱికొందఱు ఇంటిలో నిర్బంధింప బడుటచే పోలేకపోయిరి. భగవద్విరహముచే భగవన్మూర్తిని చిత్తమున నిలిపి దేహమును వదలి ముక్తలైరి.

**మ॥ తరుణుల్ గొందఱు మూలగేహముల నుద్దండించి రారాక త**
**ద్విరహాగ్నిం బరితాప మొందుచు మనోవీథిన్ విభున్ మాధవుం**
**బరిరంభంబులు సేసి జారుడనుచున్ భావించియుం జొక్కి పొం**
**దిరి ముక్తిన్ గుణదేహమున్ విడిచి ప్రీతిన్ బంధ నిర్ముక్తలై.**

(శ్రీ ఆం.భా.గ.దశ. 967)

Dr K Dayanandaswamy ebooks



గోపికలు నిర్బంధింపబడినపుడు, తమ హృదయము నందున్న మూర్తిని చూచి యానందభరితలై తన్మయలైరి. ఆయానందమే యతిశయమై పరమానందము పరమ ప్రేమరూపమై భాసించెను. అద్వైత వేదాంతము నందు చెప్పబడిన తురీయాతీతావస్థకును దీనికిని భేదము లేదు. ఆయవస్థయం దెక్కువ కాలమున్న యెడల శరీరము నిలువదు. కనుకనే వారు గుణమయ దేహములను వదలిరి. అనగా లింగదేహమున నశించి పరమాత్మలో ఐక్యమైరి. ఇది మహాయోగులకైనను దుర్లభమగు సద్యోముక్తి. ఇతర గోపికలు వారి జీవితకాలమున శ్రీకృష్ణోపదేశము ననుసరించి సర్వమును బ్రహ్మమయముగా చూచి ముక్తలైరి.

**శ్లో॥ "వందే నంద వ్రజ స్త్రీణాం పాదరేణు మభీక్ష్ణశః।**
**యాసాం హరికథోద్గీతా పునాతి భువనత్రయమ్॥"**

తా॥ ఎవరి కథలు హరికథలుగా గానము చేయబడుచు మూడు లోకములను పావనము చేయుచున్నవో యట్టి గోపికల పాదరేణువులకు నమస్కారము.

జి : బ్రహ్మదేవుడు గోపబాలికను వివాహ మాడెనని చెప్పితిరి. ఆ వివాహ మెట్లు జరిగెనో అనుగ్రహించి తెలుపుడు.

వే : గాయత్రి కథనము : ఒకప్పుడు బ్రహ్మదేవుడు భూలోకమున యజ్ఞము చేయదలచి దానికి కావలసిన ఋత్విగ్గణంబులు రా సంకల్పించి విశ్వకర్మచేత యజ్ఞమంటపంబు నిర్మింపజేసెను. యజ్ఞమునకు దేవతలు, ఋషులు, బ్రాహ్మణులు వచ్చిరి. చతుర్ముఖుని ధర్మపత్నియగు సావిత్రిని పిలువనంపిన నామె రాలేదు. బ్రహ్మ సావిత్రిపై కోపముగొని చెంతనున్న దేవేంద్రుని చూచి 'నీవు శీఘ్రముగ నేగి యొక కన్యను తీసికొని రమ్ము. నే నామెను పత్నిగా గైకొందు'నని చెప్పెను. ఇంద్రుడొక పట్టణమున కేగి అందు కన్నులకు విభ్రమంబు గొలుపుచు తలపై తట్ట నిడుకొని పాలు, పెరుగు, వెన్న నమ్ముచు వీథియందు తిరుగుచుండు గాయత్రి యనునొక గోపకన్యను గాంచి యామెను బలవంతముగ దెచ్చి బ్రహ్మ కర్పించెను. బ్రహ్మదేవు డామెను చూచి సంతుష్టు డయ్యెను. ఆమెయు బ్రహ్మను చూచి మోహించెను. అంత విష్ణుదేవుడు కన్యాదాతగా నా కన్యను బ్రహ్మ

Dr K Dayanandaswamy ebooks



కొసగెను. బ్రహ్మ గాయత్రిని వివాహమాడి యజ్ఞదీక్ష గైకొనెను. దేవేంద్రుడు బలవంతముగ కన్య నపహరించిన సంగతి యా కన్య తల్లిదండ్రులకు తెలిసి గోపకు లెల్లరు కోపోద్దీపితులై దుఃఖముతో కుమారిని వెదకుచు యజ్ఞశాలను జొచ్చి యజమాని తోడ యజ్ఞదీక్షను గైకొన్న గాయత్రి వేషమును చూచి ఆమెను తమ వెంట రమ్మని పిలిచిరి. అప్పుడు విష్ణుదేవుడు గోపకులకు తన్నెఱిగించుకొని,

సీ॥గోపకులార! మీ కోప శోకంబుల
జల్లార్చికొని శాంతి సంఘటిల్ల
నాలకింపుండు నా వ్యవహారములను మీ
క్షేమంబు వాంఛించి చెప్పుచుంటి
నను మీ రెఱుంగరు నారాయణుడ నేను
పోషించువాడను భువనములను
సకల ప్రపంచ సృష్టికరుండగు విధాత
కొనియె మీ పిల్లను దనకు సతిగ

గీ॥ నామె చేసిన పూర్వ పుణ్యంబువలన
నామెకు లభించె భర్తగా నబ్జసూతి
యామె కతమున బావనమయ్యె గోప
వంశ మెల్లను మీ రేల వగవ నింక?

గీ॥ అనుడు నా గోపులెల్ల నాహ్లాదమొంది
స్వామి నీ వస్మదీయ వంశంబునందు
ప్రభవ మొందెడు నట్లు వరంబొసంగు
మనుటయును నట్లె వరమిచ్చె నచ్యుతుండు.*

(శ్రీమదాంధ్ర పద్మపురాణము /సృష్టిఖండము)-

---

* నారాయణదేవుడు గోపకులమున జన్మించునని చెప్పిన విషయము మూలమునం దిట్లున్నది.

శ్లో॥ యుష్మాకం చ కులేచాపి దేవకార్యార్థ సిద్ధయే ।
అవతారం కరిష్యే> హం సా క్రీడా త్వ్యభవిష్యతి ॥

శ్లో॥ యదానంద ప్రభృతయో హ్యవతారం ధరాతలే ।
కరిష్యంతి తదా చాహం వసిష్యేతేషు మధ్యతః ॥(పద్మపురాణము, సృష్టి ఖండము)

Dr K Dayanandaswamy ebooks



అనంతరము సావిత్రీదేవి అచ్చటి కరుదెంచి జరిగిన సంగతి గ్రహించి అచ్చటనున్న దేవతలు తన్నవమానపరచిరని వారిని శపించెను. శాపతప్తులగు దేవతలకు గాయత్రీదేవి వరములిచ్చి వారి నోదార్చెను.

## (15) శబరి

**జి :** శబరి భక్తురాలని చెప్పుదురు. ఆమె చరిత్ర యెట్టిది?

**వే :** శబరి భక్తురాలు. ఆమెభక్తి గోపికల మధుర భక్తి వంటిదికాదు. శబరి అనగా: శబరజాతి స్త్రీయని అర్థము. శబరులన బోయవారు (వాల్మీకీయులు). వాల్మీక మహర్షి శబరిని కులనామముతోనే పిలిచెను. శ్రీమద్రామాయణమున అరణ్యాకాండమునం దీమె కథ కలదు. వాల్మీకి మహర్షి యీమెను శ్రమణియని పేర్కొనెను. శ్రమణి** అనగా:- అవివాహితగా కుటుంబ లాంపట్యము లేక బ్రహ్మచర్యము నవలంబించి విరక్తురాలై తపస్సు చేయుచుండు స్త్రీ యని యర్థము. ఈమె తపస్విని, సిద్ధులకు సమ్మతమైన సిద్ధురాలు*** అద్భుత తపోనిధులగు మతంగ మహామునుల శుశ్రూషయందే జీవితమంతయు గడిపి వృద్ధురాలైనది.

సీతాదేవిని వెదకుచు రామలక్ష్మణులు కబంధుడు చెప్పినట్లు శబరి యాశ్రమమునకు వచ్చిరి. శబరి వారి నెదుర్కొని యాశ్రమమునకు తోడ్తెచ్చి వారి పాదములను కడిగి పుష్పములతో పూజించెను. కుశలప్రశ్నానంతర మాశ్రమము నందలి వింతలను రామలక్ష్మణులకు చూపించెను. వారికి చేయవలసిన సత్కారము లన్నియు చేసిన పిమ్మట శ్రీరామునితో నిట్లనెను. "స్వామీ, నేను మతంగ మహామునులకు శుశ్రూష చేయుచుండిన దానను. వారు దివికేగునపుడు వారలవలన మీరు చిత్రకూటమునం దున్నారని, మీ తమ్మునితోకూడ నిచ్చటికి రాగలరని, మీ దర్శనమున అక్షయమగు పుణ్య లోకములు కలుగునని చెప్పిపోయిరి. అప్పటినుండి మీయాగమనమును నిరీక్షించుచున్నాను. ఈ వనమునందు

---

** శ్రమణీం సంశ్రిత వ్రతామ్. (శ్రీమద్రా.సర్గ. 74-7)

*** సా సిద్ధా సిద్ధసమ్మతా. (శ్రీమద్రా. సర్గ. 74-10)

Dr K Dayanandaswamy ebooks



తిరిగి రుచ్యములగు వన్యఫలములను తెచ్చియున్నాను. ఆరగింపు"డని ఫలముల సమర్పించినది. ఆమె భక్తికి శ్రీరామలక్ష్మణులు విస్మితులైరి.

జి : అయ్యా! మును లనేకులు శ్రీరామచంద్రునకు ఆతిథ్య మిచ్చిరి. వారందఱకు లేని గొప్పతనము శబరి కెందులకు కలిగినది? భక్తుల చరిత్రలో శబరి కింతటి యాధిక్య మెట్లు వచ్చినది?

వే : శ్రీరామచంద్రుడు చిత్రకూటమునం దున్నాడని వినినది మొద లాయనరాకకై ప్రతిదినము నిరీక్షించుచు ఎప్పుడిచ్చటికి వచ్చునో, యెట్లాతిథ్య మీయవలెనో యని యత్యంత భక్తితో నరణ్యమున తిరిగి తియ్యనైన ఫలములను పరిశీలించి, అట్టిఫలములను సేకరించి పూజకొఱకు పుష్పముల నాయత్తపరచి ప్రతిదినమును ఎదురుచూచు చుండెడిది. ఏలయన: రాముడెప్పుడు వచ్చునో శబరికి తెలియదు. గురువులు దివ్యజ్ఞానముతో వచ్చునని చెప్పిరి. కాని రాముడీదినము రాగలడని నిర్దిష్టముగ చెప్పలేదు. శ్రీరామచంద్రుడు చిత్రకూటమును వదలి శబరి యాశ్రమమునకు వచ్చునప్పటికి పదమూడు సంవత్సరముల కాలము గడచినది.*

ఈ పదమూడు సంవత్సరములు శబరి శ్రీరామాగమమునకై యెదురుచూచుచుండెను. వృద్ధురాలును, తపస్సుచేత క్రాగిన దుర్బల దేహము గలదియు నగు శబరి యట్టి స్థితిలో శ్రీరామాగమమునకై పదమూడు

---

* శ్రీ రామునితో శబరి యిట్లు చెప్పినది :
**చిత్రకూటం త్వయి ప్రాప్తే** (శ్రీమద్రా. 3.74-14) నీవు చిత్రకూటములో నున్నప్పుడు. సీతారామలక్ష్మణు లరణ్యమునకై యయోధ్య వదలిన యాఱవనాడు చిత్రకూటమున వాల్మీకిని దర్శించి పర్ణశాల నిర్మించుకొని యందుండిరి. అయోధ్యను వదలిన ముప్పదియాఱవ దినమున శ్రీరామచంద్రుడు భరతునకు పాదుకాదానము చేసెను. భరతుడు వెళ్ళిన కొలది దినములకు శ్రీరామాదులు చిత్రకూటమును వదలి దండకారణ్యమును ప్రవేశించి మునుల యాశ్రమములందు పది సంవత్సరములును, పంచవటి యందు మూడేండ్లును గడిపిరి. పదునాలుగవ సంవత్సరారంభమున సీతాపహరణము జరిగినది. శ్రీరామలక్ష్మణులు సీతను వెదకుచు శబరి ఆశ్రమము చేరునప్పటికి 13 సంవత్సరము లైనది.

Dr K Dayanandaswamy ebooks



సంవత్సరములు నిరీక్షించుచుండిన దనగా ఆమె యెంతటి భక్తురాలో మనమూహించుకొనవచ్చును. శ్రీరాముని పూజించిన పిమ్మట నామె రాముని యనుజ్ఞను గొని యొక్క క్షణమైనను విలంబనము చేయక దేహత్యాగము చేసి గురువులు పోయిన యుత్తమ లోకమునకు (బ్రహ్మలోకమునకు) పోయినది.

శబరి మహాయోగిని; మహాతపస్విని. జ్ఞానసంపన్నురాలు, మహాభక్తురాలు. యోగమునం దారూఢురాలు గనుక శ్రీరామాజ్ఞను పొంది యోగముచే దేహమునందు అగ్నిని (యోగాగ్నిని) రగుల్కొల్పి దానిచే దేహమును దహించెను.* వెంటనే శబరి దివ్యాభరణములు, దివ్య మాల్యములు, దివ్యగంధము, దివ్యాంబరములు ధరించినదియు, జ్వలించుచున్న అగ్నివలె నిర్మలమును తేజోవంతమును నగు దేహము గలదియును, ప్రియదర్శినియు, మెరపుతీగవలె నా ప్రదేశము నంతయు ప్రకాశింపజేయు నట్టిదియునై శ్రీరామునకు నమస్కరించి దివి కేగెను. శ్రీరాముడు పరంధాముడని శబరి యెఱుగును. కేవలము రాజకుమారుడని మాత్రమే భావించియుండిన సర్వసంగపరిత్యాగిని యగు శబరి యొక రాజకుమారుని దర్శనమునకై పదమూడేండ్లు నిరీక్షించి యుండునా? ఏల నిరీక్షించును? రాజుతో ఆమెకు కావలసిన దేమున్నది? శ్రీరాముడు భగవంతుడని యెఱిగియుండెను.

## (16) భగవద్ద్వేషులకు ముక్తి కలదా?

జి : ఇంతవఱకు భగవంతుని యెడల గల పరమప్రేమ, పరమానురాగములు భక్తియనియు, అది యనేక విధములనియు, అందేవిధముచేత నైనను ముక్తుడు గావచ్చుననియు చెప్పితిరి. భగవద్ద్వేషులు ముక్తు లగుదురా?

---

* తస్మి న్ముహూర్తే శబరీ దేహం జీర్ణం జహాసతి|
అనుజ్ఞాతా తు రామేణ హుత్వాఽత్మానం హుతాశనే||

Dr K Dayanandaswamy ebooks


వే : విరోధభావముచేత సహితము ముక్తుడు కావచ్చునని చెప్పబడెను. అంతేగాక భక్తివలన ముక్తి కలుగుటకంటె వైరానుబంధమున శీఘ్రముగ ముక్తుడగునని చెప్పుట గొప్పవిశేషము. ఇందుకు దృష్టాంతముగా శిశుపాలాదుల విషయము పురాణములందు చెప్పబడినది. భక్తుడు భగవంతు నేవిధముగా మఱువడో యట్లే విరోధమువలన సహితము కంసాదులు భగవంతుని మఱువకుండుటవలన వారికట్టి పద్ధతి లభించినదని చెప్పవచ్చును. భగవద్ద్వేషులకు భగవద్విషయకమగు జ్ఞానముండినను అది భక్తి కాజాలదని శాండిల్య భక్తిసూత్రములయందు గలదు. (సూ. 4)

ఆ॥ బాంధవమునన్నైన బగనైన వగనైన
బ్రీతినైన బ్రాణభీతి నయిన
భక్తినైన హరికి బరతంత్రులై యుండు
జనులు మోక్షమునకు జనుదు రధిప! (శ్రీ భాగ.దశమ.పూ. 972)

కం॥ వైరానుబంధనంబున
జేరిన చందమున విష్ణు జిరతర భక్తిం
జేరగరా దని తోచును
నారాయణ భక్తియుక్తి నాచిత్తమునన్. (శ్రీ భాగ.సప్తమ. 15)

ఈ యర్థమును బోధించు వాక్యములు భాగవతము నందు పెక్కుచోట్ల గలవు.

భగవదవతార కాలమున భగవంతునికి విరోధులై ఆయనతో యుద్ధమొనర్చి భగవన్మూర్తిని చూచుచు మృతి చెందినవారు మాత్రమే కైవల్యము చెందుదురు. ఇది అతిశయోక్తి కానేరదు. ఏలయన భగవంతునిచేత నిహతులైనవారు మరణ సమయమున భగవంతుని దివ్యమంగళ విగ్రహమును చూచుచు మరణింతురు కనుక మనస్సున భగవదాకారము లగ్నమై యుండును. అట్టి స్థితిలోనే వారు శరీరమును వదలుదురు. కనుక వారికి భగవంతుని సాలోక్యము సిద్ధించును. శిశుపాలుడు భగవత్సాయుజ్యమును

Dr K Dayanandaswamy ebooks



బొందుటకు కారణ మేమన: సనక సనందాదుల శాప మాజన్మతో పూర్తియై నందున నతనికి సాయుజ్య ముక్తి కలిగెను. అట్టి అవతార కాలమున జన్మించి భగవంతునిచేత మృతులైన వారికి తప్ప తక్కిన కాలములయందు భగవంతుని ద్వేషించువారును, దూషించువారును, భగవంతుని సేవింపనివారును ముక్తులు గారు. భగవద్ద్వేషులును, భగవద్భక్తులను ద్వేషించువారును నీచయోనుల జన్మింతురు.

## (17) ప్రతిమారాధనము - ప్రతీకోపాసనము

పరమేశ్వరుని భజించుటెట్లు? నిర్వికారుడును, నిర్గుణుడు నగు నతని నుపాసించు టెట్లు? మందాధికారులగు వారికి ఇది సాధ్యపడనందున భగవంతునికి బదులుగా ఆయన చిహ్నము (ప్రతీకము) నుంచి ప్రతీకమునందు భగవద్భావ ముంచి భజింపవలయును.

నిర్గుణ బ్రహ్మము నుపాసించుట కష్టమగుటవలన సగుణ బ్రహ్మమును నారాధించిననేకాని చిత్తము నిర్గుణ బ్రహ్మమును చెందదని యిదివఱలో చెప్పితిని. నిర్గుణ బ్రహ్మభావమను స్థానమునుండి యొక మెట్టు క్రిందికి దిగి యీశ్వర భావముతో ఈశ్వరుని సగుణునిగా నుపాసింపవలయును. మఱియొక మెట్టు క్రిందికి దిగి సగుణమునకు తోడు సాకారము కూడ చేర్చుకొనవలెను. సాకారము రెండు విధములు : (1) నిరవయవము (2) సావయవము. నిరవయవమున కుదాహరణము: శివలింగము, సాలగ్రామము.

సావయవమనగా : పాదములు మొదలు శిరస్సువఱకు గల సర్వావయవములు కలిగిన విగ్రహములు. ఉదా : విష్ణువు, వీరభద్రుడు మొదలగు విగ్రహములు. సావయవమునకంటె నిరవయవము, నిరవయవమునకంటె సగుణము, సగుణముకంటె నిర్గుణము నుపాసనకు శ్రేష్ఠము. మనదేశమందును విగ్రహారాధన సరికాదనెడి భక్తులున్నారు. విగ్రహారాధనము వలన చిన్న బిడ్డలు భగవద్భక్తు లగుటకు అవకాశ మున్నది. ఇట్టి కథ యొకటి శివపురాణము నందు ఇట్లు కలదు: మహాకాళక్షేత్రమందు చంద్రసేనుడను నొక రాజుండెను. సిద్ధుడొక డాతనికొక చింతామణి నిచ్చి "దీనిని నీవు కంఠమునందు ధరింపుము. దీనిని సోకిన

Dr K Dayanandaswamy ebooks



లోహ మేదియైనను బంగారమగును. నీ రాజ్యమునం దతివృష్టి, యనావృష్టి దోషములుగాని, స్ఫోటకాది రోగములవలన కలుగు బాధగాని ప్రజల కుండ" వని చెప్పిపోయెను. ఈ విషయము నలుప్రక్కల నున్న నరపతులకు తెలిసి మణికొఱకు వారు చంద్రసేనునిపై దండెత్తివచ్చిరి. రాజు భీతుడై యాచింతామణి నెవరి కిచ్చినను తదితర రాజులతో బాధపడక తప్పదని వేఱుగతి గానక యీశ్వరుని శరణు పొందగోరి మహాకాళేశ్వరుని యాలయమునకు పూజాద్రవ్యముల గొనిపోయి యీశ్వరుని పూజ యొనర్చుచుండెను. ఆ సమయమున నచ్చట ఈశ్వరమాయా విశేషమువలన నొక వింత జరిగెను.

ఆ కోవెలకు వెనుకభాగమున నొక పాకలో నొక గోపకాంత వసియించుచుండెను. అయిదారేండ్ల ఈడుగల యామె కుమారుడు ఏడ్చుచున్నందున వాని నోదార్చుటకై బాలుని నామె చంక నిడుకొని కోవెల ప్రవేశించి రాజు చేయుచున్న తీరంతయును బాలునకు జూపెను. ఆ బాలుడు శివునకు రాజు చేయుచున్న పూజాదులను చూచుటచే నా దృశ్యమంతయు నాబాలుని హృదయమునందు హత్తుకొనెను. బిడ్డడు ఏడుపు మానినందున తల్లి వానిని ఇంటికి తెచ్చెను. ఇంటికి వచ్చిన తరువాత బాలుడొక ఱాయి తీసికొని యా పాకలో నొక మూల ప్రతిష్ఠించి నీటితో నభిషేకించి తుమ్మిపూలు పత్తిరితో లింగమును పూజించుచు ఆనందవార్ధియందు మునిగియుండెను.

తల్లి బాలున కన్న మిడుటకై వచ్చి శివార్చన నంతయు త్రోసివేసి, బాలుడు ప్రతిష్ఠించిన లింగమును పెరికి దిబ్బపై పారవైచెను. బాలుడది గని 'హరహరా' యని మూర్ఛనొందెను. బాలుడు మూర్ఛనుండి తేఱుకొని కన్నులు విచ్చి చూచునప్పటి కచ్చట నొక బంగారు దేవళమును, అందు వజ్రమయమైన శివలింగమును, చక్కగా తీర్చిన నందులును, పార్వతీ విగ్రహమును, పూదోటయును కనబడెను. ఈ వింత చంద్రసేన మహారాజునకు, పురజనులకును తెలియగ వారందఱును వచ్చి చూచిరి. నగరిని ముట్టడించిన రాజు లందఱకు ఈవార్త తెలిసి వారును వచ్చి చూచిరి.

ఆ సమయమున శివాలయ గోపురమునందలి గోడలో చిత్రితమైన

Dr K Dayanandaswamy ebooks



హనుమంతుని చిత్రము (బొమ్మ) నుండి హనుమంతు డుద్భవించి బాలుని దగ్గఱకు పిలిచి ముద్దుచేసి యచ్చటనున్న రాజుల కాబాలుని చూపి "చూచితిరా! శివభక్తుల శక్తి" యని

శ్లో॥ అస్య వంశే௨ష్టమో భావీ నందోనామ మహాయశాః ।
ప్రాప్స్యతే తస్య పుత్రత్వం కృష్ణో నారాయణః స్వయమ్ ॥
శ్లో॥ అద్య ప్రభృతి లోకే௨స్మిన్ ఏష గోప కుమారకః ।
నామ్నా శ్రీకర ఇత్యుచ్చై ర్లోక ఖ్యాతిం గమిష్యతి ॥*
(శివపురాణము కోటిరుద్ర సంహిత 18 అ. 68, 69 శ్లో.)

తా॥ ఈ బాలుని వంశమున ఎనిమిదవ తరమున గొప్ప యశస్సుగల నందుడనువానికి శ్రీమన్నారాయణుడే స్వయముగా పుత్రుడై కృష్ణుడుగా అవతరింపగలడు. ఇప్పటినుండి యీ గోపబాలుడు శ్రీకరుడను నామమున లోకమున ఖ్యాతిగాంచగలడు - అని చెప్పి అంతర్హితుడయ్యెను.

ఉత్తరగీత యందు విగ్రహారాధనను గుఱించి యిట్లు కలదు.

శ్లో॥ తీర్థాని తోయరూపాణి దేవాః, పాషాణ మృణ్మయాః ।
యోగినో న ప్రపద్యంత ఆత్మధ్యాన పరాయణాః ॥

తా॥ ఆత్మధ్యాన పరాయణులగు యోగు లుదక రూపములయిన తీర్థములను, శిలామయ మృణ్మయ దేవతా మూర్తులను సేవింపరు.

శ్లో॥ అగ్ని ర్దేవో ద్విజాతీనాం మునీనాం హృది దైవతమ్ ।
*ప్రతిమా స్వల్పబుద్ధీనాం సర్వత్ర సమదర్శినామ్ ॥

తా॥ ద్విజులకు అగ్నిహోత్రము దేవుడు. మునులకు హృదయస్థుడైన ఈశ్వరుడే దేవుడు. స్వల్పబుద్ధులైన పామరులకు విగ్రహము దేవుడు.

---

* ఆంధ్ర శివపురాణమున నిట్లున్నది
చ॥ కడు బసిపాప వీడు శివు గాటపు వేడుక గొల్చి తత్ప్రపన్
బడసె నిటుల్ ప్రియంబుగ బ్రపంచమునం దిక బెద్దయై సిరుల్
బడయు బ్రతిష్ఠ గాంచు సరివారలచే బొగడొందు బద్మనా
భుడు హరి వీనివంశమున బుట్టుక గాంచును గొన్ని నాళ్ళకున్.
(ఆంధ్ర శివపురాణము - లింగవైభవ ఖండము)

Dr K.Dayanandaswamy ebooks

సమదర్శులైన తత్త్వవేత్తల కన్నింటియందును దేవుడు గలడు.

ఈ యర్థమునే దర్శనోపనిషత్తు ఇట్లు చెప్పినది:-

**"శివమాత్మని పశ్యంతి ప్రతిమాసు న యోగినః|**
**అజ్ఞానాం భావనార్థాయ ప్రతిమా పరికల్పితా"||**

భాగవత పురాణము విగ్రహారాధనము నంగీకరించినను సర్వభూత హృదయాంతర్వర్తియైన పరమేశ్వరు నెఱుగక కేవల విగ్రహారాధనమువలన ప్రయోజనము లేదని నొక్కి చెప్పినది. కపిల దేవహూతి సంవాదమునం దిట్లున్నది:-

**చం|| అనిశము సర్వభూత హృదయాంబుజవర్తి యనం దనర్చు నీ**
**శు నను నవజ్ఞ సేసి మనుజుండొగి మత్ప్రతిమార్చనా విడం**
**బనమున మూఢుడై యుచిత భక్తిని నన్ను భజింపడేని న**
**మ్మనుజుడు భస్మకుండమున మానకవ్రేల్చిన యట్టివాడగున్.**

(ఆంధ్రభాగవతము)

తా|| సర్వభూత హృదయాంతర్వర్తియు, సాక్షియునగు నన్నెఱుగక నిరంతరము విగ్రహారాధనమునందే కాలము గడుపుచు అనగా: స్వామివారికి అభిషేకమని, అర్చనయని, యారగింపని, శయనమని, ఉత్సవమని కాలమంతయు నిట్టి విడంబనమునకే గడపిన, అట్టివారు చేయు భక్తి భస్మకుండమున వ్రేల్చినట్లుగను. (అగ్నియందు వ్రేల్చిన దేవతలకు. ఆహుతులు చెందును. అగ్నిలేని బూడిదయందు వైచిన ద్రవ్యమువలె

---

* ఈ శ్లోకము నందు "ప్రతిమా స్వల్పబుద్ధీనామ్" అనుట సరికాదని "ప్రతిమా స్వప్రబుద్ధానాం" అని యుండవలయుని కొందఱు చెప్పుదురు. స్వల్ప బుద్ధులనుటకు బదులు అప్రబుద్ధులని - "అప్రబుద్ధానాం" ఎవరి కంటె అతిశయించిన ప్రబుద్ధులు లేరో వారికి" అని అర్థము చెప్పుదురు. మఱియు శ్లోకము యొక్క తాత్పర్యము నందు చెప్పబడిన విప్రులు, యోగులు, అప్రబుద్ధులు సమదర్శనులు అను నీనలువురయందును ఒకరికంటె నొక రుత్తరోత్తర శ్రేష్ఠులని చెప్పుదురు. "విగ్రహ" మనగా"- వి + గ్రహము = పరమాత్మను గ్రహించినది. "వి" అనగా: పరమాత్మ.

Dr K Dayanandaswamy ebooks


విగ్రహారాధనము వ్యర్థమగునని భావము.)

మఱియు నారద యుధిష్ఠిర సంవాదమునందు ఈ ప్రసక్తి కలదు. అందు "మందాధికారులకు బ్రతిమార్చనంబు పురుషార్థప్రదం బగును."
(ఆంధ్ర, భా. 7-453)

విగ్రహారాధనను సమర్థించిన పురాణములయందే విగ్రహారాధనము ఈ క్రింది విధముగ నిరసింపబడెను :

గీ|| **తెలియక యభక్తులాత్మ సంస్థితుని హరిని**
**గొలుచు చుందురు ఱాలుఱప్పలును వితగ,**
**నెఱుగక స్వనాభిగతమైన మృగమదంబు**
**దరువులను మూరుకొను మృగతతులువోలె.** (ఆంధ్ర పద్మ 4-636)

తా|| కస్తూరిమృగము కస్తూరి పరిమళము తన నాభినుండి వచ్చుచున్న కస్తూరిదని తెలిసికొనలేక బయట నెచ్చట నుండియో వచ్చుచున్నదని చెట్లను వాసన చూచుచుండునట్లు, భక్తులు కానివారు తనయందు సాక్షి స్వరూపుడైన శ్రీహరిని తెలిసకొనలేక ఱాళ్ళకు ఱప్పలకు మ్రొక్కుచుందురు.

కాని కొందఱు భక్తులు విగ్రహారాధనముతో జ్ఞానసంపన్నులైరని మన మెఱుగుదుము. సాక్షిస్వరూపుడగు హరి నెఱిగినవారు సహితము కొందఱు విగ్రహములు పూజించిరి.

ఉపనిషత్తులయందున్న సగుణోపాసన; ఉపాస్యక బ్రహ్మము యొక్క చిహ్నముగా (ప్రతీకముగా) ప్రాణము, మనస్సు, సూర్యుడు మొదలగునవి గైకొనబడినవి. ప్రతీకమను పదమునకు పండితు లిట్లర్థము చెప్పుదురు:- 'ప్రతీక' మనగా: తన వైపునకు తెలిసిన యే వస్తువుయొక్క ప్రదేశమైనను మొదట మనకు గోచరమైన, దాని మూలమున అసలు వస్తువుయొక్క జ్ఞానము మనకు కలుగునో, మొదలు గోచరించిన యా భాగమును ప్రతీకమందురు. మఱియు "ఒకదాని విషయమైన బుద్ధిని మఱియొక దానియందు నిలుపుటయును" ప్రతీకమందురు.

Dr K Dayanandaswamy ebooks



ఇందువలన విగ్రహారాధకులు విగ్రహమును మాత్రమే పరమేశ్వరుడని తదితరమైన జగత్తు పరమేశ్వర స్వరూపము కాదని, ఇతరత్ర భగవంతుడు లేడని తలంచుట లేదు. అట్లు తలంచినచో అది తప్పే యగును. తల్లిదండ్రులను భగవంతుని ప్రతీకములుగా భావించి యారాధింపవచ్చును. మన దేశమునం దెవరును శిలను, లోహమును ఈశ్వర భావన లేక పూజించుట లేదు. మూర్తిపూజ ప్రారంభించుటకు ముం దావిగ్రహమునకు గాని, లింగమునకుగాని ప్రాణప్రతిష్ఠ చేయుదురు. అనగా: ఆగమ మంత్రములతో ఆ దేవత నాహ్వానించి ఆ విగ్రహము నందుండునట్లు చేయుదురు. ప్రతీక మేదియైనను దానియందుపాసకుడు చేయు ఈశ్వర భావమే ప్రధానముగాని ప్రతీకము ప్రధానము కాదు. ప్రతిపదార్థము భగవంతుని యంశమయియే యున్నది కనుక, దేనినైన నొకదానిని ప్రతీకముగా తీసికొనుట భగవంతుని అవమానపరచుటగాని లేక ధిక్కరించుట గాని కానేరదు.

కేవలము ప్రతీక మాత్రముచేతనే సాధకునకు ప్రయోజన మేమియు లేదు. అతని భావము మంచిదై యుండవలయును. అనగా: భావము భక్తిపూరితమై యుండవలయును. ఏ ప్రతీకమును ఏ దేవతాభక్తిచేత పూజించినను తుదకు భక్తులందఱకును వారివారి యోగ్యతానుసారము ఫలమిచ్చువాడు పరమేశ్వరుడేగాని, కేవల ప్రతీకములుగాని ఆయా దేవతలుగాని కారని భగవద్గీత చెప్పినది (గీత. 7-22). ప్రతీకమును భగవంతునిగా దలపక, యక్షరాక్షసాదులలో నొకనిగా నుపాసించిన నుపాసకుడు, అంతమున వానినే పొందునుగాని పరమేశ్వరుని పొందలేడు. పరమేశ్వరుని భక్తు లాయననే తుదకు పొందుచున్నారు (గీత. 7-23).

ప్రతీకోపాసకులకు అర్చిరాది మార్గమున బ్రహ్మలోక ప్రాప్తి కలదా? లేదా? యను విషయము బ్రహ్మసూత్రము లందు చర్చింపబడెను. (బ్ర.సూ. 4-1-38-4) మఱియు (4.3.15)

**సూ|| విశేషం చ దర్శయతి||** (బ్ర.సూ. 4.3.16.)

**ప్రతీకోపాసకులకు అనగా :** నామము బ్రహ్మమని, వాక్కు బ్రహ్మమని

Dr K Dayanandaswamy ebooks



యుపాసనచేయు ప్రతీకోపాసకులకు శ్రుతి ఫలభేదము చెప్పినందువలన వారికి బ్రహ్మలోక ప్రాప్తిలేదని నిశ్చయించినారు. ఇచ్చట ప్రతీక శబ్దమునకు 'విగ్రహ'మను నర్థమును నంగీకరించినచో విగ్రహారాధకులకు బ్రహ్మలోకప్రాప్తి నిరాకరించి నట్లగును. కనుక "ప్రతీకోపాసకులు" అనగా వాక్కు మనస్సు మొదలగు వాటియందు బ్రహ్మభావ ముంచి యుపాసించినవారే యనియు, వారు విగ్రహారాధకుల కంటె భిన్నులనియు, విగ్రహారాధకులను గుఱించి యిచ్చట బ్రహ్మలోకప్రాప్తి తిరస్కరింప బడలేదనియు చెప్పుదురు.

శరీరము, ఇంద్రియములు, మనస్సు - వీటియొక్క నిర్మాణము ప్రకృతివలన కలిగినది గాన, సహజముగ వ్యక్తము వైపునకే యింద్రియములు పోవుచుండును, అవ్యక్తము వైపునకు పోవుటలేదు కనుక భాగవత ధర్మములు విగ్రహారాధనమును సమర్థించుచున్నవి. విగ్రహ, శిలా, దారు (చెక్క), లోహ, మృత్, చందన, సికతా (ఇసుక), మణి, చిత్రపట (ఆకాలమునందు కాగితముపై చిత్తరువును ముద్రించుట తెలియదు గనుక వస్త్రముపైన చిత్రమును వ్రాయుచుండెడివారు. దానికి చిత్రపటమని పేరు) మయములై అష్టవిధములుగా నుండవచ్చునని భాగవత పురాణము చెప్పినది. విశిష్టాద్వైత సంప్రదాయమునందు విగ్రహారాధనమునకు చాల ప్రాముఖ్యము గలదు.

నిర్గుణ తత్త్వమిట్టిదని తెలిసికొనుటకు శక్తిలేక సగుణ బ్రహ్మోపాసన చేయలేని మందాధికారులనుగూర్చి గీతయందు

శ్లో॥ **అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మ పరమో భవ ।**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధి మవాప్స్యసి ॥** (గీత. 12-10)

తా॥ అభ్యాసము (రాజయోగము) చేయుటకు నీ వశక్తుడవైతివేని నన్ను గూర్చిన కర్మలు చేయుటయే ప్రధానముగా కలవాడవు కమ్ము. నా కొఱకు సత్కర్మలు చేయుచు మోక్షమును పొందగలవు.

ఇట్టివారు దేవాలయములు కట్టించుట, దేవునికి పూలతోటలు వేయించుట, దీపములు వెలిగించుట, ఆలయము నూడ్చుట, నీళ్లుచల్లుట, అలంకరించుట, అభిషేకించుట, ప్రదక్షిణము చేయుట, పల్యంకికను మోయుట, వింజామరము వీచుట, భక్తులను యథోచితముగ

Dr K Dayanandaswamy ebooks



సత్కరించుట, భగవదర్పణ బుద్ధితో దానము చేయుట, దీనుల నాదరించుట, మంచివారికి కష్టములయందు తోడ్పడుట-ఇవి భగవంతునికి చేయవలసిన కర్మలు, వీటిలో మొదట చెప్పినవి దేవాలయములు విగ్రహారాధన మున్ననే చేయుటకు వీలగును.

కాంచన రత్నఖచిత కిరీటాద్యలంకారములతోను, పుష్పమాలలతోను, నలంకరించిన విగ్రహమును (మూర్తిని) ఈశ్వర భావనతో దర్శించినపు డతని మనస్సున నా మూర్తి స్థిరమగుచున్నది. (స్థాయీ భావము చెందుచున్నది.) భగవదాకారముగా కనిపించు సవికల్ప మనోవృత్తి యంతరాయము లేక అవిచ్ఛిన్నముగా నుండిన దానిని భక్తియని యందురు. భక్తిభావమును పెంపొందించునవి తులసీ పుష్ప చందనాదులు. వీణా వేణు తాళ మృదంగాదులతో సంకీర్తనము చేయుట వలనను భక్తిభావము పెంపొందును. ఇవి భక్తి లేనివారికి సహితము భక్తిరసము కలుగజేయును. భక్తిరస మనగా: ఆనందమే.* భావశుద్ధి లేని కేవలపూజ వ్యర్థమైనది. ఏదైనను నొక విగ్రహమును (మూర్తిని) మాత్రమే మనస్సున స్థిరముగ నిలుపవలయును. కొంతకాలము విష్ణువును మఱి కొంతకాల మింకొక మూర్తిని ఈ విధముగ మార్చుచుండుట తగదు.

ఇంతవఱకు చేసిన యీ విషయ వివేచనవలన తేలిన సారాంశ మేమనగా : విగ్రహారాధనము మనలో కొందఱకు మేలు, మఱికొందఱకు కీడును కలిగించుచున్నది. ఎట్లన:- విగ్రహారాధన భక్తిని కలిగించి దానిని పోషించుటకు మనకు సాధన మగుచున్నది. అందువలన మేలును, సాధకుడు విగ్రహారాధనమునందే కాలము గడుపుచు సర్వభూత హృదయాంతర్వర్తియగు సాక్షి నెఱుగక నిర్లక్ష్యము చేయుటచే కీడును కలిగించుచున్నది.

## (18) భగవత్కథామృతము

* శృంగార, హాస, కరుణ, రౌద్ర, వీర, భయానక, బీభత్స, అద్భుత, శాంతములని రసములు తొమ్మది. కొందఱు శాంతము రసము గాదని ఎనిమిది రసములేయని చెప్పుదురు. శాంతపరమే భక్తిరసమని కొందఱందరు. ఈ విషయమై వివరముగా తెలియగోరువారు "భక్తి రసాయన"మను గ్రంథమును చదువవలెను.

Dr K Dayanandaswamy ebooks



భగవత్కథా శ్రవణమునకంటెను సులభతరమైన సాధనము మఱియొకటి యుండబోదు.

శ్లో॥ "శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్ ॥"

అనికదా యున్నది. ఈ శ్లోకము నింతకు ముందొకసారి యుదాహరించి యుంటిని. మరల దీనియర్థమును జెప్పెదను. శ్లోకమున మొదట శ్రవణము చెప్పుటవలన సులభమగు కార్యముతో మొదట సాధన ప్రారంభించి దానివలన కొంత బలము చేకూరిన పిమ్మట క్రమముగా తక్కిన సాధనలను చేయుట యుక్తమని మొదట 'శ్రవణం' అని చెప్పిరి. కనుక మొదట భగవత్కథా శ్రవణము చేయవలయును. భగవంతు డెప్పుడెట్టి యవతారములను ధరించి యెట్టి దివ్యాద్భుత లీలలు ప్రదర్శించెనో తెలిసికొనినయెడల అట్టివానికి భగవంతునియందు ప్రేమ కలుగుచున్నది. భగవత్కథలను వినిన కొలదియు ఇంకను వినవలయునను కుతూహలము కలుగును. అట్లే పలుమారులు వినుటవలన హృదయము భగవత్కథా మృతముతో నిండి, అది హృదయకుహరము నుండి పొంగి సెలయేరులై బయట దుమికి ప్రవహించును. "కీర్తనం" అనునది రెండవమెట్టు. ఇట్లు శ్రవణ సంకీర్తనములవలన చిత్తము పరిశుభ్రమై హృదయము నిర్మలమై భగవంతుని లీలలను, ఆయన కల్యాణగుణములను, లోలోపల చింతింప మొదలిడును. "స్మరణం"- ఇది మూడవమెట్టు,

అట్టిపురుషున కీలోకమున నితర వ్యాపారములయం దిచ్ఛ జనింపదు. కనుక చేయుటకు కార్యమేదియును లేక భగవంతుని పాదములు సేవించుట "పాదసేవనం"- ఇది నాలుగువ మెట్టు. "అర్చనం" అనగా: పుష్పములతో, తులసితో అర్చనముచేయుట - ఇదియైదవ మెట్టు. "వందనం"- ప్రదక్షిణముచేసి సాష్టాంగపడుట - ఇది యాఱవమెట్టు. "దాస్యం" అనగా దేవాలయము శుభ్రపరచుట మొదలగు కార్యములు చేయుట - ఇది యేడవది.

ఇప్పటికి సాధకునకు దాసభావము కలిగియుండును. అనంతర

Dr K Dayanandaswamy ebooks



మాతడు తాను భగవంతున కంతరంగ మిత్రుడనని భావించును. ఇదియే "సఖ్యభక్తి" - ఇది యెనిమిదవది. కడపటిది ఆత్మనివేదనము. అనగా: ఆత్మార్పణము. తనను తానే భగవంతుని కర్పించుకొనుట. ఇదియే శరణాగతి యనియు, ప్రపత్తియనియు, న్యాసమనియు అందురు. దీనికి పైమెట్టు లేదు. భగవత్కథాశ్రవణ మెంత మేలు చేకూర్చినదో చూడుడు. భగవత్కథామృత మహిమను గుఱించి గోపిక లిట్లు చెప్పిరి:

**మ॥ ఘనలక్ష్మీ యుతమై వినన్ శుభదమై కామాది విధ్వంసియై**
**సనకాది స్తుతమై నిరంతర తప స్సంతప్త పున్నాగ జీ**
**వనమై యొప్పెడు నీ కథామృతము ద్రావం గల్గునే భూరి దా**
**న నిరూఢత్వము లేని వారలకు మా నారీ మనోనాయకా!**

(ఆం. భాగవతము. దశమ. పూర్వ. 15-44)

తా॥ లక్ష్మీ మనోహరుడవగు ఓ కృష్ణా! గొప్ప సంపదలు కలిగించునట్టిదియు; విన్నవారలకు సకల శుభప్రదాయినియు; కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాది విరోధివర్గమును నశింపజేయు నట్టిదియు; సనకాది మహాయోగివరులచేత స్తుతియింపబడు నట్టిదియు; నిరంతర తపస్సుచేత కృశీభూతులైన దేవతలకు జీవన ప్రదమైనదియు నగు నీ కథామృతము గొప్ప పుణ్యవిశేషము గలవారికే యబ్బునుకాని యన్యులకు లభింపనేరదు. కనుక నరిషడ్వర్గాదులను జయించుటకు భగవత్కథా శ్రవణము ముఖ్యము. ఇదియే భక్తికి ప్రథమసాధనము.

**శ్లో॥ జన్మకర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున!॥** (గీత. 4-9)

తా॥ ఓ యర్జునా! ఎవ డప్రాకృతములైన నా జన్మములను అనగా: శ్రీరామ, శ్రీకృష్ణాద్యవతారములను, నాయవతారములయందు నాచేత చేయబడిన సాధురక్షణ, దుష్టశిక్షణాది కర్మములను వదలిన పిమ్మట తిరిగి జన్మించడు. నన్నే పొందుచున్నాడు.

కావున భగవత్కథామృతమును నిరంతము గ్రోలు మహనీయులు

Dr K Dayanandaswamy ebooks



ముక్తులగుదు రనుటకు సందియమే లేదు. చదువు రానివారు భగవల్లీల లను గుఱించి వీథిపురాణములను, హరికథలను విని; మనోవాక్కాయ కర్మములతో భగవంతుని భజించి ముక్తులగుట కవకాశమున్నది. భాగవత దశమస్కంధమునం దీక్రింది పద్య మీయర్థమునే బోధించుచున్నది.

**కం॥ విజ్ఞానవిధము లెఱుగక**
**తదజ్ఞులు నీ వార్తజెప్ప దనువాఙ్మనముల్**
**యజ్ఞేశ! నీకు నిచ్చిన**
**యజ్ఞులు నిను బట్టి గెలుతు రజితుడ వైనన్.**

తా॥ ఓ యజ్ఞేశ్వరా! విజ్ఞాన విధము లెఱుగక పోయినను విజ్ఞానవిదులగు పెద్దలు నీ కథలు వినిపింపగా వినినట్టి యజ్ఞులు (తెలియనివారు) విని. మనోవాక్కాయ కర్మలను మూడింటిని నీ కర్పణముచేసి యజేయుడవైన నిన్ను గెలుచుచున్నారు.

ధన్యాత్ములు గానసుధతో మిళితమైన భగవత్కథామృతమును శ్రోత్రాంజలులచే పానమొనర్చి భక్తిపరవశు లగుచుందురు. త్యాగయ్య మొదలగు వారి కృతులను, గోపన్నగారి కీర్తనలు వీణా, మృదంగాది జంత్రములతో శ్రుతిగలిపి గానమ్మొర్చినపు డెట్టివారికైనను శరీరము పులకరించి కన్నుల నానందాశ్రువులు గారును. అట్టి యుత్తేజనమును బొందనివా రెన్నడును భక్తులు గానేరరు. "మురవైరి కథలకు ముదితాశ్రు రోమాంచమిళితమై యుండని మేను మొద్దు" అని భాగవతమునందు శుకమహర్షి వచనము.

## (19) భగవన్నామ మహిమ

**శ్లో॥ ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞై స్త్రేతాయాం ద్వాపరేఽర్చయన్ ।** 2
**యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్ ॥** (విష్ణుపురాణము)

తా॥ కృతయుగమున భగవంతుని ధ్యానించియు, త్రేతాయుగమున యజ్ఞముల నొనర్చియు, ద్వాపరమున అర్చించియు, మానవు డేఫలమును బొందునో దానిని కలియుగమున కేశవుని నామ సంకీర్తనముచే బొందగలడు.

Dr K Dayanandaswamy ebooks



మనస్సు చపలమైనది. దేనినో యొకదానిని చింతింపక యూరకుండ జాలదు. ఊరకుండుట అమనస్కము గదా? కనుక, మనస్సున్నదనగా: నేదోయొక పని చేయుచున్నదని యర్థము. భక్తుడు సులభముగ సాధన చేయదగినది భగవన్నామము, భగవంతుని స్మరణము. నామమును లేక మంత్రమును పలుమారు లుచ్చరించుట జపము.

జపము మూడువిధములు. (1) వాచికము - ఇతరులకు వినబడునట్లు మంత్రము నుచ్చరించుట, (2) ఉపాంశువు :- పెదవులు మాత్రము కదలించుచు మెల్లగా నుచ్చరించుట, (3) మానసికము :- మంత్రాక్షరముల యొక్క యర్థమును మంత్రార్థమును మనస్సునందే చింతించుట. కడపటిది శ్రేష్ఠమైనది. ఇది సిద్ధులయందు మాత్రమే యుండును. యుధిష్ఠిరుడు ధర్మములలో కెల్ల నుత్తమ ధర్మమును బోధింపుమని భీష్ముని అడుగ-

శ్లో॥ ఏష మే సర్వధర్మాణాం ధర్మో ఽధిక తమో మతః ।
యద్భక్త్యా పుండరీకాక్షం స్తవైరర్చే న్నర స్సదా ॥
(విష్ణుసహస్రనామస్తోత్రము. 3)

తా॥ హృదయ కమలమున వహించు పుండరీకాక్షుడగు వాసుదేవుని స్తుతిరూపమైన యర్చనము చేయునట్టి ధర్మమే, సమస్త ధర్మములయందును మిక్కిలి ముఖ్యమైన ధర్మమని నా మతము- అని భీష్ముడు తెలిపి విష్ణు సహస్రనామముల నెఱిగించెను. శ్రుతులు, మహాభారతము, పురాణములు భగవన్నామ మహిమను పెక్కు రీతుల కొనియాడినవి. మహాభారతమున విష్ణు సహస్రనామస్తోత్రము ప్రసిద్ధికెక్కినది. అట్లే శివ, లలితాసహస్ర నామస్తోత్రములును ప్రసిద్ధములు.

కలిసంతరణోపనిషత్తు నం దిట్లున్నది : ద్వాపరాంతమున నారద మహర్షి బ్రహ్మదేవుని దర్శించి కలికల్మషమునుండి తరించుటకు మార్గమేది? యని ప్రశ్నించెను. నారాయణ నామోచ్చారణ మాత్రమున కలి కల్మషము నుంచి తరింపవచ్చునని బ్రహ్మదేవు డానతిచ్చెను. ఆనామ మెద్ది? యని నారదమహర్షి తిరిగి ప్రశ్నింప :

Dr K Dayanandaswamy ebooks



"హరే రామ హరే రామ రామ రామ హరే హరే ।
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే॥"

అను మంత్రమును బ్రహ్మదేవు డుపదేశించి దాని మహిమను వర్ణించెను.

భగవన్నామ మహిమ యింతటిదని కొనియాడ తరముగాదు. శబ్దార్థముల కభేద మున్నట్లు భగవన్నామమునకును, భగవంతునకును భేదము లేదు. ఈ విషయమును తెలియజేయునట్టి అజామిళునికథ భాగవత షష్ఠస్కంధమునందు గలదు.

పూర్వము అజామిళుడను నొక బ్రాహ్మణుడు బాల్యమున దాంతుడు, శాంతుడు, ధర్మశీలుడై యుండెను. యౌవనమున నొక శూద్రస్త్రీయందు బద్ధానురాగుడై చేయరాని మహాపాపకార్యము లన్నియు చేసి, ఆమెవలన పదిమంది పుత్రులను గని వృద్ధాప్యమున నారాయణుడను పేరుగల కడపటి పుత్రునందు నధికానురాగము కలవాడై యుండెను. కాలము తీరిన యాతని జీవమును కొనిపోవుటకు భయంకరాకారులగు యమభటు లరుగుదెంచి కాలపాశము వేయుతఱి నజామిళుడు వారింగాంచి భయభ్రాంతుడును, వికలేంద్రియుడును, విహ్వలచిత్తుడునునై దూరమున నాడుచున్న బాలునుద్దేశించి నారాయణ, నారాయణ, నారాయణ, యని మూడు మారులు పిలిచెను. యమభటులు వానిని పాశబద్ధునిగా చేసిరి.

ఇంతలో విష్ణుదూత లచటి కరుదెంచి యమభటుల నదల్చి యజామిళుని కాలపాశ విముక్తుని చేసిరి. యమభటులు అజామిళుని పాపకృత్యము లన్నియు విష్ణుదూతలకు చెప్పి యతనిని దండధరుని కడకు తీసికొని పోవలయుననియు, తాము యమధర్మరాజు భటులమనియు చెప్పిరి. కాని విష్ణుభటు లంగీకరింపక మరణకాలమున నారాయణస్మరణము చేసెననియు దానివలన పాపక్షయ మైనదనియు చెప్పిరి. ఇచట విచారించవలసిన విషయమిది. అజామిళుడు స్మరించినది భగవంతుని కాదు. నారాయణ నామధారియగు పుత్రుని. భగవద్విషయమైన చింతనమే అతని కాకాలమున కలుగలేదు. కేవలనామోచ్చారణముచేత సర్వపాప విదూరు డగునా? యనునదియే ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానము అచ్చుటనే

Dr K Dayanandaswamy ebooks



విష్ణుదూతలచే నిట్లు చెప్పబడెను :

**కం॥ డెందంబు పుత్రువలనం**
**జెందినదని తలపవలదు, శ్రీపతిపే రే**
**చందమున నైన బలికిన**
**నందకధరుడందు గలడు నాథుండగుచున్.**

ఒకరోగము నిర్మూలింప గల ఔషధమును ఆ రోగి తెలిసి సేవించినను తెలియక సేవించినను నెట్లు రోగనివారణ మగునో యట్లే భగవన్నామము తెలిసి పలికినను తెలియక పలికినను సకల పాపహర మగునని విష్ణుదూతలచే సమాధానము చెప్పబడెను. అవి ప్రరోచనార్థక వాక్యములేగాని పరమార్థములు గావు. ప్రరోచనార్థక వాక్యములనగా: కవి యేయర్థము నధికముగ ప్రశంసించుటచే పాఠకుల చిత్తమును రంజింపజేయుచు వారల చిత్తములయం దావిషయము హత్తుకొనునట్లు చేయునో, యట్టి ప్రశంసావాక్యములు.

మానవుని జీవితకాలమున భగవంతుని పేర్లలో నేదేని యొకటి భగవంతు నుద్దేశింపక పుత్రులనో, మిత్రులనో, సేవకులనో యుద్దేశించి పలికియుండవచ్చును. అంతమాత్రముచేత సకలపాపములు నశించి కైవల్యము సిద్ధించునా? అట్లైన శాస్త్రములయందు చెప్పిన మోక్ష ధర్మముల నాచరించుటకై శ్రమపడవలసిన పని ఏమి? అజామిళు డదివఱకు నతని చిన్నకుమారుని నెన్నిమారులో పిలిచియుండును. ఆ పిలుపులకు విలువలేదు. ప్రాణప్రయాణ సమయమున 'నారాయణ' యని ముమ్మారు పిలిచిన ఆ పిలుపునకే ప్రాముఖ్య మీయబడినది. పుణ్యకాలములయందు, పుణ్యస్థలములయందు, పుణ్యతీర్థములయందు చేయబడిన జపతపోదానాది పుణ్యకార్యము లెట్లధిక ఫలప్రదము లగునని శాస్త్రముల యందు జెప్పబడినవో, ఆ విధముననే యంతిమకాలమందు పలుకబడిన భగవన్నామమున కట్టి యాధిక్యము కలిగినది. అట్లు పలికించినది పురాకృత సుకృతమే. "అంతిమకాలమున ప్రణవము నుచ్చరించుచు మరణించినవాడు పరమ పదము చెందు"నని గీత బోధించియున్నది కదా! గీత. (8-13).

Dr K Dayanandaswamy ebooks



అజామిళున కా పుణ్యమువలన గలిగిన ఫలితముగా నతడు విష్ణుదూతలచేత మృత్యుపాశమునుండి తప్పింపబడెను. అతడు యమదూత విష్ణుదూతల సంవాదము నంతయు వినెను. తాను చేసిన పాపములకు పశ్చాత్తాపము గలవాడై భార్యా పుత్ర మిత్ర బంధుజన వర్గంబుల రోసి, గృహమును పరిత్యజించి భాగవతోత్తములను గూడి, హరిభజనంబు చేయుచు గంగాద్వారమున కేగి, వైష్ణవజ్ఞాన దీపంబు హృదయమున వెలిగించి, యచటనున్న యొక దేవాలయమునందు యోగాసమునందుండి, యరిషడ్వర్గంబుల జయించి, కొంతకాలంబైన పిమ్మట యోగమార్గంబున శరీరము వదలి, తనకొఱకేతెంచిన విష్ణుదూతలం గని వారలకు ప్రణమిల్లి, వారలంగూడి వైకుంఠమున కేగెనని చెప్పబడెను.

ఇట్టి గాథలు ఇతర పురాణములయందును గలవు. ఉదాహరణము నకు పద్మపురాణమున గల యొకకథను సంగ్రహముగ చెప్పెదను :

పూర్వము త్రేతాయుగమున విధృతుడనెడి రాజొకడుండెను. అతనిని గుఱించి తెలిసికొనవలెనన్న అజామిళునకంటె నధిక పాపాత్ముడని చెప్పిన చాలును. ఆ రాజు శత్రువులచే నోడింపబడి రాజ్యచ్యుతుడై, యడవులలో దుష్టులగు నాతని పరివారముతో గూడి తిరుగుచు దారులుగొట్టి ధనమును హరించుచు అరణ్య మృగపక్షి సంతతులను చంపించి వాటి మాంసమును భక్షించుచుండెను. అతని పరివారమున కనుదినమును "ప్రహర, ఆహర" యని యాజ్ఞాపించుచుండును. దీని యర్థమేమనగా "కొట్టుము, తెమ్ము" "మృగములు మొదలగువానిని వధింపుము, తెమ్ము" అనునదియే యాతని యాజ్ఞ.

ఒకనాడతనికి మృత్యు వాసన్నమై యుండ మరణబాధ చెందుచు పరితపించుచుండు నతనిని, అతని పరివారము చుట్టును చేరి, సామీ! నీ కేమి కావలెనని యడుగ బదులు చెప్పుటకు శక్తిలేని యా విధృతు డనలేక యనలేక యలవాటు చొప్పున "ప్రహరాహర" యని ప్రాణములు విడిచెను. యమదూత లాతని జీవుని తీసికొనిపోవ యత్నించిరి. కాని వారి యాయుధము లాతనియెడ నిరుపయోగము లయ్యెను. యమభటులు

Dr K Dayanandaswamy ebooks



పోయి ఈ విషయము యమున కెఱిఁగించిరి. యముడంతట మృత్యు దేవతను పంపెను. మృత్యుదేవత యాతనిపై వేసిన కాలపాశము తెగిపోయెను. అంతట శివానుచరుడొక డరుదెంచి మృత్యుదేవతను శూలాగ్రమున గ్రుచ్చి విధృతుని తన రథముపై నిడుకొని శివసాన్నిధ్యమును చేర్చెను. విధృతుడు మరణించిన సమయమున "హరహర"యను శివనామ స్మరణము చేసెను గనుక అతడు తనవాడయ్యెనని శివుడు మృత్యువున కెఱిగించి మృత్యుదేవతను క్షమించి పంపివేసెను. విధృతుని ప్రమథ గణములలో నొకనిగ చేర్చుకొనెను.

ఈ రెండు కథలయందును చెప్పబడిన భావ మొక్క విధముగా కనుపడినను వాటి ఫలితమొక్క విధముగ లేదు. అజామిళుడు కుమారుని నెపమున "నారాయణ" స్మరణ చేసినను నతనికప్పుడే వైకుంఠప్రాప్తి కలుగ లేదు. అంత మాత్రముచేత అతడు పరమపదప్రాప్తి కర్హుడగునేని విష్ణుదూత లాతనిని వైకుంఠమునకు తీసికొనిపోయి యుందురు. అతడింకను పరిశుద్ధుడు కావలసియుండెను. అందువలన విష్ణుదూతలు మృత్యుముఖమునుండి యాతని విడిపించి ముక్తిని సాధించుకొనుట కవకాశమిచ్చిరి. విధృతుని కథ దీనికి విరుద్ధముగ అతని కాక్షణముననే కైలాసప్రాప్తి కలిగించినది. ఒకవేళ అజామిళుడు భగవంతు నుద్దేశించి 'నారాయణ' యని యుండెనేని అతని కప్పుడే వైకుంఠప్రాప్తి కలిగి యుండును. జీవిత కాలమంతయు భగవంతుని ప్రేమించిన వానికిని, భగవన్నామోచ్చారణ చేసిన వానికిని అంత్యకాలమందు తప్పక భగవంతుని స్మరణము కలుగును. దీనిని అంతిమ 'స్మరణ' మని యందురు. అంతిమ స్మరణము పాపాత్ములకు కలుగదు. ఈ యర్థమును తెలుపునట్టి యీ క్రింది పద్యమిచ్చుట చెప్పబడినది :

**కం॥ ధృతి దప్పిన తఱిని బురా**
**కృతమున గా కెట్లు దోచు గేశవుడు మదిన్,**
**మితిలేని జగము దాల్చిన**
**యతడొక్కని మనసులోన నడగెడు వాడే.**

(ఆంధ్రభాగవతము 16-127)

Dr K Dayanandaswamy ebooks



తెలివితప్పిన యప్పుడు భగవంతుడు మనస్సున తోచుట పూర్వజన్మ సుకృతముననే. కాకున్న మితిలేని జగము నంతయు ధరించిన భగవంతుడొకని మనమున నెట్లుండగలడు? అని తాత్పర్యము. అది సత్యమే; కాని, అజామిళుడుగాని, విధృతుడుగాని తెలివితప్పి యుండలేదు. వారికి భగవంతుని స్మరణము కలుగలేదు. అజామిళుడు స్మరించినది 'నారాయణ' నామధారియగు తన కుమారుని. విధృతుడు వాడుక చొప్పున "ప్రహర ఆహర"యని పలికెను. భగవంతుడు మనస్సున తోచెననుట యిరువురయందును లేదు.

కం॥ ధీమహిత ! భవన్మంగళ
నామ స్మరణానుకీర్తనము గల హీనుల్
శ్రీమంతులగుదు రగ్ని
ష్టోమాదిక్రుదాళికంటె శుద్ధులు దలపన్.

(ఆంధ్రభాగవతము. 3-10-35)

ఇచ్చట భగవన్నామము, స్మరణము, కీర్తనములను మూడును చెప్పబడినవి. ఈ మూడు గలవారు హీనులైనను వేదములయందు చెప్పబడిన అగ్నిష్టోమాది కర్మల నాచరించిన వారికంటెను పరిశుద్ధులని తాత్పర్యము.

పూర్వము ఖట్వాంగుడను రాజుండెను. దేవతలు దానవులచే యుద్ధమున నోడి వచ్చి తమకు తోడ్పడుమని యతని నర్థించిరి. రాజు దానవులను జంపి దేవతలకు మేలుచేసెను. దేవతలు సంతుష్టులై రాజును వరము కోరుమనిరి. అతడు తన జీవిత మెప్పుడు ముగియునో తెలుపుడని దేవతల గోరెను. వారాతని యాయువు ముహూర్త కాలముమాత్రమే యని తెలిపిరి. ఆక్షణముననే రాజు భూమికి దిగివచ్చి సర్వమును వర్జించి గాఢ వైరాగ్యమున :

కం॥ గోవిందనామ కీర్తన
గావించి భయంబు దక్కి ఖట్వాంగ ధరి
త్రీ విభుడు సూరగొనియెను
గైవల్యము దొల్లి రెండు గడియలలోనన్.(ఆంధ్రభాగవతము 2-11)

Dr K Dayanandaswamy ebooks

ఇచ్చట రాజు భగవంతునియందు చిత్తము చేర్చి గోవిందనామ కీర్తనముచేసి కైవల్యమును బొందెను. ఇంతవఱకు చేసిన యీ విషయ వివేచనమువలన తేలిన సారాంశమేమన : కేవలము చిలుక పలికినట్లు 'రామ', 'నారాయణ' అని పలికిన ఫలిత ముండదు. శబ్దముయొక్క అర్థమును మనస్సున ననుసంధింపవలెను. వాక్కునకు తోడు మనస్సున భగవంతుని స్మరించిననే ఫలిత ముండును. అదియును నంత్యకాల మందైన సాలోక్యముక్తి సిద్ధించును.

## (20) ప్రార్థన

జి : భగవంతుని కొందఱు ప్రార్థింతురు. మరి కొందఱు ధ్యానింతురు. ఇందేది యుత్తమ మగు పద్ధతి? ప్రార్థన యెట్లుండవలెను?

వే: భక్తి ప్రధానముగ నుండిన పై రెండింటిలో నేదైనను నొక్కటియే. ధ్యానమువలన పొందిన ఫలమును ప్రార్థనవలనను పొందవచ్చును. ధ్యానము కష్టసాధ్యమైనది. అది అష్టాంగ యోగములో నొక్కటియని పాతంజల (రాజ) యోగమును గుఱించి చెప్పిన సందర్భమున చెప్పియుంటిని. ధ్యానము భక్తులకును, జ్ఞానులకును అవసరమే. భగవంతుని ప్రార్థించు ఆచార మనాదియైనది. వేదములయందు అగ్ని, ఇంద్రుడు మొదలగు దేవతల ప్రార్థనయే గాక సర్వాధిపతియగు నేకేశ్వర ప్రార్థనము కూడ గలదని చెప్పుదురు. సామాన్యముగ ప్రార్థన స్తుతిరూపమున నుండును. స్తోత్రమునందే భగవంతుని తమ వాంఛితము సిద్ధింపజేయుమని కోరుదురు. ప్రార్థనవలన భగవదనుగ్రహము పొందినవా రనేకులు గలరు. ప్రార్థనలో చాల బలమున్నది. నీకు కావలసిన దేదియైనను భగవంతుని నుండి నీవు పొందవచ్చును. ఐతే, నీచిత్తము శుద్ధమై యుండవలెను. ప్రార్థన పెదవులనుండి కంఠమునుండి వెలువడిన చాలదు. హృదయమునుండి రావలెను. భగవంతుని ఈ క్రింది విధముగ ప్రార్థింపుము. ఈ క్రింది ప్రార్థనా వాక్యముల యందలి యర్థమును మనస్సున ననుసంధింపుము. దినమునకు రెండు సారులు ప్రార్థింపుము.

"ఓ సర్వేశ్వరా! ప్రకృతి, పురుషుడు, కాలమునను నీమూడింటికి

Dr K Dayanandaswamy ebooks

ప్రభుడవై వీటిచే నీసుందర విశ్వమును సృజించి జీవకోటి కీజగత్తును భోగరంగముగను, నీకు లీలారంగముగను జేసికొని ఆనందించుచు తుదకు కాలముచే నీసృష్టి నంతయు నంత మొందించుచున్నావు. ఇట్లెన్నిమారులు జరిగెనో యెవ్వరు నెఱుగరు? ఇది నీకొక లీల. ఈలీలారంగమున నీవును నొకప్పుడు పాత్రధారివై యవతరింతువని పెద్దలు చెప్పిరి. నీవు నిర్గుణుడవని కొందఱును, కాదు సగుణుడవని కొందఱును చెప్పుదురు. నిజమునకు సగుణ నిర్గుణములు రెండును నీవే. ఆ రెంటికి నతీతుడైన వాడవును నీవేయని తలంచుచున్నాను. సర్వవ్యాపివగు నీకు సర్వత్ర నమస్కరించుచున్నాను.

భక్తవత్సలా! నా ప్రార్థన చిత్తగింపుము. నీ వత్యున్నత స్వర్గ ధామమున నున్నను సర్వవ్యాపివై యున్నావు. సమస్తమును వినగలవు. సర్వమును చూడగలవు. సంకల్ప మాత్రమున సమస్తకార్యములు చేయగలవు. సర్వజ్ఞుడవు. సర్వశక్తిమంతుడవు. సర్వభూతముల యెడ దయగలవాడవు. కనుక యీ దీనుని ప్రార్థన తప్పక వినుచుందువు.

జగత్పితా! నీ సంతానమగు మానవులు జాతి, మత, కుల, భేదములు కల్పించుకొని యొకరి నొకరు హింసించుకొనుచుండగా చూచుచు నుపేక్షించుచుంటివి. బలవంతు లగువారు ప్రమాదకరమగు మారణాయుధ ములను చేసియున్నారు. మానవావళి హృదయములను మైత్రీకరుణలతో నింపి మారణాయుధములను నిస్సారములు నిరుపయోగములుగా జేయుము.

మహాప్రభూ! లోకమున నందఱకు అన్నము, వస్త్రము, ఆరోగ్యము, విద్య, నీ యందలి భక్తిని, శాంతిని ప్రసాదింపుము.

పురుషోత్తమా! నా దేశప్రజ లితరదేశములపై ఆధారపడక అన్నింటను బలవంతులై, మమ్ము ద్వేషించు వారలకు నిరాశ గలిగించి వారు మా స్నేహమును గోరునట్లనుగ్రహింపుము.

పరమాత్మా! నా దేశ ప్రజలయందలి మూఢవిశ్వాసములు పారదోలి మమ్ముల సత్యపదమున సాగిపోవునట్లు చేయుము.

Dr K Dayanandaswamy ebooks



పరమ పురుషా! నాకును నీకును భేదము లేదో! నేను నీ ప్రతిబింబమునో, లేక, నీకు శేషభూతుడనో, లేదా, నీ యంశసంభూతుడనో, యేది నిజమైనను నేను నీవాడనను నిశ్చయము నేనెల్లప్పుడు మఱువకుండునట్లును, సర్వభూతములయందు నిన్నును, నీయందు సర్వభూతములను చూచునట్లును అనుగ్రహింపుము.

పరంజ్యోతీ! నా సంతతియం దెల్లప్పుడు పాపరహితులు, నిర్భయులు, శక్తిమంతులు, నీ పాదభక్తులు జన్మించునట్లు నీ దివ్యచిత్తమున దలంపుము.

దయాసింధూ! తెలిసిగాని తెలియకగాని నేను చేసిన సమస్త పాపములను క్షమింపుము. నా హృదయ మత్యంత నిర్మలముగ జేయుము. పాపసంకల్పములు నాకు కలుగకుండునట్లు నా బుద్ధియం దనాదిగా నుండు వాసనలను దగ్ధము చేయుము. సుఖదుఃఖాది ద్వంద్వములకు నెట్టి మనోవికారమును పొందక ఓర్పుతో నిర్భయత్వమును, సకలభూతముల యెడ నభయమును, అంత్యకాలమునందు నీ స్మరణమును కృపతో దయచేయుము.

పరంధామా! నన్ననాదిగా ఆవేశించియుండు అహంకార పిశాచమును తొలగింపుము. అది నీకు తప్ప నితరులకు లొంగునది కాదు. అది తొలిగినంతనే నాకును నీకును మధ్యగల భేద మంతరించును. అహంకారము నశించు నంతవఱకు నేను కోరికలు కోరుచునే యుందును. దానిని తప్పుగా గైకొనకుము.

ఓతండ్రీ! నే నెందుకును పనికిరాని దుర్బలుడను. జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తి యోగములయందేది యనుష్ఠించుటకును శక్తిచాలనివాడను, దీనుడను; కరుణజూడుము. కరుణజూడుము. శరణు".

ఈ ప్రార్థనయందు కోరికలు కలవు. ఇందులో నీకు ఇష్టములేని అంశముల తొలగించి ప్రార్థన చేసికొనవచ్చును. ఏ కోరికను కోరక నిష్కామముగ భగవంతుని కాత్మార్పణము గావించుకొనుట మిగుల శ్రేష్ఠము. మనకేమి కావలయునో, యేది కలిగియున్న మనకు శుభము

Dr K Dayanandaswamy ebooks



చేకూరునో, యేది కలిగిన అశుభము కలుగునో సర్వజ్ఞుడగు భగవంతునకే మనకంటెను బాగుగా తెలియును కదా? కనుక యేకోరికను కోరక భగవంతుని శరణు పొందుము. భక్తిమార్గము నందిది యత్యున్నత స్థితి:

## (21) శరణాగతి

గీతను ముగించుచు భగవంతు డర్జునున కిట్లుపదేశించెను :- ఓ అర్జునా! నేను ప్రతిజ్ఞచేసి సత్యము చెప్పుచున్నాను. నాయందు మనస్సు కలవాడవు కమ్ము. నాయందు భక్తి కలవాడవు కమ్ము. నన్నే పూజింపుము. నాకే నమస్కరింపుము. అట్లు నీవు చేసితివేని నీవు నన్నే పొందగలవు. నీవు నా కత్యంత ప్రియుడ వగుటవలన నీకు సత్యము చెప్పుచున్నాను. (గీత 18. 65 ఇట్టి వాక్యములే 9వ అధ్యాయము 34వ శ్లోకమునందు సహితము చెప్పబడెను.)

దీని భావమే శరణాగతి యందురు. శరణాగతి యనగా : "నీవే దిక్కు" అని చెప్పుట. ముఖ్యముగా శ్రీ వైష్ణవులు దీనిని కర్మ, జ్ఞాన, భక్తిమార్గములకంటె భిన్నమగు ప్రపత్తియను నొక స్వతంత్ర మార్గమని చెప్పిరి.

శ్లో॥ *సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥
(గీత. 18-66)

తా॥ సమస్త ధర్మములను విడిచి నన్నొక్కనినే శరణు పొందుము. నేను నిన్ను సమస్త పాపముల వలనను ముక్తి పొందించెదను. దుఃఖపడకుము.

ఈ శ్లోకమునందలి ధర్మశబ్దమునకు వ్యాఖ్యాత లనేకు లనేక విధములైన యర్థములను చెప్పిరి. నాకు తోచిన యర్థమిది : సామాన్యముగ వేదములయందు చెప్పిన యజ్ఞాది కర్మల నాచరించుటయే ధర్మాచరణ మను భావము కొంత కాలము వ్యాప్తియం దుండెను. గీతయందు యజ్ఞ

 Dr K Dayanandaswamy ebooks

దాన తపములు త్యజింపరానివని (గీత. 18-3,5) యుండుట వలనను; యజ్ఞములలో మిగిలిన యమృతమును భుజించిన వారలు బ్రహ్మమును పొందుచున్నారు (గీత. 4-31) అని చెప్పియుండుట వలనను; విప్రునకు వేదాధ్యయనము, తపస్సు; క్షత్రియునకు రాజ్యపాలనము, వీరోచిత మరణము మొదలుగాగల శాస్త్రమునందు చెప్పబడిన వర్ణోచిత వ్యాపారములును; (గీత. 18-41 నుండి 47 వఱకు) వ్యక్తి గతములైన పితృధర్మము, పుత్ర ధర్మము మొదలగునవి ధర్మములని శాస్త్రములయందు విధించియున్నందునను ఇవన్నియును శాస్త్రోక్తముగ ననుష్ఠించిననేకాని సద్గతి కలుగదని శాస్త్రములు చెప్పుచుండుటవలనను; అట్టి ధర్మముల నెఱుగుటయు, వాటి యందు మనస్సును నిలుపుటయు, అట్టి ధర్మానుష్ఠానము చేయుటయందే కాలము గడుపవలయునా? లేక, ఒకానొకప్పుడు వర్ణధర్మమునకు మోక్షధర్మమునకు అన్యోన్యత కుదురని పక్షమున చేయవలసిన దేమి? పరమేశ్వరప్రాప్తి కాటంకము లగునప్పు డీధర్మముల నుల్లంఘించవలయునా? లేక ఈ ధర్మములకే కట్టుబడి యుండవలయునా? అను సంశయము కలుగుట సహజము.

ఈ సంశయమును ఈశ్లోకము నివర్తించుచున్నది. భగవత్ప్రాప్తి కడ్డము వచ్చు ధర్మములను వదలినను తప్పులేదు. భగవత్ప్రాప్తి కనుక సర్వనియామకు డగు భగవంతుడే "నన్ను శరణుపొందుము. నీకు భయమేల? దుఃఖపడకుము" అని యభయ మిచ్చి యున్నాడు. ఎవడైనను కేవల ధర్మమునే యంటి పెట్టుకొని భగవంతునకు దూరమగువాడు వ్యర్థకర్ము డగుననుటకు సంశయము లేదు. ఇదియే ఈ శ్లోకము నందలి భావము. ఈ యర్థమునే శ్రీమదాంధ్ర భాగవతమునందలి యీ పద్యము బోధించు చున్నది.

---

* గీతయందలి 18-66వ శ్లోకమును చరమశ్లోక మందురు. ఈ ప్రపత్తి భక్తికి చెందినదేయని నే నీ ప్రకరణముననే దీనిని చేర్చితిని. చరమశ్లోకమునకు శ్రీవైష్ణవులు చెప్పెడియర్థము రాబోవు ప్రకరణమునందు చెప్పెదను.

Dr.K.Dayanandaswamy ebooks

చం॥ తన కులధర్మమున్ విడిచి దానవవైరి పదారవిందముల్
వనివడి సేవసేసి పరిపాకము వొందక యెవ్వడేని జ
చ్చిన మఱి మేననైన నది సిద్ధివహించు దదీయ సేవ బా
సిన గుల ధర్మ గౌరవము సిద్ధి వహించునె యెన్ని మేనులన్.

(ఆంధ్రభాగవతము 11-100)

తన కులధర్మమును విడిచినచో ధర్మచ్యుతి కలుగునని కులధర్మము నందే మగ్నుడైనవాడు చచ్చినచో మరుజన్మమునం దాకులమునందే పుట్టునను నమ్మకము లేదు. ఏలయన కర్మవిపాకము ననుసరించి సంచితకర్మరాశి (అనారబ్ధకర్మ) నుండి కొంత భాగము ప్రారబ్ధముగా నేర్పడి పునర్జన్మ కవసరమగు శరీరమును నిర్మించుచున్నది. సంచిత కర్మయం దనేక జన్మార్జితమైన పుణ్యపాప మిశ్రిత కర్మఫల మిమిడి యున్నది. కనుక ఈ జన్మమునందు విప్రుడై పుట్టినవాడు రాబోవు జన్మమున విప్రుడేయయి పుట్టునను నమ్మకము లేదు. భగవంతుని నమ్మిన భక్తుడన్నో ఈ జన్మమున ముక్తుడు కాలేకపోయినను, మరుజన్మమునం దేకులమున బుట్టినను ముక్తుడగును. హరిజనులై పుట్టినవారెందరు ముక్తులు కాలేదు? భగవత్సేవను వదలినవాడు వర్ణాశ్రమోచిత ధర్మానుష్ఠానమువలన కృతకృత్యుడు కాలేడని తాత్పర్యము.

కం॥ వర్ణాశ్రమ ధర్మంబుల
నిర్ణయకర్మముల జెడక నిఖిల జగత్సం
పూర్ణుడు హరియను నాతడె
వర్ణింపగ భాగవతుడు వసుధాధీశా! (ఆంధ్ర. భాగ. 11-47)

తా॥ వర్ణాశ్రమ ధర్మనిర్ణయములకు కట్టుబడక "వాసుదేవః సర్వం"- సర్వము వాసుదేవుడే యను నిశ్చయమునకు వచ్చిననేకాని కృతార్థుడు కాజాలడు.

Dr K Dayanandaswamy ebooks

మహనీయు లనేకులు ఈమార్గము ననుసరించి ముక్తులైరి. ధర్మమును పరిత్యజింపు మనగా: అధర్మము చేయుమని యర్థము గాదు. విడువరాని ధర్మమును సహితము నాకొఱకై పరిత్యజింపు' మని భగవంతుడు చెప్పుచుండగా మోక్షాపేక్ష కలిగినపుడే ముముక్షువుచే పరిత్యజింపబడిన అధర్మమును వదలివేయుమని యిప్పుడు ప్రత్యేకముగ చెప్పనక్కఱలేదు గదా? సర్వ ధర్మాధర్మములు పరిత్యజింపుమను నర్థమిచ్చుట సరిపడదనియు "సర్వధర్మములు" అనగా మోక్ష సాధనములుగా చెప్పబడిన సమస్త మోక్షధర్మములు పరిత్యజింపుమని యర్థమనియు కొందఱు పెద్దలు చెప్పిరి. **"మాం ఏకం శరణం వ్రజ"** నన్నొక్కనినే శరణుబొందుము అనుటవలన నితరమోక్ష ధర్మముల నన్నింటిని వదలినను భయము లేదని అభయహస్తము ప్రసాదింపబడినది.

"సమస్త ధర్మములును వదలివేయుము" అనుటలో వ్యక్తిగతములైన ధర్మములను సహితము వదలుమని యర్థము. తండ్రియాజ్ఞను శిరసావహించుట ధర్మమే. భగవంతుని కొఱకు ప్రహ్లాదు డట్టి ధర్మమును తిరస్కరించెను. స్వదేశము నందును, స్వజనుల యెడను, భ్రాతయందును భక్తి కలిగి యుండుట ధర్మము. ఇట్టి ధర్మమును వదలి విభీషణుడు భగవంతుని శరణుపొందెను. పతివ్రతలగు గోపికలు భగవంతుని ప్రేమించి పాతివ్రత్య ధర్మమును తిరస్కరించియు అక్షయమగు కైవల్యము నొందిరి. భగవత్ప్రాప్తికి ప్రతిబంధకములగు ధర్మములు వదలవలయునని దీని తాత్పర్యము. మఱియొక విధముగా ధర్మమును పరిత్యజింపరాదు. **"సర్వధర్మాన్ పరిత్యజ్య"** అను గీతావాక్యము సన్న్యాసమును బోధించునది కాదు.

శరణాగతి అందఱికి సులభముగా ప్రాప్తించునది కాదు. మనము సామాన్యుల మనుకొను కొందఱికి అత్యంత సులభముగ ప్రాప్తింపగలదు. దీనికి దీనభావము తోడ్పడును. **"మదన్యః కో దీనః"** (శివానందలహరి) నా కంటె దీనుడెవడు?" అను భావ మేర్పడవలయును. శరణాగతి

Dr K Dayanandaswamy ebooks


ఒకప్పుడు మహా పండితులును, వేదవేత్తలు నగువారి కలవడక పోవచ్చును. శరణాగతి యన తనపైనున్న భారమంతయును భగవంతునిపై వేయుటయే. అతడు ఇతరమైన దేనిపైనను ఆధారపడకూడదు. సంశయ ముండరాదు. ఎక్కువగా శాస్త్రములు చదివినవారిలో సహితము "భగవంతు డున్నాడో లేడో, ఉన్నను ఆయన తటస్థుడేమో? జీవులకథ పట్టించుకొనడేమో?" యని తలంచువారు గలరు. అట్టివారికి శరణాగతి సాధ్యపడదు.

శరణాగతియం దున్న సూక్ష్మమేమనగా : "నేను", "నాది" అనుటకు బదులు "నీవు","నీది" అని తన అహంకార మమకారములను వదలుకొని దాసభావ మొందుటే. అంతయును స్వామిదే. లాభనష్టములు స్వామివే. ఈశరీరము ఆయన యిచ్చిన సాధనము. ఇదియును స్వామిదే, ఇది పోయినను స్వామిదే. లాభనష్టము లాయనవే. ఈనిశ్చయమే శరణాగతి. వాస్తవముగా భగవంతుని శరణుబొందిన భక్తుడు ఈ లోకమున సుఖింపగలడు. ఏ స్వల్పసంశయ మున్నను శరణాగతి సంపూర్ణము కాదు. సమస్తమును భగవంతుడే అనుటకును "సర్వం ఖల్విదమ్ బ్రహ్మ"- సమస్తమును బ్రహ్మమే యనుటకును భేదము లేదు.

"ఎవరు ఇతర చింతమాని నన్నే స్మరించుచున్నారో, భజియించు చున్నారో అట్టి నిత్యసమాహిత చిత్తులైన వారలకు లేనిదానిని సంపాదించుకొనుటకు (యోగము)ను, సంపాదించిన దానిని కాపాడు కొనుటకు (క్షేమము) ను నేనే పూనుకొనియున్నాను." (గీత. 9-22) ఇట్లని, ఏకరుణామూర్తి ప్రతిజ్ఞ చేసియున్నాడో, అట్టి భగవంతుని నేను శరణు పొందుచున్నాను. ఆయన కరుణామృతవృష్టి మాపై వర్షించుగాక! ఈ ప్రకరణమందు చెప్పబడిన భగవద్భక్తుల యొక్క ఆశీర్వాదములు మాకు లభించుగాక!

Dr K Dayanandaswamy ebooks

శ్లో॥ "హే రామభద్రాశ్రయ! హేకృపాలో!
హేభక్తలోకైక శరణ్యమూర్తే!॥
పునీహి మాం త్వచ్చరణారవిందం
జగత్పవిత్రం శరణం మమాస్తు ॥"

- * -

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మట్టిబోయిన రామసుబ్బయ్యచే
రచియింపబడిన 'బ్రహ్మజిజ్ఞాస' ద్వితీయ భాగమునందలి
'భక్తియోగ' మను నాలుగవ ప్రకరణము సంపూర్ణము.

**ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః**

*

Dr K Dayanandaswamy ebooks

ఓం

శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః

# బ్రహ్మజిజ్ఞాస

## (ద్వితీయ భాగము)

## ఐదవ ప్రకరణము - ప్రపత్తి

"రేఖామయధ్వజ సుధాకలశాతపత్ర
వజ్రాంకుశాంబురుహ కల్పక శంఖచక్రైః।
భవ్యై రలంకృతతలౌ పరతత్త్వ చిహ్నైః
శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే"॥

### (1) అవతారిక

జి : అయ్యా! లోకమున కొందఱు "భగవంతుని యెడల భక్తి ప్రపత్తు లుండవలె" నని చెప్పుదురు. మీ అనుగ్రహమున భక్తిని గుఱించి తెలిసికొంటిని. శ్రీ వైష్ణవులు చెప్పెడి ప్రపత్తిమార్గ మెట్టిదో యనుగ్రహించి తెలుపుడు.

వే : ప్రపత్తి మార్గము శ్రీ వైష్ణవులకు మాత్రమే సంబంధించినది కాదు. దక్షిణ దేశమునందు నీలకంఠ శివాచార్యుల సంప్రదాయమునకు చెందిన శైవులు, వీరశైవులు, బంగాళమునందలి శాక్తేయులు, రాధాకృష్ణ మతమునకు చెందినవారు, తదితర ప్రాంతములయందలి హిందూమతము నకు చెందిన ఆయా సంప్రదాయములవారు తమ తమ సంప్రదాయము ననుసరించి తమ తమ ఇష్టదేవతలకు ప్రపత్తి చేయుదురు. శ్రీవైష్ణవుల ప్రపత్తిని గుఱించి తెలిసికొనవలెనన్న విశిష్టాద్వైతమును గుఱించి సంగ్రహముగానైనను తెలిసికొని యుండవలెను కనుక దానిని గుఱించి సంగ్రహముగా చెప్పెదను.

Dr K Dayanandaswamy ebooks


మొదట (ఈ గ్రంథముయొక్క ప్రథమభాగమున) నీకు చెప్పిన ఈశ్వరాస్తిత్వము, ప్రపంచోత్పత్తి, పంచీకరణము, అధ్యాత్మ అధిభూత అధిదైవతముల విచారము, కర్మసిద్ధాంతము, కాలస్వరూపము, బ్రహ్మముయొక్క సచ్చిదానంద లక్షణములు, పంచకోశవివేకము, జ్ఞానప్రమాణములు, జ్ఞానభూమికలు, పునర్జన్మసిద్ధాంతము, పంచాగ్ని విద్య, బ్రహ్మలోకము, దేవయాన పితృయానములు, మూడవమార్గము, జీవుల ఉత్క్రాంతి, అధికారపురుషులు-మొదలగు విషయములు అద్వైతులకు విశిష్టాద్వైతులకు, ద్వైతులకు, తదితర వైదిక సంప్రదాయములకు చెందినవా రందఱకు సామాన్యము (common)గా వర్తించును. కనుక ఆ విషయముల నిచ్చట స్మరించుకొనిన చాలును. విశిష్టాద్వైతమునకు చెందిన ప్రత్యేక విషయముల నిచ్చట సంగ్రహముగా చెప్పెదను వినుము.

భారతదేశమున నలుమూలలను వైష్ణవ మతము వ్యాపించియున్నది. దక్షిణదేశమున ఆళ్వారులు, ఆచార్యులు, తూర్పున బంగాళము, బీహారు ప్రాంతములయందు గౌరాంగదేవులు (శ్రీకృష్ణచైతన్యులు)ను, పశ్చిమమున కన్నడమునందు మధ్వాచార్యుల వారును, ఉత్తరమున* నింబార్క వల్లభాచార్యులవారును వైష్ణవమును వ్యాపింపజేసిరి. వీరందఱును విష్ణు దేవుడు, లేక శ్రీకృష్ణభగవానుడు పరతత్త్వమని చెప్పుటచేత వీరి మతము వైష్ణవమతమని ప్రసిద్ధి. ఇందులో దక్షిణమున నున్న వైష్ణవమతమునకు శ్రీరామానుజ మతమనియును, రామానుజ దర్శనమనియు, శ్రీవైష్ణవ మనియు, శ్రీ సంప్రదాయమనియు, విశిష్టాద్వైతమనియు పేర్లు.

భక్తి మార్గమెట్లు ప్రచారమునకు వచ్చినదియు, భాగవత ధర్మములయొక్క యుదయమును, వాటికాధారమగు సారస్వతమును గుఱించియు ఇది వఱలో కొంత చెప్పియుంటిని. శ్రీవైష్ణవ భక్తిమతమున కాధారమగు శాస్త్రములే ప్రపత్తికిని ఆధారము. ఒక విధమగు భక్తియొక్క యున్నత భూమికయే ప్రపత్తియని చెప్పితిని.

---

* నింబార్కులును వల్లభాచార్యులును తెనుగు బ్రాహ్మణులు. నింబార్కులు 11 వ శతాబ్దమువారు. వల్లభాచార్యులు క్రీ.శ. 1041 కి చెందిన వారు. మధ్వాచార్యులు క్రీ.శ. 1169 జన్మించిరి.

Dr K Dayanandaswamy ebooks


ముఖ్యముగ శ్రీవైష్ణవుల ప్రపత్తిని పాంచరాత్రాగమములు చెప్పును. పాంచరాత్రములనగా:* నాలుగు వేదములయొక్కయు సాంఖ్య యోగ శాస్త్రముల యొక్కయు, రహస్యమును తెలియజేయునట్టి శాస్త్రములు గనుక పాంచరాత్రములనియు పాంచరాత్రాగమములనియు పేర్లు కలిగినవి. పాంచరాత్రముల మతము వైదికమని కొందఱును, అవైదికమని కొందఱును చెప్పుదురు. ఈ విషయమై శ్రీయుతులు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు భారతీయ తత్త్వశాస్త్రమున చర్చించిరి. అందులో కొన్ని వాక్యములివి: "పాంచరాత్ర, భాగవత, సాత్వతమత మార్యమతమో అనార్యమతమో చర్చనీయాంశము. దీని పూజావిధానము అవైదిక మగుటచే నిది అనార్యమతమని కొందరు వాదింతురు. ఇది వేదకర్మలనుగాని సంస్కారములనుగాని యంగీకరింపలేదు. సంకర్షణుడే జీవుల జన్మకు కారకుడను సిద్ధాంతము వేదమత విరుద్ధము." (భా.త. 2-8-8) ఆళ్వారులు** తమిళభాషయందు రచియించిన 'నాలాయిర' (నాలుగు వేలు) మని పిలువబడు దివ్య ప్రబంధమగు ద్రావిడవేదమును, వీరి తరువాత నాథముని, వారి పౌత్రులగు యామునాచార్యులును (ఆళవందారు) మొదలగు ఆచార్యులు వ్రాసిన గ్రంథములును, శ్రీలోకాచార్యులు రచియించిన అష్టాదశ రహస్య గ్రంథములును ప్రపత్తి మార్గమున కాధారములు.

విశిష్టాద్వైత సంప్రదాయము ప్రవర్తించిన కాలమును మూడు దశలు (ఘట్టములు)గా విభజింపవచ్చును. అందు ఆళ్వారుల జీవితములును, వారి రచనలగు నాలాయిర దివ్య ప్రబంధము పూర్తియగుటలో మొదటిదశ

---

* శ్లో॥ ఇదం మహోపనిషదం చతుర్వేద సమన్వితమ్ ।
సాంఖ్యయోగ కృతాన్తేన పాంచరాత్రానుశబ్దితమ్ ॥

** ఆళ్వారుల నామములు వారు రచియించిన పాశురముల (పద్యముల) సంఖ్యను ఆ యా ప్రబంధ నామములను ఈ ప్రకరణము చివర 1వ అనుబంధమునందు చూపియున్నాను. ఈ ప్రకరణమున శ్రీ వైష్ణవసంప్రదాయమునకు చెందిన పూర్వాచార్యుల నామములును వారి శిష్యుల పేర్లను 2వ అనుబంధమున చెప్పియున్నాను.

Dr K Dayanandaswamy ebooks



ముగిసినదని భావింపవచ్చును. "ఆళ్వారులలో ప్రథముడైన యాళ్వారు దక్షిణదేశమున క్రీ.పె.5వ. శతాబ్దము పూర్వకాలమునకు జెందును. అతడీ మతమును స్వీకరించె"ననియు, కడపటి యాళ్వార్లగు శ్రీ నమ్మాళ్వార్లకు (పరాంకుశ యోగికి) శ్రీనాథముని శిష్యులనియు శ్రీయుతులు డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణపండితులు చెప్పిరి. (భా.త. 2-8-8, 5-9-5) శ్రీమన్నాథమునులతో రెండవదశ ప్రారంభ మైనది.

విశిష్టాద్వైతు లీవిధముగ చెప్పుదురు : ఆళ్వారులందఱు పరమ పదమునకు వేంచేసిన పిమ్మట కొంతకాలమునకు యమునానదీ తీర నివాసులగు శ్రీరంగనాథులను యోగీంద్రులు (వీరే నాథమునులను నామమున ప్రసిద్ధి చెందినవారు.) దక్షిణ భారతమునందలి దివ్యదేశములు* దర్శించుచు చోళ రాజ్యాంతర్గతమగు మన్ను క్షేత్రమునకు (కాట్టుమన్నార్ గుడికి) వేంచేసి అది దివ్యదేశమని తలంచి యచ్చటనే స్థిరనివాసులైరి. ఈ విషయమునే మఱియొక విధముగను చెప్పుదురు. ఎట్లనగా:- నాథమునులు తొలుత చోళరాజ్యమునందలి దివ్యదేశమునందలి వీరనారాయణ పురనివాసులై యుండి అచ్చట వేంచేసియున్న మన్నారు రాజగోపాల పెరుమాళ్లను సేవించుచుండి, భరతఖండమునందలి వైష్ణవదివ్యదేశములను దర్శింప నిచ్చగించి పెరుమాళ్ల యనుజ్ఞ గైకొని దివ్యదేశములను సేవించుచు వచ్చి యమునానదీ తీరమునందలి గోవర్ధన పురమునుచేరి అది నివాస యోగ్యమని తలచి అచ్చటనే స్థిరనివాసులైరి. కొంతకాల మట్లుండ మన్నారు రాజగోపాల పెరుమాళ్లు స్వప్నమున సాక్షాత్కరించి వీరనారాయణ పురమునకు రమ్మని చెప్పిరి. భగవదాజ్ఞానుసారము నాథమునులు కుటుంబ సమేతముగ వీరనారాయణపురమునకు వచ్చి అందు నివసించుచుండిరి- ఇట్లు 'ఆచార్యసూక్తిముక్తావళి', 'ప్రసన్నామృతమ'ను గ్రంథములయందు గలదు. (వీరనారాయణపురము దక్షిణార్కాడు మండలములోని తిరుక్కోళూరు.)

ఇట్లుండ వారొకదినము శ్రీవైష్ణవులతో ప్రసంగించు సమయమున నొక వైష్ణవుడు నాలాయిర దివ్య ప్రబంధమునందొక్క భాగము (పది

* వైష్ణవుల పుణ్యక్షేత్రములను శ్రీవైష్ణవుల పరిభాషలో "దివ్యదేశము"లని యందురు.

Dr K Dayanandaswamy ebooks


పాశురములు) చదివి వినిపింపగా తక్కిన దివ్యప్రబంధమును (ఈ ప్రబంధము పరాంకుశ యోగిని మధురకవి యళ్వార్లు స్తుతించినది) విని దానినావృత్తి చేయుచు వ్రతనియమపరులై యుండగ పరమపదమున నుండి పరాంకుశయోగి విచ్చేసి, శ్రీనాథమునులకు యోగమున తోచి వరమును గోరుమని యనుగ్రహించిరి. శ్రీమన్నాథమునులును, నాలాయిర దివ్యప్రబంధమును ప్రసాదింపుమని కోరగా, పరాంకుశ యోగీంద్రులు నాలాయిర దివ్యప్రంధమును, వాటిరహస్యములను, తిరుమంత్రమును, ద్వయమును శ్రీనాథమునుల కుపదేశించిరి.

శ్రీనాథముని దివ్య ప్రబంధములను గానము చేయుచు వానిని గురుశిష్య పరంపరగ లోకమున వ్యాపింప జేయదలచి అందుకొక సంప్రదాయమును నెలకొల్పి తమ శిష్యులగు పుండరీకాక్షసూరి యను వారిని సంప్రదాయాచార్య పట్టాభిషిక్తులుగా చేసిరి. శ్రీమన్నాథమునులు, శ్రీపుండరీకాక్ష సూరి అనంతరము తమ పౌత్రులును, నీశ్వర భట్టారకులకు పుత్రులును నగు యమునాచార్యులవారి కాపదవి నొసంగునట్లు శిష్యునకు సూచనచేసి 'న్యాయతత్త్వము', 'యోగరహస్యము' అను గ్రంథములను రచియించి నూరు సంవత్సరములు జీవించి క్రీ.శ. 924లో పరమపదమును చెందిరి.

శ్రీమన్నాథమునుల తరువాత ప్రసిద్ధి కెక్కినవారు శ్రీ యామునాచార్యులు. వీరు క్రీ.శ. 916లో జన్మించిరని చెప్పుదురు. వీరి నివాసస్థలము చోళదేశమున వీరనారాయణ పురము. చోళదేశపు రాజుయొక్క పురోహితుడగు అక్కియాళ్వాన్ అను పండితుడు ఆకాలము నందలి పండితులనెల్ల వాదమున నోడించి "విద్వజ్జన కోలాహలు"డను బిరుదమును వహించి యితర పండితులనుండి కరము (కప్పము) గైకొనుచుండెను.

ఆ విధముగనే అక్కియాళ్వాన్ తనకు కప్పము చెల్లింపుమని శ్రీ యామునాచార్యుల గురువున కొక లేఖవ్రాసి పంపిరి. కాని శ్రీ యామునాచార్యుల గురువు బీదవారగుటచే కప్ప మివ్వలేకపోయిరి. శ్రీ యామునాచార్యులకు కోపమువచ్చి దూత తెచ్చిన పత్రమును చింపి పారవైచిరి. అది విని రాజు శ్రీయామునాచార్యులను ఆస్థానమునకు

Dr K Dayanandaswamy ebooks



పిలిపించెను. రాజు శైవమతాభిమాని. రాజపత్ని వైష్ణవ మతాభిమాని. రాజు పురోహితుని శ్రీయామునాచార్యుల వారోడించిన యామునుల కర్ధరాజ్య మిచ్చులాగున రాజదంపతులు వారిలో వారు సమయము చేసికొనిరి. శ్రీయామునాచార్యులు పురోహితుని వాదమున నోడించి రాజ్య లాభమును పొంది రాజభోగము లనుభవించుచు పెద్దకాలము సుఖముగ నుండిరి.

శ్రీయామునాచార్యులు వాదమున జయము బొందినప్పుడు వైష్ణవ మతాభిమానవతియగు రాణి సంతోషమున ఆచార్యులను పిలిపించి "ఆళవందారే" మమ్ము రక్షించుటకు వచ్చినస్వామి! అని సంబోధించెనట. తదాదిగ యామునాచార్యుల వారికి 'ఆళవందార్' అను నామాంతరము కలిగెను. శ్రీయామునాచార్యులు చోళరాజు కనిష్ఠ సోదరిని వివాహ మాడినట్లును, దిగ్విజయము చేసినట్లును 'ఆముక్తమాల్యద' యందు గలదు. కాని 'గురుపరంపరా ప్రభావ, ప్రపన్నామృత గ్రంథములయం దారెండు విషయములు లేవు.

ఇట్లు యామునాచార్యులవారు రాజ్యపాలనము చేయుచు చాలకాలము గడపిన పిదప శ్రీ పుండరీకాక్షసూరి శిష్యులగు శ్రీరామ మిశ్రులు (మణక్కాల్ నంబి) గారి ప్రోత్సాహమున రాజ్యపరిత్యాగము చేసి పితామహార్జిత ధనమగు నీ సంప్రదాయ రహస్యమును తెలిసికొని సన్న్యాసాశ్రమము గైకొని శ్రీరంగమున గురుపీఠము నధిష్ఠించి యుండిరి. యామునాచార్యులు తాము వృద్ధులగుటచే తమ యనంతర మాపీఠము నధిష్ఠించు యోగ్యతగల విశిష్టాద్వైత సంప్రదాయ ప్రవర్తకాచార్యు లెవ్వరాయని విచారించుచుండ భూతపురి (శ్రీపెరుంబుదూరు)లో నవతరించి కాంచీపురమున యాదవప్రకాశునొద్ద విద్య నభ్యసించుచున్న శ్రీ రామానుజాచార్యులవారి పాండిత్యాదులను గుఱించి వినియుండిన వారుగనుక వారు తగినవారని తలచి రామానుజాచార్యులవారిని పిలువనంపిరి.

శ్రీ రామానుజులవారు శ్రీరంగమునకు వచ్చునప్పటికి యామునా చార్యులవారు పరమపదించిరి. శ్రీవారి శిష్యులు గురువుగారి చరమ విగ్రహమునకు చరమకైంకర్యమును చేయదలచి కావేరి తీరమునకు తెచ్చియుండు సమయమునకు శ్రీరామానుజులవా రచటి కరుదెంచి

Dr K Dayanandaswamy ebooks



శ్రీయామునాచార్యులవారి భౌతిక దేహమును దర్శించిరి. వారి కచట నొకవిశేషము గోచరించెను. ఆ విశేషమిది: సామాన్యముగా మృతులైన వారి అవయవములు కొయ్యబారి చక్కగా చాచబడియుండును. ఇచ్చట శ్రీయామునుల హస్తమున మూడువ్రేళ్లు వంగియుండుట గని దీని యర్థమేమని శ్రీ రామానుజులు యామునాచార్యుల వారి శిష్యులను ప్రశ్నించిరి. వారును వారి గురువుగారి అంతర్య మెఱిగి యున్నవారు గనుక "(1) బ్రహ్మసూత్రములకు భాష్యము వ్రాయుట (2) తిరువాయిమొళి ప్రబంధమునకు సంక్షిప్త వ్యాఖ్యానము చేయుట (3) సిద్ధాంత రహస్యముల నెల్ల వెల్లడించి, లోకమునకు మేలుగూర్చి, ప్రసిద్ధులగు శ్రీవైష్ణవ కుటుంబములో జన్మించినవారి కెవరికైన వ్యాస పరాశర నామము లిడుట." ఈ మూడు కార్యములు మీచేత చేయింపవలెనని మా గురువుగారి యభీష్టమై యుండినదని చెప్పిరి. అంత రామానుజులవా రాకార్యము చేసెదనని యంగీకరింప యామునాచార్యులవారి హస్తమున వంగియున్న మూడు వ్రేళును చాపబడెను. తదనంతరము యామునాచార్యుల వారి చరమవిగ్రహమునకు చరమకైంకర్యమును చేసిరి.

శ్రీ రామానుజాచార్యులవారును మాట తప్పక ఆ కార్యమును వారి జీవితమునందు పూర్తిచేసి విశిష్టాద్వైత మతమును వ్యాప్తి నొందించిరి. వీరి శిష్యులలో నొకరగు శ్రీ కూరుత్తాళ్వాన్‌గారి పుత్రులకు వ్యాసభట్టు, పరాశరభట్టు అనునామము లిడిరి. బ్రహ్మసూత్రములకు "శ్రీభాష్య" మనుపేర భాష్యమును రచియించిరి. పరాంకుశయోగి విరచితమగు తిరువాయి మొళికి లఘుటీక వ్రాయించిరి.* తన ప్రధాన శిష్యులయందు డెబ్బది నలువురకు 74 శంఖములు చక్రములు ప్రసాదించి వారిని, వారి వంశమువారిని మతాచార్యులుగా నియమించి కృతకృత్యులైరి. శ్రీ రామానుజాచార్యుల వారు పరమపదించుటతో** విశిష్టాద్వైతమతము యొక్క రెండవ దశ ముగిసెను. తదనంతరము ఇప్పుడు జరుగుచున్నది మూడవ దశగా భావింపవచ్చును.

శ్రీ రామానుజాచార్యులవారు బ్రహ్మసూత్రములకును, భగవద్గీతకును

---

* శ్రీ రామానుజులవారి యాజ్ఞచే తిరుక్కురుకై పిరాన్ పిళ్ళాన్ అనువారు అరాయిరప్పడి అనువ్యాఖ్యను రచియించిరి. ఈ గ్రంథ మాఱువేల గ్రంథ సంఖ్యగలది.

** శ్రీరామానుజులవారు క్రీ.శ. 1017 జన్మించి క్రీ.శ. 1137 నందు పరమపదించిరి.

Dr K Dayanandaswamy ebooks



విశిష్టాద్వైత పరముగ భాష్యములు రచియించిరి. ఆళ్వార్లయొక్కయు, ఆచార్యులయొక్కయు రచనలను; ఉపనిషత్తులు, గీత, మహాభారతాంతర్గతమగు నారాయణీయ ధర్మములయందుగల విషయముతో (విరోధము లేదని) సమన్వయ పరచిరట. వీరి విశిష్టాద్వైతము జైమిని మహర్షి పూర్వమీమాంసతోను, ఉపనిషత్తుల యందలి జ్ఞానమార్గముతోను, వాసుదేవ భక్తిమార్గముతోను చేర్చి చెప్పబడినట్లు పండితుల అభిప్రాయము. వీరు బ్రహ్మసూత్రములకు రచియించిన శ్రీ భాష్యము వీరు రచియించిన గ్రంథములలో ప్రసిద్ధికెక్కినది. ఆ కారణమున శ్రీ వైష్ణవుల గ్రంథములయందు తఱచుగా వీరిని 'శ్రీభాష్యకారు'లని వ్రాయుచుందురు. వీరి విశిష్టాద్వైత మతమును తెలిసికొనుటకు ముఖ్యముగ ఈ క్రింద చెప్పబోవు నైదువిషయములను, తత్త్వత్రయమును చక్కగా నెఱిగి యుండవలెను.

## (2) అర్థపంచకము

శ్లో॥ ప్రాప్యస్య బ్రహ్మణోరూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః ।
ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తే" తథా ప్రాప్తి విరోధి చ ॥
వదన్తి సకలా వేదా స్సేతిహాస పురాణకాః ।
మునయశ్చ మహాత్మానో వేద వేదార్థ వేదినః ॥ (ర.సా.)

తా॥ (1) ప్రాప్యస్వరూపము అనగా : దేనిని పొందవలయునో అట్టి బ్రహ్మస్వరూప మిట్టిదని యెఱుగవలయును.

(2) ప్రాప్తస్వరూపముఅనగా : జీవుని స్వరూపజ్ఞానము,

(3) ఉపాయస్వరూపము అనగా : ప్రాప్తికిగా నగు నుపాయము. ఏయుపాయముచే బ్రహ్మము నెఱుగవచ్చునో యట్టి యుపాయ మిట్టిదని దాని స్వరూప విచారము చేయవలయును.

(4) ఫలస్వరూపము అనగా : ప్రాప్తికిగానగు ఫలము యొక్క స్వరూపము.

Dr K Dayanandaswamy ebooks



(5) **విరోధిస్వరూపము అనగా:** ప్రాప్తివిషయమగు విరోధి స్వరూపము. విరోధిస్వరూపము తెలిసికొనిన దానిని పరిహరించుట సులభము.

ఈ యైదింటిని తెలిసికొనవలెనని సమస్తవేదములు, ఇతిహాసములు, పురాణములు వీటియొక్క అర్థము నెఱిగిన మునులందఱును తెలుపు చున్నారు.

ఇవిగాక తత్త్వత్రయమును గుఱించి తెలిసికొనవలెను. తత్త్వత్రయమనగా : (1) ఈశ్వరుడు (2) చేతనులు (3) అచేతనములు. ఈతత్త్వత్రయము ఒక్కటిగా లెక్కించి అర్థపంచకముతో కలిపిన ఆఱగుచున్నది. ఇట్లే రహస్యత్రయము నెఱుగవలెను. రహస్యత్రయ మనగా: మూడు రహస్యములు. అవి. (1) తిరుమంత్రము (2) ద్వయము (3) చరమశ్లోకము. అర్థపంచక విచారమునందు రహస్యత్రయమును, రహస్యత్రయమునందు తత్త్వత్రయ అర్థపంచకములును ఒక దానితో ఒకటి చేరియే యున్నవి. కనుక నివన్నియు చక్కగా నెఱిగిన వాడే సర్వము నెఱింగినవాడు.

పైన చెప్పిన అర్థపంచకమునందు ఒక్కొక్కటి అయిదువిధములని చెప్పుదురు. ఎట్లనగా :

(1) **ప్రాప్యస్వరూపము (పొందదగిన పరస్వరూపము):** (1) ఈశ్వర స్వరూపము (2) వ్యూహము (3) విభవము (4) అంతర్యామి (5) అర్చావతారము.

(2) **ప్రాప్తస్వరూపము (స్వస్వరూపము):** (1) నిత్యులు (2) ముక్తులు (3) కేవలులు (4) ముముక్షువులు (5) బద్ధులు,

(3) **ఉపాయస్వరూపము :** (1) కర్మము (2) జ్ఞానము (3) భక్తి (4) ప్రపత్తి (5) ఆచార్యాభిమానము.

(4) **ఫలస్వరూపము :** (1) ధర్మము (2) అర్థము (3) కామము (4) ఆత్మానుభవము (5) భగవదనుభవము.

Dr K Dayanandaswamy ebooks



(5) విరోధిస్వరూపము : (1) పరత్వవిరోధి (2) స్వరూప విరోధి (3) పురుషార్థవిరోధి (4) ఉపాయవిరోధి (5) ప్రాప్తి విరోధి. ఇందు మొదట ప్రాప్యస్వరూపమును గుఱించి విచారించవలెను.

## (3) ఈశ్వరుడు

అద్వైతమతము ననుసరించి పరబ్రహ్మము నిర్విశేషము. విశిష్టాద్వైతము ననుసరించి బ్రహ్మము విశేషణ యుక్తము. చిదచిత్తులు రెండును బ్రహ్మముయొక్క విశేషణములు. సర్వేశ్వరుడు విశేష్యము. చిత్తు అనగా : ఆత్మ, లేక జీవుడు, అచిత్తనగా : జగత్తు, జడము, ఆత్మలు, చేతనులు అని జీవులకు పేర్లు. చేతనులుకాని జడద్రవ్య మంతయు అనగా : ప్రకృతి మొదలు గడ్డిపోచవఱకుగల నానాస్థావర జంగమ స్థూలసూక్ష్మ కారణోపాధులు అచిత్తు. జీవునకు శరీరమెట్లో చిదచిత్తులు రెండును సర్వేశ్వరునకు శరీరము వంటివి. చిదచిద్విశిష్ట సంపూర్ణ రూప మాయనది. ద్రవ్యమునకు గుణమువలె చిదచిత్తులు రెండును ఆయనయం దంతర్భాగములై, ఆత్మకు శరీరమువలె నుండును.

షడ్భావవికారములు, జల జడజగత్తు - ఆయన శరీర మనుటలో అర్థ మేమనగా: ఆయన ఆత్మ నిర్వికారమని, ఆయన శరీరము వికారముతో కూడిన నిత్యత కలదని యర్థము. సకల ప్రాణిజాతముయొక్క శరీరములు ఆయన శరీరము. అట్లనుటలోని భావమేమనగా : ప్రాణుల శరీరములు గాక శరీరములయొక్క మూలద్రవ్యములని యర్థము. జీవాత్మలాయనకు సూక్ష్మ శరీరముగను, జడజగత్తు స్థూలశరీరముగను నుండును. జీవులనుభవించు సుఖదుఃఖాదులు సర్వేశ్వరుని నంటవు. చిదచిత్తుల యందలి లోపము లాయనయం దున్నవని తలచరాదు. జీవాత్మలు చేయు కర్మలకు ఈశ్వరుడు బాధ్యుడు కాడు. కర్మాధిపతియై వారికి కర్మఫలమును ప్రసాదించును. ఆయన శేషి, ప్రకారి, నియంతయని చెప్పబడును.

Dr K Dayanandaswamy ebooks



విశేషణములు, విశేష్యమునకు చెందినవే యగుటచే అవి రెండుగ గణింపబడవు. ఎట్లనగా: మనము ఒక నల్లరంగుగల ఆవును చూచినపుడు దాని వర్ణమునుబట్టి అది నీలవర్ణ విశేషము గల గోవని వ్యవహరింపబడినట్లు నీలవర్ణము గోవునకు సంబంధించిన దనుటవలన గోవున కది అభిన్నము. ఇట్టి బ్రహ్మము సగుణుడు. అద్వైతులు చెప్పునట్లు నిర్గుణుడు, నిర్విశేషుడు కాడు. నిర్గుణమును, నిర్విశేషమును నగు వస్తువు కలదని తెలిసికొనుటకు మానవునకు సాధ్యము కాదు. బ్రహ్మము నిర్గుణమని చెప్పు శ్రుతివాక్యములకు వస్తువుల కుండునట్టి పరిచ్ఛిన్న గుణములును లేనిదని యర్థము - బ్రహ్మము జ్ఞానాతీతము, భావాతీతమని చెప్పు శ్రుతులకు మనస్సున కందని అనంత కల్యాణ గుణములు కలదియని అర్థము. అద్వైతులు పరబ్రహ్మము, ఈశ్వరుడు ఇరువురు భిన్నులని చెప్పుదురు. వీరి మతము ననుసరించి ఈశ్వరుడన్నను పరబ్రహ్మమన్నను నొక్కటియే, భేదములేదు. ఇట్టి సర్వేశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వనియంత, శేషి, నిరంకుశ శక్తి సంపన్నుడు, సర్వశక్తియుతుడు, సృష్టి స్థితి లయములకు కారకుడు, సర్వాంతరాత్ముడు, సర్వవ్యాపియునై యున్నాడు. ఆయనకు సూక్ష్మతమమగు దివ్యరూపము గలదు. భక్తానుగ్రహము కొఱకాయన లక్ష్మీయుతుడై వైకుంఠమున వేంచేసియుండును. ఈయన నారాయణ శబ్దవాచ్యుడు. నారాయణునకు సమానుడుగాని, అధికుడుగాని లేడు. శ్రుతులయందు చెప్పు శివ, శంభు ఈశ్వర శబ్దములు నారాయణ పరములేగాని కైలాస వాసియగు ఉమాపతి పరములు గావు. ఆయన రుద్రశబ్దవాచ్యుడు. సమస్తమును శ్రీమన్నారాయణుని యిచ్ఛాధీనమై యుండును. ఆయన యిచ్ఛకు అంకుశము లేదు. చేతనుల పాపములను క్షమించును.

సర్వేశ్వరునికి చెప్పబడిన సర్వజ్ఞత్వాది లక్షణములు ప్రపంచమున గల యే పరిచ్ఛిన్న వస్తువునకుగాని, యే వ్యక్తికిగాని చెందకపోయినను సమస్తమును ఆయనకు చెందిన దగుటచే ఆయన యేకత్వమునకు భంగము కలుగదు. మఱియు సర్వేశ్వరుడు ముందు చెప్పబోవు చేతనాచేతనముల

Dr K Dayanandaswamy ebooks



యొక్క స్వరూపస్థితి ప్రవృత్తులను* తన యధీనములో నుంచుకొనియుండును. కనుక సర్వేశ్వరుడు నియంత, తక్కిన రెండును నియామకములు. సర్వేశ్వరుడు కేవలము జీవులయొక్క సమష్టి స్వరూపము కాదు. ఆయన సకల జగదంతర్యామియు, సకల జగద్రూపుడును నగుటయేగాక ఆయనకొక వ్యక్తిత్వము గలదు. అనగా : నీశ్వరుడొక సంపూర్ణ వ్యక్తి. సత్యజ్ఞానానందాది లక్షణములు వ్యక్తిగతములేగాని నిర్గుణవస్తువునకు చెందినవి గావందురు. ఇట్టి సర్వేశ్వరుడు 1. పర 2. వ్యూహ 3. విభవ 4. అంతర్యామి 5. అర్చావతారములుగ అయిదు విధములుగ నుండును. అందు :

(1) పర : నీలమేఘశ్యాముడు, చతుర్భుజుడు, పద్మపత్రాక్షుడు, పీతాంబరధారి, శేషశాయి మొదలగు అప్రాకృత దివ్యమంగళ విగ్రహముతో నుండును. ఆ పరమ పురుషునకు పురుషుడు (జీవుడు) కౌస్తుభమణిగను, ప్రకృతి శ్రీవత్స చిహ్నముగను, మహత్తు గదాయుధముగను, జ్ఞానము ఖడ్గముగను, అజ్ఞానము ఖడ్గముయొక్క ఒఱగను, సాత్త్విక తామసాహంకార ములు శార్ఙ్గ చక్రములుగను, కర్మేంద్రియ జ్ఞానేంద్రియములు శరంభులు గను, స్థూల సూక్ష్మములగు ద్వివిధ భూతములును వనమాలగాను, గరుడశరీరమగు శ్రుతుల యందు తెలియవచ్చునట్టి సర్వేశ్వరుడు వైకుంఠమున లక్ష్మీ సహితుండై యుండును. దీనిని నిత్యవిభూతియనియు, పరవ్యూహమనియు నందురు. ప్రపంచ రంగమును లీలా విభూతి యందురు. ఈశ్వరుడుభయవిభూతి నాయకుడు.

శ్రీ రామానుజాచార్యులవారు 'శరణాగతి గద్య' యందు ప్రథమమున శ్రీ దేవిని స్తుతించి పిమ్మట భగవంతుని దివ్యాత్మ స్వరూపమును,

---

* పైన చెప్పిన స్వరూపముల వివరము : స్వరూపమనగా : తన యందు మాత్రమే యుండునట్టి ధర్మమువలన దెలుపబడునట్టి వస్తువు. స్థితి యనగా : ఇది కాలాంతరమందు సయిత ముండుట. ఇది నిత్యవస్తువుల యందు నిత్యముగా నుండును. అనిత్యవస్తువులయందు ఈశ్వర సంకల్పానుసారముగ హెచ్చియును తగ్గియును ఉండగలదు. ప్రవృత్తియనగా ప్రవృత్తి నివృత్తి రూపమగు వ్యాపారము. (రహస్యత్రయ సారము).

Dr K Dayanandaswamy ebooks



దివ్యమంగళ విగ్రహమును కల్యాణ గుణములను ఇట్లు వర్ణించి స్తుతించియున్నారు :

"అఖిలహేయ ప్రత్యనీక కల్యాణైకతాన స్వేతర సమస్త వస్తు విలక్షణా నన్త జ్ఞానానన్దైకస్వరూప! : స్వాభిమతానురూపైక రూపాచిన్త్య దివ్యాద్భుత నిత్య నిరవద్య నిరతిశయౌజ్జ్వల్య సౌన్దర్య సౌగంధ్య సౌకుమార్య లావణ్య యౌవనాద్యనన్త గుణనిధి దివ్యరూప! స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తితేజ స్సౌశీల్య వాత్సల్యమార్దవ వార్జవ సౌహార్ద సౌమ్యకారుణ్య మాధుర్య గాంభీర్యౌదార్య చాతుర్య స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ! సత్యకామ సత్యసంకల్ప కృతిత్వ కృతజ్ఞతా ద్యసంఖ్యేయ కల్యాణ గుణగణౌఘ మహార్ణవ!"

తా॥ "సమస్తదోష గుణములకు దూరమై, కల్యాణ గుణములకు మాత్రము నెలవై, తనకన్నను వేఱగు సమస్త వస్తువులకంటెను విలక్షణమై, దేశకాల వస్తుపరిచ్ఛేద రహితమై, జ్ఞానానందైక స్వరూపమై యుండువాడా! తన కభిమతమైనదియు, తగినదియు, మార్పు లేనిదియు, చింతింప నలవికానిదియు, అప్రాకృత మైనదియు, అద్భుత మైనదియు, శాశ్వత మైనదియు, నిరవద్య మైనదియు, సాటిలేనిదియు, ప్రకాశము గలిగినదియు, సౌందర్య లావణ్య యౌవనాది అపరిమిత గుణములకు నిలయ మైనదియు నగు దివ్యమంగళ విగ్రహము గలవాడా! తనకు మాత్రము స్వభావముగా గలవై అంతకన్నను అధికమగునవి లేనట్టి జ్ఞానము, బలము, ఐశ్వర్యము, వీర్యము, శక్తి, తేజస్సు, సౌశీల్యము, వాత్సల్యము, కారుణ్యము, మాధుర్యము, గాంభీర్యము, ఔదార్యము, చాతుర్యము, స్థైర్యము, ధైర్యము, శౌర్యము. పరాక్రమము, సత్యకామము, సత్యసంకల్పము, కృతిత్వము, కృతజ్ఞత్వము - అనునిట్టి అనంతకల్యాణ గుణములను ప్రవాహములకు సముద్రము వంటివాడా!" యని యనేక విధముల స్తుతించిరి.

(2) **వ్యూహమనగా** : వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధములని చతుర్వ్యూహములు.

(3) **విభవావతారములు** : ప్రపంచమున ధర్మమునకు గ్లాని కలిగినపుడు

Dr K Dayanandaswamy ebooks



ధర్మము నుద్ధరించుటకును, అధర్మము నడంచుటకును సర్వేశ్వరుడు అప్రాకృతమునుండి ప్రాకృతుడై నట్లుండుట విభవ మందురు.

ఆయన షడ్గుణైశ్వర్యాది దైవసంపద కెట్టి లోపమును కలుగకుండ ననేక రూపములతో ననేక పర్యాయము లవతరించెను. ఇట్టి విభవావతారములు ఏ కార్యము కొఱకై అవతరించునో అట్టి కార్యము ముగిసినంతనే ముగియుచుండును. శ్రీరామకృష్ణాది అవతారములిట్టివి. ఇట్లు, యవతరించుటనుగొని జీవులు తాము కర్మవశమున జన్మించినట్లు స్వామి జన్మించెనని భావించరాదు. ఆ యవతారములందు ధరింపబడిన శరీరములు పాంచభౌతికములు కావు. శుద్ధసత్త్వ ప్రధానములైనవి. లీలా విలాసార్థము ధరింపబడినవి.* శ్రీరామావతారము నందు జ్ఞానసంకోచమున్నట్లు చెప్పబడినను, నిజమునకు స్వామికి జ్ఞానసంకోచ మనునది లేదు. అట్టి శరీరము సర్వేశ్వరుని సంకల్ప మాత్రముచేతనే గలుగును.

విభవావతారములు ప్రాదుర్భావములని ఆవేశములని ద్వివిధములు. (1) ప్రాదుర్భావమనగా : ఒక జీవునిద్వారా గాక సాక్షాత్తుగ స్వరూపమును ధరించుట. ఇందు 'పూర్ణము', 'అంశము' అని రెండు విధములు గలవు. శ్రీ నృసింహ రామకృష్ణావతారములు పూర్ణావతారములు. మత్స్యకూర్మాద్యవతారములు అంశావతారములు. (2) ఆవేశావతారమనగా: జీవుని ద్వారా అవతారపరిగ్రహము. ఇవియు రెండువిధములు. 'స్వరూపావేశము' 'శక్త్యావేశము' ఏ శరీరమునందు భగవదంశము ప్రవేశించుచున్నదో అది 'స్వరూపావేశము' పరశురామాద్యవతారము లిట్టివి. ఎవరియందు భగవంతుని శక్తి ప్రవేశించుచున్నదో అది శక్త్యావేశావతారము. కృష్ణద్వైపాయన మునీంద్రాదుల యవతారము లిట్టివి.

---

* శ్రీహరి రామావతారమును ధరించునప్పుడు సహజముగ తనకు గల సర్వజ్ఞత్వాదులను స్వసంకల్పముతోనే తాత్కాలికముగ సంకోచింపజేసికొనిరి. శ్రీమద్రామాయణముననున్న శ్రీరామావతార రహస్య మిదియే. ఆ యవతారమున జ్ఞానసంకోచము లేదను శ్రీరామానుజసిద్ధాంతమును నేనంగీకరింపను.

Dr K Dayanandaswamy ebooks


(4) **అంతర్యామ్యవతారము** : ఈశ్వరుడు సమస్త జీవులయందును నీలమేఘమధ్యమున మెఱుపు తీగవలె నుండునని యందురు. పరాంకుశయోగీంద్రులు (నమ్మాళ్వారు) తిరువాయిమొ(½)ళియం దిట్లు చెప్పిరి. "**ఒరువనడి యేనుళ్ళానే**" దీని యర్థము:- "ఒరువన్=అద్వితీయుడైన శ్రియఃపతి, అడియేన్=దాసునియొక్క, ఉళ్లాన్=హృదయమునందు వేంచేసియున్నాడు. (తిరు. 8-8-1), మఱియు "**అడియేనుళ్ళానుడలుళ్ళానణ్డగత్తాన్ పుఱత్తుళ్ళాన్.**" దీని యొక్క అర్థము : "అణ్డత్తు అగత్తాన్=అండాంతర్వర్తులైన సకలపదార్థముల కంతర్యామియు, పురత్తు ఉళ్ళాన్=అండబహిర్భూతములైన మహదాదుల కంతర్యామియు, (నగు శ్రియఃపతి) అడియేన్=దాసునియొక్క, ఉళ్లాన్=హృదయము నందును, ఉడలుళ్ళాన్ శరీరమునందును నున్నాడు. (తిరు. 8-8 2) సర్వాంతర్యామి యగు సర్వేశ్వరుని స్వరూపమును భావించుకొని అనుసంధించుకొనుటకు శక్తిలేని వారలు హృదయపద్మము నందుండు నీలమేఘశ్యాముడు, చతుర్భుజుడు, శఙ్ఖచక్రాది ఆయుధములు ధరించినవాడును నైన సర్వేశ్వరుని అష్టాంగాది యోగములవలన ధ్యానము వలనను అనుసంధించుకొందురు.

(5) **అర్చావతారము** : విభవావతారములు సర్వకాలములయందును కలిగియుండు నట్టివి గావు. కనుక ఆయవతారములు లేని కాలమందు వారిదర్శనము మనకు కలుగదు. అందువలన భగవంతుడు భక్తజనానుగ్రహము కొఱకు అర్చావతారమును ధరించుచుండును. అనగా: శిలాదుల రూపమున ఆరాధనకొఱకు తిరుముఖ మండలము, తిరు నేత్రములు, చతుర్భుజములు, శంఖచక్రములు మొదలగు సాధనములతో భక్తులకు దర్శన మిచ్చుటకు వారిచేత ఆరాధింపబడుటకు అనుకూలముగా నుండునట్లు చేయును. ఇట్టి యర్చామూర్తికి కైంకర్య మొనర్చుట వైకుంఠమున లక్ష్మీసహితుడగు శ్రీమన్నారాయణునికి కైంకర్య మొనర్చుట వంటిదేయని భావింపవలెను.

పైన చెప్పిన పర, వ్యూహ, విభవ, అంతర్యామ్యవతారములకంటె కోవెలలోను, గృహములలోను కంటికి విషయమై నిలుచు అర్చావతారములే అతిశయితములని వీరిమతము. కారణమిట్లు చెప్పుదురు. పైన చెప్పిన పరత్వాదులు అప్పుడే దర్శించి పొందవలయునను నాశగల ముముక్షువు

Dr K Dayanandaswamy ebooks



లకు ప్రయోజనపడని వగుటవలనను, భగవంతుడు అవాప్త సమస్త కాముడై యుండు స్థితిని వదలి దీనుడై నిలిచియుండుటవలనను, విభవాదులన్ననో దప్పిగొన్న వానికి భూగర్భముననున్న నీరువలెను, ఎప్పుడో ప్రవహించి నిలిచిపోయిన నదులవలెను, సమీపించుటకు సాధ్యముకాని పాలసముద్రమువలెను దుర్లభము లగుటచే నిరుపయోగము లగును. అట్లుగాక ఈయవతారమున సౌలభ్య వాత్సల్యాది గుణములు గొప్ప ప్రకాశము కలిగియుండును. (శ్రీవచనభూషణము 34 నుండి 41-వ చూర్ణికవఱకు గల యర్థము.)

## (4) చేతనులు

ఈ మతము ననుసరించి జీవుడనగా: ధర్మిభూతజ్ఞానము, ఆనందము, అమలము, అణువు, నిరవయవియని చెప్పుదురు.

అనగా : జీవుడు జ్ఞానత్వ, ఆనందత్వ, అమలత్వ, నిరవయవత్వాది ధర్మములు కలవాడని యర్థము. జీవుల సంఖ్య అనంతము. వీరు నిత్యులు, అగోచరులు. దేహేంద్రియ ప్రాణబుద్ధులకు వేరైనవారై హృదయమునందుండి దేహాదులను ప్రకాశింపజేయుదురు. ఎట్లనగా : ఇంటియం దొకచోట నుంచబడిన దీపము అచ్చటినుండియే గదియంతయు ప్రకాశింపజేసినట్లు; అణువుగాను, చేతనుడుగాను నుండుట జీవుని లక్షణ మైనట్లు, భగవంతునకు శేషభూతుడుగా నుండుట జీవ లక్షణముగా చెప్పబడినది. ఆత్మలు (జీవునకును) జ్ఞానము గలవారు. ఆత్మస్వరూపము యొక్క ప్రకాశమునకు సంకోచ వికాసము లెప్పుడును నుండవు. జ్ఞానత్వము, స్వయం ప్రకాశత్వము - ఈ రెండును ధర్మభూతజ్ఞానమునకును ధర్మియగు జీవునకు (ఆత్మకును) సమానములే.

ఐతే ధర్మభూత జ్ఞానమునకు విషయిత్వము (శబ్దాదివిషయములను నెఱుగునట్టిది విషయి. విషయము నెఱుగుట విషయిత్వము) అధికము. ఐతే జ్ఞానము ఏదైననొక వస్తువును ప్రకాశింపజేయగలదు గాని తనను తాను తెలిసికొనజాలదు. ధర్మికి (ఆత్మకు) అన్యసహాయము లేక తన్నుతాను తెలిసికొనుట యనెడి ప్రత్యక్త్వము అధికము. "ధర్మభూత జ్ఞానము

Dr K Dayanandaswamy ebooks



విషయముల ప్రకాశింపజేయునప్పుడు తన కాధారమగు ఆత్మస్వరూప విషయమున స్వయంప్రకాశముగ నుండగలదు." 'జ్ఞానత్వమని చెప్పినపుడు తనను తాను ప్రకాశింపజేయుట యైనను, వేఱొక దానిని ప్రకాశింపజేయుట యైనను జ్ఞానత్వమే యగును. ఆత్మ జ్ఞానము కాదు, జ్ఞానాశ్రయముమాత్రమే. లోకాచార్యుల వారు తత్త్వత్రయమను గ్రంథమున నిట్లు చెప్పిరి: జ్ఞానాశ్రయమైతే శాస్త్రములలో ఆత్మను జ్ఞానమని చెప్పుట యెటులనగా: జ్ఞానము లేకయు తన్ను తెలిసికొనుటచేతను, జ్ఞానము సారభూతగుణమై నిరూపక ధర్మమగుటచేతను జ్ఞానమని చెప్పబడినది."

జి : ఆత్మ (జీవుడు) తనను తప్ప మరి దేనినైనను, నెఱుగడా?

వే : ఎఱుగడు, లోకాచార్యులవా రిట్లు చెప్పిరి:- "జ్ఞానమునకును, స్వరూపమునకును (జీవునకును) వ్యత్యాస మేమనగా: "స్వరూపము ధర్మియై సంకోచవికాసములకు తగనిదై తన్నుతప్ప ఇంకొకదానిని ప్రకాశింపజేయుటకు తగనిదియై అణువుగ నుండును.... జ్ఞానము విభువుగ (వ్యాపించి) ఉండును. కొందఱి జ్ఞానము ఎప్పుడును అవిభువుగ నుండును. మఱికొందఱి జ్ఞానము ఒకపుడు విభవుగను, ఒకపుడు అవిభువుగను ఉండును." (తత్త్వత్రయము)

జి : మనము 'నేను' , 'నేను' అని వ్యవహరించు చున్నాము గదా! నేననగా ఈ మతము ననుసరించి యేది?

వే : శ్రీరామానుజాచార్యులవా రిట్లు చెప్పిరి : " 'నేను' అనబడునది ధర్మిగాను అనగా: జ్ఞాన మనబడునట్టి గుణము గలదిగాను, జ్ఞాన మన్నతో అట్టి నేను అనబడుదాని యొక్క గుణముగాను ప్రత్యక్షముగా తెలియవచ్చుచుండుట వలనను, ఆత్మకాని పదార్థము ఆత్మయనెడి భ్రాంతి కలుగునప్పుడు 'నేను స్థూలమైనవాడను' అని యిట్లు ఆత్మ కానిదగు శరీరముయొక్క ధర్మములగు స్థూలత్వాదులు 'నేను' అనబడు దానియందే

Dr K Dayanandaswamy ebooks



ఆరోపింపబడినవియే యై జ్ఞానమం దారోపింపబడ కుండుట వలనను జ్ఞాతయగు 'నేను' అనబడువస్తువే ఆత్మయని యెఱుంగునది."*

**(శ్రీమదాంధ్ర శ్రీభాష్యము - జిజ్ఞాసాధికరణము - మహాసిద్ధాంతము)**

జీవాత్మలకును, సర్వేశ్వరునకును, కొన్ని సాధారణ లక్షణములు గలవు. అవి యేవనగా :(1)చేతనత్వము అనగా: జ్ఞానమునకు ఆశ్రయముగా నుండుట, (2) ప్రత్యక్త్వము అనగా: తనకు తాను తెలియవచ్చుట. అన్య సహాయము లేకయే 'నేను' అని యిట్లు తన్ను తాను తెలిసికొనుట. (3) ఆనందత్వము.

ఇరువురకును గల ముఖ్యభేద మేమనగా: జీవుడు ఆనందస్వరూపు డైనను అణువగుటవలన ఆనందము పరిమితమై యుండును. ఈశ్వరుడు అపరిచ్ఛిన్ను డగుటవలన ఆనందమునకు పరిమితి లేదు. బ్రహ్మానందాను భవ మహాసాగరమున జీవుని యానందము బిందుమాత్రమని యూహింప వచ్చును. మఱియు సర్వేశ్వరుడు స్వతంత్రుడు, జీవులు స్వతంత్రులు కారు. వీరు సర్వేశ్వరాధీనులు. అయినను ధర్మాధర్మములు చేయుటకు జీవునకు స్వాతంత్ర్యము కలదు. జీవుడు కర్త, భోక్త, జ్ఞాత. జీవుల జ్ఞానము నిత్యము, స్వతస్సిద్ధము. ఐనను పూర్వజన్మకర్మ విశేషమువలన అది తాత్కాలికముగ కొన్ని యెడల సంకోచమును చెందియుండును. జీవుడు దేవుడు కాడు. జీవుడు కర్త, భోక్త, జ్ఞాతయునై యున్నాడు. (1) నిత్యులు (2) ముక్తులు (3) కేవలులు (4) ముముక్షువులు (5) బద్ధులు - అని వీరు అయిదు విధములు.

(1) **నిత్యులనగా** : వీరెకప్పుడును బద్ధులు గారు. అనాదిగా వీరు భగవత్కృపకు పాత్రులై ప్రవాహనిత్యములగు కైంకర్య విశేషములందు ప్రవృత్తులై యుందురు. వీరును పరతంత్రులే. వీరిస్థితులలో భేదముండదు. వీరు అనంత, గరుడ, విష్వక్సేనాదులు.

---

* అద్వైతులు చెప్పునట్టి కూటస్థుని వీరు చెప్పు ఆత్మతోను, చిదాభాసుని ఆత్మగుణమగు జ్ఞానముతోను కొంతవఱకు పోల్చవచ్చును. (కూటస్థ చిదాభాసులను గుఱించి యీ గ్రంథము 1-2-29లో చూడవలెను.)

Dr K Dayanandaswamy ebooks


(2) **ముక్తజీవులనగా** : మోక్షమునకు ప్రతిబంధము నశించి వైకుంఠమునకు పోయి అచ్చట ఆనంద మనుభవించుచు స్వస్వరూపావిర్భావము (అనగా మోక్షము) కలవారై యుందురు. అనాదికాలమునుండి కష్టపడి సంపాదించుకొనిన భగవదనుగ్రహమువలన యథేచ్ఛగా భగవత్కైంకర్యము చేయుచుందురు. వీరికి సంకల్ప మాత్రమున కోరికలు సిద్ధించును. వీరిలో కొందఱు ముందుగ ముక్తు లయినవారు, కొందఱు తర్వాత ముక్తు లయినవారు.

(3) **కేవలులు** : సంసారమును రోసి పునర్జన్మనివృత్తికై శాస్త్రములను శోధించి శాస్త్రజన్యజ్ఞానముచేత ఆత్మానాత్మ విచారము చేసి, ప్రకృతియు దాని వికారములగు ఇరువదిమూడును చేరి అనాత్మయనియు, ఆత్మ వీటికంటెను వేఱైనవాడును, స్వయంప్రకాశుడు, ఆనందరూపుడు, నిత్యుడు, వికారరహితుడనియు తెలిసికొని, జ్ఞానయోగమున అనాత్మనుండి ఆత్మను వేఱుచేసి, ఆత్మయందే రమించుచు, జ్ఞాననిష్ఠులై యోగఫలమైన ఆత్మానుభవము(కైవల్యము) మాత్రమే పరమపురుషార్థమని అనుభవించుచు; భగవత్ప్రాప్తిని, సంసారమును - రెండింటిని పోగొట్టుకొని, సంసార దుఃఖము నివర్తించుటవలన కలిగిన అల్పసుఖమునే గొప్పగా భావించుకొని, ఆత్మానుభవమే పురుషార్థమని భావించి ఆత్మ ఉండువఱకు అశరీరులై తిరుగువారలు. కైవల్యమును విశిష్టాద్వైతులు కోరరు. వారు వైకుంఠప్రాప్తినే ముక్తి యందురు.

(4) **ముముక్షువులు** : మోక్షమును కోరువారు. వీరు రెండు విధములు (1) ఉపాసకులు (2) ప్రపన్నులు.

(5) **బద్ధులనగా** : అవిద్య, కర్మ, వాసన, రుచి మొదలగు ప్రకృతి సంబంధము కలిగియుండుట. వీరికి తమ తమ కర్మానుగుణముగ సర్వేశ్వరుడు కలుగజేసిన స్థూల శరీరమును ప్రాణమును ఇంద్రియములను ఆత్మస్వరూపముచేతను, ధర్మభూతజ్ఞానముచేతను ధరించి యుండగలరు. సంసారబంధము నశించునంతవఱకు పుణ్యాపాప, ఉభయరూపములగు కర్మఫలముల ననుభవించుచు లోకాంతర జన్మాంతరములను పొందుచుందురు. కొందఱు దేహమే తామని నమ్మియుందురు.

Dr K Dayanandaswamy ebooks



## (5) జీవేశ్వర సంబంధము

విశిష్టాద్వైత సిద్ధాంతము ననుసరించి జీవులకు ఈశ్వరునకు గల సంబంధము తొమ్మిది విధములుగ చెప్పబడుచున్నది.

**శ్లో॥ పితా చ రక్షక శ్శేషీ భర్తా జ్ఞేయో రమాపతిః ।**

**స్వామ్యాధారో మమాత్మా చ భోక్తాచాద్యమనూదితః** ॥ (న.సం.)

అనగా :

| **ఈశ్వరుడు - విశేష్యము** | **జీవులు - విశేషణము** |
|---|---|
| 1. పిత (తండ్రి) | పుత్రుడు (కుమారుడు) |
| 2. రక్షకుడు (రక్షించువాడు) | రక్ష్యుడు (రక్షింపబడువాడు) |
| 3. శేషి | శేషుడు (శేషభూతుడు) |
| 4. భర్త | భార్య |
| 5. జ్ఞేయము (తెలిసికొనబడు వస్తువు) | జ్ఞాత (తెలిసికొనువాడు) |
| 6. స్వామి | స్వము (సొమ్ము) |
| 7. ఆధారము | ఆధేయము |
| 8. ఆత్మ (శరీరి) | శరీరము |
| 9. భోక్త | భోగ్యుడు. |

జీవునకును, ఈశ్వరునకును ముఖ్యవిషయములయందు భేదముండుట వలన జీవాత్మ యీశ్వరు డెన్నడును కాజాలడు. జీవేశ్వరులకు గల భేద మాగంతుకము కాదు. స్వతిస్సిద్ధము. ఈశ్వరుడు శేషి, జీవుడు శేషభూతు డనుమాట కర్థమేమనగా: జీవునియొక్క అస్తిత్వము సంపూర్ణముగ ఈశ్వరునిపై ఆధారపడియుండును. ఈ విషయము ఇంకను వివరముగ తెలియగోరువారు పిళ్ళైలోకాచార్య కృతమగు 'నవవిధసంబంధ'మను గ్రంథమును చూడవలెను.

Dr K Dayanandaswamy ebooks


## (6) అచేతనము

అచేతనమనగా జ్ఞానమున కాశ్రయము కానిది. అనగా: తానితరులకే తెలియవచ్చునుగాని, తన్ను తాను తెలిసికొనుటగాని, యితరులను తెలిసికొనుటగాని ప్రయోజనము కలది కాకపోవుట. దీనిని జడమని యందురు. అచేతనములు మూడు విధములు. (1) త్రిగుణద్రవ్యము (2) కాలము (3) శుద్ధసత్త్వము. త్రివిధాచేతనములలో త్రిగుణ ద్రవ్యమును కాలమును మాత్రమే జడములనియు, శుద్ధసత్త్వమగు ద్రవ్యము జడము కాదనియు పాంచరాత్రములను పరామర్శించినవారు చెప్పుదురు. అదియును జడమేయని అనేకుల సిద్ధాంతము. జడమనగా : పైన చెప్పినట్లు స్వయంప్రకాశము కానిది. జడము కాదన్నచో జ్ఞాతృత్వ ముండవలెను. అట్టి జ్ఞాతృత్వము శుద్ధ సత్త్వమునకు లేనందున దానిని మూడు విధములగు అచేతన పదార్థములలో చేర్చిరి.

ఈ అచేతన పదార్థములు మూడింటికిని గల ప్రవృత్తి యెట్టిదనగా: సర్వేశ్వరుని సంకల్పమునకు అనుగుణముగ విచిత్ర పరిణామములు పొందుచుండుట. అందులో (1) త్రిగుణ ద్రవ్యముయొక్క స్వరూపము సత్త్వరజస్తమోగుణముల కాశ్రయమయినది. లేదా త్రిగుణాత్మకమైనది. (ఇది ప్రకృతి). ఇది నిరంతరము మార్పునొందుచుండును. సత్త్వరజస్తమో గుణములు మూడును సామ్యస్థితి (సమాస్థితి) గలిగియున్నపుడు మహాప్రళయము కలుగును. వాటియందు విషమస్థితి కల్గినప్పుడు సృష్టిస్థితులు కలుగును. వైషమ్యము కలిగినపుడు మహదాదులగు నిరువది నాలుగు తత్త్వములు ఏర్పడును. ఈ తత్త్వములయొక్క అవాంతర భేదములు వాటి అభిమాన దేవతలనుబట్టి యుండును.

ప్రపంచోత్పత్తి క్రమమును త్రిశిఖిబ్రాహ్మణ శ్రుతి చెప్పిన విధమును కొద్దిమార్పులతో అంగీకరింతురు.* ఇది సాంఖ్యులపద్ధతికి సరిపోవును.

---

* ఈగ్రంథముయొక్క ప్రథమభాగము రెండవ ప్రకరణమున సృష్టియొక్క మూడవపద్ధతిని గురించియు "బ్రహ్మవృక్షము"ను గురించియు చెప్పియుంటిని. దానిని కొద్దిమార్పుతో విశిష్టాద్వైతు లంగీకరింతురు.

Dr K Dayanandaswamy ebooks



అనగా ప్రకృతినుండి మహత్తు, మహత్తునుండి అహంకారము, దానినుండి సమస్త ప్రపంచమును కలిగినట్లు చెప్పుదురు.

ఈ "త్రిగుణ ద్రవ్యముయొక్క ప్రవృత్తి భేదమెద్ది యనగా :- బద్ధచేతనులయొక్క భోగాపవర్గములకును, సర్వేశ్వరునియొక్క లీలారసమునకును, సమముగ విషమముగ మాఱిమాఱిపోవుచుండెడిదై దేహేంద్రియాది రూపముగ ఆయా వ్యాపారములు చేయుట." రజస్తమో గుణముల మూలమున బద్ధచేతనులకు తత్త్వస్వరూపము తెలియకుండజేయుట. సత్త్వగుణము మూలమున తత్త్వస్వరూపము నున్నది యున్నట్లు తెలియబరచుట.

2. **కాలము :** కాలము సత్త్వశూన్యము. కాలమునకు గల స్వరూపభేదము జడముగాను విభువుగాను నుండుట. దీనిస్థితి కాలపరిమితి లేకుండుటవలన నిత్యమైయుండుట. దీనికిగల ప్రవృత్తిభేదము కలా, కాష్ఠాది విభాగములచే సృష్ట్యాదులకు సాధనముగా నుండుట.

పైన చెప్పిన పదార్థములు స్వరూపతః నిత్యములైనవి. కొన్ని అవస్థాంతరములు పొందుటవలన నామాంతరములు కలిగినవై అనిత్యములని వ్యవహరింపబడుచున్నవి. ఇవి నశించుట, మరల కన్పించుట, యిట్టి యవస్థాంతరములు కలిగినవి మాత్రమే యగుటంజేసి ప్రవాహ నిత్యములని చెప్పబడుచున్నవి. ప్రవాహనిత్యము లనగా : "ఏటి ప్రవాహమువలె నొకప్పుడుండుటయు, వేరొకప్పుడు లేకపోవుటయు ననుట."* వీటి స్వరూపస్థితి భేదములు ఈశ్వరాధీనములు. ఈశ్వరసత్తయు ఈశ్వర సంకల్పము తప్ప వీటికి ప్రత్యేక సత్తలేదు. కనుక యీ వస్తువులకు స్వభావ సిద్ధముగా నుండునట్టి అనుకూల్యము ఈశ్వర సంకల్పాధీనము. ఈశ్వర సంకల్పమువలన ఈ పదార్థములు ఈశ్వరునికిని, నిత్యులకును, ముక్తులకును సర్వము అనుకూలముగనే యుండును. బద్ధ జీవులకు మాత్రము వారి వారి

* ప్రవాహనిత్యములనగా : ప్రవహించుచున్న గంగానదివంటి నదీతీరమున మనము నిలుచుండి ప్రవాహ జలములయందు దృష్టినుంచిన మనకు (నిత్యముగ) జలము కనబడుచునే యుండును. కాని, ఈ క్షణమున చూడబడిన జలము మరుక్షణమున మన యెదుట నుండక మార్పు చెందుచుండును అనియును చెప్పవచ్చును.

Dr K Dayanandaswamy ebooks



కర్మానుసారము పురుషభేద, కాలభేదములనుబట్టి అనుకూల ప్రతికూలతలు కలిగియుండును.

3. **శుద్ధసత్త్వము : నిత్యవిభూతి :** శుద్ధసత్త్వము యొక్క సృష్టియందు లక్ష్మీసహితుడై శ్రీమన్నారాయణుడు వేంచేసి యుండును. వైకుంఠమున గల మందిరములు, ప్రాకారములు, వృక్షములు, నదులు, కాసారములు మొదలగు సమస్తమును శుద్ధసత్త్వముయొక్క సృష్టి. అనగా అప్రాకృతము. ప్రకృతి ఆవరణమునకు ఆవల నున్నది గనుక ప్రకృతి సంబంధమైన పదార్థ మేదియును నచట నుండదు. అందువలన నవియన్నియు దివ్యములని చెప్పబడును.

## (7) పరమాకాశము - పరమపురుషుడు

అట్టి వైకుంఠ వైభవమును శ్రీమద్రామానుజులు వైకుంఠగద్య యందిట్లు వర్ణించిరి :

"చతుర్దశ భువనాత్మక మణ్డం, దశగుణితోత్తరం చావరణ సప్తకం, సమస్తం కార్యకారణజాత మతీత్య వర్తమానే పరమవ్యోమ శబ్దాభిధేయే బ్రహ్మాదీనాం వాఙ్మనసాగోచరే శ్రీమత్ వైకుంఠే దివ్యలోకే, సనకవిధి శివాదిభి రప్యచిన్త్య స్వభావైశ్వర్యై, ర్నిత్యసిద్ధై రనంతైర్భగవదానుకూల్యైక భోగైః, దివ్య పురుషైర్మహాత్మభి రాపూరితే, తేషా మపి ఇయత్పరిమాణ మియ దైశ్వర్య మీదృశస్వభావమితి పరిచ్ఛేత్తు మయోగ్యే, దివ్యావరణశత సహస్రావృతే, దివ్యకల్పకతరూపశోభితే, దివ్యోద్యాన శతసహస్ర కోటిభిరావృతే, అతి ప్రమాణే, దివ్యాయతనే కస్మింశ్చి ద్విచిత్ర దివ్యరత్నమయే దివ్యాస్థానమణ్టపే, దివ్యరత్న స్తమ్భశత సహస్ర కోటిభిరుపశోభితే, దివ్యనానారత్న కృతస్థల విచిత్రితే, దివ్యాలఙ్కా రాలఙ్కృతే......"

తా॥ పదునాలుగు లోకములు గల యండమును, పైపై పదింత లెక్కువ వ్యాపించిన సప్తావరణములును, ఆపై గల సమస్త కార్యకారణ జాతమును గడచి యవ్వల వెలయుచుండు నట్టిదియు, పరమాకాశమను పేర పిలువబడు నట్టిదియు, బ్రహ్మాదుల మనోవాక్కుల కందనిదియునగు,

Dr K Dayanandaswamy ebooks



శ్రీ వైకుంఠ దివ్యలోకమునందు సనకసనందనాదులకును, బ్రహ్మశివాదులకును దలంపరానట్టి వైభవము కలిగి, నిరంతర భగవదనుభవ నిరతులై, భగవదనుకూలభోగము గలవారలై, నిత్యసిద్ధులై, అసంఖ్యాకులయి దివ్య పురుషులగు మహాత్ములచే నిండినదై; పరిమాణముచేతను, ఐశ్వర్యము చేతను, స్వభావముచేతను, ఇంతటిదని గణింప సాధ్యము గానిదై; దివ్యములగు శతసహస్ర ప్రాకారములు గలదై; దివ్యములగు కల్పవృక్షములచే శోభిల్లుచుండునదై, శతసహస్రకోటి దివ్యోద్యానములచే ప్రకాశించు నొక సభామంటపమున కోటానుకోట్ల దివ్య రత్న స్తంభములచే వెలుగొందునదై, అప్రాకృత నానావిధ రత్నములచే పొదిగిన నేల గలదై, దివ్యాలంకారములచే నలంకరింపబడినదై....ఇంకను ననేక విధముల వర్ణింపబడి యుండు వైకుంఠమున నున్న శ్రీమన్నారాయణమూర్తిని ఈక్రిందివిధముగ వర్ణించియున్నారు:

".....మధ్యే దివ్యపుష్ప సంచయ విచిత్రితే మహతి దివ్యయోగపర్యఙ్కే అనంత భోగినీ, శ్రీమద్వైకుణ్ఠైశ్వర్యాది దివ్యలోకం విశ్వమ్ ఆత్మకాన్త్యా విశ్వమాప్యాయయన్త్యాశేష శేషాది సర్వ పరిజనం భగవతః తత్తదవస్థోచిత పరిచర్యాయా మాజ్ఞాపయన్త్యా శీల రూప గుణవిలాసాదిభిరాత్మానురూపయా శ్రియానహాసీనం ప్రత్యగ్రోన్మీలిత సరసిజ సదృశ నయన యుగళమ్, స్వచ్ఛనీల జీమూత సఙ్కాశమ్, అత్యుజ్జ్వల పీతవాససం, స్వయాప్రభయా ఽతి శీతలయా ఽతికోమలయా స్వచ్ఛయా మాణిక్యాభయా స్వయా ప్రభయా కృత్స్నం జగద్భాసయన్తమ్, అచిన్త్య దివ్యాద్భుత నిత్య యౌవనస్వభావ లావణ్య మయామృతసాగరమ్, అతి సౌకుమార్యా దీషత్ప్రస్విన్నవ దాలక్ష్యమాణ లలాటఫలక దివ్యాలకావలీ విరాజితమ్, ప్రబుద్ధముగ్ధాంబుజచారులోచనం, సవిభ్రమభ్రూతలమ్, ఉజ్జ్వలాధరం, శుచిస్మితం, కోమల గణ్డమ్, ఉన్నాసమ్ ఉదగ్రపీనాంస విలమ్బికుండలాలకావలీ బన్ధురకంబుకన్ధరం, ప్రియావతంసోత్పల కర్ణభూషణశ్లథాల కాబద్ధ విమర్దశంసి భిశ్చతుర్భి రాజానువిలమ్బిభి ర్భుజైర్విరాజితమ్, అతికోమలదివ్య రేఖాఙ్కిత తామ్రకరతలమ్, దివ్యాఙ్గులీయకై ర్విరాజితమ్, అతికోమలదివ్య నఖావలీ విరాజి తాతిరక్తాఙ్గులీభి రలంకృతం, తత్క్షణోన్మీలిత పుండరీక సదృశ

Dr K Dayanandaswamy ebooks



చరణ యుగలమ్, అతిమనోహర కిరీటమకుట చూడావతంస మకర కుణ్డల గ్రైవేయక హార కేయూర కటక శ్రీవత్స కౌస్తుభ ముక్తా దామోదర బన్ధనపీతాంబరకాఞ్చీగుణ నూపురాదిభి రత్యన్త సుఖస్పర్శై ర్దివ్యగన్ధై ర్భూషణైర్భూషితమ్ శ్రీమత్యా వైజయన్త్యా వనమాలయా విరాజితమ్."

తా॥ పై విధమున వర్ణింపబడిన శ్రీ వైకుంఠ మధ్యభాగమున దివ్యపుష్పములతో జిత్రింపబడినదై దివ్యమై మిక్కిలి గొప్పదైన మంచముపై సర్పరాజగు శేషునిపై, శ్రీవైకుంఠమునందలి సంపదలు మున్నగు దివ్యలోకమెల్ల దన కాంతిచే వెలుంగజేసి తనివి పుట్టించి శేషుడు మున్నగు సకల పరిజనమును భగవంతుని యా యా దశలకుం దగిన కైంకర్యములందు నియమించునదియు శీలరూపగుణశృంగార విలాసాదులచే తనకు తగినదైన శ్రీదేవితో వెలసియున్న వాడును, అప్పుడే వికసించిన పద్మములవంటి కన్నులు గలవాడును, దట్టమగు మేఘమువంటి మేనిఛాయ గలవాడును, పీతాంబరధారియు, అతినిర్మలమును, అతిశీతలమును, స్వచ్ఛమును, మాణిక్యమునుబోలిన తన దివ్యకాంతిచే సమస్తలోకమును ప్రకాశింపజేయువాడును, చింతించుటకును నసాధ్యమగు దివ్యాద్భుత నిత్య యౌవన స్వభావ లావణ్యామృత సాగరుడును, అతిసుకుమార మగుటచే నించుక చెమర్చినదై కానవచ్చు లలాట ఫలకమున ముంగురులచే చెలువొందువాడును, అప్పుడే వికసించిన తామర పుష్పములవంటి సుందరములగు నేత్రములు గలవాడును, విలాసముతో గూడిన కనుబొమలును, ప్రకాశించునట్టి పెదవియు, నిర్మలమగు చిఱునగవును, కోమలమగు చెక్కిళ్లను, ఎత్తైన నాసికయు, గొప్పవై బలసిన భుజములను దగులుచు వ్రేలాడు కుండలములు గలిగి కురులచే సొంపారు శంఖమువంటి కంఠము గలవాడును, ప్రియురాండ్రు ధరించిన కర్ణాలంకారమైన కలువలు కర్ణభూషణములు చెదరిన ముంగురులు వీటి యొత్తిడిని సూచించునట్టివై మోకాళ్ళ దనుక వ్రేలాడు చతుర్భుజములచే ప్రకాశించువాడును, అతికోమలమును దివ్యరేఖాలంకృతములును ఇంచుక యెఱ్ఱనివై యొప్పు కరతలములు గలవాడును, అతికోమలమగు నఖములచే ప్రకాశించు నెఱ్ఱని

Dr K Dayanandaswamy ebooks



వ్రేళ్ళయం దలంకరింపబడిన దివ్యాంగుళీయకములు గలవాడును, అప్పుడే వికసించిన పుండరీకములంబోలిన దివ్యచరణ యుగము గలవాడును, మిగుల సుఖకరమైన స్పర్శ కలిగినవియు, దివ్యమైన పరిమళము గలవియు నయి మిగుల సుందరమగు కిరీట మకుట చూడావతంసములు, మకరాకృతి గల కుండలములు, మెడలో దాల్చిన ఆభరణములు, వక్షఃస్థలమునందు దాల్చిన ముత్యాలదండలు, బాహువులయందు ధరించిన పురులు, ముంజేతియందు ధరించిన వలయములు, శ్రీ వత్సమును, (ఇది ఆభరణము కాదు. స్వామిశరీరమునందలి మచ్చ. ఇదియు ఆభరణమువలె అందముగా నున్నదని భావము) వక్షఃస్థలమున ధరియుంచియున్న కౌస్తుభమను రత్నమును, ముత్యాల దండలును నడుమునకు కట్టిన పీతాంబరముపై ధరించిన మొలత్రాడును, పాదములయందు అందెలు మొదలగు దివ్యభూషణములచే నలంకృతుడును చక్కని వైజయంతియను వనమాలతో వెలయువాడును నగు సర్వేశ్వరుడు వేంచేసియుండును.

## (8) మోక్షము

పైన చెప్పబడిన పరమాకాశమును పరమపురుషుని జేరుటయే జీవులకు ముక్తి. ఈ మతము ననుసరించి జీవన్ముక్తి లేదు. జీవించి యున్నంతకాలమున భగవంతుని కృపకు నెదురు చూచుచు ఆర్తిగలవాడై ఓ సర్వేశ్వరా! తుచ్ఛమైన ఈ శరీరమునుండి వైకుంఠమున నున్న మీ సన్నిధానమునకు ఎప్పుడు పిలుచుకొందువు? ఎప్పు డీయాశ్రితునిచేత నిత్యకైంకర్యము చేయించుకొందు? వని నిరంతరము సర్వేశ్వరుని ప్రార్థించుచు కాలము సమకూరగనే వాక్కు మొదలగు దశేంద్రియములు మనస్సునందును, ఇంద్రియ దశకముతో కూడిన మనస్సు ప్రాణము నందును, ప్రాణము జీవునియందును, అట్టి జీవుడు భూతసూక్ష్మముల యందు (సూక్ష్మశరీరమునందు)ను, అట్టి భూతసూక్ష్మ విశిష్టజీవుడు హృదయగతుండగు పరమాత్మయందును విశ్రమించును. జ్ఞానులకు, అజ్ఞానులకు ఇంతవఱకు సమానమే. పిమ్మట జ్ఞానులు బ్రహ్మనాడి నుండియు, అజ్ఞానులు క్రిందినాడులనుండియు స్థూలదేహమును వదలుదురు." (ర.సా.ప్ర. 20).

Dr K Dayanandaswamy ebooks


ఇట్లు భగవంతుని కృపకు పాత్రుడైన భక్తుడు దేహము వదలి అర్చిరాదిమార్గమున పోయి ప్రకృతి ఆవరణమున కావల నున్న విరజానదియందు సూక్ష్మభూతములతో కూడిన సూక్ష్మశరీరమును వదలి, అచ్చటనున్న అమానవ పురుషుని హస్తస్పర్శమాత్రమున అప్రాకృత దివ్యదేహము ధరించినవాడై, వైకుంఠనగరమును ప్రవేశించి అందలి ఐరమ్మదీయమను సరస్సు వద్దకు పోగా, అచ్చటనున్న యైదునూర్ల దివ్యాప్సరస లతనిని ఎదుర్కొని, బ్రహ్మాలంకారములతో నలంకరించి, అప్రాకృతమగు రాజోపచారములు చేసి ఆనందమయమగు మంటపము నందు చేర్తురు. ఆ మంటపమున, నిత్యసూరులచే పరివేష్టింపబడి లక్ష్మీసహితుడై దివ్యసింహాసనమునందు వేంచేసియుండు శ్రీమన్నారాయణ దేవుని కన్నులపండువుగ దర్శించి మహానందమగ్నుడై లక్ష్మీనారాయణు లకు సాష్టాంగ దండప్రణామము సమర్పించి, లేచి, అంజలి ఘటించి, నిలిచి యుండు భక్తుని భగవంతుడు కరుణావలోకనముల వీక్షించి, చేరదీసి, అంకమున నునుచుకొని "కో౽సి? (నీవెవ్వడవు?") అని యడుగ; "అహం బ్రహ్మాస్మి" - నేను దేవరవారికి శేషభూతుడ నగుటచే భగవచ్ఛరీరమై యున్నానని భక్తుడు ప్రత్యుత్తర మొసంగ భగవంతుడు సంతసించి సాయుజ్యముక్తిని ప్రసాదించును. అనగా: భగవంతుడు తనతో సమానమైన భోగములను దాసునకు కలుగజేయును. సర్వేశ్వరునికి నియతములని చెప్పిన విశేషణములు తప్ప తక్కిన లక్షణము లన్నియు సర్వేశ్వరునితో సమానముగా ముక్తపురుషున కుండును. భోగము ఈశ్వరునితో సమానముగా అనుభవించును.

"జగత్కారణత్వము, మోక్షప్రదత్వము, సర్వాధారత్వము, సర్వ నియంతృత్వము, సర్వశేషిత్వము, సర్వశరీరత్వము, సర్వశబ్ద వాచ్యత్వము, సర్వవేద వేద్యత్వము, సర్వలోక శరణ్యత్వము, సర్వముముక్షూపాస్యత్వము, సర్వఫల ప్రదత్వము, సర్వవ్యాప్తత్వము, జ్ఞానానందస్వరూపత్వము, లక్ష్మీపతిత్వము మొదలగునవి సర్వేశ్వరునికి మాత్రమే నియతముగ నుండునవి. ముక్తపురుషుని కన్నో ఆధేయత్వము, విధేయత్వము, శేషత్వము, అణుత్వము

Dr K Dayanandaswamy ebooks



ఈ మొదలగునవి నియతములుగ నుండునవి" అని చెప్పియున్నారు.* (ర.సా.ప్ర. 22).

సాయుజ్య మనగా : 'సయ్యుక్' యొక్క భావము. 'సయ్యుజ్' అనగా1: ఒక భోగ్యవస్తువును కూడియుండి అనుభవించునట్టివాడు. ప్రకృతమున విశేషణ విశిష్టమగు బ్రహ్మమనెడి భోగ్యవస్తువునందు బ్రహ్మమున్ను ముక్తపురుషుడును ఉభయులును భోక్తలై యన్వయించి యున్నందున ముక్తపురుషుడు 'సంయుక్' యని వ్యవహరింపబడుచున్నాడు. "(ర.సా.ప్ర. 22) మఱియు "సామరస్యం హి సాయుజ్యం" సమానమగు రసానుభవము సాయుజ్య మనబడును. పిళ్ళై లోకాచార్యులవారు "అర్చిరాది" అను గ్రంథమున ముక్తజీవులు అర్చిరాది మార్గమున వైకుంఠము చేరుటయు, వైకుంఠలోకవర్ణనము మొదలగు విషయములు రమణీయముగ వర్ణించియున్నారు. ప్రమేయశేఖరమను గ్రంథమున ముక్తజీవులకు వైకుంఠ ప్రాప్తియు, అచ్చట చేరిన పిమ్మట విరజాస్నానము, సూక్ష్మశరీర విశ్లేషణము, భగవంతుని ఆలింగనాద్యనుభవము, భగవత్స్వరూపగుణ విగ్రహాద్యనుభవమును ఒకదాని తరువాత నొకటి ముక్తజీవుల కెట్లు ప్రాప్తించునో ఆ విధమును వర్ణించియున్నారు. ఈ లోకమునందుండి యుత్క్రాంతిని పొందిన భక్తులు పోవు మార్గము పాంచరాత్రములయందు మఱియొక విధముగ చెప్పబడియున్నది.**

స్వామికృపకు పాత్రులు కానివారు స్వామిలీలకు పాత్రు లగుదురు. లీలకు పాత్రులనగా: జననమరణ రూపసంసారమున తగులువడి యుండుట, వైకుంఠమార్గమును గుఱించి దాదాపు ఇదివఱలో నేను

---

* ఈ రహస్యత్రయసారము (1) అర్థానుశాసనవిభాగము (2) స్థిరీకరణ విభాగము (3) పదవాక్యయోజనా విభాగము (4) సంప్రదాయ ప్రక్రియావిభాగము అను నాలుగు విభాగములు (ప్రకరణములు) చేసి నాలుగింటిని 32 అధికారములుగా విభజించి వ్రాసియున్నారు. ఈ గ్రంథమున "ర. సా" అను సంకేతాక్షరముల ప్రక్కన కనబరచియుండు అంకెలు "అధికారము" అను సంఖ్యను తెలియజేయును.

** పాంచరాత్రములు చెప్పిన విధానము శ్రుతిసమ్మతము కానందున నిచ్చట చెప్పలేదు. దానిని తెలిసికొనవలెననిన ర.సా. 22-వ అధికారమును చూడవలెను.

Dr K Dayanandaswamy ebooks



క్రమముక్తిని (దేవయానమును) గుఱించియు, ఉత్క్రాంతిని గుఱించియు ఈ గ్రంథము (1-3-6, 1-3-20)న చెప్పిన విధముగనే స్వల్పభేదముతో అంగీకరింతురు. భక్తుడు ముక్తుడగుటకు నుత్తరాయణాది కాల నియమముగాని, దేశనియమముగాని అవసరము లేదని వీరంగీకరింతురు. కైవల్యమును వీరు కోరరు.

మరణకాలమునందు భక్తునకు "అంతిమస్మృతి" కలుగును. అంతిమస్మృతి అనగా:- వాక్కు మొదలగునవి పడిపోగా మనస్సు ఉపశాంత మగుటకు (స్మృతి తప్పుటకు) ముందు కలుగునట్టి యొకవిధమైన స్మృతి. ఇది ప్రక్కనున్న వారికి తెలియదు. ముక్తులు కాబోవునట్టి మహనీయులకును, మోక్షప్రదాతయగు సర్వేశ్వరునకును మాత్రమే తెలియును. ఇతరులకు తెలియదు.

## (9) శ్రీవైష్ణవులయందు రెండు శాఖలు

విశిష్టాద్వైతులయందు తెంగల (దక్షిణశాఖ), వడగల (ఉత్తరశాఖ) అను రెండు శాఖ లేర్పడినవి. తెంగలవారు నామము క్రింద పాదమును పెట్టుదురు. వడగలవారు పాదము నుంచరు. శ్రీరామానుజులవారి అనంతరము వీరియందు భేదాభిప్రాయములు ఎక్కువైనవి. తెంగలశాఖలో సుప్రసిద్ధులు శ్రీపిళ్ళై లోకాచార్యులు, వడగలశాఖలో సుప్రసిద్ధులు శ్రీ వేదాంతదేశికులను నామాంతరము గల శ్రీ వేంకటనాథుడు. వీరిని దేశికాచార్యులని కూడ పిలుతురు. శ్రీలోకాచార్యులు దేశికులవారి కాలమునందే యుండినవారు* ఇరువురును గొప్ప పండితులు.

శ్రీరామానుజులవారి అనంతరము రెండుతరములకే నంజీయరు వారి కాలమున 'సత్సంప్రదాయప్పడి' అనునది యొకటి ప్రచారములోనికి వచ్చెను. 'సత్సంప్రదాయప్పడి' అనగా: వర్ణాశ్రమాది నియమ విధులను, అట్టి విధులను నిర్ణయించిన వేదాదులను, వేదచోదితమైన కర్మ జ్ఞాన

* లోకాచార్యులవారు 1327 ప్రాంతమువారు. వేదాంత దేశికులు క్రీ.శ. 1268వ సంవత్సరముననో లేక 1269వ సంవత్సరముననో జన్మించి నూరు సంవత్సరములు జీవించి 1359వ సంవత్సరము కార్తీకమాసమున పరమపదించిరని తెలియుచున్నది.

Dr K Dayanandaswamy ebooks



భక్త్యాది అనుష్ఠానములను విడిచి వాటితో నెంతమాత్రము సంబంధము లేనట్టియు, నిర్బంధము లెవ్వియును లేనట్టియు, ప్రపత్తి మార్గము ననుసరించుటయే. దీనినే ప్రపత్తియని, శరణాగతియని, న్యాసవిద్యయని చెప్పుదురు.

'సత్సంప్రదాయప్పడి'ని ముఖ్యముగా శ్రీ పిళ్ళైలోకాచార్యులవారు ప్రచారములోనికి తెచ్చిరి. వారికి పూర్వ మీప్రపత్తి మార్గము లేదని కాదు. ఈ సత్సంప్రదాయప్పడిని రామానుజులవారే చెప్పిరని లోకాచార్యుల వారు చెప్పిరి. వడగల తెగవారీమాట నంగీకరింపరు. శ్రీ లోకాచార్యులవారు 18 రహస్యగ్రంథములు రచియించిరి. అందు ముముక్షుప్పడి, శ్రీవచన భూషణము అను తమిళ గ్రంథములు చాల ముఖ్యమైనవని చెప్పుదురు. అందు ప్రపత్తిని గుఱించి చెప్పబడినది.

ముముక్షుప్పడి మూడు ప్రకరణములు గల గ్రంథము. ఒక్కొక్క ప్రకరణమునందు ఒక్కొక్క రహస్యము చెప్పబడినది. ఈ మూడు రహస్యములు తెలిసిన మానవుడు ముక్తుడు కావచ్చును. వేదాధ్యయనమును, వేదచోదిత కర్మానుష్ఠానమును త్యజింపవలెనని వీరి సిద్ధాంతము. దీనిని వేదాంత దేశికుల వారంగీకరింపక లోకాచార్యులవారి మతమును 'రహస్యత్రయసార' మను గ్రంథమున విమర్శించిరి.

ఈ యిరుపక్షముల వారి సిద్ధాంతములమధ్య పదునెనిమిది యంశములలో భేదాభిప్రాయ మున్నట్లు తెలియుచున్నది. శ్రీలోకాచార్యులు చెప్పిన మూడు రహస్యములివి. (1) తిరుమంత్రము (2) ద్వయము (3) చరమశ్లోకము. ఈ మూడింటి వివరమునుగూర్చి సంగ్రహించి చెప్పెదను.

## (10) తిరుమంత్రము

విష్ణుమంత్రము లనేకము లున్నను అందు అష్టాక్షరి యుత్తమోత్తమ మైనది. "ఓమ్ నమో నారాయణాయ" అను నీమంత్రము అష్టాక్షరి యనబడును. దీనినే తిరుమంత్ర మందురు. రహస్యత్రయమునందిది మొదటి రహస్యము.

Dr K Dayanandaswamy ebooks



శ్లో॥ యథా సర్వేషు వేదేషు నాస్తి నారాయణాత్పరః ।
తథా సర్వేషు మంత్రేషు నాస్తి చాష్టాక్షరాత్పరః ॥

తా॥ ఏ ప్రకారము సర్వదేవతలయందు నారాయణునికంటె శ్రేష్ఠుడగు దేవుడు లేడో, అదేవిధముగ సర్వమంత్రములలోను అష్టాక్షరీ మంత్రముకంటె గొప్పది లేదు.

శ్లో॥ భూత్వోర్ధ్వ బాహురద్యాత్ర సత్యపూర్వం బ్రవీమి వః ।
హే పుత్ర! శిష్యాశ్శృణుత న మంత్రాష్టాక్షరాత్పరః ॥

తా॥ ఓ శిష్యులారా, ఓ పుత్రులారా! వినుడు, అష్టాక్షరీ మంత్రము కంటె శ్రేష్ఠమైన మంత్రము వేఱొక్కటి లేదు. చేతులెత్తి ప్రమాణవిధిగా మీకు తెలుపుచున్నాను.

ఈ మంత్రమును సర్వేశ్వరుడే నరుడు, నారాయణుడునను రూపద్వయము నొంది అందు నారాయణుడు నరున కుపదేశించెను. అనగా: సర్వేశ్వరుడే గురుశిష్యరూపము నొంది సంసారార్ణవమును తరించు నావగ నీ మంత్రమును ప్రచారములోనికి తెచ్చెను. ఈ మంత్రమును దీనిచే తెలుపబడిన యర్థమును, స్వరూపమును, స్వరూపమునకు అనురూపమైన ప్రాప్యమును (నారాయణుని) తెలుపుచున్నది. ఇది యెనిమిది అక్షరములు, మూడుపదములు గలది. ఓం + నమః + నారాయణాయ. ఈ మూడుపదములు మూడర్థములు తెలుపును. ఎట్లనగా:-

మొదటిది ఓం అను ప్రణవము. ప్రణవార్థమును తెలిసికొనవలెను. ఎట్లన: అ + ఉ + మ అని మూడక్షరములు గలిసి 'ఓమ్' అయినది. మూడక్షరము లైనప్పుడు మూడర్థములు తెలుపును. ఓమ్ అను ఏకాక్షరంబైనపుడు ఏకార్థ ప్రకాశకమై యుండును. ఇవి మూడును వేఱువేఱనిగాని ఒకటేయనిగాని చెప్పవచ్చునని కొందఱందురు. ఇది సకల వేదసారము. ఇందు అకారము నారాయణ పదార్థమును సంగ్రహముగా తెలుపును. పరమేశ్వరుని కళ్యాణ గుణములను శేషిత్వమును తెలియజేయును. ఆయనకు ఆత్మ శేషభూతుడని మకారము తెలుపును. ఉకారము అవధారణార్థమును చెప్పును. అవధారణముచే తెలుపబడునది యేమనగా:-

Dr K Dayanandaswamy ebooks



ఈ జీవుడు ఇతరులకు శేషభూతుడు కాడనియు 'అ'కార శబ్దవాచ్యుడైన శ్రీమన్నారాయణునకు మాత్రమే శేషభూతుడనియు తెలుపును. కొందఱు మఱియొక విధముగా చెప్పుదురు. ఆ విధమెట్టిదనగా:-

శ్లో॥ అకారేణోచ్యతే విష్ణుః సర్వలోకేశ్వరో హరిః ।
ఉద్ధృతా విష్ణునా లక్ష్మీరుకారేణోచ్యతే సదా ॥
మకారస్తు ద్వయోర్విప్ర శ్రీనారాయణ యోస్సదా ।
ఆత్మనశ్శేషభూతస్య వాచక శ్రుతిచోదితః ॥

తా॥ అకారము భగవంతుని, 'ఉ' కారము లక్ష్మిని, 'మ' కారము వారుభయులకు శేషభూతుడగు జీవుని తెలుపు నట్టిదని కొందఱు (శ్రీపాంచరాత్ర సంహితలు) చెప్పిరి.

'ఉ' కారము లక్ష్మీవాచకమనియు, ఆమెకు సహితము జీవులు శేషభూతులనియు కొందఱందురు. కాని దీనిని లోకాచార్యులవా రంగీకరింపరు. సర్వేశ్వర వాచకంబైన అకారమునందే లక్ష్మి గలదనియు, ఆమె అటు ఆత్మను ఇటు సర్వేశ్వరుని విడువక భర్తయొక్క పడకను, బిడ్డయొక్క తొట్టినిగూడ విడువకయుండు తల్లివలె నున్నదనియు చెప్పిరి. ప్రణవమునందలి 'మ'కారము, 'క' మొదలు ఇరువదియైదవ అక్షరము 'మ'. ఇది శేషభూతుడగు ఆత్మను తెలుపుచున్నది. ఎట్లనగా :

| | | |
|---|---|---|
| క ఖ గ ఘ ఙ | .... | ఇవి పృథివ్యాది పంచభూతములను, |
| చ ఛ జ ఝ ఞ | .... | ఇవి కర్మేంద్రియ పంచకమును, |
| ట ఠ డ ఢ ణ | .... | ఇవి జ్ఞానేంద్రియ పంచకమును, |
| త థ ద ధ న | .... | ఇవి శబ్దాది పంచకమును, |
| 'ప' కారము | .... | మనస్సును, |
| 'ఫ' కారము | .... | అహంకారమును, |
| 'బ' కారము | .... | మహత్తును, |
| 'భ' కారము | .... | ప్రకృతిని, |
| 'మ' కారము | .... | జీవాత్మను - తెలుపుచున్నవి. |

Dr K Dayanandaswamy ebooks



ఈ ఇరువది యయిదింటియందును 'అ' కార వాచ్యుండును ఇరువదియాఱవ తత్త్వంబునగు నారాయణుండు వ్యాపించియున్నాడు.

మంత్రములోని రెండవ పదము 'నమః' అనునది. ఇందు 'న' అనియును, 'మః' అనియును రెండక్షరములు గలవు. ఇది షష్ఠీ విభక్త్యంత మైనందునను, నకారము నిషేధమును తెలుపునది యైనందునను 'న మమ', 'నాది కాదు' అని నిషేధమును తెలుపుచున్నది. మఱియు 'మః' తనకు తాను దాసుడనని, 'న' అనగా: దానికి వ్యతిరేకము. అనగా: సర్వేశ్వరునకు మాత్రమే దాసుండనని, తనకు తాను దాసుడను కానని యర్థము. ఇందువలన స్వరూపవిరోధము, ఉపాయ విరోధము, ప్రాప్యవిరోధము అను మూడు విరోధములు నివర్తించుచున్నవి.

స్వరూపవిరోధము నివర్తించుటనగా : నేను నీవాడను. నాకున్న సమస్తమును నీదే అను నిశ్చయముతో నుండుట.

ఉపాయవిరోధము నివర్తించుటనగా : "స్వామీ! నీవు నన్ను రక్షించినను సరే, రక్షింపక పోయినను సరే. నీకంటె నాకు వేఱొక రక్షకుడు లేడు" అను నిశ్చయముతో నుండుట.

ప్రాప్యవిరోధము నివర్తించుట యనగా : సమస్తమగు కోరికలు నిడిచిపోవలయునను నిశ్చయముతో నుండుట. నాది యనుకొనుట స్వరూపనాశకము, నాది కాదనుకొనుట స్వరూపోజ్జీవనము.

దేశికులవారు 'నమః' శబ్దమునకు స్థూల, సూక్ష్మ, పరమములను మూడు విధములైన అర్థములు చెప్పిరి. స్థూలార్థము వ్యాకరణశాస్త్ర ప్రకారము శబ్దవ్యుత్పత్తిని బట్టి చెప్పబడు నదియు, సూక్ష్మార్థము వర్ణసామ్యాదులనుబట్టి నిరుక్తి బలమున చెప్పబడు నట్టిదియు, పరమార్థము రహస్యశాస్త్రములయందు చెప్పినట్టిదియు అక్షర నిఘంటువులవలనను తెలిపినట్టిది. అందు స్థూలమైన అర్థము : 'నమః' అని వాక్కుచే చెప్పుచు శరీరముతో నమ్రుడగుటయే గాక మనస్సున అట్టి భావముండుటయే పూర్ణమగు నమస్కారము. ఇది కరణపూర్తియని, పరమపురుషునికంటె సిద్ధి వేఱొక్కటి లేదను భావనమే అంగపూర్తియని చెప్పుదురు. సూక్ష్మమైన అర్థము : ఈ చేతనునికి తన

Dr K Dayanandaswamy ebooks



విషయమున తనకున్నట్టి మమకారము ఏది కలదో అది 'మమ' అను శబ్దముచే తెలుపబడుచున్నది. అనాదివాసనా మూలకమగు మిథ్యాజ్ఞానము వలన ఇట్టిది కలిగినదని, వాస్తవమునకు నేను, నాది యను సమస్తము శేషియగు సర్వేశ్వరునిదే యని నిశ్చయించుట.

ఇక పరమమగు అర్థము :

శ్లో|| **పంథా నకార ఉద్దిష్టో మః ప్రధాన ఉదీర్యతే ।**
**విసర్గః పరమేశస్తు తత్రార్థో ఽ యం నిరుచ్యతే ॥**

తా|| 'న' కారమునకు మార్గమని, 'మ' కారమునకు ప్రధానమని, విసర్గకు పరమాత్మయని అర్థము. భగవంతుని పొందుటకు నమస్కార మనునది ప్రధానమైన మార్గమని భావము. నమశ్శబ్దమునకు శరణాగతియని అర్థము. నమః అనునది ఆత్మ సమర్పణమును తెలుపును.

ఇక తిరుమంత్రములోని మూడవదియగు నారాయణ శబ్దార్థము *నిట్లు చెప్పిరి : నారములనగా: నిత్యవస్తువుల యొక్క సమూహము. అవి జ్ఞానానంద-అమలత్వాదులు, జ్ఞాన శక్త్యాదులు, వాత్సల్య సౌశీల్యాదులు, దివ్యమంగళ విగ్రహము, కాంతి సౌకుమార్యాదులు, దివ్యాభరణములు, దివ్యాయుధములు, పిరాట్టి (లక్ష్మీదేవి) మొదలుగా గల సమస్తమును,

---

* నారాయణ శబ్దార్థము మహాభారత శాంతి పర్వమందలి భగవన్నామ నిర్వచనమునం దిట్లున్నది :

కం|| **నారము లనగా జలముల**
**పే రయనంబనగ నెలవు ప్రీతిగ నాకున్**
**నారము లయనం బగుటను**
**నారాయణుడంద్రు జనులు నన్ను గిరీటీ!**

తా|| నారము లనగా నీరు, దాని యందు నివసించువాడు గనుక నారాయణుడని విష్ణువునకు పేరు కలిగెను.

కం|| **నారములు నాగ నుదకము**
**చారుతరాయనము నాగ సంచారం బా**
**నీరధి శయనుని కిమ్మెయి**
**నారాయణుడనగ దివ్యనామము గలిగెన్.** (ఆంధ్ర విష్ణుపురాణము 1-60)

Dr K Dayanandaswamy ebooks



**శ్లో॥ "బ్రాహ్మమండం తదంతస్థాః లోకాశ్చ స చరాచరాః ।
ఏవ మండాన్యనంతాని తత్సర్వం నార ముచ్యతే"॥**

**తా॥** బ్రహ్మాండమును, దానిలోని లోకములును, వాటిలో నుండు చరాచర పదార్థములును, అనంతములగు అండములును- ఇవి యన్నియు నారము లనబడుచున్నవి. (వి.మో.)

అయన మనగా : వీటికి ఆశ్రయంబనియు, వీటిని ఆశ్రయముగా గలదనియు చెప్పవచ్చును. ఇప్పుడు 'ఆయ' అను చతుర్థీ విభక్త్యర్థము- సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలయందును అనువర్తింపవలెను.

(ము.ము. 1-112)

దీనివలన మనము వేఱొక్కనికి భోగ్యులము కామని అట్టి తలంపును అనువర్తింపజేసికొనవలెను. ఈ విధముగా ఎనిమిది దారములు గలదియై, మూడుపేటల మంగళసూత్రము వంటిది తిరుమంత్రము.

(ము.ము. 1-113)

ఇంతవఱకు చెప్పినదానియొక్క పర్యవసాన మేమనగా; సర్వేశ్వరునికి శేషభూతుడగు నేను నాకుగాని, యితరులకు గాని శేషభూతుడను కాను. సర్వశేషియగు నారాయణునికే సర్వకైంకర్యము లొనర్పవలెను.

(ము.ము. (1-115)

ఈ విధముగ మంత్రార్థము వలన త్యాజ్యోపాదేయముల నెఱుంగ వలెను. తిరుమంత్రము నిట్లు ప్రశంసించిరి.

**శ్లో॥ అపార మల్పసారం చ సారం సారతరం త్యజేత్ ।
భజేత్సారతమం శాస్త్రరత్నాకర ఇవామృతమ్ ॥**

**తా॥** అసారము=వేదబాహ్యములగు శాస్త్రములు, అల్పసారము= స్వల్పముగా సారము గలవి (కర్మకాండను విధించు వేదములు), సారం= సారముగల (జ్ఞానకాండను విధించు ఉపనిషత్తులు), సారతరం= సారమధికమగు విష్ణుగాయత్రి మంత్రము-వీటన్నిటిని త్యజించి సారమత్యధి కముగా గల తిరుమంత్రార్థమును అనుసరించవలెను. (వి.మో.పు. 201)

Dr K Dayanandaswamy ebooks



ఈ తిరుమంత్రమును వైశ్యులకు శూద్రులకు ప్రణవముతో చేర్చి చెప్పకూడదనియు, ప్రణవమును వదలి చెప్పవలయుననియు వడగల శాఖవారు చెప్పుదురు. వారిట్లందురు. వైదికమని, తాంత్రికమని వైదికతాంత్రికమని ఈవిధముగ కర్మ త్రివిధముగా పాంచరాత్రామృతార్ణవమున చెప్పబడినది.

**శ్లో॥ వైదికం బ్రాహ్మణానాం తు రాజ్ఞాం వైదిక తాంత్రికమ్ ।**
**తాంత్రికం వైశ్యశూద్రాణాం సర్వేషాం తాంత్రికం తు వా ॥**

తా॥ వైదికముగ బ్రాహ్మణు లనుసంధించుకొనునది, వైదిక తాంత్రికముగ క్షత్రియు లనుసంధించుకొనునది. వైశ్యులును, శూద్రులును తాంత్రికముగా ననుసంధించుకొనునది. అథవా అందరును తాంత్రికముగా ననుసంధించుకొనునది. అథవా అందరును తాంత్రికముగా నైనను అనుసంధించుకొనవచ్చును. ఈ విధముగా వడగలవారు వైశ్యులను సహితము ద్విజవర్గములోనుండి శూద్రులలోనికి దిగలాగి ఈ మంత్రము ప్రణవసహితముగా చెప్పరాదని చెప్పిరి. తెంగలశాఖవారు ప్రణవపూర్వకమగు మంత్రమును శూద్రాదులకు చెప్పవచ్చు నని వారి విశాల హృదయమును వ్యక్తపరచిరి.

జి : ప్రణవమును వదలిన ఎనిమిదక్షరము లెట్లగును?

వే : దీనికిని వారే ఇట్లు సమాధానము చెప్పిరి :'నమో నారాయణాయ' అనునవి ఏడక్షరములే యయినను నమో+నార+అ+యణాయ అని చెప్పినట్లయిన ఎనిమిదక్షరము లగునట, దానివలన అష్టాక్షరి అను నామమునకు బాధ కలుగదట. ప్రణవమును వదలినను ఫలమొక్కటియే యని చెప్పుదురు. ఇంజనును తొలగించిన రైలు ఎట్టిదో ప్రణవమును వదలివేసిన అష్టాక్షరి యట్టిదనవచ్చును. మన అభిప్రాయము లెట్లున్నను శ్రుతిప్రమాణమును చూడవలెను గదా? నారాయణోపనిషత్తునందీమంత్రమును గుఱించి ఇట్లున్నది:

**మం॥ ఓమిత్యగ్రే వ్యాహరేత్, నమ ఇతి పశ్చాత్, నారా**
**యణా యేత్యుపరిష్టాత్, ఓ మిత్యేకాక్షరమ్, నమ**

Dr K Dayanandaswamy ebooks



**ఇతి ద్వే అక్షరే, నారాయణా యేతి పంచాక్షరాణి,**
**ఏతద్వై నారాయణస్యాష్టాక్షరమ్ పదమ్॥**

తా॥ మొదట 'ఓం' అను ప్రణవము నుచ్చరింపవలెను. తరువాత "నమః" అనియును, దానితరువాత "నారాయణాయ" అనియును చేర్చిన మంత్రమగును. "ఓం" అనునది ఒక అక్షరము. 'నమః' అనునవి రెండక్షరములు, "నారాయణాయ" అనునవి యైదక్షరములు. అన్నియు కలసి యెనిమిదక్షరములు అని శ్రుతి స్పష్టపరచియున్నది.

మఱియు తారసారోపనిషత్తు నందిట్లున్నది :

**మం॥ ఓం నమో నారాయణా యేతి తారకం చిదాత్మక**
**మిత్యుపాసితవ్యమ్, ఓమిత్యేకాక్షర మాత్మస్వరూపం, నమ**
**ఇతి ద్వ్యక్షరం ప్రకృతి స్వరూపమ్, నారాయణాయేతి**
**పంచాక్షరం పరబ్రహ్మ స్వరూపం. ఇతి య ఏవం వేద,**
**సో ఽమృతో భవతి॥**

అని శ్రుతు లిట్లు చెప్పియుండగ వడగలవారు ప్రణవమును వదలినను ఎనిమిదక్షరము లగునని చెప్పిరి. అది యెట్లు యుక్తమో తెలియదు.

ఈ విషయమై "ముముక్షుప్పడి" యొక్క వ్యాఖ్యయందు శ్రీ మణవాళ మహామునులు పైన నేను కనబరచిన నారాయణోపనిషత్తును మాత్ర ముదాహరించి యిట్లు చెప్పియున్నారు. "దీనిని ఎనిమిదక్షరములు గల దానినిగా జెప్పునట్టి సందర్భమున 'ఓ మిత్యేకాక్షరం' అన్నట్లు ప్రణవమును ఒక యక్షరముగాను, 'నమ ఇతి ద్వేఅక్షరే' అన్నట్లు 'నమః' అని రెండు అక్షరములనుగాను, 'నారాయణా యేతి పంచాక్షరాణి' అని నారాయణ పదమును అయిదు అక్షరములుగాను శ్రుతి చెప్పుచున్నందున సమస్త పదమగు నార+అయన అను తావున నారశబ్దమును విడదీసి ఆఱు అక్షరములనుగా చేసి ప్రణవమును లెక్కలోనికి దీసికొనకుండనే అష్టాక్షరత్వ మును చెప్పునట్టివారి (వడగలవారి) మతము అవైదికం బగుటజేసి అంత ఆదరింపదగినది కాదు" అని విమర్శించిరి. ఈ విమర్శ యెంతో సమంజసమైనది. తిరుమంత్రమును ధారక మని పిలుతురు.

Dr K Dayanandaswamy ebooks



## (11) ద్వయము

**శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే॥**
**శ్రీమతే నారాయణాయ నమః॥**

ఇదియే ద్వయమంత్రము.* ఇది రహస్యత్రయమునందు రెండవ రహస్యము. ద్వయము శ్రుతిమూలకమగు తాంత్రికమని కొందఱును, పూర్వాచార్యుల శ్రీసూక్తియని కొందఱును చెప్పుదురు. అకించనత్వము, అనన్యగతిత్వము గలవాడు దీనికధికారి. "అనన్యగతిత్వ" మనగా: సర్వేశ్వరుడు తప్ప మఱియొక్క రక్షకుడు లేడు అని యుండుట. అకించనత్వమనగా: కర్మ జ్ఞాన భక్తియోగములలోను వానికి హేతువైన ఆత్మగుణములలోను అన్వయము లేక వానికి విపరీతములైన వానిచేత తాను పరిపూర్ణుడుగా నుండు స్థితిని తెలిసి మనకు యోగ్యత లేదు అని ఉండుట. (ప్రపన్న పరిత్రాణము)

అట్టివాడు గురువును చేరి గురువునకు మూడుమారులు సాష్టాంగ నమస్కారము చేసి అతనివలన నుపదేశము పొందవలెను. తిరుమంత్రము ప్రాప్యమును (పొందదగిన ఈశ్వరుని) తెలుపును. చరమశ్లోకము ప్రాపకమును తెలుపును. ద్వయము ప్రాప్యప్రాపకములను తెలుపును. అనగా: ఇది"ఉపాయోపేయ రూపంబగునట్టి యర్థద్వయమును ప్రతిపాదించుటంజేసి దీనికి ద్వయమనిపేరు వచ్చినది." అనియు "ఉపాయవరణమును, ఆత్మ సమర్పణమును క్రమమున ప్రతిపాదించుట జేసి ద్వయమని పిలువబడుచున్నదని కొందఱు చెప్పుదురు." (ర.సా.ప్ర. 28.)

పిళ్ళై లోకాచార్యులవారి సారసంగ్రహమను చిన్న గ్రంథమున "..... అర్థద్వయమును ప్రతిపాదించుటచేత ద్వయమను తిరునామము

---

* రాధాకృష్ణ భక్తిమార్గీయులు ద్వయమంత్రమును నీ క్రింది విధమున చెప్పుదురు.
మం॥ గోపీజనవల్లభ చరణాన్ శరణం ప్రపద్యే - ఈ మంత్రము యుగళమనియు, మంత్ర చింతామణియనియు, ద్వయమనియు, పంచపది యనియు ప్రసిద్ధి - ఇదియే రాధాకృష్ణమంత్రము, వీరి మతమున యుగళార్థమనియు, న్యాసము, శరణాగతి, ఆత్మార్పణము - అనునవి యైదును బర్యాయనామములు. (అం.పద్మ.)

Dr K Dayanandaswamy ebooks



కలిగియుండు వాక్యద్వయము పది అర్థములను ప్రతిపాదించుచున్నది" అని చెప్పిరి.

ద్వయమునందు శ్రీయనగా పిరాట్టికి (లక్ష్మికి) నామధేయము. పరమేశ్వరునకు 'అ' ప్రథమ నామధేయ మైనట్లు లక్ష్మికి 'శ్రీ' ప్రథమ నామధేయము. శ్రీ శబ్దముయొక్క అర్థము 'శ్రీః' అనగా : తమ తమ యుజ్జీవనము గోరునట్టి చేతనులచే ఆశ్రయింపబడునదై, వీరిని ఉజ్జీవింప జేయుటకుగాను సర్వేశ్వరుని ఆశ్రయించి యుండునది అని వేదాంత దేశికులవారు చెప్పిరి.

శ్రీయతే = సేవింపబడునది. అందఱిచేతను ఆశ్రయింపబడునది. శ్రయతే=ఆశ్రయించునది. అనగా: ఈశ్వరుని సేవించుచున్నట్టిది అని లోకాచార్యులవారు వ్రాసిన అర్థము. మఱియు వారిట్లు చెప్పిరి:- అపరాధులయిన జీవులపైన పరమేశ్వరునికి కోపము కలిగినపుడు ఆమె ఆయన కోపమును చల్లార్చి రక్షించును. సర్వేశ్వరు డీమెయందు అతిశయమైన ప్రేమగలవా డగుటచేత ఈమె యిష్టానుసారము ప్రవర్తించును. లక్ష్మీ సహితుడైన నారాయణుని విడిచి లక్ష్మినిగాని ప్రేమించరాదు. (సేవించరాదు). అట్లు చేసినచో ప్రమాదము.

సీతారాముల విషయమునను నిట్లే.* ఇందు కుదాహరణము - శ్రీరాముని నొక్కనినే ప్రేమించిన రావణుని చెల్లెలు శూర్పణఖ విరూపిణి ఆయెను. శ్రీరాముని విడిచి సీతాదేవిని మాత్రమే ప్రేమించిన రావణుడు సర్వనాశ మయ్యెను. లక్ష్మణస్వామి సీతారాము లిద్దఱు చేరియుండునపుడు కైంకర్య మొనర్చినటువలెనే పిరాట్టికిని పెరుమాళ్ళకును చేరియే కైంకర్య మొనర్చుట జీవుని స్వరూపము. ఈశ్వరున కుపాయత్వమనియు నుపేయత్వ మనియు రెండు అకారము లున్నట్లే లక్ష్మికిని పురుషకారత్వము, ప్రాప్యత్వము అనబడు రెండు ఆకారము లున్నవి. కనుక ఈ జీవులకు ఆమె తల్లియగుటవలన ఈ చేతనుల కష్టము సహింపజాలని దైనందున నీమె

* ఈ విధానము శైవులకును సమ్మతమే. శివలింగము ఉమామహేశ్వరాత్మకమని చెప్పుదురు. కృష్ణమూర్తి పూజయందుమాత్రము లక్ష్మియుండవలెనను నియమము లేదందురు.

Dr K Dayanandaswamy ebooks



సర్వేశ్వరునితో చేతనుల యపరాధమును క్షమింపుమని చెప్పి వారిని రక్షించునట్లు చేయగలదు.

"తిరుమంత్రము ఆత్మమూలమున ఫలము పొందదగినదియని, చరమశ్లోకము సర్వేశ్వరుని మూలముగానే ఫలము పొందదగినదియని, ద్వయము పిరాట్టి మూలముగా ఫలము పొందదగినదియని తెలుపుచున్నవి." (ము.ము. 2-3) పెరియ పిరాట్టి మూలముగా భగవంతునకు ఈ చేతనుని విషయము చెప్పి రక్షింపజేయుట (అనగా: సిఫారసు చేయుట వంటిది) యని అర్థము.

జి : దేవునకు భార్య గలదని, ఆమె మాటను భగవంతుడు మీరడని చెప్పుట తత్త్వవేత్తలకు సమ్మతమేనా?

వే : తత్త్వవేత్తలగు అద్వైతులు దీనిని కాదనరు.

నిర్గుణబ్రహ్మము ఆయన శక్తియగు మాయతో చేరి సగుణబ్రహ్మమని వ్యవహరింపబడెను. సగుణ బ్రహ్మమునే లక్ష్మీనారాయణులని పురాణములు పేర్కొన్నవి.

లోకమున నొక పురుషుడు సంతానవంతుడు కావలెనన్న నతనికి భార్య యవసరమైనట్లే నిర్వికార పరబ్రహ్మమువలన జగదుత్పత్తి కలుగుటకు మాయ(ప్రకృతి) యవసరము. బ్రహ్మమును, ప్రకృతిని ఈ కారణమున భార్యాభర్తలని కవిత్వములో చెప్పిరి. మాయ విద్యారూపిణి. విద్య లేనిదే అవిద్య నశింపదు. అవిద్య నశింపనిదే బ్రహ్మము నెఱుంగలేమని తత్త్వశాస్త్రము చెప్పును. లక్ష్మీదేవి పురుషకారము లేనిదే నారాయణుని యనుగ్రహము పొందలేమని పురాణములు చెప్పును. తత్త్వవేత్తలయం దగ్రగణ్యులగు శంకరాచార్యులవారు కనకధారా స్తవమునందు లక్ష్మీదేవి కటాక్షము భగవంతునకును కామప్రద యని స్తుతించిరి.*

విశిష్టాద్వైతులు ఈ తత్త్వము నెఱుగుదురు. "విద్య యనబడునట్టి

* శ్లో|| బాహ్వన్తరే ముంజితః శ్రితకౌస్తుభే యా
హారావళీవ హరినీలమయీ విభాతి |
కామప్రదా భవగతోఽపి కటాక్షమాలా
కల్యాణమావహతు మే కమలాలయాయాః ||

Dr K Dayanandaswamy ebooks



పిరాట్టి" అని ఆచార్యహృదయమను గ్రంథమున లోకాచార్యులవారి తమ్ములగు నాయనారు వ్రాసియున్నారు. (1-53) ఒకానొక మహాత్ముడు ఆజన్మసిద్ధుడై పురుషకారము లేకయే బ్రహ్మవేత్త యగుట కలదు. అట్లే లక్ష్మీదేవి యొక్క పురుషకారము లేకయే యొకానొకనికి భగవదనుగ్రహము కలుగవచ్చును. గజేంద్రుని, ప్రహ్లాదుని భగవంతుడు రక్షించునపుడు లక్ష్మీదేవియొక్క పురుషకార మున్నట్లు భాగవతమునందు చెప్పబడలేదు.

తప్పుచేసిన బిడ్డలను తండ్రి శిక్షించునపుడు తల్లి అడ్డుపడి శిక్షింపకుండ జూచుట లోకమున గలదు. ఆ విధముగనే లక్ష్మీదేవి పురుషకార భూతురాలనుట సమంజసమే కాని, లక్ష్మీదేవి పురుషకారము లేనిదే భగవంతుడు రక్షింపడనుట సరికాదు. అట్లే యైన యెడల భగవంతుడు నిర్హేతుక కరుణాసాగరుడనియు, శరణాగత రక్షణ వ్రతుడనియు చెప్పు శాస్త్రవాక్యములు అర్థశూన్యములు కావలసివచ్చును. శ్రీలోకాచార్యుల వారును దీని నంగీకరించి యొక చూర్ణికయందు "సర్వరక్షకుండనై, నీయొక్క కింకరుండనై, నీయంగీకారము నెదురుజూచుచు.... పురుషకార భూతులే నెపముపెట్టి తరిమి వేయబూనినను నిన్ను విడనాడక రక్షించు నన్ను" (ము.ము.. 3-29) అని చెప్పిరి.

శ్లో|| నాసౌ పురుషకారేణ న చాప్యన్యేన హేతునా ।
కేవల స్వేచ్ఛయై వాహం ప్రేక్షే కంచిత్ కధాచన ॥

తా|| పురుషకారమువలన గాదు. వేరొక్క హేతువువలన గాదు. నేను స్వయముగనే యొకానొకప్పు డెవ్వనినో యొక్కనిని కటాక్షించు చున్నాను అని సర్వేశ్వరుడు చెప్పినట్లు శాస్త్రములయందు గలదు. భగవంతుడు శివ* కేశవాదిగ నేరూపమున నున్నను శరణాగతుని రక్షించుట ఆయనకు వ్రతమై యున్నది. లక్ష్మీదేవిని గుఱించి విశిష్టాద్వైతు లిట్లు చెప్పుదురు.

---

* అంధకాసురుడను నొక పరాక్రమమున లోకములను జయించి నిరంకుశవర్తనుడై యుండెను. అతడు పార్వతీదేవి రూపలావణ్యములను గుఱించి విని, శివుని జయించి పార్వతీదేవిని భార్యగా గైకొనగోరి కైలాసమునకు దండెత్తిపోయి శివునితో యుద్ధము చేసెను. శివుడు కొంతసేపు అంధకునితో యుద్ధము చేసిన పిమ్మట ఫాలనేత్రాగ్నిచే అంధకుని శరీరమునందున్న మాంసము, క్రొవ్వు,

Dr K Dayanandaswamy ebooks



సర్వేశ్వరుడు లక్ష్మీవిశిష్టుడు. విశేషణము లేనిదే విశేష్యమును తెలిసికొనలేనట్లు లక్ష్మీరహితుడగు నారాయణుని చేతను డెఱుగలేడు.

ఉపాయంబగు సర్వేశ్వరునికి ఈమె విశేషణ మనుటవలన ఉపాయంబగుటలో సంబంధ మున్నదని వడగల శాఖవారందురు. అనగా నారాయణునివలెనే లక్ష్మీదేవి సహితము మోక్షప్రదాయిని యనియు, ఈమె యీశ్వరకోటికి చెందినదనియు వడగల వారిమతము. ఈ విషయమున వీరు శైవులతో నేకీభవించి నట్లయినది. శైవులకు ఉమాదేవి సహితము మోక్షప్రదాయిని యనియందురు. దేవీభక్తులు దేవియే మోక్షదాయిని* గాని తక్కిన దేవతలెవ్వరు మోక్షము నివ్వజాలరని చెప్పుదురు. తెంగలశాఖవారు ఈ విషయమున వడగలవారి మతము నంగీకరింపక లక్ష్మి పురుషకార భూతురాలేగాని మోక్షప్రదాత సర్వేశ్వరు డొక్కడే యనియు, లక్ష్మీదేవి జీవకోటిలోనిదేగాని యీశ్వరకోటికి చెందినది కాదనియు చెప్పుదురు. వీరిరువురకు గల భేదాభిప్రాయములలో నిదియొకటి. లక్ష్మీదేవి లోకములకు తల్లి. నారాయణుడు తండ్రి.

లోకాచార్యులవారిట్లు చెప్పిరి : ద్వయము నందున్న శ్రీమత్పదము నందలి 'మతుప్' ప్రత్యయము లక్ష్మికిని నారాయణునకును గల నిత్యసంబంధమును తెలుపును. నారాయణ శబ్దార్థము : (1) వాత్సల్య (2)

---

రక్తము దగ్ధ మగునట్లు చేసెను. శల్యచర్మ మాత్రావశిష్టుడగు అంధకాసురుడు శివుని లోకనాథుడని యెఱిగి శరణుబొందెను. శివుడంతట తన హస్తము నంధకుని శిరముపై నుంప నతడెప్పటియట్లు అగుటయేగాక తేజస్వి యయ్యెను. శివుడాతని ప్రమథులలో చేర్చుకొని భృంగియని నామకరణ మొనర్చెను. లోక గర్హితుడగు అంధకాసురుడు లోకపూజ్యుడగు భృంగీశ్వరు డయ్యెను. ఈ కథ వామన పురాణమునందున్నది. ఇచ్చట పురుషకారము లేదు గదా?

* "తాపహారిణీం దేవీం భుక్తముక్తిప్రదాయినీమ్" అనియును, "నమామి భవ భీతో௨హం సంసారార్ణవతారిణీమ్" (దర్శన), "శ్రీర్లక్ష్మీర్వరదా విష్ణుపత్నీ వసుప్రదా హిరణ్యరూపా స్వర్ణమాలినీ రజతప్రభా," "స్వర్ణ ప్రభా....ఈశ్వరీ భుక్తిర్ముక్తిర్విభూతి వృద్ధి స్సమృద్ధిః కృషిః పుష్టి ర్ధదా......" అని (సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్తు). ఉపనిషత్తులు ఈ విధముగ లక్ష్మీదేవి ముక్తిదాయినియని చెప్పుటలోగల తాత్పర్యము అమె విద్యారూపిణి యనియే. కాదేని ఆమె అద్వైతము ననుసరించి మాయ యగుటవలన ఆమె తొలగుటయే ముక్తినిచ్చుట.

Dr K Dayanandaswamy ebooks



స్వామిత్వ (3) సౌశీల్య (4) సౌలభ్య (5) జ్ఞాన (6) శక్తులను తెలియజేయును. ఇందులో సౌలభ్యము ముఖ్యమైనది. అనగా : సేవించుటకు ముఖ్యస్థానము అర్చావతారము. మనకంటికి కనబడునట్టివి విగ్రహములు. విగ్రహమున శ్రీ హస్తములందు ధరించి యుండునట్టి దివ్యాయుధములును (రక్షణసాధనములు), అభయ హస్తమును, కిరీటము (ఇది రక్షణసూచకము), తిరుముఖ మండలము, చిఱునవ్వును, ఆసన పద్మమున నుంచిన శ్రీ పాదములును- వీటితో కూడియుండునట్టి స్థితియే మనకు రక్షకము.

ఈ శ్రీపాదములే రక్షకము. పిరాట్టియు పెరుమాళ్లను విడనాడినను ఆశ్రితులను శ్రీపాదములు విడువవు. శేషియందు శేషభూతుడు ప్రవేశించు నట్టి రేవు. లేక ద్వారము ఈ శ్రీపాదములే. చంటిబిడ్డ తల్లియొక్క యితర శరీర భాగములతో నిమిత్తము లేక కేవలము స్తనములను మాత్రమే ఆశ్రయించి స్తన్యపానము చేసి వర్ధిల్లునట్లు జీవు డీశ్రీపాదముల నాశ్రయించియే శేషియందు చేరుచున్నాడు. జీవుల కీశ్రీపాదములే ప్రాప్యమును ప్రాపకమునునై యున్నవి. లోకమునం దుపాయము వేఱు, దానిచేత పొందబడునట్టి ఫలము వేఱుగా నున్నవి. ఇచ్చట నివి రెండును శ్రీచరణారవిందములే. ఈ ద్వయమును శ్రీ విష్ణులోకమునందు భగవంతుడు పిరాట్టి విషయమున ప్రకాశింపజేసియున్నాడు. అనగా:- లక్ష్మీదేవికి ఉపదేశించెనని యర్థము.

## (12) చరమశ్లోకము

**శ్లో॥ సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

(గీత. 18-66)

రహస్యత్రయమున ఇది మూడవరహస్యము. (ఈ శ్లోకమును గుఱించి యిదివఱకే కొంత చర్చించియుంటిని). ఇచ్చట ప్రపత్తిమార్గీయులు ముఖ్యముగా శ్రీ లోకాచార్యులవారు చెప్పిన యర్థమునే చెప్పెదను. ఈ శ్లోకమునందలి పూర్వార్థము శేషభూతునియొక్క కృత్యములను, ఉత్తరార్థము శేషియొక్క కృత్యమును తెలుపుచున్నది. సర్వధర్మాన్ పరిత్యజ్య =

Dr K Dayanandaswamy ebooks



సర్వధర్మములను పరిత్యజించిన వాడవై. ఇచ్చట ధర్మశబ్దముయొక్క అర్థమును గమనించవలెను. ధర్మాన్=ధర్మములను అనగా: ఫలసాధన మైనట్టి ఉపాయాంతరములను, ఏయే సాధనములవలన ఫలప్రాప్తి (పరమేశ్వరానుగ్రహము) కలుగునని శ్రుతిస్మృతులచేత విధింపబడి యున్నదో, అట్టి యజ్ఞయాగాదులైన సమస్తకర్మములును, నిష్కామ కర్మాచరణమను కర్మయోగమును, జ్ఞానయోగ భక్తియోగములును*,అవతార రహస్య జ్ఞానమును, పురుషోత్తమ విద్యయు, ఉపనిషత్తులందు ప్రతిపాదింపబడిన యుపాసనలును, దివ్యదేశవాసమును, తిరునామ సంకీర్తనమును, దీపములు బెట్టుటయును, మాలలు గట్టుటయును, - సంధ్యావందనమును మొదలుగాగల సమస్త సాధనోపాయములను, అంతియేగాక మోక్షఫల సాధనంబని తలంచునట్టి సమస్త ధర్మములను బాగుగ త్యజింపవలెను.

ముత్యపు చిప్పను చూచి వెండియని భ్రమించు వాడు అది ముత్యపుచిప్ప అని తెలిసికొన్న పిమ్మట మఱల అది వెండియను భ్రమచెంది దానికొఱకెట్లు ప్రయత్నింపక యుండునో, అదేవిధముగ పైన చెప్పిన వన్నియును భ్రాంతి మూలకములేగాని నిజమైన యుపాయములు గావని త్రోసివేసి బుద్ధిని మఱల వానియందు పోకుండ నుండునట్లు నిశ్చయించుకొని; మాం = సర్వశక్తుండును, సర్వజ్ఞుండును, సర్వరక్షకుండును, ధర్మసంరక్షణార్థము విభవావతారము పొందినట్టి నన్నాశ్రయించుకొని యున్న నీకొఱకు నీ రథముపై చెఱకోలయు, కళ్ళెములు పట్టుకొని సేనాపరాగముచే దుమ్ముపడి యున్న జుట్టు ముడియును, రథము క్రిందివైపుగ జారవిడిచిన శ్రీ పాదములును గల్గి ఇట్టి సారథ్య వేషమున నున్న

* విశిష్టాద్వైతులు పాతంజల రాజయోగమును ప్రత్యేకమగు మోక్షోపాయముగా (ముక్తిమార్గమని) అంగీకరింపరు. ఏలయన: పాతంజల యోగము ధ్యానరూప మగుటచే జ్ఞాన భక్తియోగముల రెండింటియందును ధ్యానసాధన మున్నందున పాతంజల యోగము జ్ఞానయోగ, భక్తియోగముల యందంతర్భూతమైన దనియు, ఆకారణమున ప్రత్యేకమైనది కాదనియు చెప్పుదురు. కనుక విశిష్టాద్వైతమునందు ఎచ్చటెచ్చట మోక్షమార్గముల ప్రసక్తి కలుగునో యచ్చటచ్చట కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తులనే పేర్కొందురు గాని పాతంజల రాజయోగమును పేర్కొనరు.

Dr K Dayanandaswamy ebooks



నన్ను; ఏకం=ఒక్కనిని మాత్రమే (అనుట చేత ఉపాయాంతరములను త్యజింపవలెనని మరల చెప్పినట్లయినది) శరణం=ఉపాయముగ; వ్రజ=నిశ్చిత జ్ఞానము కలవాడవు కమ్ము.

**"ఉపాయే గృహరక్షిత్రోః శబ్దశ్శరణ మిత్యయం వర్తతే"** అని శరణశబ్దమునకు ఉపాయమని ప్రమాణము చూపియున్నారు. ఇది యేగ్రంథము నందున్నదో తెలియదు. శరణశబ్దము రక్షకుని, గృహమును, ఉపాయమును తెలిపినను ఇచ్చట ఉపాయమను అర్థమును మాత్రమే గ్రహింపవలయును. అట్లయిననే పూర్వాపర సందర్భములకు తగియుండు* నని లోకాచార్యులవారు చెప్పిరి (ము.ము. 3,56).

మఱియు, ఏ ధర్మమును విడువక అంటిపెట్టుకొని యున్నను 'మామేకం' అన్న వాక్యమునకు విరోధము కలుగును. లోకాచార్యులవారు ఇందుకొక దృష్టాంతమును చెప్పిరి. **"చచాల చాపం చ ముమోచ వీర"** అను తావున చెప్పియున్నట్లు ఇవి యుపాయంబులు కాకపోవుట మాత్రమే కాకుండ, మీదు మిక్కిలి కాళ్ళకు బంధములవంటివి యనుట (ము.ము. 3-20). దీని తాత్పర్యమేమన రావణుడు శ్రీరామునితో యుద్ధము చేయునపుడు శ్రీరామచంద్రుని బాణములచే మిక్కిలి బాధింపబడినవాడై యుద్ధరంగమును విడిచిపెట్టి పోవుటకు ప్రయత్నించినను చేతిలో ధనుస్సున్నంతవఱకు శ్రీరామచంద్రుడు పోనివ్వడని ధనుస్సును జారవిడిచెను. చేతిలో ధనుస్సు లేనివానిని శ్రీరామచంద్రుడు కొట్టడు కనుక 'సరే పొమ్మని' రావణుని వదలివేసెను. ఈదృష్టాంతము నందుగల యర్థమేమనగా : రావణుని చేతిలో ధనుస్సున్నంతకాలము అది జయము సంపాదింపలేక పోయెను. ధనువును వదలిన తరువాత రావణుడు ప్రాణములు రక్షించుకొనెను.* అదే విధముగ నీ వెంతవఱకు ధర్మము నవలంబించి యుందువో

---

* శరణం స్యాద్రక్షితరి రక్షణే మందిరే వధే శరణమ్. "న" ఇది రక్షించువానికిని, రక్షించుటకును, గృహమునకును, చంపుటకును పేరు' (అని నానార్థరత్నమాల) శరణం గృహరక్షిత్రోః "న" ఇది గృహ - ఇంటికిని, రక్షిత్రోః - రక్షించువానికిని పేరు. (అమరకోశము)

Dr K Dayanandaswamy ebooks

యంతవఱకు నీకు భగవదనుగ్రహము కలుగదు. ధర్మమును వదలినచో కలుగును. (ము.ము.3-20) ధర్మములు వదలుటనగా- అధర్మము నాచరించవలెనని చెప్పలేదు. (ము.ము. 3).

ప్రపత్తియే సిద్ధోపాయము. దీనికితోడు మఱియొక యుపాయమును భక్తిజ్ఞాన కర్మాదులలో దేనినైన జతపరచి (ఉపాయముగా గ్రహించితిమేని) ప్రపత్తి తరణోపాయము కాజాలదు. దీనికి బ్రహ్మాస్త్రబంధ న్యాయమును చెప్పిరి. బ్రహ్మాస్త్రబంధ న్యాయమనగా: హనుమంతుడు లంకకు పోయి అశోకవనమును నిర్మూలించినపుడు ఇంద్రజిత్తు హనుమంతుని బ్రహ్మాస్త్రముచేత బంధించెను. బ్రహ్మాస్త్రవిషయక జ్ఞానములేని రాక్షసులు బ్రహ్మాస్త్రముచేత బంధింపబడిన హనుమంతుని త్రాళ్లచేత కట్టివేసిరి. మఱియొక బంధమును సహించని బ్రహ్మాస్త్రము తత్క్షణమే విడిచిపోయెను. త్రాళ్లు హనుమంతుని బంధించలేక తునుకలైపోయెను. అదేవిధముగా శరణాగతి అన్యసాధనమును సహింపదు.

చరమశ్లోకముయొక్క ఉత్తరార్ధభాగమునకు తాత్పర్యమిట్లు చెప్పబడినది: సర్వోపాయములు విసర్జించుటవలన నెట్టి పాపములు కలుగునని నీవు భయపడుచున్నావో, అట్టి సమస్త పాపములనుండియేగాక అనేక జన్మ సముపార్జిత పాపరాశినుండియు నేను రక్షింపగలను - అని ఉపాయభూతుడైన పరమేశ్వరుని కృత్యము తెలుపబడినది. బ్రాహ్మణుడు, వేదాధ్యయనము, యజ్ఞము, సవితృదేవతాకమైన మంత్రజపము - వదలినట్లయిన భ్రష్టుడై పతితుడై నరకమునందు కూలునని వేదశాస్త్రములు చెప్పియున్నవి. అట్లే సమస్త వర్ణముల వారును ఆయా వర్ణోచితమైన ధర్మములను వదలినట్లయిన పాపము కలుగునని చెప్పినవిగదా? అట్టి భయమెంత మాత్రమును పొందనక్కఱలేదు. ఒకవేళ సర్వధర్మములు పరిత్యజించుటవలన పాపములు కలిగినను అట్టి సర్వపాపములనుండి నిన్ను ముక్తుని చేయుచున్నాను అని భగవంతుడు అభయమిచ్చి యున్నాడు. చరమశ్లోకముయొక్క అర్థము

* యో వజ్రపాతాశని సన్నిపాతాన్న చుక్షుభే నాపి చచాల రాజా |
స రామబాణాభిహతో భృశార్త శ్చచాల చాపం చ ముమోచ వీరః ||
(శ్రీమద్రామా, 6-59- 139)

Dr K Dayanandaswamy ebooks



నీ విధముగ శ్రీలోకాచార్యులవారును, శ్రీ మణవాళమహామునులును చెప్పియున్నారు.

## (13) చరమశ్లోక తాత్పర్య పరిశీలనము

చరమశ్లోకమున కీ విధముగ అర్థము చెప్పినట్లయిన అంతకు పూర్వము భగవంతు డర్జునున కుపదేశించిన దానికిని, ఈ యర్థమునకును విరోధము కలుగును. ఎట్లనగా: గీతారంభమున అర్జునుడు భగవానునితో "ఓకృష్ణా! ఏది నాకు శ్రేయస్కరమో అట్టిదానిని నాకుపదేశింపుము". (గీత. 2-7) అని ప్రార్థించినప్పుడు భగవానుడు మొదట సాంఖ్యయోగము (జ్ఞానము)ను చెప్పి "ఓ అర్జునా! ఇది బ్రహ్మనిష్ఠ యనబడును. మరణకాలమునం దీనిష్ఠను బొందినవాడు మోక్షమును పొందును." (గీత. 2-72) "అర్జునా! నీవు నా భక్తుడవును స్నేహితుడవును గనుక నీ కొఱకు శ్రేష్ఠమైనదియు, గోప్యమైనదియునగు నీ జ్ఞానముపదేశించితిని" (గీత. 4-3). "ఓ అర్జునా! తపసులకంటెను, శాస్త్రార్థజ్ఞానము గలవారికంటెను కర్మగలవారికంటెను, యోగి శ్రేష్ఠుడు కనుక నీవు యోగివి కమ్ము" (గీత. 6-46). "అర్జునా! ఏ జ్ఞానమును దెలిసికొంటివేని తెలిసికొనవలసిన దేదియును నుండదో అట్టి శాస్త్రీయ జ్ఞానమును నీకు చెప్పెదను. " (గీత. 7-2) "బ్రహ్మవాచకమైన ఓం అను నేకాక్షరము నుచ్చరించుచు నెవడు దేహము వదలుచున్నాడో వాడు మోక్షమును పొందుచున్నాడు." (గీత. 18-13) "అర్జునా! ఏ జ్ఞానము నెఱింగి సంసారమునుండి ముక్తుడవు కాగలవో ఆ మిక్కిలి గోప్యమైన అనుభవజన్య జ్ఞానముతో గూడినట్టి జ్ఞానమును నీకు చెప్పెదను." (గీత. 9-1) "ఏ భక్తులు నన్నుపాసించుచున్నారో వారు మిక్కిలి యుక్తులైన వారు, నాకు ఇష్టులు." (గీత. 12-2) "క్షేత్రక్షేత్రజ్ఞజ్ఞానము కలవానికి పునర్జన్మము లేదు." (గీత. 13-24) "పురుషోత్తమ ప్రాప్తియోగము నెవ్వడెరుగుచున్నాడో వాడు కృతకృత్యుడు." (గీత. 19-20) - ఈ విధముగా భగవంతుడు చెప్పియున్నాడు కదా! ఇవి యన్నియు మోక్షసాధనములే (మోక్షోపాయములే) గదా? అను ప్రశ్న కలుగునని తలచి అట్టి మోక్షోపాయములను భగవంతు డుపదేశించుటకు లోకాచార్యులవారు మూడు సమాధానములు చెప్పియున్నారు. అవి యీ క్రింద చెప్పెదను:

Dr K Dayanandaswamy ebooks



(1) "ఇంతకుముందు (చరమశ్లోకము చెప్పుటకు ముందు) కొన్ని యుపాయముల నుపదేశింపగా, అవి దుశ్శక్యంబులని, స్వరూపవిరుద్ధములని తలంచుకొని దుఃఖభరితుండైనట్టి యర్జునుని గుఱించి వాని దుఃఖమును పోగొట్టుటకై దీనికి మించినది లేదని చెప్పదగినట్టి చరమోపాయము నుపదేశించుటచే నిది చరమశ్లోకమను పేరున ప్రసిద్ధి చెందినది (ము.ము. 3-1) అనియును - (2) ముందు చెప్పినవన్నియు నుపాయములని భ్రమించుటేగాని వాస్తవమునకు ఉపాయములు గావు." (ము.ము. 3-17) అనియు - (3) అర్జునున కుపాయాంతరము నుపదేశించిన దంతయు అతని మనస్సు పరీక్షించుటకుగాను, దొంగపశువునకు గుదిబండ కట్టినట్లు అహంకార మమకార మూలకమగు గర్వమును పోగొట్టి స్వరూపజ్ఞానము కలుగజేయుటకు" (ము.ము. 3-91, 92)అనియును చెప్పిరి.

మొదటి సమాధానమున జ్ఞానయోగాదులు దుస్సాధములని అర్జునుడు దుఃఖితుండైనట్లు లోకాచార్యులవారు చెప్పిరి. వీరు తిరుమంత్రమును గుఱించి చెప్పిన సందర్భమున "సర్వేశ్వరుడే తన కృపచేత వీరు తనను తెలిసికొని కడతేరునట్లు తానే శిష్యుడునునై, ఆచార్యుడునునై" (ము.ము. 1-5)- అనగా నరనారాయణులై పుట్టియుండినవారే కృష్ణార్జునులై యవతరించియున్నారు. అట్టి నారాయణుని అవతారమగు నర్జునునికే జ్ఞానయోగాదులు దుశ్శక్యములైన యెడల లోకమున నెవరికవి సులభసాధ్యము లగును?ఇదిగాక అర్జునుడు దైవసంపదతో పుట్టినవాడని గీతోపదేశమున కర్జునుడని చింతింప నవసరము లేదని భగవంతుడే చెప్పియుండలేదా? (గీత. 16-5) జ్ఞాన యోగాదులు దుస్సాధములని అర్జునుడు దుఃఖపడగా చరమశ్లోకార్థమగు శరణాగతిని భగవంతు డుపదేశించెనని లోకాచార్యులవారు చెప్పిన యీ సమాధానము యుక్తమైనది కాదు. అదేవిధముగా రెండుమూడు సమాధానములు సహితము సరియైనవి కావు. ఏలయన : కురుక్షేత్ర సంగ్రామానంతరము యుధిష్ఠిరుడు రాజ్యపాలనము చేయుతఱి శ్రీకృష్ణార్జునులు ఇంద్రప్రస్థ పురమునకు పోయి యందుకొన్ని దినంబు లుండిరి. అట్టి సమయమున నొక దినమున అర్జునుడు శ్రీకృష్ణునిట్లు ప్రశ్నించెను.

Dr K Dayanandaswamy ebooks


చం॥ అనికి దొడంగునప్పుడు మదాత్మ గలంగిన గొన్ని తత్త్వ బో
ధన మహనీయ వాక్యము లుదాత్తకృపం దగ నీవు చెప్పి, తే
మనమున వాని యర్థములు మాధవ నిల్పగజాలనైతి, న
వ్వినుత వచస్సుధారసము వీనుల నింకొక మాఱు నింపవే.

కం॥ అనిన నగుచు నొక కేల న
తని గౌగిటజేర్చి బుద్ధి తత్త్వవిహీనుం
డును శ్రద్ధారహితుడు నై
తని దూఱి ముకుందు డిట్టులను నాతనితోన్.

తే॥ బ్రహ్మపద వేదనమునకు బరమహేతు
భూతములు నాటి వాక్యముల్, బుద్ధి దన్మ
హార్థములు నిల్పవైతి, శక్యంబె యింక
నవ్వచనములు చెప్పంగ నలఘుశౌర్య!

(తిక్కన భారత.అశ్వ.ప్రథమా. 153,154,155)

'ఓ కృష్ణా! యుద్ధారంభమున నామనస్సు కలత జెందియుండగా నీవు నా యందలి దయచే నాకు బ్రహ్మతత్త్వ జ్ఞానమును కలిగించు మహనీయ వాక్యములు చెప్పియుంటివి. ఆ వాక్యములయందలి యర్థమును జ్ఞప్తియం దుంచుకొనలేక పోయితిని. ఆ వాక్సుధ నింకొకసారి నా వీనుల నింపుము' అని ప్రార్థింప, కృష్ణభగవానుడు నవ్వుచు అర్జునుని కౌగలించుకొని 'బుద్ధిలేనివాడవును, శ్రద్ధలేని వాడవునునై పరబ్రహ్మ బోధకములగు నాటి వాక్యములయొక్క యర్థమును బుద్ధియందుంచు కొనలేక పోయితివి. ఆ వాక్యములు తిరిగి యిప్పుడు చెప్పుటకు నాకు సహితము సాధ్యగా'దని చెప్పి యర్జునుని యందలి యనుగ్రహముతో పూర్వము చెప్పిన తత్త్వమును స్థిరపరచుటకు మరల తత్త్వోపదేశము చేసెను. ఇది మహాభారతాంతర్గత అశ్వమేధ పర్వమునందు కలదు. దీనిని అనుగీత లందురు. ఇది గురుశిష్య సంవాద రూపమునను, భార్యాభర్తృ సంవాదరూపమునను, పితృపుత్ర సంవాద రూపమునను చెప్పబడినది. అనుగీతలు ముగించుచు భగవంతుడు చెప్పిన వాక్యము లివి :

 Dr K Dayanandaswamy ebooks

కం॥ విమలము, నచలము నగు చి
త్తము నాదెస నేకభక్తి తత్పరముగ జే
యుము, నిత్యము నీ యధ్యా
త్మము ననుసంధింపు, వాసెదవు దురితములన్. (2-223)

కం॥ సమరము నప్పుడు నీ కి
యమృత పదప్రాప్తి హేతువగు సమ్యగ్బో
ధము వివరించితి, నచలత
రమింపు మిందెపుడు శమధురాధుర్యుడవై (2-224)

అర్జునా! నీమనస్సు మాలిన్య రహితముగను, చంచలము కానట్టిదిగను చేసి దానిని నాయందు తప్ప అన్యమునందు చేరకుండునట్లు చేయుము. నేనిప్పుడు బోధించిన ఈ అధ్యాత్మబోధను ఎల్లప్పుడును ననుసంధింపుము. నీసమస్త పాపములు నశించును. యుద్ధసమయమున నీకమృతపదప్రాప్తి హేతువగు పూర్ణబోధను వివరించితిని. దీనియందుండి చలింపని వాడవును ఇంద్రియములను జయించిన వాడవునై యుండుమని బోధించి ముగించెను.

లోకాచార్యులవారు చెప్పినట్లు శరణాగతి యొక్కటి తప్ప జ్ఞాన యోగాదులన్నియు "దొంగపశువునకు గుదిబండ కట్టినట్లు" చెప్పబడి యుండిన నింద్రప్రస్థమున అర్జును డడిగిన ప్రశ్నకు అనుగీతలలోని తత్త్వజ్ఞానమును చెప్పక చరమ శ్లోకార్థమగు శరణాగతి యొక్కటియే చెప్పియుండునుగదా! కనుక గీతయందు చెప్పిన జ్ఞాన యోగాదులు ముక్తిప్రదములే. అయితే, లోకాచార్యులవారిట్లు చెప్పుటకు గల కారణ మీ విధముగ నూహింపవచ్చును :

కర్మ, జ్ఞాన, భక్తి* ప్రపత్తులందు విశిష్టాద్వైతమునకు అనురూపమైనది ప్రపత్తి. వారి తత్త్వమునకు ప్రపత్తి తగియున్నంతగా నితర మోక్షోపాయములు

* ఇచ్చట భక్తి అన్నపుడు విశిష్టాద్వైతులు చెప్పునట్టి భక్తియని యెఱుగవలెను.

Dr K Dayanandaswamy ebooks


తగి యుండవు. విశిష్టాద్వైతము ననుసరించి సర్వేశ్వరునకు జీవుడు శరీరము. సర్వేశ్వరుడు తన శరీరమును తా నేవిధముగా చక్కదిద్దు కొనవలెనో, తా నెఱిగినట్లు చేతను డెఱుగ లేడు. చేతనుడు తనను తాను తన యిష్టానుసారముగ దిద్దుకొనజూచుట దురహంకారము. సర్వజ్ఞుడగు సర్వేశ్వరునికంటె నల్పజ్ఞుడగు (తాను) చేతనుడు జ్ఞానాధికుడనని తలంచినట్లగును. చేతనుడు తన యుజ్జీవనమునకు తాను ప్రయత్నించెనేని భగవంతుడీతని విషయమున కలుగ జేసికొనడు. ఇదియే లోకాచార్యులవారి అభిప్రాయము. ఇతర దర్శనముల ననుసరించి ఆయా దర్శనములలో చెప్పినట్టి మార్గములు వారివారికి మోక్షసాధనములు. అవన్నియు మోక్షోపాయములని యంగీకరించినచో ప్రపత్తికి బలము తగ్గిపోవునని ప్రపత్తియొక్కటే మోక్షోపాయమని లోకాచార్యులు చెప్పియుందురు. ఈ విషయము మఱియొకసారి విచారింతము.

## (14) ప్రపత్తికి అధికారులు

ప్రపత్తి కధికారులగుటకు ఆకించన్యము, దీనత్వము, ఆర్తియను నీ అర్హతలుండిన చాలును. జాతి, కుల, లింగ, వయో, విద్యాది భేదములు లేక పండితులు, పామరులు అను విచక్షణ లేక అందఱును అధికారులేయని లోకాచార్యులవారి మతము. అకించనుడనగా బీదవాడు (దరిద్రుడు). లోకాచార్యులవారు ప్రపన్న పరిత్రాణమను గ్రంథమున ఆకించన త్వ మనగా: కర్మ జ్ఞాన భక్తియోగముల ననుష్ఠించు శక్తి తమకు లేదని తలచియుండుట అని చెప్పిరి. ఆకించన్యము, దీనభావము రెండును గలవాని యందు అహంకార ముండదు. దర్పదంభము లుండవు. దాస భావముండును. అహంకారము లేక పోయినచో మమకార ముండదు. ఆర్తి యనగా:- భగవంతు డెప్పు డీచేతనుని చేరదీయునా? ఎప్పుడీసంసార పాశమునుండి విముక్తి చెందుదునా? యను దుఃఖము. ఇట్టి యార్తి యున్నవాడు సంపూర్ణ వైరాగ్యము గలవాడేగదా? అతడు స్వర్గలోకాధిపత్య మిచ్చినను గైకొనడు. ఆకించన్యము, దారిద్ర్యము, ఆర్తి - యీ మూడుండిన వారియందు మలినవాసన లుండవు. భక్తియోగులకు ఎట్టియర్హత లుండవలెనని శాస్త్రములయందు చెప్పిరో అట్టి యర్హత లన్నియును ఈ మూడింటిలో

Dr K Dayanandaswamy ebooks


చేరియే యున్నవి. కనుక లోకాచార్యులవారు చెప్పినట్లు ప్రపన్నుడు కాగోరువారి కుండవలసిన యీ యర్హతలు ప్రశస్తమైనవి. మఱియు ప్రపత్తి కర్తులగు వారిని మూడు వర్గములుగా విభజించి శ్రీ వచన భూషణమునం దిట్లు చెప్పిరి:-

(1) పెరుమాళ్ళను బొందుటకు తగిన జ్ఞానములేని వారు (వీరు సామాన్యులు)

(2) జ్ఞానశక్తు లున్నను పెరుమాళ్ళ కత్యంత పరతంత్రమైన స్వరూపముయొక్క యథార్థజ్ఞానముచేత ఉపాయాంతరములు స్వరూప విరుద్ధమని వానిని విడిచిపెట్టుటకు తగిన జ్ఞానపూర్తి గలవారు-వీరు పూర్వాచార్యుల వంటివారు.

(3) శిథిలమైన కరణములు కలిగిన భక్తిపరవశులు. వీరు ఆళ్వారుల వంటివారు. (శ్రీ.భూ. 41: నుండి 46వఅంకు)

ఈ విధముగా చెప్పి తుదకు భక్తిపారవశ్యమే ప్రపత్తికి ముఖ్య హేతువని చెప్పిరి. (శ్రీ.భూ. 47-48)

ఈ విషయమును వేదాంత దేశికులవారిట్లు చెప్పిరి :

(1) ఎవ్వరికి వేదాధికారము లేదో అట్టి స్త్రీ శూద్రాదులును, (2) వేదాధికార ముండినవారిలో నీ క్రిందచెప్పబడిన వారును అనగా:

(౧) "ఉపాసనాదుల ననుష్ఠించు విషయమున శక్తి లేకపోవుట (అనగా: కర్మ, జ్ఞాన, భక్తియోగములు కష్టమగుటవలన వాటి ననుష్ఠింపలేని అసమర్థులని యర్థము)

(౨) నిశ్చయించి తెలిసికొనుటకు శక్తి లేకపోవుట.

(3) శాస్త్రములనుండి తెలిసికొనుట కంతగ నిచ్ఛ లేకపోవుట.

(౪) సత్కాలక్షేప విషయమున నసమర్థత యుండుట.

పైన చెప్పిన నాలుగుగాని, అందులో నేయొకటిగాని, రెండుగాని, మూడుగాని తమతమ యధికారమునందలి భేదమునుబట్టి కలవారలై యుండిన సత్పురుషులు మోక్షమునకు సర్వేశ్వరుని ఆశ్రయించుచున్నారు."

Dr K Dayanandaswamy ebooks



(3) అన్ని విధముల సమర్థులై యుండియు మోక్షమును చెందుటకు కాలవిలంబనము సహించని ఆర్తులు. వీరు చరమ శ్లోకమునందు చెప్పిన శరణాగతికి అర్హులు. తక్కినవా రనర్హులు. ఇట్లు చెప్పిన ఉపాసనాదులకును ప్రపత్తికిని వేఱువేఱు అధికారు లుండుటవలన రెండు శాస్త్రములును సార్థకము లనిరి.

(4) "శీఘ్రముగ భగవత్ప్రాప్తి కలుగకపోయి నట్లయిన ప్రాణములు విడనాడునట్టి స్థితి. ఇట్టిస్థితి శాస్త్రీయంబగు భక్తియోగము లేకపోయినను కొందఱికి సుకృతవిశేష మూలముగ భగవదనుగ్రహమువలన కలుగగలదు. ఇట్టి యవస్థ గలవాడును ప్రపత్తికి అధికారి కాగలడు" (ర.సా. 4)

భక్తికి శూద్రాదు లధికారులు కారు. కనుక అట్టి స్త్రీ శూద్రాదులు ప్రపత్తి కధికారులని వీరి సిద్ధాంతము. "కొందఱికి సుకృత విశేషమూలముగ భగవదనుగ్రహమువలన కలుగగలదు" అనుటచే శూద్రాదులకు సహితము ఆచార్యోపదేశము, శాస్త్రాభ్యాసము లేకయే భక్తి కలుగవచ్చునని యంగీకరించుటచే వీరి సిద్ధాంతమును పైవిధముగ సవరించుకొనక తప్పినది కాదు. ఏలయన: మనదేశమునందేగాక విదేశములయందు సహితము భక్తులు అప్పుడప్పుడు జన్మించు చుండిరని మనము వినియున్నాము. ముఖ్యముగ స్త్రీశూద్రాదులయం దధిక సంఖ్యాకులగు భక్తులు జన్మించిరి.

భక్తి యోగాదులకు స్త్రీశూద్రాదు లర్హులు కారని అట్టివారికై ప్రపత్తి చెప్పబడినదని వేదాంత దేశికాచార్యులవారు చెప్పిన దానిని గుఱించి పరిశీలింతము: చరమశ్లోకము (18-66)నకు పూర్వాపరములయందు చెప్పిన యర్థమేమి? అని గమనించిన ప్రపత్తికి ప్రత్యేకముగ అధికారి నిరూపణ మేదియు చేయబడలేదని విదితమగును. చరమశ్లోకమునకు పూర్వమున్న శ్లోకములయందలి యర్థమిది : ఓ అర్జునా! యెల్లభూతములకు నియామకుండగు నీశ్వరుడు సమస్త భూతముల హృదయముల యందుండి తన మాయచేత సమస్తజీవులను భ్రమింపజేయుచున్నాడు (గీత. 18-61).

Dr K Dayanandaswamy ebooks



ఓ అర్జునా, అట్టి యీశ్వరునే నీవు శరణుపొందుము. అతనివలననే నీకు చిత్తనైర్మల్యమును, ఉత్కృష్టమైన శాంతియును కలిగి శాశ్వతమగు స్థానమును పొందగలవు (గీత. 18-62)(అని వివరించి) మరల నీ కొఱకు మిక్కిలి రహస్యమైన జ్ఞానమును నేను చెప్పియున్నాను. నీవు లెస్సగా విచారించి **"యథేచ్ఛసి తథా కురు"** ఏ ప్రకారము కోరుచున్నావో ఆ ప్రకారము చేయుము. (గీత. 18-63)(అని అర్జునునికి స్వాతంత్ర్య మిచ్చియు) "నీవు నాకు ప్రియుడవు కావున నీ క్షేమము కొఱకు సమస్త గోప్యములయందును గోప్యమైన మాటను చెప్పెదను వినుము (గీత. 18-64), నాయందు మనస్సు కలవాడవును, భక్తి కలవాడవును, నన్ను పూజించు వాడవును కమ్ము. నాకు నమస్కరింపుము. అట్లుచేసితివేని నన్నే పొందగలవు. నాకు ప్రియుడ వగుటచే నీకు సత్యమును చెప్పితినని ప్రతిజ్ఞ చేయుచున్నాను (గీత. 18-65). అని చెప్పి తదనంతరము చరమశ్లోకము నుపదేశించెను. చరమశ్లోకముతో భగవంతు డర్జునునకు చేసిన గీతోపదేశము పూర్తియైనది.

ఆ తరువాత ఆఱు శ్లోకములు భగవద్వాక్యములే యున్నను అవి యుపదేశ వాక్యములు కావు. అవి గీతాశాస్త్రముయొక్క గొప్పతనమును, గీతార్థసంప్రదాయ ప్రవర్తనమందలి నియమములను, అనగా: గీతోపదేశమును పొందుటకు అధికారులు, ఫలము మొదలగు విషయములు చెప్పునవి. తత్త్వోపదేశ శ్లోకములలో కడపటిది 18-66 గనుక చరమశ్లోకమని యందురు. ఇప్పుడొక్కసారి సింహావలోకనము చేసిన గీత. 18-62వ. శ్లోకమునందే శరణు పొందుమని చెప్పియుండినను గీత. 18-64 శ్లోకమునందు **"సర్వగుహ్యతమం భూయః"** తిరిగి సమస్తములయందు మిక్కిలి గోప్యమైన, పరమ్‌వచః=ఉత్కృష్టమైన నాయొక్క వాక్యమును వినుము అని చెప్పుటచేత అర్జునుని నిమిత్తముగాకొని సమస్త మానవకోటికి చరమశ్లోకము నుపదేశించెనే గాని వేదాధికారములేని స్త్రీశూద్రాదులకు మాత్రమే కాదు.

చరమశ్లోకము మాట అటుంచి గీతోపదేశమును గుఱించి విచారింతము. ఏ శాస్త్రమునకైనను అధికారి, విషయము, సంబంధము,

Dr K Dayanandaswamy ebooks



ప్రయోజనము నను నాలుగంశము లుండవలయును. ఏ శాస్త్రమునకైనను అధికారి యెవరను నంశ మాయా శాస్త్రములయందే యారంభముననో, నంతముననో ఎచ్చటనో యొకచోట శాస్త్రకారులు చెప్పు నాచార మున్నది. ఆ సంప్రదాయ ప్రకారము గీతయందు చెప్పబడిన మోక్షధర్మములు ఎవరి నుద్దేశించి చెప్పబడినవో, యెవ రీధర్మానుష్ఠానమున కర్హులు కారో మొదలగు విషయములు గీతయే చెప్పియున్నది. గీతయం దీవిషయము పరిశీలించినచో నీ సత్యము తెలియగలదు. గీత చరమశ్లోకము (18-66) తర్వాత గల శ్లోకమునందు గీతాధర్మమును ఎవరికి బోధింపగూడదో అట్టి అనధికారిని తెలిపినది.

శ్లో॥ ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యో ఽభ్యసూయతి. ॥
(గీత. 18-67)

తా॥ అర్జునా! నేను నీకు చెప్పిన యీ గీతాశాస్త్రము తపస్సు చేయని వానికిని, భక్తి శ్రద్ధలు లేనివానికిని, నాయందసూయ గలవానికిని నుపదేశింపదగినది కాదు.

అని వ్యతిరేక రూపమున అధికారి నిరూపణము చేయబడినది. అనగా: 67వ. శ్లోకమునందు చెప్పబడిన వారు మాత్రమే అనర్హులు, తక్కినవా రందఱు జాతి, కుల, మత, లింగ, వయో భేదము లేక గీతయందు చెప్పబడిన సమస్త మోక్షధర్మములకు (అనగా కర్మ, జ్ఞాన, భక్తి యోగాదులకు) అధికారులని గీత స్పష్టపరచినది. స్త్రీ శూద్రాదులు గీతయందు చెప్పిన కొన్ని ధర్మముల కనర్హులని చెప్పువారి మతము గీతామతమునకు వ్యతిరేకము. తపస్సు, భక్తి, శ్రద్ధ, భగవంతునియందు ప్రీతి - యివి గలవా రన్నికులములందును నన్నిమతములందును గలరు. అట్లే తపస్సు మొదలగు యోగ్యతలు లేనివా రన్నికులముల యందు నన్నిమతములయందును గలరు. ఈ సత్యమును ఎవ్వరును దాచలేరు.

Dr K Dayanandaswamy ebooks



గీత 16-67వ శ్లోకము తరువాతి రెండు శ్లోకములందు (గీత. 18-68, 69) గీతాశాస్త్రమును భగవద్భక్తుల కుపదేశించిన వారికి ఎట్టి ఫలము కలుగునో అట్టి ఫలమును గుఱించి వివరింపబడినది. గీత. 18-70, 71 శ్లోకములయందు గీతాపారాయణము చేయువారికిని, గీతాశాస్త్రమును వినునట్టి వారికిని కలుగునట్టి ఫలమిట్టిదని చెప్పబడినది. 18-72వ శ్లోకమునందు "ఓ అర్జునా! నేను చెప్పిన గీతాశాస్త్రము వింటివికదా? నీ మోహమంతయు తొలగిపోయెనా?" అని భగవంతు డర్జునుని ప్రశ్నించి నట్లున్నది. 73 వ శ్లోకమునందు "నామోహము తొలగిపోయిన"దని అర్జునుడిచ్చిన సమాధానము చెప్పబడినది. ఇంతటితో కృష్ణార్జున సంవాదము ముగిసినది. తరువాత ఆఱుశ్లోకములు సంజయుని వాక్యములు. అంతటితో గీతాశాస్త్రము సంపూర్ణము.

భగవంతు డందరివాడైనట్లే గీతాశాస్త్రము సహిత మందఱకు చెందినదే. అందులో చెప్పబడిన మోక్షధర్మము లనుష్ఠించుటకు యోగ్యతగలవా రందఱు నధికారులే. అధికార మనునది వారు పుట్టిన కులమునుబట్టిగాక వారట్టి మోక్షధర్మము ననుష్ఠించు శక్తి(అర్హత) గలవారగుదురా? కారా? యని విచక్షణ చేయబడలేదు.

మహాభారతము భిన్న భిన్న మతములవా రుపన్యసించుటకు నెలవగు నొక యుపన్యాస వేదికవంటిది. దానియందు చెప్పబడిన భిన్నమతముల కొక సమన్వయ మనునది కల్పించియుండలేదు. మహాభారతాంతర్గతమగు భగవద్గీతయు అట్లే భిన్న భిన్న మతములను బోధించినది. గీత పుట్టినకాలమునం దేయే మతములు వ్యాప్తియందుండి మహాత్ములచే నాదరింపబడుచు ప్రసిద్ధి కెక్కియుండెనో అట్టిమతములను గీత పేర్కొని యవియన్నియు మోక్షధర్మములని అంగీకరించుట వలన చాలవఱకు వాటికొక సమన్వయము కల్పించినదని చెప్పవచ్చును. కాని గీతాచార్యుడగు శ్రీకృష్ణభగవానుని మతము భక్తిమార్గమని, శరణాగతి భక్తియం దంతర్భూత మని కడపటిశ్లోకము వలన తెలియుచున్నది. పర్యవసాన మేమనగా : గీతయందలి మోక్షధర్మముల ననుష్ఠించుటకు యోగ్యతగల వ్యక్తు లేకులము వారైనను నర్హులే.

Dr K Dayanandaswamy ebooks



## (15) భక్తి ప్రపత్తులకు గల భేదము

జి : భక్తి ప్రపత్తులకు గల భేదమెట్టిదో యనుగ్రహించి తెలుపుడు.

వే : ఆరంభము అనగా: ఒకానొకకాలమున "భక్తి ప్రపత్తు లొకటిగనే భావింపబడుచుండి రానురానవి రెండును వేఱువేఱను సిద్ధాంత మేర్పడినదని చెప్పవచ్చును. "భక్తి ప్రపత్తులొకే పద్ధతియొక్క రెండురూపము"లని శ్రీయుతులు డా|| రాధాకృష్ణ పండితులు చెప్పిరి.* "స్వభావమును బట్టి యా రెండింటికిని భేదము లేదు. భక్తిని గుఱించి యనేక నిర్వచనములు చేయబడినందున శ్రీ రామానుజ సిద్ధాంతము ననుసరించి భక్తిప్రపత్తులు వేఱువేఱని చెప్పవలసియున్నది. ఎట్లన: ఉపనిషత్తులయందు చెప్పబడిన సగుణోపాసనలు భక్తిరూపమైనవని రామానుజులవారి సిద్ధాంతము. భక్తి యన్ననో పరమప్రేమరూపమని తెలిసికొంటిమి. ఉపాసకుడు ఉపనిషత్తులయందలి యుపాసనల ననుష్ఠించుచు ఉపాస్యవస్తువు నందతనికి పరమప్రేమగలదని ఆ కారణమున నుపాస్యవస్తువు నాతడు ఉపాసించుచుండెనని చెప్పుటకు వీలులేదు. కొందఱకు ఉపాస్యదేవతయందు ప్రేమ యుండిన నుండవచ్చును. మఱి కొందఱుపాస్యమును ఏదేని యొక ఫలముకోరి యుపాసింతురు. పరమప్రేమ నిరపేక్షమైనది. కోరికలకును పరమప్రేమకును విరోధము. ఉపాసకుడు తానుపాసించు దేవతకును తనకును భేదములేదని భావించునట్టి యుపాసనలు కలవు. అవి ప్రపత్తికి సరిపడవు. ప్రపత్తికి శరణ్యుడగు రక్షకుడు వేఱు. శరణుపొందువాడు వేఱు అను భావముండవలెను. **విశిష్టాద్వైతుల మతము ననుసరించి భక్తిప్రపత్తులు ఈ క్రింద చెప్పబోవు విధముగా వేఱు వేఱుఅని చెప్పవచ్చును**

(1) భక్తి : దేనియందును నిష్ఠలేక దేనియొక్క యధీనమునందును నుండక, శేషియగు భగవంతునియొక్క స్వరూపాదుల విషయమున నిరతిశయమైన ప్రీతిగలిగి యవిచ్ఛిన్న తైలధారవలె భగవత్సాక్షాత్కారముతో సమానమైన మనోవైశద్యము గలిగిన ధ్యానవిశేషము గలిగి వర్ణాశ్రమ

---

* భా.త. - 20-10

Dr K Dayanandaswamy ebooks



ధర్మానుసారమైన కర్మములు చేయుచు, జ్ఞాన వికాసమునకు కారణమైన సత్త్వగుణమును పోషించుకొనుచు శాస్త్రములయందు జెప్పిన ప్రకారము భగవదుపాసనము చేయుటయే భక్తి.

ప్రపత్తి : ప్రపత్తికి దేశ కాలనియమము లవసరము లేదు. పైన చెప్పిన దేదియును గాదు. ఇందు వర్ణాశ్రమ ధర్మముల ననుష్ఠింపవలసిన నియమము లేదు. ప్రపన్ను డర్చావతారము లుండునట్టి దివ్య ప్రదేశములకు పోయి (అనగా తిరుమల, శ్రీరంగము, కంచి మొదలగునవి) అచ్చట స్వామిని దర్శించి యంజలి ఘటించి, హృదయ పూర్వకముగ శిరస్సు వంచి నమస్కరించి, వాక్కుతో 'నేను నీ వాడను, నిన్ను శరణుపొందు చున్నాను' అని యనిన చాలును. ఒక వేళ ప్రపన్నుడట్టి దివ్యదేశములకు పోలేని వాడైనచో నింటియందే శరణాగతి చేయవచ్చును. అంజలి ఘటించుటకు శక్తిలేని వాడైనచో మనస్సుతోను, వాక్కుతోను శరణాగతి చెప్పిన చాలును. వాక్కుతో చెప్పుటకును నసమర్థుడైనచో మనస్సు నందు స్మరించిన చాలును. మంత్రమువలె పలుమారు జపింపవలసిన పనిలేదు. దాని అర్థమును మననము చేయనక్కర లేదు. జీవితమునం దొక్కసారియే "శరణు"అన్న చాలును.

(2) భక్తి: సాధ్యోపాయము. సాధ్యోపాయమనగా: స్వధర్మము, జ్ఞానము, వైరాగ్యము, భగవంతునియందు నిరంతరము ప్రీతి - యివియన్నియు తోడ్పడగా భగవంతుని సాధించుటకు భక్తి సాధన మైనందున అది సాధ్యోపాయము.

ప్రపత్తి సిద్ధోపాయము : ఉపాయమనుట నామమాత్రమే. (ఉపచారమాత్రమే). ప్రపత్తియం దుపాయము, ఉపేయము రెండును భగవంతుడే. ఆ కారణమున నిది సిద్ధోపాయము. ఇందు వైరాగ్య మవసరము లేదు. ఎట్టి సహాయము గాని యవసరము లేదు.

(3) భక్తికి : ఫలము దేహపతనానంతరమున కలుగును. ప్రపత్తికి దేహపతనానంతరమునగాని, జీవించి యుండగనేగాని ఫలము కలుగవచ్చును.

Dr K Dayanandaswamy ebooks



(4) భక్తికి : అంతరాయములగు పాపములు నశించుటకు అనగా: భక్తి కుదురుటకు యజ్ఞ యాగాదులు చేయుటావశ్యకము.

ప్రపత్తి కెట్టి యంతరాయములను లేవు. ప్రపత్తి కుదురుట కెట్టి సాధనలును చేయనక్కరలేదు.

(5) భక్తుడు మరణించిన తరువాత ప్రారబ్ధ పుణ్యశేష ముండిన యెడల తిరిగి జన్మింపవచ్చును. భక్తుడు ప్రారబ్ధ మనుభవించియే తీరవలయును. ప్రపన్నునకు పునర్జన్మ లేదు. ఇతని కిష్టములేని ప్రారబ్ధ మనుభవింపవలసిన పనిలేదు. భగవంతుడు క్షమించును.

(6) భక్తికి : అంతిమస్మరణ ముండవలెను. అనగా భక్తుడు దేహము వదలుకాలమున భగవంతుని స్మరించుట నియతము. ప్రపత్తికి అట్టిది లేదు.

(7) భక్తునకు భగవంతునియందు జీవితకాల మంతయు నిరంతర స్మరణ ముండిన అంతిమ స్మరణమును బ్రహ్మరంధ్రముద్వారమున ప్రాణోత్క్రమణమును కలిగి అర్చిరాది మార్గమున వైకుంఠమున కేగును.

ప్రపత్తికి అట్లు కాదు. "సకృదేవ హి శాస్త్రార్థః కృతోఽయం తారయే న్నరమ్" ఒకసారి శరణు అన్న చాలును. నరుడు తరించును.

(8) భక్తుడు భగవంతుని నేదైన కోరవచ్చును. ప్రపన్నుడెట్టి కోరికలు కోరరాదు. కోరినచో ప్రపత్తి చెడును. ఏ కోరిక కోరినను దానిని మాత్రమే భగవంతు డొసగును. తక్కినవేటిని నొసంగడు. కారణమేమన: ప్రపన్ను డాకోరిక యను త్రాటిచే భగవంతుని బంధించి నట్లగును. ప్రపన్ను డేకోర్కెయు కోరకున్నను భగవంతుడు ప్రపన్నునకును, వాని వానికి కావలసిన వన్నియు నిచ్చును. దీనినే భరన్యాస మందురు.

(9) భక్తికి ఆచారము, విధి పాటింపవలెను. ప్రపత్తి కట్టి దేదియును లేదు. ద్రౌపది చెఱగుమాసియున్న కాలమున శరణాగతి చేసినను ఫలించినది.

Dr K Dayanandaswamy ebooks



(10) భక్తులు సత్త్వగుణము గలవారు. ప్రపన్నులు శుద్ధసత్త్వ ప్రధానులు. ఇట్టి భేదములు మఱికొన్ని గలవు.

## (16) దోషభోగ్యము

జి : అట్లయినచో ప్రపన్నులు ఏమియును చేయనక్కరలేదా? తిరుమంత్రము, ద్వయము ఎవరికొఱకు చెప్పబడినవి?

వే : ఏ చింతయు లేనపుడు దుశ్చింతలు కలుగుట కవకాశ మున్నది. కనుక కాలక్షేపము కొఱకు తిరుమంత్రమును, ద్వయమును అనుసంధించుకొనవలెనని లోకాచార్యులవారు చెప్పిరి.

జి : ఒకవేళ ప్రపన్నుడు తప్పు చేయడని విశ్వాసము, విషయాంత రాసక్తుడైన ప్రపన్నుని గుఱించి శ్రీ ఎఱుంజిఅప్పా (దేవరాజు) అనువారు 'విలక్షణ మోక్షాధికారి నిర్ణయమ'ను గ్రంథమున "ఈతండు పూర్వము వలెనో సంస్కార వశంబున రాజుభార్య నీచుని వరించునట్లు విషయాంతరముల ప్రేమించు నట్టివాడై తుదకు భగవంతుని విగ్రహామునకు పాత్రుడగును. వాని రక్షించుటకు ఎవ్వరికిని సాధ్యము కాదు. తుదకు పిరాట్టికి సహితము సాధ్యము కాదు" అని చెప్పిరి.

ఒకసారి నీవాడనని శరణాగతి పొందిన పిమ్మట ప్రపన్నుడు తప్పుచేయకుండ జాగ్రత్తగా చూచుకొనుట భగవంతుని విధి. ఒకవేళ ప్రపన్నుడు పాపము చేసినను దానిని క్షమించి చక్కదిద్దుకొనును. అనంతకోటి జన్మలయందు చేసిన మాత్రముననే నశింపజేసిన భగవంతుడు తరువాత చేసిన పాపమును నశింపజేయడేని అప్పు డీప్రపత్తి నిరుపయోగ మనవచ్చును. అప్పుడు ప్రపన్నునకు గతియేది? క్రైస్తవులు చెప్పెడి నిత్య నరకమునకు పోవునా యేమి? కనుక ఎఱుంజి అప్పాగారి యభిప్రాయము విమర్శింప దగియున్నది.

లోకమునందు పుట్టిన మానవులు జీవితమునందు తెలిసియో, తెలియకయో యొకసారి యైనను తప్పుచేయని వారుండరు. ధర్మము మానవాకృతి ధరించెనని చెప్పదగిన యుధిష్ఠిరు నంతటివాడు ద్యూతప్రియు

Dr K Dayanandaswamy ebooks


డగుటయే దీనికి దృష్టాంతము. **'న కశ్చిన్నాపరాధ్యతి'** - అపరాధపడనివా డెవ్వడున్నాడు? అను వాల్మీకిమహర్షి వచనము ముముక్షుప్పడి వ్యాఖ్యయం దుదాహరించియే యున్నారు. ప్రపన్నుడు శరణాగతుడైన క్షణమునందే వాని యాగామి సంచిత పుణ్యపాపము లన్నియు నశించినను ప్రారబ్ధకర్మ నశింపలేదు కదా? ప్రారబ్ధసంబంధమగు సంస్కారములు బలీయము లగుటచే వాటిపని యవి చేయుచునే యుండును. అందువలన మానవు డొకప్పుడు తప్పు చేయవచ్చును. ఎంతటి మహాత్ములో కాలుజారియున్నారు. ఈ విషయమై వేదాంత దేశికులవారి యభిప్రాయమిది:

"ప్రపన్నునికిని ప్రారబ్ధకర్మ భేదంబులను మూలముగ బుద్ధిపూర్వకముగ అపరాధము తటస్థించి నట్లయిన పశ్చాత్తాపపడి క్షమాపణ గోరుకొన వలయును" (ర.సా. 25).

ఈ విషయమై లోకాచార్యులవా రేమి చెప్పిరో చూడుడు: "ఇక నీ చేతిలో నిన్ను ఒప్పగింపను. నా యొడలి మురికిని నేను పోగొట్టుకొననా" (ము.ము. 3-81) పాపములను నేను సహించి వాటిని పుణ్యములనుగా గొనుచుండ, ఇక నీవు దుఃఖపడవలసిన దేమున్నది? (ము.ము. 3-86) ముముక్షుప్పడి 2-42 వ చూర్ణిక వ్యాఖ్యయందు **"ప్రాయశ్చిత్తిరియం సాత్ర యః పునః శరణం వ్రజేత్"** (మరల శరణాగతి జేయుటయే యట్టి విషయమున ప్రాయశ్చిత్తము) అన్నట్లు ప్రపత్తితప్ప దానికి వేఱొక్క పరిహారము లేకపోవుటంజేసియును, ప్రపత్తి యొకతూరిమాత్రము చేయవలసిన దగుటంజేసి మరల చేయదగినది కాకపోవుటం జేసియును, ముందొనర్చి యున్నట్టి ప్రపత్తిని అనుసంధించుకొనుటకుగాను అనువర్తించును" అని వ్రాసియున్నారు. అట్లు తిరిగి ప్రపత్తిని అనుసంధించుకొనుటవలన పూర్వమువలెనే భగవంతుడు ప్రపన్నుని సర్వపాపములు క్షమించునని భావింపవలయును. అప్పాగా రన్నట్లు తప్పుచేసిన ప్రపన్నుని భగవంతుడు తననిగ్రహమునకు పాత్రునిగా చేసి తిరిగి యెప్పటికి ననుగ్రహింపడేని దేవుడు నిర్దయుడని, శరణాగతి వ్యర్థమగునని ఊహింపనగును. గీతయందలి ఈ క్రింది శ్లోకము లిచట స్మరింపదగును:

Dr K Dayanandaswamy ebooks


శ్లో॥ అపిచే త్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్య స్సమ్యగ్వ్యవసితో హి సః ॥ (గీ. 9-30)

శ్లో॥ క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌంతేయ! ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥ (గీ. 9-31)

తా॥ మిక్కిలి దూరాచారుడైన ఇతర దేవతలను భజించక నన్నొక్కనినే సేవించుచున్నవా డాయెనేని యట్టివాడు సదాచారము కలవాడేయని తెలిసికొనవలయును. ఏలయనగా: నన్నే శరణుపొంది యాత్మతత్త్వ మెఱింగిన నాభక్తుడు కనుక (అతడు దురాచారుడు కాడని తాత్పర్యము). అట్టి పురుషుడు దురాచారుడై యుండినను శీఘ్రముగా ధర్మమునందు మనస్సు కలవా డగుచున్నాడు. శాశ్వతమైన ఉపశమనమును పొందుచున్నాడు. ఓ అర్జునా! నా భక్తుడు నశింపడని తెలిసికొనుము.

దురాచారుడైనను ధర్మము లన్నింటికంటెను పరమ ధర్మమగు నీశ్వరునియందు చిత్తము గలవాడును, ఈశ్వరుని శరణు పొందినవాడును నగు భక్తుడు తప్పుచేసినను భగవంతు డాతనిని విడువడు. ఏలయన: భక్తుడు భగవంతునియందే మనస్సు గలవాడగుటవలన ఈశ్వరాధీనుడై యున్నాడు. అతడేమి చేసినను భగవత్ప్రేరణచేతనే చేయుచుండెను గనుక దురాచారుడు కాడు. ఆళ్వారులలో నొకరుగా పూజింపబడుచుండు విప్రనారాయణులవారు గొప్ప భగవద్భక్తులు. వారు దేవదేవియను వేశ్యతగులాటములో దురాచారులైరి. దేవదేవి పూర్వపుణ్యావశమున దేవుడే యామె కట్టిభక్తుని సాంగత్యము లభింప జేసెనేమో?

తిరుమంగైయాళ్వార్లు దారులుకొట్టి పరధనమును దోచుకొనెను. అది దురాచారమే అయినను ఆ ధనమును స్వార్థమున కుపయోగించుకొనక భక్తులకు భగవంతుని కైంకర్యమునకు వినియోగించెను. ఆయన ఆళ్వార్లలో నొకరుగా పూజింపబడుచుండలేదా? ఇచ్చట భక్తుడు ప్రపన్నుడను భేదము లేదు. ప్రపన్నుని దోషములతోనే భగవంతుడు స్వీకరించునని తెంగలవారును, దోషములు పోగొట్టి పరిశుద్ధుడైన పిమ్మట స్వీకరించునని వడగల వారును ఈ విషయమున భేదాభిప్రాయము కలవారై యున్నారు.

Dr K Dayanandaswamy ebooks



## (17) పరభక్తి - పరజ్ఞానము - పరమభక్తి

జి : అయ్యా! పరభక్తి, పరమభక్తియని చెప్పుదురుగదా? ఆ రెండింటికిగల భేదమేమి?

వే : విశిష్టాద్వైతము ననుసరించి పరభక్తిని భక్తియొక్క యారంభదశగాను, పరమభక్తిని ఆరూఢదశగాను భావింపవచ్చును. విశిష్టాద్వైతు లిట్లు చెప్పుదురు:-

శ్లో॥ దర్శనం పరభక్తిస్స్యాత్ పరజ్ఞానం తు సంగమమ్ ।
పునర్విశ్లేష భీరుత్వం పరమా భక్తి రుచ్యతే ॥

తా॥ (1) దర్శనము పరభక్తి యనబడును. అనగా : ఆత్మ సాక్షాత్కారము - కన్నులయెదుట కనబడినంత స్పష్టముగా ధ్యాన సమయమున ఆత్మ గోచరించెనేని అట్టి ధ్యానమును పరభక్తి యందురు.

(2) **పరజ్ఞానము** : పైన చెప్పబడిన పరభక్తిచేత ఆత్మ గోచరించిన పిమ్మట భగవంతుని సాక్షాత్కారము చేసికొందునని పట్టుదలతో కించిత్కాలము భగవంతుని సాక్షాత్కారము పొందుట.

(3) **పరమభక్తి** : అట్లు భగవత్ సాక్షాత్కారమైన పిమ్మట అట్లే యెడతెగక యుండవలయునను పట్టుదలతో అట్లు సాక్షాత్కరించిన బ్రహ్మమునందు భక్తునకు నిరతిశయమును, విపులమును నగు ప్రీతి కలుగును. అట్టి విశేష ప్రీతికి పరమభక్తియని పేరు. ఇంకొక విధముగాకూడ చెప్పుదురు. ఎట్లనగా:- "భగవంతునితో చేరి యుండుటయే సుఖముగాను, వానిని విడనాడి యుండుటయే దుఃఖముగాను తలంచి యుండుట యనెడి పరభక్తి జ్ఞానావస్థగాను-భగవద్రూప గుణవిభూతులను విశదముగా సాక్షాత్కరించునట్టి పరజ్ఞానము దర్శనావస్థగాను - అట్లు సాక్షాత్కరించునట్టి వస్తువును వెంటనే పొంది యనుభవింపక పోయినట్లయిన, అప్పుడే ప్రాణములు విడనాడునట్లు చేయునట్టి పరమభక్తి ప్రాప్త్యవస్థగాను చెప్పబడినది" (ఆచార్యహృదయము 4-15). ఇవి దర్శన జ్ఞాన ప్రాప్త్యవస్థలు

Dr K Dayanandaswamy ebooks



## (18) భక్తుడు - అష్టవిధభక్తి లక్షణములు

భక్తియొక్క లక్షణములు ఎనిమిది విధములని చెప్పుదురు. దానిని గుఱించి చెప్పెదను. భక్తునియొక్క వర్ణాశ్రమములను గుఱించి పట్టింపు పెట్టుకొనరాదు. ఎందుకనగా: అతడు జ్ఞాననిష్ఠులు చెప్పునట్టి అతివర్ణాశ్రమములలో చేరును.

శ్లో॥ "అత్యంత భక్తియుక్తానాం న చ శాస్త్రం న చ క్రమః ।
నిస్త్రైగుణ్యే పథి విహరతాం కో విధిః కో నిషేధః ॥"

తా॥ సత్త్వాదిగుణముల కతీతమైన మార్గమునందు నడుచు నటువంటి అత్యంత పరమభక్తియుక్తునకు విధినిషేధములు రెండును లేవు. ఈ విధముగా నడచుకొనవలెనని శాస్త్రముగాని, క్రమముగాని లేదు. అతడు హీనకులజుడైనను అతనిని హీనకులజునిగా చూడరాదు.

శ్లో॥ "యశ్శూద్రం భగవద్భక్తం నిషాదం శ్వపచం తథా ।
వీక్షతే జాతి సామాన్యా త్స యాతి నరకం నరః ॥"

తా॥ భగవద్భక్తుడు శూద్రుడైనను, శ్వపచుడైనను, నిషాదుడైనను అతనిని జాతి సామాన్య దృష్టితో చూచిన వారు నరకమునకు బోవుదురు.

భాగవతుల కుల మిట్టిదని వారిని తక్కువపరుపరాదని తెంగలవారి మతము. (శ్రీ.భూ. 189నుండి)

శ్లో॥ అర్చావతారోపాదాన వైష్ణవోత్పత్తి చిన్తనమ్।
మాతృయోని పరీక్షాయాస్తుల్యమాహు ర్మనీషిణః॥"

అర్చావతారము (విగ్రహము) ఏ ద్రవ్యముచేత నిర్మింపబడినదను విమర్శయును, భాగవతుడు ఏ కులమున బుట్టినాడను విచారమును, మాతృయోని పరీక్షణమునకు సమమని పెద్దలు చెప్పిరి. ఈ శాస్త్రవాక్యమును లోకాచార్యులవా రుదాహరించిరి. (శ్రీ.భూ. 197) ఒక వేళ పైవిధముగా విమర్శించి అపచార పడినట్లయితే అట్టి వానికి కర్మచండాలత్వము వచ్చుననిరి. (శ్రీ.భూ. 198).

Dr K Dayanandaswamy ebooks



శ్లో॥ "న శూద్రా భగవద్భక్తా విప్రాః భాగవతాః స్మృతాః ।
సర్వవర్ణేషు తే శూద్రా యేహ్యభక్తా జనార్దనే ॥" (ప్ర.ప. 84-13)

తా॥ జన్మమువలన శూద్రులైనను భగవద్భక్తులైన వారు శూద్రులు కారు. వారు విప్రులు. భాగవతోత్తములు. భగవద్భక్తి లేనివారు ఏ వర్ణమునకు చెందినవారైనను శూద్రులుగనే లెక్కింపబడుదురు.

ఇత్యాది వాక్యములయందున్న "విప్రత్వాదికము అర్థవాద మగునేగాని అపకృష్టజన్మలో పుట్టినవాడు ఆశరీరమునందే ఉత్కృష్టుడు కాగలడా? యని కొందఱు శంకింతురు." ఇట్లు తలంచు వారికిది అర్థవాదము కాదని లోకాచార్యులవారు సమాధాన మిచ్చియున్నారు. (శ్రీ. భూ. 227 నుండి 233 చూర్ణికలు) భాగవతోత్తములు హీనకులమున పుట్టినవారైనను అట్టి వారిని పూజింపవచ్చునుగాని వారి తీర్థప్రసాదములు పుచ్చుకొనరాదని ఎరుంజిఅప్పా (దేవరాజు) గారును మఱికొందఱును చెప్పిరి. ఇది సరియైనది కాదు. వారికి అభిజాత్యమను జిడ్డు వదలకుండుటవలన అట్లు చెప్పిరి కాని, పూజ్యుడైన వానిచేతి తీర్థప్రసాదములు పవిత్రములే. ఈ విషయమై ఈ క్రింది విషయములను గమనింపుడు:

శ్లో॥ "మద్భక్త జనవాత్సల్యం పూజాయాం చానుమోదనమ్ ।
తత్కథా శ్రవణే భక్తిః స్వరనేత్రాంగ విక్రియా ॥
స్వయమారాధనే యత్నో మదర్థే దంభవర్జనమ్ ।
మమానుస్మరణం నిత్యం యచ్చ మాం నోపజీవతి ॥
భక్తిరష్ట విధాహ్యేషా యస్మిన్ మ్లేచ్ఛేఽపి వర్తతే ।
స విప్రేంద్రో మునిశ్శ్రీమాన్ స యతి స్స చ పండితః ॥
తస్మైదేయం తతో గ్రాహ్యం స చ పూజ్యో యథాహ్యాహమ్"।

తా॥ (1) నా భక్తులయందు ప్రేమయును (2) నన్ను పూజించుట యందు సంతోషమును (3) నా కథలు వినుటయం దనురక్తియును (4)నాకీర్తనలు పాడుటయందును, నన్ను గుఱించి చెప్పుటయందును డగ్గుత్తిక, దేహమునందు గగుర్పాటు, కన్నులయం దానందబాష్పము

Dr K Dayanandaswamy ebooks



లుండుటయను లక్షణములు కలుగుట (5) తానై నన్నారాధించుటకు యత్నించుట (6) నా విషయమున డంబము లేకుండుట (7) ఎల్లప్పుడు నన్ను స్మరించుకొనుట (8) అట్టి స్మరణము లేకున్న క్షణకాలమైనను జీవింపలేకుండుట - అను నీ యెనిమిది విధములగు భక్తి మ్లేచ్ఛుని యందున్నను అతడే బ్రాహ్మణ శ్రేష్ఠుడు, అతడే జ్ఞాని. అతనికి దాన మివ్వవచ్చును, అతనిచే దానము గ్రహింపవచ్చును. నావలె అతడును పూజ్యుడు అని భగవద్వాక్యములు. (ర.సా.16)

మఱియు ఆచార్యహృదయమునం దిట్లు గలదు :

మూ॥85॥ "చండాలు డైనప్పటికిని నాయెడల భక్తి గలవాడయి నట్లయిన, నాల్గువేదములను జదివినవారు ఆశ్రయించి, జ్ఞానమునిచ్చి కులదైవముతో సమానముగ పూజించి, పవిత్రములగు తీర్థప్రసాదములు గలవాడ నగునని తెలుపునట్టి భగవత్సూక్తిని ఆళ్వారుల పాశురమునున్ను.... తిరుమలై యందును, కంచియందును, శ్రీరంగమునందును క్రమముగ-పుష్పమాలికలను, చామరమునున్ను, వీణనున్ను చేతిలో నుంచుకొని కైంకర్యము చేయునట్టి యంతరంగులగు వారిని అనగా: కుఱుమ్బుఱుత్త నంబిని, తిరుక్కచ్చినంబిని, తిరుప్పాణి యాళ్వారులను క్రమముగ తొండమాన్ చక్రవర్తియును, శ్రీరామానుజులవారును, లోకసారంగ మహామునియును ఆశ్రయించిన విధమును తిరువారాధన సమయమునను, ప్రసాదస్వీకార సమయమునను, ఉత్తరవీథి యందును క్రమముగ కాయశుద్ధిని, అన్నశుద్ధిని, స్థలశుద్ధిని చేసికొనిన జ్ఞానవృద్ధులయొక్క యనుష్ఠానము నెఱింగియున్న వారికి కదా జన్మముయొక్క హెచ్చుతక్కువలు తెలియును."

తరువాత చూర్ణికయందు వర్ణాశ్రమ విద్యాదులు అజ్ఞానులను భరించునని చెప్పియున్నారు. లోకాచార్యులవారు తమ శ్రీవచనభూషణము నందు 234వ చూర్ణిక మొదలు 239వ చూర్ణికలవఱకు అభిజాత్యమును నిరసించియున్నారు. 234వ చూర్ణికలో మాఱనేరినంబి విషయము స్మరింపబడినది.

Dr K Dayanandaswamy ebooks



మాఱనేరినంబి వృత్తాంత మేమనగా:- ఆళవందారుగారి శిష్యులలో మాఱనేరినంబిగా రొకరు. వీరు కులమున హరిజనులు. కావేరీ నదీతీరమున శ్రీరంగపట్టణమునకు సమీపమున గుడిసె వేసికొని నివసించుచుండెడి వారు. వారికి రాచపుండు లేచినది. దానితో వారు బాధపడుచుండిరి. పెరియనంబిగారు తెచ్చియిచ్చిన రంగనాథస్వామి నివేదితాన్నమును భుజించుచు కాలము గడిపిరి. ఆ పుండు బలమై మాఱనేరనంబిగారు పరాధీనులు కాగా పెరియనంబిగారు ప్రతిదినము అర్ధరాత్రమున వచ్చి ఆ పుండు కడిగి కట్టుగట్టి అతనికి సమస్తోపచారములు చేసి పోవుచుండెడివారు. తుదకు శ్రీ మాఱనేరినంబి పరమపదమున కేగగా పెరియనంబిగారు వారికి ఉత్తరక్రియలు జరిపిరి. రామానుజులవారి కిది తెలిసి పెరియనంబిగారితో "స్వామీ! ఇతడు పంచమకులము వాడాయెనే. ఇతనిని అంటవచ్చునా? రంగనాథస్వామివారి ప్రసాదమును ఇవ్వవచ్చునా? అదిగాక సమస్తోపచారములు చేయవచ్చునా? ఇట్లు శాస్త్రమర్యాదల నుల్లంఘించి దేవరవారే చేయవలయునా? కూలిపెట్టి అన్యహస్తముచేత చేయించరాదా?" అని యడిగిరట. అందుకు పెరియనంబిగారు "కూలిపెట్టి సంధ్యావందనము చేయించవచ్చునా? నేను శ్రీరాముని కంటె శ్రేష్ఠుడనా? మాఱనేరినంబిగారు జటాయువుకంటె నికృష్టులా? *1."**పయిలుమ్‌శుడరొళి**" 2. "**నెడుమాఱ్కడిమై**"అను పాశురములు సముద్రఘోషమా? ఆళ్వార్లు అనుసంధించిన అర్థమును కించిత్తైనను అనుష్ఠించవద్దా?"అని సమాధాన మిచ్చిరట.

---

* ఈ పాశురములు రెండును తిరువాయిమొ(ఝ)ళి యందలివి.

1. "**పయిలుమ్ శుడరొళిమూర్త్తియై**"యను పాశరము తాత్పర్యమేమన: "తేజోమయమైన దివ్య విగ్రహముగల క్షీరాబ్ధిశాయి యైన కమలాక్షునికి దాసులైన భాగవత శ్రేష్ఠులు జాత్యాదులలో నెంత తక్కువ వారైనను వారే మనకు సమస్త జన్మములయందును పరమప్రాప్యులు" (తిరు. 3-7-1).

2. "**నెడు మాఱ్కడిమై**" అను పాశురము యొక్క తాత్పర్యమేమన :"సర్వేశ్వరునికి భక్తునివలె నేను నటించినప్పుడే నాయొక్క సకల దోషములును నశించినవి గాన నట్టి భగవంతునికి భక్తులైన శ్రీవైష్ణవుల శ్రీపాదములను వదలి త్రిలోకైశ్వర్యమునుగూడ నేనాశించను" (తిరు. 3-10-1).

Dr K Dayanandaswamy ebooks



## (19) షడ్విధ శరణాగతి లక్షణములు

జి : ఈ ప్రపత్తి వేదసమ్మతమేనా? ఇది ఇతర గ్రంథములయం దెచ్చటనైన జెప్పబడినదా?

వే : వేదములయందు ప్రపత్తి బీజములు కలవని చెప్పుదురు. ప్రాచీనోపనిషత్తులగు దశోపనిషత్తులయందు కనబడదు. శ్వేతాశ్వతరోప నిషత్తునందు "**ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే**" (శ్వే.అ. 6-మం. 18) అని యున్నది. వేదతుల్యమని చెప్పబడు శ్రీమద్రామాయణమందు ప్రపత్తిని గుఱించి చెప్పియున్నారు. శ్రీమద్రామాయణమే ఒక దీర్ఘశరణాగతి యని యందురు. శరణాగతి ఆ అంగములు గలది. అవి యేవన :

శ్లో॥ **ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్ ।**
**రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వవరణం తథా ॥**
**ఆత్మనిక్షేప కార్పణ్యే షడ్విధా శరణాగతిః ।**

తా॥ (1) ఆనుకూల్య సంకల్పము (2) ప్రాతికూల్యవర్జనము (3) రక్షించునను విశ్వాసము (4) గోప్తృత్వవరణము (5) ఆత్మనిక్షేపము (6) కార్పణ్యము- ఈ యాఱును శరణాగతి లక్షణములు (అంగములు). ఈ యాఱంగములును విభీషణుని శరణాగతియం దున్నట్లు చెప్పుదురు. శ్రీమద్రామాయణ యుద్ధకాండమున 17, 18వ సర్గలయం దీ విషయము గలదు. అందు విభీషణుని వాక్యములివి :

శ్లో॥ **రావణో నామ దుర్వృత్తో రాక్షసో రాక్షసేశ్వరః ।**
**తస్యాహ మనుజో భ్రాతా విభీషణ ఇతి శ్రుతః ॥**
(శ్రీమద్రామా 6-17-10)

అను శ్లోకమునుండి 14వ శ్లోకము వఱకు గల శ్లోకములయందు విభీషణ శరణాగతి చెప్పబడినది.

విభీషణునకును ప్రపత్తినిష్ఠునకు శరణాగతియొక్క యాఱంగము లెట్లన్వయించునో వివరించెదను:-

Dr K Dayanandaswamy ebooks



(1) **ఆనుకూల్య సంకల్పము** : ప్రపన్నుని విషయమున సర్వ భూతములయొక్క హితము కోరుట. భక్తులు ప్రపన్నులునగు వారి స్నేహము, వారి మేలు కోరుట అనునవి. విభీషణుని విషయమున:- సీతను రాముని కిమ్మని చెప్పుట.

(2) **ప్రాతికూల్య వర్జనము** : ప్రపన్నుని విషయమున భగవంతుని శరణు పొందుటకంటె అన్యమైన ప్రయత్నములను వదలుట.

విభీషణుని విషయమున :

శ్లో॥ **తేన సీతా జనస్థానాద్ధృతా హత్వా జటాయుషమ్ ।**
**రుద్ధా చ వివశా దీనా రాక్షసీభి స్సురక్షితా. ॥** (6-17-11)

శ్లో॥ **తమహం హేతుభిర్వాక్యై ర్వివిధైశ్చ న్యదర్శయమ్ ।**
**సాధు నిర్యాత్యతాం సీతా రామాయేతి పునఃపునః ॥** (6-17-12)

శ్లో॥ **స చ న ప్రతిజగ్రాహ రావణః కాలచోదితః ।**
**ఉచ్యమానం హితం వాక్యం విపరీత ఇవౌషధమ్ ॥** (6-17-13)

తా॥ జనస్థానమునం దుండగా రావణుడు సీతాదేవి నపహరించెను. జటాయువును సంహరించెను. దుఃఖితురాలును, వివశురాలును, దీనురాలును నగు సీతాదేవికి రాక్షసస్త్రీలను కాపుంచెను. రామునకు సీతాదేవి నర్పింపుమని సామమున హేతుయుక్తములగు, అనేకవిధములగు హితవాక్యములు చెప్పితిని. అవి రావణునియందు నిరర్థకము లయ్యెను. మరణ మాసన్నమైన వానికి మంచి యౌషధము ఇముడనియట్లు కాలచోదితుండగు రావణునకు నా వాక్యము రుచింపలేదు. ఇత్యాది వాక్యములచేత ఆనుకూల్య సంకల్పము ప్రాతికూల్య వర్జనము కలిగినది.

(3) రక్షించునను దృఢమైన విశ్వాసము : ప్రపన్నుని విషయమున: భగవంతుడు నన్ను రక్షించునో, రక్షింపడో అను సంశయ ముండకూడదు. సంపూర్ణమైన నమ్మక ముండవలెను. విభీషణుని విషయమున : విభీషణుడు, రాముడు తనను రక్షించునో, రక్షింపడో యను సంశయముగాని ముందుగ విచారించి రాయబారము పంపి తెలిసికొనవలెననిగాని సంశయింపక తప్పక రక్షించునను దృఢవిశ్వాసముతో లంకను, భార్యాపుత్రాదులను విడిచి

Dr K Dayanandaswamy ebooks



శ్రీరాముని శరణు వేడెను.

(4) గోప్తృత్వవరణ మనగా : ప్రపన్నుని విషయమున నీవు నాకు రక్షకుడవను అభిప్రాయము తెలుపుట.

విభీషణుని విషయమున :

**శ్లో|| సర్వలోక శరణ్యాయ రాఘవాయ మహాత్మనే ।**
**నివేదయత మాం క్షిప్రం విభీషణ ముపస్థితమ్ ॥**

(శ్రీమద్రామా. 6-17-15)

సర్వలోక శరణ్యుండును, మహాత్ముండును నగు రామునకు నా స్థితి తెలుపు డనుటచే గోప్తృత్వ వరణము.

(5) ఆత్మనిక్షేపము : ప్రపన్నుని విషయమున : ఆత్మ నిక్షేపమనగా: తాను తనకు గల చేతనాచేతనాత్మకములగు సమస్తమును నీకు (భగవంతునకు) చెందినవే అను నిశ్చయము కలిగి అది మొదలు తనకు గల సర్వమునందును తనకు స్వామిత్వము లేదను భావము.

విభీషణుని విషయమున :

శ్లో|| **"భగవద్గతం మే రాజ్యం చ జీవితం చ సుఖాని చ"** అని (శ్రీమద్రామా. 6-19-16) నా రాజ్యము, జీవితము, సుఖము సమస్తము నీ యధీనము.

(6) కార్పణ్యము అనగా : దైన్యము : ఇది ప్రపన్నుని విషయమున దీనభావము. నేను దీనుడను. కర్మయోగమునుగాని, జ్ఞాన యోగమునుగాని, భక్తియోగమునుగాని అనుష్ఠించుటకు నసమర్థుడను. నీవే దిక్కని నమ్మికొనియున్నాను. నాకు వేఱొక దిక్కు లేదను నిశ్చయము.

విభీషణుని విషయమున :

**శ్లో|| భవంతం సర్వభూతానాం శరణ్యం శరణాగతః ।**
**పరిత్యక్తా మయా లంకా మిత్రాణి చ ధనాని చ ॥**

Dr K Dayanandaswamy ebooks



(శ్రీమద్రామా. 6-19-5)

తా॥ నీవే సర్వభూతములకు శరణ్యుడవు. నేను లంకను, మిత్రులను, ధనమును పరిత్యజించి వచ్చినవాడను అనగా: ఏమియు లేని దీనుడనని భావము.

ఈ విధముగ షడ్విధ శరణాగతి లక్షణములు తేటపడునట్లు శరణాగతి చేసిన విభీషణునకు అభయప్రదానము చేయవచ్చునా? చేయకూడదా? అని శ్రీరామచంద్రుడు లోకాచారము ననుసరించి సుగ్రీవాదులతో ఆలోచించి వారి వారి యభిప్రాయములను తెలిసికొని తుదకు అభయప్రదానము చేసెను. ఎట్లనగా:-

## (20) రెండవ చరమశ్లోకము

**శ్లో॥ సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥***

(శ్రీమద్రామా. 6-18-33,34)

తా॥ ఒక్కసారి మాత్రమే శరణు జొచ్చినవాడై 'నేను నీవాడను' అని యాచించినట్లయిన స్థావరజంగమ రూపములైన సమస్తభూతముల వలనను, భయము లేమిని (అభయమును) ఇచ్చుచున్నాను. (ప్రపన్నుని విషయమున: ప్రపన్నునకును, అతనితో లేశమాత్రమైనను సంబంధము గల స్థావరజంగమ రూపములైన సమస్త భూతములకును అభయము నిచ్చుచున్నాను అని వేఱొక యర్థము.)

ఈ విధముగా అభయప్రదానము చేయుట యనునది నాకు వ్రతము. (వ్రతమనుటవలన వ్రతమును చేయుటకు సంకల్పించిన వారు నియతముగా జీవితపర్యంతము చేయుచుండవలెను. కొంతకాలము చేసి నిలుపకూడదు.)

---

* **శ్లో॥ ఆనయైనం హరిశ్రేష్ఠ దత్తమస్యాభయం మమ.** (శ్రీమద్రామా. 6-18-34)
**విభీషణో వా సుగ్రీవ యది వా రావణ స్స్వయమ్.** (శ్రీమద్రామా. 6-18-35)
సుగ్రీవా! అతడు విభీషణుడేకాక, రావణుడే స్వయముగా వచ్చి యుండనీ శరణుజొచ్చితి నన్నప్పుడే అభయ మిచ్చితిని, తోడ్కొని రమ్ము అని తాత్పర్యము.

Dr K Dayanandaswamy ebooks



పైన చెప్పిన 'సకృదేవ ప్రపన్నాయ' అను (శ్లోకము) శ్రీరామ వాక్యమును సయితము (గీత యందు 18-66. శ్లోకమును చరమశ్లోకమని చెప్పినట్లు) చరమశ్లోకమని యందురు. ఇది రెండవ చరమశ్లోకము. మొదటి చరమశ్లోకమును చెప్పెదను వినుము.

## (21) మొదటి చరమ శ్లోకములు

శ్రీమన్నారాయణుడైన భగవంతుడు భూదేవికి చెప్పిన వాక్యములు:

**శ్లో॥ స్థితే మనసి సుస్వస్థే శరీరే సతి యో నరః ।**
**ధాతుసామ్యే స్థితే స్మర్తా విశ్వరూపం చ మా మజమ్ ॥**

**శ్లో॥ తతస్తం మ్రియమాణం తు కాష్ఠపాషాణ సన్నిభమ్ ।**
**అహం స్మరామి మద్భక్తం నయామి పరమాఙ్గతిమ్ ॥***

తా॥ చిత్తము విషయముల వెంట పరుగులెత్తుట మాని నిలుకడగాను, దేహము రోగములచేత బాధింపబడక ఆరోగ్యముగను, వాత పిత్త శ్లేష్మ ధాతువులు విషమస్థితి (ఎక్కువ తక్కువ) లేక సమముగాను నుండునట్టి స్థితియందే మానవుడు; విశ్వరూపుడను, కర్మాధీనమైన జన్మములేని వాడను నగు నన్ను తెలిసికొని స్మరించెనేని అట్టి చేతనుడు సకృత్తుగా స్మరణము చేసియుండినను, అట్టివాడు మృతి జెందుకాలమున కట్టె, ఱాయి వీటితో సమానుడై యుండినను, అనగా :- స్మరించుటకు శక్తిలేనివాడై యచేతనమువలె తెలివి తప్పి పడియుండినను, అట్టివాడు చేయదగినట్టి అంతిమ స్మరణమును నేనే చేయుచున్నాను. అట్టి మద్భక్తం అట్టి నాభక్తుని, పునరావృత్తి రహితమును,

---

* ఈ రెండు శ్లోకములు (చరమశ్లోక త్రయమునకు పెరియ వాచ్చాంబిళ్ళగారు రచియించిన మణిప్రవాళ వ్యాఖ్యానముయొక్క ఆంధ్రాను వాదమునుండి గ్రహించితిని.) - ఇందేది చరమశ్లోకమో అచ్చట చెప్పి యుండలేదు. ఇందొకటి మొదటి శ్లోకమనియు, శ్రీమద్రామాయణము నందలి 'సకృదేవ ప్రపన్నాయ' అన్నశ్లోకము రెండవ చరమశ్లోకమనియు, గీతయందలి "సర్వధర్మాన్ పరిత్యజ్య" అనునది మూడవ చరమశ్లోకమనియు మణిప్రవాళవ్యాఖ్యానమునం దున్నది. ఐనను నేను చరమశ్లోక త్రయమునందు వాటికి గల ప్రసిద్ధినిబట్టి ముందువెనుకలుగ ఈ క్రమమును గైకొంటిని.

Dr K Dayanandaswamy ebooks



సర్వోత్కృష్ట మైనట్టియు, నైన గతిని పొందించుచున్నాను.

పై రెండు శ్లోకములయందలి భావము భక్తున కంతిమస్మరణము లేకపోయినను మోక్షము నొసగుచున్నానని యభయ మివ్వబడినదేగాని, శ్రీమద్రామాయణము, గీతలయందున్న చరమశ్లోకములలోని భావ మిచ్చట లేదు.

జి : శరణాగతికిని ప్రపత్తికిని భేదము లేదు కదా? బలవంతుడును విజేతయునగు శత్రురాజునకు యుద్ధమున నోడిన పరాజితుడగు రాజు శరణు (Surrender) బొందుచున్నాడు. ఆ శరణాగతియును, ప్రపన్నుడు భగవంతుని గూర్చి చేయు ప్రపత్తియు నొక్కటియే యందురా?

వే : శరణాగతి, ప్రపత్తి, నమస్సు, అంజలి - యివన్నియు నొక్కటేయని శాస్త్రములయందున్నది. ఐనను, నీవు చెప్పిన శరణాగతియు ప్రపత్తియు రెండును నొక్కటిగావు. పరాజితుడు తన పగతుని జయించు యుద్ధప్రయత్నములు మానుకొని 'శరణు'ను చున్నాడు. ప్రపన్నుడు మోక్షోపాయముల నన్నిటిని మానుకొని ప్రపత్తిచేయుచున్నాడు. ఈ విషయమున మాత్రమే ఈ రెండింటికిని సామ్యము గలదు. తక్కిన యన్ని విషయములయందు సామ్యము లేదు.

ఇంకొక విషయ మేమన, శ్రీరామచంద్రుడు సముద్రమునకు సేతుబంధము చేయుటకు పూర్వము సముద్రుని శరణుబొందెను. మూడు దినములు దర్భశయనమున నిరాహారుడై శయనించి యుండినను సముద్రుడు ప్రత్యక్షము కానందున శ్రీరామచంద్రుడు కుపితుడై సముద్రునిపై శస్త్రప్రయోగము చేసెను. సముద్రుడు ప్రత్యక్షమై రామున కంజలి ఘటించెను - ప్రపన్నుని విషయమున నట్లుకాదు. రక్షించినను, రక్షింపకున్నను నీవు తప్ప నాకు వేఱొక దిక్కులేదను దృఢభావమున ప్రపన్నుడు శరణు బొందవలయును.

నమస్సు, ప్రపత్తి రెండును నొక్కటియే యైనను ఈ కాలమున నమస్సు (నమస్కార మనునది) సమానులయం దొకరి నొకరు గౌరవించుటకు

Dr K Dayanandaswamy ebooks



లాంఛనప్రాయముగా అంజలి ఘటించు నాచారమై యున్నది. కొన్నియెడల నీ అంజలి పెద్దలయందు పిన్నలు చూపు పూజ్యభావమునకు చిహ్నమై యున్నది. పై యధికారికి క్రిందివారు నమస్కారమని చెప్పుటయు గలదు. ఇట్టివి ముముక్షుజనులు భగవంతునికి నంజలి ఘటించునట్టి ప్రపత్తితో చేరవు.

జి : అయ్యా! రామాయణమే యొక దీర్ఘ శరణాగతి యంటిరే దాని యర్థమేమి?

వే : రామాయణమునందు బాలకాండమొదలు తుదివఱకు నచ్చటచ్చట శరణాగతి చెప్పబడినది. అందువలన రామాయణము దీర్ఘ శరణాగతియని ప్రతీతి.

## (22) విశేషానుగ్రహము

జి : అయ్యా! ప్రపన్నుడు తన ఇష్టములేని ప్రారబ్ధ భోగము ననుభవింపవలసి యుండ దంటిరికదా? ఇది కర్మ సిద్ధాంతమునకు విరుద్ధము కదా?

వే : శ్రీ వైష్ణవ సిద్ధాంతము ననుసరించి, భక్తి యోగమువలన సంచితాగామి కర్మలు నశించినను ప్రారబ్ధ మా జన్మమున పూర్తిగా అనుభవింపవలసి యుండును. అట్లు పూర్తిగా అనుభవింపక కొంత మిగిలి యుండిన యెడల మరల జన్మింప వలసివచ్చును. ఇందు వలన భక్తియోగాదులచే ఆజన్మమే కడపటి జన్మమని చెప్పుటకు వీలులేదు. ప్రపత్తియందీదోషము లేదు. ప్రపన్నునకు ఆ జన్మము నందే సమస్త కర్మలు, ప్రారబ్ధము సహితము పూర్తిగా దగ్ధమగును, అంత మాత్రమే కాదు. జీవిత కాలములో ప్రపన్నునకు ఇష్టములేని, ప్రారబ్ధకర్మమును సహితము భగవంతుడు నశింపజేసి అతని కిష్టమైన ప్రారబ్ధ శేషమును మాత్రమే యనుభవింప జేయును. దేహపతనానంతరము పునర్జన్మరహితమగు మోక్షమును ప్రసాదించును.

Dr K Dayanandaswamy ebooks

ఈ విషయమై వేదాంత దేశికులవారిట్లు వ్రాసిరి :

శ్లో॥ "ఉపాయభక్తిః ప్రారబ్ధ వ్యతిరిక్తాఽఘనాశినీ ।
సాధ్య భక్తిస్తు సా హంత్రీ ప్రారబ్ధస్యాపి భూయసీ ॥

తా॥ "ఉపాయ రూపమగు భక్తి ప్రారబ్ధేతరంబులగు పాపకర్మములను నశింపజేయునది. సాధ్యభక్తి యన్ననో ప్రారబ్ధమును సయితము నశింప జేయునది యగుటచే గొప్పది అని చెప్పియున్నందున ప్రారబ్ధకర్మములను సయితము అణగద్రొక్కి తన ఫలమును ఒసంగునట్టిది యగు ప్రపత్తి నొనర్చి నట్టివారికి తక్కిన విద్యల ననుష్ఠించిన వారికివలెనే సంచితాగామి కర్మంబులును ఈవిద్యకు (ప్రపత్తికి)గల యాధిక్యము వలన ప్రారబ్ధకర్మము నిమిత్తమున గలుగునట్టి యార్తి కవధి భూతమగు క్షణాంతర, దివసాంతర, జన్మాంతరాద్యనువృత్తియును - ఇవి నివర్తింపగలవని 'మాశుచః' అను వాక్యము యొక్క యభిప్రాయము." (ర.సా. 25)

పిళ్ళైలోకాచార్యులవారి తమ్ములగు అకియ మణవాళప్పెరుమాళ్ నాయనార్‌గారు ఈ విషయమై ఆచార్య హృదయము 2 వ ప్రకరణము 20-వ చూర్ణికయం దిట్లు వ్రాసిరి. "పట్టపుఏనుగు రాజును చేయునని తెలిసికొనుట యశక్యము" దీని వ్యాఖ్యయం దిట్లున్నది. "రాజులేని దేశమున పట్టపుటేనుగు కండ్లకు గంతకట్టి వదలినట్లయిన ఆ యేనుగు ఎవనిని తనపై నెక్కించుకొనునో వాడే రాజగునప్పుడు, తక్కినవా రెందరో యుండగా నిట్లు ఈ యేనుగు ఈతని పైనెక్కించుకొనుటకు హేతువెద్ది? యనెడి విషయమును; రాజగువాడు తన యతిశయమువలన నేదో యొక స్త్రీని తనకు భార్యనుగా వరించినప్పుడు తగినట్టివా రెందరో యుండగా ఈతండు ఈ స్త్రీ నేలవరించె? నను విషయమును కనిపెట్టిన వారు లేరు".

ఈశ్వరుడు నిరంకుశ స్వతంత్రుండైనవాడు. "ఇతరులచే కనిపెట్టరాని స్వాతంత్ర్యము గలవాడై "భవ మోక్షణయోః త్వయైవ జన్తుః క్రియతే" అని సాయించినట్లు జీవాత్మల బంధమోక్షముల రెంటిని తన యధీనములో నుంచుకొనినవాడై తన కిష్టము వచ్చినప్పుడు ఇష్టము వచ్చిన దానిని ఇష్టము వచ్చినట్లు చేయుటకు సమర్థుడై నట్టివాడగు సర్వేశ్వరుడు

Dr K Dayanandaswamy ebooks



హేతువెద్దియును లేకున్నను కటాక్షమునకు విషయ మగునట్లు పట్టుపు లేనుగు, రాజును చేయు విధమున తన యధీనములో నుండు నవియును తనకుగా నుండునవియు నగు ఆత్మవస్తువులో నొక్కొక్క దానిని ఈశ్వరత్వాతిశయ మూలకమగు స్వేచ్ఛవలన తన యనుభవమునగు దగినట్లు కటాక్షించి నట్లయిన, తక్కిన యాత్మలన్నియు నుండగా ఈతండు దీనిని మాత్రమేల కటాక్షించె? నను విషయమును కనిపెట్టినవారు లేరనుట."

ఈ విశేషానుగ్రహమునే భగవంతుని నిర్హేతుకకృప అని చెప్పుదురు. భగవంతునికి జీవులయందు నిర్హేతుకకృప కలిగిన యెడల జీవులందఱిని ఏకకాలమునందే బంధవిముక్తులను చేసి పరమపదమునకు గైకొనక కొందఱిని మాత్రము సంసారము నందుంచి కొందఱిని బంధవిముక్తుల జేయుటకు హేతువేమి? యనిన నేదేనియొక అజ్ఞాతసుకృతము కొందఱి యందుండుటచేత అట్టి సుకృతవిశేషమును కలిగిన వారియందు నిర్హేతుక కృప కలుగునని, అట్టి అజ్ఞాత సుకృతమును చేయునట్లు తానే కల్పించి, అట్లు కల్పించిన యాదృచ్ఛిక, ప్రాసంగిక, ఆనుషంగిక సుకృతముల ననేక రెట్లుగా పెంచి పెద్దచేసి, అట్టి అజ్ఞాత సుకృతముద్వారా ఈశ్వరుడంగీకరించి అనుగ్రహించు చున్నాడు" అని సమాధానము చెప్పిరి.

అజ్ఞాత సుకృతమునకు ఈ క్రింది దృష్టాంతము చెప్పబడినది. ఏమనగా: ఒక భగవత్సన్నిధియందు కైంకర్యము చేయుచుండగ కార్తీకమాసమున నా సన్నిధిని వెలిగించిన దీప మొకటి ఆరిపోవుస్థితిలో నుండ నొక యెలుక ఆ దీపపువత్తిని నోటితో పట్టుకొని ఎత్తుకొనిపోవుటకు ప్రయత్నించి నోట కరచుకొన్న క్షణముననే పిల్లి యఱపు సమీపమున వినబడగా నా యెలుక భయముచే మరణించెను. ఎలుకనోట కరచుకొని వత్తిని పైకెత్తినపుడు ఆరిపోవుటకు సిద్ధముగ నున్న దీపకాంతి ప్రజ్వరిల్లి జ్వాలగా పెద్దదై వెలిగెను. ఆ కారణమున ఎలుక శాస్త్రజ్ఞానము లేకపోయినను, భగవంతునియందు భక్తి లేకపోయినను తలవని తలంపుగ చేసిన ఈ కార్యము (కైంకర్యము) వలన కలిగిన పుణ్యమును అజ్ఞాత సుకృతమందురు. ఇట్టి అజ్ఞాత సుకృతమువలన ఎలుక మఱు జన్మమునందు విదర్భరాజునకు

Dr K Dayanandaswamy ebooks



కూతురై, కాశీరాజునకు భార్యయై మిగుల విఖ్యాతి గాంచెను. ఈ దృష్టాంతమునందు ఎలుక జేసిన సుకృతకర్మయే భగవంతుని నిర్హేతుకకృపకు కారణ మైనదని చెప్పుదురు.

ఇచట నిర్హేతుకమైన దేమియు లేదు. ఎలుక చేసిన కర్మయే ఉత్తమ జన్మమునకు హేతువైనది గదా? యని ప్రశ్నించిన; భగవంతుడు ఆ ఎలుకచేత ఆ కార్యము చేయించుట నిర్హేతుకమే కదా యని లోకాచార్యులవారు సమాధానము చెప్పిరి. (శ్రీ.భూ. 382 మొదలు 405).

ఈ నిర్హేతుక కృపకు శాస్త్రప్రమాణ మేమైన గలదా? యనిన కొన్ని ఆళ్వారుల శ్రీసూక్తులును, శ్రీ పాంచరాత్రములోని అహిర్బుధ్న్య సంహితనుండి కొన్ని శ్లోకములను నుదాహరించిరేగాని శ్రుతిప్రమాణమును చూపలేదు. భగవంతునకు భక్తితో మనము సమర్పించిన దల్పమైనను దానివలన మనకు గలుగుఫల మనల్పమని భాగవతాది పురాణముల నుండియు, గీతనుండియు గ్రహించియుంటిమి. కుచేలు డటుకుల నిచ్చి అమితైశ్వర్యమును పొందెను. మహాకవి శ్రీరవీంద్రనాథ ఠాగూరు గీతాంజలి 50 వ గీతమునందు కుచేలుని కథలోని భావమే యిట్లు వ్రాసిరి: భిక్షమడుగుటకు వచ్చిన భిక్షగానినుండి వాని జోలెలో మిగిలియుండిన బియ్యపుగింజను గైకొని భగవంతుడు దానికి బదులు బంగారపు బియ్యపు గింజను వాని సంచియందుండునట్లు చేసెను.

**జి.** : మీ రిదివఱలో కర్మవిపాక సిద్ధాంతమును గుఱించి చెప్పియుంటిరి. (ఈ గ్రంథము 1-2-18) ఆ సిద్ధాంతమున కిది విరుద్ధ మగునుగదా?

**వే :** ఇది చాల జటిలమగు విషయము. ప్రాచీన దశోపనిషత్తుల మతమునకు ఇది విరుద్ధమేనని నా యభిప్రాయము. సగుణుడును లోకపాలకుడును నగు ఈశ్వరుడు కలడను మతమున నీయవ్యాజ కరుణకు స్థానముండుట విపరీతము కాదు. బ్రహ్మసూత్రములయందు వైషమ్య నైర్ఘృణ్యాధికరణమును నందును (అ. 2 పా. 1 సూ. 34) పరాయత్తాధి కరణమునందును (అ. 2 పా. 3 సూ. 42) ఈ విషయము చర్చింపబడినది.

Dr K Dayanandaswamy ebooks



అందు : ఈశ్వరుడు జీవునిచే ధర్మాధర్మ రూపమగు ప్రయత్నము నపేక్షించినవాడై వారి వారికి తగిన భోగముల నిచ్చుచున్నాడు. ఆయనకు కొందఱియందు దయగాని, మఱికొందరియందు నిర్దయగాని లేక మేఘుడు వరి, మినుము మొదలయిన పైరులకును లతాదులకును పక్షపాతము లేక వర్షము నిచ్చునట్లు ఫలము నిచ్చుచున్నాడని భాష్యకారులు చెప్పియున్నారు. ఈ విషయమై నేనిదివఱలో ఈశ్వరాస్తిత్వ లక్షణములను గుఱించి చెప్పిన సందర్భమున (1-2-12) చెప్పియుంటిని.

నాయనార్‌గారు పైన చెప్పిన దృష్టాంతమునందు రాజు, ఏనుగు వీరిచేత నెన్నుకొనబడిన స్త్రీ, పురుషులయొక్క పూర్వజన్మ సుకృతము ఫలోన్ముఖ మైనందున, సర్వభూత హృదయాంతర్వర్తి యైన ఈశ్వరుడు ఏనుగును, రాజును ప్రేరేపింపగ ఏనుగు రాజు కాదగిన పుణ్యము గల వానిని తనపై నెక్కించుకొనుటయు, రాజపత్ని కాదగిన పుణ్యావిశేషము గల కన్యను రాజు భార్యగా వరించుటయు జరిగినది. ఈ దృష్టాంతము కర్మసిద్ధాంతమునే దృఢపరచుచున్నది. లోకమున కారణము లేని కార్యము లేదుగదా!

ఈశ్వరానుగ్రహమున సంచితాగామి కర్మలేగాక ప్రారబ్ధము సహితము నశించెనేని అట్టివాడు వెంటనే శరీరము వదలవలసియుండును. ప్రారబ్ధము కొంతమాత్రమే నశించునని చెప్పినను పూర్తిగ నశించునని చెప్పినను అది కర్మసిద్ధాంతమునకు విరుద్ధమగును. కర్మరూపమగు నీ యంత్రమును సర్వేశ్వరు డొకసారి కదలించినచో అది తిరుగుచునే యుండును. మరల దానిలో ఆయన జోక్యము కలిగించుకొనడు. ఆకర్మచక్రము శాశ్వతముగ తిరుగుచుండ వలసినదే. ముక్తజీవులు తప్ప దానినుండి యెవ్వరును బయటపడరు. ఒకవేళ భగవంతుడు నిరంకుశ సర్వశక్తియని, ఆయన కసాధ్య మేదియు లేదని అంగీకరించినను మొదట ఆయన నిరంకుశ స్వాతంత్ర్యమునకు భంగము కలుగదు. ఎవరైనను ఈశ్వరు డీకారణము వలన సర్వశక్తుడు గాడని అస్వతంత్రుడని చెప్పినచో అట్టివారు కర్మసిద్ధాంతమును చక్కగా అర్థము చేసికొనలేదని చెప్పవచ్చును.

Dr K Dayanandaswamy ebooks



బ్రహ్మసూత్రములయందు "**విశేషానుగ్రహశ్చ**" (బ్ర.సూ. 3-4-38) అను సూత్రము 'విధురాధికరణము'నందు కలదు. అచ్చట ఏ యాశ్రమమునకును చెందనివారు చేయుకర్మములవలన విద్య కలుగునా? కలుగదా? యను విషయమును భాష్యకారులు శ్రీశంకర, శ్రీరామానుజు లిరువురును చర్చించిరి. ఏదేని యొక యాశ్రమమునందుండి (బ్రహ్మచర్యాది ఆశ్రమములను) శాస్త్రోక్త ప్రకారము ఆశ్రమోచిత కర్మలు చేసిన వారికే విద్య (జ్ఞానము) కలుగునని శాస్త్రములయందు చెప్పబడినది గదా? ఏ ఆశ్రమమునకును చేరని భీష్మ, కృష్ణద్వైపాయనాదుల విషయమున నెట్లు? వారు బ్రహ్మచర్యమునకును దప్పినవారై, భార్యలేని వారగుటచే గృహస్థులునుగాక, యే యాశ్రమమునకును చెందనివారు కదా! అట్టివారు ముక్తులెట్లయి? రని ప్రశ్న రాగా, విశేషానుగ్రహమున వారికి జ్ఞానమును, జ్ఞానమువలన ముక్తియును సిద్ధించినదని చెప్పబడెను.

ఇచ్చట 'విశేషాను గ్రహ' మనగా 'వారు పూర్వజన్మమునందు చేసియున్న పుణ్యపరిపాక' మని అర్థము చెప్పబడినదేగాని, భగవంతుడు తన విశేషాధికారమును వినియోగించి వారికి కర్మఫలమును సిద్ధింప జేసినట్లు చెప్పబడలేదు. భగవంతునకు అసంఖ్యాకములగు జీవకోటిలో కారణము లేకయే కొందఱి యందనుగ్రహము, మఱికొందరి యందాగ్రహము కలుగునని చెప్పినచో; పునర్జన్మ సిద్ధాంతమును నమ్మని క్రైస్తవులు, ముసల్మానులు దేవుని కారుణ్యవైషమ్య బుద్ధికి కారణము చెప్పలేనట్లే మనమును చెప్పలేని వారమగుదుము. లేదా, దేవునకు మనవలెనే అహంకార మమకారము లున్నవనిగాని, అనాలోచితముగ అర్థరహితముగ లోకవ్యవహారముల యందు జోక్యము కలుగజేసికొనుచున్నా డనిగాని దోషమారోపించ వలసివచ్చును. ఇందేదియు యుక్తము కాదు గదా?

జి : నా కర్మయే నన్నుద్ధరించిన యెడల ఈశ్వరునితో నిమిత్తమేమి?

**వే** : ఈ ప్రశ్న యిదివఱ కనేకులకు కలిగియున్నదే, క్రొత్తగాదు. పాండురంగస్వామి భక్తులగు శ్రీతుకారం (తుకోబా)గా రిట్లు చెప్పిరట:*

---

* తుకోబావారి వాక్యములు లోకమాన్యతిలక్‌గారి గీతారహస్యమునుండి గ్రహించితిని.

Dr K Dayanandaswamy ebooks



"ఎవరికైన చేత నందియిచ్చుటకు నీశ్వరుని వద్ద మోక్షమను ముల్లె లేదు. ఈ మోక్షమును సాధించుట కింద్రియములను జయించుటయు, మనస్సు నిర్విషయముగ జేయుటయు ముఖ్యసాధనములు."

వారే మఱియొకచో నిట్లు చెప్పిరి. "ఓ పాండురంగా! ఏకాంతమున నొక మాట చెప్పెదను వినుము. కర్మయే నన్నుద్ధరింప జేయునెడల నీవు చేయునట్టి యుపకారమేమి?" తుకోబావంటి మహాత్ములకు సహితమిది సంశయమే యైనది.

జి : భగవద్భక్తులకు ప్రారబ్ధానుసారము ప్రాప్తించు కష్టములను భగవంతుడు తొలగింపడేని ఆయనను సేవించుటవలన కలుగు ఫలమేమి?

వే : సంచితాగామి కర్మలు నశించునుగదా! ప్రారబ్ధము మాత్రమే ప్రతివారును అనుభవింపవలసియుండును. పురాణములయందు మార్కండేయాదుల చరిత్రలయందు ప్రారబ్ధము సహితము కొంత నశించునట్టి నిదర్శనములు కొన్ని చెప్పబడినవి. కాని పరమభక్తులు సహితము ప్రారబ్ధానుసారము ఘోరమైన దురవస్థలకు పాల్పడినట్లును గలదు.

ఇతరుల మాటలకేమి? శ్రీవైష్ణవాచార్యులయందు శ్రీ పెరియనంబి గారును కూరత్తాళ్వారును అంధులైరి. చోళరాజ భటులు కన్నులు పెకలించివేయుటచే శ్రీ పెరియనంబివంటి మహాత్ముడు వృద్ధాప్యమున నా బాధపడలేక తనువును వదలిరి. ఆయన కిష్టములేని ప్రారబ్ధము భగవంతుడు తొలగించి యుండలేదేమి? భగవంతుడు భక్తుని నీవిధముగ పరీక్షించునని సమాధానము చెప్పి యీ చిక్కునుండి తప్పించుకొనిరి. కర్మయే యుద్ధరించుచుండ భగవంతునితో పనియేమి? యను సంశయమును పోగొట్టుటకు విశ్వకవి రవీంద్రనాథఠాగూర్ గారు గీతాంజలి 9 వ గీతమున చెప్పిన దాని సారాంశమిట్లున్నది:-

"ఓ భిక్షుకా! నీ యింటిముందు నీవు భిక్షమెత్తుటకు వచ్చితివా? ఓయీ మూర్ఖుడా! నీ బాహువులమీద నిన్ను మోసికొనిపోవ యత్నింతువా? సమస్తభారమును మోయు సర్వేశ్వరునియందు నీ భారముంపుము."

Dr K Dayanandaswamy ebooks



భగవంతుని సేవించుట యనునది యొక యూతకఱ్ఱ వంటిది. నడచుటకు శక్తిలేని ముసలివాడు చేతికఱ్ఱ నాధారము చేసికొని కొంతవఱకు నడువగలడు. నడచు వాడతడైన కఱ్ఱతో పనియేమి? అను ప్రశ్నవంటిదే 'నా కర్మ నన్నుద్ధరించుచుండ నీశ్వరునితో పనియేమి?, యను ప్రశ్న - ప్రారబ్ధానుసారము కలిగిన దుఃఖమును కఱ్ఱవంటి భగవద్భక్తి సహాయముతో భరింపగలవు. అజ్ఞానివలె విలపింపవు. పామరునకు దుఃఖము కలిగిన దుఃఖించుకొలదియు వానికి దుఃఖమధిక మగుచుండును. ప్రారబ్ధము ఋణము వంటిదని, అది యనుభవించిననే తీరునని జ్ఞాని దుఃఖానుభవమునందు ఋణము తీరుచున్నదను సంతృప్తి కలిగియుండుటచే నతడజ్ఞాని వలె విలపింపడు. భక్తుడు ప్రారబ్ధానుసారము వచ్చిన కష్టము భగవత్ప్రసాదమనియు, భగవంతుడు తనను పరీక్షించు చుండెననియు, నోర్పుతో కష్టములను భరించిన భగవంతుడు సంతసించు ననియు తలంచుటచే నతడును జ్ఞానివలె విలపింపడు.

భగవంతుని విశేషానుగ్రహమువలన ప్రారబ్ధకర్మయొక్క తీవ్రత కొంత తగ్గుననుట యిదియే. ఇదిగాక భగవంతుని విశేషానుగ్రహమునకు పాత్రుడైనవానికి ప్రారబ్ధ భోగానుభవమువలన కొన్ని లాభములు కలుగగలవు. భగవదనుగ్రహము లేనివారి కట్టివి కలుగవు. ఎట్లన: ప్రారబ్ధ కర్మానుసారము కారాగార శిక్ష యనుభవింపవలసిన వ్యక్తి అట్టి శిక్షనుండి తప్పించుకొనలేడు. కాని, భగవదనుగ్రహపాత్రుడొక సత్కార్యము చేసి యట్టి కష్ట మనుభవించును. శ్రీ భద్రాచల రామదాసువంటి భగవద్భక్తులయు, శ్రీ గాంధీమహాత్ముడు మున్నగు దేశభక్తులయు, జీవిత చరిత్రములే యిందుకు దృష్టాంతము. జైలుశిక్షానుభవమువలన వీరికి సత్కీర్తి లభించెను. అట్టి ప్రారబ్ధానుభవకాలమున (జైలుశిక్ష యనుభవించు కాలమున) శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్‌గారు 'గీతారహస్యము'ను, నెహ్రూగారు ప్రపంచ చరిత్రమును వ్రాసి లోకోపకారము చేయగలిగిరి. వారు బయట నున్నచో అట్టి గ్రంథములు వ్రాయుటకు వారి కవకాశము చిక్కియుండదు. ఇట్టిదే భగవంతుని విశేషానుగ్రహ మనవచ్చును.

దీర్ఘవ్యాధి పీడితుడగు నొకడు ఈషణత్రయమును వదలి చిత్తము భగవంతునివైపు త్రిప్పును. అభ్యాసముచే నతనికి భక్తి యధికమగును.

Dr K Dayanandaswamy ebooks



ప్రారబ్ధాధీనముగ కలిగిన రోగముచే బాధపడుట తప్పకపోయినను ఆ ప్రారబ్ధభోగము నతనిని భక్తునిగ చేసిన సత్ఫలితము భగవంతుని విశేషానుగ్రహమువలన కలిగినదని తలంపవచ్చును. ఐనను మొదట అతని చిత్తము భగవంతునివైపు త్రిప్పుట యనునది పూర్వజన్మ సుకృతమే కదా? యని అనకూడదు. అంతమాత్రము కర్మచేయుటకు జీవునకు స్వాతంత్ర్యము కలదు.

జీవులు వారివారి కర్మఫలములను వారువా రనుభవించుట యను నియతికి భగవంతు డడ్డుపడడు. ఇందుకు దృష్టాంతము భాగవతమున ప్రహ్లాద చరిత్రయందలి యొక విషయమును గమనింపుడు: హిరణ్యకశిపుని వలన బాధపడలేక దేవతలు భగవంతుని శరణుజొచ్చిరి. భగవంతుడు వారికి అభయమిచ్చి యిట్లు చెప్పెను : **"ఎఱుంగుదున్ దితిసుత వ్యాపారభాషా విపర్యయముం గాలముగూడ జంపెద జనుండందాక మీ త్రోవలన్"** అందాక అనగా అర్థమేమి? "హిరణ్య కశిపుడు చేసికొన్న సుకృత ఫలమాత డనుభవింపవలెను. దానికి నే నడ్డుపడరాదు. నా భక్తుని వాడు నొప్పించుటచే వాని పుణ్యమంతరించును. అప్పుడు వాడు వధ్యుడగును" అని కదా భగవద్వాక్యమునందలి తాత్పర్యము.

లోకమును పాలించు సర్వేశ్వరుడు అనాదియగు సృష్టితోపాటు అనాదియగు కర్మచక్రము సృజించి దానిని త్రిప్పియున్నాడు. దాని భ్రమణమునకు వ్యతిరేకము గానివిధమున నాతడు తన యాశ్రితులయందు తన కృపాదృష్టిని ప్రసరించుచుండును. అంతఃకరణమెంత నిర్మలమైన, దానిని మన మంత అధికముగా తెలిసికొనగలుగుదుమని నా నమ్మకము.

## (23) ఆచార్యులు - భాగవతులు

శ్రీ వైష్ణవులు తమ గురువులను ఆచార్యులందురు. ఆచార్యుడు పంచమోపాయము. కడపటి ఉపాయమైనందున దీనిని చరమోపాయ మందురు. అనగా: కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తులను నాలుగు మోక్షోపాయములు గాక ఆచార్యు డైదవ యుపాయమని 'ఉపాయస్వరూపము'ను చెప్పిన సందర్భమున చెప్పియుంటిని. తక్కిన నాలుగుపాయములు వదలినను పంచమోపాయమును నాశ్రయించిన తరింతురని వీరి భావము. గురువునందు

Dr K Dayanandaswamy ebooks



వీరికి భక్తి యధికము. "న గురో రధికమ్" గురువుకంటె నధికుడు లేడని శ్రుతి చెప్పియున్నందున అన్ని సంప్రదాయముల వారును దీని నంగీకరింతురు. కాని భగవంతునికంటె గురువే అధికుడని వీరు కొన్నిచోట్ల చెప్పియున్నారు. నమ్మాళ్వార్లు తాము రచియించిన తిరువాయిమొళి(½) ఇరువదిసార్లు పాడిన పిమ్మటనే వారు భగవంతుని పొందగలిగిరట. మధురకవి యాళ్వార్లవారు రచియించిన "కణ్ణినుణ్ శిరుత్తాంబు"* నందు ఇట్లున్నది : "సర్వేశ్వరుని విడిచి నమ్మాళ్వార్లను ఆశ్రయించితిని. భగవన్నామము ఉచ్చరించుటకన్న ఆళ్వార్లనామ ముచ్చరించుటయే పరమభోగ్యము."

ఆచార్యులయందు (1) అనువృత్తి ప్రపన్నాచార్యులనియు (2) కృపామాత్ర ప్రపన్నాచార్యులనియు రెండు తెగలవారు కలరు. మొదటివారు శిష్యులు పలుమారులు ఆశ్రయించిన పిమ్మటనే అనుగ్రహింతురు. ఇందుకు దృష్టాంతము : తిరుక్కోట్టియూర్ నంబిగారి కడకు శ్రీరామానుజులవారు పదునెనిమిది సార్లు తిరిగిన పిమ్మటనే చరమశ్లోక తాత్పర్యమును వారు తెలిపిరట. రెండవవారు - ఒకరు తమ్మాశ్రయింపకుండినను తామే పలుమారులు శిష్యునికడకు తిరిగి శిష్యు ననుగ్రహింతురు. ఋభుమహాముని నిదాఘుడను శిష్యుని వద్దకు తిరిగి తత్త్వోపదేశము చేసినట్లున్నది. శ్రీరామానుజులును, బట్టరువారును ఇట్టివారు.

శ్రీవచనభూషణమునం దిట్లున్నది : ఈశ్వరునకు భక్తుని, భక్తునకు ఈశ్వరుని ఆచార్యుడు లభించునట్లుచేసి యుభయులకు నుపకరించు చున్నాడు. భగవంతునివలన నాచార్యుడును, ఆచార్యునివలన భగవంతుడును లభించుచున్నారు. హస్తగతమైన ద్రవ్యమును పారవైచి భూమిలో బూడ్చబడిన యితరుల ద్రవ్యమును వెదుకుట యెట్టిదో యాచార్యునివదలి భగవంతుని వెదుకుట యట్టిదే. మఱియు కంటికి

---

* "కణ్ణినుణ్ శిరుత్తాంబు" ఈ ప్రబంధము ఫలశ్రుతిగాక పదిపాశురములు మాత్రమే కలది. మధురకవి ఆళ్వార్లవారు నమ్మాళ్వార్లను స్తుతించినది. ఒక్కసారి స్తుతింపగా వారు ప్రసన్నులైరని చెప్పుదురు.

Dr K Dayanandaswamy ebooks



గోచరమగు నాచార్యుని వదలి శాస్త్రములచే వెదుకదగిన యీశ్వరుని నెవడు కోరునో యతడు చేతనున్న నీటిని విడిచి పైచి మేఘము, సముద్రము, నది, వాపీకూపముల నపేక్షించు నట్టివాడు. ఏ యాచార్యుడు అధ్యాత్మవిద్య నుపదేశించుచున్నాడో యట్టి యాచార్యుడే వైకుంఠము, క్షీరాబ్ధి, ద్వారక మొదలగు నవన్నియునని నిశ్చయము. (శ్రీ.భూ. 429 నుండి 450 వఱకు)

మోక్షార్థికి భగవత్సంబంధమును, ఆచార్యసంబంధము నున్నంత మాత్రమున చాలదు. భాగవత సంబంధముకూడ నుండవలయు నందురు. దీనికి వీరు చాల ప్రాముఖ్య మిత్తురు. భాగవతులనగా : పంచసంస్కార సంపన్నులగు శ్రీవైష్ణవులని వీరందురు. "అఱువదివేల సంవత్సరములు విష్ణువు నారాధించిన కలుగు ఫలము ఒకమారు శ్రీవైష్ణవుల నారాధించిన ఫలములో పదునాఱవ భాగమునకైనను తగదట. (ప్రప. 85-76, 77) ఇది యతిశయోక్తి. విష్ణుభక్తు లెవరైనను వైష్ణవులే. భగవద్భక్తులు భాగవతులు. ఈ సంప్రదాయము ననుసరించి పంచసంస్కార సంపన్నుడే వైష్ణవుడు. *పంచసంస్కార సంపన్నముగాని పవిత్ర బాహ్మణ కుటుంబమున భిక్ష తీసికొనుటకైనను శ్రీరామానుజులవారు ఇష్టపడలేదు. **భాగవతుల (శ్రీవైష్ణవుల) యెదుట నడుములు చక్కగా ఎత్తి నడచుటకుకూడ వీరంగీకరింపరు. వీరియందు దాసభావ మెక్కువ. రాజ్యపాలనము చేయుచున్న కులశేఖరాళ్వార్ల వంటివారుకూడ నీ భృత్యులకు భృత్యునిగా నుండునట్లు వర మనుగ్రహింపుమని స్తుతించిరి.***

---

* పంచ సంస్కారములనగా : (1) తాపము (భుజములపైన శంఖచక్రములు కాల్చి ముద్రవేయుట.) (2) ఊర్ధ్వపుండ్రములు ధరించుట. (3) విష్ణుదేవునకు సంబంధించిన పేరిడుకొనుట. (4) ఆచార్యుని వలన కుడిచెవిలో అష్టాక్షరీ మంత్రోపదేశము పొందుట. (5) వైష్ణవేష్టి.

** ప్రపన్నామృతము 45వ అధ్యాయమున 'చేలాంచలాంబ' కథను చూడుడు.

***శ్లో॥ మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ ।
త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య
భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ! ॥ (ముకుందమాల)

Dr K Dayanandaswamy ebooks


సత్సాంగత్యము ముక్తిప్రదమనుట నిస్సందేహమే. కాని సత్సాంగత్య మున్నయెడల ఆచార్యునితో నవసరము లేదు. ముఖ్యముగ నీ మతము నందు ఆచార్యుని కింతటి ప్రాముఖ్య మియ్యవలసిన అవసరము లేదని నాయభిప్రాయము. ఏలయన : ఆశ్రితులగు జీవుల కష్టములయందు తోడ్పడుటకు సర్వశక్తియగు ఈశ్వరుడొక డున్నాడు. ఆయన యుపేక్షించినను దయారూపిణియగు లక్ష్మీదేవి పురుషకారముండనే యున్నది. ముఖ్యముగా భక్తి ప్రపత్తి మార్గములు చేపట్టిన వారీ మధ్యవర్తి లేకయే తఱించవచ్చును. ఆచార్యుడు లేనియెడల తిరుమంత్రము, ద్వయము వీటిని తెలిసికొనుట ఎట్లని ప్రశ్న కలుగును. ఆ మూడింటి యొక్క యర్థమును తెలియని వారెందరో భక్తులు ప్రపన్నులు కాలేదా? తుకారాం, తులసీదాసు, కబీరు వంటివారు భక్తులు కారా!

## (24) సింహావలోకనము-సామాన్యపరిశీలనము

ఇంతవఱకును విశిష్టాద్వైతుల ప్రపత్తి విషయమై సంగ్రహముగా విచారింతిమి. ఇప్పు డీవిషయము ముగించుటకు ముందొకసారి సింహావలోకనము చేసి, సామాన్య పరిశీలనము చేయుట సముచితము. సంప్రదాయజ్ఞుల శ్లోక మిట్లున్నది :

### సంప్రదాయారంభము

**శ్లో॥ లక్ష్మీనాథ సమారమ్భాం నాథయామున మధ్యమామ్ ।**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరమ్పరామ్ ॥**

లక్ష్మీపతియగు నారాయణునితో నీ సంప్రదాయ మారంభమైనది. కొంతకాలమైన పిమ్మట నాథముని, యామునార్యులు దీని నుద్ధరించి నందున వారు మధ్యగా గలవారని చెప్పబడినది.

దీనిని మొదట నారదమహర్షి లోకమున ప్రవర్తింపజేసెను. దక్షిణభారతమునందలి ఆళ్వార్లకెట్లో ఈ భాగవత ధర్మము (వైష్ణవ ధర్మము) లభించినదని ప్రారంభమున చెప్పియుంటిని. మొదటి ఆళ్వార్లను "పంచసంస్కార" సంపన్నులనుగా చేసి యీ మతము నిచ్చిన వారెవరో,

Dr K Dayanandaswamy ebooks


పంచసంస్కారములను నీ పద్ధతి మొదట ఆచారమునందుండెనో లేదో తెలియదు. ప్రథమమున నలుగురాళ్వార్లను తర్వాతి వారిలో కొందరిని వైకుంఠమున నుండి విష్వక్సేనులు వచ్చి పంచసంస్కార సంపన్నులనుగా జేసిరని ప్రసన్నామృతము మొదలగు గ్రంథములయందున్నది. ఆళ్వార్లు భగవద్భక్తులును, ప్రపన్నశిఖామణులును నగుటవలన శ్రీమన్నారాయణుని దర్శింపగలిగిరి కాని వారు దీని నొక సంపూర్ణ దర్శనముగా (ఒక ప్రత్యేక సిద్ధాంతమును ప్రతిపాదించు శాస్త్రముగా) రూపొందించియుండ లేదు. ఆళ్వారుల ప్రబంధములు ముఖ్యముగ దక్షిణ భారతమునందలి వైష్ణవపుణ్యక్షేత్రములలో నుండు విష్ణుదేవుని వివిధములగు అర్చావతారములను స్తుతించినవి. జగన్నాథము మొదలగు కొన్ని యితర దివ్యదేశములయందలి యర్చావతారములను సహితము కొలదిగను స్తుతించినవి. వాటియందు విశిష్టాద్వైతమునకు కావలసిన తాత్త్వికాంశములు గలవు.

## ఆళ్వారులలో ముఖ్యులు

ఆళ్వారులయందు ముఖ్యులు ముప్వురు. (1) నమ్మాళ్వార్లు (2) తిరుప్పాణి ఆళ్వార్లు. (3) గోదాదేవి. ఇందులో మొదటివారగు నమ్మాళ్వార్లను గుఱించి కొంత చెప్పెదను. వీరు నారదమహర్షి వంటివారు. కులమున శూద్రులయ్యును భగవంతునికి ప్రేమాస్పదులగు భక్తు లగుటచే వీరివలన నీ సంప్రదాయము నిలిచినది. వీరికున్నంతటి గౌరవము ఇతరులగు ఆళ్వారులకు లేదు. వీరినిగుఱించి ప్రపన్నామృతమునందిట్లున్నది. "వీరికి సరోవరయోగి మొదలగు తొమ్మిది మంది ఆళ్వారులు అవయవముల వంటివారు. వీరు అవయవి వంటివారు." (ప్రప. 103-9) ఈ యాళ్వారుల వైభవముతో సాటియైన వైభవము మఱియొకటి లేదు. వీరు 'తిరువాయ్ మొళి' దివ్య ప్రబంధమును రచియించునపుడు శ్రీరంగము మొదలగు నూటయెనిమిది దివ్య దేశములయందలి పెరుమాళ్ళందరును వీరి దివ్యప్రబంధమునందు తమ్ముగుఱించి వీరు పాడిననే తమకు గొప్పతనము లభించునని యెంచి ప్రత్యక్షమైరి, వైకుంఠమున నున్న నిత్యసూరులును, శ్వేతద్వీపమున నున్న దేవతలును వీరిద్దకు వచ్చిరి.

Dr K Dayanandaswamy ebooks



నూటయెనిమిది స్థానములయందలి పెరుమాళ్ళలో ముప్పది యిరువురు పెరుమాళ్లు మాత్రము ఆళ్వారుల విశేషానుగ్రహమునకు పాత్రులైరి." ఈ విధముగా వీరివైభవము వ్రాయబడినది. (ప్రప. 104. అధ్యాయము)

వీరినిగుఱించి మొదట తెలిసికొనినవారు మధురకవి యాళ్వారులు. వీరయోధ్య యందుండగా నొకనాటి రాత్రి వీరి కప్రాకృతతేజ మొకటి కనబడెను. వారాతేజము ననుసరించి దాని సమీపింపగోరి నడచిన కొలదియు నా తేజము దూరమగుచు వచ్చెను. ఆ విధముగా ఆ తేజము ననుసరించి దక్షిణ దేశమునందలి దివ్యదేశముల సేవించుచు రాగా తుద కాతేజము నమ్మాళ్ వారున్న కురుకానగరమునకు వచ్చిన పిమ్మట కనబడక పోవుటచే అచ్చట వారు నమ్మాళ్ వారిని కనుగొని ఆ యప్రాకృత తేజము వీరినే చూపి యదృశ్య మైనదని తెలిసికొనిరి. మధురకవి ఆళ్వార్లు నమ్మాళ్ వారిని పదిపాశురములచే స్తుతించిరి. ఆ స్తుతిని పలుమారు (పండ్రెండువేల సారులు) ఆవర్తించుటచే నాథముని గారికి నమ్మాళ్వారు యోగమున ప్రత్యక్షమై యీ సంప్రదాయార్థము నుపదేశించిరని యీ మతగ్రంథములు చెప్పుచున్నవి. నమ్మాళ్ వార్లకు నాథమునులు సమకాలికులును శిష్యులును నగుటవలన, ఈ మతమును నమ్మాళ్వారే నాథమునుల కుపదేశించి యుందురనుట అంతకంటెను యుక్తముగా నుండును.

ఆచార్య హృదయమను గ్రంథమునందు నమ్మాళ్వార్లను గుఱించి యిట్లున్నది. "శ్రీ కృష్ణునియొక్కయును" వేదవ్యాసునియొక్కయును జన్మముల వంటిది కాదుకదా శ్రీకృష్ణుని విషయమగు నాశయే మూర్తీభవించినట్లుండు శ్రీ నమ్మాళ్వార్ల జన్మము?"(ఆ. హృ. 1-77) ఈ వాక్యమునకు మణవాళ మహామునుల వ్యాఖ్య యిట్లున్నది. "ఒక్కదాని కుమారుడుగా బుట్టి, ఒక్క రాత్రిలోనే వేఱొక్క దాని కుమారుండైన శ్రీకృష్ణునియొక్కయు, కన్యాపుత్రుండగు వ్యాసునియొక్కయు జన్మములవంటిది కాదు కదా! శ్రీ కృష్ణుని ప్రకాశించునట్టి శ్రీపాదములను చిరకాల మాశ్రయించి లభించిన **"కృష్ణతృష్ణాతత్త్వామి వోదితం"** అన్నట్లు శ్రీకృష్ణుని విషయమగు నాశయే శరీరముగా గొనివచ్చినట్లుండు శ్రీ నమ్మాళ్వార్ల అవతార మనుట"

Dr K Dayanandaswamy ebooks



అనియున్నది.

యామునాచార్యులవారు రచియించిన 'స్తోత్రరత్నము' (ఆళవందారు స్తోత్రము) నందు ప్రారంభమాది నాలుగు శ్లోకములచే వారి పితామహుడగు నాథమునులను స్తోత్రముచేసి, అయిదవ శ్లోకమున పరాశరమహర్షిని స్తుతించి. కృష్ణద్వైపాయన మునీంద్రుని స్తుతించకయే ఆఱవ శ్లోకమున నమ్మాళ్వార్లను ఈ క్రింది విధముగా స్తుతిచేసియున్నారు:-

**శ్లో॥ మాతా పితా యువతయస్తనయా విభూతిః**
**సర్వం యదేవ నియమేన మదన్వయానామ్ ।**
**ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామం**
**శ్రీ మత్తదఙ్ఘ్రి యుగళం ప్రణమామి మూర్ధ్నా ॥**

తా॥ నా వంశమునందు బుట్టినవారికి ఏ వకుళాభరణ యోగీంద్రుల (నమ్మాళ్వార్ల) వారి శ్రీపాదములే తల్లి, తండ్రి, స్త్రీలు, తనయులు, ఐశ్వర్యము, సమస్తమును నయ్యేనో అట్టి ప్రథమాచార్యులును, ప్రపన్నులైన మాయొక్క కులపతులును, వైష్ణవశ్రీతో కూడి పొగడపూలచేత మనోహరులు నైనట్టి నమ్మాళ్వార్ల శ్రీ పాదద్వయమును శిరస్సుచేత సేవించుచున్నాను.

లోకాచార్యులవారు నమ్మాళ్వార్లను శ్రీ మన్నారాయణుని అవతార మని చెప్పిరి. భగవంతుడు శూద్రకులములో జన్మింపవలసిన యవసర మేమనగా? తక్కువ కులమగుటవలన ఆభిజాత్యగర్వము లేనట్టిదియు, అందువలన అహంకారము లేనిదియు, దాసభావము సహజముగా కలిగి నట్టిదియు నగు శూద్రకులమే భక్తిమార్గమునకు తగినదని భావించి ఆ విధముగా భగవంతు డవతరించిరని వారు చెప్పిరి. వీరు విష్వక్సేనుల యవతారమని ప్రపన్నామృతమునందు గలదు. (పప. 103-52) ఇట్లు భక్తిమార్గమును ప్రచారములోనికి తెచ్చినవారును, లోకమునందు విస్తరింప జేసినవారలును శూద్రకులజులై యుండ శూద్రులు భక్తిమార్గమున కర్హులుకారని చెప్పుట వింతగా నున్నది.

రెండవవారు హరిజనులగు తిరుప్పాణి యాళ్వార్లు. వీరిని లోకసారంగముని యనువారు భుజములపై నెక్కించుకొని శ్రీరంగము

Dr K Dayanandaswamy ebooks


నందలి శ్రీ రంగనాథస్వామివారి యెదుట పెట్టగా వీరదృశ్యులైరట. అనగా స్వామివారియందు శరీరముతో నైక్యమైరని చెప్పుదురు. ఇది సశరీర సాయుజ్యముక్తి,

మూడవవారు గోదాదేవి. వీరిని గురించి భక్తియోగమును చెప్పిన సందర్భమున చెప్పియుంటిని.

ఆళ్వార్లలో నొకరగు తిరుమంగై ఆళ్వార్లు దురాచారుడైనను శ్రీ రంగనాథస్వామి భక్తుడగుటచే సదాచారుడేయని ఆళ్వారులలో చేర్చిరి. ఆళ్వారులు ఉపనిషత్కర్తలగు మహర్షుల కంటె తక్కువగ గణింపదగిన వారు. నాథమునులు మొదలగు పూర్వాచార్యులు ఆళ్వారులకంటెను క్రింది తరగతికి చెందినవారు.

## ఆళ్వారుల మతము

భాగవత ధర్మములు మొదట ప్రవృత్తి పరముగనే యుండినవి. ఆళ్వారులు వైరాగ్య సంపన్నులేగాని శాస్త్రోక్తముగ సన్న్యసించినవారు కారు. ఈ సంప్రదాయమునందు మొదటి యాచార్యులగు నాథమునులు గృహస్థులుగనే మహాప్రస్థానమును చేసిరి. ఈ సంప్రదాయమునందు మొదట శ్రీ యామునాచార్యులు, పిమ్మట శ్రీ రామానుజులు సన్న్యసించిరి. అప్పటి నుండి యీ మార్గము నివృత్తి పరమైనది.

పాతంజలయోగ సంబంధమగు అష్టాంగ యోగవిద్యను ఆళ్వారులును నాథమునులును ఎఱుగుదురు. నాథమునులు వారి శిష్యులలో నొకరగు కురుకానాథ యోగి (కురుకావలప్పన్) గారికి మాత్రమే చెప్పిరి. కురుకానాథులు అష్టాంగ విద్యను తమ యంత్యకాలమున నుపదేశింతుమనియు, ఆ దినమునకు తమవద్దకు రావలెననియు యామునులకు చెప్పి ఆయన తమవద్దకు రావలసిన దినమును నొకచీటిలో వ్రాసి వారికిచ్చిరి. యామునాచార్యు లావిషయమును మరచి చీటిలో వ్రాయబడియుండిన దినమునకు తిరువనంతపురమున నుండుట

Dr K Dayanandaswamy. ebooks



తటస్థించెను. అచ్చట యామునుల కాసంగతి జ్ఞప్తికి రాగా కురుకానాథులుండు గంగైకొండ చోళపురము అచ్చటికి చాలదూరమున నున్నందున చేరుట సాధ్యము కానందున చింతించిరి. ఆ విధముగా నీ సంప్రదాయమువారు అష్టాంగ యోగమును పోగొట్టుకొనిరి.

అచ్చముగా నీ విశిష్టాద్వైతమే ఆళ్వార్ల మతమని చెప్పకూడదు. ఆళ్వార్లు వేదవిహిత కర్మానుష్ఠానమునకు గాని, ధర్మశాస్త్రములయందు చెప్పిన విధులకు గాని ప్రాముఖ్య మివ్వలేదు. రామానుజులవారు భక్తి వేదవిహిత కర్మానుష్ఠానమునుండి పుట్టిన జ్ఞానమువలన కలుగుననిరి. అనగా : వీరి భక్తి జ్ఞానకర్మలతో సంబంధించినది. ఇది ధ్రువస్మృతి ధ్యానరూపమైనది. ఆళ్వార్లభక్తి ప్రేమరూపమైనది. ప్రేమ యెట్టి వేదములనుగాని, ధర్మశాస్త్రములనుగాని యపేక్షించు నట్టిది గాదు. శీలవతి యగు స్త్రీరత్నము భర్తను ప్రేమించునట్లు వారు భగవంతుని ప్రేమించిరి. ఇది శాస్త్రమువలన వారికి కలిగినది కాదు. సహజముగ కలిగినది. దీనికి మధ్యవర్తి లక్కరలేదు.

ధ్రువస్మృతి, ధ్యానము - ఇవి ప్రేమవలననే కలుగునని చెప్పుటకు వీలులేదు. ఒకానొక బలవంతుడొక దుర్బలుని చంపుదునని ప్రతిజ్ఞ చేసియుండిన దుర్బలునికి బలవంతుడగు శత్రువును గురించిన నిరంతరచింతన ముండినను అట్టిది భక్తి గానేరదు. ధ్రువస్మృతియే భక్తియనుమాట సరియైనదైనను, ఆ నిర్వచనము సర్వత్ర యంగీకరింప బడదు. ఆళ్వారుల మతమునందు వర్ణాశ్రమాచారములకు ప్రాముఖ్యము లేదు. విగ్రహారాధన ముఖ్యము. భాగవత ధర్మములయందలి విగ్రహారాధన పద్ధతి ఆర్యులకు చెందినది గాదనియు, ఈదేశమున అనాదిగా నివసించుచుండిన ఆర్యేతర జాతులకు చెందినదనియు కొందఱు పండితులు చెప్పుదురు. ఇందెంత సత్యమున్నదో చెప్పుట కష్టము.

పూర్వము భిన్నభిన్న సంస్కృతులు గల భిన్నభిన్నజాతు లొకచోట నివసించి జీవించుకాలమున నొక జాతివా రవలంబించు విధానముల

Dr K Dayanandaswamy ebooks



(ధర్మముల) నందుకొని యితర జాతివారి నాకర్షించినప్పుడు, అట్లాకర్షింపబడినవా రాధర్మముల నాచరణయం దుంచుకొని యభివృద్ధి చెందుటయు, కొంతకాలము గడచిన పిమ్మట నీ సత్యము కాలగర్భమున మునిగిపోగా తామవలంబించు ధర్మము లన్నియు ననాదిగా తమ జాతికి చెందినవే యని భావించుటయు కలదు. కాలప్రభావముచే నట్టి భిన్నజాతు లొకజాతిగా కలసిపోయిన పిమ్మట చాల కాలమునకు అట్లొక్కటిగా కలసిపోయినవారు ఆరంభమునుండియు తామొక్క జాతికి చెందిన వారమేయని నమ్ముదురు. అట్లు నమ్ముట తప్పుకాదు. కాని, అది సత్యము కాదు. అవిధముగ మనదేశమున కార్యులు రాకపూర్వ మిచ్చట అనేకజాతులు నివసించుచుండిరి. ఆర్యులయందలి యాచార విజ్ఞానములయందు కొన్నింటి నిచ్చటివారును, ఇచ్చటివారి యాచార విజ్ఞానములయందు కొన్నింటిని ఆర్యులును గ్రహించిరని చెప్పవచ్చును. భాగవత ధర్మములయందలి విగ్రహారాధన పద్ధతియొక్క పుట్టుక కాలగర్భమున మునిగిపోయినది.

## జీవేశ్వరుల పరతంత్రత

శ్రీ వైష్ణవమతము ననుసరించి జీవేశ్వరు లిరువురు స్వతంత్రులు. ఇంకొక విధముగా చూచిన నిరువురును పరతంత్రులు. ఎట్లనగా: జీవుడు ధర్మాధర్మరూపములగు కర్మలను చేయుటకు స్వతంత్రుడైనను పూర్వకర్మాధీనుడును, ఈశ్వరాధీనుడును నగుటవలన పరతంత్రుడు. ఈశ్వరుడు నిరంకుశ స్వతంత్రుడును, సర్వశక్తియుతుడునై యుండియు భక్తపరాధీనుడగుటవలన ఈశ్వరునకిట్టి పరతంత్రత యనునది యొకటి యున్నది. ఈశ్వరునకు గల పరతంత్రత యెట్టిదనగా - ఒక భక్తుడు దేవాలయము కట్టి, ఒక శిలావిగ్రహము నందులో నిలిపి, ఆగమోక్తప్రకార మీశ్వరుని నావాహన చేసి విగ్రహమును ప్రతిష్ఠించిన యెడల నీశ్వరు డావిగ్రహము నందు ప్రవేశించి, జీవుడు దేహమునందు బద్ధుడైనట్లే బద్ధుడగుచున్నాడు. అంతేగాక ఆయనకు ప్రత్యేకమైన వ్యక్తిత్వ మేర్పడుచున్నది. అనగా - ఒక్కడే దేవునియొక్క వివిధములగు అర్చావతారములకంటె తాను భిన్నుడనని భావము. శ్రీరంగమునందలి శ్రీ రంగనాథస్వామి, కాంచీపురము

Dr K Dayanandaswamy ebooks



నందలి శ్రీ వరదరాజస్వామి, తిరుమలయందలి వేంకటరమణ స్వామి అను మువ్వురు తాము వేఱువేఱన్న భావములు స్వాములకే యున్నట్లు సంప్రదాయ గ్రంథములయందు చెప్పబడినది. ఈ విషయమును తెలియజేయు నట్టి కొన్ని యైతిహ్యములను చెప్పెదను.

రామానుజులవారిని కాంచీపురమున నుండి శ్రీరంగమునకు తోడి తెచ్చుటకు శ్రీరంగమునందలి శ్రీ వైష్ణవు లొక యుపాయమును పన్నిరి. ఆ యుపాయ మిది: 'అరైయర్' గారనువా రొకరు దివ్య ప్రబంధగానము నందు సమర్థులు. తేవప్పెరుమాళ్లు (శ్రీ వరదరాజస్వాములవారు) దివ్య ప్రబంధ గానప్రియులు. అరైయర్‌గారి ప్రబంధ గానముచే పెరుమాళ్ళను సంతృప్తులను జేసి పెరుమాళ్లవలన రామానుజులవారిని వరప్రసాదము నొంది శ్రీరంగమునకు తేవచ్చునని నిశ్చయించుకొని ఆలాగున చేసిరి. వరదరాజస్వామివారు అరైయరు గానమునకు సంతుష్టులై అరైయరును వరము గోరుమనగా, వారు రామానుజులవారిని శ్రీరంగమునకు పంపునట్లు వరమును కోరిరి. అప్పుడు పెరుమాళ్లు "మేము వరము కోరుమని చెప్పినప్పుడు ఈ ఒక విషయము తప్ప నేమైనను కోరు మని చెప్పియుండవలసినది. అట్లు చేయక రామానుజుల వారిని పోగొట్టుకొంటిమే" యని విచారించిరట.

శ్రీ రామానుజులు మైసూరు ప్రాంతమున పర్యటించు సమయమున నొకనాడు యాదవాచలపతి యగు నారాయణ పెరుమాళ్లు రామానుజులవారికి స్వప్నమున దర్శనమిచ్చి, యాదవాద్రియందు తామొక పుట్టయం దున్నామని అందుండి తమ విగ్రహమును తీసి దేవాలయము కట్టించి అందు ప్రతిష్ఠించి పూజాదికము జరిపింపుమని (ప్రప. 47.5.6) తమ యుత్సవ విగ్రహము (రామప్రియ విగ్రహము) ఢిల్లీశ్వరుని యింటినుండి తెప్పింపుమని (ప్రప. 47-40) చెప్పిరి.

కబీరను ముసల్మాను శ్రీరంగమునకేగి శ్రీరంగనాథస్వామిని మోక్ష

Dr K Dayanandaswamy ebooks



మిమ్మని ప్రార్థింప, స్వామివారు" మేము ప్రపన్నులకు మాత్రమే మోక్ష మిచ్చుటకు దీక్షవహించితిమి. నీవు చక్రాంకములు ధరింపలేదు. కనుక జగన్నాథమునకు పోయి జగన్నాథుల నాశ్రయింపుము. ఆయన పతితులకైనను ముక్తి నివ్వగలర"ని చెప్పిరట. (ప్రప. 48-29.31.33)

వేంకటాచలమునందు వేంచేసియున్న శ్రీనివాసులు 'తొండూరు కొండమ్మయను' గోపబాలికకు ముక్తి నిచ్చిరి.* (ప్రప. 59-12) నుండి 55 వఱకు) ఈ స్వామివారికి వైష్ణవ వైష్ణవేతర భేదము లేదని విదితమైనది.

'తిల్ల' యను కాంత చోళరాజు బారిన పడకుండ తిరుపతియందలి గోవిందరాజ పెరుమాళ్లను రక్షించినది (ప్రప. 51-74) ఢిల్లీసుల్తాన్ శ్రీరంగము నాక్రమించుటకు వచ్చుచున్నాడని విని లోకాచార్యులు రంగనాథస్వామివారి నచ్చటనుండి తొలగించి పాండ్యమండలము, జ్యోతిష్మతీపురము, కేరళ దేశము, యాదవాచలము, తరువాత వేంకటాచలమును చేరి వేంకటాచలమున కొంతకాలముండి తిరిగి శ్రీరంగమును చేరిరి.**

(ప్రప. 120-121వ అధ్యాయములు)

ఇట్టివి మఱికొన్ని గలవు. ఈ విధముగ దేవుడును, మానవుడును స్వార్థపరులై పరస్పర సహకారులై యొకరిపై నొక రాధారపడవలసివచ్చెను.

జి : నన్నొక సంశయము బాధించుచున్నది. దేవాలయములయందలి

---

* శ్రీ రామానుజాచార్యులు వేంకటాచలము నందుండగా వారికిని వారి శిష్యులకును తొండూరు కొండమ్మయను గోపబాలిక చల్లనమ్మెను. ఆచార్యులవారు తిరుమలను వదలిపోదలచి ఆ బాలికను పిలిపించి తమకింత కాలము చల్లనిచ్చినందులకు చెల్లింపవలసిన సొమ్మును ఇవ్వబోగా, ఆ బాలిక ధనము తీసికొనుటకు నిరాకరించి "ముక్తినిమ్మని" శ్రీరామానుజుల నడిగెను. "ముక్తినిచ్చువారు శ్రీనివాసులేగాని తాను గాదని" శ్రీరామానుజులు చెప్పిరి. 'అట్లైన నాకు ముక్తి నిమ్మని స్వామివారికొక చీటి వ్రాసి యిమ్మని' ఆ బాలిక కోరెను. రామానుజుల వారట్లే చీటి వ్రాసి యిచ్చిరి. బాలిక ఆ చీటిని గరుడధ్వజమువద్ద నుంచి భూమిపై సాష్టాంగపడి శరీరమును వదలి పరమపదమున కేగెనని ప్రపన్నామృతమున గలదు. ఇది ముగ్ధభక్తి.

** క్రీ.శ. 1310 సంవత్సర ప్రాంతమున దక్షిణభారతమునకు దండెత్తి వచ్చిన ఢిల్లీసుల్తాను అల్లావుద్దీను మాలక్‌కపూరు, ఖిల్జీ సేనాని యగు మాలికాపూర్.

Dr K Dayanandaswamy ebooks



దేవతావిగ్రహములను కొందఱు ముసల్మానులు ధ్వంసము చేసిరని చరిత్ర గ్రంథములయందు చదివి యుంటిమిగదా! ఆ దేవుడు తనను తానేల రక్షించుకొనలేకపోయెను? అట్టి దుష్టుల నేల సంహరింప లేదు?

వే : అర్చావతారమునందు దేవుడు భక్తులకు భుక్తి, ముక్తులను మాత్రమే యొసగును. ఆ యవతార ప్రయోజన మంతమాత్రమే. దుష్ట శిక్షణము, శిష్ట రక్షణము, భక్తులకు మోక్ష మొసగుట మొదలగు కార్యములు విభవావతారములయందు మాత్రమే జరుగును. రామకృష్ణాద్యవతారము లిట్టివి. విగ్రహములను పగులగొట్టిన దుష్టులకు శిక్ష జరుగలేదని నీ వెట్లు చెప్పగలవు? చరిత్రయందు లేదే యందువేమో. చరిత్ర యట్టి దుష్కార్యము చేసినవారి సమగ్రజీవితము నంతయు వ్రాయలేదు గదా? విగ్రహ విధ్వంసకు లెప్పుడో యొకప్పుడు శిక్షింపబడుదురని మన నమ్మకము. మనము కర్మసిద్ధాంతమును నమ్మినవారము.

ఇంతవఱకు ఆళ్వారులయొక్కయు వారారాధించు అర్చావ తారములయొక్కయు విషయమును వింటివి. ఆళ్వార్ల అనంతరము ఆచార్యు లెట్లు శ్రీవైష్ణవము వ్యాప్తి చెందించిరో వినుము :

## పూర్వాచార్యులు - రామానుజులు

ఆళ్వార్ల అనంతరము నాథమునులు ఆళ్వార్ల దివ్య ప్రబంధములను పునరుద్ధరించిరి. ఇచ్చట నొక విశేషము గమనింపవలయును. ఆళ్వారులలో నొకరగు భక్తిసారులు మొదట శైవులుగానుండి మహదాహ్వయ యోగివలన వైష్ణవదీక్షను గైకొనిరి. నమ్మాళ్ వారికి (పరాంకుశయోగికి) మధురకవి యాళ్వార్లు శిష్యులు. వీరు తప్ప తక్కిన యాళ్వారు లొకరికొకరు గురుశిష్య క్రమమున నేర్పడినవారు కారు. వీరికొక మఠముగాని సంప్రదాయపీఠము గాని లేదు. నాథమునులే తొలుత నిట్టి యాచార్యపీఠ మేర్పరచిరి. అప్పటినుండి యాచార్యులయం దొకరి తరువాత నొకరుగా గురుశిష్య క్రమమేర్పడినది. (ప్రకరణాంతమున నున్న అనుబంధములు చూడుడు.)

నాథమునుల యనంతరము యామునాచార్యులవారి కాస్థానము లభించెను. ఆ కాలమున వైష్ణవమునకు ప్రతిస్పర్ధిగా శైవమును, అచ్చటచ్చట

Dr K Dayanandaswamy ebooks



బౌద్ధ జైనమతములును ప్రచారములో నుండెను. శ్రీ కుమారిలభట్టు శ్రీ శంకరాచార్యులవారి ప్రయత్నముచే జైన బౌద్ధమతముల ప్రాబల్యము చాలవఱకు తగ్గియుండెను. బౌద్ధజైనమతములు అవైదికము లగుటచే అవి ప్రజలకు తృప్తి నొసగలేకపోయినను, స్మార్త (అద్వైత) శైవ మతములతో వైష్ణవము పోరాడవలసి యుండెను. శైవ, వైష్ణవ మతములు చాలవఱకు సమానములే. శివుడు పరతత్త్వమని శైవులు, విష్ణువు పరతత్త్వమని వైష్ణవులు చెప్పుటయే ముఖ్యభేదము. శైవము విశిష్టాద్వైతమే. దానిని శివాద్వైతమని యందురు. శ్రీ వైష్ణవుల విశిష్టాద్వైతమునకు ప్రతిస్పర్ధి అద్వైతము.

అలౌకిక తత్త్వవేత్తయగు శ్రీ శంకరాచార్యులవారి ప్రస్థానత్రయ భాష్యములు వైష్ణవులకు దిగులు పుట్టించునట్టివిగా నుండెను. అద్వైతము నెదుర్కొని ప్రస్థానత్రయమునకు విశిష్టాద్వైత పరమగు భాష్యమును వ్రాయునంతటి శక్తి శ్రీ యామునాచార్యులవారి కుండియుండదు. యౌవన కాలమున రాచకార్యములతో గడిపినట్టి వీరు వార్ధక్యమున నింతటి గురుతర కార్యమును నిర్వహించుట కసమర్థులై యుండిరని యూహింపనగును. ప్రస్థాన త్రయమునకు విశిష్టాద్వైత పరముగా భాష్యములు వ్రాసిననేకాని పండితులకు విశిష్టాద్వైతముపై గౌరవముండదు. కనుక నీ కార్యమును నిర్వహింపగల సమర్థుడు శ్రీరామానుజాచార్యుల వారొక్కరే యని వారిపై నీ కార్యభారమును మోపిరి. ఈ కార్యమెట్టిది? కేవల తత్త్వశాస్త్రములగు ప్రాచీన శ్రుతులును, తదనంతరోపనిషత్తులును, భగవద్గీతయు, మహాభారతము, పురాణములు, పాంచరాత్రాగమములు, ఆళ్వార్ల దివ్య ప్రబంధములు - ఇవన్నియు విశిష్టాద్వైతమును బోధించు చున్నవని నిరూపించి, పండితులను మెప్పించవలసి యున్నది.

మతముతో సంబంధములేని ప్రాచీనోపనిషత్తులయందలి తాత్త్వికాంశములతో మతమున కెట్లు సమన్వయము కుదురును? ఇది సామాన్యకార్యము కాదు. ఈ కార్యమున శ్రీ రామానుజులవా రెంతవఱకు కృతార్థులైరో చెప్పుట చాల కష్టము. ఏమైనను శ్రీభాష్యరచనయందు వీరి ప్రజ్ఞ అసాధారణ మైనదని అంగీకరింపక తప్పదు. కొందరద్వైతులు

Dr K Dayanandaswamy ebooks



రామానుజులవారితో వాదించి విశిష్టాద్వైతమును స్వీకరించుటవలనను, రాజపుత్రికను నావేశించిన బ్రహ్మరాక్షసుని పారదోలుటవలనను శ్రీ వైష్ణవులు శ్రీరామానుజుల వారిని సామాన్యవ్యక్తి కారనియు, ఆదిశేషుని యొక్క అవతారమనియు చెప్పిరి. కొందఱు విష్వక్సేనుల యవతారమని ప్రశంసించిరి. ముఖ్యముగ వారి శీలమును, వ్యక్తిత్వమును వారి కింతటి యౌన్నత్యమును కలుగజేసి యుండును. రామానుజులవారి అవతారమని ప్రసిద్ధిగన్న మణవాళ మహామునులు రామానుజులవారిని 'యతిరాజవింశతి' యను ఇరువది శ్లోకముల గ్రంథమున స్తుతించిరి. శ్రీ రామానుజులవారికి 'యతిరాజ'ను బిరుదనామము గలదు.

## శ్రీ రామానుజులకు తోడ్పడినవారు

శ్రీ రామానుజాచార్యులు ఇంతటి గొప్ప కార్యమును సాధించుటకు; ఆళ్వార్ల గీతములు; నాథమునిగారి న్యాయతత్త్వము యోగరహస్యము అను గ్రంథములును; యామునాచార్యుల రచనలగు సిద్ధిత్రయము, ఆగమప్రామాణ్యము, గీతార్థ సంగ్రహము, స్తోత్రరత్నము, చతుశ్శ్లోకి యను గ్రంథములును; శ్రీపెరియనంబి మొదలగు వీరి గురువుల *యుపదేశములు, తిరుక్కచ్చినంబిగారి అనుగ్రహమును, వీరి శిష్యులగు కూరత్తాళ్వాన్ మొదలగువారియొక్క సహకారమును, పూర్వజన్మ సుకృత

---

* శ్రీరామానుజుల వారి గురువులు (1) పెరియనంబి, (2) తిరుకోట్టియూర్‌నంబి, (3) తిరుమలయాండాన్, (4) ఆళవందారాళ్వాన్, (5) తిరుమలైనంబి. వీరిలో నొక్కొక్కరివలన ఒక్కొక్క విషయమును తెలిసికొనిరి. వీరి నాశ్రయించుటకు పూర్వము కాంచీపూర్ణు లనబడు తిరుక్కచ్చినంబిగారి నాశ్రయించిరి. కాని నంబిగారు తాము గురువుగ నుండుట కంగీకరింప లేదు. శ్రీరామానుజులవారు తమ మనస్సున నుండు సంశయములను నంబిగారికి తెలిపి యీ సంశయములు తీరునట్టి సమాధానము వరదరాజస్వామి వారి నడిగి తెలిసికొని తమకు తెలుపుడని ప్రార్థించిరి. నంబిగారు, స్వామివారి అంతరంగిక భక్తుడగుటచే స్వామివా రాయనతో నిష్ఠాగోష్ఠి సలుపుదురట. నంబిగారు స్వామివారి నడిగి ఆసంశయములకు తగిన సమాధానము గైకొని రామానుజులవారి కెఱిగించిరి. ఆ కారణమువలన రామానుజులవారికి దైవవాణిని వినిపించిన ప్రధానాచార్యుడును, ఆచార్యులందఱి కంటెను శ్రేష్ఠుడును తిరుక్కచ్చి నంబిగారని నా యభిప్రాయము.

Dr K Dayanandaswamy ebooks



విశేషమువలన కలిగిన దీర్ఘాయువును తోడ్పడినవి. రామానుజులవారి గురుపులు సామాన్యులు కారు. వారిలో పెరియనంబిగారు శ్రేష్ఠులు. రామానుజులవారి శిష్యులతో కూరత్తాళ్వాన్‌గారు గురువుగారికి తీసిపోని వారు. శ్రీపెరియనంబి, ఆళ్వాన్‌గారలు స్వార్థరహితులు, మహా త్యాగధనులు. భారతదేశ స్వాతంత్ర్యపు పోరాటమున శ్రీ గాంధీమహాత్మునకు మహామేధావులును, త్యాగధనులును నగు కొందఱు దేశనాయకులు తోడ్పడినట్లే వీరందఱు విశిష్టాద్వైత మతప్రచారమునందు రామానుజుల వారికి తోడ్పడిరి.

రామానుజులవారు బ్రహ్మసూత్రములకు భాష్యమును వ్రాయదలపెట్టి, బ్రహ్మసూత్రములకు బోధాయనమహర్షి రచియించిన వృత్తిగ్రంథము కాశ్మీరదేశమునందలి శారదాపీఠంబున సరస్వతీ పుస్తక భాండాగారమున నున్నదని విని కూరత్తాళ్వాన్ మున్నగు శిష్యులతో నచ్చటికేగి ఆ గ్రంథమును ప్రథమాధ్యాయమును శ్రీ రామానుజులును, తక్కిన గ్రంథమును ఆళ్వాన్‌గారును చూచిరని చెప్పుదురు. శ్రీ భాష్య రచనకు బోధాయనవృత్తి తోడ్పడినట్లు శ్రీ భాష్యకారులే చెప్పియున్నారు. ఇప్పటి విశిష్టాద్వైతమునందు వీరు నూతనముగా చేర్చిన భావము లేవో చెప్పుట కష్టము. కారణ మేమనగా 'బోధాయనవృత్తి' యిప్పుడెచ్చటను లభ్యము కాదు. కనుక, నిందులవలన తేలిన సారాంశమేమన? ఆళ్వారుల మతము నాధారముగ జేసికొని నాథమునులును, శ్రీ యామునులును, శ్రీ రామానుజులును రూపొందించినదే యిప్పటి విశిష్టాద్వైతమతము. అయినను దర్శనాచార్యులన్న కీర్తి రామానుజులవారికే దక్కినది. విశిష్టాద్వైతమును రామానుజ దర్శనమని పిలుతురు.

శ్రీయుతులు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు శ్రీరామానుజుల వారిని గుఱించి యిట్లు చెప్పిరి : "రామానుజుని ప్రభావ మనంతర హిందూమత చరిత్రమందు నేటికిని దృశ్యమాన మగుచున్నది. మధ్వ, వల్లభ, చైతన్య, రామానంద, కబీరు, నానక్‌లు-నడపిన యుద్యమములందు వారును, సంస్కారమతమగు బ్రహ్మసమాజమును, రామానుజప్రోక్తమగు

Dr K Dayanandaswamy ebooks



నేకేశ్వర తత్త్వమున కెంతయు ఋణపడియున్నారు." (భా.త. 5 భా. 9-5). మఱియొకచోట వారిట్లు వ్రాసియున్నారు. స్వయంసంపూర్ణమగు నుత్తమతత్త్వము నాతడు మనకు బ్రసాదించుటలో గృతార్థుడు కాజాలక పోవుటలో నాశ్చర్య మేమియును లేదు. మతమునకును, దత్త్వశాస్త్రమునకును మధ్యమందు గోచరించు విశాలమగు గర్తమును గప్పివేయుట కాతడు ప్రదర్శించిన సునిశిత తార్కిక ప్రజ్ఞయు, నమితోత్సాహ శక్తియు స్తుతిపాత్రము లైనవి. స్వల్పబుద్ధియు, ననుభవమును మాత్రమేయుండి ఈశ్వరమహిమ నంతగా నెరుగని సామాన్య మానవు డింతకంటె సులభ పరిష్కారము నిచ్చి యుండును. అట్లుకాక రామానుజు డూహించుటకు సాధ్యమగు నుత్తమ వర్గమునకు జెందిన యేకేశ్వరతత్త్వము నీశ్వరాంతర్యామిత్వ రేఖాసమ్మిశ్రిత మొనర్చి ప్రదర్శించెను.

(భా.త. 5 భాగము. 9-17)

శ్రీ వైష్ణవమువలె అద్వైతమతము అందఱకు అందుబాటులోనిది కాదు.శ్రీ రామానుజులు శ్రీ వైష్ణవమును వ్యాపింపజేయుటకు తమదృష్టిని పండితులైన ద్విజులపైన కేంద్రీకరించిరేగాని జనసామాన్యమును చేరి వారిలో కలసి వారిలో తామొక్కరై యుండలేదు. వార్ధక్యమున కావేరిలో స్నానమాచరించి ధనుర్దాసు (పిళ్ళైయురంగావిల్లిదాసన్) అను శూద్రశిష్యుని భుజము నూతగా గొని పోవుచుండిరని చెప్పుదురు. పరమభాగవతుడును మహాత్యాగియునగు ధనుర్దాసువంటివారి విషయమున మాత్రము కులభేదము కొంత సడలించుకొని యుండవచ్చును.

క్రైస్తవమత ప్రచారకులు తమ మత ప్రచారమునకై చేసిన కఠోర తపస్సులో పదవ పాలైనను మనవారు చేయలేకపోయిరి. మనవారు కులతత్త్వములనెడి శృంఖలములను త్రెంచివేసి యుండినచో శ్రీ వైష్ణవము భరతఖండపు టెల్లలుదాటి ఖండాంతరములకు వ్యాపించియుండెడిది. అట్టి అదృష్టము మనకు కలిగియుండినచో ఈనాడు నాగుల (Naga Land) సమస్యలవంటివి మన మెదుర్కొనవలసిన అవసరము లేకుండెడిది. చోళరాజు శ్రీ రామానుజులవారిని బంధింప దలపెట్టకుండిన కన్నడ ప్రాంతమున శ్రీవైష్ణవము ఇంతమేరకు ఉండియుండదేమో?

Dr K Dayanandaswamy ebooks



## శ్రీరామానుజుల అనంతరము

శ్రీ రామానుజులవారి యనంతరము సత్సంప్రదాయప్పడి అను నీ ప్రపత్తి మార్గము ఎక్కువ ప్రచారములోనికి వచ్చినదని చెప్పుదురు. శ్రీరామానుజుల వారికిది సమ్మతము కాదనియు, వారికిది సమ్మతమై యుండిన శ్రీ భాష్యమున దీనిని వారు చెప్పియుండెడివా రనియు కొందఱందురట. అయితే ఆకాలమున ఇది రామానుజులవా రంగీకరించినదేయని లోకాచార్యులవారు చెప్పిరి. పూర్వాచార్యులకు ప్రపత్తి మార్గము తెలియనిది కాదు. యామునాచార్యులవారు వారిస్తోత్ర రత్నమున 22వ శ్లోకమున శరణాగతి నిట్లు చెప్పిరి.

శ్లో॥ న ధర్మనిష్ఠోఽస్మి న చాత్మవేదీ
న భక్తిమాంస్త్వచ్చరణారవిన్దే ।
అకిఞ్చనో నన్యగతిశ్శరణ్యః
త్వత్పాదమూలం శరణం ప్రపద్యే ॥

తా॥ వేదములయందు చెప్పబడిన ధర్మకార్యము లేవియు చేసియుండ లేదు. ఆత్మవేత్తను కాను, నీపాదారవిందములయందు భక్తికలవాడను కాను. ఎందుకును అసమర్థుడను. వేఱొకగతి లేనివాడను. నీ పాదపద్మము లను శరణుబొందుచున్నాను.

కనుక ఇది రామానుజులవారి అనంతరము కల్పింపబడినది కాదు. ఆళ్వారుల కాలమునుండియు నున్నదే. చరమశ్లోక తాత్పర్యము రహస్యముగ నుంచవలెనని వారి ఆచార్యుల యాజ్ఞ యగుటవలన శ్రీభాష్యమున వ్రాసియుండకపోవచ్చును.

ఈ సంప్రదాయమునందు ప్రసిద్ధులగు లోకాచార్యులవారు ఆళ్వార్ల ప్రేమరూప భక్తిమార్గమునే యనుసరించిరి. వీరును వీరి శిష్యులగు మణవాళ మహామునులును ఆళ్వారుల వలెనే వర్ణాశ్రమ ధర్మములను మన్నింపలేదు. యామునాచార్యులవారు, వారి జీవితమునం దధికభాగము క్షత్రియ ధర్మము నవలంబించిరనియు, రామానుజులవారు గృహస్థాశ్రమ ధర్మమును

Dr K Dayanandaswamy ebooks



విడనాడిరనియు, * వర్ణాశ్రమ ధర్మములు వట్టి బూటకమనియు లోకాచార్యులవా రెఱుగుదురు.**

వారి మతమిది : ఎవరు భాగవతులో వారుత్కృష్టజన్ములు. ఎవరు భగవత్సంబంధులు గారో వారు హీనజన్ములు; ఇంతేకాని సాంఘికములగు వర్ణక్రమపద్ధతి ననుసరించి యెక్కువ తక్కువలు నిర్ణయించుట తగదని చెప్పిరి. ఇందుకు వీరనేక శాస్త్రప్రమాణములను ఆళ్వార్ల శ్రీసూక్తుల నుదాహరించిరి. శ్రీ కులశేఖరాళ్వార్లు భగవత్సంబంధము లేని బ్రాహ్మణ జన్మకంటె భగవత్సంబంధము గల తిర్యగ్జన్మమునుగాని, స్థావర జన్మమునుగాని ప్రసాదింపుమని భగవంతుని ప్రార్థించిరి. విష్ణుచిత్తుల వారును గోదాదేవియు తాము గోపకులమని గోపజన్మ మారోపించుకొనిరి.
(శ్రీ.భూ. 225 నుండి 240 వఱకు.)

ఇట్లు వీరు సత్యమును వక్కాణించిరి. వర్తమాన కాలమున దేవాలయములయందు హరిజనప్రవేశము మొదలగు సంఘసంస్కరణలు వీరి భావముల కనురూపముగా నున్నవి. దేవుడున్నాడనియు, ఆయన సృష్టి స్థితి లయములకు కర్తయేగాక భక్తులయెడల కృపజూపుననియు, నమ్మిన మతమునందుగాని, యివేవియు నమ్మకపోయినను నమ్మినను పునర్జన్మ సిద్ధాంతమును నమ్మిన మతమునందుగాని వర్ణభేదమను కులతత్త్వము లుండుటకు వీలులేదు. కులతత్త్వములయందు నమ్మకము ఆస్తికత్వమునకును, పునర్జన్మసిద్ధాంతమునకును విరోధి.

---

* ఆయువును మూడుభాగములు గడిపి నాలుగవ భాగమున సన్న్యసింపవలయునని (మ.ను. 6-33) ఋణముల మూడింటిని దీర్చక సన్న్యసించిన వారు నరకమున బడుదురని (మ.ను. 6-35) చెప్పిన మనుస్మృతిని రామానుజులవారు మన్నింపలేదు.

** పరాశరస్మృతి యందు "**దుశ్శీలోఽపి ద్విజః పూజ్యో న తు శూద్రో జితేంద్రియః**" (పరా. 8-25) బ్రాహ్మణుడు దుస్స్వభావుడైనను పూజింపదగినవాడు. కాని శూద్రుడు జితేంద్రియుడైనను పూజ్యుడు కాడు అను నీవాక్యము మన్నింపబడలేదు. ఎట్లన-తిరుప్పాణియాళ్వార్లు హరిజనులు; నమ్మాళ్వార్లు. తిరుమంగై యాళ్వార్లు శూద్రులు కదా. వీరిని ప్రతి వైష్ణవాలయమునందును పూజించుచున్నారు. వీరికి తిరునక్షత్రములయందు తిరుమంజనమును ఉత్సవములు చేయుచుండలేదా?

Dr K Dayanandaswamy ebooks



## శ్రీవైష్ణవ మతమునకు ప్రపత్తియే తగినది

జి. ప్రశ్న: చరమశ్లోకమునకు లోకాచార్యులవారు చెప్పిన తాత్పర్యము విశిష్టాద్వైతమునకు అనుగుణమైనదని చెప్పియుంటిరి. దానిని గుఱించి యింకను వినవలెననియున్నది.

**వే :** అద్వైతులు చెప్పిన నిర్గుణబ్రహ్మ విచారమును విశిష్టాద్వైతులు త్రోసివేసిరి. బ్రహ్మము సగుణుడేగాక సాకారుడనియు, వైకుంఠమున నున్నాడనియు, భక్తులకొరకై యర్చావతారములు ధరించుననియు చెప్పిరి. అవాఙ్మానస గోచరుడగు పరతత్త్వము సర్వవ్యాపి యయ్యును మన కొఱకు విగ్రహరూపమున మన యెదుట నిలిచి, తల్లిచేతిలోని పసిబాలుని వలె అర్చకుని చేతిలోని అన్నపానముల కాసించి మనరక్షణ కోరియుండు నని వినియున్నావు.

ఇట్లు మనయెదుట నిలిచియుండు సర్వేశ్వరుని సకల మోక్షధర్మములకు గమ్యస్థానమని నమ్మియుండినయెడల ఎదుట నున్న స్వామిని వదలి ఇతర ధర్మములకై పరుగిడనేల? సమస్త ధర్మానుష్ఠానమునకు ఫలము సర్వేశ్వరుని కృపకు పాత్రుడగుటయే గదా? సంకల్పమాత్రమున సకల బ్రహ్మాండములను సృష్టించినట్టియు, భేద రహితు డైనట్టియు సర్వేశ్వరుడు భక్తులకొఱ కింతటి దైన్యస్థితికి వచ్చినట్లంగీకరించిన నీ మతమునకు లోకాచార్యులవారు చెప్పిన ప్రపత్తియే యనురూపమైనది. దేవుడిట్టి స్థితికి వచ్చియున్నాడని చెప్పుట కేవలము భావకల్పనమనియు, చిత్తవిభ్రాంతియనియు చెప్పెడి తత్త్వశాస్త్రవిదులకు అద్వైతమే శరణ్యము లేదా యితర మార్గములు వారల కుండనే యున్నవి.

ఈ మతము ననుసరించి **'పితా చ రక్షకశ్శేషీ'** అను శ్లోకమునందు చెప్పిన ప్రకారము జీవేశ్వరులకు గల తొమ్మిది విధములగు సంబంధములను బట్టియు; తిరుమంత్రము, ద్వయము వీటియొక్క యర్థమునుబట్టియు చరమశ్లోకమునకు లోకాచార్యులు చెప్పిన అర్థము సరిపోవుచున్నది.

భిన్నభిన్న సంస్కారములు గల భిన్నజీవులకు సరిపడునట్లు భిన్న భిన్నములకు మోక్షధర్మములను భగవంతుడు, లేక గీతాకారుడు గీతాముఖమున లోకమున కుపదేశించి యున్నాడు. ఎవరికేది తగునో

Dr K Dayanandaswamy ebooks



వారద్దాని ననుసరింతురు. విశిష్టాద్వైతులకు లోకాచార్యులు చెప్పిన ప్రపత్తిమార్గమే తగినది. అట్లు తగినదనుటకు లోకాచార్యులవారే యనేక విధముల ప్రమాణములు చూపియున్నారు. స్వామియొక్క సొత్తునకు మాలిన్యము కలిగిన స్వామియే దానిని పోగొట్టును. కుమారు డపమార్గమున నడచిన తండ్రియే సరియైన మార్గమును జూపును. ప్రియుడు ప్రియురాలి విషయమునను నిట్లే.

ఇదిగాక లోకాచార్యులవారి మతమున దోషభోగ్యమను మఱియొక విషయము చెప్పబడెను. "చేతనుడు తనయందున్న దోషమును పోగొట్టుకొనుట స్వరూప ప్రకాశమునకు కారణమైనను భగవంతుడు దోషములనే భోగ్యముగ గోరుచున్నాడు" అని చెప్పిరి. (శ్రీ.భూ, 175-176) ఇట్టి నమ్మకము సామాన్యులకు కలుగదు. లోకాచార్యులును మణవాళ మహామునులును గొప్పపండితులు, ప్రపన్నశిఖామణు లగుటచే వారి యనుభవమును వా రట్లు వ్రాసిరని నా యభిప్రాయము. లోకాచార్యులవారి గ్రంథములకు మణవాళ మహామునులు కేవల వ్యాఖ్యాతలే యైనను వారిరువుర అభిప్రాయము లొక్కటియే యని వారి గ్రంథములు చదివిన విదితమగును. లోకాచార్యులవారు చెప్పిన దోషభోగ్యతను, చరమశ్లోకార్థమును చక్కగా అర్థము చేసికొనలేకయో; లేక యింద్రియారాము లగుటచేతనో; కొందరు వైష్ణవులు *వామాచారమును స్థాపించిరి. పవిత్రమగు లోకాచార్యుల మతమునకును, వామాచారమునకును సంబంధము లేదు. అంతమాత్రమే గాక విశిష్టాద్వైతమునకు వామాచారము విరోధియని చెప్పవచ్చును.

## పర్యవసానము

శ్రీ వేదాంతదేశికులు సంస్కృత తమిళభాషలయందు నూటయిరువది గ్రంథములు రచియించిరట. వీరి గొప్పతనము లోక ప్రసిద్ధము కనుక ప్రత్యేకముగ వీరినిగుఱించి చెప్పవలసియుండదు. వీరును ప్రపత్తి నంగీకరించిరి. దీనికి బ్రహ్మాస్త్ర బంధన్యాయమును సహిత మంగీకరించిరి.

* వామాచార మనగా: మద్యమాంసములను సేవించుట. శ్రీరామానుజుల మతమునందిది దోషము కాదని వామాచారు లందురు.

Dr K Dayanandaswamy ebooks


పిళ్ళైలోకాచార్యులవారు చెప్పినట్లు ప్రపత్తి యొక్కటే మోక్షోపాయమని మాత్ర మంగీకరింపక భక్తిప్రపత్తులు రెండును మోక్షోపాయములని చెప్పిరి.

వీరిరువురు సమకాలికులు. అంతేగాక యిరువురును శ్రీరంగమున నివసించి స్వామికైంకర్యాదులయందును శ్రీవైష్ణవమత వ్యాప్తికిని పాటుపడినవారే. దేశికులు (వడగలవారు) ద్రావిడవేదము, ఋగ్వేదాదులను రెండును ప్రమాణములని అంగీకరింతురు. లోకాచార్యులవారు (తెంగలవారు) ద్రావిడవేదమే ప్రధానమందురు. వీరిరువుర మధ్యనున్న భేదములలో ఇది ముఖ్యమైనది. వీరిమధ్య గల భేదమును రెండుమాటలలో చెప్పవలయునన్న నిట్లు చెప్పవచ్చును.

దేశికులవారి మతము : వేదశాస్త్రములయందు చెప్పబడిన యజ్ఞ యాగాది కర్మానుష్ఠానము, వర్ణాశ్రమధర్మ నిర్వహణమున శకటమునకు (Coachకి) ఈశ్వరునియందు గల పరమానురాగమను నశ్వమును కట్టి ద్విజు లాశకటము నారోహించిన వైకుంఠమును చేరుదురు. ద్విజేతరులును, ద్విజులలో కొందఱును శకటములేని యశ్వము నధిరోహించిన వైకుంఠము చేరుదురు.

లోకాచార్యులవారి మతము : శకటమును అందున్న వారిని వైకుంఠము చేర్చునది యశ్వమే గదా? ద్విజులుగాని, ద్విజేతరులుగాని అశ్వము నెక్కగలవా రెవరైనను అశ్వము నధిరోహించిన చాలును. అది వారిని తప్పక వైకుంఠము జేర్చుచున్నదిగదా? ఇట్లుండ శకటముతో పనియేమి? అది గాక గొప్ప భారముగల ఆ శకటమును ఈడ్వలేక అశ్వము వైకుంఠము చేరకపోవచ్చు గదా? శకటమా అనేక దోషములతో కూడినది. అహంకారమును పెంచునది. కనుక బండినుండి గుఱ్ఱమును వేఱుచేసి గుఱ్ఱముపై కూర్చున్న తప్పక వైకుంఠము చేరుదురు.

ఇచ్చట శకటముతో బంధింపబడిన యశ్వము 'భక్తి' యనుపేరను, శకటరహితమగు నశ్వము 'ప్రపత్తి' యను పేరను చెప్పినట్లు భావింపవలెను.

Dr K Dayanandaswamy ebooks



ఈ విషయమును ముగించుచు మిగుల సారవంతమైన వాక్యములు చెప్పెదను. భగవంతుని యెదుట ప్రపత్తిచేసి ఆయనపై భారము వైచినది మొదలు ఎట్టికోరికలు లేక మోక్షోపాయములని చెప్పబడు కర్మ, జ్ఞాన, భక్తియోగాదులయందుగాని, యే విధమైన యితర సాధనలయందుగాని చిత్తమును పోకుండునట్లుచేసి, ఊరకుండిన ప్రపన్నుడును; గీతయందు చెప్పినట్లు అపేక్షారహితుడు, పవిత్రుడు, సమర్థుడు, నిర్భయుడు, సర్వసంకల్ప వర్జితుడునగు భగవంతుని కిష్టుడైన భక్తుడును (గీత. 12-16); మానావమానములయందును, శత్రుమిత్రులయందును సముడై సమస్తారంభములు విడిచి యూరకుండునట్టి మోక్షోపాయములని చెప్పబడు కర్మ, జ్ఞాన, భక్తియోగాదులయందుగాని, యే విధమైన యితర సాధనలయందుగాని చిత్తమును పోకుండునట్లుచేసి, ఊరకుండిన ప్రపన్నుడును గీత యందు చెప్పినట్లు అపేక్షారహితుడు, పవిత్రుడు, సమర్థుడు, నిర్భయుడు, సర్వసంకల్ప వర్జితుడునగు భగవంతుని కిష్టుడైన భక్తుడును (గీత. 12-16); మానావమానముల యందును, శత్రుమిత్రుల యందును సముడై సమస్తారంభములు విడిచి యూరకుండునట్టి త్రిగుణాతీతుండగు అద్వైత జ్ఞాననిష్ఠుడును (గీత. 14-25) - వీరు ముప్పురును; భిన్న ప్రదేశములందు పుట్టి భిన్నభిన్న ప్రదేశములయందు ప్రవహించి తుదకొక్కచోట కలిసిన మూడు మహానదులకువలె ఒక్కటే గమ్యస్థానమును జేరుచున్నారు.

జి. ప్రశ్న : అయ్యా మీ యనుగ్రహమున ప్రపత్తి యననేమో తెలిసికొంటిని. మహాత్ములగు ఆళ్వారులయొక్కయు, ఆచార్యుల యొక్కయు, మతమును తెలిసికొని ధన్యుడనైతిని. నా బోంట్లు ఎన్నియో గ్రంథములు ఎంతో కాలము కష్టపడి చదివినను తెలిసికొన జాలనంతటి విజ్ఞానమును బోధించితిరి. ధన్యుడను. మీకు నా కృతజ్ఞత నెట్లు తెలుపుకొందును?

వే : నీవును నేనును కలిసి పరమపదమున వేంచేసియున్న ఆళ్వారులకు, ఆచార్యులకు కృతజ్ఞత తెలుపుకొనవలెను. వారి పవిత్ర పాదపద్మములకు

Dr K Dayanandaswamy ebooks



మనస్సున సాష్టాంగనమస్కృతులర్పించుకొని వారి యాశీర్వాదములు పొందుదుముగాక? వారి కృపామృతవృష్టి మనపై వర్షించుగాక!

నేను నీకు బోధించిన యీ జ్ఞాన యోగాదులగు మోక్షోపాయముల నైదింటిని ముముక్షువులకు నీవును నుపదేశింపుము. ఇవి విన్నవారును వినిపించిన వారును సర్వపాప విముక్తులై యిహమున సర్వాభీష్టములను పొంది కడపట శ్రేయమును (పరమపదమును) పొందుదురుగాక!

\- * -

శ్లో॥ యస్యావతార చరితాని విరించిలోకే
గాయంతి నారదముఖా భవపద్మజాద్యాః ।
ఆనందజాశ్రు పరిషిక్త కుచాగ్ర సీమా
వాగీశ్వరీ చ త మహం శరణం ప్రపద్యే ॥

\- * -

ఇది పరమేశ్వరానుగ్రమువలన మట్టిబోయిన రామసుబ్బయ్యచే రచింపబడిన 'బ్రహ్మజిజ్ఞాస' ద్వితీయ భాగమునందలి ప్రపత్తి అను ఐదవ ప్రకరణముతో ద్వితీయ భాగము సంపూర్ణము.

శ్రీ కృష్ణార్పణమస్తు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

Dr K Dayanandaswamy ebooks



# ఆళ్వారుల జన్మాంశరచనాదులు

## 1 వ అనుబంధము

ఆళ్వార్ల నామములు వారు భగవంతుని ఏ యే యాభరణాదుల అంశమున జన్మించినదియు, వారు రచియించిన దివ్య ప్రబంధముల నామములు, వాటియందలి పాశురముల సంఖ్యయు నీ క్రింద కనపరచియున్నాను. ఆళ్వార్లు పదుగురని, పదునొకండుగురని, పంద్రెండుగు రని సంప్రదాయజ్ఞులయందు భేదాభిప్రాయము లున్నవి.

శ్లో॥ భూతం, సరశ్చ, మహదాహ్వయ, భట్టనాథ,
శ్రీభక్తిసార, కులశేఖర, యోగివాహాన్।

| క్రమసంఖ్య | ఆళ్వార్ల సంస్కృత తమిళ నామములు | వారు భగవంతుని యే యంశమున జన్మించినది | వారు రచియించిన ప్రబంధ నామములు | పాశురముల సంఖ్య |
|---|---|---|---|---|
| 1. | భూతయోగి (పూదత్తాళ్వార్లు) | గదాంశమున | ఇరణ్డామ్ తిరువన్దాది | 100 |
| 2. | కాసారయోగి (పోయ్గై యాళ్వార్లు) సరోవరయోగి | పాంచజన్యాంశమున | ముదల్ తిరువన్దాది | 100 |
| 3. | మహదాహ్వయ యోగి (పేయాళ్వార్లు) | నందకాంశమున | మున్రామ్ తిరువన్దాది | 100 |
| 4. | శ్రీ భక్తిసారయోగి తిరుమొళిశైయాళ్వార్లు | చక్రాంశమున | తిరుచ్చన్దవిరుత్తం | 120 |
| | | | నాన్ముగన్ తిరువన్దాది | 98 |
| 5. | భట్టనాథులు విష్ణుచిత్తులు (పెరియాళ్వార్లు) | గరుడాంశమున | తిరుప్పల్లాండు | 12 |
| | | | పెరియాళ్వార్ తిరుమొళి | 461 |
| 6. | గోదాదేవి (ఆండాళ్‌తాయారు) | శ్రీదేవి యంశమున | తిరుప్పావై | 30 |
| | | | నాచ్చియార్ తిరిమొళి | 143 |

Dr K Dayanandaswamy ebooks



| | | | | |
|---|---|---|---|---|
| 7. | కులశేఖరాళ్వార్లు | కౌస్తుభాంశమున | పెరుమాళ్ తిరుమొళి | 105 |
| 8. | యోగివాహులు (తిరుప్పాణాళ్వార్లు) | శ్రీవత్సాంశమున | అమలనాది పిరాన్ | 10 |
| 9. | విప్రనారాయణులు భక్తాంఘ్రిరేణుయోగి (తొండరడిప్పొడి యాళ్వార్లు | వనమాలాంశమున | తిరుప్పళ్ళి యెళి చ్చి, తిరుమాలై | 10<br>45 |
| 10. | పరకాలయోగి (తిరుమంగై యాళ్వార్లు) | శార్ఙ్గాంశ మున | | 1361 |
| 11. | యతీంద్రమిశ్రులు (మధురకవి ఆళ్వార్లు) | కుముదుడను గణేశుని యంశమున | కణ్ణినుణ్ శిరు త్తామ్బు | 11 |
| 12. | శఠకోపులు వకుళాభరణయోగి పరాంకుశముని (నమ్మాళ్వార్లు) | విష్వక్సే నాంశమున | తిరువాయిమొళి<br>తిరువిరుత్తమ్<br>తిరువాశిరియమ్<br>పెరియతిరువన్దాది | 1102<br>100<br>7<br>87 |
| | | | | 4000 |

భక్తాంఘ్రిరేణు, పరకాల, యతీన్ద్ర మిశ్రాన్,
శ్రీమత్పరాంకుశ మునిం ప్రణతోఽ స్మి నిత్యమ్ ॥

పైశ్లోకమునందు గోదాదేవిని వదలి పదునొకండుగురు ఆళ్వార్లను మాత్రమే స్మరించిరి. నేను గోదాదేవి నామమును విష్ణుచిత్తుల వారి వెనుక చేర్చి పైశ్లోకమునందు చెప్పిన క్రమము యుక్తమైనదని తోచినందున స్వల్పమగు మార్పుతో దానిని గైకొంటిని. దివ్యసూరి చరిత్రమునందును ప్రపన్నామృతమునందును ఆళ్వార్ల క్రమము మఱియొక విధముగా నున్నది. ప్రపన్నామృతమునందు :

శ్లో॥ కాసారభూత మహదాహ్వయ భక్తిసారాం
త్సేనేశ కారికుల శేఖరవిష్ణుచిత్తాన్ ।
భక్తాంఘ్రిరేణు మునివాహ చతుష్కవీన్ద్రాన్
మాధుర్యగాన తులసీవన జాయతీన్ద్రాన్ ॥ (ప్రప. 74-9)

ఇందు పండ్రెండుగురు ఆళ్వార్లనేగాక కడపట రామానుజులవారిని కూడ చేర్చిరి. శ్రీరామానుజుల వారు ఆళ్వార్లు కాకపోయినను వీరియందు

Dr K Dayanandaswamy ebooks



గల పూజ్యభావమువలన ఆళ్వారులలో చేర్చి చెప్పిరి. ప్రపన్నామృతమున 74 వ యధ్యాయమునందే 16వ శ్లోకమున శ్రీ మధురకవి, గోదాదేవి, శ్రీరామానుజులవారిని వదలి పదుగురాళ్వార్ల పేర్లను మాత్రమే చెప్పిరి.

ఈ యాళ్వార్లయందు ముగ్గురు బ్రాహ్మణులు, ఒక్కరు క్షత్రియులు, ఒక్కరు హరిజనులు, తక్కినవారిలో కొందఱు శూద్రులు, కొందఱు కులము లేనివారు.

గోదాదేవి, మధురకవి యాళ్వారుల నామములను నాళ్వార్ల పట్టిక యందుండి తొలగించుటకు వీలులేదు. కారణ మేమన: వారిరువురు రచియించిన పాశురములను వదలివేసినచో ద్రావిడ వేదము నాలాయిరమ్ (నాలుగు వేలసంఖ్య కలది) కాదు. అదియునుగాక ప్రతివైష్ణవాలయము నందును, ఆళ్వార్ల సన్నిధి కలదు. అందు పన్నెండుగురు ఆళ్వార్లు ప్రతిష్ఠింపబడి పూజింపబడుచున్నారు. వారి జన్మనక్షత్రములయందు తిరుమంజనము, ఉత్సవము మొదలగు పూజలు జరుగుచున్నవి. కనుక ఆళ్వార్లు పన్నెండుగు రనుటయే సరియైన నిర్ణయము.

పైన చెప్పబడిన యాళ్వార్లలో మొదటి నలుగురు సమకాలికులు. మొదటి ముగ్వురు నాలుగవ వారికడకు వచ్చి నలుగురు కలసి యొకచోటనే కొంతకాలము నివసించినట్లును, పిదప మొదటి ముగ్వురును నాలుగవ వారగు భక్తిసారులచే సనుజ్ఞాతులై మౌనవ్రతముతో ఒక గ్రామమున నొకదినము నివసించుచు 3325 సంవత్సరములు భూప్రదక్షిణ మాచరించి పరమపదించిరనియు (ప్రప. 82-38, 39, 40) నాలుగవ వారు తరువాత బహుకాలము జీవించి పరమపదించిరనియు చెప్పబడినది.

మహదాహ్వయయోగికి భక్తిసారయోగి శిష్యుడని ప్రపన్నామృతము 80 వ అధ్యాయమున చెప్పియున్నందున మొదటి శ్లోకమునందు మహదాహ్వయుల నామమునకు తరువాత భక్తిసారుల నామమును చేర్చితిని

విష్ణుచిత్తులకు గోదాదేవి సమకాలికురాలని ప్రత్యేకముగ చెప్పవలసిన పనిలేదు. విప్రనారాయణులును, పరకాలయోగియు సమకాలికులు. శ్రీ పరాంకుశయోగి, మధురకవి - వీరిరువురు సమకాలికులు. శ్రీ కులశేఖర, శ్రీ యోగివాహు లిరువురు భిన్నభిన్న కాలమునకు చెందినవారు.

Dr K Dayanandaswamy ebooks



# 2 వ అనుబంధము

## ఆచార్య శిష్యపరంపరను తెలియజేయు పథకము

(1) నాథముని

(2) ఉయ్యక్కొండారులు, కరుగైక్కా వలప్పన్, నంబికరుణాకర దాసులు, ఎఱుతిరువుడై యర్, తిరుక్కణ్ణమంగ యాండాన్, వానమాదేవి యాండాన్, అచ్చాన్ బిళ్ళై, కోకత్తూ రాళ్వాన్

(3) మణక్కాల్‌నంబి, పాండురమాశరైయర్, శెణ్ణలంగార్, పుండరీకదాసు, ఉరీకపెరుమాళ్‌నంగై

(4) యామునాచార్యులు, తైవత్తురశునంబి, తిరువిణ్ణకరప్పన్, నంబి, గోమఠ, శిరపళ్లూరావుడైయ పిళ్ళై

(5) పెరియనంబి, తిరుక్కోట్టి యూర్‌నంబి, తిరుమలై యాండాన్, అళవందా రాళ్వాన్, తిరుమలై నంబి, మారనేర్ నంబి, ఈశాండాన్, తెయ్‌వవారియాండాన్ మఱియు నెనమంఱ్రు

(6) శ్రీరామానుజాచార్యులు, అర్యశఠకోపదాసులు, అణియరంగముత్తునార్, తిరుక్కచ్చినంబి, తిరువాయికుల ముడైయాన్

Dr K Dayanandaswamy ebooks

Ramesh

(7) ఎంబారు → (8) పరాశరభట్టర్ → (9) నంజియ్యర్ → (10) నంబిళ్ళై → (11) ఉదక్రృతోళీ కృష్ణులు (వడక్కుతిరువీధిపిళ్ళై) → (12) పిళ్ళైలోకాచార్యులు → (13) తిరువాయి మొళిపిళ్ళై → (14) మణవాళమామునులు

కూరత్తాళ్వాన్

మొదలియాండాన్

(7) కురుకేశులు → (8) విష్ణుచిత్తులు → (9) వరదవిష్ణ్వార్యులు
- (10) సుదర్శనభట్టు (శుతప్రకాశికాకారులు) → (11) వేంకటనాథులు (వేదాంతదేశికులు)
- రామానుజులు (అత్రేయపద్మనాభాచార్యులు)

(ఇంకను అనేకులు)

శుభమస్తు

సర్వేజనాః సుఖినో భవంతు

సర్వము శ్రీకృష్ణార్పణమస్తు